ఈనాడు
ఆదివారం
2 డిసెంబరు 2012

దేవకన్యలు నడిచే లోయ ఇదేనా!

రొటీన్... అంటే బోరు!

'గ్లోబల్' గోరుచిక్కుడు!

రాజాధిరాజ...
ఇక్కడ వివిధ గెటప్పుల్లో కనిపిస్తున్న హీరో ఎవరు?

చలి సంగీతం

ఇక్కడ కొన్ని చలిపాటలున్నాయి. వాటికి సంగీతదర్శకులెవరో చెప్పగలరా?

1. ఓ చెలీ చెలీ ఇది జనవరి
ఏ చలీగిలీ లేవా మరి...
2. చలిగా ఉందన్నాడే కిలాడీ బుల్లోడు
దుప్పట్లో దూరాడే మొఘలాయి
మొనగాడు...
3. చలిచంపుతున్న చమక్కులో చెలి
చెంతకొచ్చిందీ...చెలి చెంతకొచ్చే
తళుక్కులో గిలిగింతపెట్టిందీ...
4. గిలిగా గిలిగిలిగా గిలిగింతగా...
కసిగా కసికసిగా కవ్వింతగా...
5. చలిచలిగా అల్లిందీ గిలిగిలిగా గిల్లిందీ
నీవైపే మళ్లిందీ మనసూ...

తమన్నా స్పెషల్

కిందనున్న తమన్నా ఫొటోల ఆధారంగా అవి ఏయే సినిమాల్లోనివో కనిపెట్టగలరా?

అది మొదలు...

ఇక్కడ కొందరు సినీ ప్రముఖులూ వాళ్ల మొదటి సినిమాలూ ఉన్నాయి. జతచేయండి.

1. రోజా	ఎ. బాచి
2. రంభ	బి. కొబ్బరిబొండాం
3. చక్రి	సి. ప్రేమతపస్సు
4. సుమన్	డి. ప్రతిధ్వని
5. ఎస్వీ కృష్ణారెడ్డి	ఇ. ఆ ఒక్కటీ అడక్కు
6. బి.గోపాల్	ఎఫ్. తరంగిణి

బాబాయ్ - అమ్మాయ్ - అబ్బాయ్

కొందరు హీరోయిన్లు బాలయ్యతోనూ ఎన్టీఆర్‌తోనూ చెరో సినిమాలో కలిసి నటించారు. ఇక్కడ వాళ్లిద్దరి ఫొటోలూ, మధ్యలో హీరోయిన్ల పేర్లూ ఉన్నాయి. ఆ సినిమాల పేర్లు చెప్పండి.

1. నయనతార
2. ప్రియమణి
3. ఆర్తీ అగర్వాల్
4. అమీషాపటేల్
5. ఛార్మి
6. సదా

అన్నదమ్ములు

1. నాగార్జున, సంఘవి నటించిన సినిమాలో నాగార్జున అన్నయ్యగా నటించిందెవరు?
2. బాలకృష్ణ, శోభన్‌బాబు అన్నదమ్ములుగా కనిపించే ఆ సినిమాలో హీరోయిన్ ఎవరు?
3. చిరంజీవికి తమ్ముడిగా రవితేజ కనిపించే ఆ సినిమాకు దర్శకుడు ఎవరు?
4. శ్రీకాంత్, సంగీత జంటగా కనిపించే ఆ సినిమాలో శ్రీకాంత్ అన్నయ్యగా నటించిన నటుడు?
5. శోభన్‌బాబు, రజనీకాంత్ అన్నదమ్ములుగా నటించిన సూపర్‌హిట్ సినిమా?

బాలచందర్ ది గ్రేట్

1. బాలచందర్‌తో అత్యధికంగా 36 సినిమాలకు పనిచేసిన నటుడు ఎవరు?
2. బాలచందర్ నిర్మాతగా తీసిన ఆ తమిళ సినిమాకి మణిరత్నం దర్శకుడు. ఆ చిత్రానికి తెలుగులో పాటలు రాసింది రాజశ్రీ. అదే సినిమా?
3. కన్నడ భాషలో నిలదొక్కుకోలేకపోయిన ఆ నటుణ్ణి బాలచందర్ తమిళంలో పరిచయం చేశారు. తరవాత అతడు దక్షిణాదిలో విలక్షణ నటుడిగా పేరు సంపాదించాడు. ఆ నటుడు ఎవరు?
4. బాలచందర్ దర్శకత్వం వహించిన వాటిలో అత్యధికంగా 22 సినిమాల్లో హీరోయిన్‌గా నటించిందెవరు?
5. కమల్‌హాసన్, రజనీకాంత్‌లు నటించి బాలచందర్ దర్శకత్వం వహించిన ఆ సినిమా ఓ ప్రముఖ నటికి మొదటి సినిమా. ఆమె ఎవరు?

(సమాధానాలు 29లో)

ద్విముఖం

ఇందులోని ఇద్దరు బహుముఖ ప్రతిభావంతులు ఎవరు?

అంకెల్లో...

రూ.1000 కోట్లు

వచ్చేఏడాది నుంచి సైబర్ సెక్యూరిటీ కోసం మనదేశం ఖర్చు చేయనున్న మొత్తం.

117 శాతం

గత ఏడాది కాలంలో వివిధ రకాల ఆన్‌లైన్ స్టోర్లలో ఈ-బుక్స్‌కి పెరిగిన గిరాకీ.

దాదాపు రూ.10 లక్షల కోట్లు

ప్రపంచవ్యాప్తంగా వైద్యపరిక రాల మార్కెట్ విలువ.

14.1 శాతం

ప్రపంచ జనాభాలో మాండరిన్ భాషను మాట్లాడేవారు. ఆ తరువాత ఎక్కువమంది మాట్లాడే భాష స్పానిష్.

7,00,000

ప్రస్తుతం వినియోగదారు లకు అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ ఆప్స్ సంఖ్య.

20 శాతం

వివిధ దేశాల్లో ఉన్న ఐటీ కంపెనీలలోని మొత్తం సిబ్బందిలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్నవారు.

676

ప్రపంచవ్యాప్తంగా 2011లో వివిధ నేరాల్లో ఉరిశిక్ష పడిన ఖైదీల సంఖ్య.

17,000

గత ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా నమోదైన డెంగీ కేసులు. వీటిలో దాదాపు ఓ వందమంది డెంగీ వల్లనే ప్రాణాలు కోల్పోయారు.

60 లక్షలు

తమిళనాడులో ప్రభుత్వ సంస్థల ద్వారా వైద్య సేవలు పొందుతున్నవారు.

మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

కలసికట్టుగా

'అభిరుచికో సంఘం' మమ్మల్ని అలరించింది. ఒకే అభిరుచిగల వ్యక్తులందరూ ఒక సంఘంగా ఏర్పడటం బాగుంది. దీనివల్ల చాలా విషయాలు ఇచ్చిపుచ్చుకోగలుగుతారు. ముఖ్యంగా కొంతమంది ఐక్యంగా ఉండగలుగుతారు. కథనంలో వివరించిన 'పుస్తక ప్రియుల సంఘం' బాగా నచ్చింది. వీటిలో ఎమ్.ఎమ్.టి.ఎస్. క్లబ్, పుడీస్ క్లబ్‌లు కాస్త కొత్తగా అనిపించాయి.

– వై.మాలతి, మంచిర్యాల్, ఆదిలాబాద్

– కలీముల్లాఖాన్ మహమ్మద్, రాజమండ్రి

హత్తుకుంది

'మారిన దూరం' కథ మనసుని హత్తుకుంది. నేటితరంలో చాలామంది డబ్బు సంపాదించడం ఒక్కటే తమ బాధ్యత అనుకుంటున్నారు. ఆ పరుగులో పడి జీవితంలోని ఎన్నో ఆనందాలనూ ఆత్మీయతలనూ కోల్పోతున్నారు. ఇలాంటి వారికి ఈ కథ ఓ కనువిప్పు కావాలి. కన్నవారి ప్రేమానురాగాలను కేవలం డబ్బుతో పొందలేమన్న సందేశాన్ని కథలో ఇచ్చారు.

– పి.ఎం.ఇంద్ర, ఎల్కతుర్తి, కరీంనగర్

– మంగ నర్సింహులు(ఈమెయిల్)

కోటికొకరు

'రాజుగారు కోటికొకరు' స్ఫూర్తిదాయకంగా ఉంది. ఇతరులకు సాయపడాలనుకునే మంతెన రామలింగరాజు లాంటివాళ్లు ఊరికొకరు ఉంటే చాలు. పేద విద్యార్థుల కోసం పెద్ద మొత్తంలో సొమ్మును విరాళమిచ్చిన ఈయన ఎంతోమందికి ఆదర్శం కావాలి.

– డా॥ శివభూషణం, కర్నూలు

– డి. ఆదినారాయణ, గొట్లపాడు, భీమవరం

వెళ్లాలనుకుంటున్నాం

'ఆ బీచ్‌లో ఇసుక ఉండదు' యాత్రా కథనం నచ్చింది. పుదుచ్చేరి అందాలను కళ్లకు కట్టినట్టు వివరించారు వ్యాసకర్త. ఇది చదివాక మేము కూడా కుటుంబ సమేతంగా అక్కడికి వెళ్లిరావా లని నిర్ణయించుకున్నాం. 'అభిరుచికో సంఘం' చాలా బాగుంది. ఇలాంటి సంఘాలలో సభ్యులుగా చేరడం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– వై.రామ్‌గోపాల్‌రెడ్డి, సిద్ధిపేట్

– సి.రాజేష్(ఈమెయిల్)

ఎన్నాళ్లైందో

'ఆ విషయంలో నేను మోనార్క్' అంటూ ఒకప్పటి నంబర్ వన్ హీరోయిన్ సిమ్రాన్ చెప్పిన ముచ్చట్లు అలరించాయి. కెరీర్‌లో ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని కుటుంబ బాధ్యతలు స్వీకరించడం చాలా గ్రేట్. 'రుచి అభిరుచి'లోని వంటకాలు నచ్చాయి.

– ఆర్.వనజ, విజయవాడ

– ఎల్.వి.రాజేంద్రకుమార్(ఈమెయిల్)

ఘన చరిత్ర

'పాప హరణాలు నవనందులు' విజ్ఞానదాయ కంగా ఉంది. నవ నందులకు పురాణాల్లో ఉన్న ప్రాధాన్యతను తెలుసుకున్నాం. 'మట్టిపూల పరిమళం' నయనానందకరం. ఆ చిత్రాలను చూస్తుంటే... అవి మట్టితో తయారైనవంటే నమ్మశక్యం కాలేదు. అంత అద్భుతంగా ఉన్నాయి. 'చురుక్కు చమక్కు' ఎప్పటిలానే ఆలోచింపజేసేలా ఉంది.

– ఎల్.విజయలక్ష్మి, సురేష్(ఈమెయిల్)

– కె.రఘురాంబాబు, హైదరాబాద్

లోపల...

చురుక్కు చమక్కు 4
శ్రీవారి సన్నిధిలో...శివాలయం ... 5
మీ మందు మీ చేతిలో 6

'గ్లోబల్' గోరుచిక్కుడు! 7

గోరుచిక్కుడు పరిధి వంటింటి నుంచి విశ్వవిపణికి విస్తరించింది. చిరుతిళ్ల నుంచి చమురు ఉత్పత్తి దాకా అనేకానేక రంగాల్లో గోరుచిక్కుడు జిగురు ప్రధాన ముడిసరుకు అవుతోంది. అమెరికా వంటి అగ్రదేశాలు కూడా మనవైపే ఆశగా చూస్తున్నాయి.

కెమెరా పట్టండి...ఛాన్స్ కొట్టండి! 11
కథ 12
అంతిమయాత్రకు అన్నీ తానై... 14
కదంబం 15
ఆకు... పచ్చని ఫ్యాషన్! 16

రొటీన్... అంటే బోరు! 18

ముల్కనూరు... మరో ఆనంద్ ..20
అబద్ధాల పోటీ! 21
పిల్లలు చెబితే వినాలి 22



రుచి అభిరుచి 23

బాలవినోదిని 24

దేవకన్యలు నడిచే లోయ ఇదేనా! 26

రాశి ఫలం 28
సమీక్ష 29
పదవినోదం 30

మంచిమాట

ఎవరి గుర్తింపుకూ నోచని లెక్కలేనన్ని చిన్నచిన్న పనుల తర్వాతే అందరి మెప్పూ పొందే ఘనవిజయం లభిస్తుంది.

చురుకు


శివం
♫.. కావవే వరద సంరక్షించు భద్రాత్మకా ♫
విచారణ
మద్యం స్కాండిలేటు నాయకులు, భాగ్యశాలి మంత్రి
త్రిధర్


అవినీతి ఆరోపణలు
వరదనష్టాలపై ఆరోపణలు
గడ్కరీ

సైబర్ నాకిన
వక్రీకరణ
రాహుల్
అభ్యర్థులు

చమకు


ఓటర్ల జాబితా ప్రచార సరళి, అభ్యర్థుల ఎంపిక, సర్వేలు, మద్దతు
కాంగ్రెస్



తిరుమల అంటే శ్రీవారే. అణువణువూ వేంకటేశ్వరుడే. తమిళంలో తిరు అంటే శ్రీ అనీ, మల అంటే శైలం (కొండ) అనీ కూడా అర్థం. అంటే తిరుమల... శ్రీశైలమన్నమాట. శివకేశవులకు భేదం లేదు కదా... అలాంటప్పుడు తిరుపతిలో శివాలయం ఉండటంలో ఆశ్చర్యమేముంది! అలా తిరుపతిలో వెలసిన పవిత్ర తీర్థరాజమే కపిలతీర్థం.

శ్రీవారి సన్నిధిలో... శివాలయం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి. ఇక్కడ శ్రీవారి ఆలయంతోపాటు గోవిందరాజస్వామి, కోదండరామస్వామివారి ఆలయాలున్నాయి. గొప్ప వైష్ణవ క్షేత్రమైన తిరుపతిలో ఓ శైవక్షేత్రం కూడా ఉంది. అదే కపిలతీర్థం. తిరుపతికి ఉత్తరంగా, తిరుపతి కొండలకు ఆనుకుని అలిపిరి దిగువకు వెళ్తే మనోహరమైన ఈ తీర్థం కనిపిస్తుంది. ముఖ్యంగా, వర్షాకాలంలో ఇక్కడకు వస్తే... ప్రకృతి సుందర జలపాత దృశ్యాలు చూపుతిప్ప నివ్వవు. ఇక్కడి ప్రశాంత వాతావరణం... అడుగుతీసి అడుగు వేయనివ్వదు.

ఇంతటి సుమనోహర తీర్థం ఇక్కడ ఎలా ఏర్పడిందంటే...

కృతయుగంలో కపిల మహర్షి ఇక్కడ ఈశ్వరుని కోసం ఘోర తపస్సు చేశాడట. ఆ తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు పాతాళంనుంచి భూమిని చీల్చుకుని ఇక్కడ వెలిశాడని స్థలపురాణం. కపిలముని తపస్సు కారణంగా ఇక్కడ కొలువైనది ఈశ్వరుడు కాబట్టి ఈ స్వామికి కపిలేశ్వరుడు అని పేరు వచ్చింది. ఇక్కడి లింగాన్ని కూడా కపిల లింగం అంటారు. ఆ తరవాత త్రేతాయుగంలో అగ్నిదేవుడు ఈ క్షేత్రంలో ముక్కంటిని పూజించాడట. అందువల్ల, ఈ లింగాన్ని ఆగ్నేయ లింగమనికూడా పిలుస్తారు. ఇక్కడ కపిలేశ్వరుడు కామాక్షీదేవి సమేతంగా కొలువయ్యాడు.

ఈ ఆలయానికి ఉన్నత శిఖరమా అనిపించేలా ఉంటాయి తిరుమల కొండలు. ఆ కొండలమీది నుంచి గలగలా పారుతూ, 20 అడుగుల ఎత్తునుంచి ఆలయ పుష్కరిణిలోకి దూకుతుంది ఆకాశగంగ. ఈ పుష్కరిణినే కపిలతీర్థం అంటారు. ఈ తీర్థాన్ని శైవులు కపిల తీర్థమనీ, వైష్ణవులు ఆళ్వార్ తీర్థమనీ పిలుస్తారు. వైష్ణవులు కోనేటి చుట్టూ నాలుగు మూలల్లోనూ నాలుగు సుదర్శన రాతిశిలలను స్థాపించారట. రాతిమెట్లు, సంధ్యావందన దీపాలనూ ఏర్పాటుచేశారు. అందుకే, అప్పట్నుంచీ దీన్ని చక్రతీర్థమని పిలిచేవారు వైష్ణవులు.

చోళుల కాలంలో...

11వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన మొదటి రాజేంద్రచోళుని కాలంలో ఈ ఆలయ నిర్మాణం జరిగిందని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. అప్పట్లో రాయన్ రాజేంద్ర చోళ అనే చోళ అధికారి దీని నిర్మాణ సూత్రధారి. చోళులు శివభక్తులు కావడంతో దీన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్మించారు.

ఆహ్లాదకరమైన కపిల తీర్థాన్ని చోళులు అభివృద్ధి చేస్తే... అచ్యుతదేవరాయల హయాంలో వైష్ణవులు దీన్ని ఆళ్వారుతీర్థంగా మార్చారు. ఈ ఆలయానికి ముందు ఒక పాడుబడ్డ గుడి ఉంటుంది. అది నమ్మాళ్వార్ అనే ఆళ్వారు గుడి అని చెబుతారు. 12వ శతాబ్దం నుంచీ 18వ శతాబ్దం వరకూ దీన్ని ఆళ్వారు తీర్థంగానే వ్యవహరించారు. పదహారో శతాబ్దంలో విజయనగరం నుంచి వచ్చిన సెవ్వుసాని అనే దేవదాసి ఈ ఆలయానికి ఎంతో సేవ చేసిందట. ఆలయంలోని వినాయకుణ్ణి ఆవిడే ప్రతిష్ఠించిందట. కపిలతీర్థంలో కపిలేశ్వర స్వామితోపాటు కాశీవిశ్వేశ్వరుడు, సహస్రలింగేశ్వరుడు, లక్ష్మీనారాయణుడు, శ్రీకృష్ణుడు, అగస్త్యేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు కూడా ఉన్నారు.

పవిత్ర తీర్థం

కపిలతీర్థం పరమ పవిత్రమైనదని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక పౌర్ణమినాడు మధ్యాహ్నవేళ ముల్లోకాల్లోని సకలతీర్థాలూ నాలుగు గంటలపాటు కపిల తీర్థంలో నిలుస్తాయని ప్రతీతి. ఆ సమయంలో ఈ తీర్థంలో స్నానమాచరిస్తే సకల పాపాలూ దూదిపింజల్లా పోతాయని ప్రసిద్ధి. స్నానమాచరించిన తరవాత నువ్వుగింజంత బంగారాన్ని దానంచేసినా... కొండంత పుణ్యం లభిస్తుందని చెబుతారు. అందుకే కార్తీకమాసం ప్రారంభం కాగానే ఈ తీర్థానికి భక్తులు పోటెత్తుతారు. నిత్యం ఈ తీర్థంలో పుణ్యస్నానాలు చేసి పరమేశ్వరుడికి ప్రీతికరంగా దీపాలు వెలిగిస్తారు. శివుడికి ఆరుద్రా నక్షత్రం అంటే చాలా ఇష్టమట. అందుకే, కార్తీకంలో ఆరుద్రా నక్షత్రం రోజున... ఆలయంలో లక్షబిళ్వార్చన, అన్నాభిషేకం ఘనంగా జరుగుతాయి. ఏటా డిసెంబరులో తెప్పోత్సవాలూ, మాఘమాసంలో 10రోజులపాటు బ్రహ్మోత్సవాలూ నిర్వహిస్తారు.

– *పట్టా మోహన్‌కుమార్, న్యూస్‌టుడే, తిరుపతి(సాంస్కృతికం)*

ఇలా వెళ్లొచ్చు

తిరుపతి బస్టాండు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో అలిపిరి మార్గంలో కపిలతీర్థం ఆలయం ఉంది. బస్టాండు సమీపంలోని రైల్వేస్టేషన్ నుంచి ప్రతీ అరగంటకూ నడిచే తిరిదే ఉచిత బస్సుల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు. ఆటోలూ ఉంటాయి. మదనపల్లి, చిత్తూరుల నుంచి తిరుపతి వచ్చే బస్సులు ఈ ఆలయం మీదుగానే వెళ్తాయి.

మీ మందు 47 హోమియో మీ చేతిలో

సంతానం సాఫల్యం

తాను బ్రతకాలి. సంతానం ద్వారా జాతిని బతికించాలి. ఇది జీవధర్మం! అయితే ఈ సంతానప్రాప్తి అనేది జీవధర్మమే అయినా దీనికి ఎన్నో అంశాలు కలిసి రావాలి. ముందుగా చెప్పుకోదగ్గది అవయవ సౌష్టవం. తల్లిపరంగా అండాశయాలు, అండవాహికలు, గర్భకోశం.

ఈ అవయవ ధర్మాలను నియంత్రణ చేసేది హార్మోనులు. అందువల్ల జీవధర్మ నిర్వహణలో ఈ హార్మోనుల పాత్ర అనల్పం. ఈ అవయవాలు, హార్మోనుల వెనక కణాల లోని జన్యువులు కీలక పాత్ర పోషిస్తాయి. సత్‌సంతానానికి జన్యువులే మూలాధారం. ఇవన్నీ అంతర్గత కారణాలు కాగా... బయటి నుంచి ఆహారం, ఆరోగ్యం, ఔషధాలు ఇవన్నీ కూడా ప్రభావం చూపిస్తాయి. స్త్రీలకు 18 సంవత్సరాల వయస్సు సత్‌సంతాన ప్రాప్తికి అనువైన వయస్సుగా పరిగణిస్తారు. జీవశాస్త్ర రీత్యా ఆ వయస్సుకు ముందే సంతానాన్ని కనటం 'బయోలాజికల్ ఎర్రర్'గా నిర్ధారించడం జరిగింది. 18వ శతాబ్దం వరకు ఆడపిల్లల సగటు రజస్వల వయసు 16 సంవత్సరాలుగా ఉండేది. ఇదిప్పుడు క్రమేపీ 11, 12 సంవత్సరాలకు వచ్చేసింది. ఆహారం, అలవాట్లు, నాగరికత శరీర ధర్మాలను ప్రభావితం చేస్తాయనటానికి ఇదే గొప్ప దర్శనం.

సంతాన రాహిత్యానికి నూటికి 30 జంటల్లో పురుషులకు సంబంధించిన కారణాలే ప్రాధాన్యత సంతరించుకొంటాయన్న విషయం మరువకూడదు.

స్త్రీలలో అండాశయాల నుండి విడుదలైన అండ కణం పురుషుడి నుంచి వెలువడిన బీజకణంతో సంయోగం చెంది పిండకణంగా రూపొందుతుంది. ఆ పిండకణం అండవాహికల ద్వారా 3 రోజులపాటు ప్రయాణం కొనసాగించి గర్భకోశంలో ప్రవేశిస్తుంది. గర్భకోశ పొరలలో పాన్పు ఏర్పరచుకొని స్థిరపడడానికి మరో మూడు రోజులు పడుతుంది.

గర్భకోశంలో స్థిరపడే సమయానికి పిండ కణం వృద్ధి-విభజనల ద్వారా రెండు విభాగాలుగా రూపొందడం జరుగుతుంది. ఒక విభాగాన్ని 'మాయ' (Placenta), రెండవ విభాగాన్ని పిండం (Embryo) అని వ్యవహరిస్తారు. మాయను చెట్టువేళ్లతో, పిండాన్ని చెట్టు మొదలు కొమ్మలతో పోల్చుకోవచ్చు. మాయ ద్వారా తల్లి నుండి సేకరించిన పోషక పదార్థాలు, ప్రాణవాయువు పిండానికి అందుతుంటాయి. మాయను విడదీసి పరిస్తే సుమారు 120 చదరపు అడుగుల పరిమాణముంటుంది.

గర్భధారణ సమయం సుమారు 40 వారాలు. ఈ కాలాన్ని మూడు విభాగాలుగా విభజన చేసి పిండ పరిమాణ దశలను గుర్తించడం జరుగుతుంది.

గర్భధారణ సమయం 3 త్రైమాసికాలలో మొదటి త్రైమాసికం అత్యంత కీలకమైనది. పిండానికి కాళ్ళు చేతులు బాహ్యంగా రూపొందడం జరుగుతుంది. అంతర్గతంగా శరీరంలో ముఖ్య అవయవాలైన గుండె, కాలేయం, ఊపిరితిత్తులు మొదటి త్రైమాసికంలోనే రూపుదిద్దుకుంటాయి. తల్లికి వేవిళ్ళు లాంటి బాధలుంటాయి.

రెండవ త్రైమాసికం తల్లికి సంతోషదాయకంగానే గడుస్తుంది. వేవిళ్ళు వంటి బాధలు తగ్గిపోతాయి. శిశువు కదలికలు తెలుస్తాయి. సెక్స్ జీవితం కొనసాగుతూనే ఉంటుంది.

మూడవ త్రైమాసికంలో కాన్పుపైన మనస్సు లగ్నమవుతుంది. సెక్సు పట్ల విముఖత సహజం.

సంతానరాహిత్యానికి అండవాహికలలో లోపాలు 35%, గర్భకోశ లోపాలు 20%, హార్మోను పరమైన సమస్యలు 20% కారణాలుగా నిర్ధారించడం జరిగింది. సంతాన లేమికి హోమియోలో ప్రత్యేక ఔషధాలు: నేట్రంమూర్, నేట్రంకార్బ్, సెపియా, బోరాక్స్, ఆరంమెట్.

2 ఔషధాన్ని ఎంపిక చేసుకునేదెలా?

బహిష్టు త్వరత్వరగా వస్తాయి. రుతుస్రావం అధికం. సంతానప్రాప్తి లేకుంటే	నేట్రంమూర్
రక్తస్రావం కన్నా తెల్లకుసుమే అధికంగా అవుతుంటే	నేట్రంమూర్
తెల్లకుసుమ అధికం, తీగ సాగుతున్నట్లుగా జిగురుగా ఉంటే	నేట్రంకార్బ్
కుటుంబం పట్ల, భర్త పట్ల కూడా విముఖత ఉంటే	నేట్రంకార్బ్
రతి బాధాకరం, రతి అనంతరం రక్తస్రావం కన్పిస్తే	సెపియా
పొట్టలో నుండి క్రింది అవయవాలు జారుతున్నట్లనిపిస్తే	సెపియా
ముఖం మీద బూజు అతుక్కున్నట్లనిపిస్తుంది, రతి ఇష్టం లేకపోతే	బోరాక్స్
రుతుస్రావం ధారాళం, త్వరత్వరగా రావడం జరుగుతుంటే	బోరాక్స్
సుఖవ్యాధులు, సంతానరాహిత్యం	ఆరంమెట్
గర్భకోశం పెద్దదై, క్రిందికి జారినట్లుగా ఉంటే	ఆరంమెట్

3 మీ ఔషధం గురించి మరిన్ని వివరాలు

నేట్రంమూర్

రజస్వల కావడం ఆలస్యమైపోతుంది. బహిష్టులు ముందుగా వస్తుంటాయి. స్రావం విపరీతం. తెల్లకుసుమ ఆకుపచ్చని రంగులోకి మారుతుంది. యోని పొడారిపోయి రతికిష్టపడరు. ఉప్పు ఎక్కువగా కావాలి.

నేట్రంకార్బ్

సున్నిత మనస్కులు. ఏదో పోగొట్టుకున్న వారిలా మనస్సు భారంగా ఉంటుంది. సంసారం, సమాజం అన్నింటి పట్ల ఉదాసీనత. రతిలో శుక్రం యోనిలో నిలబడక వంధ్యత్వం. పసుపు రంగులో చిక్కగా తెలుపు అవుతుంటుంది. అజీర్తి, ఎసిడిటీ. పాలు ఇష్టపడరు.

ఆరంమెట్

సంతాన రాహిత్యం. సిఫిలిస్ వ్యాధికి ముఖ్య ఔషధం. వంధ్యత్వం మూలంగా దిగులు. గర్భకోశం పెద్దదిగా జారి ఉంటుంది. యోని నుండి ఎప్పుడూ స్రావం. బహిష్టులు లేటు. స్రావం తక్కువ.

బోరాక్స్

తెల్లస్రావం తొడల మీదికి జారుతుంటుంది. రతి పట్ల ఇష్టం తక్కువే. మెన్సెస్ ముందుగా వస్తుంది. స్రావం అధికం. పొట్టలో నొప్పి, వికారం ఉంటాయి. సంతానానికి తల్లిపాలపై అయిష్టత. సంతానం లేనివారికి ఇది ప్రత్యేక ఔషధం.

సెపియా

పొత్తికడుపులో అవయవాలన్నీ క్రిందికి జారుతున్నట్లనిపిస్తుంది. యోని పొడారి ఉంటుంది. రతి అనంతరం రక్తం కన్పించవచ్చు. బహిష్టు లేటుగా, స్రావం తక్కువగా కావచ్చు లేదా ముందుగా అధికంగానూ కావచ్చు. రతి ఇష్టపడరు. రతి అనంతరం బాధలు కూడా తెల్లకుసుమ సుద్దలుగా పాల రంగులో, పసుపు రంగులో ఉంటుంది.

మోతాదు: *మీరు ఎంచుకున్న ఔషధాన్ని 30 పొటెన్సీలో రోజూ ఉదయం సాయంత్రం... 6 మాత్రల చొప్పున... 2, 3 వారాలపాటు వాడుకోవాల్సి ఉంటుంది.*

మనం తినే కేకు, మనం రుద్దే పేస్టు, మనం వాడే షాంపూ, మనం పెట్టే కుక్కబిస్కెట్లూ... అన్నింట్లోనూ 'గోరుచిక్కుడు' ఉంది. డాలర్లదేశం ఆశగా భారత్ వైపు చూసేది, ఒక్క గోరుచిక్కుడు కోసమే! ఆ జిగురే కనుక అందకపోతే... అమెరికా చేతిచమురు వదుల్తుంది!

'గ్లోబల్' గోరుచిక్కుడు!

వంటింటి కోణం...

గోరుచిక్కుడుతో కూర వండుకోవచ్చు. సాంబార్లో వేసుకోవచ్చు. నచ్చితే రోటిపచ్చడీ చేసుకోవచ్చు. రొట్టెలోకైనా అన్నంలోకైనా బాగానే ఉంటుంది. మొత్తంగా ఇదో 'మినిమమ్ గ్యారెంటీ' కూర! అద్భుతమన్న ప్రశంసలు రావు. చండాలంగా ఉందన్న విమర్శలూ ఉండవు. వేడివేడిగా వడ్డిస్తే కిక్కురుమనకుండా తినేస్తారు.

వ్యవసాయ కోణం...

ఇదో మెట్టపంట. వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకుంటుంది. ఇసుక నేలల్లో, ప్రతికూల వాతావరణంలో కష్టాల సాగు చేస్తున్న రాజస్థానీ రైతుల జీవితాల్లో మెరుపులు మెరిపిస్తోంది. నిన్నమొన్నటిదాకా సైకిళ్లకే దిక్కులేని గ్రామాల్లో ఆడి, బీఎండబ్ల్యూ, టొయోటా-ఫార్చూనర్ కార్లు కనిపిస్తున్నాయంటే... అంతా గోరుచిక్కుడు మహత్యమే! రాజస్థానీలను రాజాలుగా మార్చిన ఆ పంట... ఆంధ్రప్రదేశ్ రైతులనూ ఆకట్టుకుంటోంది. వివిధ జిల్లాల్లో ఉత్సాహంగా సాగు చేస్తున్నారు.

అంతర్జాతీయ కోణం...

ఇక్కడ భారత్‌లో వర్షాలు ముఖం చాటేస్తే... అక్కడ వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తర అమెరికాలోని చమురు క్షేత్రాల నిర్వాహకుల మొహాల్లో నెత్తురు చుక్క ఉండదు. ఇక్కడ ఇరగ పండితే... అక్కడ పండగే! ఈ 'గ్లోబల్' గోకరకాయ్ హంగామా వెనుక పెద్ద కథే ఉంది.

ఎక్కడో పుట్టి...

గోరుచిక్కుడు మనకు తెలిసిన కూరగాయే..! రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పండుతుంది. తెలంగాణాలో దీన్ని 'గోకరకాయ' అని పిలుస్తారు. హిందీలో గౌర్ అనీ, ఇంగ్లిష్‌లో క్లస్టర్ బీన్ అనీ అంటారు. ఈ మొక్క తరాల క్రితమే ఆఫ్రికా నుంచి మన దేశానికి వచ్చిందని నిపుణులు చెబుతారు. ప్రస్తుతం దక్షిణాసియాలోనే అధికంగా పండుతోంది. భారత్‌లో మరీ ఎక్కువ. ప్రపంచంలో ఉత్పత్తయ్యే గోరుచిక్కుడులో 80 శాతం వాటా మనదే. తర్వాతి స్థానాల్లో పాకిస్థాన్, అమెరికా ఉన్నాయి. దక్షిణాఫ్రికా, మలావి, జైర్, సూడాన్‌లలోనూ వాణిజ్య ప్రాతిపదికన సాగు చేస్తున్నారు. మొదట్లో రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అయితే, ఒంటెలకూ పశువులకూ మేత కోసమే ఎక్కువగా పండించేవారు. గోరుచిక్కుడు జిగురులోని పారిశ్రామిక ప్రయోజనాలు తెలియడంతో... ఆ పంట దిశ మారింది. రైతన్న దశ మారింది. జోధ్‌పూర్, బికనీర్, గంగానగర్, జైపూర్, ఆల్వార్ ప్రధాన మార్కెట్లుగా అవతరించాయి. గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్ రైతులు పోటీపడి పండిస్తున్నారు. కుబేరులూ కార్పొరేట్లూ కూడా గోరుచిక్కుడు పంట మీద ఆసక్తి చూపుతున్నారు.

కదలదు...వదలదు!

గోరుచిక్కుడు పంట చేతికి రాగానే బాగా ఎండబెట్టి, గింజల పొట్టు తీస్తారు. వాటిని పప్పుగా చేస్తారు. ఆ పొడిలో నీళ్లు కలిపితే జిగటజిగటగా మారుతుంది. ప్రత్యేకంగా జిగురు కోసమే పండించే గోరుచిక్కుడును 'గమ్‌గౌర్' అని వ్యవహరిస్తారు. ఐస్‌క్రీమ్‌లు, సాఫ్ట్ డ్రింకులు, పుడ్డింగ్స్, చాకొలెట్ మిల్క్, ఫ్లేవర్డ్ మిల్క్, జామ్, జెల్లీ, బ్రెడ్, బిస్కెట్, సాస్, కెచప్, చీజ్, క్యాన్డ్ ఫిష్, క్యాన్డ్ మీట్, నూడుల్స్, పాస్తా... ఇలా రకరకాల ఆహార పదార్థాల్లో వాడతారు. గోరుచిక్కుడు జిగురులో కేలరీలు ఉండవు. జీర్ణవ్యవస్థ శుద్ధికి ఉపయోగపడుతుంది. కొద్దిగా తీసుకున్నా పొట్ట నిండినట్టు అనిపిస్తుంది. దీంతో బరువు తగ్గాలనుకునేవారి కోసం ప్రత్యేకంగా తయారు చేసే ఆహార పదార్థాల్లో గోరుచిక్కుడు జిగురును విరివిగా వాడుతున్నారు. పోషకాహారాల తయారీలో, చర్మ సౌందర్యానికి వాడే లోషన్లలో దీన్ని వినియోగిస్తారు.

వస్త్ర పరిశ్రమ, ముద్రణ, అగ్నిమాపక

గోరంత సత్యాలు!

గోరు చిక్కుడు శాస్త్రీయ నామం... సైమాప్సిస్ టెట్రాగోనొలోబా. గింజల్లో సీడ్ కోట్ (పై పొర), ఎండోస్పెర్మ్ (లోపల పప్పు), జెర్మ్ అని మూడు భాగాలు ఉంటాయి. ఎండోస్పెర్మ్‌లో గెలాక్టోమెనన్ అనే పదార్థం ఉంటుంది. దీని నుంచే జిగురు తయారుచేస్తారు.

జోధ్‌పూర్‌లోని సెంట్రల్ ఆరిడ్ జోనల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (కాజ్రి) ఎక్కువ జిగురును ఇచ్చే గోరు చిక్కుడు రకాలపై పరిశోధనలు చేస్తోంది. గంగానగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు సాగుతున్నాయి. గుంటూరు, తిరుపతి నగరాల్లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లోనూ అధ్యయనం జరుగుతోంది.

గోరుచిక్కుడు జిగురుకు ఔషధగుణాలున్నాయి. కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో ఉపయోగపడుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది.

టన్ను నాణ్యమైన గోరుచిక్కుడుతో 300 కిలోల జిగురు తయారవుతుంది.

సాధారణ జిగురుతో పోలిస్తే... ఆయిల్, గ్రీజు వంటి వాటిని కూడా తట్టుకుని నిలిచే శక్తి ఉంది.

పదార్థాల తయారీ, సిరామిక్స్, దోమల నివారిణులు, కాగితం, వాటర్ పెయింట్లు, చమురు బావుల తవ్వకాలు, మైనింగ్, పేలుడు పదార్థాల తయారీలో... గోరుచిక్కుడు జిగురు చాలా కీలకం. చమురు-గ్యాస్ బావులకైతే జిగురు లేకపోతే పనే నడవదు. అమెరికా షేల్ ఆయిల్, షేల్ గ్యాస్ వెలికి తీతపై దృష్టి పెట్టడంతో... మన దేశంలో గోరుచిక్కుడు జిగురు ధరకు రెక్కలొచ్చాయి. గతంలో క్వింటాలుకు రెండువేల నుంచి నాలుగువేల మధ్య ఉన్న గింజల ధర గత ఏడాది ముప్పై అయిదువేలు పలికింది. జిగురు ధర లక్షా పదివేల పైమాటే.

ఎందుకింత గిరాకీ..!

గోరుచిక్కుడు జిగురుకు అంతర్జాతీయ మార్కెట్లో గొప్ప గిరాకీ ఉంది. అమెరికా తన చమురు పరిశ్రమ అవసరాల కోసం భారత్ జిగురుపైనే ఆధారపడుతోంది. షేల్‌గ్యాస్ లేదా నూనె వెలికితీసే 'ఫ్రాకింగ్' ప్రక్రియలో ఇది కీలకమైంది. ఇంతకీ షేల్ గ్యాస్/ఆయిల్ అంటే ఏమిటి? ఫ్రాకింగ్‌లో ఏం చేస్తారూ అంటే.. సాధారణంగా సహజవాయువూ చమురూ భూమిలోని రాతి పొరల్లో నిక్షిప్తమై ఉంటాయి. భూమి లోపలికంటా తవ్వి బావుల నుంచి వెలికి తీయాలి. సాధారణంగా ఇసుకరాయి (శాండ్ స్టోన్), సున్నపురాయి (లైమ్ స్టోన్) పొరల్లో నిక్షేపాలు ఉంటాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 90 శాతం సహజవాయువూ చమురూ ఈ రెండురకాల రాళ్ల నుంచే వస్తోంది. ఇసుకరాయిలో రేణువుకీ రేణువుకీ మధ్య, సున్నపురాయిలో లైమ్‌స్టోన్‌లో పొరల మధ్య ఉన్న ఖాళీలలో గ్యాస్, ఆయిల్ ఉంటాయి. సంప్రదాయ విధానంలో శిలల్ని బుల్లెట్‌తో పేలుస్తారు. కొన్ని సార్లు రసాయనాలూ పంపిస్తారు. అప్పుడు రాళ్లల్లో నిక్షిప్తమైన గ్యాస్, ఆయిల్ బావుల్లోకి వచ్చేస్తుంది. ఇక షేల్ గ్యాస్‌నూ షేల్ ఆయిల్‌నూ వెలికితీయడం కొంత భిన్నమైన విధానం. భూమి లోపల బంకమట్టి గట్టి పడగా ఏర్పడిన రాళ్లనే 'షేల్' అంటారు. ఈ రాళ్లలో చాలా పలుచని పొరలు ఉంటాయి. భూమి లోపలికి వెళ్లేకొద్దీ ప్రతి 100 మీటర్లకూ మూడు డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రత, ఒత్తిడి తదితర కారణాల వల్ల... కాలక్రమంలో బంకమట్టి గట్టిపడి 'హార్డ్‌రాక్'గా మారుతుంది. ఈ ప్రక్రియలో మట్టిలో ఉండే నీరు, చమురు వంటివి చాలా వరకూ బయటికెళ్లిపోతాయి. ఇంకా కొంత గ్యాస్, ఆయిల్ రాతి పొరల మధ్యలో చిక్కుకుపోయి ఉంటుంది. దీన్ని బయటికి తీయాలంటే రాతిని ముక్కలు చేయాలి. పగుళ్లు సృష్టించాలి. పొరలమధ్య దూరాన్ని పెంచాలి. షేల్ గ్యాస్/ఆయిల్ కోసం భూమి లోపలి వరకు నిట్టనిలువుగా తవ్వకాలు (డ్రిల్లింగ్) జరుపుతారు. మట్టి పొరలు తగిలాక భూమిలోపల సమాంతరంగా తవ్వకాలు చేస్తారు, నీటిలో వివిధ రసాయనాల్ని కలిపి ఎక్కువ పీడనంతో భూమి లోపలికి పంపుతారు. మట్టి రేణువుల మధ్య ఖాళీ ఏర్పడేలా చేస్తారు. అప్పుడే దాన్లోని చమురు గ్యాస్ బావిలోకి చేరుతుంది. భారీగా నీటిని వాడతారు కాబట్టి ఈ ప్రక్రియను హైడ్రో ఫ్రాక్చరింగ్ అనీ ఫ్రాకింగ్ అనీ పిలుస్తారు. ఇలా భూమి లోపలికి పంపించే పదార్థాన్ని ప్రొపొనెంట్ అంటారు. 'షేల్' బావుల్లోకి పంపే ప్రొపొనెంట్స్‌లో ఎక్కువ శాతం గోరుచిక్కుడు జిగురు ఉంటుంది. ఆ పదార్థం లేకుండా షేల్ గ్యాస్ తవ్వకాలు అసాధ్యం. అమెరికాలో ప్రస్తుతం 30 శాతం వరకు గ్యాస్ 'షేల్' నుంచే వస్తోంది. మనం జిగురు సరఫరా చేయకపోతే ఆ బావులన్నీ మూతపడినట్టే. అందుకే

మరి, మన దగ్గర గోరుచిక్కుడు ఉత్పత్తి తగ్గితే అమెరికాకు చెమటలు!

షేల్ గ్యాస్ వెలికి తీయడం కొంత సంక్లిష్టమైన ప్రక్రియే అయినా, చాలా దేశాలు దీనిపై దృష్టి సారిస్తున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులు క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో ప్రత్యామ్నాయాలు వెతుక్కోవడం తప్పనిసరి అవుతోంది. పైగా సహజ వాయువుల కోసం, చమురు కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడటం ఎప్పటికైనా ప్రమాదమే. ప్రపంచంలోని చాలా దేశాల్లో షేల్ గ్యాస్/ఆయిల్ నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతానికి, కొన్ని దేశాలు మాత్రం వెలికి తీస్తున్నాయి. భారత్ కూడా షేల్ గ్యాస్ ప్రాధాన్యాన్ని గుర్తించింది. మన దగ్గరే కాదు, పొరుగు దేశాల్లోనూ లీజుల ద్వారా తవ్వకాలు జరుపుతామని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది కూడా. అమెరికాలో అయితే ఎప్పుడో 2004లోనే ఈ కార్యక్రమం ఊపందుకుంది. ప్రస్తుతం అక్కడ 30 శాతం సహజవాయువు షేల్ నుంచే వస్తోంది. మనం కూడా షేల్ గ్యాస్ వంటి ప్రత్యామ్నాయాల్ని వెతకాల్సిన అవసరం చాలా ఉంది. భారత్‌లో చాలా చోట్ల 'షేల్' ఉన్నా, గ్యాస్/ఆయిల్ నిక్షేపాలు కలిగిన షేల్ కొన్ని చోట్లే ఉంటుందని చమురు రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మన అవసరాలకు 176 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు అవసరమైతే, 2011-12లో 48 మిలియన్ మెట్రిక్ టన్నులే ఉత్పత్తి చేయగలిగాం. గ్యాస్ 64 బీసీఎం (బిలియన్ క్యూబిక్ మీటర్లు) అవసరమైతే గత సంవత్సరం 52 బీసీఎం ఉత్పత్తి చేయగలిగాం. మిగిలింది అంతా, విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. భవిష్యత్‌తో షేల్ ప్రాధాన్యం మరింత పెరగడం ఖాయం. దాంతోపాటే... గోరుచిక్కుడు మార్కెట్ కూడా!

గౌర్‌కీ కమాల్!

దేశంలో ఉత్పత్తి అవుతున్న గోరుచిక్కుడు జిగురులో 75 శాతం వరకు రాజస్థాన్ నుంచే వస్తోంది. ఈ పరిశ్రమలకు జోధ్‌పూర్ ప్రధాన కేంద్రం. గంగానగర్‌లో ఓ పరిశోధన కేంద్రం కూడా ఉంది. రాజస్థాన్‌లో వర్షాలు అంతంత మాత్రమే కావడంతో కాలం కలిసొస్తే నాలుగు గింజలు రాలేవి. రైతుకు నాలుగు రాళ్లు వచ్చేవి. ధరలూ తక్కువే కావడంతో గోరుచిక్కుడు సేద్యం లాభదాయకంగా ఉండేది కాదు. దళారుల దోపిడీ సరేసరి. వ్యాపారులు, పరిశ్రమల యజమానులు మాత్రం బాగుపడేవారు. గత సంవత్సరం పరిస్థితి మారిపోయింది. ఉత్తర అమెరికాలో షేల్ గ్యాస్ బూమ్‌తో గోరుచిక్కుడు జిగురుకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. ధరలు నింగినంటాయి. ఊహించని డబ్బు వచ్చిపడటంతో రాజస్థాన్ రైతులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ప్రజల జీవనశైలే మారిపోయింది. అప్పటి వరకు గుడిసెల్లో బతుకీడుస్తున్నవారు పక్కా ఇళ్లు కట్టుకున్నారు. టీవీ, ఫ్రిజ్ వంటి గృహోపకరణాలు సమకూర్చుకున్నారు. ట్రాక్టర్లు కొనుక్కున్నారు. ఆమధ్య గంగానగర్‌కు చెందిన 70 ఏళ్ల బీర్బల్ 20 క్వింటాళ్ల గింజల్ని దాదాపు ఐదున్నర లక్షలకు విక్రయించాడు. విత్తనాల కోసం క్వింటాలు గింజల్ని దాచుకున్నాడు. వాటిని దొంగలు ఎత్తుకెళ్లకుండా గట్టి కాపలా ఏర్పాటు చేసుకున్నాడట. వ్యాపారి రాధేశ్యామ్ గోరుచిక్కుడులో సంపాదించిన లాభాలతో హాంకాంగ్‌లో స్థిరాస్తి వ్యాపారం చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడట. సేద్యానికి పెట్టుబడి సమస్యే లేదు. రైతులు వ్యాపారుల దగ్గరకు వెళ్లడం కాదు... వ్యాపారులే రైతుల దగ్గరకు వచ్చి బయానా సమర్పిస్తున్నారు. విత్తనాలూ గట్రా సరఫరా చేస్తున్నారు. రైతేరాజు అన్నమాట రాజస్థాన్ రైతన్నల విషయంలో నిజమవుతోంది!

ప్రభావం...

గోరుచిక్కుడు జిగురు దేనిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసా...

ఐస్‌క్రీమ్



గట్టిపడేలా చేస్తుంది. మెత్తదనాన్నీ ఆకర్షణీయమైన మెరుపునూ ప్రసాదిస్తుంది.

బేకరీ ఉత్పత్తులు



తేమను కాపాడుతుంది. ఆహారపదార్థాల జీవితకాలాన్ని పెంచుతుంది. తాజాదనాన్నిస్తుంది.

నిర్మాణ రంగం

వాటర్‌ప్రూఫ్‌గా పనిచేస్తుంది.

కాగితం

కాగితానికి బిగువునిస్తుంది. నాణ్యమైన ముద్రణకు ఉపయోగపడుతుంది.

పేలుడుపదార్థాలు

తేమ నుంచీ నీటి నుంచీ రక్షణ కల్పిస్తుంది.

షాంపూ

మంచి కండిషనర్‌గా ఉపయోగపడుతుంది.

సాస్

సాస్ వంటి ద్రవాహారాల్లో అదనంగా ఉన్న నీటిని పీల్చుకుంటుంది. చిక్కదనాన్నిస్తుంది.

టూత్‌పేస్టూ షేవింగ్ జెల్

గొట్టం చివర సుతారంగా నొక్కగానే...టూత్‌పేస్టూ షేవింగ్ జెల్లూ ట్యూబులోంచి మెత్తగా బయటికొస్తున్నాయంటే... ఆ జిగురే కారణం.

భారత్ నెం.1

గోరుచిక్కుడు పంటలోనూ, గోరుచిక్కుడు జిగురు ఎగుమతిలోనూ మనదేశం అగ్రగామిగా ఉంది. అంతర్జాతీయ పారిశ్రామిక అవసరాల్లో ఎనభై శాతం దాకా ఇక్కడి నుంచే వెళ్తోంది. భారత్‌లో గోరుచిక్కుడు గింజల సగటు ఉత్పత్తి 10-11 లక్షల టన్నులు. దేశం నుంచి 1-1.5 లక్షల టన్నుల జిగురు ఏటా ఎగుమతి అవుతోంది. మరో 20 నుంచి 30 వేల టన్నుల జిగురును దేశీయంగా వినియోగిస్తున్నాం. మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న ఆహార పదార్థాల్లో బాస్మతి బియ్యం తర్వాతి స్థానం గోరుచిక్కుడుదే. అయితే, భారత్ నుంచి గింజల రూపంలో గోరు చిక్కుడు ఎగుమతుల్లేవు. దీనిపై నిషేధం విధించారు. పప్పు లేదా జిగురు రూపంలోనే పంపాలి. ధరలు అదుపు తప్పడంతో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను కూడా నిలిపేశారు. ఉత్తర భారతంలో దీన్ని ఖరీఫ్ పంటగా వేస్తారు. గత సీజన్‌లో అక్కడ 12 లక్షల టన్నుల గింజలు పండించారు. ఈ సంవత్సరం 15 నుంచి 18 లక్షల టన్నుల దాకా చేతికొస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతానికైతే, గోరుచిక్కుడు ధరలు తగ్గాయి. అయినా క్వింటాలుకు రూ.8 వేల దాకా పలుకుతోంది.

మన రాష్ట్రంలో...

కూరగాయ గోరుచిక్కుడుకీ జిగురు గోరు చిక్కుడుకీ కొంత తేడా ఉంది. కూరగాయగా పండించడం అన్నది, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉంది. గత ఏడాది ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో కూరగాయగా పండించిన గోరుచిక్కుడునే కొందరు రైతులు జిగురు కోసం విక్రయించారు. ఇప్పుడు రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి విత్తనాలు తెచ్చుకుని వాణిజ్య ప్రాతిపదికన సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతపురం జిల్లా వంటి వర్షాభావ ప్రాంతాల్లో ఇప్పటికే ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగు చేస్తుండగా...ఇప్పుడు గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోను పెద్ద ఎత్తున సాగు చేయాలని భావిస్తున్నారు.

మన రాష్ట్రం నెలనెలా 200 టన్నుల జిగురును ఉత్తరభారతం నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇందులో 50 టన్నుల వరకు మస్కిటో కాయిల్స్ తయారీకే వాడుతున్నారు. గోరుచిక్కుడులో రెండు రకాలు... 80-90 రోజుల్లో కోతకు వచ్చేవి ఉన్నాయి, 120-125 రోజుల్లో కోతకు వచ్చేవీ ఉన్నాయి. పెద్దగా తెగుళ్లు లేకపోవడం, వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకునే గుణం ఉండటం, పెట్టుబడి తక్కువ కావడం, గిరాకీ బాగుండటం... తదితర కారణాల వల్ల రైతులు మక్కువ చూపుతున్నారు. పత్తి, మిరప దెబ్బతీస్తుండటంతో గోరు చిక్కుడు ఆశాకిరణంలా కనిపిస్తోంది. అలా అని, అనాలోచితంగా అడుగు ముందుకేయడమూ ఇబ్బందే. దీనిపై ఇంకా కొంత అధ్యయనం జరగాల్సి ఉంది. అన్ని కాలాల్లో, అన్ని నేలల్లో, వివిధ వాతావరణ పరిస్థితుల్లో పండించి చూసిన తర్వాత కానీ ఒక నిర్ణయానికి రావడం కష్టమంటున్నారు అనుభవజ్ఞులు.

ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన హంగామా ... రాజస్థాన్, గుజరాత్ వ్యాపారులను ఆకర్షిస్తోంది. పల్లెల్లో ప్రత్యక్షమైపోయి, క్వింటాలుకి రూ.10-12 వేలు ఇస్తామంటూ రైతులతో ఒప్పందం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ మన రైతుల్లో చాలా మంది ముందస్తు ఒప్పందానికి సిద్ధంగా లేరు. సీజన్‌లో మంచి ధరలు వస్తాయన్న ఆశ వారిలో కనిపిస్తోంది. "ముప్పై ఏళ్ల నుంచీ గోరు చిక్కుడు పండిస్తున్నా. ఇది వరకు పంటలో పనికిరాని విత్తనాల్ని జిగురు కోసం పంపించేవాళ్లం. ఇప్పుడు గిరాకీ పెరగడంతో 10 ఎకరాల్లో కేవలం జిగురు గోరుచిక్కుడునే పండించాలని అనుకుంటున్నా. ఎకరానికి రూ.10 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. తెగుళ్లు తక్కువ. క్వింటాలుకి రూ.8 వేలు ధర వచ్చినా కూడా, మిగతా అన్ని పంటల కంటే ఇది లాభదాయకంగా ఉంటుంది" అంటారు గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన జెట్టి రత్తయ్య. ఈ పంట మన రాష్ట్రానికి చాలా అనుకూలమని, ప్రస్తుతం మంచి గిరాకీ ఉన్నందున రైతులు సాగు చేయవచ్చునని విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ అభిప్రాయపడుతున్నారు.

'అనంత' ఆశలు!

వర్షాభావ పరిస్థితుల వల్ల అనంతపురం జిల్లాలో వేరుసెనగ పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేసేందుకు 'ఆపరేషన్ అనంత' పేరుతో ఓ కార్యక్రమాన్ని చేపట్టారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) శాస్త్రవేత్తల బృందం అనంతపురం వెళ్లి అధ్యయనం చేసింది. వివిధ ప్రత్యామ్నాయ పంటలు సూచించింది. వాటిలో గోరుచిక్కుడు ఒకటి. సాగు లాభదాయకంగా అనిపించడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. అనంతపురం రైతులకు ఇచ్చేందుకు విత్తనాలు కావాలంటూ రాజస్థాన్ విత్తనాభివృద్ధి సంస్థను మన ప్రభుత్వం కోరింది. కానీ వాళ్లు చేతులెత్తేశారు. దీంతో జోధ్‌పూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఓ ప్రైవేటు పరిశ్రమ పంటను తిరిగి కొంటామంటూ ఉచితంగా విత్తనాలు అందజేసింది. ఒకటిరెండు పంటలు బాగా వస్తే... సాగు పుంజుకునే అవకాశం ఉంది.



మన రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో 6645 ఎకరాల్లో జిగురు గోరుచిక్కుడును సాగు చేస్తున్నారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే 3500 ఎకరాల్లో సాగు ఉంది. ఏది ఎలా ఉన్నా, మార్కెట్ పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని పంట వేయాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. అందరూ వేలం వెర్రిగా ఇదే పంట వేసినా, సరఫరా పెరిగి ధరలు పడిపోతే నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

అంతర్జాతీయంగా మాత్రం పరిస్థితులు ఆశాజనకంగానే ఉన్నాయి. ప్రస్తుతం షేల్ గ్యాస్ ఎక్కువగా అమెరికాలోనే వెలికి తీస్తున్నారు. చైనాలో కూడా భారీ నిల్వలు ఉన్నట్టు అంచనా. మరికొన్ని దేశాలు త్వరలో షేల్ గ్యాస్ వెలికితీయడంపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో భవిష్యత్ బంగారమే అన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. రైతన్న గోరుచిక్కుడుపై కొండంత ఆశే పెట్టుకున్నాడు.

– *జె.కళ్యాణ్‌బాబు, ఈనాడు, గుంటూరు*



కెమెరా పట్టండి... ఛాన్స్ కొట్టండి!



భారతదేశ గొప్పతనాన్ని ఇప్పటివరకూ ఎందరో కవులూ రచయితలూ చరిత్రకారులూ రకరకాలుగా చెప్పారు. మనమూ భారతీయతను పుస్తకాలూ పాటలూ సినిమాలూ ఫొటోల్లో... కన్నాం విన్నాం. ఇప్పుడు కొత్తగా షార్ట్‌ఫిల్మ్‌ల ద్వారా భారతదేశాన్ని చూపించమంటోంది భారత విదేశాంగ శాఖ. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా 'ఇండియా ఈజ్... వీడియో గ్లోబల్ ఛాలెంజ్ 12' పోటీని ప్రారంభించింది.

భిన్న భాషలు, భిన్న మతాలు, విభిన్న సంస్కృతులు... భారతదేశానికి పరిచయ వాక్యాలివి. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయం. భాష, మతం, సంస్కృతిపరంగానే కాదు భౌగోళికంగానూ మనదేశంలో ఎంతో వైవిధ్యం ఉంది. ఆ వైవిధ్యాన్ని పొట్టి సినిమా ద్వారా ప్రపంచానికి తెలియజేయాలనుకుంటోంది భారత విదేశాంగశాఖలోని ప్రజా వ్యవహారాల విభాగం. అందులో భాగంగా 'భారతదేశం... ఓ దృశ్యమాలిక' పేరుతో షార్ట్‌ఫిల్మ్ పోటీల్ని నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో భారతదేశ ప్రత్యేకతల్ని అయిదు నిమిషాలకు మించని నిడివి ఉన్న షార్ట్‌ఫిల్మ్‌లో చూపించాలి. ఈ పోటీల నిర్వహణలో విదేశాంగశాఖ యూట్యూబ్ సహకారమూ తీసుకుంటోంది. వీడియోల సమర్పణ, ఓటింగ్ అంతా యూట్యూబ్ వేదికగానే జరుగుతుంది.

ఎక్కడివారైనా

అనుభవజ్ఞులు కావొచ్చు, కొత్తవారు కావొచ్చు, భారతీయులు కావొచ్చు, విదేశీయులు కావొచ్చు... 18 ఏళ్లు నిండిన ఎవరైనా ఈ పోటీలకు అర్హులే. 'ఇండియా ఈజ్...ఎ విజువల్ జర్నీ'గా పిలుస్తున్న ఈ పోటీల్లో 'ఇండియా ఈజ్ అన్‌ఫర్గెటబుల్', 'ఇండియా ఈజ్ ఇన్‌క్రెడిబుల్' 'ఇండియా ఈజ్ వేర్ యు ఆర్' అనే మూడు విభాగాలు ఉన్నాయి. విదేశీయులకూ అవకాశం ఎందుకు ఇస్తున్నారంటే- భారత్ వచ్చి వెళ్లిన వాళ్లు మనదేశం గురించి అర్థం చేసుకున్న తీరును తెలుసుకోవడానికి. అంతా భారత్ వచ్చి వీడియోల్ని తీసే పంపాలని లేదు. అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా... లాంటి దేశాల్లోనూ భారతీయులు అధికంగా ఉండే చోట వారిపైన తీసిన వీడియోల్ని పంపొచ్చు. పోటీదారులు తమ వీడియోని మూడింటిలో ఏదో ఒక విభాగానికి ఎంపికచేసుకుని యూట్యూబ్‌లో ఇండియా ఈజ్ (youtube.com/indiais) అనే ఛానెల్లో అప్‌లోడ్ చెయ్యాలి. మిగతా పోటీదారుల వీడియోల్నీ ఇక్కడ చూడొచ్చు. పోటీదారులతో పాటు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కూడా ఈ అంశాల మీద అయిదు షార్ట్‌ఫిల్మ్స్ తీస్తున్నాడు. 'అమ్మో, అనురాగ్‌తో పోటీనా' అని భయపడనవసరం లేదు. ఇవి పోటీదారులకు స్ఫూర్తినిచ్చేందుకు ఉద్దేశించినవి తప్ప పోటీపడేందుకు కాదు. విజేతలకు అనురాగ్ తన సినిమాలో ఒక సన్నివేశాన్ని తీసే అవకాశమూ ఇస్తాడు. గతేడాది కూడా విదేశాంగ శాఖ ఇదే తరహా పోటీల్ని నిర్వహించింది. ఆ పోటీల్లో 42 దేశాల నుంచి 250 మంది తమ చిత్రాల్ని పోటీకి పంపారు. అప్పుడు యూట్యూబ్‌లో వీడియోల్ని పెట్టలేదు. ఈసారి యూట్యూబ్‌కు ఉన్న ప్రాచుర్యం దృష్ట్యా కచ్చితంగా పెద్ద ఎత్తున స్పందన వస్తుందనేది నిర్వాహకుల అంచనా.

పది బహుమతులు

ఈ పోటీకి ఒక్కరే ఎన్ని షార్ట్‌ఫిల్మ్‌లైనా పంపించవచ్చు. అందులో భాష మాత్రం ఇంగ్లీషే ఉండాలి. లేదంటే ఇంగ్లిష్ సబ్‌టైటిల్స్ అయినా ఉండాలి. ఏ కెమెరాతో తీశారన్నది సమస్యే కాదు. సినిమా కెమెరా నుంచి సెల్‌ఫోన్ వరకూ దేన్నైనా ఉపయోగించవచ్చు. భారతదేశాన్ని ఎంత బాగా చూపించారు, చిత్రాన్ని తీయడంలో ఉన్న సాంకేతిక మెరుగులు... వంటివన్నీ ప్రామాణికంగా తీసుకుంటారు. మొత్తంమీద మీ వీడియో అన్ని విధాలా మెప్పించేదిగా ఉండాలి.

వీడియోల్ని యూట్యూబ్‌లో పెట్టడానికి ఆఖరి తేదీ ఫిబ్రవరి 9, 2013. మొత్తం షార్ట్‌ఫిల్మ్‌లను నిర్వాహకులు వీక్షించి 45 ఉత్తమ వీడియోల్ని ఎంపికచేస్తారు. వీటిని న్యాయనిర్ణేతలు చూసి 15 అత్యుత్తమ వీడియోల్ని ఎంపికచేస్తారు. వాటిని మళ్లీ యూట్యూబ్‌లో ఓటింగ్‌కోసం పెడతారు. మార్చి 22 నాటికి విజేతల్ని ప్రకటిస్తారు. ఫిల్మ్ ఫెస్టివల్స్, పోటీల్లో తప్ప బయట ప్రదర్శించకుండా 2008 తర్వాత తీసిన ఏ షార్ట్‌ఫిల్మ్‌నైనా పోటీకి పంపొచ్చు. పోటీల్లో మొత్తం పదిమంది విజేతల్ని ఎంపిక చేస్తారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు విజేతల్ని ఎంపిక చేస్తారు. మొదటి బహుమతి గెల్చుకున్నవారికి రెండురోజులు భారతదేశంలో ఎక్కడైనా పర్యటించేందుకు ఏర్పాట్లు చేస్తారు. తాజ్ గ్రూప్‌కు చెందిన హోటల్ ఎగ్జాటికాలో ఆతిథ్యం ఉంటుంది. దాంతోపాటు రూ.లక్షపైన విలువచేసే కెనాన్ 5డి మార్క్ 2 కెమెరా, లెన్స్‌లనూ అందిస్తారు. మొదటి బహుమతి గెల్చుకున్నవారు విదేశాల్లో ఉన్నవారైతే రానుపోను విమాన ఛార్జీలూ చెల్లిస్తారు. రెండో స్థానం పొందినవారికి తాజ్ వివాంతాలో రెండ్రోజుల ఆతిథ్యం, గో ప్రో హీరో2 కెమెరా ఇస్తారు. మూడో స్థానంలో నిల్చినవారికి హెచ్‌డీ డిజిటల్ కేమ్‌కార్డర్, మరికొన్ని బహుమతులూ ఉంటాయి. అత్యధిక ప్రజాధారణ పొందిన వీడియోకీ హెచ్‌డీ డిజిటల్ కేమ్‌కార్డర్‌ను బహుమతిగా ఇస్తారు. పోటీలకు వీడియోల్ని పంపాలనుకునేవారు కచ్చితంగా యూట్యూబ్‌లో సభ్యత్వం తీసుకోవాలి. ఇది ఉచితమే. ఈ పోటీ భారతదేశ గొప్పతనాన్నీ, వైవిధ్యాన్నీ అందరికీ తెలియజేయడానికి ఉద్దేశించింది. కాబట్టి వీడియోలు ఆ విధంగానే ఉండాలి తప్ప మరో విధంగా ఉండకూడదు.

మరెందుకు ఆలస్యం, మీలోని భారతీయుణ్నీ, కెమేరామ్యాన్‌నీ అర్జెంటుగా బయటకు తీయండి.



కథ

అమ్మ పుట్టినరోజు

– జి.మేరీ కృపాబాయి

అది స్వప్న ఫొటో. ఫొటో మీదుగా అమర్చిన పూలదండ మధ్యనుండి ఆమె చిరునవ్వు ఆ కుటుంబసభ్యుల హృదయాలను కదిలించి వేస్తోంది. ఆమె మరణించిందన్న నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. చెమర్చిన కళ్ళను క్షణానికోసారి తుడుచుకుంటున్నారు.

"బాబూ, స్వప్న మరణించి నెలరోజులైంది. నువ్వూ పిల్లలూ కొంచెం కూడా కోలుకోలేదు. కాలం గాయాలను మాన్చుతుందంటారు. కానీ, మీ ముగ్గురూ బాధ నుండి కాస్త కూడా బయటపడటం లేదు" దూరపుబంధువు ఒకామె అర్జున్‌ని ఓదారుస్తూ అంటోంది.

"చక్కగా ఆరోగ్యంగా ఉన్న స్వప్న సడెన్‌గా మృత్యువు ఒడిలోకి ఎందుకు వెళ్ళింది? తన అనారోగ్యాన్ని ఆమె గమనించుకోలేదు సరే కనీసం మేమైనా ఎందుకు గమనించలేదు..." ఆవేదనతో అన్నాడు అర్జున్, స్వప్న భర్త.

"అసలు చెల్లి లాస్య వల్లనే అమ్మ చనిపోయింది. ఇంజినీరింగ్ ఫస్టియర్ చదువుతోంది కానీ ఒక్క పని కూడా సొంతంగా చేసుకోదు. ఉదయం లేచింది మొదలు కాలేజీకి వెళ్ళేవరకూ అమ్మకు అన్నీ ఆర్డర్లు పాస్ చేస్తుంది. క్షణాలలో వేడివేడిగా టిఫిన్ రెడీ కావాలంటుంది. టిఫిన్‌ప్లేటు చేతికందించాలంటుంది. తిన్న ప్లేటు ఎక్కడబడితే అక్కడ పడేస్తుంది. లాస్య బెడ్‌రూం చూస్తే దొంగలుపడి గందరగోళం చేసిన రూమ్‌లా ఉంటుంది. అమ్మ ఆ రూమంతా సర్దాలి. సర్దినా ఒక్కక్షణం అలా ఉండనివ్వదు. క్రమశిక్షణలేని లాస్య వల్లనే అమ్మ కుంగిపోయింది. ఆ దిగులుతోనే అమ్మ చనిపోయింది" ఏడుస్తూ అన్నాడు ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉన్న శిశిర్.

శిశిర్ మాటలకు ఎక్కడలేని కోపం వచ్చేసింది లాస్యకు. "నిజం చెప్పాలంటే అన్నయ్య పెట్టే టెన్షన్‌లు భరించలేకనే అమ్మ అనారోగ్యం పాలైంది. ఎప్పుడూ స్నేహితులూ, సరదాలంటూ తిరుగుతుంటాడు. నాన్నకు తెలీకుండా అమ్మ దగ్గర డబ్బు గుంజి పార్టీలకు తగలేస్తూ ఉంటాడు. ఇంట్లో రోజూ స్పెషల్స్ చెయ్యాలంటాడు. తనకిష్టమైన వంటలు చెయ్యకపోతే ఇల్లంతా వీరంగం చేస్తాడు. ఉదయం తొమ్మిదింటికి నిద్ర లేస్తాడు. లేచిన వెంటనే అమ్మని హడావుడి చేస్తాడు. పాపం, అమ్మ ఒక్కత్తీ ఎన్ని పనులని చేస్తుంది? ఎన్ని విషయాలను చక్కపరుస్తుంది? ఏ రోజూ అర్ధరాత్రి దాటితేగానీ ఇల్లు చేరడు. అమ్మ అప్పటివరకూ మేల్కొని ఉంటుంది. మళ్ళీ తెల్లవారుజామునే లేస్తుంది. అందుకే తన ఆరోగ్యం పాడైపోయింది. అమ్మ యంత్రం కాదుకదా! పదేపదే పనిచేస్తే యంత్రం కూడా అరిగిపోతుంది. అమ్మ పరిస్థితిలో ఉన్న ఏ మనిషయినా అరిగిపోకుండా ఉంటారా? అన్నయ్య వల్లనే అమ్మ అరిగిపోయి, కరిగిపోయింది" బాధగా అంది లాస్య.

"తప్పమ్మా, అలా అనకూడదు..." ఏదో చెప్పబోయింది పెద్దావిడ. ఆమె మాటలకు అర్జున్ అడ్డుపడ్డాడు.

"లాస్య మాటలు చాలావరకూ నిజమే. శిశిర్ పెట్టే టెన్షన్‌కి స్వప్న తట్టుకోలేక పోయింది. వాడి క్రమశిక్షణారాహిత్యానికి ఆమె ఆందోళన చెందుతూ ఉండేది. ఇంటిపనీ, వంటపనిలో సతమతమయ్యే ఆమెకు శిశిర్ అదనపు భారమయ్యాడు. వాడి వల్లనే స్వప్న ఆరోగ్యం దెబ్బతింది" అన్నాడు అర్జున్ కొడుకునుద్దేశించి.

అర్జున్ మాటలకు ఆ పెద్దామె అలానే చూస్తూండిపోయింది. శిశిర్‌కు తండ్రి అర్జున్‌పైన కోపం ముంచుకొచ్చింది.

"వాస్తవం చెప్పాలంటే నాన్న వల్లనే అమ్మ చనిపోయింది. నాన్న బద్ధకంతో ప్రతి పనినీ అమ్మకు అప్పగించేవారు. కరెంటు బిల్లు కట్టడం దగ్గర నుండి సరుకులు కొనుగోలు చెయ్యడం వరకూ అన్నీ అమ్మే చూసుకోవాలి. నాన్న సెల్‌ఫోన్ కన్పించకపోయినా రెయిన్‌కోట్ కన్పించకపోయినా అమ్మే వెతికి అందించాలి.

డ్యూటీకి వెళ్ళిరావడం మినహా అమ్మకు ఇంటిపనిలోగానీ, వంటపనిలోగానీ వీసమెత్తు సహాయం చెయ్యరు. ఉదయాన్నే కాఫీ తాగి, న్యూస్‌పేపర్లు చదవడం ఒక్కటే ఆయన చేసేపని.

ఆఫీసులో నాన్న చేసే పనికి ప్రభుత్వంవారు ఏభైవేలు ఇస్తున్నారు. ఆ ప్రకారం చూస్తే, ఇంట్లో అమ్మ చేసే పనికి నెలకు లక్ష రూపాయలు ముట్టాలి. కానీ, అమ్మ అన్నీ ఫ్రీగా చేస్తోంది. నాన్న సహాయం లేకుండా చేస్తోంది. నాన్నకు కూడా సహాయం చేస్తోంది" ఆవేశంగా అన్నాడు శిశిర్.

శిశిర్ మాటలు అర్జున్‌ని ఆలోచింపచేశాయి.

'అవును. భార్య స్వప్నపట్ల తను ఎంత బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించేవాడు! ఇంటికి సంబంధించిన ఏ విషయాన్నీ పట్టించుకునేవాడు కాదు. అన్నీ ఆమెకే వదిలేసేవాడు. తన ప్రవర్తన మూలంగా ఆమెకు విశ్రాంతి లేకుండా పోయింది. తను చిన్న సహాయం కూడా చేసేవాడు కాదు. కనీసం మాట సహాయం కూడా చేసేవాడు కాదు. ముఖ్యంగా ఇంటినిండా అతిథులున్నప్పుడు కూడా తన సహాయం గగనకుసుమమే. క్షణం తీరికలేకుండా స్వప్న నానా హైరానాపడిపోతూ ఉండేది. ఓర్పుతో నేర్పుగా ఇల్లు నడిపేది' మనసులోనే అనుకున్నాడు అర్జున్.

మరికాసేపటి తర్వాత అక్కడినుండి నెమ్మదిగా లేచి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఫోన్ కోసం చూశాడు. ఎంత వెతికినా సెల్ కన్పించలేదు.

"లాస్యా, నా సెల్ ఎక్కడైనా కన్పించిందా?" అంటూ కూతుర్ని అడిగాడు.

"నేను చూళ్ళేదు. అమ్మ ఉంటే రక్కున వెతికి తీసుకువచ్చి మీ చేతికి అందించేది. మీకు ఏ వస్తువైనా వెతుక్కోవలసిన బాధ తప్పేది" అంది లాస్య.

లాస్య మాటలకు మౌనం వహించాడు అర్జున్.

'అవును. తన వస్తువులు ఏవి కన్పించకపోయినా భార్య క్షణాల్లో వెతికి తీసుకువచ్చి తన ముందుంచేది. భగవంతుడు ఆమెకు అంతటి ఓర్పూ ప్రేమా ఇచ్చాడు' అనుకుంటూ వెళ్ళి స్వప్న ఫొటో ముందర నిలబడ్డాడు అర్జున్.

"శిశిర్ అన్నయ్యా, నా గ్రీన్ చున్నీ కనబడటంలేదేమిటి? నువ్వెక్కడయినా చూశావా?" అంటూ గదిలోంచి కేకపెట్టింది లాస్య.

"నీ చున్నీతో నాకేం పని. అన్నీ అమ్మ చేసిపెడితే తిని కూర్చోవడం కాదు, ఇప్పుడు తెలిసివచ్చిందా?" కోపంగా అన్నాడు శిశిర్.

"అవును అన్నయ్యా, ఉదయం నుండీ నేను నా ఏటీయం కార్డు కోసం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోల కోసం వెతుకుతున్నాను. అవి ఎక్కడా కన్పించడం లేదు. అమ్మ ఉంటే ఇటువంటి సమస్యలుండేవి కాదు" చెమర్చిన కళ్ళను తుడుచుకుంది లాస్య.

అన్నాచెల్లెళ్ళ సంభాషణ అర్జున్ చెవిన పడింది. క్షణంలో అతని కళ్ళూ చెమర్చాయి.

'స్వప్న ఉండగా ఎవరికీ ఏ లోటూ రానివ్వలేదు. కుటుంబ అభివృద్ధికి అవిశ్రాంత పోరాటం చేసింది. కుటుంబంలోని అన్ని పాత్రలూ తనే పోషించింది. శారీరకంగా మానసికంగా అలసిపోయింది. తన ఆరోగ్యాన్ని కూడా గమనించుకోకుండా పనులు చేసింది. అందరికీ అన్నీ అందించింది. తనే అందకుండా వెళ్ళిపోయింది' అర్జున్ మనసులో బాధ సుడులు తిరుగుతోంది. వాయుగుండంలా ప్రారంభమైన ఆ బాధ ఉప్పెనలా మారింది.

రెండు క్షణాల తర్వాత అర్జున్ శిశిర్ వైపు చూశాడు. శిశిర్ బాల్కనీలో నిలబడి ఎటో శూన్యంలోకి చూస్తున్నాడు. అతని ముఖంలో పశ్చాత్తాపాన్ని గమనించాడు అర్జున్.

'అమ్మను అనవసరంగా ఇబ్బందిపెట్టినందుకు మానసికంగా కుంగిపోతున్నట్లున్నాడు' అనుకున్నాడు.

కూతురు లాస్య కూడా సోఫాలో దిగాలుగా కూర్చుని ఉంది. 'తను తల్లిని పెట్టిన ఇబ్బందులను తలుచుకుని కుమిలిపోతోంది' అనుకుని నిట్టూర్చాడు అర్జున్.

రెండు నిమిషాల తరువాత, "నాన్నా, కూరగాయలు తీసుకొస్తారా, వంట చేస్తాను" అంటూ వచ్చింది లాస్య.

'అవును. తనకు అసలు కూరగాయల మార్కెట్ ఎక్కడ ఉందో తెలీదు. కూరగాయల రేట్లు తెలీవు. కొన్ని కూరగాయల పేర్లు కూడా తెలీదు. వాటి నాణ్యతను ఎలా చెక్ చెయ్యాలో తెలీదు. ఆ సెక్షన్ అంతా స్వప్నే చూసుకునేది. ఇప్పుడు కూరగాయలు ఎలా తెచ్చేది? కూరగాయలు... కూరగాయలు...' మనసులోనే మథనపడిపోతున్నాడు అర్జున్.

"ఏమిటండీ, కూరగాయలు, కూరగాయలు అంటూ కలవరిస్తున్నారు. ఈరోజు నుండీ కూరగాయలు మీరే తెస్తారా ఏమిటీ?" నిద్రపోతున్న అర్జున్‌ను నవ్వుతూ తడుతోంది స్వప్న.

గాఢనిద్రలో నుండి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు అర్జున్. ఎదురుగా చిరునవ్వులు చిందిస్తూ స్వప్న! అప్పుడే తలంటుస్నానం చేసిందేమో, షాంపూ పరిమళం తేలి వస్తోంది.

'అంటే, తను ఇప్పటివరకూ కలగన్నాడన్న మాట! ఎంత భయంకరమైన కల! పూర్తిగా వాస్తవంలా అన్పించింది. తన స్వప్న మరణించలేదు. బతికే ఉంది' అనుకుంటూ గోడవైపు చూశాడు అర్జున్. అక్కడ దండతో వేలాడుతున్న స్వప్న ఫొటో లేదు. అర్జున్, స్వప్నల అందమైన ఫొటో ఉంది.

రెండు నిమిషాలు అటూ ఇటూ చూశాడు అర్జున్. మళ్ళీ స్వప్న వైపు చూశాడు. స్వప్న చిరునవ్వుతో అర్జున్‌వైపే చూస్తోంది. తను వాస్తవంలోనే ఉన్నట్లు అర్జున్ గ్రహించాడు. 'తన భార్య స్వప్న మరణించలేదు, బతికే ఉంది' అని పదిసార్లు మనసులోనే అనుకున్నాడు. అతని ఆనందానికి అవధిలేకుండా పోయింది. ఒక్క ఉదుటున బెడ్‌పై నుండి లేచి, స్వప్నని దగ్గరకు తీసుకున్నాడు.

"స్వప్నా, ఈరోజు ఇంత ఎర్లీగా స్నానంచేసి రెడీ అయిపోయావేమిటి?" ప్రేమగా అడిగాడు అర్జున్.

"ఈరోజు నా పుట్టినరోజు కదండీ! అందుకే అన్నీ ఎర్లీగా చేసేశాను. ఈరోజు బ్రేక్‌ఫాస్ట్ నుండి అన్నీ స్పెషల్సే. త్వరగా బ్రష్ చేసుకుని రండి" అంది స్వప్న.

హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు అర్జున్.

'థాంక్ గాడ్! నా స్వప్న బతికే ఉంది. ఇకపై స్వప్నని జాగ్రత్తగా చూసుకుంటాను. ఆమె ఆరోగ్యంగా జీవించేలా నావంతు కృషి చేస్తాను. ఆమె ఒక్కత్తే కుటుంబ భారమంతా మొయ్యకుండా సహాయపడతాను. ఆమెను విశ్రాంతిగా ఉంచుతాను. పిల్లల్ని కూడా తగినవిధంగా మలుస్తాను' మనసులోనే అనుకున్నాడు.

"అలాగే స్వప్నా, క్షణంలో రెడీ అయి వచ్చేస్తాను" అంటూ బాత్‌రూమ్ వైపు నడిచాడు అర్జున్.

అర్జున్ స్నానం చేసి హాల్లోకి వచ్చేసరికి శిశిర్ టీవీ చూస్తూ కన్పించాడు. అర్జున్‌ను చూసి లేచి నిలబడ్డాడు.

"నాన్నా, ఈరోజు నేను మా ఫ్రెండ్స్‌తో పిక్నిక్‌కి వెళుతున్నాను. అమ్మకు చెప్పండి" అంటూ దూకుడుగా వరండాలోకి వెళ్ళిపోయాడు.

"ఆగు" గట్టిగా అరిచాడు అర్జున్.

అర్జున్ అరుపుకి బిత్తరపోయి నిలబడిపోయాడు శిశిర్.

"ఏమిటి డాడీ?" అర్థంకానట్లుగా అడిగాడు.

"ఈరోజు అమ్మ పుట్టినరోజని నీకు తెలుసా?" ప్రశ్నించాడు అర్జున్.

"తెలుసు డాడీ. కానీ, అమ్మ ఎప్పుడూ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకోదుగా... అందుకని..." నసిగాడు శిశిర్.

"నువ్వెప్పుడైనా అమ్మను పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకోమని అడిగావా? చేద్దామని ఆలోచించావా? ఇకపై అలా కుదరదు. అమ్మ పుట్టినరోజును మనం సెలబ్రేట్ చెయ్యాలి. ఈరోజు నుండీ అమ్మకు అన్ని పనుల్లోనూ నువ్వూ, చెల్లీ, నేనూ సహాయం చెయ్యాలి. అమ్మను రిలాక్స్‌డ్‌గా ఉంచాలి" అన్నాడు అర్జున్.

"అలాగే నాన్నగారూ. మరి, మా ఫ్రెండ్స్‌తో ప్రోగ్రాం..." అన్నాడు శిశిర్.

"మీ ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి చెప్పు. ప్రోగ్రాం రేపటికి పోస్ట్‌పోన్ అయ్యిందని" సీరియస్‌గా చెప్పాడు అర్జున్. శిశిర్ అలానే చేశాడు.

అప్పటికే లాస్య బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసుకుని కాలేజీకి వెళ్ళడానికి రెడీ అయ్యింది. ఆమెతో ప్రత్యేకంగా మాట్లాడాడు అర్జున్.

"లాస్యా, అమ్మ పుట్టినరోజు కదా... విష్ చేశావా?" అడిగాడు అర్జున్.

"లేదు నాన్నగారూ. అమ్మ పుట్టినరోజునాడు మనమెప్పుడూ విష్ చెయ్యం కదా" తండ్రివైపు వింతగా చూస్తూ అంది లాస్య.

"అదే వద్దంటున్నాను. అమ్మ మన ముగ్గుర్నీ ఎంత బాగా చూస్తుంది. ఎంత ప్రత్యేకంగా చూస్తుంది. మనమూ అమ్మను అలానే చూడాలి. అమ్మకు ప్రతి పనిలో సహాయం చెయ్యాలి. ఈరోజు కాలేజీ నుండి గంటముందు పర్మిషన్ అడిగి వచ్చేసెయ్. అమ్మ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకుందాం" అన్నాడు అర్జున్. సరేనంది లాస్య.

ఆరోజు సాయంత్రం నాలుగుగంటల వేళ కుటుంబసభ్యుల సమక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేక్‌ను కట్ చేసింది స్వప్న. కేక్ కటింగ్ తర్వాత కొత్త మోడల్ బంగారు గాజులను భార్యకు ప్రజెంట్ చేశాడు అర్జున్. భర్త, పిల్లలు తన పుట్టినరోజు సెలబ్రేట్ చేస్తున్న తీరుకి ఆశ్చర్యపోయింది స్వప్న.

"స్వప్నా, ప్రతి సంవత్సరమూ నీ పుట్టినరోజుని ఇలానే సెలబ్రేట్ చేస్తాం. అంతేకాదు, రేపటినుండి ఇంటిపని భారమంతా నీపైనే వేసుకోవద్దు. మేం ముగ్గురం నీకు సహాయం చేస్తాం" ప్రేమగా అన్నాడు అర్జున్.

తన జీవితంలో- తాను ఎప్పుడు కలలుగనే సరికొత్త మార్పు రాబోతోందని స్వప్నకు అర్థమైంది. ఆమె ఆనందానికి అవధులే లేకపోయాయి.

అంతిమయాత్రకు అన్నీ తానై...

కోట్లకు పడగలెత్తినవాళ్లకైనా... కూటికి లేకపోయినవాళ్లకైనా... మృత్యువు అనివార్యం. మృత్యువు సమానమేకానీ... మరణానంతర కార్యక్రమాలు మాత్రం అందరికీ ఒకేలా జరగవు. అందుకు కారణం ఆర్థిక అసమానతలు. మరి, వాటిని చెరిపేయలేమా? చంద్రశేఖర్‌రెడ్డి చెరిపేయాలనుకున్నారు.

కలియుగంలో అశ్వమేధ యాగం లేదు. కానీ, ఆ యాగ ఫలితాన్ని పొందొచ్చు. ఎలా అంటే... అనాథ శవానికి దహన సంస్కారాలు నిర్వహిస్తే చాలు!

కానీ, ఆ ఫలితాన్ని ఆయన ఆశించలేదు. ఆయనకు శ్రీరాముడు చెప్పిన మాటలే వేదంగా తోచాయి.

'మరణాంతాని వైరాని'... శ్రీరాముడి మాటలివి. యుద్ధంలో రావణుడు చనిపోతే అతడికి దహన సంస్కారాలు చేయనంటాడు విభీషణుడు. అప్పుడు రాముడు... 'ఎంత శత్రువైనా మరణంతోనే వైరం పోతుంది. నువ్వు చేయనంటే చెప్పు, నేను చేస్తాను. నీకు నేను స్నేహితుణ్ణి కాబట్టి... రావణుడు నాకూ సోదరుడవుతాడు' అంటాడు.

'శత్రువుకికూడా దహన సంస్కారాలు చేయడానికి రాముడు ముందుకొచ్చాడు. కానీ, కళ్లముందు ఎంతోమంది నిర్భాగ్యులు దిక్కులేని చావుచస్తున్నా వాళ్ల గురించి మనం ఆలోచించం. నిరుపేదలు చనిపోతే అంత్యక్రియలు చేయలేక బంధువులు పడే వేదన నాకు తెలుసు. అందుకే, వాళ్లు అంత్యేష్టి సంస్కారాలు నిర్వహించడానికి సాయపడాలని అనుకున్నాను' అంటారు కె.చంద్రశేఖర్‌రెడ్డి.

వైభవంగా వైకుంఠయాత్ర

కర్నూలుజిల్లా కోవెలకుంట్ల మండలం జొలదరాళి గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి విద్యుత్‌శాఖలో ఉద్యోగి. కొన్ని కారణాల వల్ల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

'ఉద్యోగం... నా కోసం నావాళ్లకోసం చేశాను. పదవీ విరమణ తరవాత ఇది నాకు రెండో జీవితం. దీన్ని నా స్వార్థానికి కాకుండా, మరణించిన అనాథలూ నిరుపేదల దహన సంస్కారాలకు సాయంచేయడానికి వినియోగించాలనుకున్నాను' అంటారు చంద్రశేఖర్‌రెడ్డి. అందుకోసం 2003లో కర్నూలు నగరంలోని అమీన్ అబ్బాస్‌నగర్‌లో 'సద్గురు కృపాలయం' సేవాసంస్థను ఏర్పాటుచేశారు.

అంత్యక్రియల్లో ఉండే మొదటి సమస్య... శ్మశానం ఊరికి దూరంగా ఉండటం. అలాగని దాన్ని తీసుకొచ్చి ఊరి మధ్యలో పెట్టలేరుగా? అందుకే అక్కడికి శవాన్ని సులభంగా తీసుకెళ్లే మార్గాన్ని వెదికారు చంద్రశేఖర్‌రెడ్డి. అందుకోసం రెండు వాహనాలను కొన్నారు. మరణించినవాళ్లు వైకుంఠాన్ని చేరుకోవాలన్న ఆలోచనతో వాహనానికి 'వైకుంఠ రథం' అని పేరుపెట్టారు. శవాలను ఉంచేందుకు మూడు ఫ్రీజర్ బాక్సులను ఏర్పాటుచేశారు.

ఎవరైనా ఒక్క ఫోన్‌చేస్తే చాలు, నిమిషాల్లో వైకుంఠ రథం వస్తుంది. వాళ్లు చేయాల్సిందల్లా... వాహనానికి డీజిల్ ఖర్చును భరించడమే. అప్పట్నుంచీ మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు చెందినవాళ్లు వీటిని ఉపయోగించుకుంటున్నారు.

వైకుంఠ క్షేత్రం కూడా...

కొన్నాళ్లకు ఒక సమస్య వచ్చింది. శ్మశానంలోని వాతావరణం బాగాలేదనీ, దహన సంస్కారాలు పూర్తయ్యాక స్నానాలూ కర్మకాండల వంటివాటికి అక్కడ ఏమాత్రం అనువుగా లేదనీ ఆయన గుర్తించారు. దానికి పరిష్కారంగా... తానే ఒక శ్మశానాన్ని ఏర్పాటుచేయాలనుకున్నారు.

స్థానిక చిత్తారివీధి సమీపంలోని జోహరాపురానికి వెళ్లే దారిలో ఖాళీగా ఉన్న ఎనిమిది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. అందులో శ్మశానం ఏర్పాటుచేస్తాననీ, ఆ స్థలాన్ని తనకు ఇవ్వమనీ కోరారు. ప్రభుత్వం అనుమతితో ఆ స్థలాన్ని తీసుకుని బాగుచేయించారు. మొక్కలు పెంచి ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటుచేసిన ఆ శ్మశానానికి 'వైకుంఠ ఆశ్రమం' అని పేరుపెట్టారు. శవాన్ని దహనం చేయడానికి గంధపు చెక్కలూ నెయ్యీ ఉచితంగానే ఇవ్వాలని నిర్ణయించారు. దహన సంస్కారాలను చూసేందుకు గ్యాలరీ ఏర్పాటుచేశారు. కర్మకాండలకోసం ప్రార్థన మందిరాలు, వంటశాల, క్షౌరశాల నిర్మించారు. ఒకేసారి ఆరు మృతదేహాలను దహనంచేసే అవకాశమున్న ఈ వైకుంఠక్షేత్రాన్ని 2011 ఏప్రిల్‌లో ప్రారంభించారు.

గతంలో డీజిల్ ఖర్చులను మృతుడి కుటుంబీకులే భరించాల్సి వచ్చేది. అది కూడా చంద్రశేఖర్‌రెడ్డే భరించడానికి సిద్ధమయ్యారు. కర్నూలు నగరవాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల వాళ్లూ ఈ సేవలన్నింటినీ ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం మూడు వైకుంఠ రథాలూ, ఐదు ఫ్రీజర్ బాక్సులూ, రెండు అంబులెన్స్‌లూ ఉచితంగా సేవలందిస్తున్నాయి.

నిత్యాన్నదానం

తన సాయాన్ని కేవలం అంత్యక్రియలకే పరిమితం చేయదలుచుకోలేదు చంద్రశేఖర్‌రెడ్డి. నిరుపేద రోగులకూ సాయపడాలనుకున్నారు. కర్నూలు సర్వజన ఆసుపత్రికి నిత్యం వేలాది మంది నిరుపేద రోగులూ, వాళ్లతో పాటు సహాయకులూ వస్తుంటారు. రోగులకు అవసరమైన ఆహారం ప్రభుత్వం ఇస్తుంది. కానీ, వచ్చిన సహాయకులు భోజనం కోసం ఇబ్బందులు పడటం చూసిన చంద్రశేఖర్‌రెడ్డి వాళ్లకి భోజనం పెట్టాలనుకున్నారు. అలా 2012 జనవరి 29న నిత్యాన్నసేవాశ్రమం ఏర్పాటుచేసి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట్లో 500 మందికి భోజనం పెట్టేవారు. ప్రస్తుతం 1200 మందికి అన్నదానం చేస్తున్నారు. ఈ సేవాకార్యక్రమంలో 25 మంది స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు.

ఎన్నో శవాల అంత్యక్రియలకు సాయపడుతూ, మరోపక్క నిత్యాన్నదానమూ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఖాతాలో ఎన్ని అశ్వమేధ యాగాల పుణ్యం పోగుపడి ఉంటుందో!

– *మునీందర్,* ఈనాడు పాత్రికేయ పాఠశాల

కదంబం

బార్బీ... భలే కెమెరా!

బార్బీ బొమ్మను రకరకాలుగా అలంకరించి ఆడుకోవడమే కాదు, దాంతో రకరకాల ఫొటోలూ తీయవచ్చు. వాటిని ఎంచక్కగా ఆ బొమ్మకున్న టీషర్టుమీదే ప్రదర్శించనూ వచ్చు. ఈ బార్బీ బెల్టుకి ఉన్న చిన్న బటన్ నొక్కితే ఆ బొమ్మ భుజాల్లో ఉన్న డిజిటల్ కెమెరా క్లిక్‌మంటుంది. ఆ ఫొటో వెంటనే బొమ్మకి ఉన్న టీ షర్టులోపల అమర్చిన ఎల్‌సిడి తెరమీద చక్కగా కనిపిస్తుంది. ఫొటో తీయడంతోబాటు అందులోని బ్యాక్‌గ్రౌండ్ కలర్స్‌నీ డిజైన్లనీ రంగులన్నీ కూడా బెల్టుకున్న బటన్స్ నొక్కడం ద్వారా మార్చుకునే సౌకర్యం ఉంది. ఈ బొమ్మతో రకరకాల ఫొటోలు తీసి స్లైడ్ షో వచ్చేలానూ అమర్చవచ్చు. 200 ఫొటోల వరకూ ఇందులో స్టోర్ చేసుకోవచ్చట. ఈ బొమ్మకున్న యుఎస్‌బి కేబుల్‌ని కంప్యూటర్‌కి అనుసంధానించి అవన్నీ డౌన్‌లోడ్ చేసుకుని మళ్లీ కొత్త ఫొటోలు తీసుకోవచ్చు. సో... ఈ బార్బీ బొమ్మతో ఆడుకుంటూనే అమ్మాయిలు ఫొటోగ్రఫీలో నైపుణ్యాన్నీ పెంచుకోవచ్చన్నమాట.

పిల్లి ఎగురుతోంది!

మీరు చూసినదీ చదివినదీ రెండూ నిజమే. అయితే ఇది బతికుండగా కాదు, చనిపోయాక ఎగురుతుంది. దీని అసలు పేరు ఓర్విల్లె. ఇప్పుడు ఓర్విల్లె రైట్. కళకి సాంకేతిక విజ్ఞానం తోడయితే ఏమయినా చేయొచ్చనడానికి ఈ ఓర్విల్లె హెలీకాప్టరే ఉదాహరణ. బార్ట్ జాన్‌సెన్ అనే ఓ డచ్ ఆర్టిస్ట్‌కి పెంపుడు పిల్లి అయిన ఓర్విల్లె కారు ప్రమాదంలో మరణించింది. దాన్ని మర్చిపోలేని బార్ట్ శాశ్వతంగా ఉంచేందుకు తనలోని సృజనకు విజ్ఞానాన్ని జోడించి ఇలా హెలికాప్టర్‌గా రూపొందించి, ఆమ్‌స్టర్‌డామ్‌లో జరిగిన ప్రదర్శనలో దీన్ని ఎగరేశాడు. ఆలోచన బాగుందా!

కప్పుకే లెక్కుంది!

కొన్ని రకాల వంటలు ముఖ్యంగా కేకులు, బిస్కట్లు వంటివి చేసేటప్పుడు కొలతలు కూడా కచ్చితంగా ఉండాలి. అయితే పరధ్యానంలో చాలాసార్లు ఎంత వేసిందీ మర్చిపోవడం కూడా సహజమే. అందుకే ఇటీవల టాకింగ్ మెజరింగ్ కప్పుల్ని రూపొందిస్తున్నారు. మనం తీసుకునే పదార్థాలను ఇందులో వేసి దానికున్న 'వి' బటన్ నొక్కితే చాలు, అది ఎంతో కచ్చితంగా మిల్లీ గ్రాములతో సహా లెక్కించి చెప్పేస్తుందట... అదీ అమ్మాయి స్వరంలోనే. మొత్తానికిది భలే కప్పు అన్నమాట.

లాలిజో... లాలిజో...

నిద్రపోయేముందు మంద్రస్వరంలో వినిపించే సంగీతాన్ని వింటూ నెమ్మదిగా నిద్రలోకి జారుకునే అలవాటు చాలామందికి ఉంటుంది. అయితే అందుకోసం కొందరు వాక్‌మన్‌నో లేదా మొబైల్‌నో హెడ్‌ఫోన్స్ లేదా ఇయర్‌ఫోన్స్ ద్వారా ఆశ్రయిస్తే మరికొందరు స్టీరియో ఆన్ చేస్తారు. అయితే ఆ బాధంతా లేకుండా ఈ మధ్య హై టెక్ మంచాలే మనల్ని నిద్రపుచ్చేస్తున్నాయి. ఈ 'టైమ్ ఫర్ స్లీప్ సౌండ్ బెడ్' మీద పడుకుంటే చాలు... దానిలోపల అమర్చిన స్పీకర్లు, సబ్ ఊఫర్ల ద్వారా సంగీతం వీనులవిందుగా వినిపిస్తుందట. ధ్వనిని పెంచుకోవచ్చూ తగ్గించుకోవచ్చు. అయితే పడుకునేముందు మంచానికి ఉన్న ప్లగ్‌ను బోర్డులో పెట్టి స్విచ్ వేయాలన్నది మర్చిపోకూడదు మరి.

డాన్స్ బేబీ డాన్స్!

....వంటి ప్రోగ్రామ్స్‌లో చేసీ చేసీ పిల్లలు తమ గదుల్లోని కర్ర ఫర్నిచర్ కూడా అలానే నృత్యం చేస్తే బాగుణ్ణు అని కోరుకోవచ్చేమోనని ముందుగానే ఆలోచించాడు వాంకోవర్‌కి చెందిన జడ్సన్ అనే కళాకారుడు. ఫలితమే ఈ డాన్సింగ్ ఫర్నిచర్ డిజైన్లు. బాగున్నాయా మరి!

ఆకు... పచ్చని ఫ్యాషన్!

పచ్చదనానికి ఆకు తోడయిందో, ఆకుకి పచ్చదనం అతుక్కుపోయిందో తెలీదు కానీ ప్రకృతి నిండా 'ఆకు'పచ్చని అందాలే... అంతులేని ఆకుల రూపాలే... అందుకే డిజైనర్ల దృష్టిని 'ఆకు' ఎనాడో ఆకర్షించింది... రంగురంగుల్లో మెరుస్తూ ఎవర్‌గ్రీన్ ఫ్యాషన్‌గానూ వెలుగొందుతోంది!

ఓ చీరమీద ఎంబ్రాయిడరీ చేయాలన్నా అద్భుతమైన డిజైన్ ప్రింట్ చేయాలన్నా ఓ నగ చేయించుకోవాలన్నా... ఆకుల ఆసరా ఉండి తీరాల్సిందే. డిజైన్‌లో అగ్రపీఠం పూలదయినా పండ్ల దయినా వాటి చుట్టూ అవి అందంగా అల్లుకోవాల్సిందే. అప్పుడే ఆ డిజైన్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. డిజైన్‌లో భాగంగా ఉండేవి కొన్నయితే, మొత్తంగా ఆకులతోనే డిజైన్ చేసేవి మరికొన్ని.

రంగుల ఎంబ్రాయిడరీల్లో అచ్చంగా ఆకులతోనే చేయడం కాస్త తక్కువే అయినా ప్రింటెడ్ ఫ్యాబ్రిక్‌లో మాత్రం కేవలం వీటితోనే డిజైన్లు రూపొందించడానికి ఇష్టపడుతున్నారు ఆధునిక డిజైనర్లు. పూలూ పండ్లతోనే డిజైన్లు రూపొందించగా లేనిది ప్రకృతిలో ఎటు చూసినా కనువిందు చేసే పచ్చని ఆకు అద్భుతమైన డిజైన్ కాదా అంటున్నారు. అందుకే తమ డిజైన్లలో హరిత సౌందర్యంమీద అత్యంత శ్రద్ధ కనబరుస్తున్నారు. ఒకప్పుడు కంచిపట్టు, బెనారస్... వంటి చేనేత చీరల్లో ఆకుల డిజైన్‌కు ప్రత్యేక స్థానం ఉండేది. బుటేల మాదిరిగా కుట్టిన ఈ డిజైన్లను చాలామంది ఇష్టంగా ధరించేవారు. జాంథానీ నేతలో కూడా ఈ డిజైన్ ఎక్కువగా కనిపిస్తుంటుంది.

చీరలూ, డ్రెస్సుల తరవాత ఆకు డిజైన్‌లో అగ్రాసనం నగలదే. అదీ వజ్రాల నగల్లో పత్ర రూపానికే పెద్దపీట వేస్తుంటారు డిజైనర్లు. వజ్రాలను ఆకు ఆకారం వచ్చేలా పొదుగుతారు. అన్నింటినీ మించి రంగురంగుల రాళ్లను ఆకు ఆకారంలో చెక్కి పొదిగితే ఆ అందమే వేరు. రంగు రాళ్లే కాదు, ఎనామిల్ పూత పూసి చేసే మీనాకారి డిజైన్లలో కూడా లీఫ్ డిజైన్లదే పై చేయి. అచ్చంగా బంగారం, ప్లాటినం, వెండి, రాగి... వంటి లోహాల తోపాటు ఇతరత్రా లోహాలకు రంగుల్ని మేళవించి చేసే లీఫ్ పెండెంట్లు, జుంకీలు, ఉంగరాలు, గాజులు, బ్రేస్‌లెట్లు పాశ్చాత్య దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. రకరకాల లోహాలతో పాటు ప్లాస్టిక్, చెక్క... వంటి వాటితో చేసే ఫంకీ ఫ్యాషన్ జ్యువెలరీల్లో కూడా పత్రం అద్భుతమైన డిజైన్.

ఇటీవల నగలూ, డ్రెస్సులకు తోడుగా బ్యాగ్‌లు, పర్సులు, బెల్టులు, చెప్పులు, హెయిర్ క్లిప్పులు... వంటి అనేక రకాల యాక్సెసరీలు కూడా ఆకుల డిజైన్లలో మెరుస్తున్నాయి. తమలోని పర్యావరణ ప్రియత్వాన్ని చాటుకునేందుకు ఈ డిజైన్లను ప్రత్యేకంగా ధరించేవాళ్లు కొందరయితే, వెరైటీకోసం వేసుకునేవాళ్లు మరికొందరు. లీఫ్ డిజైన్లు అనగానే అన్నీ పచ్చగానే ఉండాలనేం లేదు. రంగురంగుల్లోనూ మిశ్రమ రంగుల్లోనూ ఉండే అందాల ఆకులకీ లోటు లేదు. అందుకే ఆకు డిజైన్లను ఆకర్షణీయమైన రంగుల్లోనూ రూపొందిస్తున్నారు. దాంతో వీటిని ఫంకీగానూ ఫ్యాషన్ జ్యువెలరీగానూ ధరించేవాళ్ల సంఖ్యా పెరిగింది.

ఎన్నో రూపాల్లో..!

ఆకులన్నీ చూడ్డానికి ఒకేలా ఉన్నా అదీ ఎక్కువగా ఆకుపచ్చరంగులోనే ఉన్నప్పటికీ వాటి రూపాల్లో ఉన్న వైవిధ్యం మరెక్కడా కనిపించదు. ఒక్కో జాతి మొక్కదీ ఒక్కో ఆకారం. వాటి అంచుల్లో ఈనెల్లో చిన్న చిన్న తేడాలతో కనిపించేవి కొన్ని... మొత్తంగా ఆకారంలోనే భిన్నంగా ఉండేవి మరికొన్ని. వేటి అందం వాటిదే.

మనతో పోలిస్తే పాశ్చాత్యులే ఎక్కువగా పత్రప్రియులు. పైగా వాళ్లకి వర్షాకాలం వెళ్లి చలికాలం తిరుగుతుంటే పచ్చని ఆకులన్నీ ఎరుపు, పసుపు, నారింజ... వంటి వర్ణాల్ని పులుముకుని శోభాయమానంగా కనిపిస్తుంటాయి. అందుకే వాళ్లు ఆకుల్ని తమ డిజైన్లలో చొప్పించేందుకు అత్యంత ఆసక్తిని కనబరుస్తారు. మేపల్, ఓక్ చెట్ల ఆకులంటే వాళ్లకి మరీ మక్కువ. వీటి రూపంతో చేసే డిజైన్ ఏదయినా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కంటికి వర్ణభరితంగానూ ఉంటుంది. ఇవే కాదు, ఫెర్న్, సైకస్, పామ్... చెట్ల ఆకులు విభిన్నంగా ఉండటంతో అవి కూడా వాళ్ల డ్రెస్సుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. కుషన్స్, కర్టెన్లు, బెడ్‌షీట్‌లు, వాల్‌పేపర్లు... ఇలా ఇంటీరియర్ డిజైన్ల లోనూ ఆకుల డిజైన్లను అందంగా మెరిపిస్తారు. అదే మన దగ్గరయితే బంతి, చామంతి, మందార, మామిడి, కొబ్బరి, తాటి చెట్ల ఆకుల డిజైన్లు ఉంటుంటాయి.

ఆకును డిజైన్‌గా వాడటం ఈనాటిది కాదు. పూలూ లతలతో అల్లుకున్న మన ఆలయాలూ చారిత్రక కట్టడాల గోడల్నీ పైకప్పుల్నీ పరిశీలిస్తే ఈ విషయం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రత్యేకించి ఇది అని కాకుండా అన్నిరకాల పత్ర సౌందర్యానికీ మనం ముగ్ధులమయితే, గ్రీకులకీ రోమన్లకీ మాత్రం ఎందుకో ఎకాంథస్ జాతి మొక్క ఆకు బాగా నచ్చినట్లుంది. వాళ్లు దాన్ని డిజైన్‌గా చేసుకుని ప్రత్యేకంగా ఆభరణాలు చేయించుకునేవారు. వాళ్ల కట్టడాలూ గృహాలంకరణ వస్తువుల్లో కూడా వంపు తిరిగినట్లుండే ఈ డిజైనే కనిపిస్తుంది. బైజాంటైన్, రోమన్ వాస్తు శిల్పాల్ని పరిశీలిస్తే వాళ్లకి ఈ ఆకు అంటే ఎంత ఇష్టమో అర్థమవుతోంది. తరవాతి కాలంలో దీని స్థానాన్ని ఆలివ్, ద్రాక్ష ఆకులు ఆక్రమించాయి. ప్రస్తుతం గృహాలంకరణలో భాగంగా వాడే వాల్‌పేపర్లలో వీటిదే పై చేయి. ఇటీవల పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచేందుకు రకరకాల ఆకుల డిజైన్లను డిజైనర్లు రూపొందిస్తున్నారు. దాంతో ప్రకృతి ప్రేమికులంతా 'ఆకుని మించిన డిజైన్ మరేముంటుంది' అంటూ ఎలుగెత్తుతుంటే ఫ్యాషన్ ప్రియులు కూడా వంతపాడుతున్నారు. నిజమే కదా!

రొటీన్... అంటే బోరు!

గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారా అంటే... 'లేరు' అనడుగానీ 'ప్రస్తుతానికి లేరు' అంటాడు. పుస్తకాలు చదవనుగానీ... చదివేవాళ్లతో స్నేహం చేస్తానంటాడు. సినిమాలంటే ప్రాణమేగానీ... సినిమాకోసం ప్రాణాలు తీసుకోను అంటాడు. ఇలా, ఎంతో తెలివిగా హాస్యంగా లౌక్యంగా మాట్లాడటం హీరో రామ్ స్టైల్. సినిమాల గురించీ మీ జీవితం గురించీ చెప్పమని అడిగినప్పుడు నవ్వుతూ నవ్విస్తూ ఎన్నో కబుర్లు చెప్పాడిలా...

ఇంగ్లిష్ డిక్షనరీలో నాకు నచ్చని పదాల్లో మొదటిది 'రొటీన్'.

రోజూ ఒకటే డ్రెస్సు... ఒకటే పని... ఒకటే వ్యాయామం... ఇలా జీవితం రొటీన్‌గా సాగిపోవడం నాకు నచ్చదు. జీవిత మన్నాక కొంత థ్రిల్ ఉండాలి. అందుకోసం ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ లక్షణం ఇప్పు డొచ్చింది కాదు... చిన్నప్పట్నుంచీ నేనింతే. కావాలంటే నా బాల్యంలోకి వెళ్లొద్దాం రండి.

హీరోనని డిసైడయ్యా

బుడి బుడి నడకలు... చిలిపిచేష్టలు.

కట్‌చేస్తే... ఒకచోట కుదురుగా కూర్చోకపోవడం.

మళ్లీ కట్‌చేస్తే... నవ్వడం, నవ్వించడం.

నా బాల్యం గురించి మూడుముక్కల్లో చెప్పాలంటే ఇంతే.

మా పెదనాన్న స్రవంతి రవికిషోర్‌గారు... లేడీస్ టైలర్, మహర్షి, నువ్వేకావాలి లాంటి విజయవంతమైన చిత్రాల నిర్మాత. నేను పుట్టిందీ పెరిగిందీ చెన్నైలో. మాది పెద్ద ఉమ్మడి కుటుంబం. నాన్నగారు కూడా పెదనాన్నకు సాయంచేస్తూ ఉండేవారు. అందువల్ల ఇంట్లో సినిమా వాతావరణమే ఉండేది. ఇవి చాలవా... నేను సినిమాలపట్ల ఆకర్షితుణ్ణి కావడానికి. దాంతో నాక్కూడా నటనమీదే ఆసక్తి ఉండేది. నటన తరవాత నాకు బాగా నచ్చేవి ఆటలు. స్కూల్లో రన్నింగ్, జావెలిన్ త్రో లాంటి పోటీల్లో పాల్గొనేవాణ్ణి. ప్రైజులూ గెలిచేవాణ్ణి.

అప్పుడు నాకు ఎనిమిదేళ్లనుకుంటా. ఓరోజు నటన మీద ఆసక్తి ఒక్కసారిగా ఎక్కువైపోయి 'నేను హీరోను కావాలి' అనిపించింది. ఏ విషయాన్నీ దాచుకునే అలవాటు నాకు లేదు. వెంటనే నా ఆలోచన అమ్మకు చెప్పాను. సాధారణంగా పెద్దవాళ్లు భయపెడతారు. కానీ, అమ్మ జాగ్రత్తపడింది. నాన్నతోనూ చెప్పింది. 'ఎలాగూ వీడు సినిమాల్లోకి వెళ్లాలని ఫిక్సైపోయాడు కాబట్టి, మనం ఆపలేం. నటనలో శిక్షణ ఇప్పిద్దాం' అనుకున్నారు ఇద్దరూ. వాళ్ల పోలికలే నాకూ వచ్చాయి. ఏదైనా చేయాలంటే ప్రణాళికతోనే చేస్తాను. అలా ఒకపక్క చదువుకుంటూనే మరోపక్క నటనలోనూ శిక్షణ తీసుకునేవాణ్ణి.

హీరో కావాలంటే ఫైట్లు చేయాలి అనేవాళ్లు అందరూ. దాంతో, కరాటే క్లాసులకూ వెళ్లేవాణ్ణి. అలా మూడేళ్లు గడిచాయి.

అప్పటికి మేమింకా చెన్నైలోనే ఉంటున్నాం. ఐడీ అనే తమిళచిత్రంలో అవకాశం వచ్చింది. మొదటిసారి కెమెరా ముందు నాకు ఎలాంటి భయమూ కలగలేదు. ఆ సినిమా అందరినీ మెప్పించింది. యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మనదేశం సహా సుమారు 60 దేశాల నుంచి అనేక చిత్రాలు ప్రదర్శనకు వస్తే... అందులో నా ప్రదర్శనకు ఉత్తమ నటుడి అవార్డు వచ్చింది. దాంతో నేను పెద్ద హీరోనైపోయానన్న ఫీలింగ్. కానీ, వయసు సరిపోదుగా. అందుకే, మరికొన్నాళ్లు వేచి ఉండాల్సి వచ్చింది.

అప్పట్లో కుంగ్‌ఫూ గురించి కూడా అందరూ చెబుతుండటంతో దాన్నీ నేర్చుకోవాలనుకున్నా. ఆ క్లాసు ఉదయం అయిదింటికే మొదలయ్యేది. నేను నాలుగున్నరకు లేచి రెడీ అయ్యేవాణ్ణి. అమ్మ కూడా నాతోపాటు లేచి, వేడివేడిగా టిఫిన్ వండిపెట్టేది. ఇంతకీ, కుంగ్‌ఫూలో ఎందుకు చేరానో తెలుసా... హీరోనైపోయే లోపు నాకు బోరు కొట్టకుండా ఉండటానికి.

చెప్పానా... చిన్నప్పట్నుంచీ నా క్యారెక్టర్ ఇంతేనని. తరవాత కూడా అలాగే ఉండేవాణ్ణి. కావాలంటే పదో తరగతి చదువుతున్న రోజుల్లోకి తీసుకువెళ్తాను రండి.

చదవకూడదని డిసైడయ్యా

చిన్నప్పుడు నేను చదవడం తక్కువ, ఆటలూ సినిమాలూ ఎక్కువ. ఎంత త్వరగా పెద్ద హీరో అయిపోదామా అని ఉండేది. టెన్త్ క్లాసులో యూనిట్లు, క్వార్టర్లీ లాంటి పరీక్షలేవీ రాయలేదు. పబ్లిక్ పరీక్షలే రాశాను. 70 శాతం మార్కులొచ్చాయి. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే... నేను దేనిమీదైనా శ్రద్ధపెట్టి చేశానంటే అందులో విజయం సాధించేవరకూ నిద్రపోను. 'మరి, చదువు ఎందుకు చదవలేదో' అంటారా?

చెప్పానుగా, నాకేమో తొందరగా హీరో అయిపోవాలని ఉండేది. బాగా చదివి మార్కులు సంపాదిస్తే... నన్ను సినిమాల్లోకి పంపాలన్న ఆలోచన అమ్మానాన్నలకు ఎలా వస్తుంది? ఆ భయంతోనే చదివేవాణ్ణికాదు. పాసుమార్కులు తెచ్చుకునే వాణ్ణంతే. పదో తరగతిలో ఓ మోస్తరుగా చదివినా ఎక్కువ

ఉమ్మడి కుటుంబం

నేను 'ఇండిపెండెంట్లీ డిపెండెంట్'ని నమ్ముతాను. ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు చాలాచోట్ల కుదరవు. తాతయ్యకు తలనొప్పిగా ఉందంటే... అప్పట్లో మేం టీవీ కట్టేసేవాళ్లం. ఈతరం పిల్లలు అలా కాదు... 'మీకు తలనొప్పిగా ఉంటే, వేరే రూముకి వెళ్లండి' అంటున్నారు. అందుకే, ఎవరికి వాళ్లు ఒకేచోట విడివిడిగా ఉండటమే మంచిది. అదే సమయంలో అందరూ కష్టసుఖాల్లో కలుస్తుండాలి. అందుకే, మేమంతా ఒకే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో వేర్వేరు ఫ్లాట్లలో ఉంటాం. ఎప్పుడూ కలుస్తుంటాం.

మార్కులు వచ్చేశాయి. అందుకే, ఆ శ్రద్ధేదో సినిమాలమీదే పెట్టాలని నిర్ణయించుకున్నాను.

తెలుగులోనే డిసైడయ్యా

అప్పటికే నేను తమిళంలో సినిమా చేయడంతో ఓ తమిళ దర్శకుడు మా ఇంటికొచ్చి కథ చెప్పారు. ఇంట్లో కూడా ఓకే అనుకున్నారు. ఇంతలో సునామీలా వచ్చి నాతో సినిమా తీస్తానన్నారు వైవీఎస్ చౌదరి.

అప్పటికి ఆయన హిట్ సినిమాలతో జోరు మీదున్నారు. దాంతో పెదనాన్న నన్ను తెలుగులోనే పరిచయం చేయాలనుకున్నారు. అ సినిమాయే దేవదాసు. అలా 19 ఏళ్లకే హీరోనైపోయా. ఇలియానాకూ అదే మొదటి సినిమా. ఆ సినిమాకు నేను చేసిందల్లా... చౌదరిగారిని గుడ్డిగా ఫాలో అయిపోవడమే. సినిమాకి నేనూ ఇలియానా పడిన కష్టం ఎవ్వరికీ తెలీదు. మా కష్టానికి ఫలితమా అన్నట్టు... సినిమా పెద్ద హిట్టయ్యింది.

దేవదాసు తరవాతైనా తమిళంలో సినిమా చేయాలనుకున్నాను. కానీ, ఇంతలో దర్శకుడు సుకుమార్ 'జగడం' కథతో వచ్చారు. ఆ కథ నాకు నచ్చింది. సినిమాను ఎంతో ప్రేమించాను. ప్రాణం అనుకుని కష్టపడి చేశాను. కానీ, సినిమా ఫలితం నన్ను నిరాశపరిచింది.

చాన్నాళ్లు ఆ బాధలోంచి తేరుకోలేకపోయాను. కొన్నాళ్లకు నాకు తత్వం బోధపడింది.

సినిమా అంటే ప్రాణం అనుకోవడంలో తప్పులేదు. కానీ, ఫలానా సినిమానే ప్రాణం అనుకోకూడదు. జగడం మంచి సినిమా. ప్రేమించి చేసిన సినిమా. ప్రేమించిన అమ్మాయిని ఇంటికి తెస్తే... ఇంట్లోవాళ్లు (ప్రేక్షకులు) నచ్చలేదని కరాఖండిగా చెప్పేశారు. అరే, బాగానే ఉందికదా అని ఆమెనే చూస్తూ కూర్చుంటానంటే ఎలా? నా దృష్టిలో ఫ్లాప్ సినిమా... లవ్ ఫెయిల్యూర్ లాంటిది. హిట్టయిన సినిమా విజయవంతమైన లవ్ మ్యారేజ్. అందుకే, లవ్ ఫెయిల్యూర్లకు బాధ పడటం మానేశాను. పోలిక విచిత్రంగా ఉంది కదూ. నా క్యారెక్టరే అంత. ఎందులోనైనా కొత్తదనం వెతుకుతాను.

పోగొట్టుకున్నచోటే వెతుక్కోవాలంటారు. అందుకే, తెలుగులోనే హిట్ కొట్టాలనుకున్నాను. సరిగ్గా, అప్పుడే శ్రీను వైట్ల 'రెడీ' కథతో వచ్చారు. నా కెరీర్‌ను పెద్దమలుపు తిప్పిందా సినిమా. తెలుగులో సెటిలైపోయానన్న ఫీలింగ్ వచ్చింది. అందుకే, తమిళంలో చేయాలన్న ఆలోచనను పక్కకు పెట్టేశాను. ఆ తరువాత వరుసగా మస్కా, గణేష్, రామరామ కృష్ణకృష్ణ, కందిరీగ, ఎందుకంటే ప్రేమంట సినిమాలు చేశాను. ప్రస్తుతం భాస్కర్‌తో 'ఒంగోలు గిత్త' చేస్తున్నాను.

నా తొమ్మిది సినిమాల్లో కేవలం రెండింటిలోనే ఒకే కథానాయిక. మిగతా ఏడింటిలో నూ కనీసం ఇద్దరు ఉండేవారు. అందుకే, అందరూ... మీకు గర్ల్‌ఫ్రెండ్స్ కూడా ఇద్దరు ముగ్గురున్నారా అంటుంటారు.

గర్ల్‌ఫ్రెండ్స్ లేరు అనను. అలా అంటే... ఏదైనా లోపముందేమోనని సందేహం వస్తుంది. అందుకే, 'ప్రస్తుతానికి లేరు' అని చెబుతుంటాను.

ఏ విషయాన్నయినా కొత్తగా చెప్పడం, కొత్తగా చూపించడం నాకు అలవాటు. లేదంటే బోరుకొడుతుంది. నమ్మడం లేదా? అయితే, మీకు మరిన్ని విషయాలు చెప్పాలి.

వెరైటీగా డిసైడయ్యా

నా ఆలోచనలకు తగిన పని ఏదైనా ఉందీ అంటే... అది నటన మాత్రమే. పనిమీద శ్రద్ధ ఉండాలి అంటారు అందరూ. కానీ, నాకు అదొక్కటే సరిపోదు... ఎక్సైట్‌మెంట్ కూడా ఉండాలి.

సినిమాలు చేయనప్పుడు... తెలుగు సహా ఇతర భాషల్లో ఎలాంటి సినిమాలొస్తున్నాయో, ఎలా నటిస్తున్నారూ వంటివన్నీ పరిశీలిస్తుంటాను. నేను కొత్తగా ఏం చేయొచ్చా అని ఆలోచిస్తాను. కూర్చునిటే తాగుతున్నప్పుడు కూడా... టీని ఇంకా వెరైటీగా ఎలా తాగొచ్చా అని ఆలోచిస్తాను.

ఫైటింగులు కూడా వెరైటీగా చేయాలనుకుంటాను. గణేష్ సినిమాలోని త్రీ సెక్షన్ స్టాఫ్ ఆయుధం ఆ స్ఫూర్తితో వచ్చిందే. భారతీయ సినిమాల్లో దాన్ని మొట్టమొదట వాడింది నేనే. థర్టీసిక్స్ ఛాంబర్ ఆఫ్ షావొలిన్ సినిమాలో చూసిన ఆ ఆయుధాన్ని అమెరికా నుంచి తెప్పించాను. తీరాచూస్తే ఇక్కడెవ్వరికీ దాన్ని ఎలా ఉపయోగించాలో తెలియదు. దాంతో ఆ సినిమాను జాగ్రత్తగా చూసి నేర్చుకున్నాను. ఇలాంటివి నాకు చాలా ఎక్సైటింగ్‌గా ఉంటాయి.

సినిమాల్లాగే జీవితమూ కొత్తగా ఉండాలనుకుంటాను. అందుకే, నా జీవితంలో ఏ రెండురోజులూ ఒకేలా ఉండవు. ప్రతిరోజూ కొత్తగా ఆలోచిస్తా. కొత్తగా పనిచేస్తా. అద్దం ముందు నిల్చున్నప్పుడు నాకు నేను బోరు కొట్టకుండా ఉండేలా చూసుకుంటాను.

ఫిట్‌నెస్‌లో కూడా నాకు రొటీన్ నచ్చదు. రోజూ జిమ్‌కి వెళ్లడం, గంటసేపు వ్యాయామం, వర్కవుట్ ఇలాగే ఫాలో అవ్వడం నావల్ల కాదు. అందుకే, ఒకరోజు డాన్స్, మరోరోజు జిమ్నాస్టిక్స్, ఇంకోరోజు కుంగ్‌ఫూ... ఇలా రకరకాలు ప్రయత్నిస్తాను.

సంతోషం అంటే ఏంటీ అని చాలామంది ఆలోచించేస్తుంటారు. నా దృష్టిలో సంతోషం అంటే...

ఇంటి నుంచి పనికి వెళ్లేటప్పుడు హ్యాపీగా ఉండాలి. పని అయిపోయాక ఇంటికి వెళుతున్నప్పుడు కూడా హ్యాపీగా ఉండాలి.

నేనెప్పుడూ అలాగే ఉంటాను. అదే నా అందం, ఆరోగ్యం రహస్యం.

అమ్మకు నచ్చడం కష్టం



సినిమాలకు సంబంధించి నటన తప్ప దర్శకత్వమో మరొకటో చేయాలన్న ఆలోచనలేదు.

ట్విట్టర్‌లో ప్రతి గంటకూ అప్‌డేట్స్ పెడుతుంటాను. అభిమానులతోనూ స్నేహితులతోనూ టచ్‌లో ఉండటానికి అదే మంచిమార్గం అనిపిస్తుంది.

పుస్తకాలు ఎక్కువగా చదవనుగానీ... చదివేవాళ్లతో ఎక్కువగా మాట్లాడతాను.

నేను గ్యాడ్జెట్ ప్రియుణ్ణి. ఫోన్లు, ట్యాబ్లెట్లు కొత్తవి వస్తే కొనేస్తుంటాను.

నాన్నగారికి నేను నటించే ప్రతి సినిమా నచ్చుతుంది. అమ్మ 'బాగుంది' అనడం మాత్రం కష్టం.

నా సినిమాలకు డ్రెస్సులన్నీ నేనే డిజైన్ చేసుకుంటాను.

నటులు ఎమోషన్లతో ఆడుకుంటారు. ఒక్కోసారి అవి వాళ్లతో ఆడుకుంటాయి. నాకు రెండు పెంపుడు కుక్కలుండేవి. ఇటీవల ఒక కుక్క చనిపోయింది. కానీ, ఆ రోజు షూటింగ్‌లో నేను చాలా ఆనందంగా ఉండాలి. ఎంత విచిత్రమో కదా!

నేను దేవుణ్ణి నమ్ముతాను. ఉదయం లేచే ముందూ రాత్రి పడుకునేముందూ నమస్కారం చేసుకుంటాను.

కొత్త భాషలు నేర్చుకోవడమంటే ఇష్టం. విదేశాలకు వెళ్లినప్పుడు విమానంలో ట్రాన్స్‌లేటర్ పట్టుకుని చిన్నచిన్న పదాలు నేర్చుకుంటాను. ఇటలీ వెళ్లినప్పుడు ఇటాలియన్ కొంత నేర్చుకున్నాను. ఇప్పుడు స్పానిష్ నేర్చుకుంటున్నాను.

మా అన్నయ్య పైలటింగ్ కోర్సు చేసి పైలట్ అయ్యాడు. ఆ ఉద్యోగం వదిలేసి సినిమా నిర్మాణంలోకి వచ్చాడు.

దేవదాసు 100వ రోజునాడు నాన్న కారు కొనిచ్చారు. నాకు వచ్చిన బహుమతులన్నింటిలోకీ అదే గొప్పది. కార్లంటే నాకు చాలా ఇష్టం. కార్లో షికార్లు చేయడాన్ని ఇష్టపడతాను.

ముల్కనూరు... మరో ఆనంద్

పల్లె అంటే... పాడిపంటలు. కానీ వాటి స్థానంలో కరవుకాటకాల మాటలే వినిపిస్తున్నాయి. పల్లెలు ఖాళీ అయిపోతున్నాయి. తమ పల్లెలు అలా కావడం ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు సభ్యులకు నచ్చలేదు. అందుకే తమ వంతుగా పాల డెయిరీ స్థాపనకు సహకారం అందించారు. ఆ సహకారమే నేడు ముల్కనూరుని 'మిల్క్ ఊరు'గా మార్చింది.

పాల విప్లవం పేరు చెప్పగానే గుర్తొచ్చేది గుజరాత్ లోని ఆనంద్ మిల్క్ డెయిరీ. సరిగ్గా ఆ దిశగానే అడుగులు వేస్తోంది ముల్కనూరు డెయిరీ. కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉంది ముల్కనూరు. పుష్కర కాలం కిందట ముల్కనూరు పరిసర గ్రామాల్లో వర్షాలులేక భూములు బీళ్లుగా మారేవి. చెరువులు నిండుకునేవి. పశువులు కబేళాలకు పోతుండేవి... ఇదంతా చూస్తున్న ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు (ఎం.సి.ఆర్.బి.) నిర్వాహకులకు ఏదో ఒకటి చేయకపోతే పచ్చని పల్లెలు ఎడారిగా మారిపోతాయనిపించింది. పొదుపు సంఘాలతో ప్రఖ్యాతి చెందిన స్వశక్తి మహిళలను ఏకం చేసి సాగుకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పిస్తే బావుంటుందని యోచించారు. బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తమ ఆలోచనను స్వశక్తి మహిళలకు చెప్పారు. ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే మిల్క్ డెయిరీ. 2000లో ఆలోచనకు బీజం పడితే 2002లో కల సాకారమైంది. స్వశక్తి పొదుపు సంఘాలకు మార్గనిర్దేశం చేస్తున్న సహవికాస సొసైటీ, ఎం.సి.ఆర్.బి. అందించిన రూ.3.5 కోట్ల రుణ సహకారంతో ముల్కనూరు మహిళా సహకార డెయిరీ ఆవిర్భవించింది.

పొదుపు సంఘాలే స్ఫూర్తి

కరీంనగర్ జిల్లాలో మహిళా పొదుపు సంఘాల విజయగాథలు అనేకం. ఆ ధైర్యంతోనే మిల్క్ డెయిరీని మహిళా సహకార డెయిరీగా ప్రారంభించారు. పాల సేకరణ, డెయిరీ, కార్యాలయ నిర్వహణ అంతా మహిళల సారథ్యంలోనే జరుగుతుంది. ముల్కనూరు డెయిరీ 72 సంఘాలకు చెందిన 5,200 మంది సభ్యులతో ప్రారంభమైంది. క్రమంగా చుట్టుపక్కల గ్రామాల మహిళల్నీ భాగస్వాములను చేసుకున్నారు. నేడు జిల్లాలోని వివిధ గ్రామాల్లో 109 సంఘాలకు చెందిన 20వేల మంది మహిళలు సహకార డెయిరీలో సభ్యులుగా ఉన్నారు. 109 పాల సేకరణ కేంద్రాలకూ అధ్యక్షులు మహిళలే. వీరిలోంచి 15 మందిని సమితి డైరెక్టర్లుగా ఎన్నుకుంటారు. ఇందులోంచి ఒకరు అధ్యక్షురాలిగా ఉండి నాలుగేళ్లపాటు సేవలు అందిస్తారు. పాలనా వ్యవహారాలు చూసేందుకు ఏర్పాటుచేసిన కార్యాలయంలో ఉన్న సిబ్బందిలో అత్యధికులు మహిళలే. ముల్కనూరు డెయిరీ రోజుకు 75వేల లీటర్ల పాలు సేకరిస్తోంది. పాలతో పాటు మజ్జిగ, వెన్న, పెరుగునీ మార్కెట్ చేస్తోంది. డెయిరీ విజయం వెనుక కారణాల్లో మహిళల పట్టుదలతో పాటు నాణ్యమైన ఉత్పత్తుల్ని అందించడమూ ఆధునికతను అంది పుచ్చుకోవడమూ ఉన్నాయి. పాలను సేకరించిన వెంటనే సభ్యుల మొబైల్ ఫోన్లకు సమాచారం అందిస్తారు. ఇలా చేయడంవల్ల మధ్యలో

నీళ్లు కలపడానికీ, రికార్డుల్లో తగ్గించి రాయడానికీ వీలుండదు. రవాణా ఖర్చుల్ని తగ్గించుకోవడానికి డెయిరీకి గరిష్ఠంగా 25కి.మీ. పరిధి లోపల మాత్రమే పాలు సేకరిస్తారు. పాలూ, పాల ఉత్పత్తుల్ని వరంగల్, కరీంనగర్, మంచిర్యాల, గోదావరిఖని వంటి సమీప నగరాలు, పట్టణాల్లో మార్కెట్ చేస్తారు. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గి డెయిరీకీ, వినియోగదారులకీ మేలు జరుగుతుంది. పాలశుద్ధి, తూకం, నాణ్యతా పరీక్ష, పాల క్యాన్ల శుభ్రత... ఇవన్నీ ఆధునిక యంత్రాలతో జరుగుతాయి.

బోనస్ కూడా...

2011-12 ఆర్థిక సంవత్సరంలో ముల్కనూరు డెయిరీ రూ.68 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిపింది. ఇదే ఆర్థిక సంవత్సరానికి డెయిరీకి ఉన్న డిపాజిట్లు, స్థిరాస్తుల విలువ రూ.23 కోట్లకు పైమాటే. రైతుల నుంచి కనిష్ఠంగా లీటరు గేదె పాలను రూ.23, ఆవుపాలను రూ.18 చెల్లించి కొంటారు. వెన్న శాతాన్నిబట్టి గరిష్ఠంగా గేదె పాలకు రూ.61, ఆవు పాలకు రూ.23 చెల్లిస్తారు. దేశంలో ఇంతకంటే మంచి ధరలు లేవని నిర్వాహకులు గర్వంగా చెబుతారు. పదిహేను రోజులకు రైతులకు డబ్బు చెల్లిస్తారు. ఏటా బోనస్ ఇస్తారు. గతేడాది రూ.1.9 కోట్ల బోనస్ ఇచ్చారు. ఈ సంఘ సభ్యురాలు రాజమణి సగటున రోజుకు 25 లీటర్ల గేదె పాలు సరఫరా చేస్తోంది. నెలకు ఆమె ఆదాయం రూ.17వేల వరకూ ఉంటుంది. ఆమె దగ్గర - డెయిరీ ప్రారంభించినప్పుడు ఒక గేదె ఉంటే ప్రస్తుతం 13 గేదెలున్నాయి.

ముల్కనూరు డెయిరీ రెండు సార్లు నాణ్యత విభాగంలో జాతీయ అవార్డు దక్కించుకోవడంతోపాటు ఈ ఏడాది జాతీయ ఉత్తమ సహకార సంఘం అవార్డునూ పొందింది. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులమీదుగా అవార్డునీ, రూ.1.5 లక్షల నగదు బహుమతినీ డెయిరీ అధ్యక్షురాలు కడారి పుష్పలీల అందుకోనున్నారు. 'ఇది మహిళా విజయం. మా అభివృద్ధిని మెచ్చి నెదర్లాండ్స్‌కు చెందిన ఒక సంస్థ సహకారం ఇచ్చేందుకు ముందుకు వస్తోంది. భవిష్యత్తులో లేగదూడల పెంపకాన్ని ప్రారంభించనున్నాం' అని చెబుతున్నారు అధ్యక్షురాలు పుష్పలీల.

ముల్కనూరు డెయిరీ మరిన్ని మైలురాళ్లను దాటాలని ఆకాంక్షిద్దామా!

– *గణేశ్ సింగ్ రాహుల్*, ఈనాడు, కరీంనగర్

అబద్ధాల పోటీ!

అతి పెద్ద అబద్ధాల పోటీ ఇంగ్లండ్ లోని శాన్‌టన్‌బ్రిడ్జ్‌లో ఏటా నవంబరులో జరుగుతుంది. ప్రపంచంలోని నలుమూలల నుంచీ వచ్చిన అనేకమంది దీనిలో పాల్గొంటారు. లాయర్లూ రాజకీయ నాయకులకు మాత్రం ప్రవేశం లేదు. పందొమ్మిదో శతాబ్దానికి చెందిన జమీందారు విల్ రిట్‌సన్ గౌరవార్థం దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ జమీందారు గారు అబద్ధాలు చెప్పడంలో మహాదిట్ట. ఆయన జాపకార్థం జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనేవారు అయిదు నిమిషాల్లో అందమైన అబద్ధాన్ని చెప్పేయాలి. ఎలాంటి సామెతలూ జోకులూ ఉపయోగించకూడదు. ఇప్పటివరకూ - రెండో ప్రపంచ యుద్ధానికి సంబంధించి లేనిపోని కథలల్లి చెప్పినవారు ఎక్కువసార్లు విజేతల య్యారు. 'నేను జీవితంలో ఇంతవరకూ ఒక్క అబద్ధంకూడా చెప్పలేదు' అని సెలవిచ్చిన బిషప్‌గారు గత ఏడాది సునాయాసంగా బహుమతిని గెలుపొందాడు. ఇలాంటి పోటీలు మన దేశంలో పెడితే మాత్రం విజేతలను నిర్ణయించడం కాస్త కష్టమేనేమో!

ఇళ్లే కాన్వాస్‌లు

మాస్కోకు చెందిన డిమిట్రీ బొకారెవ్ పాడుబడిన బిల్డింగులకూ పెళ్లికళ తీసు కొచ్చేస్తున్నాడు. ఇళ్ల తలుపులూ బయటి గోడల మీద డ్రాయింగ్‌లు వేయడానికి బొకారెవ్ ప్రజల అనుమతి తీసుకునేవాడు. ఆ తర్వాత వాటి స్వరూపమే మార్చేసే వాడు. ఇలా ఇతడు గత పదిహేడేళ్లుగా తన కళతో అలరిస్తున్నాడు. తన చిత్రకళకు మరిన్ని మెరుగులద్దిన బొకారెవ్ ఇప్పుడు ఇంటి లోపలికి కూడా ప్రవేశించాడు. గోడలూ మేడమెట్లూ సీలింగ్‌లూ అన్నింటినీ అందమైన ప్రకృతి చిత్రాలతో ముంచెత్తు తున్నాడు. కొత్తగా మెరిసిపోతున్న తమ ఇళ్లను చూసి యజమానులూ మురిసిపో తున్నారు. అంతేకాదు ఒక్కసారివచ్చి ఇంటి అందాలను చూసిపొమ్మని బంధువులను కూడా సంతోషంగా ఆహ్వానిస్తున్నారు. ఇళ్లనే కాన్వాస్‌లుగా మార్చేసుకున్న బొకారెవ్ ఉచిత కళాసేవ బాగుంది కదూ...

ఐ సేవ్ యూ

జపాన్‌కు చెందిన హ్యుమానిక్స్ అనే వ్యాపార సంస్థ స్థానిక విశ్వవిద్యాలయం సహకారంతో మూడు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాన్ని తయారు చేసింది. దీని పేరు 'ఐ సేవ్ యూ'. వాహనం వెలుపల ఎయిర్ బ్యాగ్స్ ఉండటం దీని ప్రత్యేకత. దీని ధర సుమారు అయిదున్నర లక్షల రూపాయ లు. ఇది వృద్ధులూ వికలాంగు లకూ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తేచాలు 30 కిలో మీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగినా వాహనం బయట ఉండే ఎయిర్ బ్యాగ్‌ల వల్ల వాహనంపై ఎలాంటి ఒత్తిడీ పడదు. దాంతో ప్రయాణికులూ పాదచారులకూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ వాహనం కాపాడగలుగుతుంది. 'ఐ సేవ్ యూ' అంటున్న వాహనాన్ని ఎవరు మాత్రం కాదనగలరు?

మోడల్ తాత

మనవరాలి వ్యాపారాన్ని పెంచడానికి తాత మోడల్ అవతార మెత్తాడు. చైనాలోని డెబ్బైరెండేళ్ల లీ జియాన్‌పింగ్ టీనేజర్ దుస్తులు ధరించిన ఫొటోలు అంతర్జాలంలో ప్రశంసల వర్షం కురి పించాయి. అంతేకాకుండా షాపు అమ్మకాలనూ అమాంతం పెంచేశాయి. టీనేజర్ల దుస్తులకు మోడలింగ్ చేస్తున్న అతిపెద్ద వయస్కుడు లీనే కావడం విశేషం. లేతరంగుల డ్రస్సులూ లేసులను లీ ధరించిన విధానం అందర్నీ ఎంతగానో ఆకట్టు కుంటోంది. మోడలింగ్‌కు అనువుగా ఉండే ఇతడి శరీరాకృతినీ సన్నగా పొడుగ్గా ఉండే కాళ్లనూ చూసి ఎంతోమంది టీనేజర్లే తెగ ముచ్చటపడుతున్నారట. ఏదేమైనా షాపు అమ్మకాలు అయిదురెట్లు పెరిగిపోవడంతో...లేటు వయసులో ఘాటుగా మోడలింగ్ చేస్తున్న లీ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

పేకాటలో గెలవాలంటే...

ముఖ కవళికల ఆధారంగా ఎదుటివారి మనసులో ఏముందో కనిపెట్టేస్తారు చాలామంది. మరి పేకాటలో ఇలా జరిగితే కొంపలంటుకు పోవూ... అందుకే న్యూయార్క్‌కు చెందిన సౌందర్య నిపుణుడు డాక్టర్ జాక్‌బెర్డీ కొత్త ప్రక్రియను కనిపెట్టాడు. దీని పేరు 'పోకర్‌టాక్స్'. పేకాటలో అవసరమైన కార్డు వచ్చినప్పుడు లేదా అనవసర మైంది వచ్చినప్పుడు అనుకోకుండానే కనుబొమ్మలు ఎగరేయడం, చిట్లించడం చేస్తుంటారు కొందరు. దాంతో వారి ఆటతీరు ఎదుటివారికి తెలిసిపో తుంది. ఈ ఇబ్బంది లేకుండా 'పోకర్‌టాక్స్' ద్వారా ముఖం చిట్లించినా నుదుటిపైన గీతలు

పడకుండా చేస్తున్న జాక్ తన చికిత్సను ఉపయోగించు కుంటే పేకాటలో విజయం తథ్యమని ఊరిస్తున్నాడు.

కొందరు కాలుస్తారు.
కాలుస్తూనే ఉంటారు... కాలుస్తూ కాలుస్తూ కాలుస్తూ...
చివరికి కాలిపోతారు! ధూమపానం...
మనిషిని ఇలానే కాల్చేస్తుంది.
అలా కాలకుండా ఉండాలంటే...
ఆ చైతన్యం చిన్నప్పట్నుంచే ఉండాలి!

పిల్లలు చెబితే వినాలి

"...వినను. ఏం... ఎందుకు వినాలి? మా తాత కాల్చాడు. మా నాన్న కాల్చాడు. నేను కాలుస్తున్నాను. ఇప్పుడు నువ్వు చెప్పగానే మానేయాలా..?"

ఇదో రకం వితండవాదం.

"...మీకేం తెలుసు. తెల్లారి నుంచి రాత్రి వరకూ టెన్షన్ టెన్షన్. రిలీఫ్ కోసం సిగరెట్ కాలిస్తే తప్పా? ఈ మాత్రం మనశ్శాంతీ మిగలనివ్వరా..?"

ఇది మరోరకం. ఇలాగే ఎవడివాదన వాడికి ఉంటుంది. చేస్తున్నది తప్పు అని తెలిసినా తప్పని పరిస్థితుల్లో చేస్తున్నామని తప్పించేసుకుంటారు. 'పొగతాగడం మానేయండి బాబూ మీ మంచికే చెబుతున్నాం' అని గొంతు చించుకున్నా చాలామంది చెవులకి ఎక్కదు. ఇలాంటి వాళ్లని మార్చాలనుకోవడం పిచ్చిపని. ధూమపానానికి అలవాటు పడి పోయినవారిని మార్చలేనప్పుడు... కొత్తవాళ్లని అందుకు అలవాటు పడనీయకుండా చేస్తే చాలు. ఇదే లక్ష్యంతో ధూమపానంవల్ల కలిగే నష్టాలను పిల్లలకు వివరించే ప్రయత్నంచేస్తోంది ముంబైకి చెందిన 'సలామ్ బోంబే ఫౌండేషన్'.

పిల్లలే కీలకం

ఏ సమస్య అయినా ఎక్కడ మొదలౌతుంది అన్నది తెలుసుకుంటే... అక్కడి నుంచే దాన్ని నిర్మూలించడం సులువు. ధూమపానం కూడా అంతే. మనదేశంలో ధూమపానం, గుట్కా లాంటి వాటిని తొలిసారిగా రుచి చూస్తున్నవారి సగటు వయసు ఎంతో తెలుసా... 15 సంవత్సరాలు! దేశవ్యాప్తంగా రోజుకి దాదాపు 55,000 మంది పిల్లలు ఈ అలవాట్ల బారిన పడుతున్నారని మరో అంచనా. ఇలాంటి నిజాలే డా॥ సుల్తాన్ ప్రధాన్‌ని ఆలోచింపజేశాయి. దేశం గర్వించదగ్గ క్యాన్సర్ వైద్యుల్లో (సర్జికల్ ఆంకాలజిస్ట్) ఈయనా ఒకరు. మరికొంతమంది మిత్రులతో కలసి చిన్నారులను ఈ చెడు అలవాట్ల బారిన పడనీయకుండా చేద్దాం అని సంకల్పించారు. పద్మినీ సొమానీ, ఆదిత్యా విక్రమ్ సొమానీ, బి.కె.అగర్వాల్... ఇలా కొంతమంది మిత్రులతో కలసి 2002లో 'సలామ్ బోంబే ఫౌండేషన్' ఏర్పాటు చేశారు. పొగాకు వాసనే తెలియని భవిష్యత్తును పిల్లలకి అందించాలన్న లక్ష్యంతో ఎన్నో

కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఎన్నో కార్యక్రమాలు

ముంబైలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎన్నో అవగాహనా కార్యక్రమాలు రూపొందించారు. "13 నుంచి 15 ఏళ్లలోపు పిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆ వయసులో వాళ్లకి మంచేదో చెడేదో తెలీదు. అవి తెలియజేయాలంటే ఇంట్లో వాళ్లే వాళ్లకు ఆదర్శంగా మారాలి. 'సిగరెట్ నేను కాల్చడం లేదు... ఎందుకంటే ఆరోగ్యానికి హానికరం. గుట్కా నేను తినను... ఎందుకంటే అది ఆరోగ్యానికి హానికరం' అని పిల్లలకు మనమే చెప్పగలగాలి" అంటారు పద్మిని. వీళ్లు ప్రతీయేటా 'సూపర్ ఆర్మీ' పేరుతో విద్యార్థులను బృందాలుగా తయారుచేస్తున్నారు. ఈ సైనికులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ధూమపాన వ్యతిరేక ప్రచారం చేస్తారు. పాటల ద్వారా చిత్రలేఖనం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. ఈ 'సూపర్ ఆర్మీ'లో ప్రతీయేటా కొన్ని వేలమంది విద్యార్థులు పాలుపంచుకుంటున్నారు. వీటితోపాటూ వివిధ స్వచ్ఛంద సంస్థల సహాయంతో ముంబైలోని చాలాచోట్ల పిల్లలకి ఇలాంటి అవగాహనా కార్యక్రమాలూ వ్యాసరచన పోటీలూ చర్చాపోటీలూ బొమ్మలు వేయడమూ పరుగు పందాలూ పాటల పోటీలు... ఇలా పిల్లల్ని వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నారు. ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా వాటి ద్వారా పిల్లలకు చేరవేస్తున్న సందేశం... పొగతాగడం, గుట్కాలు తినడం ఆరోగ్యానికి హానికరం అని. ప్రస్తుతం ఈ ఫౌండేషన్ ముంబైలోని 49 మున్సిపల్ పాఠశాలల్లోనూ 51 గవర్నమెంట్ ఎయిడెడ్ స్కూళ్లలోనూ తరచూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అంతేకాదు, మహారాష్ట్రలోని మరో ఐదు జిల్లాల్లోని పిల్లలనూ చైతన్యవంతం చేస్తోంది. గడచిన ఏడాది కాలంలో దాదాపు 13 లక్షల మంది చిన్నారులను వివిధ అవగాహన సదస్సులో భాగస్వాములను చేసింది. ఈ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులూ చేతులు కలిపారు.

పెద్దలూ మారాలని

'సిగరెట్ కాల్చడం ఆరోగ్యానికి ఎందుకు హానికరమో పిల్లల మనసుల్లో నాటేలా చెప్పగలిగితే చాలు... ఇక వాటి జోలికి పోరు. కానీ, పెద్దలను మార్చడం చాలా కష్టం! వాళ్లను డీ ఎడిక్షన్ సెంటర్లదాకా తీసుకురావడమంటే మాటలు కాదు. అందుకే మేమే వాళ్ల దగ్గరకి వెళ్తున్నాం. దీనికోసం ఓ ప్రత్యేకమైన వ్యాను తయారుచేశాం. ఇందులో కొంతమంది కౌన్సెలర్లు ఉంటారు. 'ఎవరితోనైనా ధూమపానం మాన్పించాలంటే మాకు చెప్పండి... మేము వాళ్ల దగ్గరకి వెళ్లి కౌన్సెలింగ్ చేస్తాం'... ఇదే ఈ వ్యాన్ ముఖ్యోద్దేశం. ప్రస్తుతం ఇది ముంబైలోని పలు ప్రాంతాల్లో తిరుగుతోంది' అని వివరిస్తారు ప్రోగ్రామ్ డైరెక్టర్ దేవిక. ఈ అవగాహన కార్యక్రమాలు తీసుకొచ్చిన మార్పు ఏంటంటే... ఇప్పుడు ముంబైలోని కొంతమంది పిల్లలు వాళ్ల పెద్దవారి సిగరెట్ అలవాట్లను ప్రశ్నిస్తున్నారు. ధూమపానం వల్ల ఎలాంటి సమస్యలు వస్తున్నాయో వాళ్లే వివరిస్తున్నారు. పిల్లలు చెబుతున్నా మారం అని పెద్దలు అంటారా...? ★

పరాటా స్పెషల్

గోబీ పరాటా

కావలసినవి

గోధుమపిండి: 4 కప్పులు, **కాలీఫ్లవర్ తురుము:** 2 కప్పులు, **కొత్తిమీర తురుము:** కొద్దిగా, **పచ్చిమిర్చి:** రెండు, **అల్లం:** అంగుళంముక్క, **ఉప్పు:** సరిపడా, **కారం:** తగినంత, **గరంమసాలా:** రుచికోసం కొద్దిగా, **వాము:** అరటీస్పూను, **నూనె లేదా వెన్న:** సరిపడా

తయారుచేసే విధానం

గోధుమపిండిలో తగినన్ని నీళ్లు పోసి పిండిముద్దలా కలపాలి.

కాలీఫ్లవర్ తురుము, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, అల్లం తురుము, కొత్తిమీర తురుము, వాము, ఉప్పు, గరంమసాలా అన్నీ కలపాలి.

మీడియం సైజు చపాతీలు రెండు చేయాలి. ఒకదానిమీద కాలీఫ్లవర్ మిశ్రమాన్ని ఉంచి మరో చపాతీని దానిమీద పెట్టి మూసేయాలి.

ఇప్పుడు దీన్ని మళ్లీ ఓసారి కర్రతో వత్తి పెనంమీద వేసి తక్కువ మంటమీద రెండువైపులా కాల్చి తీయాలి.

బఠాణీ పరాటా

కావలసినవి

గోధుమపిండి: మూడు కప్పులు, **మైదా పిండి:** రెండు కప్పులు, **ఉప్పు:** అరటేబుల్ స్పూను, **వెన్న లేదా నెయ్యి:** ముప్పావుకప్పు

స్టఫింగ్‌కోసం: నూనె: 2 టేబుల్‌స్పూన్లు, **అల్లంతురుము:** టేబుల్‌స్పూను, **పచ్చిమిర్చి:** మూడు, **ఇంగువ:** పావుటీస్పూను, **ఉడికించిన బఠాణీలు:** రెండున్నర కప్పులు, **గరంమసాలా:** 2 టీస్పూన్లు, **కారం:** పావుటీస్పూను, **ఉప్పు:** సరిపడా, **నిమ్మరసం:** 2 టీస్పూన్లు, **బెల్లంతురుము:** 2 టీస్పూన్లు, **కొత్తిమీర తురుము:** కొద్దిగా, **నూనె లేదా వెన్న:** వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

గోధుమపిండిలో మైదా, ఉప్పు, నెయ్యి వేసి తగినన్ని నీళ్లు పోసి కలపాలి. తరవాత పలుచని తడిబట్ట కప్పి పక్కన ఉంచాలి.

స్టఫింగ్‌కోసం బాణలిలో నూనె వేసి వేడి చేయాలి. తరవాత అల్లంతురుము, పచ్చిమిర్చి వేసి వేయించాలి. తరవాత ఇంగువ వేసి వేగాక మిగిలిన దినుసులన్నీ వేసి రెండు నిమిషాలు వేయించి దించాలి. చల్లారిన తరవాత పది ముద్దలుగా చేసుకోవాలి.

పిండి ముద్దను రెండు మీడియం సైజు చపాతీల్లా చేయాలి. ఒకదానిమీద స్టఫింగ్ ముద్దను పెట్టి పైన రెండో చపాతీని వేసి మూసేయాలి. తరవాత ఓసారి కర్రతో వత్తి నూనె లేదా వెన్న వేస్తూ రెండువైపులా తక్కువ మంటమీద కాల్చితీయాలి.

పాలక్ పరాటా

కావలసినవి

గోధుమపిండి: 2 కప్పులు, **పాలకూర తురుము:** కప్పు, **నూనె:** టేబుల్‌స్పూను, **జీలకర్ర:** కొద్దిగా, **ఉప్పు:** రుచికి సరిపడా, **కారం** లేదా **మిరియాలపొడి:** పావుటీస్పూను, **నూనె** లేదా **వెన్న:** వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

పాలకూరను ఉడికించి నీళ్లు వంపేసి

చల్లారనివ్వాలి.

పిండిలో పాలకూర, ఉప్పు, కారం, జీలకర్ర, నూనె వేసి కలపాలి. తరవాత తగినన్ని నీళ్లు పోసి కలిపి ముద్దలా చేసి ఉంచాలి.

పిండిముద్దను ఉండలుగా చేసి పరాటాల్లా వత్తాలి. తరవాత పెనంమీద వెన్న వేసి రెండువైపులా కాల్చి తీయాలి.

ముంబై స్టఫ్‌డ్ పరాటా

కావలసినవి

గోధుమపిండి: 2 కప్పులు, **నెయ్యి:** అరటీస్పూను, **ఉప్పు:** రుచికి సరిపడా, **నూనె:** సరిపడా

స్టఫింగ్‌కోసం: పెసరపప్పు: 2 టేబుల్ స్పూన్లు (రాత్రే నానబెట్టి నీళ్లు వంపేయాలి), **ఉల్లికాడల తురుము:** 2 టేబుల్‌స్పూన్లు, **కారం:** అరటీస్పూను, **జీలకర్ర:** అరటీస్పూను, **ఇంగువ:** పావుటీస్పూను, **ఉప్పు:** రుచికి సరిపడా

తయారుచేసే విధానం

గోధుమపిండిలో నెయ్యి, ఉప్పు, టీస్పూను నూనె, తగినన్ని నీళ్లు పోసి ముద్దలా చేసి పది నిమిషాలు పక్కన ఉంచాలి.

స్టఫింగ్‌కోసం తీసుకున్నవన్నీ ఓ గిన్నెలో వేసి ముద్దలా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. పిండి ముద్దను కూడా నాలుగు ఉండలుగా చేయాలి.

ఓ ముద్దను తీసుకుని చిన్న చపాతీలా వత్తాలి. అందులో స్టఫింగ్‌కోసం తీసుకున్న ముద్దను ఉంచి చుట్టూ అంచులు మూసేయాలి. ఇప్పుడు దీన్ని మళ్లీ కర్రతో కాస్త నెయ్యి లేదా పిండి అద్దుతూ వత్తాలి.

ఇలాగే అన్నీ చేసుకుని పెనంమీద నెయ్యి వేస్తూ రెండువైపులా కాల్చి తీయాలి.

లాచా పరాటా

కావలసినవి

గోధుమపిండి: రెండు కప్పులు, **నూనె:** టేబుల్‌స్పూను, **ఉప్పు:** సరిపడా, **వెన్న** లేదా **నెయ్యి:** వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

పిండిలో నూనె, ఉప్పు వేసి కలపాలి. తరవాత తగినన్ని నీళ్లు కూడా పోసి ముద్దలా కలిపి తడిబట్ట కప్పి అరగంటసేపు పక్కన ఉంచాలి.

పిండిని ఉండలుగా చేసి ఐదారు అంగుళాల చపాతీలా చేయాలి. ఇప్పుడు కరిగించిన నెయ్యిని చపాతీమీద మొత్తంగా రాయాలి. తరవాత చాకుతో రెండున్నర అంగుళాల వెడల్పుతో పొడవుగా కోయాలి. వీటన్నింటిని ఒకదానిమీద ఒకటి పరచాలి. అలా పరిచేటప్పుడు ప్రతీదానిమీదా నెయ్యి రాయాలి. ఇలా పరిచిన దాన్ని ఒకవైపు నుండి గుండ్రంగా చుట్టాలి. ఇప్పుడు దీన్ని కర్రతో పరాటాలా వత్తి పెనంమీద వెన్న వేస్తూ తక్కువ మంటతో రెండువైపులా కాల్చి తీయాలి.

ఉపవినోదిని

అంకెలాట



ఇక్కడ ఒకే రకమైన అయిదు ఆకారాలు వేర్వేరు రంగుల్లో పరిమాణాల్లో ఉన్నాయి. వాటి మధ్య ఖాళీ వృత్తాలూ ఉన్నాయి. ఆ వృత్తాల్లో 1-9 అంకెలు నింపాలి. అయితే ప్రతీ రంగులో ఉన్న ఆకారంలో వృత్తాల్లోని అంకెల మొత్తం 17 అవ్వాలి.

బేల పేరేమి?

ఇక్కడ ఉన్న అయిదుగురిలో ఒకరు గ్రహాంతర వాసి. అది ఎవరో చెప్పండి? మిగతావారి పేర్లూ, వారు ఏయే స్థానాల్లో ఉన్నారో చెప్పండి.

1. కెల్లీకి మూడు యాంటెనాలు లేవు. అతడు ఈథన్ పక్కనే ఉన్నాడు.
2. ఈథన్, ఒలీవియా ఇద్దరి శరీరాలమీద ఒకేలాంటి డిజైన్ ఉంది.
3. పీటర్ గ్రహాంతరవాసి పక్కనే ఉన్నాడు. అతడి కాలి వేళ్లు కనిపించడంలేదు.
4. ఒలీవియాకి రెండు తలలు లేవు.



ఏ భాగం?

ఆకులోంచి ఏ భాగాన్ని కత్తిరించారో చెప్పగలరా?



ఒకేసారి

కాగితంపైన పెట్టిన పెన్ను ఎత్తకుండా వెళ్లిన దారిలో వెళ్లకుండా ఈ బొమ్మను గీయగలరా?





దొంగకి భేదాలుండవు ఎవరి డబ్బైనా తనదిగా భావిస్తాడు!

విప్పండి చూద్దాం

1. యంత్రం కాని యంత్రం?
2. దారం కాని దారం?
3. పిట్టకాని పిట్ట?
4. గొడుగు కాని గొడుగు?
5. పండు కాని పండు?
6. వల కాని వల?

తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య పది తేడాల్ని చెప్పండి.

రంగులేద్దాం

బొమ్మలో మూడు భుజాలు ఉన్న భాగాలకు మాత్రమే గోధుమ రంగు వేస్తే దీనిలో దాగిన బొమ్మ కనిపిస్తుంది.



దారి కనుక్కోండి

వీటిలో ఒక జంతువు మాత్రమే సరస్సుని చేరుకోగలదు. అది ఏ జంతువు?

మూడు బొమ్మలు

చంద్రగిరిని పాలించే విజయ సేనుడు రాజ్యానికి ఓ దివాన్ కావాలని ప్రకటన ఇచ్చాడు. ప్రకటన విని తన దగ్గరకు వచ్చేవారికి రాజు మూడు బొమ్మలు చూపించి వాటి మధ్య తేడా చెప్పమనేవాడు. 'మూడూ ఒకేలా ఉన్నాయి. తేడా లేదు' అనే సమాధానమే అందరి నుంచీ వచ్చేది. అది వినగానే 'అవునా, అయితే మీరిక వెళ్లొచ్చు' అని చెప్పేవాడు రాజు.

కొద్దిరోజులకు గురుకులంలో పాఠాలు చెప్పే గురువు ఒకరు రాజుని కలిసి... 'పరీక్షకు నేను సిద్ధం రాజా' అని చెప్పాడు. రాజు బొమ్మల్ని చూపించాడు. అతడు వాటిని కాసేపు పరిశీలించి 'నాకొక చీపురుపుల్ల కావాలి' అని అడిగాడు. ఓ భటుడు చీపురుపుల్ల తెచ్చి ఇచ్చాడు.

ఆ గురువు ఒక బొమ్మ తీసుకొని దాని చెవిలో చీపురుపుల్ల దూర్చాడు. అది మరో చెవిలోంచి బయటకు వచ్చింది. 'ఈ బొమ్మలాంటి వారు చాలామంది ఉంటారు. ఒక చెవితో విని మరో చెవితో వదిలేస్తారు. దేన్నీ పట్టించుకోరు' అని చెప్పాడు. రెండో బొమ్మ చెవిలోనూ చీపురుపుల్ల దూర్చాడు. అది నోట్లోంచి బయటకు వచ్చింది. 'ఇలాంటివారు ఏదీ దాచుకోరు. విన్నది విన్నట్లే అందరికీ చెబుతుంటారు' అన్నాడు. తర్వాత మూడో బొమ్మ తీసుకొని చెవిలో చీపురుపుల్ల దూర్చాడు. ఈసారి పుల్ల బయటకు రాలేదు. 'ఇలాంటివాళ్లు చాలా అరుదుగా ఉంటారు. అన్నీ జాగ్రత్తగా వింటారు. ఏది మంచో ఏది చెడో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని చెప్పాడా గురువు.

అతడి వివరణ విన్న రాజు... 'నేను ఇన్నాళ్లుగా వెతుకుతున్నది మీలాంటి వ్యక్తి కోసమే. మీరు నా దగ్గరే ఉండి రాజ్య పాలనలో సహకరించండి' అని వినమ్రంగా చెప్పాడు.

ఒంటరి

వీటిలో ఒక భాగం తప్పించి మిగిలిన అన్నీ రెండుసార్లు ఉన్నాయి. మరి ఆ ఒంటరి భాగం ఏదో చెప్పగలరా?



జవాబులు

ఒంటరి: G (A-E, B-I, C-F, D-H)

దారి కనుక్కోండి: A-తాబేలు, B-కప్ప, C-గుర్రంకంటే చాపు, D-పంబర, E-ఆక్టోపస్.

రంగులేద్దాం: 1. చాపకింద, 2. పంచాదారం, 3. ఛాయాచిత్రం, 4. పుట్టగొడుగు, 5. ఫ్రిజ్, 6. పరదా

జవాబు



మూడు బొమ్మలు: 1. బంగారపు పుల్ల, 2. చాయ్ పైపుల్ని, 3. చాయ్ కప్పుల్ని, 4. చాయ్ చెంచా, 5. పాలు, 6. జగ్గు కప్పుల్ని, స్టవ్ 7. టైటన్ పెంపుడు జంతువు పేరేంటో జాబితా 8. పరిశీలకుడి చూపులు దేనిపై 9. ఆరడుగుల దూరాలు 10. పరాయి దేశం

జవాబు



చంద్రగిరి: C

మూడు బొమ్మలు: 3

దేవకన్యలు నడిచే లోయ ఇదేనా!

హిమాలయాలు స్వర్గానికి మరోపేరు. సమ్మోహితుల్ని చేసే అందం వాటి సొంతం. ఎత్తైన మంచుకొండలూ లోతైన లోయలూ పచ్చిక మైదానాలూ ఎన్నెన్నో ప్రకృతి అందాలు... వాటిల్లో ఓ అద్భుతమే 'ద వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్' అంటోంది ఆ పూలలోయను సందర్శించిన హైదరాబాద్‌కు చెందిన పి.ఎస్.చరణి.

వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ చూడడానికి నేనూ అమ్మా నాన్నా అన్నయ్యా మావయ్యా బయలుదేరాం. ఢిల్లీలో దిగుతూనే ముందుగానే మాట్లాడుకున్న ట్రావెల్స్ వాళ్లు వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు. ఢిల్లీ నుంచి హరిద్వార్‌కు సాయంత్రానికి చేరుకున్నాం. రాత్రి గంగాహారతి చూసి పరిచయస్తులైన బద్రీషాల్ పిట్టిగారి ఆశ్రమంలో బసచేశాం.

నదీ సంగమం!

ఆ మర్నాటి నుంచీ మా నిశ్శబ్ద ప్రయాణం మొదలైంది. అలకనందా నది మా వెంటే పరుగులూ తీస్తూ వస్తోంది. దారిలో దేవప్రయాగ దగ్గర ఆగాం. అలకనందా నది, భాగీరథి నదితో కలిసే చోటు ఇది. భాగీరథి నది గంగోత్రి నుంచి వస్తుంది. తరవాత రుద్రప్రయాగ వచ్చింది. హరిద్వార్‌కు సుమారు 165 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అలకనందా నది మందాకిని నదిలో కలుస్తుంది. ఈ రెండు నదుల సంగమదృశ్యం మంత్రముగ్ధుల్ని చేస్తుంది. రుద్రప్రయాగలో ఆ రాత్రి గెస్ట్ హౌస్‌లో బస చేశాం. ఉదయాన్నే ఆరుగంటలకు కారులో బయలుదేరి రెండున్నర గంటలు ప్రయాణంచేసి గోవిందఘాట్‌కు చేరుకున్నాం. ఇది చాలా చిన్న ఊరు. అక్కడ వేడివేడి పరోటాలు తిని, టీ తాగాక మళ్లీ మా ప్రయాణం మొదలైంది. ఇక్కడ నుంచి మా ప్రయాణం గుర్రాల మీద సాగింది. గోవిందఘాట్ నుంచి ఘాంగారియాకు 13 కిలోమీటర్లు. అప్పుడే వర్షం సన్నగా మొదలైంది. మరో పక్క చలి. సన్నని దారి. అదీ మెలికలు తిరిగి రాళ్లతో నిండి ఉంది. అలవాటయిన దారి కావడంతో గుర్రాలు మాత్రం ముందుకు సాగిపోతున్నాయి. వాటిని పేర్లు పెట్టి పిలుస్తుంటే అవి స్పందించడం చూస్తే చిత్రంగా అనిపించింది. నా గుర్రం పేరు బాదుషా. గుర్రంమీద ప్రయాణం భయంగా అనిపించినా చుట్టూ అందంగా కొలువుతీరిన కొండల్నీ గుట్టల్నీ చూస్తూ ఆ భయాన్ని మరిచిపోయాం. అలా ఆరు గంటలు ప్రయాణించాక గుర్రాలకు విశ్రాంతి కోసం అరగంట ఆపారు. అక్కడే మేం కూడా పరోటాలు తిని టీ తాగాం. ఇవి దారిపొడవునా దొరుకుతాయి. లోయలో లక్ష్మణగంగ పరుగులు తీస్తూ ప్రవహిస్తోంది. అది కిందకి పరుగులు తీస్తుంటే మేం పైకి ఎక్కుతున్నాం. మధ్యలో భ్యుందర్ గంగ అనే జలపాతం కనిపించింది. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఘాంగారియా చేరాం.

దేవభూమిగా పిలిచే పూలలోయ ఇదే

అలకనందా, భాగీరథి నదుల సంగమం... దేవ ప్రయాగ!

ఘాంగారియా మనుషులు నివసించే చివరి ఊరు. చాలా చిన్న ఊరు. ఇక్కడి ప్రజలు చాలా మంచివాళ్లు. యాత్రికులపై ఆధారపడి జీవిస్తుంటారు. ఊరిని చాలా శుభ్రంగా ఉంచుతారు. ఊరంతా ఓ ఎన్‌జీవోలా ఏర్పడి ప్లాస్టిక్ ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ప్రయాణికులు తెచ్చే నీళ్ల సీసాలూ, ప్లాస్టిక్ సంచులూ అన్నీ కట్టకట్టి డెహ్రాడూన్‌కి పంపిస్తున్నారు. ఆ సన్నని దారిలో ప్రతి కిలోమీటరుకీ ఇద్దరు చొప్పున ఆ చలిలో రోడ్డు శుభ్రం చేస్తోన్న వాళ్లను చూస్తుంటే చాలా బాధ కలిగింది. వాళ్ల కష్టం చూశాక ఇక ప్లాస్టిక్ వాడకూడదు అనిపించింది. జూన్ నుంచి అక్టోబర్ వరకూ మాత్రమే ఇక్కడ ఉంటారు. తరవాత చలి పెరుగుతుంది. ఆ సమయంలో వాళ్లు చమోలి అనే ఊరికి వస్తారు.

ఘాంగారియాలో మేం ముందే బుక్ చేసుకున్న గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నాం. అది చాలా శుభ్రంగా ఉంది. సాయంత్రం ఆరు గంటలకు వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ గురించి షార్ట్ ఫిల్మ్ చూపించారు. రాత్రికి వేడివేడి పరోటాలు చేసి పెట్టారు.

సప్తశృంగ పర్వతం!

మర్నాడు తెల్లవారుజామున 5 గంటలకే మా ప్రయాణం మొదలైంది. హేమకుండ్ సాహిబ్, లోక్‌పాల్ యాత్రకి బయలుదేరాం. ఘాంగారియా నుంచి ఇది 6 కిలోమీటర్లు. 15,500 అడుగుల ఎత్తులో ఉంది. సిక్కులకు పరమపవిత్రమైన గురుద్వారా అక్కడ ఉంది. సిక్కుల గురువైన గురు గోవింద్ సింగ్ గత జన్మలో తపస్సు చేసిన చోటుగా దీన్ని విశ్వసిస్తారు. ఇక్కడి వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. ఇక్కడ గురుద్వారాకు ఎదురుగా స్వచ్ఛమైన నీళ్లతో మెరిసే సరస్సు పేరే హేమకుండ్. ఇక్కడకు వచ్చే భక్తులంతా ఆ చల్లటినీళ్లలో స్నానం చేసి గురుద్వారాకి వెళ్తున్నారు. మేం కూడా అదే పద్ధతిలో వెళ్లి ప్రార్థన చేశాం. అక్కడ అందరికీ వేడివేడి కిచిడీ, టీ ఇచ్చారు. బయట ఓ వ్యక్తి చేతులు కడుక్కోవడానికి వేడినీళ్లు అందిస్తున్నాడు. అక్కడి టాయ్‌లెట్స్ చాలా శుభ్రంగా ఉన్నాయి. పక్కనే ఉన్న లోక్‌పాల్ లక్ష్మణుడి గుడి, ఆ పక్కనే ఉన్న శివుడి గుడి దర్శించుకున్నాం. లక్ష్మణుడు గత జన్మలో శేషసాయి రూపంలో విష్ణుమూర్తిని మోస్తూ సరస్సు అడుగున తపస్సు చేశాడని హిందువుల నమ్మకం. లోక్‌పాల్ అంటే విష్ణుమూర్తికి మారుపేరు. అందుకే హిందువులూ సిక్కులూ కూడా ఈ ప్రాంతాన్ని తపోభూమిగా భావిస్తారు.

హేమకుండ్ సరస్సూ ఆ సరస్సు మీద తేలియాడే మబ్బులూ సరస్సు చుట్టూ ఏడు శిఖరాలతో ఉన్న సప్తశృంగ పర్వతమూ ఆ పర్వతం నిండా ఉన్న బ్రహ్మకమలాలూ... మొత్తంగా ఆ ప్రదేశం అద్భుతంగా తోచింది.

మర్నాడు ఉదయాన్నే 8 గంటలకు మళ్లీ మొదలైంది మా ప్రయాణం... ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఆ పూలలోయ దిశగా సాగాం.

బ్రిటిష్ పర్వతారోహకుడైన ఫ్రాంక్ ఎస్ స్మిత్, ఆర్. ఎల్. హోల్డ్స్‌వర్త్‌లు ఈ వ్యాలీని మొదటిసారిగా ప్రపంచానికి పరిచయం చేశారు. భారతదేశంలో ఉన్న ఎత్తైన పర్వతాలను అధిరోహించే క్రమంలో 1931లో కామత్ పర్వతాన్ని అధిరోహించారు. వారంతా తిరిగి కిందకు వచ్చేటప్పుడు పెద్ద గాలివానలో చిక్కుకున్నారు. వారు ధౌలీ లోయలో


కుటుంబసభ్యులతో వ్యాసకర్త(కుడి చివర)

లోయలో ప్రవహిస్తోన్న లక్ష్మణగంగ

గంసాలీ అనే దిగువ ఊరికి చేరాలి. కానీ వారంతా దారితప్పి భ్యుందర్ వ్యాలీలోకి దిగిపోయారు. అప్పుడే మబ్బులు మెల్లమెల్లగా విడిపోతున్నాయి. అలా మబ్బులు విడిపోయాక వారంతా ఓ అద్భుత దృశ్యాన్ని చూశారు. అదే 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్'... అక్కడ ఎటు చూసినా తివాచీ పరచినట్లున్న పువ్వుల్ని చూడగానే వాళ్లు అలానే ఉండిపోయారట. అప్పటి వరకూ దీని గురించి బయటి ప్రపంచానికి తెలీదు. స్థానికులైన పర్వతవాసులకు మాత్రమే తెలుసు. దీన్ని వాళ్లు పార్వతీదేవి ఉద్యాన వనమని విశ్వసించేవారు. దేవభూమిగా పిలిచేవారట. అందుకే ఆ వనంలోకి అడుగు పెట్టేవారు కాదు. మానవులు అక్కడకు వెళ్తే దేవతలు శపిస్తారని భావించేవారు. ఈ లోయ భూమికి 3,658 మీటర్ల ఎత్తులో ఉంది. 1982లో ఈ లోయను 'నేషనల్ పార్క్ ఆఫ్ ఇండియా'గా గుర్తించారు. ఇప్పుడు ఇది ప్రపంచ వారసత్వ సంపదల్లో ఒకటి.

అదిగో పూలలోయ!

అందమైన ప్రకృతిలో ఆనందంగా నడుస్తూ పార్కు సమీపంలోకి చేరుకున్నాం. టిక్కెట్ కొనుక్కుని లోపలకు అడుగుపెట్టాం. అక్కడ అంతా కాలినడకనే వెళ్లాలి. నాలుగు కిలోమీటర్లు నడిచిన తరవాత అసలైన వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ లోయ వస్తుంది. దారంతా పరచుకున్న రకరకాల మొక్కలూ పువ్వులూ చూస్తూ పక్షుల కిలకిలలు వింటూ మెల్లగా నడిచాం. దారిలో పుష్పావతి నదిదాటి వ్యాలీ చేరుకున్నాం. అప్పటికే సన్నని వాన మొదలయింది. ఒకచోట పెద్దరాయి ఉంది. దానిమీద బామినిదౌర్ 3,300 మీటర్లు అని రాసి ఉంది. అక్కడకు చేరుకున్నాం. అదే వ్యాలీకి మొదటి మెట్టు. అక్కడనుంచి లోపలకు ఎంత నడిచినా అక్కడ రకరకాల రంగురంగుల పూలే. మొత్తం ఎనిమిది కిలోమీటర్ల పొడవునా ఈ పూలవనం కనిపిస్తుంటుంది. మధ్యమధ్యలో చిన్న చిన్న జలపాతాలతో వెనకనుంచి తొంగిచూసే పర్వత శిఖరాలతో ధవళకాంతులతో మెరిసే పుష్పావతీ నదీ ప్రవాహంతో అద్భుతంగా ఉందా ప్రాంతం. ఆర్కిడ్లూ, పాపీలూ, కోబ్రాలిల్లీలూ, బంతిపూలూ, డైసీలూ... ఇలా రకరకాల పువ్వులూ వాటిమీద వాలిన సీతాకోకచిలుకలూ మరెన్నో రకాల కీటకాలూ... అవన్నీ మనల్ని మరోలోకంలో విహరింపజేస్తాయి. ఈ పూల సందర్శనకు జూన్ నుంచి ఆగస్టు వరకూ మంచి సమయం.

అవన్నీ మనసారా ఆస్వాదించి తిరిగి 4 గంటలకు హోటల్‌కు చేరుకున్నాం. అక్కడ ప్రతిరోజూ వానపడుతుందని ముందే హెచ్చరించారు. అందుకే ఆ రాత్రికి అక్కడే హోటల్‌లో ఉండి మర్నాడు ఉదయాన్నే గుర్రాలమీద బయలుదేరి గోవిందఘాట్‌కు చేరుకున్నాం. గుర్రాలమీద ప్రయాణం చేయలేనివాళ్లకి ఘాంగారియా వరకూ హెలికాప్టర్ సదుపాయం ఉంది. ఘాంగారియాలో చాలా హోటల్స్ ఉన్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉన్న ఈ లోయ ఢిల్లీ నుంచి సుమారు 500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఢిల్లీ నుంచి హరిద్వార్‌కి రైలు లేదా రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించవచ్చు. వ్యాలీ ప్రయాణంలో చలీ వర్షం రెండూ ఉంటాయి. అందుకే రెయిన్‌కోట్‌లూ ఉన్ని దుస్తులూ సన్‌స్క్రీన్‌లోషన్లూ... తప్పనిసరి. మొత్తమ్మీద పూలలోయ సందర్శన కోసం చేసిన ప్రయాణం ఓ అందమైన కలలా చందమామ కథలా అనిపించింది.

రాశి ఫలం

గ్రహబలం (డిసెంబరు 2 - 8)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఎన్ని సమస్యలున్నా మానసికంగా దృఢంగా, ఆత్మవిశ్వాసంతో ఉంటారు. ఒక శుభవార్త వింటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ దుందుడుకు స్వభావంతో శత్రువులను పెంచుకుంటారు. ఖర్చులు పెరుగుతాయి. గతంలో చేసిన చెడ్డపనుల ఫలితాన్ని ఇప్పుడు అనుభవించాల్సి వస్తుంది. శివాలయ సందర్శన, శివారాధన చేయడం మంచిది.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

సమయానికి మిమ్మల్ని ఆర్థికంగా ఆదుకునేవాళ్లు వస్తారు. ఉన్నతవిద్యా ప్రణాళికలు అనుకూలిస్తాయి. సొంతింటికి సంబంధించిన ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. కొన్ని వ్యవహారాల్లో మీరు రాజీపడకపోవడం వల్ల బంధుమిత్రులతో అభిప్రాయభేదాలు రావొచ్చు. కుటుంబ సభ్యుల్లో ఒకరి అనారోగ్యం మిమ్మల్ని ప్రశాంతంగా ఉండనివ్వదు. దైవారాధన మానకండి.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆరోగ్యం సహకరిస్తుంది. ఆప్తులను చేజేతులా దూరం చేసుకున్నందుకు బాధపడతారు. భవిష్యత్ ప్రణాళికలు వేస్తారు. మీ శ్రమకు గుర్తింపు లభిస్తుంది. ఒక వార్త మిమ్మల్ని బాధపెడుతుంది. ఆర్థిక విషయాల్లో ఇబ్బందులు కాస్త తగ్గుతాయి. అనవసర ఖర్చులు వస్తాయి. ఒక సంఘటన మీ మనో ధైర్యాన్ని పెంచుతుంది. లక్ష్మీదేవి ఆరాధన సత్ఫలితాలనిస్తుంది.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

భవిష్యత్ ప్రణాళికలు వేయడానికీ, వాటిని ప్రారంభించడానికీ అనువైన సమయం. ఆర్థికంగా స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. బుద్ధిబలం బాగుంటుంది. చేపట్టిన పనులను విజయవంతంగా పూర్తిచేస్తారు. మీ ప్రతిభను పైఅధికారులు గుర్తిస్తారు. శ్రమ కాస్త ఎక్కువగా ఉంటుంది. స్వల్ప అనారోగ్య సమస్యలను మినహాయిస్తే ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

శుభకార్యక్రమాలలో పాల్గొంటారు. ఒక వార్త మీ ఇంట్లో ఆనందాన్ని నింపుతుంది. చేపట్టిన పనుల్లో ఇబ్బందులున్నా పూర్తిచేయగలుగుతారు. ఒక ముఖ్యమైన వ్యవహార ఫలితం మీకు అనుకూలంగా రావొచ్చు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య సమస్యలు తగ్గుతాయి. మీ పనితీరుతో అందరి ప్రశంసలూ అందుకుంటారు. శివారాధన చేస్తే బాగుంటుంది.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మీకు అనుకూలమైన సమయం. ఆర్థిక ఇబ్బందులు తగ్గి, ఆదాయ మార్గాలు పెరుగుతాయి. శుభకార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్యం అన్నివిధాలా సహకరిస్తుంది. విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. మనసు చెడ్డపనుల మీదికి మళ్లుతుంది. బంధువులతో మనస్పర్థలు రావొచ్చు. సొంతింటి ప్రయత్నాలు సానుకూలమవుతాయి.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఈ వారం శుభాశుభ మిశ్రమం. అనుకున్న పనులను అనుకున్నట్టు పూర్తిచేయలేకపోతారు. ఒక వార్త లేదా సంఘటన మీ ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. అనారోగ్య సమస్యలు కాస్త ఇబ్బందిపెడతాయి. అధికారులు మీ వైఖరిపట్ల అసంతృప్తితో ఉంటారు. శ్రమ ఎక్కువవుతుంది. ఒక నిర్ణయానికి కట్టుబడి ఉండరు. శివపార్వతుల ఆరాధన సత్ఫలితాలనిస్తుంది.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

కాస్త అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఒక సంఘటన మీకు మనస్తాపాన్ని కలిగిస్తుంది. అకాల భోజనం వల్ల స్వల్ప అనారోగ్య సమస్యలుంటాయి. చేపట్టే పనుల్లో ఆటంకాలు వస్తుంటాయి. ఒక ముఖ్య విషయమై పైఅధికారులను కలుస్తారు. నిర్ణయం వాయిదాపడొచ్చు. ప్రయాణాలు తప్పకపోవచ్చు. కానీ, అవి మీకు ఉపయోగపడవు. దైవారాధన మరిచిపోవద్దు.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

బంధుమిత్రులతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారు. ప్రయాణాలు లాభిస్తాయి. శారీరక బలం ఇనుమడిస్తుంది. సంతానాభివృద్ధికి సంబంధించిన ఒక శుభవార్త వింటారు. చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయి. కంటి సమస్యలు కాస్త ఇబ్బందిపెడతాయి. కుటుంబంలో చిన్నపాటి గొడవలు జరగొచ్చు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసుకుంటారు. శుభకార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయానికి తగ్గట్టే ఖర్చులుంటాయి. వృత్తి ఉద్యోగాల్లో చిన్నపాటి ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. కోపాన్ని తగ్గించుకోక పోతే బంధుమిత్రులతో మనస్పర్థలు వచ్చే ఆస్కారముంది. ఒక శుభవార్త వింటారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఒక ముఖ్యమైన విషయమై పైఅధికారులను సంప్రదిస్తారు. నిర్ణయం మీకే అనుకూలంగా వస్తుంది. చిన్నచిన్న సమస్యలు మినహాయిస్తే ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది. చేపట్టే పనులను పట్టుదలతో పూర్తిచేస్తారు. ఒక నిర్ణయానికి కట్టుబడి ఉండరు. నిర్ణయాలను మారుస్తుంటారు. ఒక శుభవార్త, ఒక దుర్వార్త వింటారు. దైవారాధన మానకండి.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కీలకమైన పనులు ప్రారంభించడానికి అంత అనుకూలమైన సమయం కాదు. బంధుమిత్రులను కలుస్తారు. చేతికి రావాల్సిన డబ్బు వచ్చినట్టే వచ్చి జారిపోతుంది. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో అభిప్రాయభేదాలు వస్తాయి. అనవసరంగా ఆందోళనపడుతుంటారు. చేపట్టే పనుల్లో ఇబ్బందులు వచ్చినా పూర్తిచేస్తారు. శివారాధన తప్పనిసరిగా చేయాలి.

బంధాలూ అనుబంధాలు

'నిశ్శబ్ద జలపాతాలు' కథాసంపుటి పేరుకు తగినట్టే సరళమైన శైలితో సాగే కథావాహిని. రచయిత్రి పొత్తూరి జయలక్ష్మి తన భావ వ్యక్తీకరణతో ఆకట్టుకుంటారు. నేల విడిచి సాము చేయకుండా, అర్థంలేని నాటకీయత లేకుండా కథలన్నీ అలరింపజేస్తాయి. 'అన్నీ మంచి శకునములే' మూఢనమ్మకాల్ని ఎండగడితే, 'మనసు పాడింది సన్నాయి పాట' అపార్థాల అనర్థాల్ని ప్రకటిస్తుంది. 'నిశ్శబ్ద జలపాతాలు' మంచి మనసుల మనోభావాల్ని వెల్లడిస్తుంది. 'నిస్సహాయుడు'లో రామయ్య పాత్ర ప్రకృతితో పెనవేసుకున్న అనుబంధానికి ప్రతీక. 'అనురాగ పొదరిల్లు' జీవనసంధ్యలో ఉన్న ఓ మగువ ఆశల హరివిల్లును ఆవిష్కరిస్తుంది. రచయిత్రి విభిన్న కథావస్తువుల్ని ఎంపిక చేసుకుని, వాటిని బలమైన కథా కథనాలతో మలచిన తీరు ప్రశంసనీయం.

నిశ్శబ్ద జలపాతాలు; రచన: పొత్తూరి జయలక్ష్మి
పేజీలు: 118; వెల: రూ.80/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– కావూరి లాస్య శ్రీనిధి

బలమైన అభివ్యక్తి



మానవ హక్కులే శ్వాసగా జీవించిన కె.బాలగోపాల్ కలం నుంచి జాలువారిన వ్యాసాల సంకలనం 'మనిషి-మార్క్సిజం'. బాలగోపాల్ రచనా శైలి సరళంగా, సూటిగా, స్పష్టంగా, విమర్శనాత్మకంగా ఉంటుంది. లోతైన అధ్యయనం, విభిన్న కోణాల్లో విశ్లేషణలతో పాఠకుడికి సంపూర్ణ అవగాహన కల్పిస్తుంది. సామ్యవాదం, మార్క్సిజం, కమ్యూనిజం, ప్రజాస్వామ్యం, ఆధునిక చైనా ప్రస్థానం, ప్రజా ఉద్యమాలు, ప్రజా చైతన్యం, రాజ్యహింస గురించి... తన ఆలోచనలు, అభిప్రాయాలను విస్పష్టంగా వివరించే ప్రయత్నం చేశారు. మానవ వికాసానికి దోహదపడని ఏ వ్యవస్థ అయినా కాలక్రమంలో మనుగడ కోల్పోక తప్పదని హెచ్చరిస్తారు. వివిధ అంశాలపై బాలగోపాల్‌తో విభేదించే వారు కూడా మానవహక్కుల పట్ల ఆయన నిబద్ధతను నిస్సంకోచంగా అంగీకరిస్తారు. పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ ఇది.

మనిషి-మార్క్సిజం (వ్యాసాలు); రచన: కె.బాలగోపాల్ పేజీలు: 168; వెల: రూ.100/–
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు.

– *గోపరాజు మల్లపరాజు*

వైవిధ్యమైన కథలు

రచయిత జీవితానుభవం కథను పరిపుష్టం చేస్తుంది. ఏభైఏళ్లకు పైగా కథలు రాస్తున్న అరిగే రామారావులో ఈ వైవిధ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వస్తువు ఎంపిక, కథ నడకలో పరిణామక్రమాన్ని పాఠకులు తేలిగ్గా గ్రహించగలుగుతారు. విదేశాల్లో స్థిరపడ్డ బిడ్డలను తమ విలాసాల కోసం పీల్చిపిప్పి చేసే పెద్దలు (నీ సుఖం కొంత చూసుకో), షేర్‌మార్కెట్‌లో భారీ పెట్టుబడులు పెట్టి దివాలా తీసే మధ్యతరగతి వాళ్లు (తెలుగు తల్లి), చురుకైన కుర్రాడిని బుట్టలో వేసుకుని కాణీ కట్నం లేకుండా పెళ్లి చేసుకునే గడుగ్గాయి ఆడపిల్లలు (ప్రేమబంటు), కుటుంబ సభ్యులతో క్యాంపులకెళ్లి అవతలవాళ్లను దోచుకునే అవకాశవాదులయిన ఆఫీసర్లు (చీర్ల చంద్రలేఖ), వేశ్యావృత్తిలో మగ్గుతూనే సాహిత్యాన్ని ప్రేమించే వారు (సానిపాప)... ఈ కథల్లో మనకి కనిపిస్తారు. ముంబయ్ వేశ్యావాటికల్లో అమ్మాయిల చెర (విముక్తి), వ్యసనం బారిన పడిన వ్యక్తిని చిన్నారులు సంస్కరించిన తీరు (సమ్మె), ఓ తండ్రి విశృంఖల ప్రవర్తన బిడ్డకు శాపంగా మారటం(నీడ) వంటి అంశాలు హృదయాన్ని ద్రవింపచేస్తాయి.

విముక్తి (కథల సంపుటి-3)
రచన: అరిగే రామారావు
పేజీలు: 205; వెల: రూ.100/–
ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ, నవయుగ పుస్తక కేంద్రాలు.

– *సీపీ సారథి*

సినిమా పజిల్

సమాధానాలు

రాజాధిరాజ...: వెంకటేష్
చలి సంగీతం: 1. సిర్పీ 2. మణిశర్మ 3. కీరవాణి 4. ఇళయరాజా 5. దేవిశ్రీ ప్రసాద్.
తమన్నా స్పెషల్: 1. కెమెరామెన్ గంగతో రాంబాబు 2. రెబల్ 3. ఊసరవెల్లి 4. బద్రినాథ్.
అది మొదలు...: 1-సి, 2-ఇ, 3-ఎ, 4-ఎఫ్, 5-బి, 6-డి.
బాబాయ్–అమ్మాయ్–అబ్బాయ్: 1. శ్రీరామరాజ్యం, అదుర్స్ 2. మిత్రుడు, యమదొంగ 3. పల్నాటి బ్రహ్మనాయుడు, అల్లరిరాముడు 4. పరమవీరచక్ర, నరసింహుడు 5. అల్లరిపిడుగు, రాఖీ 6. వీరభద్ర, నాగ.
అన్నదమ్ములు: 1. హరికృష్ణ 2. నగ్మా 3. ముత్యాల సుబ్బయ్య 4. వెంకటేష్ 5. జీవనపోరాటం.
బాలచందర్ ది గ్రేట్: 1. కమలహాసన్ 2. రోజా 3. ప్రకాష్‌రాజ్ 4. సరిత 5. జయప్రద.
ద్విముఖం: బాలసుబ్రమణ్యం, దేవిశ్రీ ప్రసాద్.

బుక్ షెల్ఫ్

హెచ్ఐవి/ఎయిడ్స్ - మీ అవగాహనను పెంచుకోండి!
రచన: పెన్మెత్స సుబ్బరాజు
పేజీలు: 102; వెల: స్వచ్ఛంద సంస్థలకు, సామాజిక కార్యకర్తలకు ఉచితం
ప్రతులకు: నేత్రదాన ప్రోత్సాహక సంఘం 1-122, చార్వాకభవనం, జిన్నూరు-534 265 పోడూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

మన విజయవాడ (కవితా సంకలనం)
సంపాదకుడు: చలపాక ప్రకాష్; పేజీలు: 121; వెల:రూ.50/–
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు.

తెలుగు సినిమా; రచన: చలసాని వెంకటేశ్వరరావు (జగపతి)
పేజీలు: 162; వెల: రూ.200/–; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

ఒక స్థితప్రజ్ఞుని జీవిత చరిత్ర
రచన: వివేకానంద మిట్టపల్లి విఠలాచార్య
పేజీలు: 99; వెల: రూ.40/–
ప్రతులకు: రచయిత, నం.4-482/5, ప్లాట్ నం.78/బి న్యూ బాలాజీనగర్, మీర్‌పేట గ్రామం సరూర్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా.

ఎల్గడి
(ఆదిలాబాద్ జిల్లా కవితా సంకలనం)
ప్రచురణ: తెలంగాణ రచయితల వేదిక
పేజీలు: 119; వెల: రూ.60/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

తూరుపు వెళ్లే రైలు
రచన: ఎమ్.ఆర్.వి.సత్యనారాయణమూర్తి
పేజీలు: 128; వెల: రూ.100/–
ప్రతులకు: ఎమ్.రాజేశ్వరి ఇం.నం. 14-73/6, జేవీఎల్ రావు నగర్ పెనుగొండ-534 320.

పదవినోదం-1119



ఆధారాలు

అడ్డం:

1. వెల్లడించు, శ్వేతం! (3)
3. భద్రం (3)
5. చిల్లి, రంధ్రం (2)
7. ఇది నాది అవునో కాదో! (3)
8. వానకోయిల (3)
9. సోదరి, మీకన్నా పెద్దది! (2)
10. పెళ్ళివారు విశ్రమించే చోటు (3)
12. పదాలు (3)
14. లోన (3)
16. ఆ చేరిస్తే నటుడు, బ్రెట్ జోడిస్తే బౌలర్! (1)
19. తెలుగు పైనాపిల్! (3)
22. ఒక యువనటి (3)
24. శత్రువు (2)
25. ఇంచుమించు (4)
27. సంచరించు (3)
28. గోవిందుణ్ని తలచుకోండి! (3)
30. గజిబిజి సుదతి (3)
32. నాన్న చెల్లెలు! (2)
33. ఖరీదా? (2)
34. ఎండలు మండే రుతువు (2)
36. జీవించిన (4)
38. ధేనువు (2)
39. బొట్టు (3)
41. ప్రపంచంలో (3)
43. అటునుంచి నేరేడు! (3)
45. వైభవం లాంటిది (2)
46. మీదికాదు-కానేకాదు! (2)
47. ఉప్పు (3)
48. యంత్రం (2)
49. అడ్డం 48తో తిరిగి, మళ్ళీ! (1)
50. కష్టం (3)
51. నూరు (2)

నిలువు:

1. వివేకం (3)
2. ఇది గట్టిగా ఉంటే భవంతి దృఢంగా ఉంటుంది! (3)
3. అమెరికాలోని కోస్టారికా, కొలంబియాల దగ్గర్లో ఒక నగరం (3)
4. ముడుపులు (3)
5. బరువులో (3)
6. నక్షత్రం (2)
9. కెరటం (2)
11. తలకిందులైన సామెత! (3)
13. నిలువు 37కి వెయ్యింతలు? (2)
15. దంతం, సుంకం! (2)
17. ఒక పూలమొక్క (3)
18. తాజాగా (5)
19. ఇది కాదు-అది, అక్కడ! (3)
20. వేడుక లాంటిది (3)
21. వెల్లువలా (4)
23. చిన్న ముక్కలుగా చేయు (3)
26. పరిధి (2)
29. ఇరవైని ఇలాగంటారు (3)
31. సీతాన్వేషణలో వానరదండును నియోగించి రాముడికి తోడ్పడిందెవరు? (4)
33. ముందర కాదు (4)
35. మాసం (2)
36. వేడుకొను, అర్థించు (4)
37. వెయ్యి గ్రాములు (2)
39. భుజించే (2)
40. సింహం (4)
42. పక్షంలో తొమ్మిదో తిథి (3)
44. జమదగ్ని ధర్మపత్ని! (3)

సుడోకు-163

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

1	3							
				4	6			9
		6	3			4		
3	2			5			8	
			6		7			
	4			8			5	1
		5			9	6		
4			7	6				
							3	4

సమాధానాలు

పదవినోదం-1118



సుడోకు-162

1	6	3	9	8	2	7	4	5
9	2	8	7	4	5	1	3	6
7	5	4	1	3	6	9	2	8
6	3	5	2	7	1	8	9	4
4	7	9	6	5	8	2	1	3
2	8	1	3	9	4	6	5	7
8	1	7	5	2	3	4	6	9
5	4	2	8	6	9	3	7	1
3	9	6	4	1	7	5	8	2

నలుపంటే నలుపూ కాదు...

తోటలో కలియతిరుగుతూ సందడి చేసే ఉడుతకు కారుమబ్బు రంగును అద్దిందెవరు?

చారలతో రాజసం ప్రదర్శించాల్సిన పులి కాళరాత్రి రంగును పులుముకుందేంటి?

ఛెంగుఛెంగున ఎగురుతున్న లేడిపిల్ల అలా 'నల్ల'బోయిందేంటి?

ఇక్కడున్న బల్లులు, కప్ప, పాము, సీల్‌చేప వంటివాటిని చూస్తే... ఎవరి మనసైనా ఇలాంటి సందేహాల వేదిక కావాల్సిందే. నిజానికి ఈ రంగు వాటికి అవి పూసుకున్నదీ కాదు, మరెవరో వేసిందీ కాదు... పుట్టుకతోనే వచ్చింది.

మనిషైనా జంతువైనా- తమ సహజ శారీరక లక్షణాలకు భిన్నంగా- ఇలా పూర్తి నల్లగా లేదా తెల్లగా మారడం ఒక వ్యాధి. ఉదాహరణకు, కొంగ తెల్లగా కాకి నల్లగా ఉండటం సహజం. అదే, కాకి తెల్లగా కొంగ నల్లగా ఉంటే- అది రోగం. శరీరంలో 'మెలనిన్' అనే పిగ్మెంట్ ఎక్కువగా ఉంటే మేనిఛాయలో నల్లదనం పెరుగుతుంది. దీన్ని మెలనిజమ్ అంటారు (ఈ పిగ్మెంట్ అసలు లేకపోతే శరీరం తెల్లగా మారుతుంది. దాన్ని ఆల్బినిజమ్ అంటారు). ఇక్కడున్న జంతువులన్నీ 'మెలనిజమ్' వ్యాధితో ఉన్నవి.

కుందేళ్లూ లేళ్లూ వంటివాటిని వేటాడే జంతువులు మామూలువాటి జోలికి వెళ్తాయిగానీ ఈ నల్లని వాటి దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడవట. అంటే, ఈ జబ్బువల్ల వాటికి కొంత లాభమేనన్నమాట.

అత్యాధునిక సేద్యం
అన్నదాత తోనే సాధ్యం

- ఆయా సీజన్లకు, నేలలకు అనువైన పంటల ఎంపిక-సాగు వివరాలు
- కూలీల సమస్యలనధిగమించే ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు
- ప్రగతిపథంలో నడుస్తున్న అభ్యుదయ రైతుల అనుభవాలు
- సమగ్ర సస్యరక్షణ, సమగ్ర ఎరువుల వాడకం
- సాగునీటి పొదుపు మార్గాలు
- పంటమార్పిడి విధానాలు, అంతరపంటల సాగుతో లాభాలు
- రైతుల సందేహాలు తీర్చే జాబులు - జవాబులు
- స్వయం ఉపాధి పథకాలు, పెరటి తోటల పెంపకం
- పాడి, పట్టు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, చేపలు, రొయ్యలు, పుట్టగొడుగుల పెంపకంపై సమగ్ర వివరాలు
- పంటల ఎగుమతులు, రాయితీలు , బీమాలపై ప్రత్యేక అంశాలు

డిసెంబరులోగా
అన్నదాత సంవత్సర చందా
రూ.150 లు చెల్లించండి.
నెలనెలా అన్నదాత సంచికలను పొందడంతో
బాటు వ్యవసాయ సమగ్ర సమాచారదర్శిని
అన్నదాత 2013 డైరీని
అందుకోండి

అన్నదాత డైరీ
చందాదారులకు
మాత్రమే లభించే
ప్రత్యేక కానుక

చందాను మీ సమీపంలోని 'ఈనాడు' కార్యాలయంలో గానీ, 'ఈనాడు ఏజెంటు'కు గానీ లేదా మీ వద్దకు వచ్చే మా ప్రతినిధికి గానీ చెల్లించి **'అన్నదాత 2013 డైరీ'ని** పొందండి.

చందాను మాకు నేరుగా పంపేవారికి డైరీని 'రిజిష్టర్ పార్శిల్'గా పంపిస్తాం. దీనికోసం అదనంగా **రూ.60**లు కలిపి, మొత్తం **రూ.210**లు పంపించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని మనియార్డర్ లేదా డీడీ ద్వారా పంపించండి. దానితోపాటు మీ పూర్తి చిరునామానూ, పిన్‌కోడ్‌నూ స్పష్టంగా పేర్కొనడం మరచిపోకండి.

మీ చందాను పంపాల్సిన మా చిరునామా:

మేనేజర్, 'అన్నదాత', ఈనాడు కాంప్లెక్స్,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082

ఈనాడు
ఆదివారం
9 డిసెంబరు 2012

వాళ్లంటే... వీళ్లకి ఇష్టం

ఒకప్పుడు... కండలు తిరిగిన హీరోలూ జీరో సైజ్ హీరోయిన్లూ అంటే బాలీవుడ్‌వైపు చూడాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు... మన తారలూ శరీర సౌష్టవంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. కుర్రహీరోలూ హీరోయిన్లూ జిమ్ములో శ్రమిస్తున్నారు. వాళ్లందర్నీ మనం ఇష్టపడుతున్నట్టే... వారు ఇష్టపడే కండల తారలూ ఉంటారు. మరి, తారల అభిమాన తారలెవరో తెలుసుకుందామా...

ఆనందమే ఆరోగ్యం

'ఫిట్‌గా ఉండటం అనేది మనం ఫీలవడంలో ఉంటుంది. నేను ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకంగా ఏమీ చేయను. జిమ్‌కి వెళ్లడం కూడా అరుదే. కొన్నాళ్లు డాన్స్ చేసేదాన్ని. ఇప్పుడు వీలుంటే స్విమింగ్ చేస్తున్నాను. ఇవే నా ఆరోగ్య రహస్యాలు. హృతిక్ రోషన్ బాడీ అంటే చాలాచాలా ఇష్టం. బాడీ అంటే అలా ఉండాలనిపిస్తుంది. అందుకే అతడే నా అభిమాన హీరో.'

- తాప్సీ

అలా... కష్టమే

'ఏళ్ల తరబడి ఒకేలా శరీరాకృతిని కాపాడుకోవడం చాలా కష్టం. నేను చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను... ఏంజెలీనా జోలీ ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. బాలీవుడ్‌లో బిపాషా బసు సూపర్ ఫిట్‌గా ఉంటుంది. దీపికా పడుకొనె శరీరాకృతి నాకెంతో నచ్చుతుంది. వీళ్లు ఆహారం విషయంలో ఎంతో శ్రద్ధగా ఉంటారు. నా వరకూ... యోగా చేస్తాను. శారీరక మానసిక ఆరోగ్యానికి ఇదొక్కటే చాలు అనిపిస్తుంది.' - కాజల్

అసలైన ఫిట్‌నెస్

'బయటకి కనిపించేదంతా ఫిట్‌నెస్ కాదు. అది లోపల్నుంచీ ఉండాలి. బయట కన్పిస్తున్న వాళ్లందరూ లోపల్నుంచి ఎంత ఫిట్‌గా ఉంటున్నారో నాకు తెలీదు. నా వరకూ అయితే ఎక్కడున్నా క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తాను. నాగచైతన్య కూడా చాలా ఫిట్‌గా ఉంటాడు. ఎందుకంటే వాడు చేస్తున్న వ్యాయామాలూ ఆరోగ్యంపై చూపిస్తున్న శ్రద్ధా నాకు తెలుసు.' - నాగార్జున

వాళ్ల క్రమశిక్షణే వేరు

'ఫిట్‌నెస్ విషయంలో బాలీవుడ్ తారలు ఎంతో క్రమశిక్షణతో ఉంటారు. క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తారూ డైట్ చార్టు ప్రకారమే భోజనం చేస్తుంటారు. హృతిక్‌రోషన్, సల్మాన్‌ఖాన్, సంజయ్‌దత్... వీళ్ల ఫిట్‌నెస్ లెవెల్స్ చాలా బాగుంటాయి. హాలీవుడ్‌లో అయితే ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్ శరీరాకృతి అంటే చాలా ఇష్టం. ఇక, నా విషయానికొస్తే... వారానికి కనీసం ఐదారురోజులు కచ్చితంగా వ్యాయామం చేస్తాను.'

- రానా

నిద్ర రాదట!

'క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా ఓ వ్యసనంలాంటిదే. ఒక్కోసారి ఏదైనా పనుండీ లేదా ముందురోజు పనెక్కువై జిమ్‌కి వెళ్లలేకపోతే... ఏదో తప్పు చేసినట్టుగా ఉంటుంది. ఇలా అయితే ఆరోగ్యం ఏమైపోతుందో అని భయమేసేస్తుంటుంది. సల్మాన్‌ఖాన్ ప్రతీరోజూ వ్యాయామం చేస్తాడు. ఉదయమో సాయంత్రమో... వ్యాయామం చేయందే మాత్రం నిద్రపోడని విన్నాను. క్రమశిక్షణ అంటే అలానే ఉండాలి కదా' - అల్లు అర్జున్

కష్టమే... తప్పదు

'నా వ్యాయామం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒకసారి స్విమింగ్‌తో సరిపెట్టుకుంటే... మరోసారి యోగా చేస్తాను. చేసే సమయం కూడా అంతే... వీలుంటే ఉదయం చేస్తాను. లేకుంటే సాయంత్రం. వారంలో ఇన్ని రోజులు చేయాలని నియమాలేవీ లేవు. ఎప్పుడు సమయం దొరికితే అప్పుడు చేస్తాను. షారుఖ్ ఫిట్‌నెస్ నచ్చుతుంది. ఎందుకంటే... అతడు సినిమాల్లో పాత్రకి తగ్గట్టుగా శరీరాకృతిని ఎంతో చక్కగా మార్చేసుకోగలడు. అలాగే, అమీర్‌ఖాన్, హృతిక్‌ల ఫిట్‌నెస్ చాలా నచ్చుతుంది.' – శ్రియ

లోపల...

చురుక్కు చమక్కు 4

అనాథ బాలలకు... కొత్త కుటుంబం 5

మీ మందు మీ చేతిలో 6

ఇల్లే బడి!

7

విద్యా వ్యవస్థలోని లోపాలు, చదువుల్లోని ఒత్తిడి, కార్పొరేటీకరణలోని వ్యాపారకోణం, పిల్లల వికాసం పట్ల నిర్లిప్తత ... కన్నవారికి కష్టం కలిగిస్తున్నాయి. అతి సహజంగా పిల్లలకు వికాసాన్ని ప్రసాదించాలనే తపనతో ఇంటినే బడిగా మార్చుకుంటున్నారు.

మాట్లాడే బొమ్మలు 11

కథ 12

అవీ ఇవీ 14

మూడోతరం ఆటగాణ్ని 15

గోటికి వెల కట్టగలరా? 16

సీతారాములు నడయాడిన శ్రీశైలం 18

...అయినా కంటతడి పెట్టలేదు 20

అదిగో యుగాంతం! 22

చిన్న బెల్టే పెద్ద ఫ్యాషన్ 23

బాలవినోదిని 24

రుచి అభిరుచి 26

తారలు... గురువులు! 27

రాశి ఫలం 28

సమీక్ష 29

పదవినోదం 30

కోళ్ళ గూటిలో కాకులు

'కుక్కుట గృహమందు కాక ఘకములుండెన్' ...అంటే కోళ్ళ గూటిలో కాకులూ గుడ్లగూబలూ ఉన్నాయట! ఎంత చిత్రమైన సమస్య! ఈ సమస్యను పూరించేందుకు కొప్పరపు వేంకట సుబ్బరాయ, కొప్పరపు వేంకటరమణ కవి సోదరులు ఏకంగా ఓ కథనే అల్లాల్సి వచ్చింది.

ఒక్కడగు బోయ పక్షుల
నక్కజముగ నెన్నొ జాతులనదగు వానిన్
కక్కురితిఁడెచ్చె యొక్కట
కుక్కుట గృహమందు కాక ఘకములుండెన్

కుక్కుటం అంటే కోడి. కానీ దాన్ని ఈ అర్థంలో కాకుండా... కుక్కేయడం అనే అర్థంలో వాడుతూ ఓ కథని అల్లేశారు కవులు. ఒక బోయవాడు అడవికి వేటకి వెళ్లాడు. రకరకాల పక్షులను వేటాడి తెచ్చాడు. వాటన్నింటినీ ఒకే చోట కుక్కాడు అని సమస్యను పూరించారు. 'కుక్కుట' అనే నామవాచకాన్ని క్రియావాచకంగా మార్చి అందంగా ప్రయోగించారు. అలా కుక్కేయడం వల్ల అతడి ఇంట్లో కాకులూ గుడ్లగూబలూ ఒకే చోట ఉన్నాయి అని ఈ పద్యం అర్థం.

మంచిమాట

పర్యవేక్షణతో నిమిత్తం లేకుండా పనులు సజావుగా పూర్తికావడం ఉత్తమ నాయకత్వానికి నిదర్శనం.



మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

యువతకి మార్గదర్శి

'ఓ బ్రిగేడియర్ పల్లెయాత్ర' చాలా బాగుంది. పల్లెల్లో ఉంటున్న మేధావుల ఆవిష్కరణలను గుర్తించి, వాటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే అద్భుతాలు చెయ్యొచ్చు. సామాన్యుడికి అభివృద్ధి ఫలాలను అందివ్వొచ్చు. ఆ దిశగా బ్రిగేడియర్ చేస్తున్న కృషికి అభినందనలు. ఈ వ్యాసం యువతకి మార్గదర్శకం కావాలి.

– *ఝాన్సీ.యు(ఈమెయిల్)*
– *ఎ.అజయ్‌కుమార్, మెట్‌పల్లి*

మనం మారాలి

'కనువిప్పు' కథ నిజంగానే కనువిప్పు కలిగించేలా ఉంది. ఈతరం తల్లిదండ్రుల్లో చాలామంది డబ్బే సర్వస్వం అనుకుంటున్నారు. పిల్లల్ని పెంచడం అంటే... వాళ్ల కోసం డబ్బుని కూడబెట్టడమే అనుకుంటున్నారు. అలాంటి వారిలో ఈ కథ కాస్తైనా మార్పు తెస్తుంది.

– *ఎన్.లక్ష్మణ్(ఈమెయిల్)*
– *ఆరుద్ర శ్రీవిద్య, ముల్కలపల్లి*

నూతనోత్సాహం

'నిరాశకు నో చెబుదాం' స్ఫూర్తిదాయకంగా ఉంది. మనల్ని నిరాశలోకి నెట్టేసే అంశాలు చాలా ఉంటాయి. అన్ని సందర్భాల్లో మనల్ని ఓదార్చడానికి స్నేహితులో బంధువులో అవసరం లేదు. కొన్ని వెబ్‌సైట్లు కూడా మనలో నూతనోత్సాహాన్ని నింపుతాయన్న విషయం తెలుసుకున్నాం.

– *లక్ష్మి, నెల్లూరు*
– *సీహెచ్.రాజారామ్(ఈమెయిల్)*

ఇంద్రజాలం

'లీ ఎక్కడున్నావ్' చూపుతిప్పుకోనివ్వలేదు. నిజంగానే... చిత్రాల్లో లీ ఎక్కడున్నాడో వెతుక్కునేసరికి చాలాసేపే పట్టింది. మమ్మల్ని చాలా ఆశ్చర్యానికి గురిచేసింది. 'ఓ బ్రిగేడియర్ పల్లెయాత్ర' ఎంతో నచ్చింది. అభివృద్ధి ఫలాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నం అభినందనీయం.

– *జి.వి.ఫణిభూషణ్, విజయవాడ*
– *గులాబీల మల్లారెడ్డి, కరీంనగర్*

చైతన్యం

'సామాన్యుడే విలేకరి' విజ్ఞానదాయకంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యానికి ఇదో నాంది కావాలి. వీడియో వాలంటీర్లను 'గ్రామీణ రాయిటర్స్‌గా' తీర్చిదిద్దాలనుకుంటున్న జెస్సికా, స్టాలిన్‌ల లక్ష్యం చాలా గొప్పది. 'కనువిప్పు' కథ ఆలోచింపజేసింది. ఈతరం తల్లిదండ్రులూ పిల్లల పెంపకంపై వారి ఆలోచనలకు అద్దం పట్టింది. పిల్లల్ని పెంచడం అంటే డబ్బు సంపాదించి పెట్టడమే అనుకుంటున్నవారికి ఇదో కనువిప్పు.

– *పెరవలి మృత్యుంజయశర్మ, నెల్లూరు*
– *ఎన్.రాము, జిల్లేడువలస, శ్రీకాకుళం*

అన్నిటా ప్రత్యేకం

'అంకెలకీ ఓ లెక్కుంది' నచ్చింది. సినీతారల కార్లు... వాటిపై ఉండాల్సిన నంబర్ల విషయంలో వారు తీసుకుంటున్న జాగ్రత్తలూ వాటి వెనక ఉన్న సెంటిమెంట్లూ బాగున్నాయి. 'ఆ హ్యాపీడేస్ మళ్లీరావు' అంటూ యువ సంగీత దర్శకుడు మిక్కీ జె మేయర్ చెప్పిన ముచ్చట్లు బాగున్నాయి. ఆయన స్వరాలు మెలోడీ ప్రధానంగా వినసొంపుగా ఉంటాయి. 'బాల వినోదిని' పజిల్స్ మెదడుకు పదునుపెట్టేలా ఉన్నాయి.

– *వి.ఎస్.కె.రాజేష్‌కుమార్, పుట్టపర్తి*
– *ఆర్.జాన్సన్ రాజు, విజయవాడ*

చురుకు


విద్యుత్ రవాణా ఛార్జీల వడ్డింపే ఉత్పాదన
విద్యుత్ బిల్లుకోసం దారుడు
పాత ఛార్జీలు
ఛార్జీలు
సర్ఛార్జీలు

కర్ణాటక బీజేపీ
కాంగ్రెస్ పార్టీ
యడ్యూరప్ప


అమ్మా వలియా
మన్మోహన్
చిదంబరం
ఎకానమీ
5.3% వృద్ధి

చమకు


మోడీ
నగదు బదిలీ
గుజరాత్ ఓటర్లు

అనాథ బాలలకు... కొత్త కుటుంబం

అందరిలాగే ఆ ప్రభుత్వోద్యోగులు కూడా వార్తాపత్రికలు చదువుతారు. అందులోని కొన్ని వార్తలు వాళ్లను ఆలోచింపజేశాయి. ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టేలా చేశాయి.

నవంబరు 14... ఆ స్కూల్లో సందడే సందడి. ఎందుకంటే, స్కూల్లోని మొత్తం 70 మంది విద్యార్థుల్లో 44 మంది పుట్టినరోజు ఆ రోజు. వాళ్లంతా కొత్త బట్టలు వేసుకున్నారు. కేక్ కట్ చేశారు. వాళ్ల నవ్వుల పువ్వులతో ఆ స్కూలు వాతావరణంలో ఆనందం గుబాళించింది.

'44 మంది ఒకేరోజు పుట్టారా?' అని ఆశ్చర్యంగా ఉంది కదూ.

వాళ్లలో ఎంతమంది ఆరోజున పుట్టారో కచ్చితంగా తెలీదు. ఎందుకంటే... అందరూ అనాథలే. అలాంటివాళ్లకు కొత్త కుటుంబాన్నిచ్చింది వరంగల్ జిల్లాలోని సాయి అనాథ సేవాసంస్థ.

ప్రభుత్వ ఉద్యోగులే...

వేళకు వెళ్లడం, వేళకు రావడం... బోలెడన్ని సెలవులు... జీతానికీ జీవితానికీ ధీమా... ప్రభుత్వ ఉద్యోగానికి మరేదీ సాటిరాదు. కానీ, అందరూ వీటితో సంతృప్తి చెందరు. సమస్యలున్నా, సాఫీగా సాగిపోతున్నా జీవితంలో ఇంకేదైనా సాధించాలని ఆరాటపడుతుంటారు. అలాంటి ప్రభుత్వోద్యోగులే వరంగల్‌లో ఎనిమిదిమంది కలిశారు.

వేర్వేరు శాఖల్లో పనిచేసే వీళ్లను కలిపినవి... 'వార్తలు'. వీధి బాలలూ, అనాథ పిల్లల గురించి పత్రికల్లో వార్తలు వస్తుంటాయి. వాటిని చదివి 'అయ్యో పాపం' అనుకుంటారు చాలామంది. వీళ్లూ అలాగే బాధపడ్డారు. కానీ, అంతటితో ఆగిపోకుండా చిన్నారులకోసం ఏదైనా చేయాలనుకున్నారు.

తొలి అడుగు...

సాయి అనాథ సేవాసంస్థ... ఆ ఎనిమిది మంది ఆలోచనలకు ప్రతిరూపమిది. దీనికోసం వీళ్లంతా చందాలు వేసుకుని రూ.1.65 లక్షలు పోగుచేశారు.

రోజూ పత్రికల్లో అనాథ పిల్లల గురించి వచ్చే వార్తలను చదివి... వాళ్ల గురించి ఆరా తీసేవారు. వాళ్లను దగ్గర్లోని ప్రభుత్వ లేదా ప్రైవేటు స్కూల్లో చేర్పించేవారు. ప్రతి చిన్నారికీ ఖర్చులకోసం నెలకు రూ.100, ఆహారం కోసం నాలుగు కిలోల బియ్యం పంపించేవారు. అలా 2001లో ప్రారంభమైన ఈ సేవాసంస్థద్వారా మొదట్లో 18 మంది చిన్నారులకు సాయంచేసేవారు. తరవాత ఆ సంఖ్య 40కి పెరిగింది. ఇలా చేస్తున్నా వీళ్లలో ఏదో అసంతృప్తి. తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనుకున్నారు. ముఖ్యంగా అనాథ చిన్నారులకు 'ఒక కుటుంబాన్ని' ఇవ్వాలనుకున్నారు. కానీ, డబ్బులు?

సొంత స్థలమిచ్చి...

మరికొందరు స్నేహితులకు తమ ఆలోచనను చెప్పారు. దాంతో ఎనిమిదిమంది కాస్తా 20 మంది అయ్యారు. నాలుగు రాళ్లు సంపాదించగానే సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకుంటాడు సగటు ఉద్యోగి. కానీ, రంగయ్య అలా అనుకోలేదు. ఆయనే ఈ ఉద్యోగ బృంద నాయకుడు. హన్మకొండ సమీపంలోని పరిమళ కాలనీ, వివేకానంద నగర్ ప్రాంతంలో ఆయనకు కొంత భూమి ఉండేది. దాన్ని అనాథ చిన్నారుల కోసమే ఇవ్వడానికి ముందుకొచ్చారాయన. దాంతో, మిగిలినవాళ్లు కూడా మరింత డబ్బు విరాళంగా ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అలా పోగైన డబ్బులతో రంగంలోకి దిగారు.

అమ్మమ్మలూ తాతయ్యలను ఇచ్చి...

సాయి స్పందన డిజి స్కూల్... శ్రీరామకృష్ణ పరమహంస వృద్ధాశ్రమం... వాళ్ల ఆలోచనలకు ప్రతిరూపాలివి. స్కూల్లో... ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకూ ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన అందిస్తున్నారు. ఆవరణలో మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం... విశాలమైన తరగతి గదులు... అందమైన బెంచీలతో ఉండే ఈ స్కూలు... ఖరీదైన ప్రైవేటు స్కూల్‌ని తలపిస్తుంది. ఇందులోనే పిల్లలకు హాస్టల్ కూడా ఉంది.

మరీ ముఖ్యంగా, అనాథ చిన్నారులకు తోడుగా ఉండేందుకు వృద్ధులను తీసుకొచ్చారు. 'పిల్లలకు తల్లిదండ్రులు లేనిలోటు తీర్చలేనిది. అందుకే, పూర్వకాలంలో చిన్నారులను తాతయ్యలూ నానమ్మల దగ్గర అలవాటు చేసేవారు. వాళ్లు ఆ లోటు తీర్చడమే కాదు, మన పురాణేతి హాసాల్లోని నీతికథలనూ పిల్లలకు చెప్పేవారు. ఈతరం చిన్నారులకు ఆ అదృష్టం ఉండటంలేదు. మంచి కుటుంబంతోనే మంచి సమాజం ఏర్పడుతుంది. అందుకే, స్కూలుతోపాటూ వృద్ధాశ్రమాన్నీ ఏర్పాటుచేశాం' అంటారు రంగయ్య.

ఇక్కడున్న పిల్లల్లో ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నుంచి వచ్చిన వాళ్లున్నారు. వీరిలో 44 మంది అనాథలు. మిగతావాళ్లంతా తల్లి లేదా తండ్రి లేనివాళ్లు. ఇంతమంది చిన్నారులకు కొత్త జీవితాన్ని ఇవ్వడమే కాదు... 16 మందికి ఉపాధ్యాయులుగా ఉపాధినీ ఇచ్చింది ఈ 'ఉద్యోగ బృందం'.

బీటెక్... బీఈడీ...

స్వచ్ఛంద సంస్థ ప్రారంభం నుంచీ సాయమందుకుంటున్న విద్యార్థుల్లో ఎనిమిది, ఆ పై తరగతులు చదువుతున్న వాళ్లను వేరే విద్యాసంస్థల్లో చేర్పించి, బాగోగులు చూసుకుంటున్నారు. అలా ప్రస్తుతం పదిమంది పదోతరగతి చదువుతున్నారు. అయిదుగురు ఇంటర్, ఒకరు బీఎస్సీ నర్సింగ్, ఇద్దరు బీఈడీ, ఒకరు బీటెక్, మరొకరు పీజీ చదువుతున్నారు.

'వచ్చే ఏడాది నుంచీ ఒక్కో తరగతీ పెంచుకుంటూ పీజీ వరకూ వెళ్తాం. వీలైనంతమంది ఎక్కువ చిన్నారులకు మంచి జీవితం ఇవ్వాలన్నది మా లక్ష్యం' అంటారు రంగయ్య. ఎంత ఉన్నత లక్ష్యమో కదూ!

– *భాస్కర్.బి, ఈజేయస్*

ఫొటోలు: ఎ.సంపత్‌కుమార్, వరంగల్

మీ మందు 48 హోమియో మీ చేతిలో

పాపాయికి జ్వరమొస్తే...



డా॥ పోలూరి కృష్ణాదేవి

శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారన్‌హీట్ ఉండటం జీవధర్మం. ఈ ఉష్ణోగ్రత పెరిగితే 'జ్వరం' అని వ్యవహరిస్తారు. జ్వరం రావటానికి కారణాలు అనేకం. అసలు కారణం తెలియకుండానూ జ్వరం రావచ్చు.

జ్వరాన్ని చర్మంలో ఉన్న రక్తనాళాలు, చెమట గ్రంథులు నియంత్రిస్తుంటాయి. పెద్దల్లో కన్నా పిల్లల్లో ఈ శరీర ఉష్ణోగ్రత నియంత్రణ తక్కువ. అందుకే వేసవిలో పిల్లలే ఎక్కువగా వడదెబ్బకు గురవుతుంటారు. అలాగే ఇన్ఫెక్షన్ల మూలంగానూ అధికంగా జ్వరాల బారినపడుతుంటారు. వీళ్లు పెద్దపెట్టున జ్వరానికి గురికావటం కూడా జరుగుతుంటుంది.

పసి పిల్లల్లో జ్వరాన్ని థర్మామీటరు నోటిలో పెట్టిగాక ఆసనంలో పెట్టి చూడడం సముచితం. ఆసనంలో థర్మామీటరును 4 సెంటీ మీటర్ల లోనికి పెట్టి, 2 నిమిషాలుంచి ఉష్ణోగ్రతను గమనించాలి.

4 సంవత్సరాల వయస్సు దాటిన పిల్లలకు నోటిలో థర్మామీటరును 3 నిమిషాల పాటు ఉంచితే సరిపోతుంది. అదే చంకలోనైతే థర్మామీటరును 5 నిమిషాల పాటు ఉంచి ఉష్ణోగ్రతను గమనించొచ్చు.

శిశువులు జ్వరాలకు గురైనప్పుడు... 'శ్వాస ఆడటం కష్టంగా ఉందా? మాటి మాటికీ చెవి పట్టుకొని గుంజుతున్నారా? మూత్ర విసర్జన బాధాకరంగా ఉందా? విరేచనాలు ఎక్కువగా అవుతున్నాయా?' ...తదితర అంశాలను శ్రద్ధగా గమనించాల్సి ఉంటుంది.

బాక్టీరియా, వైరస్ క్రిముల మూలంగా జ్వరపడినట్లయితే త్వరగానే కోలుకుంటారు. శరీరంపై దద్దు, గ్రంథులు వాచి ఉండడం, ముక్కు కారడం జరుగుతున్నట్లయితే వ్యాధుల నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

జ్వరాలనగానే తరుణ వ్యాధులు గుర్తుకొస్తాయి. తరుణ వ్యాధులు, దీర్ఘవ్యాధుల పట్ల హోమియో వైద్యవిధానంలో ప్రత్యేక అవగాహన ఉంది. తరుణ వ్యాధుల విషయం, ఆరంభం స్పష్టంగా తెలుస్తుంది. దీర్ఘవ్యాధుల పట్ల మనకు అవగాహన ఉండదు. ఉదాహరణకు మధుమేహం, రక్తపోటు వ్యాధులను తీసుకుంటే వైద్యులు గుర్తించి చెబితేనే తెలుస్తుందిగానీ అంతకు ముందు తెలియదు.

తరుణ వ్యాధులు ఔషధాలు వాడకపోయినా తగ్గిపోతాయి. అయితే వ్యాధి తీవ్రత హెచ్చుగా, ఉద్ధృతంగా ఉంటే రోగి మరణించే ప్రమాదం ఉంటుంది. ఇక దీర్ఘ వ్యాధులు క్రమబద్ధంగా ఔషధాలు వాడితేనే తగ్గుతాయి. వాటంతట అవి తగ్గవు. దీర్ఘ వ్యాధుల నివారణకు వ్యాధి లక్షణాలు, వ్యాధి గ్రస్తుని వివరాలు రెండిటినీ పరిగణనలోకి తీసుకోవాలని మొదటగా చెప్పినవాడు హానిమనే. దీన్నే 'లక్షణ సర్వస్వం' అని వ్యవహరిస్తారు.

జ్వరాలను పరిశీలిస్తే ఏదైనా పొంగు బయటపడే ముందు జ్వరం రావచ్చు. ఇవి పొంగు జ్వరాలు. వ్యాధి అంతర్గతంగా ఉండి జ్వరం రావచ్చు. అంతర్గత వ్యాధులకు జ్వరం ఒక బాహ్య లక్షణం కావచ్చు. కాబట్టి జ్వరాలను ఈ నేపథ్యంలో పరిశీలించి, లక్షణాలను విశ్లేషించి ఔషధాలను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

1 సమస్య

జ్వరం, చలి, దాహం, నొప్పులు, మలబద్ధకం.

2 ఔషధాన్ని ఎంపిక చేసుకునేదెలా?

జ్వరం, కనురెప్పలు వాలిపోయి ఉంటే	జెల్సీమియం
నిస్త్రాణ, కాళ్లు, చేతుల్లో వణుకు	జెల్సీమియం
అకస్మాత్తుగా పెద్దపెట్టున జ్వరం కన్పిస్తే	బెల్లడోనా
తల వెచ్చగా, కాళ్ళు చేతులు చల్లగా ఉంటే	బెల్లడోనా
చికాకు, కోపం, ఎవరు పలకరించినా గిట్టదు	బ్రయోనియా
దాహం విపరీతం, నీళ్ళు ఎక్కువగా కావాలి	బ్రయోనియా
జ్వరం, మగతగా ఉంటారు, మాట్లాడుతూ మగతలోకి పోతారు	బాప్టీజియా
నోరు దుర్వాసన, దుర్వాసనతో గూడిన మలవిసర్జన	బాప్టీజియా
తేమతో గూడిన వాతావరణం గిట్టక జ్వరం	రస్టాక్స్
జ్వరం, మూతిమీద నీటి బొబ్బలు కన్పిస్తే	రస్టాక్స్
అకస్మాత్తుగా జ్వరం, ఆందోళన కనిపిస్తే	ఎకొనైట్
దాహం విపరీతం, చల్లటి నీళ్ళు కావాలి	ఎకొనైట్

3 మీ ఔషధం గురించి మరిన్ని వివరాలు

ఎకొనైట్

అకస్మాత్తుగా జ్వరం. దడుపు జ్వరం. చలిగాలి గిట్టక జ్వరం. రాత్రి, అర్ధరాత్రి జ్వరం అధికం. అస్థిమితంగా ఉంటారు.

జెల్సీమియం

స్తబ్దత. కంటి రెప్పలు వాచి ఉంటాయి. దాహం ఉండదు. మూత్రవిసర్జన తరవాత హాయిగా ఉంటుంది. కండరాల బలహీనత. నడక తడబడుతుంటుంది.

బెల్లడోనా

అకస్మాత్తుగా జ్వరం. ముఖం కందిపోయి ఉంటుంది. కంటి పాపలు విప్పారి ఉంటాయి. ముఖం వేడిగా ఉండి కాళ్లు చేతులు చల్లగా ఉంటాయి. భ్రమలు ఎక్కువ.

బ్రయోనియా

నాలుక మీద తెల్లటి మందం. విపరీతమైన దాహం. ప్రశాంతంగా ఉండాలి. దగ్గు. న్యుమోనియా. కోపం ఎక్కువ. నోరు పొడారి పోతుంటుంది. ఏపాటి కదిలినా నొప్పి విపరీతం.

బాప్టీజియా

సెప్టిక్ జ్వరం. మగత ఎక్కువ. సమాధానం చెబుతూ మగతలోకి జారిపోతారు. మలమూత్రాలు దుర్వాసన గొడతాయి. ఫ్లూ జ్వరం. పక్క కుదరక అస్థిమితంగా ఉంటారు. విరేచనాలు.

రస్టాక్స్

తడిచిన తరవాత జ్వరం. పక్క కుదరదు. అస్థిమితం. సర్పిగుల్లల మీద వేడికాపు, వేడినీళ్ళు హాయినిస్తాయి. కండరాలన్నీ నొప్పి పెడతాయి.

మోతాదు: *మీరు ఎంచుకున్న ఔషధాన్ని 30 పొటెన్సీలో రోజూ ఉదయం సాయంత్రం... 3 మాత్రల చొప్పున... 2, 3 వారాలపాటు వాడాల్సి ఉంటుంది.*

ఇల్లే బడి!

చదువుల్లోని డొల్లతనంపై కన్నవారు కన్నెర్రజేస్తున్నారు. పుస్తకాల బరువులనూ పరీక్షల భయాలనూ ర్యాంకుల ఒత్తిళ్లనూ తీవ్రంగా నిరసిస్తున్నారు. ఆ నిట్టూర్పులోంచి పుట్టిందే 'హోమ్ స్కూలింగ్' విధానం. ఈ పద్ధతిలో... ఇల్లే బడి.

'యావన్మందికీ తెలియజేయునది ఏమనగా... ఈ అడవిని పాలించే రాజుగారు రాజ్యంలోని జంతువులకు నైపుణ్య పరీక్ష పెట్టాలని నిర్ణయించారు. అంతా తప్పక రావాలహో!'... చాటింపు మారుమోగింది. జంతువులన్నీ ఉత్సాహంగా బయల్దేరాయి. తీరా వెళ్లాక... ఇదిగో ఈ తాటిచెట్టును ఎవరు ఎక్కగలరో... వాళ్లే విజేతలని ప్రకటించారు.

ఆమాట వినగానే, నెమలమ్మ మొహం కళతప్పింది. మయూరం నాట్యంలో మిన్న. పురివిప్పి ఆడిందంటే..ప్రకృతి పరవశించి పోతుంది. కానీ...

మృగరాజు మౌనంగా నిష్క్రమించాడు. సింహబలానికి సాటిలేదు, వేటలో తిరుగు లేదు. కానీ...

చేపపిల్ల కన్నీరు పెట్టుకుంటూ వెనుదిరిగింది. నీటిలో ఎన్ని విన్యాసాలైనా చేయగలదు. కానీ...

జింకకైతే ఏడుపు ఆగలేదు. మనోవేగంతో పరుగెత్తగలదు. కానీ..

...చెట్టెక్కడం చేతకాదు.

'ఇదేం న్యాయం? ఇదెక్కడి ధర్మం? చెట్టెక్కడమే ఏకైక కొలమానమా? ఆ విద్య తెలియకపోవడం అవిద్య కిందికే వస్తుందా? నాట్యాల నెమలి ఎందుకూ పనికిరానట్టా? పరుగుల జింక ఫెయిలైపోయినట్టా? అందాల చేపపిల్ల అక్కరకు రాకుండా పోతుందా? సింహానికి చేవలేదని తేల్చేస్తారా? ఏ జీవి ప్రత్యేకత ఆ జీవిదే. ప్రతి నైపుణ్యం ప్రత్యేకమైందే'... అడవి జంతువులు ఆక్రోశించాయి.

మన విద్యావిధానాన్ని కూడా కన్నవారు ఇంతే తీవ్రంగా గర్హిస్తున్నారు. 'పది జవాబులు బట్టీపట్టి... పరీక్ష పేపరు మీద కక్కేస్తే తెలివైన విద్యార్థి కింద లెక్కా? గ్రేడ్ల వీరతాళ్లు వేస్తారా, ర్యాంకుల కిరీటం తొడుగుతారా? ఓ అబ్బాయికి ఆల్జీబ్రా అంటే ఇష్టం ఉండకపోవచ్చు. కానీ చక్కగా బొమ్మలేస్తాడు. ఆ నైపుణ్యాన్ని ఎందుకు గుర్తించరు? మరో అమ్మాయికి ఫిజిక్స్ బోర్‌బోర్ కావచ్చు. ఫొటోగ్రఫీలో మాత్రం బోలెడన్ని ప్రయోగాలు చేయవచ్చు. ఫిజిక్స్ ఒక సబ్జెక్టు అయినప్పుడు, ఫొటోగ్రఫీ మాత్రం కాకుండా పోతుందా? కాలం చెల్లిన బోధన విధానాలతో విద్యాసంస్థలు మగ్గిపోతున్నాయి. చిన్నారుల నైపుణ్యాలను గుర్తించే తీరిక ఉపాధ్యాయుడికి లేదు. నలభై యాభైమంది పిల్లల అటెండెన్సు తీసుకునేసరికే సగం సమయం గడిచిపోతుంది. మిగతా సగం సమయంలో మార్కుల కోసం మూర్ఖపు పరుగులకు తయారు చేస్తున్నారు.

"అయినా, చదువంటే సిలబస్సేనా? మంచి పుస్తకం చదువు కాదా, మంచి ప్రయాణం చదువు కాదా, మంచి సంగీతం చదువు కాదా?... చదువులకు మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రతిభను కొలవడానికి మీదగ్గరున్న తూకపు రాళ్లేమిటి? ప్రతి పసివాడికీ ఓ ప్రత్యేకత ఉంటుంది. ముందు, దాన్ని గుర్తించండి. ప్రోత్సహించండి. వీలైతే మెరుగులు దిద్దండి. అంతేకానీ... ఆ ఉత్సాహం మీద నీళ్లు చల్లకండి. ఆ లేలేత రెక్కలపై కత్తెరగాట్లు వేయకండి" అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కొందరైతే ఇంకాస్త ముందుకెళ్లి... 'హోమ్ స్కూలింగ్' విధానం వైపు మొగ్గుచూపుతున్నారు. చదువుల్లోని మూసకూ పరీక్ష విధానంలోని ఒత్తిళ్లకూ చాలాచాలా దూరంగా పిల్లల్ని పెంచి పెద్దచేస్తున్నారు. ఆ ప్రయత్నంలో తామే గురువుల పాత్ర పోషిస్తున్నారు. ఇంటిని పాఠశాలగా మారుస్తున్నారు. పిల్లలు స్వేచ్ఛగా ఎదగడానికీ సహజంగా వికసించడానికీ అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. హోమ్ స్కూలింగ్‌లో కన్నవారి పాత్ర చాలా కీలకం. ఉపాధ్యాయులుగా, స్నేహితులుగా, మార్గదర్శకులుగా... అనేక పాత్రలు పోషించాల్సి ఉంటుంది. ఆ బాధ్యతకు సంతోషంగా సిద్ధపడుతున్నారు. అవసరమైతే ఇద్దర్లో ఎవరో ఒకరు కెరీర్‌ను త్యాగం చేసుకుంటున్నారు. భావసారూప్యం ఉన్న తల్లిదండ్రులంతా కలిసి ఓ సంఘాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల ముంబయిలో జరిగిన జాతీయ



స్థాయి సమావేశానికి హైదరాబాద్ సహా అనేక నగరాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 'మా జనాభా రోజురోజుకూ పెరుగుతోంది' అంటారు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ హోమ్ స్కూలర్స్ ప్రతినిధి డోలాదాస్ గుప్తా.

గోడల్లేని బడి...

గృహ పాఠశాలలో గోడలుండవు. గోడకుర్చీలుండవు. గంటలుండవు. బెత్తపుదెబ్బల మంటలుండవు. ఇల్లే బడి. ప్రకృతే ప్రయోగశాల. పెరట్లో కనిపించే బొద్దింక జువాలజీ పాఠం. కొత్త మామిడిపూత బోటనీ పాఠం. తొలకరి చినుకులు జాగ్రఫీ పాఠం. పెరిగిన చాక్లెట్ల ధరలు ఎకనామిక్స్ పాఠం. అయినా, పాఠం కానిదేముంది... ప్రతి అనుభవం లోంచీ ఎంతోకొంత తెలుసుకుంటారు. తెలుసుకున్నది అర్థంచేసుకుంటారు. అర్థంచేసుకున్నది జీవితానికి అన్వయించుకుంటారు. అదంతా పరీక్ష పేపరు మీద కక్కాల్సిన పన్లేదు. టీచరమ్మకు అప్పజెప్పాల్సిన అవసరంలేదు. ఫలానా సమయంలో ఫలానా పనే చేయాలన్న ఆంక్షలూ ఉండవు. ఆడుకోవాలనుంటే ఆడుకుంటారు. బొమ్మలేసుకోవాలనుంటే బొమ్మలేసుకుంటారు. గిటార్ వాయించాలనుంటే గిటార్ వాయిస్తారు. సైక్లింగ్ చేయాలనుంటే సైక్లింగ్ చేస్తారు. ఇంటర్నెట్ బ్రౌజ్ చేయాలనుంటే బ్రౌజ్ చేస్తారు. చదువుకోవాలనుంటే చదువుకుంటారు. ఎవరూ పరిమితులు విధించరు. ఇంకెవరితోనో పోలికతెచ్చి చిన్నబుచ్చరు. వెనుకబడిపోయావని వెక్కిరించరు. విత్తు మొలకెత్తినట్టు, పూవు వికసించినట్టు, ఇంద్రధనుస్సు రూపుదిద్దుకున్నట్టు... అది సహజ వికాసం!

ఒక్కసారి ఊహించుకోండి... తోటి పిల్లలు తరగతి గదిలో కూర్చుని ఆంధ్రప్రదేశ్ మ్యాపులో కరీంనగర్ ఎక్కడుందో, కర్నూలు ఎక్కడుందో అతి కష్టంగా గుర్తిస్తున్న సమయానికి ఓ కుర్రాడు ఇంట్లోనే సేదతీరుతూ కాలనీ వివరాలతో ఓ మ్యాపు తయారు చేస్తే ఎలా ఉంటుంది? 'ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి ఫలానా పట్టణంలో జన్మించెను' అంటూ పాఠం బట్టీపట్టాల్సిన వయసులో... సరిగమలు నేర్చుకుంటూ ఆమె గాత్రాన్ని ఆస్వాదించడం ఎంత గొప్ప అనుభూతి! ఆ హద్దుల్లేని అధ్యయనానికి... అమ్మానాన్నలే దిశానిర్దేశకులు. నిజానికి, నాన్న కంటే అమ్మ పాత్రే కీలకం. కొలువులు

నిన్ను నీవు చదువుకో...

ఎలుకల పరుగు(రాట్ రేస్)తో ఓ సమస్య ఉంది. పందెంలో గెలిచినా..చివరికి ఎలుకగానే మిగిలిపోతాం! సంయుక్త ఆందోళనా అదే. అందుకే ఇంటర్ తర్వాత ప్రొఫెషనల్ కోర్సులు చేయాలన్న ఆలోచనకు స్వస్తి పలికింది. మార్కుల చుట్టూ తిరిగే బోధన విధానం మీద ఆ యువతికి పెద్దగా నమ్మకం లేదు. అందుకే తన అభిరుచుల మేరకు తనకంటూ ఓ సిలబస్ తయారుచేసుకుంది. భరతనాట్యం, ఆరిగమి, సంగీతం, చేనేత... వీటిచుట్టే ఆమె చదువంతా సాగింది. అలా అని విశ్వవిద్యాలయాలు ఇచ్చే పట్టాలను వదులుకోలేదు. ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ అందుకుంది. అదీ గోల్డ్‌మెడల్‌తో. ఆతర్వాత నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ప్రవేశ పరీక్ష రాసి... సీటు తెచ్చుకుంది. ఈ రెండింటితో పాటు... ఏ విద్యార్థికీ దక్కని అపార జీవితానుభవాన్ని సంపాదించింది. 'చదువంటే... పుస్తకాల్లోని సమాచారాన్ని తలకెక్కించుకోవడం ఒక్కటే కాదు. నిన్ను నీవు తెలుసుకోవడం కూడా' అంటుంది సంయుక్త. తన అనుభవాల్ని 'లెర్నింగ్ ద హార్ట్ వే' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చింది. సంయుక్త తండ్రి దివంగత నరేంద్రనాథ్ మానవతావాది, రైతు నాయకుడు. తల్లి ఉమాశంకరి హక్కుల ఉద్యమాల్లో చురుకైన కార్యకర్త. సంయుక్త ప్రస్తుతం 'చిత్రిక' అనే స్వచ్ఛంద సంస్థ తరపున శ్రీకాకుళం జిల్లాలో చేనేత కార్మికుల కోసం పనిచేస్తోంది.

నా పిల్లలు...

–శైలజ

పిల్లల్ని ఇంట్లోనే చదివించాలన్న నా ఆలోచనకు ప్రధాన కారణం కార్పొరేట్ విద్యలోని ఒత్తిళ్లే. పెద్దబ్బాయి తరుణ్ హైస్కూలు దాకా మాల్దీవుల్లో చదువుకున్నాడు. ఆతర్వాత హైదరాబాద్‌లో చేర్పించాం. ఆ ఒత్తిడి తట్టుకోలేకపోయాడు. ఓరకమైన నిస్పృహకు గురయ్యాడు. దీంతో ఇంట్లోనే చదివించాలన్న నిర్ణయానికి వచ్చాను. తనూ ఉత్సాహంగా అంగీకరించాడు. వాడికి ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. అందులో నైపుణ్యం సంపాదించాడు. తరుణ్‌కు నలుగురిలో చొచ్చుకుపోయే గుణం ఉంది. నాయకత్వ లక్షణాలున్నాయి. వాటన్నిటినీ నా వంతుగా ప్రోత్సహిస్తున్నాను. ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువుతున్నాడు. రెండో అబ్బాయి ఆశ్రిత్ స్వతహాగా సెల్ఫ్ లెర్నర్. ఎవరూ చెప్పాల్సిన పన్లేదు. తనని మొదట్లో బెంగుళూరులోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్లో చేర్పించాం. అక్కడున్న టీచర్ల కంటే తనకే సబ్జెక్టు మీద అవగాహన ఎక్కువని అర్థమైపోయింది. ఆ మాత్రం దానికి లక్షల ఫీజు కట్టడం ఎందుకు? బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, సినిమాలు... ఆశ్రిత్‌కు బోలెడన్ని అభిరుచులున్నాయి. టెక్నాలజీ మీద మంచి పట్టు ఉంది. తను కేంబ్రిడ్జ్ సిలబస్‌తో ఇంటిదగ్గర నుంచే పన్నెండో తరగతి పరీక్షలు రాశాడు. ఇద్దరు పిల్లల విషయంలోనూ నా దారి ఒకటే. ఎప్పుడూ షరతులు విధించలేదు. ఆదేశాలు జారీ చేయలేదు. పిల్లలకు ఆలోచన ఇవ్వాలి. ఏది మంచో ఏది చెడో చెప్పి వదిలేయాలి. పిల్లలు మన కోసం పుట్టలేదు. మన ద్వారా పుట్టారంతే. మన ఆలోచనల్నీ కలల్నీ లక్ష్యాల్నీ వాళ్ల మీద రుద్దడం చాలా తప్పు. స్వతంత్రంగా ఆలోచించుకోనిద్దాం. స్వతంత్రంగా ఎదగనిద్దాం.

వదులుకున్నా, కూర్చుని పాఠాలు చెప్పినా... చాలావరకూ అమ్మలే.

ప్రతి పసివాడూ ప్రత్యేకమే... అని నమ్ముతుంది హోమ్ స్కూల్ విధానం. వాళ్ల అభిరుచిని బట్టి దినచర్య ఉంటుంది. అది కూడా కచ్చితంగా ఏం ఉండదు. పిల్లల ఇష్టాల్ని బట్టి మారిపోతూ ఉంటుంది. ఏ నేషనల్ ఓపెన్ స్కూల్ ద్వారానో పరీక్షలు కడతారు. ఆ సిలబస్ కోసం మహా అయితే, రోజూ ఒకటిరెండు గంటలు కేటాయించుకుంటారు. అవసరమైతే ట్యూషన్ పెట్టించుకుంటారు. అయినా కూడా, సొంతంగా నేర్చుకోడానికే సొంతంగా అర్థంచేసుకోడానికే తొలి ప్రాధాన్యం. ఆ ప్రయత్నంలో కన్నవారి సహకారం ఉండనే ఉంటుంది. ఇంటర్మీడియట్ స్థాయి వరకూ ఈ మార్గంలోనే చదువుకునే వెసులుబాటు ఉంటుంది. ఆతర్వాత... ఇంజినీరింగ్, మెడిసిన్, ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ ఇలా తమకు నచ్చిన కోర్సులో చేరిపోతారు.



చదువైపోతుంది. ఏ ఉద్యోగంలోనో వ్యాపారంలోనో స్థిరపడతారు. కానీ హోమ్ స్కూలింగ్ పునాదులు మాత్రం పదిలంగా ఉంటాయి. ఆ సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచనా ధోరణి, శోధించి సాధించే గుణం..ఏ రంగంలో అయినా అగ్రస్థానానికి తీసుకెళ్తాయి.

అమ్మే పంతులమ్మ

అవసరమైతే ఉద్యోగాల్ని కూడా వదులుకునే అమ్మలు... పసివాళ్లే ప్రపంచంగా బతికేస్తారు. ఒక నేస్తంలా వారికి మరింత దగ్గర అవుతారు. పరిశీలిస్తున్నకొద్దీ పిల్లల్లోని... ఐన్‌స్టీన్‌లూ సీవీరామన్‌లూ సునీతా విలియమ్స్‌లూ ఎమ్.ఎఫ్.హుస్సేన్‌లూ ఒక్కొక్కరుగా బయటికొస్తారు. ఇద్దరు ముగ్గురు పిల్లలుంటే, అంతా ఇంట్లోనే చదువుతుంటే... అదో చిన్న బడే! అన్నలూ అక్కలూ 'లీడర్' పాత్ర పోషిస్తారు. ఒకరి సందేహాలు మరొకరు తీరుస్తారు. 'పిల్లల గురించి తెలుసుకోవాలంటే, వాళ్లతో ఆడుకోవాలి. ఆటల ద్వారానే నేను మా అబ్బాయిని అర్థంచేసుకున్నాను' అని చెబుతారు ఎలిజబెత్. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉంటున్న శైలజ కరణం తన ఇద్దరు పిల్లల్నీ ఇంట్లోనే చదివించారు. ఆ అనుభవం ఆమెను హోమ్ స్కూలింగ్ నిపుణురాలిగా మార్చింది. ఆ పద్ధతిలో పిల్లల్ని చదివించాలనుకునే వారికి 'స్వేచ్ఛ' సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నారు, ప్రస్తుతం పదిహేనుమంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. 'పిల్లల గురించి కలలు కనడం కాదు, పిల్లల కలల్ని నిజం చేయడం కన్నవారి బాధ్యత' అంటారామె. మణికొండలో ఉంటున్న నీలిమ కూడా తన పిల్లలందర్నీ ఇంటిదగ్గరే చదివించుకున్నారు. ముంబయికి చెందిన వినీల తన ముగ్గురు పిల్లల్నీ బడి మానిపించాలని నిర్ణయించుకోగానే, సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రాథమిక అవగాహన కోసం టీచర్ ట్రైనింగ్ కోర్సు చేశారు. శాండ్రా డోడ్ వంటి నిపుణుల పుస్తకాలు చదివారు. అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్ బ్రౌజ్ చేశారు. 'మా అమ్మాయి చక్కగా కవిత్వం రాస్తుంది. పత్రికల్లో అచ్చయ్యాయి కూడా. వాటిని చూసి ఓ ప్రచురణకర్త పుస్తకంగా వేస్తానని ముందుకొచ్చారు. బడికే పరిమితమై ఉంటే... తనలోని కవయిత్రి చచ్చిపోయేది. ఈ విషయంలో నాకెలాంటి సందేహం లేదు' అంటారామె. టెన్నిస్ ప్రాక్టీసా, పాఠశాలా... అన్న ప్రశ్న వచ్చినప్పుడు శ్రీనివాస్, లక్ష్మి దంపతులు టెన్నిస్ వైపే మొగ్గుచూపారు. ఆ దంపతుల ఏకైక సంతానానికి ఆటంటే ప్రాణం. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నది కల. పెద్దక్లాసులకు వెళ్తున్నకొద్దీ చదువుల ఒత్తిడి పెరుగుతోంది. ఆటలు పక్కనపెట్టి చదువుమీద దృష్టిపెట్టాలని క్లాస్ టీచర్ ఒకటికిరెండుసార్లు హెచ్చరించారు కూడా. దీంతో ఆ దంపతులు హోమ్ స్కూలింగ్ విధానాన్ని ఎంచుకున్నారు. ఆ కుర్రాడు ఓపికున్నంతసేపు ప్రాక్టిస్ చేసుకుంటాడు. ఉదయం, సాయంత్రం ఒకటిరెండు గంటలు చదువులకు కేటాయిస్తాడు. 'ఆశల్ని చిదిమేసే చదువులు నా పిల్లలకొద్దు. ఏ పిల్లలకూ వద్దు' అంటున్నప్పుడు లక్ష్మి గొంతులో తీవ్రత. విద్యావ్యవస్థపై అది నిరసన స్వరం కావచ్చు. ప్రియాదేశికన్ బ్లాగుపోస్టులో తన కొడుకు గురించి ఇలా రాసుకున్నారు...' డాబా మీద నిలబడి నక్షత్రాల్ని చూస్తున్నప్పుడు మా అబ్బాయి రాఘవన్‌కు అంతరిక్షం అంటే ఆసక్తి కలిగింది. ఆ కుతూహలాన్ని గ్రహించి, ఇంటర్నెట్‌లో ఓ మంచి వెబ్‌సైట్ చూపించాను. ఓ టెలిస్కోప్ కొనిచ్చాను. అదే వాడి ప్రపంచమైపోయింది. కాన్వాస్ ముందు కూర్చుని గ్రహాల బొమ్మలు గీశాడు. అక్కడి వాతావరణాన్ని కూడా అందులో చూపించాడు. ఇంట్లోని పాత వస్తువులతో సౌర వ్యవస్థ నమూనా తయారు చేశాడు. తనిప్పుడు అంతరిక్ష శాస్త్రం గురించి ఎంతసేపైనా మాట్లాడగలడు. తామేం నేర్చుకోవాలో నిర్ణయించుకునే అవకాశం పిల్లలకు ఇస్తే... ఇలాంటి అద్భుతాలే జరుగుతాయి.'

బెత్తపు చదువులొద్దు...

లక్షరూపాయల డొనేషన్ కట్టి చిన్నారి శోభను కార్పొరేట్ స్కూల్లో చేర్పించారు అమ్మానాన్నలు. ఓరోజు హోమ్‌వర్క్ చేసుకురాలేదని క్లాస్ టీచర్ గుడ్లురిమి చూసేసరికి... ఆ చిన్నారికి భయమేసింది. జ్వరమొచ్చింది. 'ప్లీజ్ టీచర్... కొట్టొద్దు టీచర్! సారీ టీచర్...' అంటూ నిద్రలోనూ కలవరింత. బడికెళ్లనని మొండికేసింది.

వారం పదిరోజుల్లో పరిస్థితి సర్దుకుంటుందని అనుకున్నారు. అలా జరగలేదు. దీంతో సైకాలజిస్టు సలహా మీద హోమ్‌స్కూల్ విధానాన్ని ఎంచుకున్నారు. శోభ ఇప్పుడు ఆడుతూపాడుతూ ఇంట్లోనే చదువుకుంటోంది. పాఠాల్ని ప్రేమిస్తోంది. జీవితాన్ని ఆస్వాదిస్తోంది. హైదరాబాద్‌లో ఓ పేరున్న పబ్లిక్‌స్కూల్లో పదోతరగతి దాకా క్లాస్ టాపర్‌గా ఉన్న అదితి... ఆతర్వాత మాత్రం ఆ నాలుగుగోడల విధానాన్ని వ్యతిరేకించింది. చదువులపై తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి రాసిన ఓ పుస్తకాన్ని చదివాకే ఆ అమ్మాయికి ఆలోచన వచ్చింది. అమ్మానాన్నలు కూతురి ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. 'ఇష్టమైన పుస్తకాలు చదువుకుంటాను. భరతనాట్యం సాధన చేస్తాను. ఓపికుంటే వంటింట్లో ప్రయోగాలు చేస్తాను. ఏదైనా రాయాలనిపిస్తే రాస్తాను. స్కూలుకెళ్తే ఐదారు సబ్జెక్టులకు మించి చదవలేం. ఇప్పుడలా కాదు.. ఎన్నయినా చదువుకోవచ్చు. ఏమైనా నేర్చుకోవచ్చు. ఈ స్వేచ్ఛ నాకు నచ్చింది' అంటుందా అమ్మాయి.

అనుభవాల ప్రయోగశాల...

అమెరికాలో నాలుగున్నర దశాబ్దాల క్రితం ప్రాణంపోసుకున్న విధానమిది. విద్యావేత్త జాన్‌హోల్ట్ ఆలోచనల నుంచి పుట్టింది. పుస్తకాల్లో చదివి తెలుసుకోవడం కాదు, అనుభవాల్లోంచే ఏ పాఠమైనా నేర్వాలి... అన్నదే ఆయన ఆలోచన. పైపైకి ఇదంతా బాగానే అనిపించవచ్చు. ఇంట్లోనే పసివాడిని తీర్చిదిద్దడం అన్నది... అంత సులభమైన పని కాదు. తమ మీద తమకు నమ్మకం ఉండాలి. పసివాడిని నమ్మాలి. ఎంచుకున్న విధానాన్ని విశ్వసించాలి. జిజ్ఞాస, ఆశావాదం, ఓపిక చాలా అవసరం. ఆరంభశూరత్వం పనికిరాదు. ఎక్కడ ఏ తేడా వచ్చినా... దెబ్బతినేది బిడ్డ జీవితమే. 'హోమ్ స్కూలింగ్' మీద పెద్దగా అవగాహన లేని భారత్‌లాంటి దేశంలో అయితే స్నేహితుల నుంచీ బంధువుల నుంచీ రకరకాల ఒత్తిళ్లు. ఎక్కడ ఏ కొత్తపరిచయమైనా 'మీ పిల్లలు ఏం చదువుతున్నారు, ఏ స్కూల్లో వేశారు' తరహా వాకబులు ఉండనే ఉంటాయి. ఆ ప్రశ్నల్ని తట్టుకోవాలి. ఓపిగ్గా జవాబులివ్వాలి. ఇంట్లోనే చదువుకోవడం వల్ల పిల్లలు స్నేహితులకు దూరమవుతారన్న వాదనా ఉంది. ఈమాటంటే వినీల ఒప్పుకోరు. 'నా పిల్లలే కనుక బడికెళ్లి ఉంటే, స్కూల్ ఫ్రెండ్స్ మాత్రమే ఉండేవారు. అదీ వాళ్ల ఈడు నేస్తాలే ఉండేవారు. ఇప్పుడలా కాదు. స్విమ్మింగ్ ఫ్రెండ్స్ ఉన్నారు. చెస్ అకాడమీ ఫ్రెండ్స్ ఉన్నారు. టేబుల్ టెన్నిస్ ఫ్రెండ్స్ ఉన్నారు. అపార్ట్‌మెంట్ ఫ్రెండ్స్ ఉన్నారు. ఆ మిత్రమండలిలో పదేళ్లవారు ఉన్నారు, పాతికేళ్లవారు ఉన్నారు. ఇంత వైవిధ్యం ఎక్కడ దొరుకుతుంది' అని ప్రశ్నిస్తారామె. 'రకరకాల అనుభవాలు. కొత్త కొత్త సవాళ్లు. వాటన్నిటినీ ఓపిగ్గా పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలి. బడికెళ్లి చదువుకున్న పిల్లలతో పోలిస్తే నా బిడ్డలకు చొరవ ఎక్కువ. ఇట్టే కలిసిపోతారు. స్వతంత్ర భావాలు ఏర్పడ్డాయి. నా అంచనా తప్పుకాలేదు' అంటారు సుప్రజ.

'ఇళ్లన్నీ బడులైపోతే, పాఠశాలలేం కావాలి, ఉపాధ్యాయులంతా ఏమైపోవాలి?' అని ప్రశ్నించేవారికి ఒకటే సమాధానం... 'విద్యా వ్యవస్థలోని లోపాలను భరించలేకే కన్నవారు ఈ అసాధారణ నిర్ణయం తీసుకుంటున్నారు. ఒకటి మాత్రం నిజం, బడి బడే. హోమ్ స్కూల్ అన్నమాటలోనూ 'స్కూల్' ఉంది. రుగ్మతల్ని వదిలించుకుంటే, బూజుపట్టిన భావాల్ని కడిగేసుకుంటే, మార్కుల పరుగునూ ర్యాంకుల మోహాన్నీ తగ్గించుకుంటే... బడి బడిగానే మిగుల్తుంది. ఆరోజే కనుక వస్తే... ఇంటి బడుల అవసరం ఉండకపోవచ్చు. భూకంపాల వంటి సంక్షోభ సమయాల్లో సురక్షితమైన చోట వేసుకునే తాత్కాలిక డేరా లాంటిది... హోమ్ స్కూల్!

★ ★ ★

పద్నాలుగేళ్ల వయసులోనే ఐఐటీ ప్రవేశపరీక్షలో మంచి ర్యాంకు సాధించాడు సహాల్ కౌశిక్. సమాచారం తెలియగానే... మీడియా ఆ కుర్రాడి చుట్టూ మూగిపోయింది. ప్రశ్నల వర్షం కురిపించింది.

'నీ విజయ రహస్యం?'

మరొకరైతే పొంగిపోయేవారు. ఏవేవో కారణాలు చెప్పేవారు.

'నేను అందర్లాంటివాణ్నే. ఎలాంటి ప్రత్యేకతలూ లేవు. ఈమాత్రం తెలివితేటలు ఉన్నవాళ్లు చాలామందే ఉన్నారు' ...కౌశిక్ జవాబులో నిజాయతీ.

'రోజూ ఎన్ని గంటలు చదివేవాడివి?'

పదిగంటలు, పదిహేను గంటలు, ఇరవై గంటలు... ఏ టాపర్ నుంచైనా వచ్చే సమాధానమే.

'ఇంతసేపని కచ్చితంగా చెప్పలేను. కానీ చదివినంత సేపూ సబ్జెక్టు మీద ప్రేమతో చదివేవాడిని. మిగతా సమయాన్ని హాబీలకు కేటాయించేవాణ్ణి'... చెప్పాడు కౌశిక్.

'హాబీలా... ఐఐటీ ఎంట్రన్స్ రాస్తూ కూడా?'... మీడియా ఆశ్చర్యపోయింది.

'అవును. నాకు సంగీతం ఇష్టం. పుస్తకాలిష్టం. అందులోనూ చరిత్రకు సంబంధించిన పుస్తకాలంటే చాలా ఇష్టం. మరీ బోర్ కొడితే కంప్యూటర్ కాలక్షేపం ఉండనే ఉంది'

ర్యాంకుల కోసం అభిరుచుల్ని దూరం చేసుకుంటున్న పరిస్థితుల్లో... అభిరుచుల్లోని ఆనందాన్ని ఆస్వాదిస్తూనే తన కల నిజం చేసుకున్నాడు కౌశిక్. ఆ విజయం వెనుక, బిడ్డ కోసం వైద్యవృత్తిని వదులుకున్న అమ్మ ఉంది. బడిని మరిపించిన ఇల్లుంది. ★

మూలాలు...

హోమ్ స్కూలింగ్ అన్న భావన అమెరికాలో పుట్టింది. 1970 ప్రాంతంలో జాన్ హోల్ట్ అన్న విద్యావేత్త ప్రపంచానికి పరిచయం చేశాడు. నిజానికి ఆయనో నౌకాదళ అధికారి. బాల్యంలోని చేదు అనుభవాలే ఈ వైపు నడిపించాయి. హోల్ట్ రచించిన 'టీచ్ యువర్ ఓన్' సంచలనాలు సృష్టించింది. 'గ్రోయింగ్ విత్‌వుట్ స్కూలింగ్' పేరుతో పత్రిక నడిపారు. 'హౌ చిల్డ్రన్ ఫెయిల్' పుస్తకంలో 'పరీక్షల్లో వైఫల్యానికి చిన్నారులను బాధ్యులను చేయకండి, ఆ పాపం పాఠశాలలదే' అని కుండబద్దలు కొట్టారు. హోల్ట్‌కు సంతానం లేదు. కానీ పిల్లలంటే ప్రాణం. 'పిల్లల్ని గౌరవించండి. పసివాళ్లను గౌరవించకుండా వాళ్ల నుంచి గౌరవాన్ని పొందాలనుకోవడం దురాశే' అని బోధించారు. హోల్ట్ 1985లో మరణించారు.



మాట్లాడే బొమ్మలు

పదాలకంటే బొమ్మలు స్పష్టంగా మాట్లాడతాయి. కానీ ప్రతి పదాన్నీ బొమ్మ రూపంలో చూపడం సాధ్యమవుతుందా? ఒకప్పుడు అసాధ్యమేమోగాని ఇప్పుడు మాత్రం దాన్ని 'ది నౌన్ ప్రాజెక్ట్' సుసాధ్యం చేస్తోంది.

పాటలకు ఓ గుర్తు, కెమెరాకు ఓ గుర్తు, స్పీకర్‌కి ఒక గుర్తు, ఫోన్‌బుక్‌కి ఓ గుర్తు... సెల్‌ఫోన్లో మనకు బొమ్మల రూపంలో ఉండే ఇలాంటి గుర్తులు చాలా కనిపిస్తాయి. కానీ దైనందిన జీవితంలో ఇంకా చాలా అంశాలు మనకు ఎదురవుతాయి. అలా ఎదురయ్యే ప్రతి పేరుకీ ఒక గుర్తుని ఇవ్వడమే ఈ నౌన్ ప్రాజెక్టు ఉద్దేశం. దీన్ని 2010లో అమెరికాకు చెందిన ఎడ్వర్డ్ బోట్‌మన్ ప్రారంభించాడు.

అనుభవం నుంచే...

బోట్‌మన్‌కి చిన్నప్పట్నుంచీ బొమ్మలు గీయడం అలవాటు. కాలక్షేపానికి బొమ్మలు గీస్తూ పోతున్న అతడికి కొన్నాళ్ల కిందట ఈ ప్రపంచంలో ప్రతి అంశాన్నీ ఒక్కో గుర్తు రూపంలో చూపితే బావుంటుందన్న ఆలోచన వచ్చింది. కానీ ఆ విషయాన్ని తర్వాత కొద్దిరోజులకే మర్చిపోయాడు. ఆర్కిటెక్ట్ అయిన బోట్‌మన్ ఒకసారి వృత్తిలో భాగంగా ఒక భవన నిర్మాణ సంస్థ ఫైల్స్ చూస్తుండగా వారు ఒకే అంశాన్ని చెప్పడానికి రకరకాల బొమ్మలు వాడటం గమనించాడు. 'ఎందుకీ గందరగోళం' అని విసుక్కుంటూనే తాను వెనకెప్పుడో అనుకున్న 'ప్రతి అంశానికీ ఒక గుర్తు' ఆలోచనను గుర్తుచేసుకున్నాడు. వెంటనే భార్య సోఫియా, స్నేహితుడు స్కాట్ థామస్‌ను సంప్రదించి నౌన్ ప్రాజెక్టు ప్రారంభించాడు. గుర్తులతోనే ఒక భాషను తయారుచేయాలనేది వీరి లక్ష్యం. 'ఇద్దరు వ్యక్తుల మధ్య భాషాపరమైన ఇబ్బందుల్ని గుర్తులు దూరం చేస్తాయి' అని చెబుతాడు బోట్‌మన్. ఆసుపత్రులు, రవాణా, కంప్యూటర్... ఇలా ప్రతిచోటా కొన్ని ప్రత్యేక గుర్తులు ఉంటాయి. భాషతో పనిలేకుండా వాటిని ఎక్కడి వారైనా గుర్తు పట్టగలరు.

ఆన్‌లైన్ గ్రంథాలయం

నౌన్ ప్రాజెక్టు తమ వెబ్‌సైట్ (thenounproject.com)లో ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే వాడుకలో ఉన్న గుర్తుల్ని సేకరించి పెడుతుంది. కొత్త అంశాలకూ గుర్తుల్ని రూపుదిద్దుతుంది. బస్సు, లారీ, రైలు, కంప్యూటర్, సెల్‌ఫోన్... ఇలాంటి చాలా అంశాలకు గుర్తులు ఎప్పట్నుంచో ఉన్నాయి. వీటిని గుర్తులతో చూపడం చాలా సులభం ఎందుకంటే వాటికి ఒక రూపం ఉంటుంది. కానీ ఒక రూపమంటూ లేని మానవ హక్కులు, నిరసన లాంటి అంశాలకూ నౌన్ ప్రాజెక్ట్‌లో గుర్తులు చూడొచ్చు. గుర్తులు గీయడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఇలాంటి అంశంపైన పనిచేస్తున్నవారితో నిత్యం సంప్రదింపులు జరుపుతారు. అన్నింటి లోకీ బాగుంది అనుకున్న గుర్తుల్ని ఖరారు చేస్తారు. వీటికి కంప్యూటర్, సెల్‌ఫోన్స్, ఆప్స్‌లో ఉపయోగించుకునే విధంగా సాంకేతిక రూపం తేవడం స్కాట్ బాధ్యత. బోట్‌మన్ భార్య సోఫియా ఈ గుర్తుల మార్కెటింగ్ వ్యవహారాలు చూస్తుంది. తక్కువ మొత్తం చెల్లించి వీటిని ఉపయోగించుకోవచ్చు.

బోట్‌మన్ బృందం పనిని మెచ్చే వందలాదిమంది ట్విట్టర్, పింట్‌రెస్ట్, గూగుల్, 37 సిగ్నల్స్, గ్రూపాన్... వేదికల ద్వారా వీరికి మార్గనిర్దేశం చేస్తారు, సలహాలూ ఇస్తారు. తమ ప్రాంతంలో వాడుకలో ఉన్న గుర్తులను నౌన్ ప్రాజెక్టుకు అందిస్తారు. ప్రస్తుతం వీరి వెబ్‌సైట్లో సుమారు 3000 గుర్తులు ఉన్నాయి. ఒకదేశంలోని అంశం మరోచోట ఉన్నవారికి పరిచయం ఉండదు. జర్మనీలో ఒక బోర్డ్‌గేమ్‌లో 'మహిళ'కు గుర్తుగా ఓ చెక్క బొమ్మతో చేసిన రూపం ఉంటుంది. ఆ దేశంలో మహిళ బొమ్మను అదే గుర్తుతో చూపిస్తారు. అలాంటి విషయాల్ని కూడా వివరంగా చెప్పి నెట్‌లో ఉంచుతారు. బుర్ఖా, సిక్కు మతస్థుడు, కివీ పక్షి... ఇలాంటి పదాలు అన్నిదేశాల వారికీ పరిచయం ఉండవు. అలాంటప్పుడు వాటి నేపథ్యాన్నీ వివరిస్తారు. ఈ గుర్తులు డిజైనర్లూ, నిర్మాణరంగంలో ఉన్నవారే కాదు బుద్ధిమాంద్య పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకీ, హాస్పిటల్ వర్గాలకి కూడా ఉపయోగపడుతున్నాయి.

గుర్తుల మారథాన్...

నౌన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో, 'ఐకానథాన్' పేరుతో గుర్తులు రూపొందించే మారథాన్ కార్యక్రమాలనూ చేపడతారు. దీనిలో భాగంగా ఒక నగర పాలక సంస్థను తీసుకొని వారికి ఏయే అంశాలకు గుర్తులు కావాలో గుర్తిస్తారు. వాటికి రూపునివ్వడంలో సామాన్యులూ పాల్గొని తమ ఆలోచనల్ని డిజైనర్లతో పంచుకోవచ్చు. ప్రస్తుతం అమెరికా నగరాల్లో మాత్రమే చేపడుతున్న ఈ 'ఐకానథాన్'లో ప్రభుత్వ అధికారులూ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటారు. ప్రజల్నీ గుర్తుల తయారీ ప్రక్రియలో భాగం చేయడం, వారికి గుర్తుల ప్రాధాన్యతను చెప్పడం కూడా 'ఐకానథాన్' ముఖ్య ఉద్దేశం. ఇలాంటి మారథన్‌లోనే మానవహక్కులు(ఇద్దరు వ్యక్తులు సమానస్థాయిలో నిలబడటం), ఆహార బ్యాంకు (చేతుల మధ్య ఆహార పొట్లం), ఎలక్ట్రిక్ కార్(ప్లగ్ ఉన్న కారు), పర్యావరణానికి హానిలేని ఇంధనాలు(ఇన్ఫినిటీని పోలిన ప్లగ్)... లాంటి భావనలకు గుర్తులు తయారుచేశారు. గుర్తుల్ని ఉపయోగించేది ప్రజలే. అందుకే ఐకానథాన్ లాంటి వేదికలపైన వాటిని ప్రాథమిక దశలోనే చూపించి లోపాల్ని సరిదిద్దుకుంటారు. ఈ మధ్య వార్తల్లోకి వచ్చిన గంగ్‌నమ్ స్టైల్ డ్యాన్స్‌కీ ఒక గుర్తు తయారుచేశారు. దీన్ని రూపొందించింది ప్రవాస భారతీయుడైన అర్జున్ మహంతి.

'భాష, దేశంతో సంబంధంలేకుండా ప్రపంచంలో ఎక్కడివారైనా గుర్తులతో మాట్లాడుకునే ఓ ప్రత్యేక సంజ్ఞా భాషను తీసుకురావడమే మా లక్ష్యం' అంటున్నారు బోట్‌మన్. సరిహద్దులు చెరిపేసే బోట్‌మన్ బృందానికి ఆల్ ది బెస్ట్ చెబుదామా!



కథ

పాట

– డా॥ కె.వి.రమణరావు

సర్పిలాకారంగా మలుపులు తిరుగుతూ కొండను చుట్టివున్న రోడ్డు వెంబడి కారు కొండెక్కుతోంది. ఈ కొండనానుకుని మొదలైన డామ్ అవతలి గుట్ట వరకూ పొడవుగా సాగి ఉంది. కొండపైన పచ్చటి పార్కు, దానిమధ్య కొత్తగా కట్టబడిన గెస్ట్ హౌస్ కారు మలుపు తిరిగిన ప్రతిసారీ మరింత దగ్గరగా కనిపిస్తున్నాయి. డామ్ నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చింది.

కారు వెనుకసీట్లో కూర్చుని చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను చూస్తూ తన సీడీ ప్లేయర్‌లోంచి వస్తున్న పాత సినిమా పాటలు వింటున్నాడు సాగర్. అతను ఆ డామ్ కడుతున్న నిర్మాణ కంపెనీలో ఇంజినీరు. ఈమధ్యే ఈ ప్రాంతానికి బదిలీ అయి తనిఖీ పనిమీద మొదటిసారి వస్తున్నాడు. రోడ్డు మలుపులూ పాట వంపులూ కలుస్తూ విడిపోతున్నట్టుగా ప్రయాణం సాగింది.

కారు గెస్ట్‌హౌస్ ముందాగేసరికి సమయం ఉదయం తొమ్మిది గంటలైంది. సాగర్ త్వరగా తయారై టిఫిన్ తిని పనిజరిగే చోటికి వెళ్ళిపోయాడు. అతను తిరిగొచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది. తీరిగ్గా వేడినీటి స్నానంచేసి బడలిక తీర్చుకుని, భోజనం చేసి వెంటనే నిద్రపోయాడు.

తెల్లవారుజామున సాగర్‌కి మెలకువ వచ్చింది. ఎక్కడినుంచో వస్తున్న తీయని పాట సుప్తావస్థలోనున్న అతని మస్తిష్కంలోకి దూరి దాన్ని చైతన్యవంతం చేసి అతన్ని మేలుకొలిపింది.

అతను ఆలోచనారహితంగా ఆ పాటనే వింటూ అలాగే ఉండిపోయాడు. కాసేపటి తర్వాత పక్కకు వత్తిగిలి కిటికీవైపు చూశాడు. బయట అప్పుడప్పుడే వెలుగురేకలు విచ్చుకుంటున్నాయి. మంచి నిద్ర తరవాత ఆ వాతావరణంలో ఆ పాట విన్నాక అతనిలో చాలా ప్రశాంతత కలిగినట్టు అనిపించింది. అది ఏదో జానపదుల పాట. పాడుతున్న స్త్రీ గొంతు చాలా మధురంగా ఉంది.

అతను లేచి పలుచటి కిటికీ తెరలు తొలగించి బయటికి చూశాడు. గెస్ట్‌హౌస్ వెనకాల ఉన్న ఓ చిన్న ఔట్‌హౌస్ అవతలనుంచి ఆ పాట వినిపిస్తోంది. అంత తీయని పాటను పాడుతున్న వారెవరో చూడాలని అక్కడికి వెళ్ళాలనుకున్నాడు. కానీ సభ్యత కాదని ఆగిపోయాడు.

ఆరోజు అతను డామ్‌పైనున్న క్రస్ట్ గేట్లను పరీక్షిస్తూ గడిపాడు. కిందపని జరుగుతున్నచోటు నుంచీ పగలంతా హుషారుగా కూలీలు పాడుకుంటున్న పాటలు లీలగా వినిపిస్తూనే ఉన్నాయి. అప్పుడప్పుడూ వాటిల్లో తను ఔట్‌హౌస్ నుంచి విన్న గొంతునుంచి కూడా కొన్ని మధురమైన పాటలు వినిపించాయి. ఆ గొంతు మిగతా గొంతులకు తలమానికంగా, స్ఫూర్తిదాయకంగా ఉంది.

ఆ ఔట్‌హౌస్‌లో ఎవరున్నారని అతను వాకబు చేశాడు. ఆ గెస్ట్‌హౌస్‌లో దిగేవాళ్ళ భోజనాలూ అవీ చూసుకోవడానికి కంపెనీ వాళ్ళు ఔట్‌హౌస్‌లో రాచయ్య అనే అతని కుటుంబాన్ని ఉంచారనీ, అతని కొడుకు కోటి తమ కంపెనీలోనే మెకానిక్‌గా పనిచేస్తున్నాడనీ, కొత్తగా కాపురానికొచ్చిన అతని భార్య రాణి ఈ పాటల్ని పాడుతున్నదనీ తెలిసింది. ఆమె పగలంతా డామ్ సైట్లో పనిచేస్తుందనీ తరువాత ఇంటికొచ్చాక కూడా ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటుందనీ పనిచేస్తున్నప్పుడంతా పాడుతూనే ఉంటుందనీ కూడా విన్నాడు.

ఆరోజు పని పూర్తిచేసుకుని సాగర్ గెస్ట్ హౌస్ చేరేసరికి రాత్రైపోయింది. స్నానంచేసి భోజనమయ్యాక వరండాలో కుర్చీ వేసుకుని ఓ పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు. కాసేపయ్యాక అంతా వ్యాపించిన నిశ్శబ్దంలోంచి సన్నగా మొదలైంది పాట. అతను పుస్తకం మూసి కళ్ళు మూసుకుని పాట వినడంలో లీనమయ్యాడు. అది అతనికి తెలియని ఏదో భాషలోని విషాదగీతం. బహుశా దుష్టశక్తుల మీద పోరాడి నేలకొరిగిన ఒక వీరుడిని స్మరిస్తున్న పాట. ఆ చీకటి నిశ్శబ్దం కలిసిన వేళలో అది అతన్ని ఏవో తెలియని లోకాలకి తీసుకెళ్ళింది. అతను పాట వింటూ అలాగే నిద్రలోకి జారిపోయాడు. ఏ అర్ధరాత్రో లేచి లోపలికెళ్ళి పడుకున్నాడు. తిరిగి ఉదయాన్నే అతను ఆమె పాట వింటూ నిద్ర లేచాడు.

ఆరోజు పొద్దున్నే సాగర్‌ని సైట్ దగ్గరకు తీసుకెళ్ళడానికి కోటి వచ్చాడు.

"నీ భార్య పాటలు బాగా పాడుతోంది. ఎక్కడ నేర్చుకుందేమిటి?" అడిగాడు సాగర్ పోర్టికోలో.

అతను రెండడుగులు ముందుకేసి రిజర్వాయర్ వెనకాలున్న కొండలవైపు చెయ్యి చూపిస్తూ "వాళ్ళ సొంతూరు ఆ యెనకాల కొండల్లో నది పక్కనే ఉంటాది సార్. ఇంగా ఎగువన పెద్దకొండల్లో సుగాలి బిడికీలున్నాయి. ఆ పక్కోళ్ళంతా ఎప్పుడూ ఏదో ఒకటి పాడతానే ఉంటారు. అయన్నీ ఏయో పొలాల్లో పాటలు. మంచిగా నేర్చుకున్న పాటలేంగాదు సార్" అన్నాడు సిగ్గుపడుతూ.

"అలాగంటావేమిటయ్యా... ఆమె పాటలో చాలా గొప్ప పనితనం ఉంది" అంటూ అతను చెయ్యి చూపించిన వైపు చూశాడు సాగర్. దూరంగా దిగంతాల వరకూ అన్నీ కొండలు. దగ్గరగా ఉన్న చిన్నకొండలు పచ్చగా ఉన్నాయి, దూరంగా ఉన్నవి నీలిరంగులోకి మారి మసకలో కలిసిపోతున్న పెద్దకొండలు. ఆ కొండల మధ్యనుంచీ మెలికలు తిరుగుతూ వచ్చిన నది రిజర్వాయర్‌లో కలిసిపోయింది. ఆ దృశ్యమే ఒక పాటలాగుంది.

"ఆ బాసేందో దానికే తెలీదు. ఆడికీ మాయమ్మ 'దీనికి పాట రాందే సేతులాడవు' అని ఇసుక్కుంటానే ఉంటాది" కోటి ఇంకా సిగ్గుపడ్డాడు బయటికి దారితీస్తూ.

అలా నాలుగురోజులు గడిచాయి. ఆ నాలుగురోజులూ అతను గెస్ట్‌హౌస్‌లో పాట వింటూనే గడిపాడు. ఈ నాలుగురోజుల్లో అతను ఒక విషయం గమనించాడు. రాణి పాటలన్నీ దాదాపు జానపదగీతాలే. కొన్ని

తెలుగులో, మరికొన్ని ఏవో తెలియని భాషల్లో. ఆమె పాడుతున్న సమయానికీ, చేస్తున్న పనికీ, ఆమె పాడుతున్న రాగాలకీ ఏదో దగ్గర సంబంధం ఉంది. పొద్దున భక్తి గీతాలూ, సాయంకాలం ప్రేమగీతాల్లాంటివీ, రోలు దగ్గర రోకటితో దంచుతున్నప్పుడూ, విసుర్రాయి విసురుతున్నప్పుడూ హుషారైన పాటలూ పాడుతోంది. పాటా, పనీ ఒకే రిథమ్‌లో సాగుతాయి. రాత్రి పొద్దుపోయిన తర్వాత బహుశా ఏ బాధల్ని మరచిపోవడానికో విషాదగీతాలు పాడుతుంది. ఆ పాటలు వింటూవుంటే మనిషికీ పాటకీ గల గాఢమైన అనుబంధం, జీవన పోరాటంలో నాగరికతను నిర్మించే క్రమంలో అనాదిగా పాట మనిషికి ఇచ్చే బలం, స్ఫూర్తీ సాగర్‌కి అస్పష్టంగా అవగతమవుతున్నాయి.

ఒక్కోసారి ఆమె లాలి పాటలూ, పాత హిందీ, తెలుగు సినిమా పాటలూ పాడేది. అతనికి చిన్నప్పుడు తన తల్లి పాడిన పాటలు గుర్తొచ్చి ఆనాటి జ్ఞాపకాల్లోకీ అనుభూతుల్లోకీ వెళ్ళిపోయేవాడు.

ఆశ్చర్యమేమిటంటే అతను నాలుగురోజు లున్నా ఆమె అతనికి కనపడనే లేదు. ఔట్‌హౌస్‌లోనో ఇంకా వెనకాలో పాట మాత్రమే వినిపించేది. అతని పనులన్నీ రాచయ్యో, అతని భార్య యెల్లమ్మో చూసుకునేవాళ్ళు.

అయిదోరోజు అతను తిరిగి వెళ్ళాల్సిన రోజు. ఆ సాయంత్రం సామాన్లు సర్దుకున్నాక కారు కోసం ఎదురుచూస్తూ అతను తదేకంగా ఔట్‌హౌస్‌కేసి చూస్తూ కిటికీ దగ్గర నిలబడ్డాడు. ఔట్‌హౌస్ వెనకాలెక్కడో లీలగా పాట వినిపిస్తోంది. చాలాసేపు తరవాత హఠాత్తుగా ఆ సాయంత్రం నీరెండలో దూరంగా రెండు చెట్లమధ్య కట్టిన తాడుకి బట్టలారేస్తూ ఆమె కనిపించింది. ఆమె సన్నగా పొడవుగా ఊదారంగు చీరలో 'శారీరక శ్రమవల్ల వచ్చిన సహజమైన ఆకృతితో' నాజూగ్గా ఉంది. పాడటం ఆపకుండానే ఉతికిన బట్టలని ముడతలు లేకుండా గాలిలో నైపుణ్యంగా విదిలించి తాడుమీద పొందిగ్గా వేస్తోంది. ఆరేసిన రంగురంగు బట్టలలో పాటతో సహా ఒక మిశ్రమవర్ణంలా కలిసిపోయి ఆమె అటూ ఇటూ తిరుగుతోంది. ఆమె మొహం స్పష్టంగా కనపడలేదు. కానీ, ఆమె సగటు భారతీయ గ్రామీణ స్త్రీకి ప్రతి రూపంలా కనిపించింది.

ఆ తరువాతి కాలంలో కూడా అతను ఆ డామ్ సైట్‌కి వస్తూనే ఉన్నాడు. కింద ఊర్లో కొత్తగా పూర్తైన ఆధునిక గెస్ట్‌హౌస్‌లో కాకుండా ఆమె పాటకోసం ఆ కొండమీద గెస్ట్‌హౌస్‌లోనే దిగుతూ ఉన్నాడు. మళ్ళీ ఎప్పుడూ ఆమె అతనికి కనిపించనేలేదు, పాట మాత్రం వినపడుతూనే ఉండేది.

కొన్ని నెలలు గడిచాయి. డామ్ పనులు చాలావరకూ పూర్తయ్యాయి. కొంత వ్యవధి తర్వాత మళ్ళీ సాగర్ డామ్ సైట్‌కి వెళ్ళాల్సొచ్చింది. కొండమీది గెస్ట్‌హౌస్‌కి అతడిని తీసుకెళ్ళడానికి అద్దె కారుని డ్రైవ్ చేసుకుంటూ వచ్చిన కోటిని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏం కోటీ, కంపెనీలో మెకానిక్‌గా వస్తున్న జీతం చాలడంలేదా... డ్రైవర్‌గా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నావా?" అడిగాడు సాగర్.

"కంపెనీలో ఉద్యోగం పోయింది సార్" అన్నాడు కోటి దిగాలుగా.

"ఎందుకూ?" ఆందోళనగా అడిగాడు సాగర్.

"ఉద్యోగమిచ్చేటప్పుడు కంపెనీవోళ్ళు యాభైవేలు కాసన్ డిపోజిట్ కట్టమన్నారు సార్. వాళ్ళిచ్చిన ఆర్నెల్లు టైము లోపల కట్టలేకపోయినాను..." అన్నాడు.

కంపెనీ ఇలాంటి విషయాల్లో గట్టిగా ఉంటుంది. సాగర్ ఏమీ మాట్లాడలేక తలదించుకున్నాడు.

కారు గెస్ట్‌హౌస్ చేరేసరికి మధ్యాహ్నమైంది. సాగర్ వెంటనే పని దగ్గరికి వెళ్ళిపోయాడు. రాత్రి తిరిగొచ్చిన సాగర్‌కి పాట వినపడలేదు. నిశ్శబ్దం ముల్లులా గుచ్చుకుంది. ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. ఆరోజే కాదు, మరుసటిరోజూ ఆ మరుసటిరోజూ అతనికి పాట వినపడలేదు. మనసంతా దిగులుకమ్ముకున్నట్టయింది. పనిలో కూడా సరిగ్గా నిమగ్నం కాలేకపోయాడు. 'బహుశా, రాణి ఊర్లో లేదేమో' అనుకున్నాడు. 'ఒకవేళ ఆమెకి ఒంట్లో బాగోలేదేమో'... కొంచెం ఆందోళనపడ్డాడు.

వెళ్ళేరోజు సాగర్ని తీసుకెళ్ళడానికి మళ్ళీ కారు తీసుకొచ్చాడు కోటి.

"ఈసారి పాట వినపడ్లేదు... నీ భార్య ఊరెళ్ళిందా?" కారు కదిలాక అడిగాడు సాగర్.

కోటి వెంటనే జవాబు చెప్పలేదు. "ఉంది

సార్" అన్నాడు నిదానంగా.

"మరి, ఆరోగ్యం బాగాలేదా?"

"రెణ్ణెల్లకిందట కాసన్ డిపోజిట్టు కట్టకపోతే నా ఉద్యోగం తీసేస్తామన్నారు సార్. మా దగ్గిర అంత డబ్బు లేదు. ఒక నెల టైమడిగినాము. మా అమ్మ నా భార్యను పుట్టింటినుంచి కొంత డబ్బు తీసుకురమ్మనింది. వోళ్ళు 'ఇప్పటికే అప్పుల్లో ఉండాము, యీలేము' అన్నారు సార్. అప్పుడు మా ఇంట్లో కొంచెం గలాటా అయ్యింది సార్. నా ఉద్యోగం పోయినప్పటి నుంచి మాయమ్మ నా భార్యతో మాట్లాడటంలేదు, ఏ పనీ చెప్పడం లేదు. ఏరేగా సూస్తాంది. ఇదేమో ఎప్పుడూ ఏడుస్తా దిగాలుగా కూర్చోనుంటాంది సార్" కోటి తన మనసులోని బాధనంతా చెప్పుకున్నాడు.

సాగర్ నిర్ఘాంతపోయాడు. కొద్దిపాటి డబ్బు అవసరాలు పేదవాళ్ళ జీవితాలతో ఎలా చెలగాటమాడుతాయో ప్రత్యక్షంగా చూస్తున్నాడు. కోటిని ఎలా ఓదార్చాలో తెలియలేదు. మౌనంగా ఉండిపోయాడు. కారు కొండదిగి ఊర్లోకి ప్రవేశించింది.

డామ్ సైట్ నుంచి నగరానికి వచ్చినప్పటి నుండీ సాగర్ మామూలుగా ఉండలేకపోతున్నాడు. కోటి విషయం మాట్లాడ్డానికి ఆరోజు హెడ్డాఫీసులోని హెచ్.ఆర్. డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళాడు. ఆ డిపార్ట్‌మెంట్ చీఫ్ సుందరం అతని స్నేహితుడే. సాగర్ వెళ్ళేటప్పటికి సుందరం ఫోన్లో ఎవర్తోనో తీవ్రంగా మాట్లాడుతున్నాడు. సాగర్ని కూర్చోమని చేత్తో సైగచేసి చూపించాడు.

"ఏమిటీ, ఫోన్లో ఎవరిమీదో అరుస్తున్నావ్" అన్నాడు సాగర్ సుందరం ఫోన్ పెట్టేశాక.

"అదా... మన కంపెనీ బెంగుళూరు బ్రాంచీ హెడ్ విషయం. నీకు తెలిసే ఉంటుంది. అతను ఒక వెంచర్‌లో మనవాళ్ళు చెప్పినా వినకుండా అతికిపోయి కంపెనీకి పదికోట్లు నష్టం తెచ్చాడు. అతనిమీద యాక్షన్ ఏమీ ఉండకూడదని పై ఆఫీసు నుంచీ ఆర్డర్సు..."

"పది కోట్లా... మరతన్ని ఏమీ చేయకుండా వదిలేస్తారా?"

"ఏం చేస్తాం... అతనికి పైవాళ్ళలో మంచి పరపతి ఉంది. ఇలాంటి నష్టాలు ప్రతి సంవత్సరం కలుగుతూనే ఉన్నా కంపెనీ చూసీచూడనట్టు ఉంటోంది" అని తలపట్టుకున్నాడు సుందరం.

"అది సరేగానీ, పని జరిగే ప్రదేశాల్లో తాత్కాలిక ఉద్యోగాలిచ్చేటప్పుడు మనం కాషన్ డిపాజిట్ కట్టించుకోవాల్సిన అవసరం ఉందా?" అడిగాడు సాగర్ కోటిని దృష్టిలో పెట్టుకుని.

"అదెప్పటిదో పాతకాలం రూలు. ముఖ్యంగా యంత్రసామగ్రి వాళ్ళ చేతుల్లో పెడతాం కాబట్టి, వాటి రక్షణ కోసం అలా కట్టించుకుంటాం. ఏం, ఎందుకడుగుతున్నావ్?"

"తూర్పుకొండల డామ్ సైట్‌లో 'కోటి' అనే మెకానిక్‌ని యాభైవేలు కాషన్ డిపాజిట్ కట్టలేదని మనవాళ్ళు ఉద్యోగంలోంచి తీసేశారట. వాళ్ళు పాపం చాలా బీదవాళ్ళు. నాకు తెలిసినవాళ్ళు."

"నీకు తెలీందేముందీ... అన్ని రూల్సూ కిందిస్థాయి ఉద్యోగులకే. మన కంపెనీ బిజినెస్ ప్రమోషన్ పేరుతో మొన్న పెద్ద సంఖ్యలో క్లైయింట్లనూ ఉద్యోగులనూ సింగపూర్, మలేషియాలకి కాన్ఫరెన్స్ పేరుతో వారంరోజులు తీసుకెళ్ళింది. దానికైన ఖర్చు ఎంతో తెలుసా... కోటిన్నర" అని నిట్టూర్చాడు సుందరం.

ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉన్నారు.

"అన్నట్టు బోనస్‌గా నీకు అరవైవేలొచ్చాయి. నిన్ననే నీ అక్కౌంట్లో జమ చేశాను" అంటూ ఓ కాగితం సాగర్‌కిస్తూ "ఒకవేళ ఈ బోనస్‌ని నువ్వు డబ్బుగా తీసుకునే బదులు కొత్తకారు కొనుక్కోవాలనుకుంటే మన కంపెనీ నీకు రెండు లక్షలిస్తుంది. ఇదో కొత్త స్కీమ్.

గుండుతోనూ అందం

జుట్టు విపరీతంగా ఊడిపోతోందా? ఉన్న నాలుగు వెంట్రుకలనూ అటూఇటూ సర్దుకోలేక తెగ ఇబ్బంది పడిపోతున్నారా? అయినాసరే ఏమాత్రం బెంగ పెట్టుకోవద్దంటున్నారు పరిశోధకులు. 'సోషల్ సైకలాజికల్ అండ్ పర్సనాలిటీ సైన్స్' మేగజైన్‌లో మూడేళ్ల పరిశోధనా వివరాలను ప్రచురించారు. గుండున్న వ్యక్తులే స్థిరచిత్తంతో, దృఢంగా ముందుకు దూసుకు పోతూ శక్తిమంతమైన నాయకులుగా కొనసాగుతున్నారని తేల్చిన ఈ పరిశోధనను మూడు దశలుగా నిర్వహించారు. మొదటిదశలో జుట్టున్నవారూ, లేనివారిలో ఎవరు ఆకర్షణీయంగా ఉన్నారో ప్రేక్షకులనే గుర్తించమన్నారు. రెండోదశలో ఒకేవ్యక్తి జుట్టుతోఉన్న, జుట్టుతోలేని ఫొటోలలో ఆకర్షణీయమైంది గుర్తించమన్నారు. మూడో దశలో ఇద్దరి మధ్యా వక్తృత్వ, వ్యాసరచన పోటీ నిర్వహించారు. అన్ని దశల్లోనూ జుట్టులేనివాళ్లే ముందున్నట్టు గుర్తించారు. సో, బట్టతల ఉన్నవారూ, జుట్టు మరీ తక్కువగా ఉన్నవారూ దిగులు పడటం మానేసి, పూర్తిగా గుండు చేయించుకోవడం ద్వారా తమ హుందాతనాన్నీ ఆకర్షణనూ మరింత పెంచుకోవచ్చని వారు తేల్చి చెబుతున్నారు.

ఆవులింత ఎంతో మేలు!

ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగల అసాధ్యుల సంగతేమోగానీ అమ్మకడుపు లోని బుజ్జాయి ఆవులింతని మాత్రం మన వైద్యులు స్కాన్ చేయగలుగు తున్నారు. 15 మంది గర్భస్థ శిశువుల్ని పరిశీలించి వాళ్ల ఆవులింతల్ని 4డీ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా స్కాన్ చేశారట. 24 నుంచి 36 వారాల శిశువుల్ని పరిశీలించినప్పుడు- 28 వారాల తరవాత వీళ్లు ఆవులించడం తగ్గిందని చెబుతున్నారు. అయితే దీని ప్రాధ్యానం ఏమిటనేది కచ్చితంగా తెలియకపోయినప్పటికీ దీనికీ ఆ శిశువు ఆరోగ్యానికీ ముఖ్యంగా మెదడు పెరుగుదలకీ కేంద్రనాడీవ్యవస్థకీ సంబంధం ఉందని డర్హమ్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు చెబుతున్నారు.

తింటూనే సన్నబడాలంటే...

ఆకలేసినప్పుడల్లా కడుపునిండా తినేయాలి. మరోపక్క శరీరంలో ఉన్న కొవ్వు మొత్తం కరిగిపోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే కడుపు మాడ్చుకోకుండానే స్లిమ్‌గా తయారవ్వాలి. ఇదేగా మీ కోరిక? ఇంకెందుకాలస్యం, వెంటనే ప్రొటీన్లు ఎక్కువగా ఉండే బీన్స్, నట్స్, చికెన్, గుడ్లు, చేపలు, పీతలు తినడం మొదలుపెట్టే యండి. వీటి అరుగుదలకు ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల ఇవి తిన్న చాలాసేపటివరకూ ఆకలివేయదు. దాంతో ఆ తర్వాత తినే ఆహార పరిమాణం బాగా తగ్గిపోతుంది. సన్నబడటానికే కాకుండా ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ఇంకా ఎన్నో ప్రయోజనాలు న్నాయి. చర్మం ఆరోగ్యంగా నిగనిగలాడుతుంది. జుట్టు పెరుగుతుంది. అంతేకాదు గోళ్లు, ఎముకలు, కండరాలు కూడా దృఢంగా తయారవుతాయి. ఇవన్నీ సరదాకు చెబుతున్న సంగతులు కాదు. పరిశోధనలో వెల్లడైన నిజాలే.

గర్భాశయ మార్పిడి సాధ్యమే!

కృత్రిమ గర్భధారణ గురించి తెలిసిందే. ఇది కూడా సాధ్యపడనివాళ్లకి అద్దెకి అమ్మ కడుపు ఉందన్న సంగతీ మనకు తెలుసు. అయితే దీన్ని అంతా ఇష్టపడకపోవచ్చు. అందుకే ఇప్పుడు గుండెమార్పిడి, కాలేయమార్పిడి, మూత్రపిండ మార్పిడి... మాదిరిగానే గర్భాశయ మార్పిడికి కూడా శ్రీకారం చుట్టారు వైద్యులు. స్వీడన్‌కు చెందిన మైఖేల్ ఒలాసన్ నేతృత్వంలో వైద్య బృందం తొలిసారిగా ఓ తల్లి గర్భాశయాన్ని కూతురికి అమర్చారు. ప్రస్తుతానికి శస్త్రచికిత్స విజయవంతమైనప్పటికీ ఆమె గర్భం దాల్చి పండంటి బిడ్డను ప్రసవించినప్పుడే తమ కృషి ఫలించినట్లని ఈ బృందానికి నాయకత్వం వహించిన మైఖేల్ ఒలాసన్ చెబుతున్నారు. ఇందుకోసం ముందుగానే తల్లీకూతుళ్ల నుంచి ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ కోసమన్నట్లుగా అండాలను సేకరించి ఉంచారు. ఆమె పూర్తి ఆరోగ్యవంతురాలయ్యాక పిండాన్ని గర్భాశయంలోకి ప్రవేశపెడతారట. ఇది పూర్తిస్థాయిలో విజయవంతమవ్వాలనీ నవమాసాలూ మోసి తల్లి కావాలని కలలు కనేవాళ్ల కోరిక ఫలించాలనీ ఆశిద్దాం.

మూడో తరం ఆటగాణ్ని

రాహుల్ ద్రవిడ్ రిటైర్మెంట్ ప్రకటించాక 'ఆ లోటు పూడ్చలేనిది' అన్నారు అంతా. కానీ ద్రవిడ్‌లాంటి క్లాస్‌తో, మనో నిబ్బరంతో బ్యాటింగ్‌చేసే చతేశ్వర్ పుజారాని చూశాక మరో ద్రవిడ్ దొరికాడంటున్నారు. ఈ సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్ గురించి మరిన్ని విషయాలు అతడి మాటల్లోనే...

తాత శివ్‌లాల్ పుజారా ఒకప్పటి 'ధ్రన్‌గధ్రా' సంస్థానం క్రికెట్ జట్టులో ఆటగాడు. నాన్న అర్వింద్, బాబాయ్ బిపిన్ సౌరాష్ట్ర తరపున రంజీ మ్యాచ్‌లు ఆడారు. అంటే, మా కుటుంబంలో నేను మూడో తరం క్రికెటర్‌ని. రెండున్నరేళ్లపుడు నన్ను క్రికెటర్‌ని చేయాలన్న ఆలోచన నాన్నకు వచ్చిందట. ఆ వయసులో రబ్బరు బ్యాట్ పట్టుకొని బంతిని కొడుతున్నపుడు తీసిన ఓ ఫొటోలో నా చూపులో ఏకాగ్రత, బంతిని కొట్టడానికి మునివేళ్లపైకి లేచిన తీరు నాన్నకి స్పష్టంగా కనిపించాయట. అప్పట్నుంచి రోజూ నాతో బ్యాటింగ్ ప్రాక్టీసు చేయించే వారట. అయిదేళ్లు వచ్చినపుడు నాన్న నా గురించి ఊహిస్తున్నది నిజమో కాదో తెలుసుకోవడానికి ఆయన స్నేహితుడూ గుజరాత్ నుంచి భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఫాస్ట్ బౌలర్ కర్సన్ ఘావ్రీ సలహా అడిగారట. ఆయన నన్ను గమనించాక 'అబ్బాయిలో బ్యాట్స్‌మన్ ఉన్నాడు. ఇక చేయాల్సిందల్లా వాడికి సరైన మార్గం చూపించడమే' అని చెప్పారట.

నాన్న రైల్వే ఉద్యోగి. రాజ్‌కోట్‌లోని రైల్వే గ్రౌండ్‌కి రోజూ ఉదయాన్నే నన్ను తీసుకెళ్లి బ్యాటింగ్ నేర్పించేవారు. నాన్నే నాకు కోచ్. ఇంట్లో అంతా తొమ్మిదింటికే నిద్రపోయేవాళ్లం. ఎందుకంటే తెల్లవారి అయిదింటికే లేచి ప్రాక్టీసుకు వెళ్లాలనీ, నా నిద్రకు ఎలాంటి ఇబ్బందీ ఉండకూడదనీ. నా ఆహారం, క్రమశిక్షణ విషయంలో అమ్మ(రీనా) జాగ్రత్తలు తీసుకునేది. ప్రాక్టీసు నుంచి రాగానే కొబ్బరి నీళ్లు ఇచ్చేది. మేం శాకాహారులం. క్రికెటర్‌కి బలం కావాలంటే మంచి ఆహారం ఉండాలని డ్రైఫ్రూట్స్‌తో చేసిన ప్రసాదాలూ మిఠాయిలూ పెట్టేది. ఈరోజు ఎన్ని గంటలైనా క్రీజులో నిలబడగలుగుతున్నానంటే మంచి ఆహారపు టలవాట్లవల్లనే. చిన్నప్పట్నుంచీ అమ్మ నాకు పూజ చేయడం కూడా అలవాటుచేసింది.

సౌరాష్ట్ర అండర్-14 జట్టుకి ఆడినపుడు ట్రిపుల్ సెంచరీ చేశాను. ఆ తర్వాత అవకాశం వచ్చిన ప్రతిసారీ భారీ స్కోర్లు చేశాను. ఆస్ట్రేలియాలో శిక్షణ ఇచ్చే బోర్డర్-గవాస్కర్ జూనియర్ క్రికెటర్ స్కాలర్‌షిప్‌కి ఎంపికయ్యాను. కానీ నాకు అప్పటికి 18 ఏళ్లు నిండలేదు. ఆస్ట్రేలియా బోర్డు మాత్రం 18 ఏళ్లు నిండని క్రికెటర్లకు సంరక్షకుడు ఉండాలంది. కానీ నాతోపాటు మరొకరిని పంపించడానికి అయ్యే ఖర్చు భరించడానికి సౌరాష్ట్ర క్రికెట్ సంఘం కానీ జాతీయ క్రికెట్ అకాడమీ కానీ సిద్ధపడలేదు. నాన్నకూ ఆ శక్తి లేకపోయింది. దాంతో ఆస్ట్రేలియా వెళ్లలేకపోయాను. అందుకు చాలా బాధపడ్డాను.

2005లో భావ్‌నగర్‌లో అండర్-19 మ్యాచ్ ఆడి తిరిగి వస్తున్నాను. నాన్నని బస్‌స్టాప్‌కి పంపమని అమ్మకి ఫోన్ చేశాను. సరేనంది. ఇంటికి వచ్చేసరికి అమ్మ లేదు... చనిపోయింది. అమ్మను క్యాన్సర్ బలితీసుకుంది. నాల్రోజులపాటు ఆ షాక్‌లో ఉండిపోయాను. తర్వాత ముంబయితో మ్యాచ్‌కు వెళ్లాల్సి ఉంటే నాన్న పంపించారు. ఏకాగ్రత కుదరక బాగా ఆడలేదు. ఇంటికి వచ్చాను. నా పరిస్థితిని గమనించి మా కుటుంబ గురూజీ దగ్గరకు తీసుకెళ్లారు నాన్న. ఆయన 'మీ అమ్మ నిన్ను భారత క్రికెట్ జట్టులో చూడాలనుకుంది. ఆమె కోర్కెని నిజం చేయాల్సిన బాధ్యత నీపైనే ఉంది' అని చెప్పారు. ఆరోజు నుంచి దిగులు చెందడం మానేసి పరుగుల వేట కొనసాగించాను. అమ్మ అలవాటు చేసిన ఆహారమే ఇప్పటికీ తింటాను. రోజూ పూజ చేస్తాను.

2006 అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు(349) చేసిన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు సాధించాను. అప్పుడే భారతజట్టులో స్థానం దక్కుతుందని నమ్మకం కలిగింది. 2008లో అండర్-22 టోర్నీలో సౌరాష్ట్ర తరపున రెండు ట్రిపుల్ సెంచరీలు చేశాను. తర్వాత ఒడిశా మీద మరో ట్రిపుల్ సెంచరీ. నెలరోజుల వ్యవధిలో మూడు ట్రిపుల్ సెంచరీలు చేశాను. 2010లో మొదటిసారి భారత టెస్టు జట్టులోకి ఎంపికయ్యాను. తర్వాత గాయం కారణంగా 2011 మొత్తం క్రికెట్‌కు దూరంగా ఉన్నాను. ఈ ఏడాది న్యూజిలాండ్ సిరీస్‌తో నాకు మళ్లీ టెస్ట్ క్రికెట్ ఆడే ఛాన్స్ వచ్చింది. తర్వాత ఇప్పుడు ఇంగ్లండ్‌తో సిరీస్. వన్డే క్రికెట్‌లోనూ అడుగుపెట్టడం, సుదీర్ఘ కాలంపాటు మంచి క్రికెట్ ఆడటం నా ముందున్న లక్ష్యాలు.

ఇంకొంత

24 ఏళ్ల చతేశ్వర్‌ని ఇంట్లో 'చింటూ' అని పిలుస్తారు.

అర్వింద్, రీనాలకు ఏకైక సంతానం.

దూరవిద్యలో బీబీఏ చేస్తున్నాడు.

రాజ్‌కోట్‌కే చెందిన అమ్మాయి పూజ(ఎంబీఏ)తో నిశ్చితార్థం జరిగింది.

సచిన్, సౌరభ్ గంగూలీ, రికీ పాంటింగ్, రాహుల్ ద్రవిడ్‌లకు అభిమాని.

అహ్మదాబాద్‌లో ఇంగ్లండ్‌పై చేసిన అజేయ డబుల్ సెంచరీనే తన కెరీర్‌లో మధుర ఘట్టం అని చెబుతాడు.

నచ్చే డ్రెస్ టీషర్ట్, జీన్స్. 10 డెనిమ్ జీన్స్ ఉన్నాయి.

గోటికి వెల కట్టగలరా?

గోళ్లరంగుల్లో వేనవేల రకాలు... రంగులయితే చెప్పనే అక్కర్లేదు. అయినా ఎన్ని రకాలుంటేనేం... లాస్‌ఏంజెలస్‌కు చెందిన అజాచుర్ అనే జ్యువెలరీ కంపెనీ విడుదల చేసిన నెయిల్‌పాలిష్‌కు మరేవీ సాటిరావు. ఒక్క బాటిల్ ధర సుమారు కోటి నలభై లక్షల రూపాయలు. ఎందుకింత ఘనం అంటే అచ్చంగా 267 క్యారెట్ల నలుపు రంగు వజ్రాలను నూరి మరీ తయారుచేసిన గోళ్లరంగు ఇది. దీన్ని ఇటీవల ఎమ్మీ అవార్డ్స్ సందర్భంగా కెల్లీ ఓస్‌బోర్న్ మాత్రమే ధరించింది. ఈ రంగు వేసుకున్న రోజంతా ఆమె మరే వస్తువుల్ని పట్టుకోలేదట. నిజం చెప్పాలంటే దాని ఖరీదు గుర్తొచ్చి నిద్ర కూడా పట్టలేదట. కెల్లీ కాకుండా దీన్ని వేసుకున్న ఘనత జెన్నిఫర్ లోపెజ్‌కు మాత్రమే సొంతం.

అందమైన కుర్చీ

ఈ కుర్చీని చూడగానే ఇందులో కూర్చునేందుకు చాలామంది సాహసించరు. కూర్చుంటే అదెక్కడ పాడవుతుందోనని కొందరూ, ఒకవేళ కుర్చీకి పొదిగిన రాళ్లేమయినా గుచ్చుకోగలవేమోనని మరికొందరూ భయపడ వచ్చు. కానీ రెండూ జరగవు. ఈ రంగు రాళ్లని ఒకదాని తరవాత ఒకటిగా చేత్తోనే ఎంతో శ్రమకోర్చి మరీ అమర్చారు. అందుకే దీని ఖరీదు కూడా అంతే ఎక్కువ... కేవలం 19 లక్షల రూపాయలు మాత్రమే.

ఖరీదైన పానీయం!

సౌదీ అరేబియా... వంటి మధ్య తూర్పు దేశాల్లో మద్యపానం నిషేధం ఉన్న సంగతి తెలిసిందే. అలాంటిచోట కూడా లండన్‌కు చెందిన ఓ బెవరేజ్ కంపెనీ మార్కెట్లోకి చొచ్చుకుపోగలిగింది. అయితే ఆల్కహాల్‌తో మాత్రం కాదు. 'రువా' అనే ఓ ఖరీదైన పానీయాన్ని అక్కడ విక్రయిస్తోంది. గులాబీలతో తయారయ్యే ఈ నాన్ ఆల్కహాలిక్ డ్రింక్‌ను నిల్వచేసే క్రిస్టల్ బాటిల్‌కి 800 వజ్రాలు, 200 కెంపులు పొదగడంతో పాటు వైట్ గోల్డ్‌ను కూడా వాడారట. అందుకే ఒక్క బాటిల్ రువా కావాలంటే 20 కోట్ల 25 లక్షల రూపాయలు చెల్లించాల్సిందే!

శునకరాణికి పెళ్లంట!

అక్కడకు వచ్చినవాళ్లలో కొందరు 'వావ్' అంటూ చప్పట్లు కొడితే, ఇంకొందరు మాత్రం 'టూ మచ్' అంటూ పెదవి విరిచారట. ఎందుకంటే ఇంతవరకూ ఎవరూ కనీవినీ ఎరగని రీతిలో అక్కడ ఓ శునకవివాహం అంగరంగ వైభవంగా జరిగింది. న్యూయార్క్‌లోని జుమేరియా ఎస్సెక్స్ హౌస్‌లో కాటన్ డె టులెర్ జాతికి చెందిన బేజీ హోప్ డైమండ్ అనే అందాల శునకరాణీ, పూడుల్ జాతికి చెందిన చిలీ పేస్టర్‌నాక్ అనే శునకరాజూ బంధుమిత్రుల సాక్షిగా ఒకటయ్యాయట. ఇందుకోసం సదరు శునకరాణీరాజుల యాజమానులు పెట్టిన ఖర్చు కేవలం కోటీ నలభై లక్షలు మాత్రమే. 'న్యూయార్క్ హ్యూమేన్ సొసైటీ' పెర్‌ఫెక్ట్ మ్యాచ్ అన్న వ్యాఖ్యానంతో ఈ కుక్క జంటని తెగ పొగిడేసింది కూడా. ఈ పెళ్లికి ఇతర జాతుల శునకాలు కూడా హాజరై తమదైన భాషలో ఆశీర్వదించా యట. ఏమాటకామాటే చెప్పుకోవాలంటే ఇప్పటివరకూ జరిగిన శునకవివా హాల్లో ఇదే ఖరీదైనది మరి!

పెళ్లి జంట!

విందుకు వచ్చిన అతిథి శునకం!

ఐఫోన్ సోకు

ఐఫోన్‌ల వెల్లువకి అంతే లేకుండా ఉంది. ఒకదాని తరవాత ఒకటి సరికొత్త ఫీచర్లతో మార్కెట్లోకి వస్తూనే ఉన్నాయి. ఫోన్ ఫీచర్స్‌కు దీటుగా దాని కేస్‌లనీ రూపొందిస్తున్నారు తయారీదారులు. అందులో భాగంగానే తయారైన ఈ ఐఫోన్-5 కేస్ ధర అక్షరాలా అరవై లక్షల రూపాయలు. న్యూయార్క్‌కు చెందిన ద నేచురల్ సెఫైర్ కంపెనీ ఆధ్వర్యంలో తయారవుతోన్న ఈ కేస్‌కి సిలోన్‌కి చెందిన సహజ కెంపులనీ, నీలాలనీ, 18 క్యారెట్ల వైట్‌గోల్డ్‌నీ ఉపయోగించా రట. అర్డరుమీద తయారుచేయించుకోవాలనుకుంటే ఎల్లో, పింక్ సెఫైర్‌లతోబాటు ప్లాటినం కూడా వాడతామని చెబుతున్నారు. ఎంతమంది క్యూ కడతారో వేచి చూడాల్సిందే మరి.

పుత్తడి సింకు

అచ్చంగా 24 క్యారెట్లతో తయారైన ఈ పుత్తడి సింకునిగానీ ఇంట్లో అమర్చుకోవాలనుకుంటే కాస్త ఆలోచించాల్సిందే. ఎక్కడ అంటే అక్కడ కాకుండా సెక్యూరిటీ కూడా ఉండేలా చూసుకోవాల్సిందే అంటున్నారు లగ్జర్ ఎడిషన్ అండ్ గ్యాలరీ కంపెనీకి చెందిన నిర్వాహకులు. ధర సుమారు యాభై లక్షల రూపాయలు. ఈ పుత్తడి సింకుకి అదనపు హంగుకోసం వజ్రాలను కూడా పొదిగారు. కావాలనుకుంటే ఇంకా కెంపులు, పచ్చలు, నీలాలు... ఒకటేముంది... ఏ రాళ్లయినా ఎన్నయినా పొదిగి మరీ చేస్తారట. కేవలం బంగారమేనా... మాకు ప్లాటినం కావాలి అనుకునేవాళ్లకి అవీ చేసి ఇస్తారట. అవునుమరి... ఎంత చెట్టుకి అంత గాలి అని ఊరికే అన్నారా?

బంగారు దోసె తిన్నారా?

...ఇది తినాలంటే బెంగుళూరులోని రాజ్‌భోగ్ రెస్టారెంట్‌కి వెళ్లాల్సిందే. ఎందుకంటే అక్కడ నిజంగానే అచ్చమైన 24 క్యారెట్ల బంగారురేకులతో వేసిన దోసెనే అందిస్తారు. ఆలివ్ నూనె, బంగారు రేకులతో కలిపి వేసే ఈ దోసె ఖరీదు సుమారు 1100 రూపాయలు. ప్రపంచంలోకెల్లా ఖరీదైన దోసె ఇదే. ప్రారంభించిన కొత్తల్లో రోజుకి ఈ దోసెలు ఒకటి రెండయినా తినేవాళ్లు ఉంటారా అనుకునేవారట. కానీ ప్రస్తుతం రోజుకి 30కి పైగా బంగారు దోసెల్ని తినేస్తున్నారట బెంగుళూరు వాసులు. 'పూర్వం రాజులు రోజూ కొద్ది పాళ్లలో బంగారాన్ని తినేవారనీ, ఆయుర్వేద మందుల్లో స్వర్ణభస్మాన్ని వాడతారనీ విన్నాం. అలాగే కిళ్లీలూ స్వీట్లలో బంగారురేకుల్ని వాడటం తెలిసిందే. అదే పద్ధతిలో దోసెలు ఎందుకు వేయలేం అనుకుని వీటిని ప్రారంభించాం' అంటున్నారు నిర్వాహకులు చందన్ లోకేష్. వజ్రాలతో అలంకరించిన కుందేలు ఆకారం దోసె కావాలనుకుంటే మాత్రం 30 వేల నుంచి 9 లక్షల రూపాయల వరకూ బిల్లు కట్టాలి.

రిచ్ గ్లాసెస్

ఈ కళ్లజోడు పెట్టుకుంటే ఎంత రిచ్‌గా కనిపిస్తారో తెలియదుగానీ దీన్ని మించిన కళ్లజోడు మాత్రం ఇంతవరకూ మార్కెట్లోకి రాలేదు. పెట్టుకోవాలంటే 2 కోట్ల 50 లక్షల రూపాయలు చెల్లించాల్సిందే. స్విట్జర్లాండ్‌కు చెందిన లగ్జరీ హౌస్ చోపార్డ్ తయారుచేసిన ఈ గ్లాసెస్‌లో 60 గ్రా. 24 క్యారెట్ల బంగారంతోపాటు 4 క్యారెట్ల వజ్రాలను కూడా వాడారట. పైగా వీటిని పొదిగేందుకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించారట. లుక్ కావాలంటే ఆ మాత్రం రిచ్‌నెస్ ఉండాల్సిందే!

సీతారాములు నడయాడిన శ్రీశైలం

'కార్తీకం... శివుడికి అత్యంత ఇష్టమైన మాసం. అందుకే, హైదరాబాద్‌కి దగ్గరలో ఉన్న అత్యంత మహిమాన్విత క్షేత్రమైన శ్రీశైలం వెళ్లి ఈ కార్తీకంలో శివారాధన చేయాలనుకున్నాం. హైదరాబాద్ చుట్టూ ఇన్ని పుణ్యక్షేత్రాలు ఉండగా శ్రీశైలాన్నే ఎందుకు ఎంచుకున్నామంటే - అందుకు చాలా కారణాలున్నాయి' అంటున్నారు అక్కడ పర్యటించిన ఉమాదేవి దార్వేముల.

ఉపవాసం అంటే భగవంతుడికి సమీపంలో ఉండటం. కార్తీకం లాంటి పవిత్రమాసాల్లో పుణ్యక్షేత్రాల్లో ఉండి, దైవధ్యానం చేస్తే ఎంతో మంచిదట. విశేషించి... కొన్ని క్షేత్రాల్లో చేసే పూజలకు వచ్చే ఫలితాన్ని విలువకట్టలేమని చెబుతున్నాయి శాస్త్రాలు. అలాంటి వాటిలో శ్రీశైలం ఒకటి. కార్తీకమాసంలో ఆ క్షేత్రాన్ని దర్శించుకోవాలని నేను, మావారు, అక్క, బావ, అన్న, వదిన... మొత్తం ఆరుగురం కలిసి బయల్దేరాం. అందరమూ సీనియర్ సిటిజన్లమే.

మధ్యాహ్నం హైదరాబాద్‌లో బస్సు ఎక్కి రాత్రి ఏడున్నరకు శ్రీశైలం చేరుకున్నాం. ముందుగానే మేం మాట్లాడుకున్న కరివెనవారి సత్రానికి వెళ్లి రూములు తీసుకున్నాం. సామాన్లు పెట్టేసి కాళ్లూచేతులూ కడుక్కోకుండా... మా ఆరుగురి కోసం ఫలహారాలు ఉంచమని సత్రంవాళ్లకు చెప్పేశాం. ఇలా ఎందుకూ అంటే... శ్రీశైలంలో అడుగుపెట్టిన వెంటనే మల్లికార్జున శివలింగాన్ని దర్శించుకోవాలి. దాన్ని ధూళి దర్శనం అంటారు. అలా రాత్రి 8.15 గంటలకు మల్లికార్జునుడి దర్శనం చేసుకుని సత్రానికి వచ్చేశాం.

శ్రీశైలమే ఎందుకూ అంటే...

మైనాకం మంధరం మేరుం
శ్రీశైలం గంధమాదనమ్
పంచశైలా పఠేన్నిత్యం
మహాపాతకనాశనమ్

అయిదు మహిమాన్వితమైన పర్వతాలలో శ్రీశైలం ఒకటి.

కేదారే హ్యాద్యకం పీత్వా
వారణాస్యాం మృతస్తథా
శ్రీశైల శిఖరం దృష్ట్వా
పునర్జన్మ నవిద్యతే

కేదారక్షేత్రంలోని నీటిని తాగినా, కాశీలో మరణించినా, శ్రీశైల శిఖరం దర్శించినా పునర్జన్మ ఉండదని పురాణాలు చెబుతున్నాయి.

జ్యోతిర్లింగాలలో రెండోదైన శ్రీశైలం... మన రాష్ట్రంలోని ఏకైక జ్యోతిర్లింగ క్షేత్రం. మనదేశంలో మూడు క్షేత్రాల్లో మాత్రమే జ్యోతిర్లింగమూ, శక్తిపీఠమూ కలిసి ఉన్నాయి. అందులో మొదటిది కాశీ, రెండోది ఉజ్జయిని, మూడోది శ్రీశైలం. పవిత్ర కృష్ణా తీరాన ఏర్పడిన శ్రీశైలానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. రోజూ పూజాకార్యక్రమాలలో సంకల్పం చెప్పుకునేటప్పుడు 'మేరోర్దక్షిణ దిగ్భాగే... శ్రీశైలస్య... ప్రదేశే...' అని దిక్కులను చెప్పడానికి ప్రామాణికంగా తీసుకున్న గొప్ప పర్వతం ఇది. భాగవత, మహాభారతాల్లో దీని ప్రస్తావన కనిపిస్తుంది. అందుకు నిదర్శనంగా పాండవులు స్థాపించిన శివలింగాలు ఇక్కడ కనిపిస్తాయి.

ఇక, రామాయణం విషయానికొస్తే... శ్రీశైలానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సీతారాములిద్దరూ వేర్వేరుగా సహస్ర లింగాలను ప్రతిష్ఠించిన అరుదైన క్షేత్రమిది. దశావతారాల్లో రామావతారం ప్రతిష్ఠించినన్ని శివలింగాలను మరే అవతారమూ ప్రతిష్ఠించలేదు. శివకేశవుల అభేదానికి చిహ్నమా అన్నట్టు... చాలా ఆలయాల్లో 'రామలింగేశ్వరుడు' కనిపిస్తాడు. నరరూపంలో వచ్చిన రాముడు... లింగప్రతిష్ఠ ఎంత గొప్పదో మానవులకు చెప్పడానికే ఇలా చేశాడట. ప్రతిరోజూ సాయంత్రం ఆ పరమేశ్వరుడు వృషభారూఢుడై ఈ క్షేత్రంలో విహరిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

శ్రీశైలం ప్రత్యేకతల్లో ఇవికొన్ని మాత్రమే. తెలియనివి ఇంకెన్నో.

పదే పదే చూడాలని...

శ్రీశైలంలో అడుగుపెట్టిన వాళ్లు ఎవరైనా... వీలైనన్ని ఎక్కువసార్లు భ్రమరాంబా మల్లి

వ్యాసకర్త

శ్రీ భీమశంకర జ్యోతిర్లింగ క్షేత్రం భీమశంకరం (మహారాష్ట్ర)

ఈటీవీ2

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఆరవ జ్యోతిర్లింగ క్షేత్రం 'భీమశంకరం'. మహారాష్ట్రలోని పూణే జిల్లా ఖేడ్ తాలూకాలో ఉన్న ఈ క్షేత్రానికి ఘాట్‌రోడ్ యాత్ర పూణే వద్దనున్న ఘోడేగావ్ నుంచి ప్రారంభమవుతుంది. సముద్రమట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తున ఉండే ఈ ఆలయాన్ని రఘునాథ్ పీష్వా అనే భక్తుడు, పీష్వాల దివాన్ అయిన నాడా ఫడన్వేష్ నిర్మించారు. 1437లో చిమన్‌జీ అంతాజీ, నాయక్ షిండేలు పునర్నిర్మించారు. శివుడు అంతమొందించిన త్రిపురాసుని భార్యలు ఢాకినీ శాకినీలలో ఢాకినీ పేరున 'ఢాకిన్యాం భీమశంకరం'గా వెలసిన ఈ జ్యోతిర్లింగ దర్శనం కార్తీకమాసం సందర్భంగా నేటి సాయంత్రం మీకోసం...

తీర్థయాత్ర ఈరోజు సాయంత్రం 4.30 గంటలకు

త్రిపురాంతకుడు

త్రిపురసుందరీదేవి

కార్జునులను దర్శించుకోవాలనుకుంటారు. మేం కూడా అలాగే అనుకున్నాం.

మర్నాడు తెల్లవారుజామున మూడు గంటలకే కాలకృత్యాలన్నీ ముగించుకుని... సుప్రభాత దర్శనం టిక్కెట్లు తీసుకుని గుడిలోకి వెళ్లాం. ఈ టిక్కెట్టు పదిమందికే ఇస్తారు. అద్దాల గదిలో పవళించిన స్వామిని... ముందు వృషభం నడుస్తుండగా గర్భగుడిలోకి భక్తులతోపాటు తీసుకొస్తారు. సుప్రభాత సేవచేసి, రుద్ర నమకమూ చమకాలతో అభిషేకం చేస్తారు. దర్శనం చేసుకున్నాక రూముకి వచ్చి కాఫీ తాగి మళ్లీ ఎనిమిది గంటలకు దర్శనానికి వెళ్లాం. అభిషేకం టిక్కెట్లు తీసుకుని గర్భగుడిలో అభిషేకం చేసుకున్నాం. తరవాత కుంకుమార్చన టిక్కెట్టు తీసుకుని అమ్మవారికి కుంకుమార్చన చేశాం.

భ్రమరాంబాదేవి... అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటి. సతీదేవి మెడభాగం శ్రీశైలంలో పడిందని పురాణగాథ.

కుంకుమార్చన అయ్యాక బయటకు వచ్చి ప్రసాదం స్వీకరించాం. తరవాత స్వామివారి గుడిపక్కన... పాండవులు ప్రతిష్ఠించిన శివలింగాలనూ, వృద్ధ మల్లికార్జునుడి లింగాన్నీ చూశాం. ఇక్కడే రాముడు ప్రతిష్ఠించిన సహస్రలింగం ఉంది.

వృద్ధ మల్లికార్జునుడి ఆలయానికి తూర్పున పెద్ద వృక్షమూ, దానిచుట్టూ అరుగూ కనిపిస్తాయి. దాన్నే త్రిఫల వృక్షం అంటారు. రావి, జువ్వి, మేడి... ఒకేచోటి నుంచి ఒకే వృక్షంలా కనిపించే ఈ వృక్షం కింద కూర్చుని దత్తాత్రేయుడు, శంకర భగవత్పాదులు వంటి మహానుభావులు తపస్సు చేశారట. అంత పవిత్రమైన ఆ వృక్షానికి మేమూ ప్రదక్షిణలు చేశాం. ఆడవాళ్లంతా అక్కడ దీపాలు వెలిగించారు. తరవాత సత్రానికి వచ్చి భోంచేసి, విశ్రాంతి తీసుకున్నాం.

అమ్మవారు అష్టభుజి

శ్రీశైలానికి ఈ పేరు రావడం వెనుక ఒక పురాణగాథ ఉంది. పూర్వం వసుమతి అనే ముని కుమార్తె పరమశివుడి కోసం తపస్సు చేసిందట. తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన శివుడు వరం కోరుకోమన్నాడట. అప్పుడామె... తనపేరును శ్రీగా మార్చి, ఆ ప్రాంతాన్ని తన పేరుమీద ప్రసిద్ధి చెందేలా చేయమని కోరుకుందట. శివుడు అలాగే వరమిచ్చాడట. అప్పట్నుంచీ దీనికి శ్రీగిరి అని పేరు వచ్చిందనీ. కాలక్రమంలో శ్రీశైలం అయిందనీ చెబుతారు.

శ్రీశైల ఆలయాన్ని రాతితో కట్టారు. చుట్టూ నాలుగు గోపురాలతో కోటగోడల్లాంటి ఎత్తైన ప్రాకారంలో విశాలమైన ప్రాంగణంలో ఉంది ప్రధానాలయం. ఇందులో మల్లికార్జునుణ్ణి దర్శించుకునేముందు స్వామికి కుడివైపున ఉన్న రత్నగర్భ గణపతిని దర్శించుకోవాలి. దేశంలో మరెక్కడా ఇలాంటి గణపతి కనిపించడు. తరవాత మల్లికార్జున లింగాన్ని దర్శించుకోవాలి. ఈ లింగానికి మరో ప్రత్యేకత ఉంది. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ లింగాన్ని చేతులతో స్పృశించి, తలను కూడా తాకించి నమస్కారం చేసుకోవచ్చు. స్వామిని దర్శించుకున్నాక లింగానికి ఎడమవైపున ఉన్న భద్రకాళీ సమేత వీరభద్ర స్వామికి నమస్కరించుకుని బయటకు వస్తారు.

స్వామిని దర్శించుకున్నాక భ్రమరాంబాదేవి దర్శనం చేసుకున్నాం. ఇక్కడే సీతాదేవి ప్రతిష్ఠించిన సహస్రలింగం కనిపిస్తుంది. ఇక, భ్రమరాంబాదేవి... అష్టభుజాలతో ఉండే అమ్మవారు. ఆయుధాలు ధరించి, మహిషంపై కాలుంచి నిల్చుని ఉంటుంది. కానీ, పూజారులు చేసే అలంకారం వల్ల కూర్చున్నట్టుగా ఉండి, కేవలం రెండు చేతులే కనిపిస్తాయి.

ఎన్నో ఉపాలయాలు

శ్రీశైల క్షేత్రంలో ఉన్నన్ని ఉపాలయాలు మరే క్షేత్రంలోనూ ఉండవంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ అణువణువూ ఒక పుణ్యధామమే. అందుకే, భక్తులు వాటిని చూడటానికి ప్రత్యేక వాహనాల్లో వెళ్తుంటారు. అలాగే మేం కూడా మధ్యాహ్నం రెండు గంటలకు జీపు మాట్లాడుకుని సాక్షి గణపతి, శ్రీశైలం డ్యాము, హాటకేశ్వరస్వామి, శ్రీశైల శిఖరం, ఫాలధార, పంచధార చూశాం.

ఫాలధార, పంచధార... చాలా విశిష్టమైన ప్రదేశం. ఫాలధార అంటే... శివుడి ఫాల(నుదుటి) భాగం నుంచి వచ్చిందట. ఇక, పంచధార... పరమేశ్వరుడి అయిదుముఖాల నుంచి వచ్చిన ధార అని చెబుతారు. ఆదిశంకరాచార్యులవారు ఇక్కడ కూర్చుని శివానందలహరి రచించారు.

ఇంకా అక్కమహాదేవి గుహలు, మల్లికాగుండం, కదళీవనం, బయలు వీరభద్రస్వామి, ఇష్టకామేశ్వరీదేవి, సప్తమాతృకలు... ఇలా చాలా ఉన్నాయి. సమయాభావం వల్ల వీటిని చూడలేకపోయాం.

త్రిపురాంతకుడి దర్శనమూ...

శ్రీశైలం అష్టదళపద్మమనీ... దానికి ఎనిమిది దిక్కుల్లోనూ ఉన్న క్షేత్రాలు అష్టదళాలనీ చెబుతోంది స్కందపురాణం. ఈ క్షేత్రానికి తూర్పున త్రిపురాంతకం, దక్షిణాన సిద్ధవటం, పశ్చిమాన అలంపురం, ఉత్తరాన ఉమామహేశ్వరం ప్రధాన ద్వారాలుగా విరాజిల్లుతున్నాయి.

వీటన్నింటినీ చూడలేకపోయినా కనీసం ఒక్కటైనా చూడాలని దగ్గరలో ఉన్న త్రిపురాంతక క్షేత్రానికి బయల్దేరాం. ప్రకాశం జిల్లాలో ఉన్న ఈ క్షేత్రం శ్రీశైలం నుంచి సుమారు 80 కి.మీ. దూరంలో ఉంది. పరమేశ్వరుడు త్రిపురాసుర సంహారం తరవాత ఇక్కడ కొండపై వెలిశాడని స్థలపురాణం. సాధారణంగా ఆలయాలకు తూర్పు లేదా ఉత్తర ద్వార ప్రవేశం ఉంటుంది. కానీ, ఈ ఆలయాన్ని రాక్షస ఆగమశాస్త్రం ప్రకారం నిర్మించడం వల్ల నైరుతి ద్వారంగుండా లోపలికి వెళ్లాలి. త్రిపురాంతకుడికి ఇరువైపులా భద్రుడు, వీరభద్రుడు ఉంటారు. ఈ ఆలయానికి వెనుక సుమారు కిలోమీటరు దూరంలో బాలాత్రిపురసుందరీదేవి ఆలయం ఉంది. ఇది చెరువులో ఉండటం విశేషం. లలితాసహస్రనామాల్లో అమ్మవారిని 'చిదగ్నికుండ సంభూతా' అని కీర్తిస్తారు. అంటే, అమ్మవారు చిదగ్నికుండం నుంచి ఉద్భవించిందని అర్థం. ఆలయంలోని ఈ చెరువే చిదగ్నికుండమనీ, ఇందులోంచి జన్మించిన జగన్మాతే భండాసురుణ్ణి వధించిందనీ చెబుతారు. అగ్నికుండంలోంచి వచ్చిందని చెప్పే అమ్మవారి విగ్రహం వెనక్కు తిరిగి ఉంటుంది. ఆలయంలోని బావిలో కొలువైన ఆమె రూపం ఎలా ఉంటుందో ఎవ్వరికీ తెలీదు. అందుకే, భక్తుల సందర్శనార్థం మరో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారిని కదంబ వనవాసిని అని పిలుస్తారు. అందుకు, నిదర్శనంగా ఇక్కడ కదంబ వృక్షాలూ ఉన్నాయి.

త్రిపురాంతకం చూశాక మళ్లీ శ్రీశైలం బయల్దేరాం. అక్కడే భోజనం చేసి, మధ్యాహ్నం రెండింటికి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యాం. శ్రీశైలం, త్రిపురాంతకాలలో ఆ మహాదేవుణ్ణి దర్శనం చేసుకున్నాక మనసుకు ఎంతో ప్రశాంతంగా అనిపించింది. అందుకు కారణం... కార్తీకంలో రెండు విశిష్ట క్షేత్రాలను దర్శించుకున్నామన్న సంతోషమే.

...అయినా కంటతడి పెట్టలేదు

"అనుకున్నది అనుకున్నట్టు జరిగితే అది జీవితమే కాదు. జరిగింది మంచికే అనుకోకపోతే ఆనందమే ఉండదు. కొన్ని అనుకున్నవి జరిగాయి. అనుకోనివీ కొన్ని జరిగాయి. ఎందుకిలా జరిగిందని బాధగానీ... ఇలా జరిగితే బాగుండేదన్న అత్యాశగానీ ఏరోజూ కలగలేదు."

- ప్రముఖ నటుడు సుమన్.

సినిమాకి స్క్రిప్ట్ ఉంటుంది. కానీ... జీవితానికి ఉండదు. సినిమాకి స్క్రీన్ ప్లే ఉంటుంది. కానీ... జీవితానికి ఉండదు.

అనుకున్నట్టు సినిమాను తీయగలరు. కానీ... రేపేం జరుగుతుందో ఎవ్వరూ ఊహించలేరు. నేనైతే సినిమాల్లోకి వస్తానని ఊహించలేదు. హీరో కాగలనని కలలు కనలేదు. నా ఊహలన్నీ వేరుగా ఉండేవి. కానీ... పైవాడి స్క్రీన్‌ప్లే మరోలా ఉంది!

గాల్లో అనుకున్నా

చిన్నప్పుడు నాకు ఆకాశమంటే ఇష్టం. అలా చూస్తూంటే సమయం తెలిసేది కాదు. ఎగురుతున్న పక్షులూ నెమ్మదిగా కదులుతున్న మబ్బులూ అప్పుడప్పుడూ పేద్ద శబ్దం చేస్తూ వెళ్తూన్న విమానాలు... సరిగ్గా అక్కడే నా చూపు ఆగిపోయేది. ఆకాశంలో నాకు కనిపించిన విమానం కనుమరుగయ్యేంత వరకూ కళ్లు అక్కడే చిక్కుకునేవి. ఒక్కోసారి... ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు విమానం వెళ్తున్న శబ్దం వినిపిస్తే వెంటనే వాకిట్లోకి పరిగెత్తేవాణ్ని. 'అలా భోజనం మధ్యలో వెళ్లకూడదు' అని అమ్మ తిడుతుండేది. మొత్తానికి విమానాలు అంటే ఒక ప్యాషన్ ఏర్పడింది. దాంతో పెద్దైతే పైలెట్‌ని కావాలని కలలు కనడం మొదలుపెట్టాను. అప్పుడప్పుడూ చెన్నైలోని ఎయిర్‌పోర్ట్ దగ్గరకి వెళ్ళి విమానాలు ఎలా ల్యాండ్ అవుతున్నాయో ఎలా టేకాఫ్ అవుతున్నాయో జాగ్రత్తగా గమనిస్తుండేవాణ్ని. ముందే చెప్పాగా... అన్నీ మనం అనుకున్నట్టు జరగవని. నాకు పైలెట్ అవ్వాలనుంటే... అమ్మ మాత్రం 'నువ్వు బాగా చదువుకుని పేద్ద డాక్టర్‌వి కావాలి' అనేది. అమ్మ పేరు కేసరి చందర్. మద్రాస్ ఎతిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్. నాన్న సుశీల్ చందర్. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో పనిచేసేవారు. నేను కూడా బాగానే చదువుకునేవాణ్ని. పైలెట్ కావాలనుకున్న కలని అమ్మకోసం మార్చుకున్నాను. అమ్మ కోసం డాక్టర్‌ని కావాలని నిర్ణయించుకున్నాను. మైండ్ సెట్ మార్చుకుని సైన్స్‌ను చదవడం ప్రారంభించాను. అయితే... పైవాడి స్క్రీన్‌ప్లే మరోలా ఉంది.

సరదాకే అనుకున్నా

ఓసారి ఎవరో కరాటే సాధన చేస్తుండటం చూశాను. నాకూ చేయాలనిపించింది. ఆర్.వి.టి. మణి అనే మాస్టర్ ఉంటే ఆయన్ని కలిశాను. సరదాపడి నేర్చుకుందామని వెళ్లాను. కానీ, శిక్షణ మాత్రం కఠినంగా ఉండేది. అయినా ఆ క్రమశిక్షణ నచ్చింది. ఏకాగ్రతతో సాధన చేసి బ్లాక్‌బెల్ట్ సాధించాను. కరాటే సాధన దినచర్యలో భాగంగా మారిపోయింది. స్కూల్లో ఉన్నప్పుడే వీణ నేర్చుకున్నాను. కాలేజీకి వచ్చాక... సంగీతంపై మరింత ఆసక్తి కలిగింది. పాటలు వినడమంటే చాలా ఇష్టం. గిటారు శబ్దం ఎక్కడ వినపడినా... నిలబడిపోయేవాణ్ని. టీవీల్లో ఏదైనా కచేరీ కనిపించినా వేదికలపై ఎవరైనా గిటారు వాయిస్తున్నా... నా ధ్యాసంతా గిటారుమీదే ఉండేది. దాంతో ఓ శుభముహూర్తాన గిటారు నేర్చుకోవాలని డిసైడ్ అయ్యాను. కళ్లు మూసుకుని గిటారు వాయిస్తుంటే... నాకు నేనే ఓ రాక్‌స్టార్ అని ఫీలైపోతుండేవాణ్ని. నేను గిటారు పట్టుకుని నిలబడితే సినిమా హీరోలా ఉంటానని స్నేహితులు ఉబ్బేస్తుండేవారు. ఆ పొగడ్త కాస్త కిక్‌ని ఇచ్చేది. కానీ... నిజంగానే సినిమాల్లోకి వెళ్లి హీరోని అయిపోవాలని ఎప్పుడూ అనుకోలేదు. అయితే...

పైవాడి స్క్రీన్‌ప్లే మరోలా ఉంది!

ఒకటి చాల్లే అనుకున్నా

అనుకోకుండా ఓ సినిమాలో నటించే అవకాశం తలుపుతట్టింది. స్నేహితుల ద్వారా నా గురించి తెలుసుకున్న ఓ నిర్మాత 'ఓ తమిళ చిత్రంలో హీరో వేషం ఇస్తాం చేస్తావా' అని అడిగారు. అప్పటికి సినిమా అంటే నాకు ఎలాంటి మోజూ లేదు. దాంతో ఎటూ తేల్చి చెప్పలేక ఈ విషయం అమ్మకి చెప్పండని వాళ్లను అమ్మ దగ్గరకి పంపించేశాను. తిరిగి బంతి నా కోర్టులోనే పడేసింది అమ్మ! 'వాడికి ఆసక్తి ఉంటే సరదాగా కొద్దిరోజులు షూటింగ్‌కి తీసుకెళ్లండి. ఇందులో నాకెలాంటి అభ్యంతరమూ లేదు' అంది. ఏం చేద్దాం... అని ఆలోచనలోపడ్డాను. నాకు డాన్సు రాదు. నటనలో ఎలాంటి శిక్షణా తీసుకోలేదు. ఫైటింగులు చేయడం అస్సలు రాదు. మరెలా...? సర్లే, షూటింగ్ కొద్దిరోజులే అంటున్నారు కదా... సరదాగా ఎలాగోలా



మనిషికో టాలెంట్

ఎన్టీ రామారావు
సమయపాలన, క్రమశిక్షణ నేర్చుకున్నాను.

అక్కినేని నాగేశ్వరరావు
నటనలో క్లాస్ టచ్ ఆయనకే సాధ్యం.

కృష్ణ
కొత్తదనం, ప్రయోగాలకి సిద్ధపడే తత్వం.

కృష్ణంరాజు
పనికీ ఆనందానికీ ఆయన పాటించే సమయ విభజన.

శోభన్‌బాబు
కొన్ని విలువలకు కట్టుబడి ఉండటం.

కమల్‌హాసన్
నటుడిగా ఒక చట్రంలో ఇమడని విలక్షణం.

చిరంజీవి
ప్రతీ ఒక్కరినీ గౌరవించే గుణం. డాన్స్ బాగుంటుంది.

రజనీకాంత్
స్టైల్, అందరికీ మర్యాదనిచ్చే మంచి గుణం. నాకే సమస్య వచ్చినా రజనీకాంత్‌కి ఫోన్ చేస్తుంటాను.

లాంగిచేద్దాం అని నిర్ణయించుకున్నాను. అలా 'నీచల్ కులం' అనే తమిళ చిత్రం ద్వారా అనుకోకుండా నటుడినయ్యారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి కాకముందే 'నల్లడే నరంది తీరుం' అనే మరోచిత్రంలో అవకాశం వచ్చింది. అదీ కాదనలేకపోయాను. అప్పుడే భానుచందర్‌తో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజులకే భానూ నేనూ మంచి మిత్రులమయ్యాం. అనుకోకుండా తమిళంలో అవకాశాలు వస్తుండటంతో తమిళ సినిమాలే చేద్దాం అనుకున్నాను. పైగా నాకు తెలిసిన భాష తమిళం. మా మాతృభాష తుళు. మా పూర్వీకులది కర్ణాటకలోని మంగళూరు. నాన్నా అమ్మా ఉద్యోగరీత్యా మద్రాసులో స్థిరపడటంతో నాకు తమిళమూ వచ్చేసింది. కాబట్టి కేవలం తమిళ చిత్రాలే చేద్దామని నిర్ణయించుకున్నాను. అయితే...

పైవాడి స్క్రీన్‌ప్లే మరోలా ఉంది.

బానే ఉంది అనుకున్నా

'నువ్వు తెలుగు సినిమాల్లో నటించి తీరాలి. నా మాట విను. అక్కడ నువ్వు స్టార్‌గా ఎదుగుతావు. ఒక్కసారి ప్రయత్నించు' అని ఓరోజు భానుచందర్ నన్ను బతిమలాడటం మొదలుపెట్టాడు. నాకు తెలుగు తెలియదు బాబూ వదిలేయ్ అన్నా వినలేదు. 'నేను కూడా ఆ చిత్రంలో నటిస్తున్నాను. నీకెలాంటి ఇబ్బందీ రాకుండా చూసుకుంటా' అని భాను భరోసా ఇచ్చాడు. దాంతో 'ఇద్దరు కిలాడీలు' అనే చిత్రం ద్వారా తెలుగులోకి వచ్చాను. ఆ తరువాత 'తరంగిణి'లో నటించాను. ఈ చిత్రం 'ఇద్దరు కిలాడీలు' కంటే ముందుగానే విడుదలైంది. తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. దాంతో వరుసగా అవకాశాలు వచ్చిపడుతుండేవి. వరుస హిట్లు. ఎప్పుడో నేర్చుకున్న కరాటే... సినిమాల్లోకి వచ్చాక ఉపయోగపడుతుందని ఎప్పుడూ ఊహించలేదు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉండటం వల్ల ఫైట్లు కొత్తగా చేసేవాణ్ని. డూప్ లేకుండా సాహసాలు చేసేవాణ్ని. అలా ఒక కొత్త ట్రెండ్‌ని తీసుకొచ్చాను. నటనలోనూ డాన్స్‌లోనూ శిక్షణ లేదు. కాబట్టి చాలా కష్టపడుతుండేవాణ్ని. అప్పట్లో నాకు చిరంజీవే పోటీ. అదీ చాలా హెల్దీ కాంపిటేషన్. నా చిత్రాల్లో నేనేదైనా బాగా చేస్తే చిరంజీవి అభినందించేవారు. నేనూ అలాగే నా అభిప్రాయాన్ని తెలియజేసేవాణ్ని. నెమ్మదిగా తెలుగులో తిరుగులేని నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాను. ముఖ్యంగా మహిళా అభిమానులు ఎక్కువయ్యారు. అప్పట్లో నా సినిమాలకు సాయికుమార్ డబ్బింగ్ చెబుతూండేవాడు. నా బాడీ లాంగ్వేజ్‌కి సాయి గొంతు సరిగ్గా కుదిరేది. ఇంకేముంది నటుడిగా ఇక తిరుగులేదు, దూసుకుపోతున్నాను అనుకున్నా, అయితే...

పైవాడి స్క్రీన్‌ప్లే మరోలా ఉంది!

మంచికే అనుకున్నా

అనుకోకుండా ఒక కేసు నా మెడకు చుట్టుకుంది. అరెస్టయ్యి జైల్లో పడ్డాను. నా వెనకేం జరుగుతుందో ఇక ముందేం జరగనుందో ఏమీ అర్థం కాలేదు. అయితే, ఆ సమయంలో కొందరు నిర్మాతలూ నటులూ సుహాసినీ సుమలతా భానుప్రియ లాంటి హీరోయిన్లూ నాకు బాసటగా నిలిచారు. విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి 'సుమన్ చాలా మంచివాడు' అని చెప్పారు. నా అభిమానులు కూడా వెంట నిలిచారు. జైల్లో దాదాపు ఆరునెలలు గడపాల్సి వచ్చింది. అయితే... ఈ మొత్తం ఎపిసోడ్‌లో నేను కంటతడిపెట్టిన క్షణంగానీ ఆత్మవిశ్వాసం కోల్పోయిన రోజుగానీ లేదు. బాధపడలేదు. పైవాడు ఏదో ఆడిస్తున్నాడు... నేను ఆడుతున్నాను, అంతే! ఇదే ఫిలాసఫీకి కట్టుబడ్డాను. జైలు జీవితం నా ఆలోచనా విధానాన్ని చాలా ప్రభావితం చేసింది. ప్రతి మనిషీ డబ్బుకోసమే బతుకుతుంటాడు అంటారు. కానీ, నిజమైన సంపద అంటే ఆత్మీయుల్ని సంపాదించుకోవడమని తెలిసింది. నేను జైల్లో ఉన్నానని తెలిసి ఎంతోమంది వచ్చి పలకరిస్తూ ఉండేవారు. నాకు ధైర్యం చెబుతూండేవారు. వీళ్లంతా ఎవరు? నాకేమవుతారు? నా కోసం ఎందుకు బాధపడుతున్నారు? నాకు తెలియకుండా ఇంతమంది అభిమానాన్ని నేనెలా పొందగలిగాను...' అనిపించింది. నాకంటే అదృష్టవంతులు ఇంకెవరుంటారు అనిపించింది. అందుకే జైలు జీవితం బాధనిపించలేదు. ఆర్నెల్లకే జైలు నుంచి బయటకి వచ్చేశాను. కానీ, ఆ కేసు కోసం ఓ మూడేళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగాల్సివచ్చింది. నా జీవితంలో అత్యంత ఇబ్బందికరమైన దశ అది. ఆ తరువాత నటుడిగా నా కెరీర్ ఏమౌతుందోనని కాస్త ఆలోచనలో పడ్డాను. 'జైలుకెళ్లొచ్చాను కదా. అభిమానులు నన్ను సరిగా రిసీవ్ చేసుకోరు' అనుకున్నాను. అయితే... పైవాడి స్క్రీన్‌ప్లే మరోలా ఉంది!

దేవుడే అనుకున్నా

బందిపోటు, 20వ శతాబ్దం, దోషి-నిర్దోషి, ఆత్మబంధం, పెద్దింటల్లుడు, మొండిమొగుడు పెంకిపెళ్లాం, పరువు-ప్రతిష్ఠ, బావ-బావమరిది... వరుస హిట్లు. మళ్లీ ఫామ్‌లోకి వచ్చేశాను. ఆ తరువాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించడం మొదలుపెట్టాను. ఎప్పుడూ హీరో పాత్రలు చేస్తూ ఉండాలంటే... వయసు ఒప్పుకోదుగా! నాకు నటించడం ప్యాషన్. కాబట్టి ఏ పాత్ర వచ్చినా నటిస్తూనే ఉన్నాను. ఈ మధ్యకాలంలో నాకు అత్యంత సంతృప్తిని మిగిల్చిన చిత్రాలు రెండున్నాయి. 'అన్నమయ్య'లో వేంకటేశ్వరుడి వేషం నాచేత వేయించారు రాఘవేంద్రరావు. అది నా అదృష్టం. ఇప్పటికీ ఆ సినిమా చూస్తుంటే... నాకా పాత్ర రావడం దైవలీల అనిపిస్తూంటుంది. 'శివాజీ'లో రజనీకాంత్ హీరో... నేను విలన్. నాలో నటుడికి భిన్నమైన కోణం ఆ పాత్ర. ఒక హీరోగా సంతృప్తికరమైన కెరీర్ నాది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే వందల రోజులు ఆడిన చిత్రాలు చాలా ఉన్నాయి. ఇప్పుడూ నటుడిగా మరో రకమైన సంతృప్తి కలుగుతోంది. మూడుతరాల నటులతో కలసి పనిచేసే అవకాశం దక్కింది.

ఇక, నా కుటుంబం విషయానికొస్తే... డి.వి. నరసరాజుగారి మనవరాలు శిరీషను పెళ్లి చేసుకున్నాను. మాకో పాప.. అఖిలజ ప్రత్యూష. ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. మెడిసిన్ చేయాలనుకుంటోంది. కూచిపూడి నృత్యం నేర్చుకుంది. నాకు ఖాళీ ఉందంటే ఇంట్లోనే ఉంటాను. పార్టీలూ పబ్‌లూ నచ్చవు. నా భార్య ఏం వండితే అదే తింటాను. తరచూ కరాటే సాధన చేస్తుంటాను. అదే నా ఫిట్‌నెస్‌ని కాపాడుతోంది. ఇక, దైవభక్తి... చెప్పాగా అంతా ఆయన స్క్రీన్‌ప్లే ప్రకారమే నడుస్తోందని!

– *జి.వి.వి.సత్యనారాయణరెడ్డి, ఈజేయస్*

అదిగో యుగాంతం!

డిసెంబరు 21న యుగాంతం అయిపోతుందన్న పుకారు ప్రపంచ మంతటా షికారు చేస్తుంది. అయినా సరే ఏమాత్రం నిరాశ పడొద్దంటోంది రష్యాకు చెందిన ఒక సంస్థ. కొత్త రకం కిట్టులను మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టింది. దీనిలో వోడ్కా బాటిల్, నోట్‌ప్యాడ్, పెన్సిలు, తాడు, గేమ్స్‌కార్డు లు, చేపలడబ్బా, బ్రెడ్డు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టె ఉంటాయి. ఈ కిట్టు ఒకటి కొనేసుకుంటే ప్రమాదం నుంచి గట్టెక్కుతారని కాదు, ఊహించనిది జరిగి ఎక్కడైనా ఇరుక్కుపోతే బోరు కొట్టకుండా ఉండటానికే ఈ చిరు ప్రయత్నమట. ఏదేమైనా వ్యాపార సంస్థలకు ముందుచూపు కాస్త ఎక్కువే సుమా!

పెళ్లికూతురు ఏడవాల్సిందే

పెళ్లికళ అందంగా అద్భుతంగా కనిపించేది పెళ్లి కూతురి మొహం లోనే. భాగస్వామితో కలిసి కోటి ఆశలతో కొత్త జీవితంలోకి అడుగు పెడుతున్న ఆనందం ఆమె కళ్ళలో కొలువుతీరుతుంది. అలాకాకుండా పెళ్లికి ముందు పెళ్లికూతురు భోరున విలపిస్తే అశుభమని అంతా కంగారుపడిపోవడం ఖాయం. చైనాలోని తుజీ తెగకు చెందినవారి పెళ్లిలో మాత్రం పెళ్లికూతురు గట్టిగా ఏడవాల్సిందే. ఇది క్రీస్తుపూర్వం నుంచీ ఎంతో పవిత్రంగా కొనసాగిస్తున్న ఆచారం. పెళ్లి కూతురు ఏడవకపోతే అతిథులంతా ఆమె జీవితం ఏమైపోతుందోనని ఆందోళన చెందుతారట. సంతోషంతో పెళ్లికూతురికి ఏడుపే రాకపోతే తల్లి రెండు తగిలించైనా ఏడిపిస్తుందట.

చావు మంచికే

మానసిక సమస్యలూ విపరీతమైన ఒత్తిడితో బాధపడుతున్న పేషెంట్లను హాయిగా చనిపోమంటున్నారు చైనా సైకాలజిస్టులు. ఇదెక్కడి గొడవని ఆశ్చర్య పోకండి... అంతా పేషెంటు బాగుకోసమే. ఈ చావు అనుభవం కోసం పేషెంటును ముందుగా ఒక గదిలోకి పంపిస్తారు. అక్కడ ఉండే పుస్తకంలో చనిపోయే ముందు రోగి మనోభావాలను రాయాలి. చీకటి గదిలోని శవపేటికలో పేషెంటు పడుకోగానే వారిపైన తెల్లటి వస్త్రం కప్పి పేటిక తలుపులు మూసేస్తారు. పేటికను గోతిలో పెట్టి విషాద సంగీతాన్ని వినిపిస్తారు. ఆ తర్వాత అయిదు నిమిషాలకు అప్పుడే పుట్టిన శిశువు ఏడుపును వినిపిస్తారు. డాక్టర్‌గారు శవపేటిక తలుపులు తెరిచి రోగిని సంతోషంగా బైటి ప్రపంచంలోకి ఆహ్వానిస్తారు. జీవితాన్ని కొత్త కోణంలో చూడటానికి ఈ పునర్జన్మ ఎంతగానో ఉపయోగపడుతుందని చైనీయులు నమ్ము తున్నారు. ఇప్పటికే వెయ్యిమంది ఇలాచచ్చి... అలాబతికారట.

అమ్మో... రక్తపిశాచి

'రక్తపిశాచి ఊళ్లో సంచరిస్తోంది తస్మాత్ జాగ్రత్త' అని హెచ్చరిస్తున్నారు సెర్బియాలోని బజీనాబస్తా మునిసిపాలిటీ అధికారులు. అక్కడి జానపద కథల ప్రకారం... రక్తపిశాచి సవాసవానోవిక్ ఊరవతల నదికి సమీపంలో ఉండే పాడుబడిన మిల్లులో నివాసముండేది. ఇప్పుడు రోడ్ల విస్తరణలో భాగంగా ఆ మిల్లును కూలగొట్టారు. దానిలో నుంచి బైటపడ్డ పిశాచి ఏ క్షణంలో ఎవరిని కబళిస్తుందోనని ప్రజలు భయభ్రాంతులవుతున్నారట. 'ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడొద్దనీ... ధైరంగా దాన్ని ఎదుర్కొందా'మని స్వయంగా ఛైర్మన్‌గారే పత్రికా సమావేశంలో అభయమివ్వడం కొసమెరుపు.



మాస్కుతో జోడీ

సూటిగా ప్రశ్నించి ఎదుటివారి అభిరుచులూ అభిప్రాయాలూ తెలుసుకో వాలంటే చాలామందికి మొహమాటం అడ్డుపడుతుంది. పైగా వాళ్లు చెప్పిన సమాధానాల ఆధారంగా సరిజోడీని ఎంచుకోవాలంటే ఇంకా ఇబ్బందే. దీన్ని అధిగమించడానికి జపాన్‌లోని పెళ్లిళ్ల పేరయ్యలు కనిపెట్టిన పద్ధతి 'ఓటా-కాన్‌కాట్‌సూ'. దీని ప్రకారం యువతీ యువకులు మొహం కనిపించకుండా తమకు నచ్చిన జంతువుల యానిమేషన్ మాస్కును తగిలించుకుంటారు. సూటిగా సుత్తిలేకుండా అన్ని విషయాలూ చర్చించుకుని సరిజోడీని ఎంచుకుంటారు. జపాన్‌లోని కుకే నగరంలో కొన్నేళ్లుగా ఇదే పద్ధతిలో పరిచ యాలను నిర్వహించి మనసావాచా ఇష్టపడ్డవాళ్లను ఒక్కటి చేసేస్తున్నారు.

చిన్నబెల్టే పెద్ద ఫ్యాషన్

గమనిక: ఈ పేజీలోని వ్యక్తులు ధరించిన, బొమ్మల్లో చూపించిన బెల్టులను మీరూ ధరించవచ్చు. ఈ విషయాన్ని మీరు ఇంకెవరికైనా చెప్పినా, సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లలో పంచుకున్నా మీకు ఎలాంటి ఇబ్బందీ కలగదు. పైగా ఆశ్చర్యపోతారు. ఎందుకంటే... అమ్మాయిలతోపాటు అబ్బాయిలకూ చిన్నబెల్టే ఇప్పటి ఫ్యాషన్ అని ఫ్యాషన్ డిజైనర్లు డిసైడ్ చేశారు. ఈ విషయాన్ని మొట్టమొదట మీరే చదువుతున్నారు.

చూడటానికి చిన్నగా ఉండాలి... వీలైతే అరచేతిలో ఇమిడిపోవాలి...

సెల్‌ఫోనైనా ట్యాబ్లెటయినా యువత వాడాలనుకునే వస్తువు ఏదైనా అంతే. ఈరోజుల్లో ఎవరైనా పెద్దపెద్ద గ్యాడ్జెట్లూ యాక్సెసరీలతో కనిపిస్తే చిన్నచూపు చూస్తున్నారు. చిన్నచిన్న వస్తువులవైపే మొగ్గు చూపుతున్నారు. అంతేగానీ, చిన్నబోవడం లేదు. ఎందుకంటే, చిన్నదే ఇప్పుడు పెద్దఫ్యాషన్. ఆ కోవలోనే ఇప్పుడు బెల్టు కూడా చేరిపోయింది.

క్లాస్ నుంచి మాస్‌కి...

ఒకప్పుడు బెల్టు అంటే సూటూ బూటూ కథాకమామిషా ఉండాల్సిందే. ధనవంతులకూ, ఆఫీసర్లకే ప్రత్యేకం. ఒక్కమాటలో చెప్పాలంటే 'క్లాస్' వర్గానిదే.

కానీ, సినిమా పుణ్యమా అని అది మాస్‌కూ చేరిపోయింది. పాత సినిమాల్లో దొంగలు లుంగీపై పెద్దపెద్ద బెల్టులు కట్టుకోవడంతో... బెల్టును అలా కూడా ఉపయోగించవచ్చని తెలిసింది. ఆ సమయంలోనే అమ్మాయిలకూ దానిపై మనసు మళ్లింది. అంతవరకూ పాశ్చాత్యులకూ, పెద్దవాళ్లకూ పరిమితమైన బెల్టు కాస్తా గల్లీల్లోకి కూడా చొచ్చుకుపోయింది.

ఆ తరవాత బెల్టుల్లో చాలా వెరైటీలు వచ్చాయి. పెద్ద బెల్టులూ, లెదర్ కాకుండా ఇతర మెటీరియల్‌తో చేసినవీ మార్కెట్లో తిరుగాడాయి. బెల్టుల్లో మరో సంచలనం బకెల్. చిత్రవిచిత్రమైన బకెల్స్ పెట్టుకుని కొత్త ట్రెండ్‌కి తెరతీసింది యూత్.

సౌకర్యమే ప్రధానం

ఏ ట్రెండ్ అయినా సౌకర్యవంతంగా ఉంటేనే నిలుస్తుంది. జీన్స్ ప్యాంట్‌నే తీసుకోండి... ఇప్పటికీ ఎప్పటికీ సౌకర్యంగా ఉంటుంది. అందుకే, జీన్స్ చిరంజీవి. కానీ, కొన్ని రకాల గెడ్డం ఫ్యాషన్లు, హెయిర్‌స్టైల్స్ కొన్నాళ్లపాటే ట్రెండ్‌గా ఉంటాయి. అలాగే బెల్టుల్లో కూడా ఇన్నాళ్లూ పెద్దబెల్టులూ, విచిత్రమైన బకెల్సూ పెట్టుకునీ పెట్టుకునీ యువతకు బోరుకొట్టింది. అందుకే, ఉన్నాయా లేవా అన్నట్టుండే చిన్న బెల్టులమీదకు దృష్టి మళ్లింది. దీంతో ఫ్యాషన్ డిజైనర్లు సరికొత్త చిన్నబెల్టులతో ర్యాంపువాక్‌లకు కొత్తలుక్ తెస్తున్నారు. ఇటీవల ప్రభాస్ సినిమా 'మిర్చి' స్టిల్స్ కూడా ఈ ట్రెండ్‌ని ధ్రువీకరిస్తున్నాయి.

ఈ చిన్నబెల్టుతో క్లాస్ లుక్ వచ్చేస్తుంది. ప్రత్యేకించి అమ్మాయిలకు ఎంతో అందంగా, సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందులో అబ్బాయిలకైతే కేవలం లెదర్‌తో చేసినవే రంగుల్లో వస్తున్నాయి. కానీ, అమ్మాయిలకు ఇతర మెటీరియల్‌తో చేసినవీ, అబ్బాయిలకంటే ఎక్కువ రంగుల్లో వెరైటీల్లో వస్తున్నాయి.

ఇక్కడున్న ఫొటోలను చూస్తుంటే ఆ విషయం అర్థం కావడంలేదూ. ఫొటోల్లోని అమ్మాయిలనూ అబ్బాయిలనూ చూస్తోంటే ఆ సౌకర్యం తెలియడంలేదూ. మరింకెందుకు ఆలస్యం, ఫాలో అయిపోండి చిన్న బెల్టు ఫ్యాషన్‌ని!

విచిత్రం

బొమ్మలో పువ్వు మధ్యలోని నీలం రంగు చుక్కని తదేకంగా చూస్తూ 50 అంకెలు లెక్కపెట్టండి. తర్వాత కుడివైపు ఫ్రేమ్‌లో ఉన్న నల్లటి చుక్కని చూస్తూ పది వరకూ అంకెల్ని లెక్కపెట్టండి. మరి ఏం గమనించారు?



చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ కొన్ని సామెతలూ, జాతీయాలూ అసంపూర్తిగా ఉన్నాయి. అయితే ఖాళీల్లో రావాల్సినవన్నీ శరీర భాగాలే. అవేంటో చెప్పగలరా?

1. అందితే జుట్టు అందకపోతే -----.
2. ఆవులిస్తే ---- లెక్కపెట్టినట్లు.
3. ----తో పోయే దానికి గొడ్డలి ఎందుకు?
4. ----- మంచిదైతే ఊరు మంచిదవుతుంది.
5. కొరివితో ----- గోక్కున్నట్లు.

అమెరికా

పక్కనున్న భాగాలను చదరంలో అమర్చాలి. అలా అమర్చినపుడు ప్రతి అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్న వరుసల్లో నాలుగు గళ్లలోని చుక్కల మొత్తం 11 రావాలి.





నిక్కర్ వేసుకోవడం తాతల కాలం నాటిది! పాత పద్ధతులు నాకు నచ్చవు!

ఒకేలా

పైనున్న బొమ్మను పోలిన బొమ్మ కింద వాటిలో ఏదో చెప్పండి.

గేమ్‌షో

1. గిఫ్ట్‌ప్యాక్‌లో ఉన్న ఆట వస్తువు ఏమిటో చెప్పగలరా?
2. చిత్రంలో రెండు తప్పులున్నాయి. అవేంటో చెప్పండి?
3. ఇక్కడ ఉన్న పాత్రల్నీ వాటి మూతల్నీ జతచేయండి.
4. దీనిలో మొత్తం ఎన్ని చేపలు ఉన్నాయి.
5. వీటిలో ఒక పాత్ర ఏ లోహంతోనూ చేయలేదు. అదేమిటి?
6. ఇందులో ఆంగ్ల అక్షరం Uతో మొదలయ్యే పదాలు నాలుగు ఉన్నాయి. వాటిని గుర్తించగలరా?

నసీరుద్దీన్ కొడుకు

రచన, బొమ్మలు: భగవత్







దారి చూపండి

పడవలో ఉన్నవారు అవతల బంగారు నాణాల దగ్గరికి చేరాలి. అయితే వారు దారిలో ప్రమాదం పొంచి ఉన్న దీవుల్ని తప్పించుకుంటూ ఆహారం ఉన్న దీవుల మీదుగా వెళ్లాలి.

జవాబులు

తప్పులెంతో చూడండి: 1. ఐస్క్రీం 2. కొరకు 3. గోళ్ళ 4. గేదె 5. ఆశ

గీతలుంటే: **1.** చొక్కా మీద ఉన్న చారలు రెండు **2.** శిఖరం 30, జారుడుబండ కంటుంది **3.** 1-E, 2-D, 3-F, 4-A, 5-C, 6-B. **4.** పిరుదు **5.** కంచె **6.** Umpire, Umbrella, Unicorn, Utensils.

జమిలిగా: చిక్కీ చుట్టూ ఉన్నదాన్ని చదివేస్తుంది.

ఒకటే: 2.



చలికాలంలో వేడివేడిగా...

రుచి అభిరుచి

పెప్పర్ కార్న్ ఫ్రైడ్ రైస్

కావలసినవి

బియ్యం: కప్పు, **మిరియాలపొడి:** 2 టీస్పూన్లు, **మొక్కజొన్న గింజలు:** అరకప్పు, **నెయ్యి:** 2 టీస్పూన్లు, **అజినమోటో:** చిటికెడు, **ఉప్పు:** సరిపడా, **సోయాసాస్:** అరటీస్పూను, **జీలకర్ర:** టీస్పూను

తయారుచేసే విధానం

అన్నం వండి పక్కన ఉంచాలి.

బాణలిలో నెయ్యి వేసి కరిగిన తరవాత జీలకర్ర వేయాలి. తరవాత మొక్కజొన్న గింజలు, మిరియాలపొడి, అజినమోటో, ఉప్పు, సోయాసాస్ వేసి రెండు నిమిషాలు వేయించాలి. తరవాత వండిన అన్నం వేసి బాగా కలపాలి. డిన్నర్‌కి ఇది ఎంతో రుచిగా స్పైసీగా ఉంటుంది.

పెనం చెక్కలు

కావలసినవి

గోధుమపిండి: కప్పు, **బియ్యప్పిండి, సోయా పిండి:** అరకప్పు, **అవిసెపిండి:** టీస్పూను, **రాగిపిండి:** టీస్పూను, **కసూరిమెంతి:** అరకప్పు, **కరివేపాకు:** 10 రెబ్బలు, **కారం:** టీస్పూను, **ఉప్పు:** సరిపడా, **జీలకర్ర:** టీస్పూను, **పసుపు:** టీస్పూను, **దాల్చినచెక్కపొడి:** టీస్పూను, **మసాలా పొడి:** పావుటీస్పూను, **ఇంగువ:** చిటికెడు

తయారుచేసే విధానం

ఓ గిన్నెలో పిండిలన్నీ వేసి కలపాలి. తరవాత ఉప్పు, జీలకర్ర, కసూరిమెంతి, కారం... అన్నీ వేసి కలపాలి. ఇప్పుడు తగినన్ని నీళ్లు పోసి మెత్తని ముద్దలా పిండిని కలపాలి. పిండిముద్దను చిన్న ఉండలుగా చేసి పాలిథీన్ కవర్‌మీద నెయ్యి లేదా నూనె అద్దుతూ చెక్కల్లా వత్తాలి.

స్టవ్‌మీద పెనం పెట్టి వేడి చేసి పెనం మొత్తం పరచుకునేలా నూనె రాయాలి. ఇప్పుడు వత్తిన చెక్కల్ని పెనం మీద పరిచినట్లుగా వేసి తక్కువ మంటమీద కాల్చాలి. అవసరమైతే మధ్యలో రెండుమూడు చుక్కలు నూనె వెయ్యాలి. రెండు నిమిషాల తరవాత అన్నీ తిప్పి నూనె వేస్తూ కరకరలాడేవరకూ కాల్చి తీయాలి.

అడపిండి వడలు

కావలసినవి

పెసరపప్పు, మినప్పప్పు, కందిపప్పు, సెనగపప్పు: అరకప్పు చొప్పున, **ఎండుమిరప కాయలు:** ఏడు, **బియ్యం:** కప్పు, **మెంతులు:** అరటీస్పూను, **జీలకర్ర:** అరటీస్పూను, **పసుపు:** పావు టీస్పూను, **బ్రెడ్‌పొడి:** 2 టీస్పూన్లు, **ఉప్పు:** సరిపడా, **బేకింగ్ సోడా:** అరటీస్పూను

తయారుచేసే విధానం

పప్పులన్నీ ఓ గిన్నెలో వేసి రాత్రంతా నానబెట్టాలి. మెంతులు, ఎండుమిర్చి ముక్కలు విడిగా ఓ గిన్నెలో నానబెట్టాలి. బియ్యం విడిగా నానబెట్టాలి.

ఉదయాన్నే నానబెట్టిన వాటికి ఒక కరివేపాకు రెబ్బ జోడించి మిక్సీలో వేసి రుబ్బాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు చిలకరించాలి. తరవాత బేకింగ్ పౌడర్, బ్రెడ్ పొడి, జీలకర్ర, పసుపు వేసి కలిపి చిన్న చిన్న వడల్లా చేసి కాగిన నూనెలో వేయించి తీయాలి. వీటిని కొత్తిమీర పచ్చడితో తింటే చాలా రుచిగా ఉంటాయి.

థాలిపీట్

కావలసినవి

గోధుమపిండి: కప్పు, **బియ్యప్పిండి:** అరకప్పు, **సెనగపిండి:** పావుకప్పు, **జొన్నపిండి:** అరకప్పు, **అల్లం:** చిన్నముక్క, **వెల్లుల్లిరెబ్బలు:** రెండు, **పచ్చిమిర్చి:** మూడు, **దనియాలపొడి:** 2 టీస్పూన్లు, **కసూరిమెంతి:** టీస్పూను, **అవిసెగింజలపొడి:** టీస్పూను, **గరంమసాలా:** టీస్పూను, **జీలకర్ర:** టీస్పూను, **వాము:** అరటీస్పూను, **పసుపు:** అరటీస్పూను, **కారం:** 2 టీస్పూన్లు, **కొత్తిమీర తురుము:** కప్పు, **నువ్వులు:** 2 టేబుల్‌స్పూన్లు, **ఉల్లితురుము:** అరకప్పు, **ఉప్పు:** సరిపడా, **నూనె:** సరిపడా

తయారుచేసే విధానం

అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి మెత్తగా రుబ్బాలి. కొత్తిమీర సన్నగా తరగాలి.

నువ్వులు, నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ ఓ గిన్నెలో వేసి కలపాలి. తరవాత తగినన్ని నీళ్లు పోసి చపాతీపిండిలా కలపాలి.

ఇప్పుడు పిండి ముద్దను చపాతీ కర్రతో పాలిథీన్ కవర్‌మీద గానీ లేదా నున్నని పాలరాయిమీదగానీ నూనె లేదా నెయ్యి అద్దుతూ చపాతీలా చేయాలి. రొట్టె చేశాక గారె మాదిరిగా మధ్యలో రంధ్రం చేసి పైన నువ్వులు చల్లి నెమ్మదిగా అద్దాలి. ఇప్పుడు పెనంమీద ఈ రొట్టె వేసి చిల్లులో అరటీస్పూను నూనె వేసి మూతపెట్టాలి. రెండుమూడు నిమిషాల తరవాత రొట్టెను తిప్పి మళ్లీ అదే మాదిరిగా మధ్యలో పావుటీస్పూను నూనె వేసి మూతపెట్టి కాలనివ్వాలి. రెండోవైపు తిప్పిన తర్వాత నువ్వులు గోధుమరంగులోకి మారగానే రొట్టె తీయాలి. ఇలాగే అన్నీ చేసుకోవాలి. ఇది చాలా రుచిగా ఉంటుంది. మంచి పోషకాహారం కూడా.

థాలిపీట్

పెప్పర్ కార్న్ ఫ్రైడ్ రైస్

పెనం చెక్కలు

అడపిండి వడలు

– *గాయత్రి,*
హైదరాబాద్
(gayathrismyhomekitchen.blogspot.in)

తారలు... గురువులు!

అదో పెట్టుబడి.
ఆ తరువాత అదే ఆదాయం!
ఇప్పుడు అదే వాళ్లని 'గురు'లా మార్చింది.
ఆ లెక్క ఏంటంటే...

సిద్ధాంతాలు:

1. ఫిట్‌నెస్... ఒక పెట్టుబడి.
2. ఫిట్‌నెస్... ఒక ఆదాయం!

సిద్ధాంతం 1

తారలు అన్నాక... అందంగా ఉండాలి. ఆకర్షణీయంగా ఉండాలి. అలా ఉంటేనే తెరపై బాగుంటారు. ప్రేక్షకుల్ని అలరించగలుగుతారు. అలా ఉండాలంటే... అందాన్నీ ఆరోగ్యాన్నీ కాపాడుకోవాలి. అలా కాపాడుకోవాలంటే... కాస్త ఒళ్లు వంచాలి. జిమ్‌లకి వెళ్లాలి. యోగా చేయాలి. రన్నింగులు చేయాలి. ఆహార నియమాలపై నియంత్రణ ఉండాలి. జిహ్వ చాపల్యాన్ని అణచుకోవాలి. డైటీషియన్ సూచనలకు లోబడాలి. అంత కఠినంగా ఉంటేనే చక్కని శరీరాకృతి సాధ్యం. శరీరాకృతి అలా ఉన్నంతకాలం... సినిమాల్లో అవకాశాలు వస్తుంటాయి. అభిమానులు పెరుగుతారు. అందాన్ని ఆస్వాదిస్తుంటారు. శిల్పాశెట్టి, యానాగుప్తా, లారాదత్తా, డయానా హెడెన్... ఇలా ఎంతోమంది నటీమణులు చాలాయేళ్లపాటు వెండితెరపై అలరించారు. కొన్నాళ్లు హీరోయిన్లుగా మరికొన్నాళ్లు ప్రత్యేక గీతాల్లో నర్తిస్తూ కెరీర్‌ని నెట్టుకొచ్చారు. హీరోయిన్‌గా పదికాలాలపాటు వెలగాలంటే సినిమాలు హిట్లు అయినంతమాత్రాన చాలదు, ఫిట్‌నెస్ ఎప్పుడూ ఒకేలా ఉండాలి. అందుకే... ఫిట్‌నెస్ ఒక పెట్టుబడి.

సిద్ధాంతం 2

ఫిట్‌నెస్ ఉన్నంతకాలం వెండితెరపై ఓ వెలుగు వెలిగారు. అభిమానులకు ఆదర్శమయ్యారు. ఫిట్‌నెస్ ఉన్నాసరే హిట్లు లేకపోతే... అవకాశాలూ తగ్గుతాయి కదా! అంత మాత్రాన... ఉన్న ఫిట్‌నెస్ ఊరకే పోతుందా? దాన్ని వేరే ఆదాయ మార్గంగా మార్చుకోలేరా? సరిగ్గా ఇలానే ఆలోచించిన తారలు కొందరు... తమ ఫిట్‌నెస్ రహస్యాలను అభిమానులతో పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ దిశగా తొలి అడుగు వేసింది... శిల్పాశెట్టి. 2008లో 'హౌ ఐ డిడ్ ఇట్' అంటూ ఓ పుస్తకాన్నీ డీవీడీని విడుదల చేసింది. అభిమానులూ ఈ సిరీస్‌ని బాగానే అభిమానించారు. శిల్ప ఎప్పుడూ చెక్కిన శిల్పంలా ఎలా ఉంటోందన్న విషయాన్ని తెలుసుకోవాలని చాలామంది ఈ డీవీడీలనూ పుస్తకాలనూ కొనుక్కున్నారు. ఈ ఆదరణ చూసిన మరికొందరు తారలు స్ఫూర్తిపొందారు. అభిమానులను అలరించేందుకు ఇదేదో కొత్త మాధ్యమం అనుకున్నారు. తమ ఆరోగ్య రహస్యాలను అభిమానులతో పంచుకోవాలనుకున్నారు. 'ఎ బ్యూటిఫుల్ ట్రూత్: ద ఆర్ట్ ఆఫ్ గ్రూమింగ్ ఫర్ విమిన్' పేరుతో ఓ పుస్తకం విడుదల చేసింది డయానా హెడెన్. కాపీలు చకచకా అమ్ముడైపోయాయి. ఐటమ్‌గర్ల్ యానా గుప్తా... 'హౌ టు లవ్ యువర్ బాడీ అండ్ గెట్ ద బాడీ యు లవ్' అనే పుస్తకాన్ని అచ్చేసింది. అభిమానుల ఆదరణ అద్భుతం. 'కొన్నేళ్లపాటు ఫిట్‌నెస్ కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఈ విషయానికి సంబంధించి ఇంటర్‌నెట్‌లో వెతికితే... చాలావరకూ తప్పుడు సమాచారమే కనిపించింది. మరి, నా అనుభవం కొంత మందికైనా ఓ పాఠంలా పనికొస్తుంది అనిపించింది. అందుకే ఫిట్‌నెస్ రహస్యాలను బయట పెట్టాను' అంటోంది బిపాషా. 'లవ్ యువర్ సెల్ఫ్' డీవీడీలో బిపాషా హాట్‌హాట్‌గా వ్యాయామాలు చేసింది. అందరూ ఫిట్‌నెస్ గురించి చెబుతున్నారు... రొటీన్‌గా! అందుకే ఏదైనా కొత్త విషయాన్ని తెలియజేయాలనుకుంది లారాదత్తా. ఆమె గర్భిణి అయ్యాక 'ప్రినాటల్ యోగా' పేరుతో డీవీడీని విడుదల చేసింది. అదీ మాంచి ఆదరణకు నోచుకుంది.

కేవలం తారలే కాదు... ప్రముఖ వ్యాపారవేత్త యశ్‌బిర్లా ఫిట్‌నెస్‌కి చాలా ప్రాముఖ్యతనిస్తారు. ఈ మధ్య ఆయన కూడా తన ఆరోగ్య రహస్యాలను డీవీడీల రూపంలో బయటపెట్టారు.

నిరూపణ: ఫిట్‌నెస్ అంటే... అందరికీ ఆసక్తే. అందరూ అందంగానూ ఆరోగ్యంగానూ ఉండాలనుకుంటారు. ఆ విషయాలను సెలెబ్రిటీలు చెబితే ఆసక్తిగా వింటారు. అందుకే, సెలెబ్రిటీలు విడుదల చేసిన పుస్తకాలూ డీవీడీలూ బాగా అమ్ముడు పోయాయి. అంతేకాదు... ఇప్పుడీ పుస్తకాలకీ డీవీడీలకి సీక్వెల్స్ కూడా సిద్ధమౌతున్నాయి. యానా మరో పుస్తకం రాస్తోంది. అందులో ఆరోగ్యంతోపాటూ మానవ సంబంధాలపై కూడా చర్చించబోతోంది. బిపాషా మరో డీవీడీ విడుదలకి సిద్ధమౌతోంది. డయానా హెడెన్ ఈసారి మగాళ్ల అందాల గురించి మాట్లాడబోతోంది. లారా కూడా పిల్లల పెంపకంపై ఒక డీవీడీని విడుదల చేసే ఆలోచనలో ఉందని సమాచారం. మొత్తమ్మీద ఈ తారలందరూ ఇప్పుడు కొత్తతరం 'లైఫ్‌స్టైల్ గురు'ల అవతారాలెత్తారు.

సో... సెలెబ్రిటీలకి ఫిట్‌నెస్ ఒక పెట్టుబడి. అది ఎప్పటికీ ఆదాయాన్ని ఆర్జిస్తూనే ఉంటుంది... ఇదీ లెక్క! ★

రాశి ఫలం

గ్రహబలం (డిసెంబరు 9 - 15)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆదాయానికి తగ్గట్టే ఖర్చులుంటాయి. ఒక సంఘటన మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. భవిష్యత్ ప్రణాళికలు వేయాలని ఆరాటపడతారు. కానీ, ఏకాగ్రతతో చేయలేకపోతారు. మీ ఆలోచనలను పక్కదారిపట్టించే సంఘటనలు జరుగుతుంటాయి. అధికారుల వల్ల భయం, కీర్తి, స్వల్ప అనారోగ్యం, స్వస్థానప్రాప్తి. శివారాధన శ్రేయస్కరం.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఒక శుభవార్త వింటారు. ఖర్చులు పెరిగే సూచనలున్నాయి. గతంలో నిర్లక్ష్యం చేసిన అనారోగ్య సమస్యలు ఇప్పుడు ఇబ్బందిపెడతాయి. శుభకార్యక్రమాలలో పాల్గొంటారు. బంధుమిత్రులను కలుస్తారు. మీరు చేపట్టే పనులకు ప్రోత్సాహం కరవవుతుంది. పనుల్లో ఆటంకాలు ఎదురవుతుంటాయి. విరోధులు పెరుగుతారు. దైవసంబంధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ప్రారంభించిన పనుల్లో చిన్నచిన్న ఆటంకాలు ఎదురైనా వెనకడుగువేయకుండా పట్టుదలతో పూర్తి చేస్తారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. విందూ వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. మానసికంగా దృఢంగా ఉంటారు. అవసరానికి డబ్బు చేతికి అందుతుంది. శుభకార్యక్రమాల వల్ల ధనవ్యయం కాస్త ఎక్కువ జరగొచ్చు. ఉన్నత విద్యా ప్రణాళికలు అనుకూలిస్తాయి.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

విలాసాలకు డబ్బు ఖర్చుచేస్తారు. ఒక ముఖ్యమైన విషయమై పైఅధికారులను సంప్రదిస్తారు. నిర్ణయం మీకు అనుకూలంగా వస్తుంది. ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారు. శుభవార్త వింటారు. మీ కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. అకారణంగా కలహాలు వచ్చే సూచనలున్నాయి. ఇష్టమైన పనులను చేపట్టి పూర్తిచేస్తారు. ఒక నిర్ణయానికి కట్టుబడి ఉండరు.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

తల్లితరపు బంధువుల ఆదరణకు నోచుకుంటారు. కీలక సందర్భాల్లో మీ తెలివితేటలు అక్కరకు వస్తాయి. చేపట్టిన పనుల్లో ఇబ్బందులు ఎదురైనా మధ్యలో వదిలేయకుండా పట్టుదలతో పూర్తిచేస్తారు. ఒక వార్త లేదా సంఘటన మీకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఖర్చులు పెరుగుతాయి. శత్రువులపై మీదే పైచేయి అవుతుంది. శివారాధన తప్పనిసరిగా చేయాలి.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

వారారంభంలో అన్నీ మీకు అనుకూలంగా జరుగుతాయి. ఆర్థికంగా కుదురుకుంటారు. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. మీ పేరుప్రఖ్యాతులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మనసు చెడ్డపనుల మీదకు మళ్లుతుంటుంది. ఆరోగ్యం సహకరిస్తుంది. కుటుంబ వాతావరణం మీకు అనుకూలంగా ఉంటుంది.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అవసరానికి డబ్బు చేతికి అందుతుంది. ఒక వార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. చిన్న చిన్న సమస్యలు మినహాయిస్తే ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది. చేపట్టే పనుల్లో ఆటంకాలు ఎదురవుతుంటాయి. బంధువులతో పొరపొచ్చాలు రావచ్చు. దుర్గాదేవి ఆరాధన చేస్తే బాగుంటుంది.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఒక వార్త లేదా సంఘటన మీకు మానసిక ఆనందాన్నిస్తుంది. బంధుమిత్రులతో చిన్నపాటి విభేదాలు వచ్చే సూచనలున్నాయి. ప్రారంభించిన పనుల్లో ఆటంకాలు తప్పకపోవచ్చు. కీలక విషయాల్లో మీరు ఆశించిన పురోగతి ఉండకపోవచ్చు. భోజన సౌఖ్యం ఉండకపోవచ్చు. విదేశీ ప్రయాణాలు అనుకూలించకపోవచ్చు.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మానసికంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారు. భోజనసౌఖ్యాన్ని పొందుతారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది. ఒక ముఖ్యమైన విషయంలో విజయం సాధిస్తారు. ఆర్థికంగా ఫర్వాలేదనిపిస్తుంది. కుటుంబంలో చిన్నపాటి అభిప్రాయ భేదాలు వచ్చే సూచనలున్నాయి. శివారాధన చేయడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయి.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇంట్లో శుభకార్యక్రమాలు జరుగుతాయి. అవసరానికి ఆర్థిక సాయం చేసేవాళ్లుంటారు. కుటుంబ వాతావరణం మీకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటుంది. మీ ప్రతిభకు పైఅధికారుల గుర్తింపు లభిస్తుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు కాస్త ఇబ్బందికరంగా మారతాయి. ఒక వార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఒక ముఖ్యమైన వ్యవహారంలో విజయం సాధిస్తారు. ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయి. ఒక వార్త లేదా సంఘటన మీకు ఆనందాన్ని కలిగిస్తుంది. శారీరక బలం ఇనుమడిస్తుంది. చేపట్టే పనుల్లో చిన్నచిన్న ఇబ్బందులున్నా విజయం సాధిస్తారు. కుటుంబ వాతావరణం అంత అనుకూలంగా ఉండకపోవచ్చు. స్వల్ప అనారోగ్య సమస్యలు ఉంటాయి.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

పరిస్థితులు గతంలోకంటే కాస్త అనుకూలంగా మారతాయి. ఉద్యోగస్తులకు స్థానచలన సూచనలున్నాయి. ఒక వార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆర్థిక ఇబ్బందులు కాస్త తగ్గుముఖం పడతాయి. విరోధులు పెరిగే ఆస్కారముంది. ఒక సంఘటన మిమ్మల్ని బాధపెడుతుంది. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. శివారాధన చేయడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయి.

జీవిత దర్శనం

'మా'రుతీయం' జీవితకాలపు అనుభూతుల్ని పంచిన కవితా సంకలనం. నాటకకర్తగా, నటుడిగా, నవలా రచయితగా సుప్రసిద్ధులైన గొల్లపూడి మారుతీరావుగారు బతుకు లోతుల్ని చూసిన కవిగా దర్శనమిచ్చారు. జీవితంలో ఉన్నట్టే ఇందులోనూ తీపీ, చేదూ, వగరూ, ప్రేమా, చిరునవ్వూ, బాధా, కోపం, తాపం అన్నీ ఉన్నాయి. ఇవన్నీ వివిధ దశల్లో ఆయన అనుభవించిన పరిస్థితులకు అక్షరరూపాలే. ప్రేమగీతాలు, ఆసుపత్రి పాటలు, వాసు స్మృతులు, మళ్ళీమళ్ళీ వసంతం, ఉగాది కవితలు, స్వాతంత్ర్య గీతం, ఏరిన పూలు... ఇలా ఇలా వైవిధ్యంగా సాగిన కవితా విస్ఫోటనం గుండె లోపలిపొరల్లో గుబులు పుట్టిస్తుంది. కంటతడిని మించిన ఎదతడిని మిగుల్చుతుంది. 'నా జ్ఞాపకాల ఊపిరి నిన్ను పలకరిస్తే/నేను నిన్ను పిలుస్తున్నానని గుర్తుపట్టు'... ఇంతకు మించిన వినమ్ర వేడుకోలు ఉంటుందా! 'ఏను స్వర్గమ్ము కాంక్షించినానుగాని/ నీదు కౌగిట దైవమ్ము నిలిపె దాని' ఉమర్‌ఖయ్యాం రుబాయిత్‌ను తలపిస్తుంది. 'ఇప్పుడే ఆ సందుమలుపు తిరిగాడు/ఆ గాయం ఇంకా పచ్చిగా ఉంది' అన్న 'స్మృతి' గుండెగొంతుకలో కొట్టుకుంటుంది.

మారుతీయం
రచన: గొల్లపూడి మారుతీరావు
పేజీలు: 149; వెల: రూ.100/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– జి.వి.ఎన్.మూర్తి

సమీక్ష

'బ'రైపోనాదండి' కథా సంకలనంలో పద్నాలుగు కథలున్నాయి. ఇదే పేరుతో రాసిన కథలో సోములు, అతని భార్య దేవుడమ్మ బుగత చుట్టూ కథ తిరుగుతుంది. బుగత మరణాన్ని పాఠకుడు జీర్ణించుకోలేకపోతాడు. రెండో కథలో... గోడకు కొట్టిన సున్నమూ సన్మానాలకిచ్చిన ఖర్చూ

బతుకు సారం

తిరిగిరాదన్న నిజాన్ని రచయిత గౌరీశంకర్ కళ్లకు కట్టినట్టు చెప్పారు. జీవితం చివరిదశలో ఒంటరితనం ఎంత భరించలేనిదో 'పాకుడు' కథలో చక్కగా వివరించారు. తొందరపాటుతో తీసుకునే నిర్ణయాలు ఎంత ప్రమాదకరమో 'ఒక్కసారి ఆలోచించు' హెచ్చరిస్తుంది. కథ చివర్లో వచ్చిన ఒక ఫోన్ మనసును ఆర్ద్రతకు గురిచేస్తుంది.

బరైపోనాదండి (కథా సంకలనం)
రచన: భమిడిపాటి గౌరీశంకర్
పేజీలు: 102; వెల: రూ.50/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– రమాకాంత్

హాస్యం కార్ఖానాలో పుట్టదు, జీవితాల్లోంచి ప్రాణం పోసుకుంటుంది. ఈ విషయంలో ఏవైనా అనుమానాలుంటే 'ఈ కార్టూన్లు మీవే' పుస్తకం చూడొచ్చు. కార్టూనిస్టు శంకు (ఎస్.బి.శంకర్‌రావు) సృష్టించిన పాత్రలతో మాట్లాడొచ్చు. 'నాకు ఆపరేషన్ తప్పదంటారా డాక్టర్!' అని అడిగిన రోగికి 'తప్పదు. రేపు మా స్టాఫ్‌కి జీతాలివ్వాలి'

గిలిగింతల గీతలు

అని బదులిస్తాడు వైద్య నారాయణుడు. 'ఏవండీ, మీవాడికి పెళ్లయిందటగా, నన్ను పిలవలేదేం?' అనడిగిన పొరుగింటి పెద్దాయనతో 'భలేవారే! ఆ పెళ్లికి మావాడు నన్నే పిలవలేదు' అని వాపోతాడో కన్నతండ్రి. నిత్యజీవితంలోంచి పుట్టిన నిఖార్సయిన హాస్య రేఖలు ఈ పుస్తకం నిండా ఉన్నాయి.

ఈ కార్టూన్లు మీవే
కార్టూనిస్టు: శంకు
పేజీలు: 64; వెల: రూ.150/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– రఘు

విజయసూత్రం



ఎక్కడైనా గెలుపే కీలకం. నిలవాలంటే గెలవాలి. గెలవాలంటే అందరికంటే ముందుండాలి. ఆ తపనే వ్యక్తిత్వ వికాస పుస్తకాలకు సిరులపంట కురిపిస్తోంది. సీనియర్ సైకాలజిస్ట్ టి.ఎస్.రావు 'వ్యక్తిత్వ వికాసం' పుస్తకంలో వికాసంలోని అనేకానేక కోణాల్ని స్పృశించారు. బలాల గురించీ బలహీనతల గురించీ, సమయ పాలన గురించీ సరైన ప్రణాళిక గురించీ ప్రేమ గురించీ పెళ్లి గురించీ...మనిషి జీవితాన్ని మలుపు తిప్పే ప్రతి మజిలీ గురించి చర్చించారు.

వ్యక్తిత్వ వికాసం; రచన: డాక్టర్ టి.ఎస్.రావు; పేజీలు: 338; వెల: రూ.150/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– కుమార్

జీవితసత్యాలు
రచన: డి.యం.రవిప్రసాద్
పేజీలు: 99; వెల: రూ.80/–
ప్రతులకు: మైత్రేయ పబ్లికేషన్స్ ఇంటి నం.2-5-596/303, సిద్ధంహోమ్స్ సుబేదారి, వరంగల్.

లోపలి స్వరం (కవిత్వం)
రచన: రేణుక అయోల
పేజీలు: 119; వెల: రూ.60/–
ప్రతులకు: పాలపిట్ట బుక్స్ 16-11-20/6/1/1, 403 విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్ మలక్‌పేట, హైదరాబాద్.

జీవ వికాసం
రచన: బొర్రా గోవర్ధన్
పేజీలు: 158; వెల: రూ.80/–
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు.

పూదోట
(గేయ, వచన కవితా సంపుటి)
రచన: చీపెల్లి బాపు
పేజీలు: 154; వెల: రూ.80/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

చర్నాకోల
రచన: యం.డి.ఉస్మాన్‌ఖాన్
పేజీలు: 92; వెల: రూ.80/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

బుక్ షెల్ఫ్

హిందూ వివాహ బంధం
సంపాదకుడు: మౌనశ్రీ మల్లిక్
పేజీలు: 96; వెల: రూ.60/–
ప్రతులకు: ప్రజాహిత పబ్లిషర్స్ 1-1-1/18/1, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ హైదరాబాద్.

ఓడిపోవద్దు
సంపాదకులు: జూలూరు గౌరీశంకర్, కాకి భాస్కర్
పేజీలు: 104; వెల: రూ.60/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

సమన్వయ భారతివారి ప్రథమ బాలశిక్ష (I) - తెలుగు సూక్తి సుధ
రచన: భాగవతుల శ్రీనివాసరావు
పేజీలు: 104; వెల: రూ.40/–
ప్రతులకు: భాగవతుల సామ్రాజ్యలక్ష్మి 'శ్రీమణిదీప్పం', 23-23-52 శివరావు వీధి, సత్యనారాయణపురం విజయవాడ.

నేటి వేమన నానీలు
రచన: రాచపాళెం రఘు
పేజీలు: 100; వెల: రూ.50/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

పదవినోదం-1120



ఆధారాలు

అడ్డం:

1. సంఖ్యలనే ఏమంటారు? (3)
4. అడ్డం 16తో తూర్పు తీరాన రాష్ట్ర నగరం (1)
6. సువాసన (2)
8. గయోపాఖ్యానంలో కృష్ణుడి ఆగ్రహానికి గురైనవాడు? (3)
9. ఎంత కాలం (3)
10. అవరోధం (3)
12. మూషికం (3)
13. ఉన్నాయనుకుంటున్నా రేమో, లేవని చెప్పేయండి! (2)
14. కత్తిదెబ్బవల్ల అయ్యేది? (2)
15. క్రిమి, కీటకం (3)
16. కొమ్మ, విభాగం (2)
17. సిక్సర్ అంటే ఎన్ని పరుగులు? (2)
18. చీకటిరంగు (3)
19. ఖైదు (2)
21. చెమ్మ (2)
22. దేవత (3)
24. అష్టమికి ఎల్లుండి! (3)
26. సౌమిత్రి అంటే ఎవరు? (4)
27. నవ మధ్య అక్షరంతో బ్రహ్మ! (3)
28. కూర (2)
30. మానవుడు (3)
32. క గుణింతంలో ఆంగ్ల మట్టి! (1)
33. చంద్రకాంతి (3)
35. చెరి ఒక (2)
36. రావణరాజ్యం (2)
38. దయ, కనికరం లాంటిది (2)
39. అదనంగా ఇచ్చేది, కోరేది, వడ్డించేది (3)
41. ప్రయోజనం, మిగులు (2)
42. భుజించను (3)
44. గజిబిజి ఎరువులు! (4)
47. నామధేయమా? (2)
48. ఆంగ్ల ఆధారం (1)
49. క గుణింతంలో- గోరు, గిట్ట (1)

నిలువు:

2. అల (3)
3. గాలి (3)
5. ఆలకించాక (3)
7. లక్ష్మీపతి (3)
9. భల్లూకం (3)
10. ఈమె కాదు (2)
11. తొందర, ఆందోళన (3)
12. కారం రంగు (3)
13. ఉత్తరం (2)
15. చింతపండు రుచి (3)
16. 'ఊర్వశి' పురస్కారాన్ని ముమ్మార్లు గెలుచుకున్న సీనియర్ నటి (3)
17. ఉసిరి (4)
18. పాకశాస్త్ర ప్రవీణుడనిపించుకున్న ఒక పురాణపాత్ర (3)
20. ధరణి అంటే? (2)
22. పిల్లనగ్రోవి (3)
23. పడిశం (3)
25. గాంధారి సోదరుడు (3)
28. శాలను ఇముడ్చుకున్న పులి! (3)
29. రంగు, ప్రసిద్ధి (2)
30. ఇంకో (2)
31. శీర్షాసనమేసిన దోషి (2)
33. తక్కువైనది, ఖాళీ (3)
34. కొలను సవ్యంగా లేదు (3)
35. తటాకం (3)
37. ఒక సాంక్రామిక వ్యాధి (3)
40. చెరసాల (2)
43. ఏరుకన్నా పెద్దది, సముద్రంకన్నా చిన్నది! (2)
45. తోము (2)
46. ఏ విధంగా (2)

సుడొకు-164

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

						8	9	
7					8	1	5	
				6	5			3
			9	8			4	
		8	2		1	3		
	9			7	4			
3			8	2				
	5	9	6					7
	2	1						

సమాధానాలు

పదవినోదం-1119

1 తె	లు	2 పు		3 ప	ది	4 లం		5 తూ	టు		6 సు
లి		7 నా	దే	నా		8 చా	త	కం		9 అ	క్క
10 వి	11 డి	ది		12 మా	13 ట	లు		14 లో	15 ప	ల	
	సు		16 లీ		న్ను		17 చే		న్ను		18 స
19 అ	నా	20 స		21 ప		22 స	మం	23 త		24 వై	రి
ది		25 ర	మా	ర	26 మి		27 తి	రు	గు		ణ
28 గో	29 విం	దా		30 ద	తి	31 సు		గు		32 అ	త్త
	శ		33 చె	లా		34 గ్రీ	ష్మం		35 నె		గా
36 బ	తి	37 కి	న		38 గో	వు		39 తి	ల	40 కం	
తి		41 లో	త	42 న		43 డు	44 రే	నే		45 టీ	వి
46 మా	దే		47 ల	ప	ణం		ణు		48 మ	ర	
లు		49 ల		మి		50 సం	క	టం		51 పం	ద

సుడొకు-163

1	3	4	5	9	2	8	6	7
5	7	2	8	4	6	3	1	9
8	9	6	3	7	1	4	2	5
3	2	1	9	5	4	7	8	6
9	5	8	6	1	7	2	4	3
6	4	7	2	8	3	9	5	1
2	1	5	4	3	9	6	7	8
4	8	3	7	6	5	1	9	2
7	6	9	1	2	8	5	3	4

గజిబిజి అందం... ఆతిథ్యం



కొన్నిసార్లు అందం అర్థంకాకపోవచ్చు. ఎమ్.ఎఫ్.హుస్సేన్ పెయింటింగులను కోట్లకుకోట్లు పెట్టి ఎందుకు కొంటున్నారంటే ఏం చెప్తాం? మరికొన్నిసార్లు అందం గజిబిజిగానూ ఉండొచ్చు. స్పెయిన్‌లోని మార్కస్ డి రిస్కల్ హోటల్‌కి పర్యాటకులు ఎందుకు పోటెత్తుతున్నారంటే ఏమని చెప్పగలం? మార్కస్ డి రిస్కల్... స్పెయిన్‌లోని ఎల్సిగో ప్రాంతంలోని సుప్రసిద్ధ హోటల్. ప్రపంచంలో ద్రాక్షసారాయి ఉత్పత్తికి పేరుగాంచిన రియోజాకు సమీపంలో ఉందిది. ప్రపంచ ప్రసిద్ధమైన రియోజా సమీపంలో... మరో విశిష్టమైన హోటల్ ఉండాలన్న ఉద్దేశంతో ఆరేళ్ల కిందట ఈ హోటల్‌ను నిర్మించారు. చూడగానే ఆకట్టుకునేలా ఉండేందుకు రంగురంగుల లోహపు రేకులను హోటల్ పైభాగంలో ఉపయోగించారు. వాటికి తగ్గట్టుగానే లోపల గదులు కూడా కాస్త వంగినట్టూ, కుంగినట్టూ ఉండటం విశేషం. నిర్మాణ వైవిధ్యమే కాదు... అతిథ్యంలోనూ నెంబర్ వన్ ఈ హోటల్ అని చెబుతారు ఇక్కడకు వచ్చే పర్యాటకులు. ఈ హోటల్ నిర్మాణంతో ఎల్సిగో పర్యాటక చిత్రమే మారిపోయిందని గర్వంగా చెబుతున్నారు హోటల్ నిర్వాహకులు.

నదిమీద వంతెన ఎవరైనా కడతారు. అలా కట్టిన వంతెనమీద ఎవరైనా వెళ్తారు. కానీ, తమ వంతెన మీద అందరూ అలా వెళ్లిపోవాలని ఆ అధికారులు కోరుకోలేదు. సంభ్రమాశ్చర్యాలతో వంతెనను చూస్తూ కళ్లప్పగించి ఉండిపోవాలనుకున్నారు. ఆ ఆలోచనకు ప్రతిరూపమే 'మూన్‌లైట్ రెయిన్‌బో ఫౌంటెయిన్'. ఇది దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలోని హన్ నదిపై ఉంది. సుమారు 1.2 కి.మీ. పొడవుండే ఈ బ్రిడ్జి పొడవునా ఇరువైపులా పదివేల ఎల్ఈడీ నాజిళ్లు ఏర్పాటుచేశారు. నదిలోని నీటినే వీటిద్వారా నిమిషానికి సుమారు 190 టన్నులు వెదజల్లుతారు. చిన్నపాటి జలపాతాలను పోలిన ఈ ఇంద్రధనుసు ఫౌంటెయిన్లను చూడటానికి రెండుకళ్లూ సరిపోవు. ఎందుకంటే... రెండువైపులా చూడాలి కదా మరి! అందుకే, ఈ వంతెన గిన్నిస్‌బుక్‌లోకీ ఎక్కింది.

ఈనాడు
ఆదివారం
16 డిసెంబరు 2012



'ఐడియా' యుద్ధం!

Online matrimony service from
EENADU

WE KNOW WHAT
YOU WANT IN A
MATRIMONY SEARCH!

RELIABILITY
CHOICE
CONVENIENCE

Eenadupellipandiri.net – The TELUGU MATRIMONIAL website from EENADU!

Planning your **Daughter's** or **Son's** marriage... Take the first and of course the right step today. Register your son's or daughter's profile with Eenadupellipandiri.net – The TELUGU MATRIMONY site from EENADU! Get to see many profiles from TELUGU COMMUNITY that fit your criteria before you choose the right match for your son or daughter. You can shortlist the profiles, communicate and interact with them before both the families meet formally.

eenadupellipandiri.net has brought many families together and is behind many happy weddings. Let us together celebrate your **Son's** or **Daughter's** wedding.

eenadu pellipandiri.net
We understand TELUGU WEDDINGS BETTER

For registrations & details log on to **www.eenadupellipandiri.net** or **Call : 040 - 4905 1234**

verb

లోపల...

చురుక్కు చమక్కు 4
ఈ నీలకంఠుడు...
ఆరునెలలు నీళ్లలోనే! 5
మీ మందు మీ చేతిలో 6
'జ్ఞానానంద'మయం! 11
కథ 12
పాత్రలో ఒదిగిపోతా 15
వీరీ వీరీ గుమ్మడిపండు... 16
కదంబం 18
అరటిపండ్ల రైలు..! 19
అదే నేర్చుకున్నాం,
అదే నేర్పుతున్నాం 20
సూటిగా... సుత్తి లేకుండా! 22
రుచి అభిరుచి 23
బాలవినోదిని 24
వెండితెరపై యమ ముద్ర! 26
పాముల పల్లె 27
రాశి ఫలం 28
సమీక్ష 29
పదవినోదం 30

'ఐడియా' యుద్ధం!

బిజినెస్ ఐడియా పోటీలూ, బిజినెస్ ప్లాన్ కాంపిటీషన్లూ ఊపందుకుంటున్నాయి. దిగ్గజాల్లాంటి సంస్థలూ చేయితిరిగిన ఇన్వెస్టర్లూ రంగంలోకి దిగుతున్నారు. కొత్త ఐడియాలను గుర్తించి గౌరవిస్తున్నారు. సందేహం అక్కర్లేదు, ఒక మంచి ఐడియా జీవితాల్ని మార్చేస్తుంది. 7

మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

భలే చిక్కుడు

'గ్లోబల్ గోరుచిక్కుడు' ఉపయోగకరమైన వ్యాసం. మనం నిత్యం వాడుతున్న ఎన్నో వస్తువుల తయారీకి చిక్కుడు ఉపయోగపడుతోందని తెలుసుకుని ఆశ్చర్యపోయాం. పంట ప్రాముఖ్యత, దిగుబడి, రాబడి గురించి చక్కగా వివరించారు. చాలీచాలని జీతాలతో పట్టణాల్లో ఇబ్బందులు పడే పల్లె యువత... తిరిగి గ్రామాలకు వెళ్లిపోయి ఇలాంటి వాణిజ్య పంటలను సాగు చేయడం ఎంతో ఉత్తమం.

– మల్లేష్ బండారి, కరీంనగర్
– పి.విజయ్‌కుమార్, చెన్నూరు, ఆదిలాబాద్

హత్తుకుంది

'అమ్మ పుట్టినరోజు' కథ మా హృదయాలను హత్తుకుంది. ఈ కథలోని సంఘటనలు నిత్య జీవితంలో... ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల్లో మనం చూస్తున్నవే. ప్రతీదానికీ అమ్మ ఉందిగా అనుకుంటుంటాం. కానీ, అమ్మకి మనం ఉన్నామో లేమో ఆలోచించేవారు ఏ కొద్దిమందో ఉంటారు. దీన్ని చదివినవారిలో కొంతైనా మార్పు వస్తుందని ఆశిస్తున్నాం.

– మాచర్ల మోహన్ నాగేశ్వరరావు, విజయవాడ
– కె.కల్యాణి, ర్యాలీ, తూ.గో.

అరుదుగా ఉంటారు

'అంతిమయాత్రకు అన్నీ తానై' స్ఫూర్తిదాయకంగా ఉంది. చంద్రశేఖర్‌రెడ్డిలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. ఆయన్ని చూసి వందమందిలో ఒకరు మారినా చాలు. అనాథ శవాలకు సంస్కారాలు చేయించడం గొప్ప విషయం. ఆయన దీంతోపాటూ నిత్యాన్నదానం కూడా నిర్వహిస్తుండటం అభినందనీయం.

– ఎ.ఎస్.లీల, భీమవరం
– కటకం వీరభద్రరావు, కాకినాడ

రామ్ మంచి బాలుడు

'రోటీన్ అంటే బోరు' అంటూ యువ హీరో రామ్ చెప్పిన కబుర్లు అలరించాయి. ఉమ్మడి కుటుంబం గురించి రామ్ చెప్పిన మాటలు చాలా బాగున్నాయి. ఒక సినిమాలో నటించేందుకు అతడు పడే కష్టాన్నీ అంతర్మథనాన్నీ చక్కగా చెప్పాడు. 'అంతిమయాత్రకు అన్నీతానై' నచ్చింది. చంద్రశేఖర్‌రెడ్డి అభినందనీయులు.

– కె.కీర్తిరత్న, సామర్లకోట
– వై.రాజేష్, విశాఖపట్నం

ఆకుల ఫ్యాషన్

'ఆకు పచ్చని ఫ్యాషన్' ఆకర్షణీయంగా ఉంది. నిజంగానే అతివల దుస్తులంటే చాలా వరకూ ఆకుల డిజైన్లు ఉండే తీరతాయి. వివిధ డిజైన్ల ఫొటోలు చూపుతిప్పుకోనివ్వలేదు. దుస్తుల మోడల్స్ కూడా బాగున్నాయి. 'అమ్మ పుట్టినరోజు' కథ బాగుంది. అమ్మప్రేమ మాధుర్యాన్ని అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ బిడ్డకూ ఉంటుంది. ఎంతోమందిని మేలుకొలిపే కథ ఇది.

– పైడిశెట్టి హరీష్, నర్సన్నపేట, శ్రీకాకుళం
– ఆదర్శ్, కరీంనగర్

మెదడుకు మేత

'సినిమా పజిల్స్' నచ్చాయి. ఆదివారంపూట మెదడుకు మేత పెట్టాయి. వీలైతే ఇలాంటి పజిల్స్‌ని ప్రతీవారం ఇస్తే బాగుంటుంది. 'నలుపంటే నలుపు కాదు' చిత్రాలు- ముఖ్యంగా నల్లకుందేలూ బల్లీ ఉడుతలను చూస్తుంటే ఆశ్చర్యమేసింది. మనకు తెలియని వింతలు ఈ ప్రకృతిలో ఎన్ని ఉంటాయో కదా అనిపించింది.

– కాంచనపల్లి కృష్ణమోహనరావు, ఫీనిక్స్, అమెరికా
– ఎ.ఆర్.రాజేశ్వరి, విజయనగరం
– పి.వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్

మీకు తెలుసా!

'లాక్మే' అంటే 'లక్ష్మి'!

ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల సంస్థ 'లాక్మే' పేరు మనకు తెలిసిందే. అయితే, ఆ పేరు పెట్టడం వెనక ఆసక్తికరమైన సంఘటన ఉంది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో... ప్రధాని నెహ్రూ, జేఆర్డీ టాటాకి ఓ ఉత్తరం రాశారు. విదేశాల నుంచి సౌందర్య సాధనాలను దిగుమతి చేసుకోవడం వల్ల మనం నష్టపోతున్నామనీ వాటిని మనమే ఉత్పత్తి చేస్తే మంచిదనీ కోరారు. అప్పుడు నావల్ టాటా సౌందర్యోత్పత్తులకు బాగా గిరాకీ ఉన్న ఫ్రాన్స్‌లో వాటి తయారీ కేంద్రాన్ని ప్రారంభించాలనుకున్నారు. టాటా ఆయిల్ మిల్స్‌లోని ఒక విభాగాన్ని సౌందర్య సాధనాల తయారీ కేంద్రంగా మార్చాలనుకున్నారు. దానికి ఏ పేరు పెడితే బాగుంటుందా అని చాలా ఆలోచించారట. ఓరోజు ప్యారిస్‌లో ఒక నాటక ప్రదర్శన జరుగుతోంది. ఆ నాటకం పేరే లాక్మె. అందులో 'లక్ష్మీదేవి' పేరును ఫ్రెంచిలో వారు 'లాక్మే' అని ఉచ్చరించడాన్ని టాటా గమనించారు. ఇదేదో వినడానికి కొత్తగా ఉందనిపించి ఆ పదాన్నే కంపెనీ పేరుగా పెట్టుకున్నారు. అలా లక్ష్మీ నుంచి 'లాక్మె' బ్రాండ్ వచ్చింది. ఆ తరువాత కొన్నేళ్లకు లాక్మె కంపెనీని హిందుస్థాన్ లీవర్‌కి విక్రయించారు.

LAKMÉ COSMETICS

మంచిమాట

విజయానికి కావలసింది బోలెడంత సమయం కాదు, ఉన్న కొద్ది సమయాన్నయినా సద్వినియోగం చేసుకోవాలన్న సంకల్పం, చేసుకోగల సామర్థ్యం.

చురుకు

విమర్శలతో సర్జికల్ దాడి
పాల సర్జికల్ దాడి
కిరణ్
వెంకట్ వీరాలు
వేలసలు
ధరలు
శ్రీధర్


నిన్నేం కింద పడేయట్లేదు, భయపడకు!
శేషగిరి
కర్ణాటక ప్రభుత్వం
యడ్యూరప్ప
మంత్రులూ, ఎమ్మెల్యేలు


అవినీతి
బిజేపీకి కాంగ్రెస్‌కి తన్న చప్పట్లైన తడాగమనించావా!
అవినీతి

చమకు


సాహసగతం, సుసాహసగతం, ఇక అభివృద్ధి చెయ్యి
ఎఫ్‌డీఐలు
దేశీయ చిల్లర వర్తకులు

ఈ నీలకంఠుడు... ఆరునెలలు నీళ్లలోనే!

శివుడు అభిషేకప్రియుడు. అలాంటి శివుడు అక్కడి ఆలయంలో ఆరునెలలపాటు నీళ్లలోనే ఉంటాడు. అభిషేకం చేయాలంటే... మిగతా ఆరునెలల్లోనే చేయాలి. ఈ అరుదైన ఆలయం శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో ఉంది.



శివుడికి నలుగురు భార్యలని చెబుతారు పెద్దలు. అర్ధనారీశ్వరుడు కాబట్టి, పార్వతీదేవి మొదటిభార్య. భగీరథుడి కోరిక మేరకు గంగను భరించి, శిరసున మోశాడు కాబట్టి గంగ రెండో భార్య. ఇక మిగతా ఇద్దరు భార్యలూ క్షేత్రాలు. వాటిలో మొదటిది కాశీ, రెండోది దక్షిణకాశిగా పేరుగాంచిన ద్రాక్షారామం.

శివుడికి రెండో భార్య అయిన గంగమ్మ... తనను భరించిన శివయ్యను చల్లబరుస్తోందా అన్నట్టు ఉంటుంది ఆ ఆలయంలోని చిత్రం.

తనను నిత్యం శిరసున ధరించే శివయ్యకు కృతజ్ఞతాపూర్వకంగా... ఏడాదిలో ఆరు నెలలపాటు గంగమ్మ ఆయన్ను తనలో దాచుకున్నట్టు ఉంటుంది ఆ ఆలయ గర్భగుడి.

ఈ జలవిశేషాన్ని చూడాలంటే పాతపట్నంలోని నీలకంఠేశ్వరాలయానికి వెళ్లాల్సిందే.

17వ శతాబ్దంలో...

ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల విభజన జరగకముందు 17వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పర్లాకిమిడికి చెందిన గంగ వంశీయుడైన ముకుంద గజపతి నారాయణ పాలించేవారు. అప్పట్లో పాతపట్నం శివారులోని మహేంద్రతనయ నదికి ఆవలివైపున పొలాలు ఉండేవి. ఓరోజు ఒకరైతు నాగలితో దున్నుతుండగా నాగలికి ఏదో తగిలి, ముందుకు కదల్లేదట. ఏంటా అని తవ్వి చూస్తే... లింగాకారం. వెంటనే ఆ రైతు ఈ విషయం చెప్పడానికి ఊర్లోకి వెళ్లాడు. అదేరోజు రాత్రి ముకుంద గజపతి నారాయణకు శివుడు కలలో కనిపించి... 'నేను ఈ ప్రాంతంలో లింగాకారంలో ఉన్నాను. నాకు ఓ ఆలయాన్ని నిర్మించు. నీ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది' అని చెప్పాడట. మరునాడే రాజు... శివలింగాన్ని వెతికేందుకు బయలుదేరాడు. పంటపొలంలో వెలసిన శివుణ్ణి దర్శించుకుని... నీలకంఠేశ్వరుడు అని పేరు పెట్టి, అక్కడే ఆలయాన్ని నిర్మించాడు. 1656 నుంచి 1674 మధ్యలో ఆలయ నిర్మాణం జరిగినట్లు ఆలయ గోడలపై రాసి ఉంది. అప్పట్నుంచీ ఇప్పటివరకూ ఈ ఆలయం చుట్టూ పంటపొలాలు అలాగే ఉండటం విశేషం.

ఫిబ్రవరి నుంచి మొదలు...

నీలకంఠేశ్వర ఆలయాన్ని దర్శించుకోవడానికి జులై నుంచి జనవరి మధ్యలో ఎక్కువగా వస్తుంటారు భక్తులు. ఎందుకంటే, జులై నెలరావడమే ఆలస్యం... గర్భాలయంలో నీరు ప్రత్యక్షమవుతుంది. ప్రకృతిసిద్ధంగా స్వచ్ఛమైన నీరు ఉబుకుతుంది. వేసవి ఎండలకు ఆ పరమేశ్వరుడు కందిపోయాడనుకుంటుందో ఏమో, గంగమ్మ... లింగాన్ని నీటితో ముంచెత్తుతుంది. ఒక్కో సమయంలో మూడు అడుగుల ఎత్తు వరకూ నీరు వస్తుంది.

ఈ ఆరు మాసాల సమయంలో నీటిలో ఉన్న శివలింగానికే పూజలూ అర్చనలూ చేస్తారు భక్తులు. అంతేకాదు, గర్భగుడిలో ఉబికిన నీటినే తీర్థంగా స్వీకరిస్తారు.

ఆరునెలల తరవాత అంటే... ఫిబ్రవరి మొదటివారంలో ఆ నీరంతా మాయమైపోతుంది. శివలింగం మామూలుగా కనిపిస్తుంది. గర్భగుడిలోకి ఈ నీరు ఎలా వస్తోందో, ఆరునెలల తరవాత మళ్లీ ఎలా మాయమైపోతోందో ఎవ్వరికీ తెలియదు.

పంచలోహ నందీశ్వరుడు

ఆలయంలోని మరో ఆకర్షణ... 53 కిలోల పంచలోహ నందీశ్వరుడు. అప్పట్లో గజపతి రాజులే ఈ విగ్రహాన్ని తయారుచేయించారు. పండగలూ ఉత్సవాల సమయాల్లో దీన్ని గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళతారు. 2004లో అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఒకటి ఈ విగ్రహాన్ని ఎత్తుకుపోయింది. వాళ్లు తమవెంట తీసుకెళ్లే అవకాశం లేక... మహేంద్రతనయ నది ఒడ్డున భూమిలో పాతిపెట్టారు. ఆ తరవాత నుంచీ ఈ ప్రాంతంలో వర్షాలు పడలేదట. కొద్దిరోజుల తరవాత ఆ దొంగలు నదీతీరంలో ఇసుకను తవ్వుతుండగా స్థానికులు గుర్తించి పట్టుకున్నారు. అలా నందీశ్వరుడి విగ్రహం మళ్లీ ఆలయంలోకి చేరింది. అప్పటివరకూ వర్షాలు కురవకుండా, కరవు కాటకాలతో ఉన్న ఆ ప్రాంతంలో... విగ్రహం ఆలయానికి చేరిన రోజున భారీ వర్షం కురిసిందట. అందుకే, నందీశ్వరుడికీ ప్రత్యేక పూజలు చేస్తారు భక్తులు. ఇక్కడ అమ్మవారి పేరు వారాహిదుర్గ. ఇంకా ఈ ఆలయంలో కాశీవిశ్వేశ్వర, లోకనాథేశ్వర, కేదారేశ్వర, రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి.

శిల్పకళా వైభవం

గజపతులు శిల్పకళా పోషకులు. అందుకే, నీలకంఠేశ్వర ఆలయాన్ని చూడచక్కని శిల్పాలతో నిర్మించారు. దశావతారాలను శివతత్వంలో మలచి... అంటే, శివుడే దశావతారాలను ధరించాడా అన్నట్టుండే శిల్పాలను ముఖమండపంలో ప్రతిష్ఠించిన తీరు అబ్బురపరుస్తుంది.

శ్రీకాకుళం నుంచి సుమారు 42 కి.మీ. దూరంలో ఉంది పాతపట్నం. అక్కణ్ణుంచి కె.గోపాలపురం గ్రామానికి వెళ్లే దారిలో... పాతపట్నం పట్టణం నుంచి పావుకిలోమీటరు దూరంలో ఉంది నీలకంఠేశ్వరాలయం. మహేంద్రతనయ నది వంతెనపై ఉన్న కాజ్ వేను దాటి పంటపొలాల మధ్యలోకి అడుగు పెడితే... బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టు ఉంటుంది. ఈ ప్రశాంత వాతావరణమూ... ఆరునెలల నీళ్లు... ఇవన్నీ భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

– *సూరాబత్తుల చంద్రశేఖర్*
న్యూస్‌టుడే, పాతపట్నం

మమంచు 49 హోమియో మీ చేతిలో

తడపరతో జాగ్రత్త

తడపర లేదా తట్టు (మీజిల్స్) అనేది అంటువ్యాధి. 5 సంవత్సరాల వయస్సులోపు పిల్లల్లో ఎక్కువ. సాధారణ జలుబు మాదిరే ఇదీ వైరస్ కారణంగా సంప్రాప్తించే వ్యాధే. జలుబు మాదిరే ప్రారంభమవుతుంది, జలుబు మాదిరే రోగి ముక్కు, గొంతు స్రావాలు/ తుంపర్ల ద్వారా ఎదుటి వారికి సంక్రమిస్తుంది. ఈ వైరస్ క్రిములు సంక్రమించిన 10, 12 రోజుల తర్వాతగానీ వ్యాధి లక్షణాలు కన్పించవు. కానీ ఈ క్రిములు ఒంట్లో చేరిన వారం రోజుల నుంచీ ఎదుటి వారికి ఈ వ్యాధి సంక్రమించే అవకాశముంటుంది.

తట్టు వ్యాధి జలుబు, దగ్గుతో ఆరంభమవుతుంది. ముందు బుగ్గల లోపల తెల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలకు 'కోప్లిక్స్ స్పాట్స్' అని వ్యవహరిస్తారు. 3, 4 రోజుల తర్వాత శరీరంపై దద్దు కనిపిస్తుంది. ముందు మెడ మీద, చెవుల వెనకభాగంలో కనిపించి, తర్వాత మిగతా శరీరం అంతటా చోటు చేసుకోవటం జరుగుతుంది. మచ్చలన్నీ కలిసి శరీరమంతటా డాగులు డాగులుగా కనిపిస్తాయి. తట్టు వ్యాధి డాగులు దురద పెట్టవు.

డాగులు కన్పించే సమయానికి పెద్ద పెట్టున జ్వరముంటుంది. 104 నుండి 105 డిగ్రీల ఫారిన్‌హీట్ వరకూ కూడా ఉండవచ్చు. మెడ దగ్గరి లింఫ్ గ్రంథులు వాచి, బిళ్ల కట్టి ఉంటాయి. ఆకలి మందగిస్తుంది. చెవిగూబ ఎర్రబడి నొప్పి, పొట్టలో నొప్పి, వాంతులు, విరేచనాలు కనిపిస్తాయి. కాళ్ల మీద డాగులు కనిపించిన తర్వాత 2, 3 రోజులకు జ్వరం ఇతర లక్షణాలు తగ్గిపోతాయి.

తట్టువ్యాధి లక్షణాలు వాటికవేగా రోగికి ప్రమాదం తెచ్చిపెట్టవుగానీ ఈ వ్యాధి కారణంగా చోటుచేసుకునే ఇతర వ్యాధులు మాత్రం ప్రమాద హేతువులనే చెప్పుకోవచ్చు. వీరిలో బ్రాంకైటిస్, న్యుమోనియా అత్యంత ప్రమాదకారులు. వెయ్యిమంది బాధితుల్లో ఒకరికి మెదడువాపు వ్యాధి సంక్రమించే అవకాశముంది. ఈ వ్యాధి రాకుండా పిల్లలకు నిరోధక టీకాలున్నాయి. పిల్లలు అనారోగ్యంగా ఉన్నా, ముఖ్యంగా మెదడు వ్యాధులున్నా.. వారికి ఈ టీకాలు ఇవ్వకూడదు. అలాగే గుడ్లు సరిపడని వారికి కూడా ఈ టీకాలు హానికరం. గుడ్లు ఉపయోగించి ఈ టీకాలు తయారవుతున్నాయి గనుక గుడ్లకు అలర్జీ వున్న శిశువులకు ఈ టీకాలు వేయరు.

తట్టు వ్యాధి టీకాలు వేసిన పిల్లల్లో తేలికపాటిగానే అయినప్పటికీ నూటికి ఐదుగురిలో తట్టువ్యాధి రావచ్చు. 10 లక్షల కేసుల్లో ఒకరు మెదడువాపు వ్యాధికి గురికావచ్చు. హోమియోలో 'మార్బిలైనం' ఔషధం ఒక డోసు వేసినట్లయితే ఇవే ఈ వ్యాధిని నిరోధించవచ్చు.

1 సమస్య

జ్వరం, చలి, దాహం, చెమటలు

2 ఔషధాన్ని ఎంపిక చేసుకునేదెలా?

ఆకస్మాత్తుగా పెద్దపెట్టున జ్వరం వస్తే	ఎకోనైట్
చెమటలు అధికం, దుప్పటి కప్పితే తన్నేస్తుంటే	ఎకోనైట్
జలుబు, ఖంగు ఖంగున దగ్గు వున్నట్లయితే	బ్రయోనియా
నాలుక మీద తెల్లటి కోటింగ్, దప్పిక ఎక్కువ, ఎక్కువ నీళ్లు తాగుతుంటే	బ్రయోనియా
వేసవిలో జ్వరం, రెప్పలు బరువెక్కి వాలిపోతుంటే	జెల్సీమియం
వెన్నులో చలి పైకీ కిందికీ పాకుతున్నట్లుంటే	జెల్సీమియం
ఒంటి మీద దద్దు, పెద్దగా జ్వరం కన్పించనట్లయితే	పల్సటిల్లా
చలి పెడుతుంది, దుప్పటి కప్పుకోవాలనిపించదు	పల్సటిల్లా

3 మీ ఔషధం గురించి మరిన్ని వివరాలు

ఎకోనైట్

విపరీతంగా చలి. దాహం ఎక్కువ. ఆస్థిమితం. దురదలు. ఒళ్లు వెచ్చగా, పొడలుగా, కందినట్టు ఉంటుంది. ముఖం కందినట్లు ఎర్రగా కన్పిస్తుంది.

బ్రయోనియా

పొడి దగ్గు. ఛాతీలో కుట్టు నొప్పులు. చలి ఎక్కువ. కొద్దిపాటి శ్రమకు కూడా విపరీతంగా చెమటలు, రాత్రిళ్లు విపరీతంగా దగ్గు. కూర్చోవలసి వస్తుంది. వాంతవుతుంది. బయట నుండి ఇంట్లోకి వెళ్లగానే దగ్గు.

జెల్సీమియం

జ్వరం. ఒంటి మీద దద్దు. నిస్త్రాణ, కను రెప్పలు వాలిపోయి ఉంటాయి. చర్మం పొడారి ఉంటుంది. దురద. మగత, ముక్కు కారుతుంటుంది. పొడి దగ్గు.

పల్సటిల్లా

బయట వేడిగా వున్నా చలి పెడుతుంది. దాహం వుండదు. సాయంకాలం నాలుగు అయ్యేటప్పటికి చలి. దగ్గుతో పడుకోలేక లేచి కూర్చుంటారు. ఉదయం పూట దగ్గు, ఆకుపచ్చగా కఫం పడుతుంది.

తట్టు నొప్పికి పల్సటిల్లా, సల్ఫర్ చాలంటాడు కెంట్. కొంతమంది ఎకోనైట్, యుఫ్రేజియాలూ సాయపడతాయంటారు.

మోతాదు: మీరు ఎంచుకున్న ఔషధాన్ని 30 పొటెన్సీలో రోజూ ఉదయం సాయంత్రం... 3 మాత్రల చొప్పున... 2, 3 వారాలపాటు వాడాల్సి ఉంటుంది.

కొత్త ఆలోచనలు కదంతొక్కుతాయి. ఆవిష్కరణలు సై అంటే సై అంటాయి. ఐడియా పోటీలూ, బిజినెస్ ప్లాన్ కాంపిటీషన్లూ... క్యాంపస్ బుర్రలకు పదునుపెడుతున్నాయి. ఔత్సాహిక వ్యాపారవేత్తల కోసం గెలుపు తలుపులు తెరుస్తున్నాయి.

'ఐడియా' యుద్ధం!

ఆలోచన... చిన్న పాయగా మొదలై... మహా సముద్రంలా విస్తరిస్తుంది.

ఇది... జ్ఞానశక్తి. మేధకు సంబంధించింది.

పోటీ... ప్రపంచానికి వీరుడినిస్తుంది. వీరుడికి విజయాన్నిస్తుంది. విజయానికి అర్థాన్నిస్తుంది.

ఇది... ఇచ్ఛాశక్తి. గెలవాలన్న తపనతో ముడిపడింది.

ఆచరణ... అద్భుతమైన ఐడియాలన్నీ వాటంతటవే అత్యద్భుతమైన వ్యాపారాలైపోవు. అమలు ముఖ్యం. చిత్తశుద్ధి ఉండాలి.

ఇదే క్రియాశక్తి. ఆచరణే ప్రాణం.

ఇచ్ఛాశక్తి-జ్ఞానశక్తి-క్రియాశక్తి ఈ మూడింటినీ కలిపి 'మహాశక్తి'గా అభివర్ణిస్తుంది భారతీయత.

అది ఐడియాల పోటీ కావచ్చు, బిజినెస్ ప్లాన్ కాంపిటీషన్ కావచ్చు-ఏ విజయానికైనా ఇదే మార్గం, ఇదే మంత్రం!

ఐడియాలు కావాలి...

నూట ఇరవైకోట్ల కస్టమర్లున్నారు. ఇంటర్నెట్ ఉంది. ఇంటికో ఇంజినీరింగ్ పట్టభద్రుడున్నాడు. మౌలిక సౌకర్యాలున్నాయి. లేనిదల్లా ఐడియాలే. ఉన్నా అడుగుబొడుగు సరుకే. కాపీ రాగమే! నిఖార్సయిన ఐడియాల కొరత మార్కెట్‌ను తీవ్రంగా వేధిస్తోంది. ఎదుగుతున్న సమాజానికి ఆవిష్కరణలే ఆక్సిజన్. ఆ అవసరం పెరిగేకొద్దీ పోటీల ప్రాధాన్యం పెరుగుతుంది. అదే జరుగుతోందిప్పుడు.

పోటీ... పదునైన బుర్రలకు సవాలు, గట్టి ఆలోచనలకు గండపెండేరం. అలాంటి పరీక్షలోనే... రంగురాళ్లతో పోరాడి వజ్రం గెలుస్తుంది. జంతుజాలం మధ్యలోంచి మృగరాజు దర్జాగా నడిచొస్తుంది. త్రేతాయుగంలో శివధనుస్సు అయినా, ద్వాపరలో మత్స్య యంత్రమైనా పోటీకి ప్రతీకలే. ఇప్పుడా పోరు మేధోయుద్ధంగా మార్పు చెందింది. బిజినెస్ ఐడియా కాంపిటీషన్స్... వాటి తాజారూపం.

క్యాంపస్ క్యాంటీన్లో సెటైర్లేసుకుంటూ కాలక్షేపం చేసే కుర్రాళ్లను రెచ్చగొట్టాలంటే... లక్ష్యం లేకుండా బతికే టెక్కీలకు గెలుపులోని కిక్కు రుచి చూపాలంటే... 'నేనూ నాజీతం' అనుకునే జీవితాలకు విశ్వరూప దర్శనం చేయించాలంటే పోటీలే మార్గం. మరో వర్గమూ ఉంది. వాళ్లనెవరూ గిల్లాల్సిన పన్లేదు. గిచ్చాల్సిన అవసరం లేదు. రెచ్చిపోయే గుణం రక్తంలోనే ఉంటుంది. అవకాశాల కోసం భుజానికి బైనాక్యులరేసుకుని తిరుగుతుంటారు. ప్యాకేజీ బాగుంటే... బ్యాగేజీ సర్దుకుని బయల్దేరతారు. ప్రైజ్‌మనీ పాకెట్లో పడేదాకా పచ్చి మంచినీళ్లయినా ముట్టుకోరు.

...వీళ్లంతా ఐడియాల యుద్ధంలో అక్షౌహిణుల సైన్యం.

దరఖాస్తులకు ఆహ్వానం...

శామ్‌సంగ్, ఎకనమిక్ టైమ్స్, టాటా, మహీంద్రా, ఫిలిప్స్, నోకియా... ఆహ్వానిస్తున్నది ఆషామాషీ సంస్థలు కాదు. జాతీయ అంతర్జాతీయ దిగ్గజాలు. ఆ పిలుపులో కొంత కార్పొరేట్ సామాజిక బాధ్యత ఉంది. ఎదుగూ ఎదగనివ్వూ... అన్న సువిశాల వ్యాపార భావనా లేకపోలేదు. నిజానికి ఏ సంస్థకు ఆ సంస్థకు పరిశోధన- అభివృద్ధి విభాగాలున్నా, వాటిపై కోట్లకు కోట్లు ఖర్చు పెడుతున్నా... ఇప్పటిదాకా ఏ గొప్ప వ్యాపార ఆలోచనా అద్దాల గదుల్లో ఊపిరిపోసుకోలేదు. గూగుల్, ట్విటర్, ఫేస్‌బుక్... అన్నీ జనం లోంచి పుట్టినవే. సామాన్యుల ఆవిష్కరణలే. అందుకే కార్పొరేట్ సంస్థలు యువత భాగస్వామ్యానికి అంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఐడియాను వ్యాపారంగా మలచడంలో అన్ని విధాలా అండగా నిలిచే ఏంజిల్ ఇన్వెస్టర్లూ, వ్యాపార భాగస్వాములుగా మారి పెట్టుబడులు సమకూర్చే వెంచర్ క్యాపిటలిస్టులూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆశీస్సులు అందించే పోటీలూ తక్కువేం కాదు. అందులోనూ రకరకాలు. ఒక పోటీ ఐడియాలు చెబితే చాలంటుంది. ఒక పోటీ పక్కా బిజినెస్ ప్లాన్ సమర్పించమంటుంది. ఒక పోటీ గ్రామీణుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే ఆవిష్కరణలు కావాలంటుంది. ఒక పోటీ పర్యావరణానికి హానిచేయని టెక్నాలజీని కనిపెట్టమంటుంది. ఒక పోటీ అదర

ఐడియాల జాతర!

కల... నిద్రలో వచ్చి నిద్రలో పోయేది కాదు. నిద్రలేపేది, నిద్రలేకుండా చేసేది. కళ్ల నిండా ఆశలతో, గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో - భుజంతట్టే చేతుల కోసం ఎదురుచూస్తున్న కొత్తతరాన్ని గుర్తించి గౌరవించి ప్రోత్సహించడానికి ఎన్నో వేదికలు, దమ్మున్న ఐడియాలకు దుమ్మురేపే అవకాశాలు!

'మెరుపు' కల

మహీంద్రా... స్పార్క్ ద రైజ్

వ్యవసాయం, సౌరవిద్యుత్, గ్రామీణాభివృద్ధి, మౌలిక సౌకర్యాలు, టెక్నాలజీ... తదితర రంగాలకు సంబంధించి ప్రజల జీవితాల్ని మార్చేయగల ఐడియాలను ఆహ్వానిస్తోంది.

Spark the Rise

వివరాలకు: www.sparktherise.com

వజ్రాలవేట

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్

సామాన్యుల ఐడియాలను ప్రోత్సహిస్తుంది. అట్టడుగు ఆవిష్కరణలకు పట్టంకడుతుంది. సాంకేతిక సహకారం అందిస్తుంది. పేటెంట్ సాధించడంలో సాయపడుతుంది. విద్యార్థులకూ యువతకూ ఆవిష్కరణ పోటీలు నిర్వహిస్తుంది.

వివరాలకు: www.nif.org.in

అదిరేటి డిజైన్లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్

డిజైన్ చేయండి-దేశాన్ని మార్చండి... అంటుంది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్. ఉదాహరణకు - మరింత చవకైన వాటర్‌ఫిల్టర్లు, మన్నికైన బస్ షెల్టర్లు, తక్కువ ధరలో ఆకర్షణీయమైన కియోస్క్‌లను తయారు చేయడం... ఇలా అనేకానేక అంశాలపై ఐడియాలను ఆహ్వానిస్తుంది. పోటీలు పెడుతుంది.

राष्ट्रीय डिज़ाइन संस्थान NATIONAL INSTITUTE OF DESIGN

వివరాలకు: www.nid.edu

ఐడియా శక్తి

ద ఎకనమిక్ టైమ్స్-పవర్ ఆఫ్ ఐడియా

ఏటా పోటీలు నిర్వహిస్తుంది. గెలుపొందిన ఐడియాలకు ఆర్థిక సహకారం అందిస్తుంది. ఇప్పటికే ఎన్నో కలల్ని నిజం చేసింది.

THE POWER OF ideas

వివరాలకు: www.ideas.economictimes.com

గొట్టే మొబైల్ అప్లికేషన్లను అందించమంటుంది. ఒక పోటీ డిజైనింగ్‌కు పెద్దపీట వేస్తూ వికలాంగుల సైకిళ్లనో, బస్‌స్టాపు బెంచీలనో సరికొత్తగా రూపొందించమంటుంది. కొన్ని విద్యార్థులకే పరిమితం. ఇంకొన్ని అందరికీ ఆహ్వానం.

ఏ సంస్థా రాకెట్ టెక్నాలజీ గురించో పరుసవేది విద్య గురించో అడగటం లేదు. సామాన్యుడి జీవితాన్ని మార్చే చిన్న ఆలోచన ఇచ్చినా చాలంటున్నాయి. శామ్‌సంగ్ ఇన్నోవేషన్ అవార్డు విజేత మాప్లే ఆవిష్కరణ ఏమిటో తెలుసా... ప్రమాదాల్లో గాయాల పాలైనవారిలో తక్షణం రక్తస్రావాన్ని ఆపే థర్మోస్టాటిక్ డ్రెస్సింగ్. 'నిమిషానికో రోడ్డు ప్రమాదం జరుగుతోంది. రక్తం పోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నవారు సగానికి సగంమంది. ఈ డ్రెస్సింగ్‌తో రక్తస్రావాన్ని ఆపడం చాలా సులభం' అంటారు మాప్లే. రక్తమోడుతున్న రహదారుల్ని చూడలేకే ఈ పరిశోధన ప్రారంభించారాయన. చాలా ఐడియాలకు మూలం మేధస్సో సాంకేతిక పరిజ్ఞానమో కాదు. స్పందన, మానవీయ స్పందన! వికలాంగులు ఉపయోగించే చక్రాల సైకిళ్లు మెట్లు ఎక్కడానికి పనికిరావు. ఇదో పెద్ద అవరోధం. ఓ తీవ్ర సమస్య కూడా. ఐఐటీ కాన్పూర్ విద్యార్థి శానుశర్మ తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆ పరిమితిని అధిగమించే ప్రయత్నం చేశారు. ఆ సృజనకు జి.ఇ.ఇండియా ఇన్నోవేషన్ అవార్డు వచ్చింది. విజయభాస్కర్ 'ఎకో కేర్' ...పర్యావరణానికి ఎలాంటి హానీ చేయని ఇటుకల్ని ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల ప్రకృతికి నష్టం ఉండదు. తేలిగ్గా ఉంటాయి కాబట్టి, నిర్మాణపనులూ చకచకా జరిగిపోతాయి. 'బిజ్-క్వెస్ట్' పోటీల్లో ఈ ప్రాజెక్టు ఎంపికైంది. సామాజిక బాధ్యత లోంచి ఈతరహా ఆలోచనలు ప్రాణంపోసుకుంటాయి. జీవితానుభవాలు కూడా ఐడియాకు బలాన్నిస్తాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సంస్థ 'రెడ్‌బస్' సంగతే తీసుకోండి. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఫణీంద్రశర్మ పండక్కి ఊరెళ్లడానికి పడిన కష్టమే... తిరుగులేని బిజినెస్ ఐడియాగా మారింది. వెంచర్ క్యాపిటల్ సంస్థల్నీ ఆకర్షించింది. ఆ కంపెనీ మూడువందల కోట్ల వార్షిక ఆదాయాన్ని నమోదు చేసుకుంది. ఒక రెడ్‌బస్సే ఏమిటి, మార్కెట్ మొత్తం సామాన్యుడి చుట్టే గింగిర్లు కొడుతోందిప్పుడు. అందుకే ఐడియా పోటీల నిర్వాహకులూ 'సామాన్య మంత్రం' జపిస్తున్నారు.

వరాల మూటలు...

విద్యార్థికైనా, ఔత్సాహిక వ్యాపారికైనా... బిజినెస్ ప్లాన్ పోటీల్లో గెలుపు అంటే, జీవితంలో మలుపే! ఆ విషయంలో సందేహం లేదు. ఎకనమిక్ టైమ్స్ 'ద పవర్ ఆఫ్ ఐడియా'... ముడి ఐడియాలకు పదునుపెట్టి మెరుగులు దిద్దుతుంది. వేలవేల దరఖాస్తుల్లోంచి... దాదాపు 75 ఆలోచనలను ఎంపిక చేసి, ఐడియా వీరుల కోసం ఐఐఎమ్ సహకారంతో సదస్సు నిర్వహిస్తుంది. మెంటార్స్‌ను (మార్గదర్శకులను) అందిస్తుంది. అనుభవ సంపన్నుల దిశానిర్దేశంలో బాగా రాటుదేలిన ఐడియాల మధ్యే ప్రధాన పోరు ఉంటుంది. విజేతలకు ఐదు లక్షలదాకా బహుమతి ఇస్తారు. శామ్‌సంగ్ కూడా దాదాపుగా ఇంతే మొత్తంలో నజరానా ప్రకటిస్తుంది. మహీంద్రా స్పార్క్ సెప్టెంబరులో ప్రారంభించిన పోటీలు డిసెంబరు చివరి దాకా ఉంటాయి. బిజినెస్ ప్రాజెక్టులకూ, ఐడియాలకూ వేరువేరు విభాగాలున్నాయి. నెలనెలా పన్నెండు గ్రాంట్లు (ప్రాజెక్టులకు ఎనిమిది, ఐడియాలకు నాలుగు) అందిస్తారు. అంతిమ పోటీలో అత్యుత్తమ



జనం టెక్నాలజీ

గాంధియన్ యంగ్ టెక్నలాజికల్ ఇన్నొవేషన్ అవార్డ్స్

ఇంజినీరింగ్, ఫార్మసీ, సైన్స్ వంటి రంగాల్లో విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకూ ఆవిష్కరణలకు పట్టం కట్టేందుకూ ఈ అవార్డు ఊతమిస్తుంది.

వివరాలకు: www.techpedia.in

కొత్తకు పిలుపు

మారికో ఇన్నొవేషన్ ఫౌండేషన్

సామాన్యుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే ఆలోచనలను వెలుగులోకి తేవాలన్నదే ప్రధాన ఉద్దేశం. విద్య, ఆరోగ్యం, పేదరికం తదితర విభాగాలలో సరికొత్త ఆలోచనలను స్వాగతిస్తోంది.

వివరాలకు: www.maricoinnovationfoundation.org

మార్గదర్శి

భారతీయ యువశక్తి ట్రస్ట్

ఆలోచన నుంచి అమలు దాకా ప్రతిదశలోనూ సంస్థ దిశానిర్దేశం చేస్తుంది. సాంకేతిక సహకారం అందిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సృష్టించగలిగితే మరీ మంచిది.

వివరాలకు: www.bystonline.org

ఉందిలే మంచికాలం...

రోలెక్స్ అవార్డ్ ఫర్ ఎంట్రప్రైజ్

'తమదైన కొత్తదారి నిర్మించాలనుకునే యువతకు ఇదే మా ఆహ్వానం. ప్రపంచంలో ఎక్కడున్నా సరే, మా స్నేహహస్తం మీకు అందితీరుతుంది' అంటున్నారు రోలెక్స్ అవార్డ్ ఫర్ ఎంట్రప్రైజ్ నిర్వాహకులు. ఆలోచనకు ఓ వ్యాపార రూపం ఇచ్చి ఉండవచ్చు, ఇవ్వకపోనూవచ్చు. ఏ దశలో ఉన్నా దరఖాస్తుకు అర్హులే.

వివరాలకు: www.rolexawards.com

కొత్తగా...

నెక్స్ట్ బిగ్ ఐడియా

సరికొత్త వ్యాపార ఆలోచనలు ఉన్న వ్యక్తులు కానీ బృందాలు కానీ పోటీలో పాల్గొనవచ్చు. గతంలో ఏ సంస్థ నుంచీ ఎలాంటి ఆర్థిక సాయం అందుకోని వారికే అవకాశం. కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రిత్వశాఖ కూడా ఓ ప్రధాన భాగస్వామి.

వివరాలకు: www.nextbigidea.in

మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం...

ఆల్ ఇండియా బిజినెస్ ఇన్నొవేషన్ కాంటెస్ట్

ఎంబీయే, పీజీడీఎమ్ విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడమే పోటీల ప్రధాన ఉద్దేశం. విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఆతిథ్యం, రియల్ ఎస్టేట్, మీడియా... తదితర రంగాలకు సంబంధించిన ఆలోచనలను పంపుకోవచ్చు.

వివరాలకు: www.silliconindia.com\ aibic\

గ్రామీణ సృజన

నాబార్డ్ రూరల్ ఇన్నొవేషన్ అవార్డ్స్

ఆ ఆవిష్కరణ గ్రామీణ భారతానికి ఎంతో కొంత మేలు చేయాలి. పల్లె ప్రజలకు ఆసరానివ్వాలి. వ్యవసాయం, పశుపోషణ, ప్రజారోగ్యం... ఇలా గ్రామీణ భారతానికి ముడిపడి ఉండాలి. ఆలోచనకు ఇప్పటికే ఓ రూపం ఇచ్చుండాలి.

వివరాలకు: www.nabard.org

మార్పు దిశగా...

శామ్‌సంగ్ ఇన్నొవేషన్ అవార్డ్

ఆవిష్కరణ – మార్పు సంకేతం, తూర్పు కిరణం. సమాజానికి మంచిని పంచుతున్న ఆవిష్కర్తలను గౌరవించడమే మా లక్ష్యం... అంటారు శామ్‌సంగ్ ఇన్నొవేషన్ అవార్డు రూపకర్తలు.

వివరాలకు: www.siqmoneycontrol.com

'కోటి' కలలు

బిజ్–క్వెస్ట్

చక్కని ఆలోచనలకు ఆసరా ఇవ్వడానికే 'బిజ్ క్వెస్ట్' పోటీలు. వందల ఎంట్రీల్లోంచి... ఆణిముత్యాల్లాంటి ఐడియాలను ఎంపిక చేసి... 'హైదరాబాద్ ఏంజిల్స్' ద్వారా ఆర్థిక సాయం అందిస్తారు. ద ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్-ఐఎస్‌బీ కనెక్ట్ సారథ్యంలో పోటీలు జరుగుతాయి.

వివరాలకు: www.tieisbconnect.in

'ఆప్'కే లియే...

ఐడియాస్ ప్రాజెక్ట్

సామాన్యుల జీవితాల్ని మార్చే మొబైల్ అప్లికేషన్లకు ప్రాధాన్యం ఉంటుంది. గత ఏడాది ఆటోడ్రైవర్లకు పనికొచ్చే ఓ ఐడియాకు బహుమతి వచ్చింది. పోటీ విశ్వవ్యాప్తంగా ఉంటుంది.

వివరాలకు: www.ideasproject.com

భిన్నంగా...

అన్‌రీజనబుల్ ఇన్‌స్టిట్యూట్

ఇదో అంతర్జాతీయ సంస్థ. మంచి ఐడియాలను గుర్తిస్తుంది. నిపుణుల సహకారం అందిస్తుంది. ఇన్వెస్టర్లను పరిచయం చేస్తుంది. సమాజంలో మార్పు తీసుకురాగల ఆలోచనలకే ప్రాధాన్యం. వడపోత జరుగుతుంది.

వివరాలకు: www.unreasonableinstitute.org

(కొన్ని పోటీలకు గడువు పూర్తయి ఉండవచ్చు. ఇంకొన్ని ప్రారంభదశలో ఉండవచ్చు. అందుబాటులో ఉన్నవాటికి పోటీపడాలి. రానున్నవాటికి వ్యూహాలు రచించుకోవాలి)

ప్రాజెక్టుకు 40 లక్షలు, అత్యుత్తమ ఐడియాకు 20 లక్షలు నజరానా ఇస్తారు. 'నెక్స్ట్ బిగ్ ఐడియా' తొలి 30 బృందాలకు 50 లక్షల దాకా నిధులు సమకూరుస్తుంది. 'బిజ్‌క్వెస్ట్' పోటీల విజేతల్లో ముగ్గురికి కోటిరూపాయల చొప్పున నిధులు లభించాయి. 'హైదరాబాద్ ఫర్ ఇన్నొవేటర్స్ ఫోరం'... త్వరలో జరగనున్న ఐడియా కార్నివాల్ ద్వారా రెండు వందల మంది విద్యార్థులను ఎంపిక చేయాలని భావిస్తోంది. వారి ఐడియాలను వడపోసి, మెరుగుపెట్టి... కొన్నింటికైనా కార్యరూపం ఇవ్వాలన్న కృతనిశ్చయంతో ఉంది. కాలేజీ స్థాయిలో జరిగే పోటీలపై పెద్దపెద్ద కంపెనీల మానవవనరుల విభాగాలు ఆసక్తి చూపుతున్నాయి. 'ఐడియా' స్టార్స్‌కు ఆకర్షణీయమైన జీతాలు ఆఫర్ చేస్తున్నాయి. క్యాంపస్ దాటకుండానే పని చేయడానికి మైక్రోసాఫ్ట్ వంద విద్యాసంస్థల్లో

ఇన్నోవేషన్ కేంద్రాలు ప్రారంభించబోతోంది.

ఐడియాకు ప్రాణంపోయడం అంటే మాటలు కాదు. ఉత్పత్తి, మార్కెటింగ్, బ్రాండింగ్, సిబ్బంది... కోట్లు కావాలి. మొత్తంగా ఓ వ్యవస్థను నిర్మించుకోవాలి. ఆ పెట్టుబడితో పోలిస్తే, విజేతలకు ఇచ్చే బహుమతి మొత్తం తక్కువే కావచ్చు. కానీ, గెలుపు అందించే ఆత్మవిశ్వాసం మాత్రం వెలకట్టలేనిది. గుర్తింపు వల్ల..మన ఐడియా మీద మనకు నమ్మకం కుదుర్తుంది. విజేతను వేయికళ్లు గమనిస్తుంటాయి. అందులో ఇన్వెస్టర్లూ ఉండవచ్చు. అంతెందుకు, 'పాలతో ప్రజల జీవితాల్లో మార్పు' నినాదంతో 'అన్‌రీజనబుల్ ఇన్‌స్టిట్యూట్' పోటీకి పంపిన ప్రతిపాదన... తమిళనాడుకు చెందిన దేవీప్రసాద్ జీవితాన్నే మార్చేసింది. 'మీ ఆలోచన ఏమిటో నాలుగు ముక్కల్లో చెప్పండి?' అని అడిగినప్పుడు 'ప్రతి ఆవు నుంచి మరిన్ని పాలు, ప్రతి రైతుకూ మరిన్ని ఆవులు, ప్రతి పల్లెలో మరింతమంది రైతులు..' అంటూ మూడంటే మూడేముక్కల్లో తేల్చేశాడు. ఆ ఆత్మవిశ్వాసం నిర్వాహకులకు నచ్చింది. దేవీప్రసాద్ 'ఆరోహణ' పేరుతో పాల ఉత్పత్తిని ఓ సామాజిక వ్యాపారంగా ప్రారంభించాలనుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఎంపికలో అందరికంటే ముందు నిలిచాడు. ఇంకేముంది, వెంచర్ క్యాపిటలిస్టుల ద్వారా నిధులు సమకూరాయి. దాదాపు పాతిక గ్రామాలకు తన సామాజిక వ్యాపారాన్ని విస్తరించగలిగాడు. ఐడియా దగ్గరికే అవకాశాలు... ఒక్క పోటీల ద్వారానే సాధ్యం.

కలల కసరత్తు...

ఎందుకు, కొన్ని ఐడియాలే న్యాయనిర్ణేతలను ఆకర్షిస్తాయి? కొన్ని ఐడియాలకే బహుమతులు దక్కుతాయి? కొన్ని ఐడియాలే ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని చూరగొంటాయి? అంటే... 'ఐడియా మేనేజ్‌మెంట్' ఓ కళ. బిజినెస్ ప్లాన్... సినిమా స్క్రిప్టులా పక్కాగా ఉండాలి. రోడ్‌మ్యాప్‌లా స్పష్టంగా ఉండాలి. రాజ్యాంగంలా సమగ్రంగా ఉండాలి. ఫిక్షన్‌లా ఆకట్టుకునేలా ఉండాలి. మంచి బిజినెస్ ప్లాన్ అన్నది నూటికినూరు శాతం విజయాన్ని ఇవ్వకపోవచ్చు. కానీ, విజయావకాశాల్ని ఇస్తుంది.

సైనికుడిలోని అప్రమత్తత, ఆటగాడిలోని సాధన, సైంటిస్టులోని ఏకాగ్రత, విద్యార్థిలోని జిజ్ఞాస, నటుడిలోని సమయస్ఫూర్తి, పర్వతారోహకుడిలోని ఆశావాదం... ఎంట్రప్రెన్యూర్‌కు ఉండాల్సిన ప్రధాన లక్షణాలు. ఉత్పత్తి నాణ్యంగా ఉన్నంతమాత్రాన సరిపోదు... ప్యాకింగ్ కూడా అంతే అద్భుతంగా ఉండాలి. అప్పుడే వినియోగదారుడు ఇటువైపు చూస్తాడు. వెంటనే కొనేస్తాడు. ఐడియా కూడా అంతే. అదో ముడి వజ్రం లాంటిది. పైపైన చూస్తే ఆకర్షణీయంగా ఉండదు. మెరుగులు పెట్టాలి. మేకప్పు వేయాలి. అన్నిటికంటే ముందు మన ఐడియాను మనం ప్రేమించాలి. బలంగా విశ్వసించాలి. మనమే నమ్మకపోతే, ఎదుటి వ్యక్తుల్ని ఎలా నమ్మించగలం? ఆ నమ్మకం మన మాటల్లో చేతల్లో ప్రతిఫలించాలి. అదే సమయంలో పిడివాదమూ పనికిరాదు. మూలానికి భంగం వాటిల్లనంత వరకూ మన ఆలోచనకు ఒకటిరెండు మార్పుచేర్పులు సూచించినా... పాజిటివ్‌గా తీసుకోవాలి. 'సాలెపురుగు నా వ్యాపార గురువు. అది ఫలానా వైపు నుంచే పని మొదలుపెట్టాలని మడికట్టుకు కూర్చోదు. ఎక్కడ అనువుగా ఉంటే అక్కడి నుంచే మొదలుపెడుతుంది. ఆగూడు కూడా ఎంత మెత్తగా ఉంటుందో అంత బలంగా ఉంటుంది' అంటారు వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా. జీవితంలో అయినా, పోటీల్లో అయినా ఆమాత్రం పట్టువిడుపులు అవసరమే.

బిజినెస్ ఐడియా న్యాయనిర్ణేతలకు మన ఐడియాతో పాటూ వ్యక్తిత్వమూ నచ్చాలి. ఏ ఒక్కటి నచ్చకపోయినా రెండూ నచ్చనట్టే. "ఎవరైనా కొత్త ఐడియాతో వస్తే ఆ వ్యక్తిలో ఓర్పు, పట్టుదల ఏమేరకు ఉన్నాయో గమనిస్తాం. ఆ తర్వాతే బిజినెస్ ఐడియా గురించి ఆలోచిస్తాం. అవసరమైతే ఐడియాను మార్చుకోగలం. మనిషిని మార్చలేం కదా!' అంటారు 'హైదరాబాద్ ఏంజిల్స్' అధ్యక్షుడు శ్రీని కొప్పోలు.

నిపుణుల్ని గెలవడానికి అంకెలే అస్త్రాలు. సర్వేలూ అధ్యయనాలూ మార్కెట్ గణాంకాలూ మన ప్లాన్‌లో విస్తారంగా ప్రస్తావించాలి. ఐడియాకు పరిమితులేమైనా ఉంటే (ఉంటాయి కూడా) నిజాయతీగా ఒప్పుకోవాలి. మనదే అత్యుత్తమమైన ఐడియా అన్న భ్రమ వద్దు. ఎవరో ఒకరు మనల్ని చిన్నబుచ్చవచ్చు. అయినా... చిరునవ్వుతో స్వీకరించాలి. ప్రపంచాన్ని ఓ మలుపు తిప్పిన ఐడియాలన్నీ ఈ దశను దాటుకునే వచ్చాయి. అపజయాల్నీ అవమానాల్నీ ఎదుర్కోడానికి ఒకటే మార్గం..

ఫస్ట్ దె ఇగ్నోర్ యు.
దెన్ దె లాఫ్ ఎట్ యు.
దెన్ దె ఫైట్ విత్ యు.
దెన్... యు విన్! ★

గాంధీ మార్గం

ఒక మంచి ఐడియాకు ఉండాల్సిన లక్షణాలు తెలుసుకోవాలంటే... ఆధునిక చరఖా డిజైనింగ్ కోసం 1929లో మహాత్మాగాంధీ నిర్వహించిన ఐడియా పోటీల ప్రకటన చదవాలి.

★ మరింత వేగంగా, మరింత సమర్థంగా పనిచేయగల చరఖా అవసరం దేశానికి చాలా ఉంది.

★ మీరు రూపొందించే చరఖా చాలా తేలిగ్గా ఉండాలి. తరలించడానికి వీలుగా ఉండాలి.

★ రెండు చేతులతో కానీ ఒక చేతితో, ఒక కాలితో కానీ పనిచేసుకోడానికి అనువుగా ఉండాలి.

★ ఓ మహిళ దాదాపు ఎనిమిదిగంటలు నిర్విరామంగా పనిచేసినా ఇబ్బంది కలగకూడదు. అలసట అనిపించకూడదు.

★ ధర కూడా తక్కువే ఉండాలి. అదీ 150 రూపాయల లోపే అయితే మంచిది.

★ నాణ్యత విషయంలో రాజీపడకూడదు. కనీసం ఇరవై సంవత్సరాలు ఎలాంటి మరమ్మతులూ లేకుండా పనిచేయాలి.

★ వార్షిక నిర్వహణ ఖర్చు చరఖా ధరలో ఐదు శాతానికి మించకూడదు.

దరఖాస్తులను సబర్మతీ ఆశ్రమానికి పంపాలి. బహుమతి పొందిన డిజైన్‌పై సర్వహక్కులూ భారతీయ చరఖా సంఘానికి బదిలీ చేయాలి.

బహుమతి: రూ.లక్ష

(ప్రస్తుత విలువ కోటిరూపాయల పైమాటే!)

వాట్ ఎన్ ఐడియా బాపూజీ!

ఒక స్ఫూర్తి... వృద్ధుల కళ్లల్లో ఆనందాలను నింపుతోంది. ఒక స్ఫూర్తి... మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. అదే స్ఫూర్తి... ఎంతోమందికి విద్యాదానం చేస్తోంది. మరెందరికో వైద్యసేవలందిస్తోంది. ఆ స్ఫూర్తి గురించి తెలియాలంటే... పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలంలోని గొరగనమూడి వెళ్లాల్సిందే.

'జ్ఞానానంద'మయం..!

గొరగనమూడి గ్రామంలో... దాదాపు 20 నిరుపేద కుటుంబాలున్నాయి. ఒకపూట గడవడం కూడా వాళ్లకి కష్టమే. కష్టపడి పనిచేద్దామన్నా... వారిలో అధిక సంఖ్యాకులు వికలాంగులూ వృద్ధులూ. అందుకే, ఇప్పుడు ప్రతీరోజూ ఉదయమూ సాయంత్రమూ వాళ్లకి క్యారియర్లతో భోజనం వెళ్తోంది.

గొరగనమూడి గ్రామంలో... నిరుద్యోగ యువత ఉన్నారు. చదువుకున్నా సరే ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడటం రాక ఉద్యోగాలు రానివారూ ఉన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం లేక ఉపాధి వెతుక్కోలేక ఊళ్లోనే చాలామంది ఖాళీగా ఉంటున్నారు. ఒక్క గొరగనమూడిలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలు శృంగవృక్షం, వీరవాసరం, పెన్నాడ, విస్సాకోడేరు, బంటుమిల్లిల్లో కూడా ఇలాంటి వారు ఎక్కువే. అయితే... ఇదంతా గతం. 2003లో 'స్వామీ జ్ఞానానంద మెమోరియల్ భూపతిరాజు పద్మనాభరాజు ఎడ్యుకేషన్ సెంటర్' ఆ ఊరిలో ప్రారంభం కావడంతో వీరందరి తలరాతలూ మారిపోయాయి. దీన్ని డా॥రామరాజు, డా॥లక్ష్మీ నరసింహరాజు సోదరులు ప్రారంభించారు. గ్రామీణ యువత, మహిళలకు వివిధ ఉపాధి అంశాల్లో ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. కంప్యూటర్ శిక్షణ, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటూ రోజూ యోగా నేర్పిస్తున్నారు. ఇంట్లో పని చేసుకుంటూ వేణ్ణీళ్లకు చన్నీటి సాయంలా ఖాళీ సమయాల్లో కాస్త సంపాదిద్దాం అనుకునే గృహిణులకు కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. ఈ సెంటర్‌లో ఇప్పటివరకూ శిక్షణ పొందినవారిలో సుమారు వెయ్యిమంది వివిధ ఉపాధి మార్గాలను చూసుకోగలిగారు.

మలివయసులో...

గొరగనమూడి గ్రామంలో... చాలామంది వృద్ధులున్నారు. ఎన్నో రకాల అనారోగ్యాలతో

బాధలుపడుతున్నారు. కొందరికి చికిత్స చేయించుకోగలిగే ఆర్థిక స్థోమత లేదు. మరికొందరికి సేవలు చేసే వారసులు లేరు. ఇదీ గతమే. ఈ పరిస్థితీ ఇప్పుడు మారిపోయింది! గ్రామంలో 'స్వామీ జ్ఞానానంద వానప్రస్థాశ్రమం' వచ్చాక వృద్ధుల కష్టాలు తొలగిపోయాయి. సుమారు ఏడెకరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు డా॥ రామరాజు, డా॥ లక్ష్మీనరసింహరాజు. ఆశ్రమానికి అనుబంధంగా గ్రామీణ సేవాకేంద్రం ఏర్పాటు చేశారు. ఒక వైద్యుడు, నర్సు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలవారు కూడా రోజూ ఇక్కడికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. వైద్యం, మందులూ వారికీ ఉచితమే. ఆ పక్కనే ధ్యానమందిరం ఉంది. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు తరచూ జరుగుతుంటాయి. గ్రంథాలయం ఉంది. దినపత్రికలు మొదలుకొని పెద్దల కాలక్షేపానికి కావాల్సిన పురాణలదాకా అన్నీ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. విశాలమైన విశ్రాంతి గదులూ ఉన్నాయి. కొన్ని కుటీరాలనూ నిర్మించారు. ప్రస్తుతం ఈ వానప్రస్థాశ్రమంలో 43 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.

ఆయన ఆశయాలతో...

గొరగనమూడి గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున సేవాకార్యక్రమాలను నిర్వహించడం చాలా గొప్ప విషయం అని రామరాజు సోదరుల దగ్గర అంటే... అంతా 'జ్ఞానానంద' ఇచ్చిన స్ఫూర్తే అని చెబుతారు. జ్ఞానానంద ఆశయాలకు కట్టుబడి అతని వారసులుగా ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించడం నైతిక బాధ్యతగా స్వీకరించాం అంటున్నారు. 'మా పెదనాన్నగారు భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు. ఆయన చిన్నప్పుడే ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెంచుకుని ఇల్లు విడిచి పుణ్యక్షేత్రాల పర్యటనకు వెళ్లిపోయారు. 1921లో సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు. జ్ఞానానందగా పేరు మార్చుకున్నారు. తరువాత భౌతికశాస్త్రంపై ఆసక్తి కలిగి ఉన్నత విద్యను అభ్యసించారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎన్నో ప్రయోగాలు చేశారు. నోబెల్ బహుమతి గ్రహీత జేమ్స్ ఛాడ్విక్‌తో పనిచేసిన అనుభవమూ ఆయనకుంది. తరువాత ఆయన రాసిన హై వ్యాక్యువా గ్రంథం న్యూక్లియర్ ఫిజిక్స్ రంగంలో ప్రామాణికం మారింది. ఆపై నెహ్రూగారి కోరిక మేరకు కొన్నాళ్లు నేషనల్ ఫిజికల్ లేబొరేటరీలో పనిచేసి... ఆపై స్వగ్రామం గొరగనమూడికి చేరుకున్నారు. అప్పట్నుంచీ గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పల్లెలన్నీ అభివృద్ధి చెందాలన్నది ఆయన ఆశయం. అందుకే ఆయన తదనంతరం 'ది సెయింట్ అండ్ ది సైంటిస్ట్ స్వామి జ్ఞానానంద ట్రస్టు'ను... ఆయన సోదరుడైన మా నాన్నగారు పద్మనాభరాజు ప్రారంభించారు' అని చెబుతారు. ఆ ట్రస్టు కార్యక్రమాలను ఇప్పుడు మరింత విస్తృతం చేశారీ సోదరులు.

సేవాకార్యక్రమాలకు కావాల్సిన నిధులన్నీ ఈ సోదరులే సమకూర్చుకుంటారు. జ్ఞానానంద మరో సోదరుడి కుమారుడైన కృష్ణవర్మరాజూ అతని భార్యా క్షేత్రస్థాయిలో ట్రస్టు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు . సాధారణంగా కుటుంబ సభ్యుల ఆస్తులను వారసులు పంచుకుంటూ అనుభవించడం మనం చూస్తూనే ఉంటాం. కానీ, సేవా భావాన్ని ఇలా వారసత్వంగా పుణికి పుచ్చుకుని తండ్రుల ఆశయాలను తమ లక్ష్యాలుగా మార్చుకున్న ఈ సోదరుల లాంటివారు చాలా అరుదుగా కనిపిస్తూ ఉంటారు.

– వేములపల్లి వెంకట సుబ్బారావు, ప.గో. డెస్కు

ఫొటోలు: నోబుల్, సూర్యదుర్గారావు

కథ

కామెర్ల రోగులు

– సర్వాబట్ల శివరామశర్మ

తలెత్తి చూశాను. ఎదురుగా రావుగారు నిలబడి ఉన్నారు. ఏమిటన్నట్టు కళ్ళెగరేశాను. జీవంలేని నవ్వు నవ్వాడు. అర్థమైంది నాకు. మామూలే... మనీ ప్రాబ్లం!

రావుగారు మా డిపార్ట్‌మెంట్‌లో 'మంచి' సీటులో ఉన్నారు. ఆయన అనుకుంటే డబ్బే డబ్బు. కానీ అనుకోడు. అదో టైపు వ్యక్తి. పిల్లల చదువుల కోసమూ భార్య వైద్యం కోసమూ... నా దగ్గర చేయి చాచి అప్పు చేస్తాడు. కానీ, 'పార్టీల' దగ్గర మటుకు చేయి చాచడు.

'రావుగారూ, మీరు ఊc అనండి చాలు... మీ బాధలు క్షణంలో ఎగిరిపోతాయి' అని మేమెవ్వరమన్నా అంటే, మౌనంగా ఉండిపోతాడు తప్ప మాట్లాడడు.

'ఈ కాలంలో లంచం తీసుకోనిదెవరు సారూ?' అంటే దీర్ఘంగా నిట్టూరుస్తాడు.

'బాబూ, నాకు ప్రభుత్వం జీతం ఇస్తోంది, అది చాలు. ఏదో మీలాంటివాళ్ళు అవసరార్థం ఆదుకుంటారు. అదే పదివేలు' అని వేదాంతం చెబుతాడు. ఏమాటకామాటే చెప్పాలి... నిప్పులాంటి వాడు, కన్‌ఫర్మ్‌గా చెప్పవచ్చు.

తను తీసుకోడు. తీసుకునే మాలాంటి వాళ్ళని పొరపాటున కూడా కామెంట్ చేయడు. 'ఎవరి ఖర్మ వారిది' అనే మనస్తత్వం. కానీ, మాకే... అంటే, మా డిపార్ట్‌మెంట్‌లో చాలామందికి రావుగారిని చూస్తే అదో రకమైన ఈర్ష్యా భావం. అది భయం వలన కావచ్చు, భక్తి వలన కావచ్చు. ఆయనలా బతకలేకపోతున్నామని అంతర్లీనంగా ఉన్న న్యూనతాభావం వలన కావచ్చు. ఏదైతేనేం... అందరం పైకి గౌరవిస్తాం, లోపల తిట్టుకుంటాం.

అయినా, కాకులన్నీ నల్లగానే ఉండాలి. ఒక్కటి మాత్రం తెల్లగా ఉంటే ఎలా? కానీ ఏం చేయలేం. రావుగారు ప్రాణం పోయినా లంచం తాకరు. మాకా... అదిలేనిదే జరగదు. మాకు తప్పదు. అయినా ఐఏఎస్ ఆఫీసర్లే తీసుకోంగా లేనిది, ఆఫ్ట్రాల్... ఓ గుమస్తా తీసుకోకపోవడం న్యాయమా... మీరే చెప్పండి!

ఎవ్వరు చెప్పినా ఆయన 'ఆశించడు'. మమ్మల్ని దేబిరిస్తుంటాడు. నిజం చెప్పొద్దూ... రావుగారికి అప్పివ్వడానికి నాకో 'బలమైన' కారణం ఉంది. ఆయనకి అప్పిస్తూ సాయం చేయడం ద్వారా, నా 'పాపం' కొద్దిగానైనా కడుక్కుంటున్నానని నా నమ్మకం. అందుకే రెండోమాట లేకుండా, ఆయన అడిగినంత అప్పు ఇస్తుంటాను.



ఫైల్స్ చూడటానికి నాది గుమస్తా ఉద్యోగం కాదు, నేను సర్వేయర్ని. కొలతలేయాలంటే నా 'లెక్క' తేలాలి. అది తేలందే కొలత గొలుసులు తాకను. అవతలివాడు ఎవడైతే నాకేంటి, నా అమౌంట్ నాకు అందాల్సిందే.

ఆలోచనల్లో ఉండగానే శరత్ పరిగెత్తుకుని వచ్చాడు. వాడు మాకందరికీ రైట్‌హ్యాండ్ లాంటివాడు. ఎవరెవరికి ఎంత ఇవ్వాలో పార్టీలకి చెప్పేది వాడే. వాడేం మా ఉద్యోగి కాదు. మా స్టాఫ్ అందరికీ బంధువు లాంటివాడు. గిట్టనివాళ్ళు వాణ్ణి 'రాబందు' లాంటివాడని అంటారు.

అయినా, ఇలాంటి 'మధ్యవర్తులు' లేకుండా ఏం జరుగుతుంది! అందులో ఈమధ్య 'ప్రెస్' మరీ యాక్టివ్‌గా ఉంది. పొరపాటు జరిగితే 'లైవ్ టెలికాస్ట్' అయిపోతాం. అందుకే అందరం జాగ్రత్తగా ఉంటున్నాం. వాడు రావడమే "చిన్న సిట్టింగ్ ఉంది, రండి" అని పిలిచాడు. సిట్టింగ్ అంటే 'మందు' పార్టీ.

టైమ్ చూశాను. ఐదు కావస్తోంది. "మరీ... ఇప్పుడేనా?" అన్నాను చిన్నగా.

వాడు నవ్వాడు. "గురువు గారూ, మనకి టైమ్‌తో పనేంటి? మన టైమ్ బావుండాలని ఆశించండి. మాంచి పెద్ద పార్టీ... రండి!" అంటూ పిలిచాడు.

ఇంకేం ఆలోచించలేదు. లేచి వాడి వెనుక బయల్దేరాను. రెగ్యులర్‌గా వెళ్ళే బార్ వైపు పోబోయాను. కానీ, వాడు కారు దగ్గరికి రమ్మని సైగ చేశాడు. అర్థంకాలేదు. డోర్ తీసి చూద్దును గదా... లోపల 'బాస్' కూర్చుని ఉన్నాడు. "రా, రా... త్వరగా" అంటున్నాడు. అర్థమైంది నాకు. పెద్ద పనే! మా 'బాస్' వస్తున్నాడంటే... లక్షల్లో గిరాకీ... ఆనందంగా ఎక్కి కూర్చున్నాను.

కారు టౌను దాటి ఓ చిన్నతోట దగ్గర ఆగింది. అందరం లోపలికి వెళ్ళాం. అక్కడ రాయుడుగారు కూర్చుని ఉన్నారు. మమ్మల్ని చూడగానే జేవురించిన ముఖంతో "ఏమిటయ్యా ఇది?" అంటూ ఓ మ్యాప్ మా ముందర విసిరేశాడు.

మ్యాప్ చూడగానే నాకు మ్యాటర్ అర్థమైంది. ప్రభుత్వం త్వరలో తెలుగుగంగ కాలువ నుంచి సాగునీరు కోసం కాలువ తవ్వబోతోంది. అది కరెక్ట్‌గా రాయుడిగారి పొలాల మధ్యనుంచి పోతుంది. అదీ విషయం.

'డబ్బులొచ్చే విషయం అనుకున్నాను గానీ... దెబ్బలు తగిలే పని అనుకోలేదు' అని మనసులోనే గొణుక్కున్నాను.

మా తహసిల్దార్ మటుకు "రాయుడు గారూ, ఆ మ్యాప్ కేవలం రఫ్ వర్క్. ఇంకా ఫైనలైజ్ కాలేదు. మీరెందుకు ఆవేశపడతారు" అన్నాడు అనునయంగా. అంతేకాక, నన్ను చూపించి "ఇదిగో, సర్వేయర్ని తీసుకొచ్చాను. మీకెలా కావాలంటే, అలా గీయించుకోండి. మేమేమన్నా కాదంటామా" అన్నాడు.

రాయుడు ఆ మాటతో శాంతించాడు. "ఇదిగో తహసిల్దార్, నాకేం ఊరికే పనులొద్దు. కాలువ నా పొలాల పక్కనుంచి వెళ్ళేట్టు చేయండి. ఎకరాకి లక్ష ఇస్తాను. పదెకరాలుంది అక్కడ... తెలుసా!"

నా కళ్ళు ఆనందంగా మెరిసిపోయాయి. ఎంత తక్కువ వేసుకున్నా నా వాటా లక్ష రూపాయలుంటుంది. ఉత్సాహంగా ముందుకు వంగి "తప్పకుండా సార్, కాలువ మీరు చెప్పినట్టే తిప్పుతాను" అన్నాను. తహసిల్దార్ కూడా అవునన్నట్టు తలాడించాడు.

రాయుడు ఆప్యాయంగా "రేయ్, పెద్ద సారుకి మర్యాదలేవిరా?" అంటూ అరిచాడు పెద్దగా.

గ్లాసులూ సోడాలూ అమరుస్తున్నారు ఆయన అనుచరగణం. నాకో అనుమానం వచ్చింది. "సార్, కాలువ తిప్పగలం. మరి, అక్కడ పోయే పొలాలు... ఎలాంటివో" అంటూ నసిగాను. రాయుడు తేలిగ్గా తీసేశాడు నా మాటల్ని.

"ఆఁ, నలుగురు రైతులవి. అసైన్డ్ పొలాలవి. తలా రెండు ఎకరాలుంటుంది, అంతే" అన్నాడు.

ఊపిరి పీల్చుకున్నాను. రాయుడుగారి పని అయిపోయినట్టే. పట్టా పొలాలకు నష్టపరిహారం ఎక్కువ అవుతుంది. అసైన్డ్ పొలాలు ప్రభుత్వానివే. కనుక ఆ రైతులకి 'మరోచోట ఇవ్వచ్చు' అని రాసేస్తే చాలు. ఆ మాట బాస్‌కి చెప్పాను.

తహసిల్దారుకి కూడా ఆ ఆలోచనే వచ్చినట్టుంది. 'నిజమే'నన్నట్టు తలూపాడు. కాకుంటే, ఓ నలుగురు బక్కరైతులు బలైపోతారు. తప్పదు మరి. గ్లాసు అందుకుంటూ "రేపే మీ ఊరొస్తాను సార్" అన్నాను.

"నేను కారు పంపుతాను" అన్నాడు రాయుడు.

వద్దని వారించాను. "సార్, దీనిలో మీ ప్రమేయం లేనట్టే ఉండాలి. తర్వాత కథ నేనూ, మా సారూ నడుపుతాం, కదా" అన్నాను.

రాయుడు ఆనందంగా నవ్వాడు. 'రేపు ఉదయమే పోవాలి' అనుకుంటూ గ్లాసుమీద గ్లాసు లాగించేశాను.

రాత్రి తాగిన దెబ్బ- ఉదయమే లేవలేక పోయాను. తీరిగ్గా లేచి మధ్యాహ్నం మూడింటికి బయల్దేరాను. రాయుడుగారి ఊరు బెంగళూరుకి పోయే దారిలో ఉంది. బెంగళూరు పోయే ప్రతి బస్సూ అక్కడ ఆగుతుంది. కారణం... నిమ్మకాయల లోడింగ్! ప్రతిరోజూ కనీసం యాభై బస్తాలైనా పోతుంటాయి.

బస్టాండు దాటి ఊరివైపు బైక్ మీద కదిలాను. బస్టాండుకీ ఊరికీ మధ్య రెండు కిలోమీటర్లు ఉంటుంది. అక్కడ్నుంచి ఆయనగారి పొలాలు ఓ మూడు కిలోమీటర్లు. తలారిని తీసుకుని బయల్దేరాను. బైక్ అక్కడిదాకా పోదు కాబట్టి నడక మొదలుపెట్టాం. దారిలో యథాలాపంగా తలారిని అడిగాను.

"ఇక్కడ పొలాలు బాగా పండుతాయా?"

నవ్వాడు వాడు. "ఈ ఊర్లో రాయుడిగారి పొలాలు తప్ప, అన్నీ నిమ్మతోటలే సార్!" అన్నాడు.

ఆశ్చర్యంగా చూస్తూ "అదేమిటీ?" అన్నాను.

"ఆయన సేద్యం ఎందుకు చేస్తాడు సార్. తాతలనాటి ఆస్తి. అమ్ముకోవడం, జల్సాగా తిరగడం, రాజకీయాల్లో వేలు పెట్టడం... అంతే! అయినా, ఆయనకేం పిల్లా పీచా? పెళ్ళాం కూడా లేదు" అన్నాడు వెటకారంగా.

వాడి మాటలు విని మతిపోయింది. 'పొలం మధ్యలో కాలువ పోతే... పంటకు నష్టం కాదన్నమాట. రేట్లు రావు, అదీ ఆయన బాధ! అయినా, ఎవరెటుపోతే నాకేం... నా అమౌంట్ నాకొస్తుంది, అది చాలు' అనుకుంటూ రాయుడిగారి పొలాల దగ్గరికి వెళ్ళాం. తలారి చెప్పినట్టు రాయుడి పొలం 'ఖాళీగా' ఉంది. పక్కనే ఉన్న తోట నిమ్మచెట్లతో మిలమిలలాడిపోతోంది.

రాయుడు చెప్పినట్లే చేస్తే, ఒక్క చెట్టు ఉండదు. మమ్మల్ని చూసి తోటలో పనిచేసే వాళ్ళు పరుగున వచ్చారు. నమస్కారం చేస్తున్నవారిని చూస్తూ "ఈ తోటలు మీవేనా?" అని అడిగాను దర్పంగా.

"అవును బాబూ, ప్రభుత్వం ఇచ్చిన భూమి. రెక్కల కష్టంతో ఈ స్థితికి తెచ్చాం" అన్నారు వినయంగా.

సాయంత్రపు ఎండలో వారి శరీరాలు చెమటతో మెరుస్తున్నాయి. కాయకష్టం చేసి శరీరాలు రాటుదేలిపోయి ఉన్నాయి. అక్కడే ఉన్న గట్టుమీద కూర్చున్నాను.

'సర్వేయర్' వచ్చాడని తెలిసింది కాబోలు, తోటల్లో ఉన్న అందరూ వచ్చేశారు. ఆడవాళ్ళూ పిల్లలూ కూడా ఉన్నారు. పక్కనున్న రైతుని అడిగాను. "వీళ్ళకి కూలీ ఎంత ఇస్తారో..."

అతను వెంటనే "వాళ్ళు కూలోళ్ళు కాదు సారు... మా భార్యాబిడ్డలు" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాను.

"అవును సారూ, మేము నలుగురం అన్నదమ్ములం. అందరం కల్సి ఉమ్మడిగా పనిచేస్తాం. మావాళ్ళే ఉన్నప్పుడు కూలీలెందుకు సారూ" అన్నారు వాళ్ళు.

"మరి, మీ పిల్లల్ని బడికి పంపరా?" గదమాయిస్తూ అడిగాను.

"ఎందుకు పంపం సారూ, ఇదిగో వీడు పదోతరగతి చదువుతున్నాడు. నా అన్న కూతురు ఇంజినీరింగు చేస్తుంది. సెలవులు కదా సారూ, ఖాళీ దొరికితే వచ్చి సాయంచేస్తారు, అంతే!" అన్నాడు ఆ రైతు చాలా మామూలుగా.

అవాక్కయిపోయాను. ఎంత కష్టం చేస్తున్నారో అనిపించింది. కానీ, సెంటిమెంట్లు పెట్టుకుంటే బతకలేం. అయినా, వీళ్ళు కష్టజీవులు. ఇక్కడ పొలం పోతే ఏం? ఇంకోచోట 'కష్టపడి' బతకగలరు.

'కానీ, మళ్ళీ అక్కడా రాబందులు వాలితే' అంది నా ఇంగితజ్ఞానం. దాన్ని అణిచేశాను. ఒకసారి చుట్టూ చూసుకున్నాను. పేపర్ తీసి రఫ్‌గా మార్కు చేసుకున్నాను. వాళ్ళముందు మటుకు బైటపడలేదు.

అయినా, వాళ్ళకేం అన్పించిందో ఏమో, "సార్, మా బతుకుల్ని రోడ్డున పడేయకండి" అన్నారు దీనంగా.

లేదు, లేదన్నట్టు తలూపాను. "మీరేం వర్రీ కాకండి. నేను వచ్చింది వేరే పనిమీద" అన్నాను నిదానంగా.

వాళ్ళ కళ్ళల్లో భయాందోళనలు కన్పిస్తున్నాయి.

గద్ద తన్నుకుపోతున్న కోడిపిల్లని తల్లికోడి నిస్సహాయంగా చూసినట్టు నన్నే చూడ సాగారు. నాకు వాళ్ళముందు నిలబడాలంటే, నిజం చెప్పొద్దూ... భయంవేసింది. దేవుడి

కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అర రావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ, హైదరాబాద్-82.

విగ్రహం ముందు పాడు ఆలోచన వస్తే, ఎంత ఫీలవుతామో... అలా నా ముఖంలో రంగులు మారాయి.

అయినా పైకి బింకంగా "సరే, వస్తాను" అనేసి కదిలాను.

వెనుక వస్తున్న తలారి మౌనంగా బయల్దేరాడు. కొద్దిదూరం వెళ్ళాక "సార్, కాలువ ఎలా వస్తుంది?" అన్నాడు.

కోపంగా చూస్తూ "నీకెందుకా సంగతులు, నోర్మూసుకుని రా" అన్నాను. విషాదంగా నవ్వాడు అతను.

"సార్, మీరు రాగానే నాకర్థమైంది. కాలువ పక్కకి తిరిగితే చాలు సార్, ఇందాకటి రైతుల జీవితాలు తారుమారు అవుతాయి. రాయుడికేం సార్, మంచి రేటుకి అమ్ముకుంటాడు. కానీ, ఆ రైతులు... జీవితాంతం కూలీలుగా మారిపోతారు సార్" అన్నాడు దీనంగా. నేనేం బదులు చెప్పలేదు, చెప్పలేను కూడా!

'టైమ్ ఆరు అయిపోతోంది. త్వరగా బయల్దేరడం మంచిది' అనుకుంటూ తలారిని వదిలించుకుని బైక్ స్టార్ట్‌చేసి బయల్దేరాను. బస్టాండు దగ్గరికి రావడమే, టైరు పంక్చర్ అయింది. కడుపు మండిపోయింది. ఏం చేసేది, కాళ్ళీడ్చుకుంటూ బైక్ లాక్కుంటూ తీసుకొచ్చి బస్టాండులో పడేశాను.

బస్టాండు అంటే మరీ పెద్దదేం కాదు. రెండు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి, అంతే! ఒక్క షాపు కూడా లేదు. బైక్‌ని ఓ మూల పార్క్ చేసి చుట్టూ చూశాను. ఇద్దరు ముఠా కూలీలు కూర్చుని బాతాఖానీ కొడుతున్నారు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి "బైక్ ఇక్కడ పెట్టి, రేపు తీసుకుంటాను. ఇబ్బంది లేదు కదా" అన్నాను.

వాళ్ళిద్దరూ నవ్వారు. "సార్, మీరు ఎప్పుడన్నా రండి. మీ బండిని ఎవర్నీ తాకనీం. ఇంతకీ, మీరు ఎక్కడికి పోవాలి?"

చెప్పాను.

"అబ్బో, మీరు వెళ్ళాలంటే తొమ్మిదికే ఇక బస్సు. కూర్చోండి" అన్నారు వాళ్ళు. చేసేదిలేక తిట్టుకుంటూ కూర్చున్నాను.

వాళ్ళిద్దరూ మాటల్లో మునిగి తేలుతున్నారు. ఇంతలో బెంగళూరు బస్ వచ్చింది. పరిగెత్తుకుంటూ వెళ్ళి డ్రైవర్‌తో మాట్లాడారు. బస్ టర్న్ తీసుకుని బస్తాల దగ్గరికి వచ్చింది. ఓ వ్యక్తి ఎత్తుతుంటే, రెండో అతను నిచ్చెన పట్టుకుని ఎక్కుతూ 'టాప్' పైన వేస్తున్నాడు. అలానే చూస్తూండిపోయాను.

ఒకటా, రెండా... పాతిక బస్తాలు! నిచ్చెన మీద కాలు జారితే చాలు, అతను కిందపడతాడు. కచ్చితంగా కాలో చెయ్యో విరిగిపోవచ్చు, లేదా మెడే విరగొచ్చు. ఊపిరి బిగపట్టి చూడసాగాను.

నేను భయపడినట్టు ఏమీ జరగలేదు. పాతిక బస్తాలు అవలీలగా వేసేసి వచ్చి కూర్చున్నారు. వాళ్ళల్లో ఒకతనికి యాభై ఏళ్ళుండొచ్చు. 'గస' పెడుతున్నాడు. ఊపిరి అందనట్టు కూలబడ్డాడు. కాళ్ళు రెండూ చాపి, వెనక్కి వాలి బీడీ వెలిగించాడు.

"ఆ బీడీ ఆపకూడదా" అన్నాను.

"అయ్యో, మీకు ఈ వాసన పడదా" అంటూ ఆర్పేయబోయాడు.

"ఆర్పకు" కంగారుగా అరిచాను.

"నా ఉద్దేశ్యం, నాకు ఇబ్బందని కాదు. అంతలా 'గస'పెడుతూ తాగడం ఎందుకని?"

నవ్వాడతను. "అలవాటైపోయింది బాబూ" అన్నాడు.

"ఇంత కష్టం చేస్తున్నారు, ఎంత సంపాదిస్తారు?" ఆసక్తిగా అడిగాను.

"ఎంత బాబూ, బస్తాకి పది రూపాయలు. ఒకరోజు రెండొందలు రావొచ్చు, లేదా

ఐదొందలు రావొచ్చు. లేకుంటే లేదు" అన్నాడు నిర్లిప్తంగా రెండో అతను.

"ప్రమాదం కదా. ఇంకేదైనా పని చూసుకోవచ్చుగా" అన్నాను సానుభూతిగా.

"మేం చదివిన చదువుకి ఇదే పెద్ద పని. అయినా, మాకు దీంట్లో తృప్తి ఉంది. ఎవరి కడుపూ కొట్టం, కష్టం చేస్తాం. ఫలితం దక్కుతుంది" అన్నాడు తృప్తిగా బీడీ పొగ వదులుతూ.

వాడి స్టైల్ చూస్తే ఒళ్ళు మండింది. సానుభూతి పోయింది. నన్ను 'ఎత్తి' పొడిచినట్టు అనిపించింది. కానీ, నా భావాల్ని అణచుకుంటూ "అందరివీ కష్టార్జితాలే. అవకాశంలేనివాళ్ళు చెప్పేవి నీతివాక్యాలే. అసలు రంగు బైటపడేది... అవకాశం దొరికినప్పుడూ, చేసినప్పుడూ" అన్నాను కసిగా.

ఈసారి వాడు నావంక చూసి "అవకాశం దొరికినా ఛస్తే చేయను బాబూ" నిక్కచ్చిగా చెప్పాడు.

నవ్వుతూ అతని వంక చూసి "పది రూపాయలకి చేయకపోవచ్చు, పాతికవేలకి చేయవచ్చేమో!" అన్నాను.

ఎందుకంటే, నా అనుభవంలో చాలామంది 'ఆఫీసర్స్'ని చూశాను. చిన్నచిన్న మొత్తాలకి లొంగరు. అదే పెద్ద అమౌంట్ చెప్పామనుకోండి... పాకులాడుతారు. అయినా, ఈ కాలంలో డబ్బెవరికి చేదు. ఈ కూలోళ్ళకి అవకాశం దొరక్క ఇలా ఉన్నారు. దొరికితే వీళ్ళు 'నాకంటే' ఎక్కువగా దోచేయరూ- అనుకుంటూ చూసేసరికి వాళ్ళిద్దరూ లేరు.

ఇద్దరూ దూరంగా పోయి ఓ సంచిని తీసి చూస్తున్నారు. ఆ సంచిలోనుంచి ఓ పాత పేపరు తీసుకొచ్చి నా ముందుంచారు.

అందులో 'నిజాయతీ... ఇదే నీ చిరునామా!' అన్న టైటిల్ ఉంది. దానికింద వాళ్ళిద్దరి ఫొటోలు వేశారు. అందుకుని చదవసాగాను. నాకు తెలీకుండానే నా శరీరం గగుర్పాటు చెందసాగింది. చేతులు వణుకుతున్నాయి.

"మీరు ఇందాక అన్నట్టు 'వేలు' కాదు సార్, లక్షలు... అదీ పది లక్షలు! మా బతుక్కి అది పెద్దమొత్తమే సార్. కానీ, మేం ఆశపడలేదు సార్. కింద పడిపోయిన బ్యాగ్‌ని భద్రంగా పోలీస్‌స్టేషన్‌కి చేర్చాం సార్!"

వాళ్ళు చెబుతూనే ఉన్నారు. నా కాళ్ళకింద భూమి కదులుతున్నట్టు ఉంది. కేవలం లక్ష రూపాయలు వస్తాయని బక్క రైతుల బతుకుల్ని కూల్చబోయిన నేనెక్కడా, వీళ్ళెక్కడా?

నిజానికి మేమంతా కామెర్ల రోగులం! లంచాలు తీసుకునే మాకు ప్రతి డిపార్ట్‌మెంట్‌లో 'లంచగొండులే' కన్పిస్తారు. నిజాయతీపరులు కనపడరు. నాణేనికి రెండోపక్క చూడటానికి మేము ఒక్కనాటికీ ప్రయత్నించం. ప్రాణంపోయినా లంచం పుచ్చుకోని రావుగారూ, పదిలక్షలు దొరికినా తిరిగి ఇచ్చేసిన ముఠాకూలీలూ... నన్ను చూసి హేళనగా నవ్వుతున్నట్టు అన్పిస్తోంది.

నేను ఇంకేం ఆలోచించలేదు. నా కళ్ళపొరలు తొలగినట్టు కవర్‌లో నుంచి మ్యాప్ తీసి చింపేశాను.

అతి కిరాతకంగా ఎన్నో వన్యప్రాణుల్ని వేటాడిన కిరాతకుడు కూడా, కేవలం జంట పావురాల కంటనీరు చూసి వాల్మీకిగా మారాడట! మనిషైతే... ఒక్క సంఘటన, ఒక్క మాట... చాలు. అవి మనల్ని కదిలిస్తాయి, మార్చేస్తాయి కూడా. వాళ్ళిద్దరి వైపూ కృతజ్ఞతగా చూస్తూ రెండుచేతులూ జోడించాను. నేనెక్కాల్సిన బస్సు చీకట్లను చీల్చుకుంటూ వెలుతురును విరజిమ్ముతూ దూసుకుని వస్తోంది.

వాలుజడతో వయ్యారంగా నడుస్తూ... మనసులోని మాటను టకీమని చెప్పేస్తూ... ప్రేమికుడిని ఆటపట్టించే గడుగ్గాయి 'మధుమతి'ని ఎవరు మర్చిపోగలరు? 'జర్నీ' చూసిన చాలామంది అమ్మాయిలు ఆ పాత్రలో తమను తాము ఊహించుకుని మురిసిపోయారు. ఆ అచ్చ తెనుగు అందమే అంజలి. మన పక్కింటి అమ్మాయిలా కనిపించే ఈ చక్కనమ్మ తన గురించి ఏం చెబుతోందంటే...

పాత్రలో ఒదిగిపోతా

నాన్న ఎలక్ట్రీషియన్, అమ్మ గృహిణి. మాది తూర్పుగోదావరి జిల్లా రాజోలు. పదో తరగతివరకూ అక్కడే చదివా. తర్వాత మా కుటుంబం చెన్నైలో స్థిరపడింది. బీఎస్సీ మ్యాథ్స్ చేశా. ఆ తర్వాత మోడలింగ్ చేయడం, షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించడం మొదలు పెట్టా. అలా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టే అవకాశం వచ్చింది. నా తొలి సినిమా తెలుగే. నా మోడలింగ్ వ్యవహారాలు చూసిన శివనాగేశ్వరావు 'ఫొటో' సినిమాలో అవకాశం ఇచ్చారు. తర్వాత సినిమా 'ప్రేమలేఖ రాశా'. అయితే రెండూ ఫ్లాపయ్యాయి. అప్పుడు తమిళ సినిమా(కట్రదు తమిళ్)లో అవకాశం వచ్చింది. దానికి ఉత్తమ అరంగేట్ర నటి అవార్డు కూడా వచ్చింది. ఆ తర్వాత 'అంగాడితెరు'(షాపింగ్‌మాల్)కు ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డు దక్కింది.

★ నేనీ రంగంలోకి వచ్చేముందు నటన, నృత్యంలో ప్రత్యేక శిక్షణ ఏమీ తీసుకోలేదు. కానీ ప్రతి పాత్రకూ న్యాయం చేసేందుకు కష్టపడి పనిచేస్తా. 'జర్నీ'లో మధుమతి అందరికీ గుర్తుండిపోవడానికి కారణం అదే. నా నటన వాస్తవానికి దగ్గరగా కాదు, వాస్తవంగానే ఉంటుంది. ఇలా ఆలోచించడం వల్లేనేమో ప్రేక్షకులు నన్నింతగా అభిమానిస్తున్నారు. పాత్ర కోరితే... మేకప్ లేకుండా నటించడానికి కూడా నేనెప్పుడూ సిద్ధమే. నేనో పాత్రలో నటిస్తున్నానంటే అక్కడ అంజలి కనిపించకూడదు. ఆ పాత్ర మాత్రమే కనిపించాలి, అంతగా పాత్రలో ఒదిగిపోతా.

★ చిన్నప్పటి నుంచీ నటిని కావాలనే కోరుకున్నా. నటిని కాకపోతే ఏమై ఉండేదాన్నో అనేది నేనింతవరకూ ఊహించలేదు కూడా. చిరంజీవిగారికి వీరాభిమానిని. హీరోయిన్లలో శ్రీదేవి అంటే చాలా ఇష్టం. 'వసంత కోకిల' ఎన్నిసార్లు చూశానో లెక్కేలేదు.

★ నటిగా ఫిట్‌నెస్ కాపాడుకోవడం తప్పనిసరి. అందుకే రోజూ గంట వ్యాయామం చేస్తాను. ఇరవై నిమిషాల ధ్యానం తప్పనిసరి. దైవభక్తి ఎక్కువే. షూటింగ్ జరుగుతున్న ప్రదేశానికి దగ్గర్లో ఏ గుడి ఉన్నా తప్పకుండా వెళతాను. కాస్త సమయం చిక్కినా డాన్స్ ప్రాక్టీస్ చేస్తా. సినిమాలు చూస్తా. పుస్తకాలు బాగా చదువుతా. నాలో సానుకూల మార్పులు తీసుకొచ్చిన పుస్తకం 'టెల్ యువర్ డ్రీమ్'. అందుకే నచ్చిన వాళ్లకు దీన్ని బహుమతిగా ఇస్తుంటా. షూటింగ్ లేనప్పుడు అమ్మ చేసిన బిర్యానీ లాగించేస్తా. వంట చేయడం రాదుగానీ దోశలు మాత్రం బాగా వేస్తా.

★ దీపావళి పండగంటే చాలా ఇష్టం. ఈ పండక్కు కుటుంబమంతా పదిరోజులు రాజోలులో గడిపేస్తాం. అక్కడి నా బాల్య జ్ఞాపకాలు ఇప్పటికీ నా మనసులో ఎంతో పదిలంగా ఉన్నాయి. అన్నయ్యా, నేనూ, తమ్ముడూ ఆటలాడుకుంటూ ఎంతో ఆనందంగా గడిపేవాళ్లం. పదో తరగతిలో నేనే మా క్లాసు లీడర్‌ని. అందరూ నన్ను చిన్నీ అంటూ ఎంతో అభిమానంగా చూసే వాళ్లు. నాన్నకు నేను సినిమాల్లోకి రావడం అంతగా ఇష్టం ఉండేదికాదు. అయితే కష్టపడి నాన్నను ఒప్పించా. ఆ తర్వాత నా నటనను మెచ్చుకుంటూ నాన్న చిన్నచిన్న బహుమతులు కూడా ఇచ్చారు. అప్పుడెంత సంతోషపడ్డానో మాటల్లో చెప్పలేను.

★ బాగా అలంకరించుకుంటేనే అందంగా కనిపిస్తామని చాలామంది అనుకుంటారు. నిజానికి ఎలాంటి కల్మషంలేకుండా నవ్వుతూ ఉంటే ఎవరైనా అందంగానే కనిపిస్తారు. నలుపు, తెలుపు రంగులు కలబోతగా ఉన్న దుస్తులంటే చాలా ఇష్టం. ఆ కాంబినేషన్ జీవితంలోని కష్టసుఖాలూ, చీకటివెలుగుల కలబోతలా ఉంటుంది.

★ దర్శకులకే దర్శకులు బాలచందర్, బాలూమహేంద్ర, భారతీరాజాల ప్రశంసలను ఎప్పటికీ మర్చిపోలేను. 'ఈ మధ్య వచ్చిన కథానాయికల్లో అంజలి నటన నన్నాకట్టుకుంది' అని బాలూమహేంద్ర ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ పేపర్ కటింగ్ ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉంది. ఆ మాటలు గుర్తొచ్చినప్పుడల్లా కొత్త శక్తి వచ్చినట్టు ఉంటుంది. ఇక్కడ నేనేదో తెగ కష్టపడి పోతున్నానని ఎప్పుడూ అనుకోను. ఎందుకంటే నేనెంతో ఇష్టపడి ఎంచుకున్న నా కలల ప్రపంచమిది.

★ సేవ చేయడాన్ని నా పాత్రలకే పరిమితం చేయను. ఆ తపన నాలోనూ ఉంది. కాస్త తీరిక దొరికితే చెన్నైలో జరిగే సామాజిక అవగాహన కార్యక్రమాలకు హాజరై నా సహకారం అందిస్తా. ఓ సేవా సంస్థను ప్రారంభించాలని కూడా ఎప్పటినుంచో కోరిగ్గా ఉంది. అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారికి అండగా నిలవాలనుంది. ఈ విషయంలో సుస్మితాసేన్‌ను అభినందించాల్సిందే. నాకూ ఆమె బాటలో నడవాలనుంది.

★ మొదటిసారిగా తెలుగులో ప్రముఖ నటులతో కలిసి 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' చేస్తున్నా. వెంకటేష్, మహేష్‌బాబులతో కలిసి నటించడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. అవకాశాలు వస్తున్నాయని చకచకా సినిమాలు చేసేయడం నాకిష్టముండదు. పదికాలాలపాటు ప్రేక్షకుల గుండెల్లో నిలిచేపోయే పాత్రల్లో కనిపించాలన్నదే నా తాపత్రయం. ★

వీరీ వీరీ గుమ్మడిపండు...

గుమ్మడి పండు... సంప్రదాయ వేడుకలకూ కలినరీ కళలకూ చూడచక్కని వేదిక మాత్రమే కాదు, రుచికరమైన కూరగాయ కూడా. అన్నింటినీ మించి అద్భుత పోషకాల భాండాగారం కూడా!

గుండ్రంగా ఉండే గుమ్మడిపండుని చూస్తే ముచ్చటపడనివాళ్లెవరు? అందుకే గుమ్మడిపండులాంటి బిడ్డ పుట్టాలని ఆశీర్వదిస్తుంటారు పెద్దలు. అందుకోసమే అన్నట్లుగా మనదగ్గర ప్రతి ఇంటి పెరట్లోనూ ఓ గుమ్మడిపాదును తప్పక పాకిస్తుంటారు కూడా. విరబూసిన గుమ్మడిపూలతో బతుకమ్మల్నీ గొబ్బెమ్మల్నీ అలంకరిస్తే విరగ్గాసిన గుమ్మడికాయల్ని గుమ్మాలకు వేలాడదీసి మిగిలినవి ఏడాది పొడవునా వాడుకునేందుకు ఉచ్చుల్లో బిగిస్తుంటారు. గృహప్రవేశవేళ దిష్టికోసం గుమ్మడికాయను పగలగొట్టి వాకిలిదగ్గర పెట్టే సంప్రదాయం అంతటా ఉంది. అలాగే పెళ్లిళ్లూ, ఇతరత్రా శుభకార్యాల్లోనూ గుమ్మడిపండును ఇచ్చిపుచ్చుకోవడం చేస్తుంటారు. కార్వింగ్... వంటి కలినరీ కళల్లో గుమ్మడిదే అగ్రాసనం. దీనిమీద బొమ్మల్ని అద్భుతంగా చెక్కేస్తుంటారు కళాకారులు. హాలోవీన్ పండుగ సందర్భంగా గుమ్మడిని రకరకాల ఆకారాల్లో చెక్కి లోపల కొవ్వొత్తుల్ని వెలిగించి లాంతర్లుగా కిటికీలకూ గుమ్మాలకూ వేలాడదీస్తారు.

పప్పూ దప్పళం!

వంటలకొస్తే- పప్పూ దప్పళం తినాలంటే కచ్చితంగా గుమ్మడికాయ పగలగొట్టాల్సిందే. కత్తికో కత్తిపీటకో లొంగదు కాబట్టే గుమ్మడిని ఎవరూ సాధారణంగా కోయరు. పగలగొట్టడం మాత్రమే చేస్తారు. సాంబారు, కూరలు, వేపుళ్లు, పుడ్డింగ్‌లు, కేకులు, హల్వా... ఇలా గుమ్మడితో రకరకాల వంటలు చేయడం తెలిసిందే. నిజం చెప్పాలంటే మనదగ్గరకన్నా అమెరికన్లూ యూరోపియన్లే దీన్ని ఎక్కువగా వాడతారు. సూపులూ ప్యూరీలూ బ్రెడ్లూ కుకీలూ జ్యూస్‌లూ సలాడ్లూ పుడ్డింగ్‌లూ కేకులూ బిస్కట్లూ ఐస్‌క్రీములూ... ఇలా అన్నింట్లోనూ దీన్ని ప్రత్యేకంగా వాడుతుంటారు. అమెరికా, ఐరోపాల్లో చేసే పంప్‌కిన్ పీ అక్కడివాళ్లకి ఎంతో ఇష్టమైన వంటకం. దీన్ని మొదటగా స్థానిక అమెరికన్లు గుమ్మడి పై భాగాన్ని కొద్దిగా కోసి అందులోని గింజల్ని తీసి పాలు, సుగంధద్రవ్యాలు, తేనె నింపి కాలిన బూడిదలో పెట్టి బేక్ చేశారట. దాన్నే ఇప్పుడు కాస్త మార్చి ఓవెన్‌లో తయారుచేస్తున్నారు. కేవలం గుజ్జునే కాదు, లోపల ఉన్న గింజలని స్నాక్స్‌గా తింటారు. ఇవి ఎంతో శక్తిమంతమైనవి.

రకరకాలు!

సుమారు క్రీ.పూ. 7000 సంవత్సరాల నుంచీ వాడుకలో ఉన్న గుమ్మడిని మొట్టమొదటగా మెక్సికన్లే పండించారు. వీటిల్లో బోలెడు రకాలు... అరకిలో నుంచి ఐదు వందల కిలోల బరువు వరకూ ఇవి కాస్తాయి. ఎక్కువగా నారింజ నుంచి లేత పసుపు రంగులోనూ ఉంటాయి. కొన్ని ముదురు ఆకుపచ్చ నుంచి లేత ఆకుపచ్చ రంగుల్లోనూ మరికొన్ని తెలుపు, బూడిద వర్ణాల్లోనూ ఇంకొన్ని ఎరుపు వర్ణంలోనూ ఉంటాయి. ఒక్క అంటార్కిటికాలో తప్ప మిగిలిన ఆరు ఖండాల్లోనూ గుమ్మడిని పెంచడం విశేషం. కొన్నిచోట్ల దీన్ని పశుగ్రాసంగానూ వాడతారు. అన్నింటికన్నా ఈ పంటలో అమెరికాదే హవా. ఏటా 68 కోట్ల కిలోల గుమ్మడిపండ్లను వాళ్ళు పండిస్తున్నారు. ఎంత పెద్ద గుమ్మడిపండ్లని పండిస్తే అక్కడ అంత గొప్ప. ఇందుకోసం పోటీలు కూడా జరుగుతుంటాయి. అందుకే వీటి పెంపకంలో అక్కడి రైతులు పోటీలు పడతారు.

ఆరోగ్యఫలం!

తియ్యని గుమ్మడిపండులో క్యాలరీలు చాలా తక్కువ. 100గ్రా. గుమ్మడి గుజ్జు నుంచి కేవలం 26 క్యాలరీలు మాత్రమే లభిస్తాయి. గుమ్మడి గుజ్జులో విటమిన్-ఎ, విటమిన్-సి, విటమిన్-ఇ పుష్కలంగా ఉంటాయి. విటమిన్- ఎ కంటిచూపుని మెరుగుపరచడంతోబాటు ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్లు రాకుండా కాపాడుతుంది. విటమిన్-ఇ కొవ్వులు కరిగేందుకు తోడ్పడుతుంది.

గుమ్మడిలో ఆల్ఫా, బీటా కెరోటిన్లూ, క్రిప్టోక్సాంతిన్, ల్యూటెన్, జియా క్సాంథిన్... వంటి పాలీ ఫినాలిక్ ఫ్లేవొనాయిడ్లు ఉంటాయి. ఇవన్నీ కూడా రోగనిరోధకశక్తిని పెంచుతాయి. జియా క్సాంథిన్ వృద్ధాప్యంలో వచ్చే రెటీనా సమస్యల్ని తగ్గిస్తుంది. ఇవి ఇన్సులిన్‌ని ప్రభావితం చేస్తాయి. అందుకే డయాబెటిస్ రాకుండా ఉండేందుకూ వచ్చినవాళ్లకీ కూడా ఇది మంచిది. ఈ విషయాన్ని ప్రయోగపూర్వకంగా నిర్ధారించారు.

ఇందులో ఉండే పీచువల్ల కొలెస్ట్రాల్ పెరగకుండా ఉంటుంది. అందుకే ఇది హృద్రోగులకు మంచి కూరగాయ.

ఈ గుజ్జుని తినడంవల్ల ఊపిరితిత్తుల్లోని కఫం తగ్గడంతోబాటు మైగ్రెయిన్లూ తలనొప్పీ కూడా తగ్గుముఖం పడతాయి. గ్యాస్ట్రిక్ సమస్యలుండవు.

బి-కాంప్లెక్స్ విటమిన్లు, కాపర్, కాల్షియం, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్... వంటి ఖనిజాలు కూడా గుమ్మడిపండు నుంచి లభిస్తాయి.

గుమ్మడినుంచి తీసిన గుజ్జు పెంపుడు జంతువులైన పిల్లి, కుక్కలకు ఎంతో మంచిదట. కోళ్లకి కూడా ఇది మంచి మేత. గుమ్మడి తురుము లేదా గుజ్జుని వాటికి ఆహారంలో భాగంగా ఇవ్వడంవల్ల గుడ్ల ఉత్పత్తి పెరుగుతుంది.

గింజల్లో ప్రొటీన్లూ ఖనిజాలూ విటమిన్లూ ఓమేగా-3- ఫ్యాటీ ఆమ్లాలూ సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండెజబ్బుల్ని తగ్గించడంలో కీలకపాత్రను పోషిస్తాయి. ముఖ్యంగా వీటిల్లో చర్మానికి మేలుచేసే విటమిన్-ఇ, విటమిన్-కె సమృద్ధిగా దొరుకుతాయి. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం ఆయుష్షును పెంచేందుకు దోహదపడుతుంది.

100 గ్రా. గింజల నుంచి 559 క్యాలరీలు లభిస్తాయి. వీటిల్లో 30 గ్రా. ప్రొటీన్లు ఉంటాయి. మెదడును ప్రభావితం చేసే ట్రిప్టోఫాన్ అనే అమైన్ ఆమ్లం కూడా ఈ ప్రొటీన్లలో ఉంటుంది. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే సమస్య తగ్గుతుంది. బద్దెపురుగుల్లాంటి పరాన్నజీవులు పొట్టలో పెరగకుండా కూడా ఉంటాయి. మలబద్ధకమూ తగ్గుతుంది.

గింజల్ని తరచూ తీసుకోవడం వల్ల బరువు తగ్గడంతోబాటు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇవి శరీరంలో కొవ్వు పేరుకోకుండా చేస్తాయని ఆయుర్వేదం సైతం చెబుతోంది. వీటిని ఎండబెట్టి, వేయించి లేదా పచ్చిగాగానీ తినవచ్చు.

గుమ్మడి విత్తులు లేదా వీటినుంచి నుంచి తీసిన నూనె కూడా చాలా మంచిది. ఇది రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌నీ బీపీనీ ప్రొస్టేట్ క్యాన్సర్లనీ మూత్రాశయ సమస్యల్నీ నిద్రలేమినీ తగ్గిస్తుంది. చర్మానికీ మెదడుకీ ఎముకల ఆరోగ్యానికీ కూడా మేలు చేస్తుందట.

అందుకే మరి... 'వీరీ వీరీ గుమ్మడి పండు... వీరి పేరేమి'... అంటూ గుమ్మడిని ఆటపాటలకో ప్రత్యేక వేడుకలకో పరిమితం చేయకుండా వంటింట్లోనూ తగిన ప్రాధాన్యాన్ని కల్పిస్తే అది అద్భుత ఔషధ భాండాగారంగానూ ఉపయోగపడుతుంది.



కదంబం

బొమ్మల పంకా

సీలింగ్ ఫ్యానయినా టేబుల్ ఫ్యానయినా ఒకప్పుడు మూడు లేదా నాలుగు రెక్కలతో మాత్రమే ఉండేవి. అదీ తెలుపు లేదంటే ముదురు గోధుమ రంగుల్లో మాత్రమే. కానీ ఇప్పుడు బెడ్ రూమ్‌లూ అందులోని ఫర్నిచర్‌తోపాటే ఫ్యాన్లూ మేకోవర్‌ని సంతరించుకున్నాయి. రంగురంగుల్లో విభిన్న డిజైన్లలో వస్తున్నాయి. లైట్‌తో కలిపి ఉన్నవీ, రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసేవీ, పిల్లలకోసం రకరకాల బొమ్మలున్నవీ కూడా వస్తున్నాయి. ఉషా.. వంటి ప్రముఖ కంపెనీలు చోటాభీమ్ థీమ్‌తోనూ ఫ్యాన్లను రూపొందించడం విశేషం.

శంఖు వనం!

'మొక్కల్ని పెంచేందుకు మనసంటూ ఉండాలే గానీ మార్గాలనేకం' అంటోంది అమెరికాకి చెందిన మేగన్. శంఖువులూ నత్తగుల్లల... వంటివాటిల్లో కూడా సకులెంట్స్ రకాలను చక్కగా పెంచుకోవచ్చని చెబుతోంది గార్డెనర్. ముఖ్యంగా మీనియేచర్ గార్డెనింగ్‌లో ఇవి చక్కగా పనికివస్తాయి. సో... కుండీల్లో మాదిరిగానే షెల్ గార్డెన్‌నీ పెంచుకోవచ్చన్నమాట.

ఐఫోన్ పేక

అచ్చంగా యాపిల్ ఐ ఫోన్ మాదిరిగానే ఉన్న ఈ పేకముక్కల్ని చూడగానే ఎవరైనా తమ కళ్లు తమని మోసం చేయడం లేదు కదా అనే ఆలోచిస్తారు. కానీ ఇది నిజమే... పేకముక్కలే ఐఫోన్ అవతారమెత్తాయి. కాకపోతే యాపిల్ లోగో స్థానంలో డైమండ్, కళావర్ తదితర గుర్తులు ఉంటాయంతే. మెనినోస్ వెబ్‌సైట్ ద్వారా విక్రయిస్తున్న ఈ పేకముక్కల సెట్ ఖరీదు సుమారు 1500 రూపాయలు.

వెలిగే దిండు

దిండుని హత్తుకుంటే లైటు వెలుగుతుందా? ఏమో వెలిగినా వెలగవచ్చంటోంది డిజైనర్ డయానా లిన్. డి లైట్ హగ్గబుల్ జి 2గా పిలిచే ఈ దిండును హత్తుకున్నా తలకింద పెట్టుకున్నా రంగురంగుల కాంతి గదంతా పరచుకుంటుందట. అదెలా అంటే పారదర్శక దిండు కవరులోపల 12 ఎల్ఇడి దీపాలను చిన్న సిలికాన్ పొరలో చుట్టి ఉంచారట. బ్యాటరీలూ లేదా ఏసీ ఎడాప్టర్ ద్వారా ఇది ఎప్పటికీ పనిచేస్తుంది.

నిప్పు- నీరు

ఎంత పెద్ద నిప్పయినా నీళ్లకి లోకువే. కాసిని నీళ్లు చల్లగానే అది ఆరిపోవాల్సిందే. కానీ అమెరికాలోని ఈరీ కౌంటీలోని చెస్ట్‌నట్ రిడ్జ్ పార్కులో మాత్రం ఈ అద్భుతం సందర్శకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంటుంది. అంత పెద్ద జలపాతం నుంచి నీళ్లు వెల్లువలా జారిపడుతుంటే ఆ పక్కనే చిన్న మంట జ్యోతిలా వెలుగుతుంటుంది. అందుకే ఈ జలపాతాన్ని 'ఎటర్నల్ వాటర్ ఫాల్స్' అంటారు. అయితే ఈ జ్యోతి ఏ మంత్రమో మాయో కాదు. అక్కడున్న రాళ్ల మధ్యలోంచి సహజవాయువు విడుదలై రాపిడికి గురవడమే ఈ మంటకి కారణం. జలపాతం వెనకనున్న ఓ రాతిపొర ఆ మంటమీద నీళ్లు పడకుండా అడ్డుగా ఉండటంతో భూమి లోంచి వాయువు ఉబికి వస్తున్నంతసేపూ అది వెలుగుతుంటుంది. మధ్యమధ్యలో మాయమైనా మళ్లీ దానంతటదే వస్తుంటుందట. ప్రకృతి చిత్రాల ముందు మనిషి మాయలేపాటి... కదా!

అరటిపండ్ల రైలు...!

క్రీడాకారులు తక్షణ శక్తి కోసం ఆశ్రయించేదీ ఆహారం తీసుకోడానికి సమయం లేకపోయినా అందుబాటులో ఉన్న ఆహారం రుచించకపోయినా ఎవరైనా ముందుగా ఆధారపడేదీ అరటిపండుపైనే. అలాంటి అరటిపండ్ల రవాణాకు ప్రత్యేకంగా ఒక రైలుంది. ఈ అక్షరాల పట్టాల వెంట ప్రయాణిస్తే ఆ కథేంటో మీకూ తెలిసిపోతుంది.

అహ్మద్... ఆజాద్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు. నిమిషానికోసారి వాచీ చూసుకుంటున్నాడు. అతడి కుటుంబ సభ్యులో బంధువులో స్నేహితులో ఆరోజు రైల్లో వస్తున్నారేమో అనుకుంటే పొరపాటే. అతడు ఎదురుచూస్తున్నది... బనానా ట్రెయిన్ కోసం. 'అరటి పండ్లకూ రైలా?' అని ఆశ్చర్యపోకండి. అవును... అరటిపండ్ల రవాణాకూ రైలుంది. అది మహారాష్ట్రలోని జల్గావ్‌లో బయలుదేరి ఢిల్లీలోని ఆజాద్‌పూర్ వరకూ ప్రయాణిస్తుంది. సెప్టెంబరు నెలలో దీన్ని ప్రారంభించారు.

ఈ రైలు కథ...

నేషనల్ హార్టీకల్చర్ బోర్డూ, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కలిసి ఈ రైలును ప్రారంభించాయి. ఈ రెండు సంస్థలూ దీని మీద ఎనిమిదేసి కోట్ల రూపాయల చొప్పున పెట్టుబడి పెట్టాయి. పండ్ల లభ్యతను బట్టి ఈ రైలు వారానికి ఒకటి లేదా రెండుసార్లు తిరుగుతుంది. మహారాష్ట్రలో బయలుదేరి మధ్యప్రదేశ్ మీదుగా ఢిల్లీ చేరడానికి ఇరవై ఆరు గంటలు పడుతుంది. పండ్లను రైలులోకి ఎక్కించడానికీ దించడానికీ ఎనిమిది గంటల సమయం పడుతుంది.

ఈ రైల్లో మొత్తం 80 కంటెయినర్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 12 టన్నుల అరటి పండ్లు పడతాయి. ఈ రైలును ప్రారంభించడం వల్ల రవాణా ఖర్చులు తగ్గిపోవడమేకాదు, పండ్ల నష్టాన్నీ నివారించారు. సరైన స్టోరేజీ సదుపాయాలు లేకపోవడం వల్ల ఇంతకు ముందు రోడ్డు రవాణాలో 20 నుంచి 30 శాతం పండ్లు పాడయ్యేవి. ఇప్పుడా నష్టం ఐదు శాతానికి తగ్గిపోయింది. రైతులకే కాకుండా వ్యాపారులకూ దీనివల్ల ఎన్నో లాభాలు చేకూరుతున్నాయి. రోడ్డు రవాణాలో వారికి కేజీకీ మూడు రూపాయలు ఖర్చయ్యేది. ఇప్పుడది రెండు రూపాయలకు తగ్గిపోయింది.

మహారాష్ట్ర నుంచే ఎందుకు?

మహారాష్ట్రలో అరటిపంట అధికం. ఈ రాష్ట్రంలో సుమారు 17 లక్షల హెక్టార్ల భూమి అరటిసాగు కింద ఉంది. ఇక్కడ పండే పంటల్లో 25శాతం వాటా అరటి పండ్లదే. సముద్రంలేని చోట ఉప్పు అమ్మితే లాభమన్నది వ్యాపార సూత్రం. ఈ సూత్రాన్ని ఆకళింపు చేసుకున్న ప్రభుత్వానికి చక్కటి ఆలోచన వచ్చింది. దాని ఫలితమే అరటి పండ్ల రైలు. దీని ద్వారా మహారాష్ట్రలో విరివిగా పండే అరటిపండ్లను అరటిసాగు తక్కువగా ఉండే ఉత్తర భారతదేశానికి అందిస్తోంది.

ఈ రైలుకు సకాలంలో పండ్లను అందించే బాధ్యత మహారాష్ట్ర అగ్రికల్చర్ మార్కెటింగ్ బోర్డ్‌ది. దీన్నే 'మహాబనానా' అంటారు. దీని కింద 26 కోఆపరేటివ్ సొసైటీలూ ఉన్నాయి. ఒక్కో సొసైటీలో 300 నుంచి 350 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. దీని అధ్యక్షులు డీజీ మహాజన్ 'ఉత్తర భారతదేశానికి అరటి పండ్లను రవాణా చేయడంలో ఎంతో పురోగతిని సాధించాం. దీన్ని కొనసాగించడానికి మరింత కృషిచేస్తాం.' అంటున్నారు.

'రవాణా వేగంగా జరగడం వల్ల పండ్ల నష్టం తక్కువగా ఉంటుంది. పైగా తక్కువ ఖర్చుతో పండ్లు త్వరగా రవాణా అవుతున్నాయి కూడా. ఇంతకంటే రైతుకు కావాల్సిందేముంటుంది? ఇతర పండ్లూ కూరగాయలకూ ఇలాంటి రైళ్లు కావాలి' అంటున్నారు ఆజాద్‌పూర్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ మర్చంట్స్ అసోసియేషన్‌లో సభ్యుడు సురేష్ సచ్‌దేవ్.

ఫలించిన ప్రయోగం

బనానా రైలు ప్రయోగానికి ముందు ఉల్లిపాయలూ బంగాళాదుంపల రవాణాకు ప్రత్యేక రైలును ఉపయోగించారు. నాసిక్ నుంచి కోల్‌కతా, మాల్దా వరకూ ఉల్లిపాయలు తరలించారు. అలాగే కోల్‌కతా నుంచి గౌహతి - ఆగ్రా నుంచి బెంగళూరుకు బంగాళాదుంపలు తరలించారు. కానీ ఈ ప్రయోగం అంతగా విజయవంతం కాలేదు. ఆ తర్వాత ప్రారంభించిన బనానా రైలుకు మాత్రం విశేష స్పందన లభించింది. వచ్చే అయిదేళ్లలో పది రైళ్లను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారంటే అరటిపండ్ల రైలుకు ఉన్న ఆదరణ ఎంతటిదో అర్థంచేసుకోవచ్చు.

రైతుల ఆదరణేకాదు వ్యాపారుల అండ దండలూ ఈ రైలుకు పుష్కలంగా లభిస్తున్నాయి. ఢిల్లీలోని ఆజాద్‌పూర్‌లో ఉంటున్న అహ్మద్ కుటుంబం అయిదు తరాలుగా అరటిపండ్ల వ్యాపారంలోనే ఉంది. అయినా ఏనాడూ లాభాలను కళ్లజూసిందిలేదు. వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకే సరిపోయేది. అరటిపండ్ల రైలు రాకతో ఇప్పుడిప్పుడే వ్యాపారం మీద అతడికి మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. వ్యాపార పరిధి పెంచి కుటుంబ సభ్యుల కలలను నిజం చేయగలననే భరోసా కూడా అతడికి కలుగుతోంది. ఇలాంటి వ్యాపారులు ఢిల్లీలో ఎందరో.

తాజా అరటిపండ్లు తినడమన్నది ఒకప్పుడు ఢిల్లీవాసులకు అరుదైన అవకాశంలా ఉండేది. ధర కూడా బాగా ఎక్కువ పెట్టాల్సివచ్చేది. ఇప్పుడు బనానా రైలు పుణ్యాన తక్కువ ధరకే తాజా పండ్లు లభిస్తున్నాయి. ఈ రైలు మన స్టేషన్‌లోనూ ఆగితే బాగుంటుంది కదూ...!

పల్లెటూరిలో పచారీకొట్టు మొదలుకొని పట్టణాల్లోని డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వరకూ... ఆ ఔషధం ఎక్కడైనా దొరుకుతుంది! దానిపేరు 'జిందాతిలిస్మాత్'. జలుబు, దగ్గు, జ్వరం... దేనికైనా ఇదే మందు. పిల్లలూ పెద్దలూ అనే తేడా లేకుండా ఎంతోమంది దీన్ని వాడుతున్నారు. తొంబై రెండేళ్లుగా ఈ ఔషధాన్ని తయారు చేస్తోంది 'ఖార్ఖానా జిందా తిలిస్మాత్' కంపెనీ. ఏ ఉత్పత్తైనా శతాబ్దకాలంపాటు ప్రజాదరణను నిలుపుకోవడమంటే మాటలు కాదు. అదెలా సాధ్యమైందో వివరిస్తున్నారు ఆ సంస్థ యజమానులు ముహమ్మద్ రవూఫ్‌ద్దీన్, మిన్హాజుద్దీన్ సోదరులు.

అదే నేర్చుకున్నాం, అదే నేర్పుతున్నాం

రవూఫ్: మార్కెట్ అన్నాక పోటీ ఉంటుంది. తట్టుకోవాలంటే వ్యూహాలు మార్చుకోక తప్పదు.

మిన్హాజ్: ఏ కంపెనీకైనా వ్యూహాలు మార్చుకోవడం అవసరమే. కానీ, కొన్ని విలువలుండాలి. అవి మారకూడదు. కొంత సామాజిక బాధ్యత కూడా ఉండాలి.

రవూఫ్: మా నాన్నగారు మాకు నేర్పింది అదే. ఆయన వ్యాపారం కోసం ఈ ఔషధాన్ని తయారుచేయ లేదు. సామాన్యుల అవసరం కోసం దీన్ని తయారుచేశారు. ఆయన లాభాల కోసం కంపెనీ పెట్టలేదు. ప్రజల సమస్యలు తీరాలని ఆలోచించేవారు.

మిన్హాజ్: 'పేదలకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే అప్పులు చేసే పరిస్థితి ఉండ కూడదు. తక్కువ ఖర్చుతోనే వాళ్లకు చికిత్స లభించాలి' అని నాన్న ఆలోచించేవారు. అది సాధ్యం కావాలంటే అన్ని రోగాలకూ ఒకేఒక్క మందు ఉండాలి. అలాంటి ఔషధాన్ని కనిపెట్ట డానికి ఎంత కష్టపడ్డారో మాకు బాగా గుర్తే.

చిన్న ఇంట్లో మొదలు

రవూఫ్: నాన్నగారి పేరు హకీమ్ ముహమ్మద్ మోయిజుద్దీన్ ఫారుఖీ. ఆయనకి చిన్నప్పట్నుంచే పరిశోధనలంటే చాలా ఇష్టం. ముఖ్యంగా వైద్యమంటే ఆయనకి చాలా ఇష్టం. ఆ ఇష్టం ఏర్పడ్డానికి ఓ కారణముంది. నాన్నగారు ఎంతోమంది పేద ప్రజల జీవితాలను దగ్గరగా గమనిస్తూ ఉండేవారట. ముఖ్యంగా రోగాలతో చనిపోయినవారి గురించి తెలుసుకుని చలించిపోతుండేవారు. రోగం ముదిరి చనిపోవడం వేరు... ఆ రోగానికి చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక చనిపోవడం వేరు. ఇలాంటి కేసులు ఆయన్ని తీవ్రంగా ఆలోచింపజేసేవి. అందుకే పేదలకు సర్వరోగ నివారిణిగా పనిచేసే ఔషధం ఏదైనా ఉంటే బాగుండు అనుకునే వారు. 'దాన్ని నేనే ఎందుకు కనిపెట్టకూడదు' అని నిర్ణయించుకున్నారు. నాన్న ఆలోచనలకి మా తాతయ్య ఎంతో మురిసిపోయారు. దాంతో నాన్న యునానీ వైద్య విద్యను అభ్యసించారు. ఆ తరువాత షికాగో మెడికల్ కాలేజ్ ఆఫ్ హోమియోపతి నుంచి హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు చేశారు. ఆయనకు 'డాక్టర్ ఆఫ్ హోమియో పతి మెడిసిన్' పట్టా కూడా లభించింది. తరువాత ఆయన పరిశోధనలు మొదలు పెట్టారు. హైదరాబాద్‌లోని మోతీ మార్కెట్ లోని మా ఇంట్లోనే ఆసుపత్రిని ప్రారంభించారు. పేదలకు వైద్యాన్ని చేస్తూనే ఔషధం తయారీకోసం శ్రమిస్తుండేవారు.

అన్నీ ఆయనే

మిన్హాజ్: జిందాతిలిస్మాత్‌తో పాటూ ఫారుఖీ పళ్లపొడినీ నాన్న కనిపెట్టారు. వాటి ఫార్ములాలు కనిపెట్టడానికి చాలా శ్రమించారు. మందు కనిపెట్టడం ఒక ఎత్తయితే, అది సరిగ్గా పనిచేస్తుందో లేదో తెలుసుకోవడం మరో ఎత్తు. నాన్నగారి దగ్గరకి వస్తున్న రోగులకు ఈ మందుని ప్రయోగపూర్వకంగా ఇచ్చేవారు. ఫలితాలను అంచనాలు వేసి... మందు తయారీలో మార్పులూ చేర్పులూ చేశారు. ఎలాగో మొత్తానికి జిందాతిలిస్మాత్ ఫార్ములా రూపొందింది. 1920లో ఇంట్లోనే వీటి తయారీ మొదలు పెట్టారు. ఆయనే తయారీదారు... ఆయనే ప్రకటన కర్త... ఆయనే అమ్మకందారు... ఆయనే కార్మికుడూ... ఆయనే యజమాని. ఈరోజుల్లో మాదిరీ అప్పట్లో ఏదైనా వస్తువుకి ప్రచారం అంటే అంత సులభమైన పనికాదు. వార్తాపత్రికలు ఇంత విరివిగా లేవు. దేన్నైనా ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే చాలా కష్టం. పగలంతా వైద్యం చేసి చీకటిపడగానే ఏదో ఒక గ్రామానికో పట్టణానికో బయలుదేరేవారు. ఆ రాత్రివేళ ఇంటింటికీ వెళ్లి 'ఈ మందు వాడండి... మీ ఇంటిల్లిపాదికీ సర్వరోగ నివారిణి' అంటూ ప్రచారం చేసేవారు.

అవే సాధనాలు

రవూఫ్: జిందాతిలిస్మాత్‌తోపాటూ ఫారుఖీ పళ్లపొడిని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వినూత్నంగా ప్రచారం చేసేవారు. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు గోడలపై ఆయనే ప్రకటనలు రాసేవారు. ప్రయాణిస్తున్నప్పుడు తోటి ప్రయాణికులకు ఏవైనా ఆరోగ్య సమస్యలున్నా యేమో తెలుసుకుని ఉచితంగా జిందాతిలిస్మాత్ ఇచ్చేవారు. చివరికి గాలిపటాలపై కూడా ఈ ఉత్పత్తుల గురించి రాయించేవారు. మొత్తానికి ఆయన శ్రమ ఫలించింది. 'ప్రతీ ఇంటిలోనూ తప్పక ఉండాల్సిన సర్వరోగ నివారిణి'గా జిందాతిలి

స్మాత్‌ను ప్రజలు నమ్మారు. ఔషధం అంత బాగా పనిచేసింది కాబట్టే ప్రజలు ఆదరించారు అనడం కరెక్ట్. దీని ధర కూడా తక్కువగానే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొదట్లో నాన్నగారే ఔషధాన్ని సొంతంగా తయారు చేసుకునేవారు. రానురానూ డిమాండ్ పెరుగుతుండటంలో ఓ ఏడుగురిని పనిలోపెట్టుకున్నారు. చిన్నగా ప్రారంభమైన ఖార్జానా జిందా తిలిస్మాత్ నెమ్మదిగా ఓ సంస్థగా మారింది. మరికొంతమందికీ ఉపాధి కల్పించగలిగింది.

ఆయన చెప్పేవారు

మిన్హాజ్: నాన్నగారికి మేం నలుగురం కుమారులం. చిన్నప్పట్నుంచీ మాకు ఈ కంపెనీని భవిష్యత్తులో ఎలా నడపాలనే విషయాన్నే చెబుతూ ఉండేవారు. 'మనం పేదవాళ్ల కోసం మందులు తయారుచేస్తున్నాం. భారీ ఎత్తున లాభాలు ఆశించకూడదు. ప్రజల ఆదరణని సొమ్ము చేసుకోవాలని ఆలోచించకూడదు. మనం చేస్తున్నది ఒక సేవా కార్యక్రమం. అంతేకాదు, మనం వీలైనంత ఎక్కువమందికి పని కల్పించాలి' అనేవారు. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక విప్లవం జోరందుకున్న రోజులవి. ఈ ఔషధ ఉత్పత్తుల తయారీ మొదలుపెట్టి పారిశ్రామిక విప్లవం దక్కన్ ప్రాంతంలో ప్రారంభం కావడానికి నాన్నగారు నాంది పలికారు అనొచ్చు. హైదరాబాద్ సంస్థానంలోని రాజకుటుంబీకులు ఈ ఔషధాల గురించీ, కంపెనీ ఆర్థిక విజయం గురించీ చాలా చోట్ల గొప్పగా చెప్పేవారట. ఆ రోజుల్లోనే హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో తొలి పారిశ్రామిక ప్రదర్శన జరిగింది. అందులో జిందాతిలిస్మాత్ స్టాలును నాన్న ఏర్పాటు చేశారు. ప్రదర్శనకి వచ్చినవారంతా ఈ మందు గురించి తెలుసుకోవాలని ఎగబడేవారు. దేశంలోని ఎన్నో ప్రాంతాలవారికి ఈ ఔషధం గురించి తెలిసింది. 1949లో సంస్థను మోతీ మార్కెట్ నుంచి అంబర్‌పేటకు మార్చారు. తరువాత ఐదేళ్లకి నాన్న మరణించారు.

సమాన బాధ్యతలు

రవూఫ్: నాన్నగారు మరణించేనాటికి మేం చిన్నవాళ్లం. మా పెద్దన్నయ్యకి కంపెనీ వ్యవహారాలు తెలుసు. నాన్నగారు ఆయనకే ఎక్కువగా పనులు చెబుతూండేవారు. మా నలుగురికీ కంపెనీలో సమాన హోదాలు కల్పించారు. నాన్నగారు ఏవైతే ఆశయాలు పెట్టుకుని ఔషధ తయారీ మొదలుపెట్టారో... ఇప్పటికీ మేము వాటిని తు.చ. తప్పకుండా అనుసరిస్తున్నాం. మా నలుగురు సోదరుల్లో దురదృష్టవశాత్తూ పెద్దన్నయ్యా మూడో సోదరుడూ మరణించారు. వారి వారసులకు కంపెనీలో భాగస్వామ్యం కల్పించాం. నాన్నగారి హయాంలో ఏడుగురితో మొదలైన కంపెనీ... ఇప్పుడు వందకుపైగా ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తోంది. గడచిన నాలుగైదు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా... ముఖ్యంగా వాణిజ్యపరంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. కంప్యూటర్లూ యంత్రాలూ అందుబాటులోకి వచ్చి ఎన్నో కంపెనీలు ఉత్పాదనా వ్యయాన్ని తగ్గించుకున్నాయి. ఉద్యోగుల సంఖ్యను కుదించుకున్నాయి. అయితే, ఇప్పటి వరకూ మా సంస్థలో ఎలాంటి యంత్రాలనూ ఉపయోగించడం లేదు. ఎందుకంటే... 'మనం వీలైనంతమందికి ఉపాధి కల్పించాలి' అని నాన్నగారు చెప్పిన మాటలు మేం మరచిపోలేం. యంత్రాలను ప్రవేశపెట్టి ఉద్యోగులను తగ్గించుకోవాలని ఏనాడూ అనుకోలేదు. ప్రస్తుతం మా దగ్గర పనిచేస్తున్న వారిలో అప్పట్లో నాన్నగారితో పనిచేసివారి వారసులే ఎక్కువమంది. నాన్నగారితో పనిచేసినవారి మూడో తరం వారసులు కూడా మా దగ్గర ఉద్యోగులుగా ఉన్నారు. అందుకే, కంపెనీలో పనిచేసేవారందరూ ఒకే కుటుంబంలా కలసిమెలసి ఉంటారు. మేము కూడా యజమానుల్లా వ్యవహరించం. వాళ్లలా ఉద్యోగులమే అనుకుంటాం..

సమాజ సేవలో

మిన్హాజ్: ప్రకృతి వైపరీత్యాలూ గొడవలూ జరిగినప్పుడు మా వంతుగా బాధితులకు సహాయపడుతుంటాం. ఉచితంగా మందులను పంపిణీ చేస్తుంటాం. ఆ మధ్య సునామీ వచ్చినప్పుడు బాధిత ప్రాంతాల్లో సుమారు 12 వేలకు పైగా జిందాతిలిస్మాత్ ప్యాక్‌లను బాధితులకు అందజేశాం. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వరదలు వచ్చినప్పుడు కూడా వారాలపాటు నీటిలో చిక్కుకుపోయిన ప్రజలకు ఈ ఔషధాన్ని అందించాం. హైదరాబాద్‌లో గొడవలు జరిగిన ప్రతీసారీ బాధితులకు మేం మందులను ఇచ్చాం. అంతేకాదు, ఎవరైనా మా దగ్గరకి వచ్చి 'మా ఊళ్లో చాలామంది ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు' అని చెప్తే వెంటనే ఈ మందును ఉచితంగా ఇస్తుంటాం. ప్రతీయేటా హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకి వేళ్లే భక్తులకు కూడా ఈ మందుని పంపిణీ చేస్తున్నాం. జిందాతిలిస్మాత్, ఫారుఖీ పళ్లపొడి తయారీని ఒక వ్యాపారంగా చూడటం లేదు. ఇదో సేవా కార్యక్రమం.

అభిమానం చాలు

రవూఫ్: జిందాతిలిస్మాత్, ఫారుఖీ పళ్ల పొడి... ఈ రెండూ దొరకని దుకాణాలంటూ ఉండవనడంలో ఆశ్చర్యం లేదు. అందరి ఇళ్లల్లోనూ ఇవి తప్పక ఉంటున్నాయి. వీటి ఖరీదు కూడా చాలా తక్కువే. చిన్నపిల్లల దగ్గర్నుంచీ వృద్ధుల వరకూ అందరూ వీటిని వాడుకోవచ్చు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసు. కాబట్టి ఇప్పుడు ఈ ఔషధం గొప్పతనం గురించి మరోసారి ప్రజలకు వివరించాల్సిన అవసరం లేదు. తరతరాలుగా వారి అభిమానం మాపై ఉంటోంది. అయితే... కొత్త వినియోగదారులను ఆకర్షించేందుకు అప్పుడప్పుడూ ప్యాకింగులు మారుస్తుంటాం. బహుమతి పథకాలను ప్రవేశపెడుతుంటాం. ఇప్పుడు విదేశాలకు కూడా మా ఉత్పత్తులు బాగానే ఎగుమతి అవుతున్నాయి. మేము 'జిందా బామ్'ను కూడా తయారు చేశాం. దీనికీ మంచి ఆదరణ లభిస్తోంది.

మిన్హాజ్: ఈతరం పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా ఎక్కడైనా కలిసినప్పుడు మా కంపెనీ విజయ రహస్యమేంటీ అని అడుగుతూ ఉంటారు. శతాబ్ద కాలంగా వినియోగదారుల ప్రేమని ఎలా పొందుతున్నారు అని ప్రశ్నిస్తుంటారు.

రవూఫ్: ఆ ప్రశ్నలకు 'విలువలే విజయ రహస్యం' అని చెబుతాం. అంతేకదండీ... నీతి నిజాయతీలతో ఏ పనిచేసినా అది విజయవంతమౌతుంది. పనిలోపనిగా తోటివారికి సాయపడదాం అనుకుంటే మరీ మంచిది. మేం మానాన్న నుంచి నేర్చుకున్నది ఇదే... మా వారసులకు నేర్పుతున్నదీ ఇదే.

– *ముహమ్మద్ ముజాహిద్, న్యూస్‌టుడే*
నూర్‌ఖాన్‌బజార్ (హైదరాబాద్)

లోగోల వెనక

మిన్హాజ్: జిందాతిలిస్మాత్ బాటిల్‌పై నీగ్రో బొమ్మ ఉంటుంది. అది నాన్నగారి ఆలోచనే. ప్రపంచంలో అందరికంటే ఆఫ్రికా నీగ్రోలు బలంగా ఆరోగ్యంగా ఉంటారు. అందుకే ఆ లోగోను పెట్టారు.

రవూఫ్: ఫారుఖీ పళ్లపొడిపై షార్క్ చేప బొమ్మ ఉంటుంది. షార్క్ చేప దంతాలు ఎంతో బలంగా ఉంటాయి. అందుకే దాన్ని ఎంచుకున్నారు.

సూటిగా... సుత్తి లేకుండా!

సోషల్ నెట్‌వర్కింగ్... మన ఫీలింగ్స్‌ని త్వరగా స్నేహితులతో పంచుకునే వీలు కల్పించింది! అయితే... ఆ ఫీలింగ్స్‌ని 100 శాతం మనం వ్యక్తీకరించగలుగుతున్నామా..? ఎన్ని ఆప్షన్స్ ఉన్నా... ఎక్కడో ఏదో లోటు! అది పూడ్చుకునే మార్గం... కనిపించేసింది.

స్మైల్... :)... ఇలా చూపించొచ్చు. విచారం... :(... ఇలా చెప్పొచ్చు. నచ్చితే 'లైక్' కొట్టడానికి 'థంబ్ అప్' ఉంది. నచ్చకపోతే అదీ చెప్పడానికి 'థంబ్ డౌన్' ఉంది. అయితే... ఒక్కోసారి మన ఫీలింగ్స్‌ని స్నేహితులతో పంచుకోవడానికి కీబోర్డులో మీటలు సరిపోవు అనిపిస్తుంది. ఎన్ని అక్షరాలు కంపోజ్ చేసినా మనం అనుకున్నది ఇంకా సరిగ్గా చెప్పలేకపోయామే అన్న భావన ఉండిపోతుంది. పొట్ట చెక్కలైపోయే జోక్ విన్నాం... దాన్ని చెబుతూ... మధ్య మధ్యలో నవ్వుతూ.. మళ్లీ చెబుతూంటే ఉండే ఆనందం వేరు... అదే జోకుని అక్షరాల్లో రాసి ఏ ఫేస్‌బుక్ ద్వారానో స్నేహితులకు చేరవేయడం వేరు. సరిగ్గా ఇలాంటప్పుడే... 'మన ఫీలింగ్స్ సరిగ్గా కన్వే కావడం లేదు' అనుకుంటాం. ఇలా అనుకునీ... మథనపడీ పడీ... తలలు పగులగొట్టుకునేలా ఆలోచిస్తే... చివరికి ఓ మార్గం తట్టింది. అదే 'వీడియో పోస్ట్'!

ఇక, రాతలేదూ అక్షరాలూ లేవూ గుర్తులూ లేవు. అనుకున్నది అనుకున్నట్టు కెమెరా ముందు వాగేయడం... దాన్ని కాపీ చేసి సోషల్ నెట్‌వర్కింగ్‌లో పడేయడం. సోషల్ నెట్‌వర్కింగ్‌లో యూత్ అలవాటుపడుతున్న కొత్త ట్రెండ్ ఇది. అయితే... ఈ ట్రెండ్ మనకే కొత్త, విదేశీయులకు పాతదే!

అలా దిగుమతైంది

యూరప్, అమెరికాల్లో ఇలా ఎవరికివారు సొంతంగా వీడియోలు తీసుకోవడం అనే కాన్సెప్ట్ చాలా రోజుల నుంచీ ఉంది. అలా తీసిన వాటిని యూట్యూబ్‌కి అప్‌లోడ్ చేయడం... ఆ చానెల్ లింక్‌ని సోషల్ నెట్‌వర్కింగ్ ద్వారా బంధువులూ స్నేహితులతో పంచుకోవడం... ఇదీ అక్కడి ట్రెండ్. మామూలుగా అయితే యూట్యూబ్‌లో చానెల్స్ అంశాలవారీగా ఉంటాయి. అంటే... వ్యాయామం, వంటలు, యోగ, విద్య... ఇలా ఉంటాయి. వ్యక్తిగత వీడియో చానెల్స్‌కి అలాంటివేం లేవు. ఫలానా విషయం మీద మాత్రమే మాట్లాడుతూ వీడియో తీయాలనో... లేదా ఫలానా ప్రదేశంలో మాత్రమే తీసిన వీడియోలు అప్‌లోడ్ చేయాలనే పరిమితులను పెట్టుకోలేదు. రోడ్డు మీద వెళ్తున్నప్పుడు ఓ బొచ్చు కుక్క వింత చేష్టలు చేస్తూ కనిపిస్తే... వెంటనే వీడియో తీసి అప్‌లోడ్ చేసేయడం. కాలేజీలో స్నేహితులతో పిచ్చాపాటీ మాట్లాడుకుంటే... దాన్నీ అప్‌లోడ్ చేసేయడం. ఆ వీడియో విజ్ఞానదాయకంగా ఉండాలనీ సందేశాత్మకంగా ఉండాలనీ సరదాగా ఉండాలనీ రూల్ లేదు. నచ్చింది తీసేయడం... అప్‌లోడ్ చేసేయడం... ఇదే అక్కడి ట్రెండ్. మన యూత్‌కి ఈ కాన్సెప్ట్ బాగా నచ్చింది. పైగా, ఇప్పుడున్న స్మార్ట్‌ఫోన్లలో మంచి నాణ్యత గల వీడియోలు తీసుకునే అవకాశమూ తోడైంది. ఇంకేం... రెచ్చిపోతున్నారు.

ఎక్కువగా వారే

మహఫ్రీద్ ఇరానీ... ముంబై యువతి. మూడేళ్ల కిందట కుటుంబ సభ్యులతో కలసి రోలర్‌కోస్టర్ ఎక్కింది. దానిపై ప్రయాణిస్తున్నంతసేపూ వీడియో తీసింది. దాన్ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి సరదాగా స్నేహితులకు చెప్పింది. చూసినవాళ్లంతా 'వావ్' అంటూ కామెంట్లు పెట్టారు. ఇదేదో బాగుందని అక్కణ్నుంచీ తనకి నచ్చిన అంశాలను వీడియోలు తీయడం... అప్‌లోడ్ చేయడం... ఫేస్‌బుక్, ట్విటర్‌ల ద్వారా స్నేహితులతో పంచుకోవడం హాబీగా మార్చుకుంది. మరో కుర్రాడు షాహిల్ షా. అతడు నోరు విప్పితే నవ్వులే అంటారు స్నేహితులు. ఏ విషయాన్నైనా కాస్త హాస్యం జోడించి చెప్పడం మనోడి టాలెంట్. అలా వాగేసి ఓ 38 వీడియోలను తీశాడు. వాటిల్లో ఒకదాన్నైతే ఏకంగా ఐదున్నర లక్షలమంది చూశారు. అనీషా అనే యువతి ముంబై లైఫ్‌స్టైల్ మీద సరదాగా వీడియోలు తీస్తుంటుంది.

ఒక్క ముంబై అనే కాదు... ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూర్, హైదరాబాద్‌కి చెందిన కొంతమంది యూత్ ఇప్పుడు ఏం చెప్పాలనుకున్నా వీడియోల ద్వారానే చెప్పేస్తున్నారు. స్నేహితులతో ఆ వీడియోలను పంచేసుకుంటున్నారు. 'ఈ ఆదివారం మేము రోలర్ కోస్టర్ రైడ్‌కి వెళ్లాము... అని ఓ నాలుగు ఫొటోలు ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేయొచ్చు. అదే ఆ రైడ్ మొత్తాన్ని వీడియోగా తీసి ఫ్రెండ్స్‌తో పంచుకుంటే కలిగే ఫీల్ వేరు' అంటాడు హైదరాబాద్‌కి చెందిన సూర్య. 'వీడియోలను ఎడిటింగ్ చేయడానికి కాస్త సాంకేతిక పరిజ్ఞానం అవసరం. కాకపోతే అదేమంత సమస్య కాదు. కాసేపు ఇంటర్‌నెట్ ముందు కూర్చుంటేచాలు... చాలా సులువుగా నేర్చేసుకోవచ్చు' అంటాడు మరో ఔత్సాహికుడు. దేనికైనా ఒకటే సూత్రం బాస్... మనసుండాలి. మార్గం మనకే ఎదురౌతుంది! మన ఫీలింగ్స్ కూడా 100 శాతం కన్వే అయిపోతాయి.

కాలీఫ్లవర్... రుచి సూపర్!

రుచి అభిరుచి

కావలసినవి

కాలీఫ్లవర్: ముప్పావుకిలో, **నూనె:** 4 టేబుల్‌స్పూన్లు, **పాలపొడి:** 3 టేబుల్‌స్పూన్లు, **పంచదార:** పావుటీస్పూను

గ్రేవీ ముద్దకోసం

ఉల్లిపాయలు: రెండు, **అల్లం:** అర అంగుళం ముక్క, **వెల్లుల్లి రెబ్బలు:** మూడు, **పచ్చిమిర్చి:** 5

గరంమసాలాకోసం

దాల్చినచెక్క: అర అంగుళం ముక్క, **యాలకులు:** రెండు, **లవంగాలు:** రెండు

తయారుచేసే విధానం

కాలీఫ్లవర్ పూరెమ్మలను దేనికది విడదీయాలి. తరవాత వీటిని ఓ గిన్నెలో వేసి తగినన్ని నీళ్లు పోసి ఉప్పు వేసి ఉడికించాలి.

ఉల్లిముక్కలు, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి పేస్టులా చేయాలి.

ముప్పావు కప్పు నీళ్లలో పాలపొడి వేసి పేస్టులా చేయాలి.

బాణలిలో 2 టేబుల్‌స్పూన్ల నూనె వేసి ఉడికించిన కాలీఫ్లవర్ ముక్కలను మూడు నాలుగు నిమిషాలు వేయించి తీయాలి. తరవాత అందులోనే మిగిలిన రెండు టేబుల్‌స్పూన్ల నూనె వేసి ఉల్లిముద్ద, గరంమసాలా వేసి వేయించాలి. ఇప్పుడు పాలపొడి ముద్ద కూడా వేసి ఉడికించాలి. పాలపొడి ముద్ద పాలవిరుగుడులా అయ్యేవరకూ ఉడికించాలి.

ఇప్పుడు వేయించి తీసిన కాలీఫ్లవర్ ముక్కలు వేసి టీకప్పు నీళ్లు పోసి, ఉప్పు సరిచూసి సిమ్‌లో 5 నిమిషాలు ఉడికించాలి. గ్రేవీ చిక్కగా అయ్యాక ఇష్టమైతే పంచదార వేసి కలిపి దించాలి.

మలై కాలీఫ్లవర్

కావలసినవి

బంగాళాదుంపలు: 2, **కాలీఫ్లవర్ పూరెమ్మలు:** ఒకటిన్నర కప్పులు, **జీలకర్ర:** టీస్పూను, **ఇంగువ:** పావుటీస్పూను, **అల్లం, పచ్చిమిర్చి ముద్ద:** ఒకటిన్నర టీస్పూన్లు, **మెంతిఆకులు:** కప్పు, **చాట్‌మసాలా:** 2 టీస్పూన్లు, **నూనె:** టేబుల్‌స్పూను, **ఉప్పు:** రుచికి సరిపడా

ఆలూగోబీ

తయారుచేసే విధానం

* బంగాళాదుంపల పొట్టు తీసి, పొడవాటి ముక్కలుగా కోయాలి.
* బాణలిలో నూనె వేసి బంగాళాదుంపముక్కలు, కాలీఫ్లవర్‌ముక్కలు వేసి విడివిడిగా వేయించాలి. తరవాత బ్లాటింగ్‌పేపర్‌తో నూనె అద్ది పక్కన ఉంచాలి.
* నాన్‌స్టిక్‌పాన్‌లో కొద్దిగా నూనె వేసి జీలకర్ర, ఇంగువ వేసి వేగాక అల్లంపచ్చిమిర్చి ముద్ద వేసి ఓ నిమిషం వేయించాలి. తరవాత మెంతి ఆకులు వేసి వేయించాలి. ఇప్పుడు వేయించిన ఆలూ, గోబీ ముక్కలు వేసి చాట్‌మసాలా, ఉప్పు చల్లి కలపాలి. రెండుమూడు నిమిషాలు సిమ్‌లో వేయించి దించాలి.

కావలసినవి

కాలీఫ్లవర్: కిలో, **బంగాళాదుంపలు:** అరకిలో, **బఠాణీ:** అరకిలో, **ఉల్లిపాయలు:** ఐదు(ఒకటి చిన్న ముక్కలుగా కోయాలి, మిగిలినవి సన్నగా పొడవుగా కోయాలి), **నెయ్యి లేదా నూనె:** తగినంత, **కుంకుమపువ్వు:** అరటీస్పూను, **పెరుగు:** 2 టేబుల్‌స్పూన్లు

మసాలా ముద్దకోసం

దనియాలు: 2 టేబుల్‌స్పూన్లు, **అల్లం:** అంగుళంముక్క, **లవంగాలు:** 12, **కాశ్మీరీ మిర్చి:** 16

తయారుచేసే విధానం

కాలీఫ్లవర్ పూరెమ్మల్ని విడదీయాలి. బంగాళాదుంపలు పెద్ద ముక్కలుగా కోయాలి.

మసాలా ముద్దకోసం తీసుకున్నవన్నీ మెత్తగా నూరాలి. బాణలిలో 4 టేబుల్‌స్పూన్ల నూనె వేసి పొడవుగా కోసిన ఉల్లిముక్కలు వేసి వేయించాలి. తరవాత వీటిని ముద్దలా చేసి ఉంచాలి. ఇప్పుడు ఆ నూనెలోనే సన్నని ముక్కలుగా కోసిన ఉల్లిముక్కలు వేసి వేయించాలి. తరవాత మసాలా ముద్ద వేసి మూడు నాలుగు నిమిషాలు వేయించాలి.

కాలీఫ్లవర్ ముక్కలు, బంగాళాదుంప ముక్కలు, బఠాణీలు వేసి మూడు కప్పుల నీళ్లు పోసి మూతపెట్టి ఉడికించాలి. ముక్కలు ఉడికాక ఉల్లిముద్ద వేసి ఉప్పు వేసి ఉడికించాలి.

చివరగా పెరుగులో కుంకుమపువ్వు వేసి కలిపి, మృదువుగా చేయాలి. ఇప్పుడు ఇది కూరలో వేసి ఓ నిమిషం ఉడికించి దించాలి.

మొఘలాయీ కాలీఫ్లవర్

కావలసినవి

కాలీఫ్లవర్: అరకిలో, **టొమాటోగుజ్జు:** ఒకటిన్నర కప్పులు, **వెల్లుల్లిరెబ్బలు:** 13, **జీలకర్ర:** టీస్పూను, **మిరియాలు:** ఒకటిన్నర టీస్పూన్లు, **లవంగాలు:** నాలుగు, **అల్లం:** అంగుళం ముక్క, **ఆవాలు:** టీస్పూను, **పసుపు:** టీస్పూను, **కాశ్మీరీ కారం:** రెండున్నర టీస్పూన్లు, **కొత్తిమీర తురుము:** కొద్దిగా, **ఉప్పు:** తగినంత, **నూనె:** 5 టేబుల్‌స్పూన్లు

తయారుచేసే విధానం

కాలీఫ్లవర్ పూరెమ్మల్ని విడదీయాలి. కారం, పసుపు తప్ప మిగిలినవన్నీ మిక్సీలో వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తని ముద్దలా చేయాలి. తరవాత అందులోనే ఉప్పు, కారం, పసుపు వేసి కలపాలి.

ఇప్పుడు ఈ మసాలా ముద్దను ఒక్కో రెమ్మకీ పట్టించి ఒకటిన్నర గంటలపాటు నాననివ్వాలి. నానిన తరవాత కాస్త నీరు ఊరుతుంది.

నాని ఊరిన కాలీఫ్లవర్ ముక్కలను నీటితోపాటుగా బాణలిలో వేసి మూతపెట్టకుండా ఉడికించాలి. నీళ్లన్నీ ఆవిరైపోయాక దించాలి.

విడిగా ఓ బాణలిలో నూనె వేసి కాలీఫ్లవర్ ముక్కలు వేసి బాగా వేయించాలి. వేగాక టొమాటో గుజ్జు వేసి అది ముక్కలకు పట్టేవరకూ ఉడికించి దించాలి.

చివరగా కొత్తిమీరతో అలంకరిస్తే సరి.

చిల్లీ కాలీఫ్లవర్ రోస్ట్

ఆటవిడుపు

మీకు తెలుసా?

మన శరీరంలోని రక్తనాళాల పొడవు సుమారు లక్ష కిలోమీటర్లు.

జతచేయండి

ఇక్కడ ఆరుగురు డ్రైవర్లు ఉన్నారు. అయితే వారి తల భాగాల్లో సగం ఇతరులవి కలిపి ఉన్నాయి. ఏ రెండేసి కలిపితే అసలైన తలలు వస్తాయో చెప్పగలరా?



అమరిక

ఇక్కడ తొమ్మిది కీటకాలు ఉన్నాయి. అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్న ప్రతీ మూడింటి మధ్య ఒక పోలిక ఉంది. వాటిని గుర్తించండి.



ఎంత దూరం?

సీత ఇంటి దగ్గర నుంచి సైకిల్ మీద బయలుదేరి దక్షిణం వైపు ఎనిమిది కిలోమీటర్లు వెళ్లింది. అక్కడ నుంచి కుడివైపు తిరిగి అయిదు కిలోమీటర్లు వెళ్లి ఆగింది. తర్వాత కుడివైపు ఎనిమిది కిలోమీటర్లు వెళ్లి అక్కడనుంచి ఎడమవైపు పది కిలోమీటర్లు వెళ్లింది. ఇప్పుడు ఆమె ఇంటికి నేరుగా వెళ్లాలంటే ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించాలి?

ఈ వారం గేమ్

మీరెప్పుడైనా పియానో వాయించారా? లేదా... అయితే ఈసారి ఇంటర్నెట్ బ్రౌజ్ చేసేటపుడు మీరు fisherprice.com వెబ్‌సైట్ హోమ్ పేజీలోకి వెళ్లి games-&activities విభాగంలో lets play piano అని ఉంటుంది. దాన్ని సెలెక్ట్‌చేస్తే మీ మౌస్ సాయంతో సరిగమలు పలికించవచ్చు. అక్కడ పియానో మీద C, D, E, F, G, A, B, C అనే కీ నోట్స్ ఉంటాయి. వాటిపైన మౌస్‌ని క్లిక్ చేయాలి. అప్పుడు స్వరాలు వస్తాయి. ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, బాబా బాబా బ్లాక్ షీప్... లాంటి కొన్ని పాటలు ఉంటాయి. అక్కడున్న సూచనలతో ఆ పాటలకు మీరు పియానో వాయించవచ్చు. లేదంటే మీరే సొంతంగా కొత్త ట్యూన్లు పలికించవచ్చు. పియానోతో పాటు ఇంకా మీకోసం అక్కడ జంతువుల్ని అరుపులతో గుర్తుపట్టడం, తేడాల్ని గుర్తించడం, హైడ్ అండ్ సీక్... లాంటి చాలా రకాల ఆటలూ ఉన్నాయి.

తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాల్ని కనుక్కోండి.

తెలివైన తాబేలు

అడవిలో తాబేలు ఒకటి ఉండేది. అది నదిలో ఉన్నా బయటకు వచ్చినా పెద్ద జంతువులన్నీ హేళన చేసేవి, భయపెట్టేవి. దాంతో ఎప్పుడూ బిక్కుబిక్కుమంటూ గడిపేది. ఒకరోజు తాబేలు ఆహారం కోసం వెళ్తుండగా ఏనుగు వచ్చి తొండంతో దాని డిప్ప మీద నెమ్మదిగా నొక్కిపెట్టింది. వెనక్కు తిరిగి చూస్తే... 'భయ పడ్డావా చిట్టి తాబేలూ' అని నవ్వుతూ అడిగింది ఏనుగు.

భయాన్ని దాచేసి... 'నాకెందుకు భయం. నువ్వు నాకంటే పరిమాణంలో మాత్రమే పెద్ద. శక్తిలో చిన్నదానివే' అంది తాబేలు. ఆ మాట విన్న ఏనుగు కోపంతో... 'అయితే నీ శక్తి ఏపాటిదో నాకు చూపించు' అంది ఏనుగు. 'సరే నువ్వు రేపు ఉదయం రా' అని చెప్పి వెళ్లి, ఒక తాడు సంపాదించింది తాబేలు. దాన్ని పట్టుకొని ఉదయాన్నే నది ఒడ్డుకు వెళ్లి, రోజూ తనని వెక్కిరించే నీటిగుర్రాన్ని పిలిచింది. 'నువ్వు నాకంటే బలమైనదానివన్నావు. నువ్వు ఈ తాడు చివర పట్టుకో నేను అటు చివరకు వెళ్లి పట్టుకొని

లాగుతాను. ఎవరి బలం ఏమిటో తెలుస్తుంది' అని నీటి గుర్రానికి సవాలు విసిరింది తాబేలు. నవ్వుతూ తాడు అందుకుంది నీటి గుర్రం.

తాబేలు మరో కొన పట్టుకొని ఏనుగు దగ్గరకు వెళ్లింది. దాని తొండానికి రెండో కొన అందించి... 'నువ్వు ఈ చివర పట్టుకో. నేను అటువైపు వెళ్లి రెండో కొన లాగుతాను' అని చెప్పి రెంటికీ సమాన దూరంలో కూర్చొని 'తాడు లాగు' అని గట్టిగా అరిచింది. నీటిగుర్రం, ఏనుగు తాడును చెరోవైపు లాగాయి. ఎంతసేపు లాగినా తాడు రాకపోయేసరికి 'తాబేలుకి ఇంత బలం ఉందా' అనుకున్నాయి. చీకటి పడేసరికి రెండూ ఒకేసారి తాడును వదిలేశాయి. 'చూశావా నా బలం' తాబేలు గట్టిగా అనేసరికి రెండూ సిగ్గుతో వాటి దారిన పోయాయి. అప్పట్నుంచీ అవి హేళన చేయడం మానేశాయి. తాబేలు ధైర్యంగా బతికేది.

పట్టుకోండి చూద్దాం

ఇక్కడున్న రెండు బాగాల్లో పక్క భాగంలో లేని చాక్లెట్ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. వాటిని గుర్తించండి.



విప్పండి చూద్దాం

1. పుట్టి వారమైనా కదలదూ మెదలదూ... ఏమిటది?
2. చెట్టుకి కాయని కాయ. తియ్యగ ఉండే కాయ. ఏమిటో చెప్పండి?
3. చెట్టుకి వేలాడుతుంది. తేనెపట్టుకాదు. మనం ఎక్కి కూర్చుంటాం కొమ్మ కాదు? ఏమిటది?
4. అమ్మకి తమ్ముడు, ఆకాశంలో ఉంటాడు. ఎవరు?



రంగులేద్దాం

అంకెల వరుసలో చుక్కల్ని కలిపితే వచ్చే బొమ్మకు రంగులు వేయండి.

జవాబులు

తెలివైనవి?: (మడుసుసుంది) 1. అమ్మాయి మరణిస్తే అంకు ఆకైస్తు 2. గుహాశిఖరం ఉత్తర దారిన 3. అమ్మాయి ఇష్టి 4. అంతరిక్షాన్ని పైన ఉన్న మేఘాలు 5. గోడమీద కుట్టుకున్న అమ్మాయి బొమ్మ, 7. కళ్ళద్దాలకు కట్టుకున్న చెవి దగ్గర గుండ్రటి భాగం 8. చెట్టు చుట్టుతిరిగే కుక్కపిల్ల అమ్మాయి అమ్మాయి మేడపై చూపు తగలకుండా ఉంచి.

ఆమ్మరక: ఆగ్లం: 1. పిలం కళ్ళు 2. మనుషులకన్నా చూపు 3. ఆకాశం 2. రెక్కలు 3. పుక్కలు ఐమ్మా:

1. శరీర భాగాలపై ఉన్న 2. ఒకేచోటుండే పిందాలు.

జతపరుచుండి: 1-E, 2-C, 3-F, 4-B, 5-D, 6-A.

పిన్నింగ్ ఆగ్లం: 1. గుడ్లు 2. కళ్ళజోడు 3. ఊయల 4. పంచదారపాకం.

మిళ్లీకంగ ఆగ్లం: 1. YUM 2. CHOCO **ఎంత ఆగుంది?:** 15 కి.మీ.

యమధర్మరాజు... యమలోకానికి రాజు... అప్పుడప్పుడూ సినీ లోకానికి వస్తుంటాడు. ఫైట్లు చేస్తాడు... డాన్సులు చేస్తాడు... వీలైతే లవ్ కూడా చేస్తాడు. మొత్తానికి 'యముడు' మన సినిమాల్లో సుపరిచిత పాత్రధారి!

వెండితెరపై యమ ముద్ర!

యమలోకం... పాపులంతా వరుసగా నిలబడతారు. చిత్రగుప్తుడు పాపాల చిట్టా చదువుతాడు.

అది విని యముడు శిక్షలు విధిస్తాడు.

మామూలుగా అయితే యముడి బాధ్యత అదే! కానీ... తెలుగు సినిమాలకి వచ్చేసరికి యముడి ప్రపంచాన్నే మార్చేశారు రచయితలూ దర్శకులు. అసలు... యముడు యమలోకంలోనే ఎందుకుండాలి? ఏం, భూమ్మీదకి రాకూడదా? వస్తే ఎలా ఉంటుంది? ఇలాంటి ప్రశ్నల్లోంచి పుట్టిన యముడు ఎన్నో ఏళ్లుగా ఎన్నో సినిమాల్లో ఎంతోమంది నటుల రూపంలో మనకి కనిపిస్తూనే ఉన్నాడు. అలా పౌరాణికం నుంచి సాంఘిక చిత్రాలకు యముడి పాత్ర బదిలీ అయింది.

క్రెడిట్ ఆయనదే

సాంఘిక చిత్రాల్లోకి యమ ప్రవేశం 'దేవాంతకుడి'తో మొదలైందనే చెప్పాలి! ఎన్టీ రామారావు హీరోగా నటించిన ఆ చిత్రంలో ఎస్వీ రంగారావు యముడు. ఆ తరువాత కొన్నాళ్లకు అదే చిత్రాన్ని కాస్త అటూఇటూగా మార్చి 'యమగోల'గా తీశారని చెబుతారు. ఈ చిత్రంతో యముడి పాత్రకి ఓ చక్కని నటుడు దొరికాడు. అతడే కైకాల సత్యనారాయణ. 'యమగోల'లో యమధర్మరాజు, చిత్రగుప్తుడు భూలోకానికి వచ్చి... రకరకాల ఇబ్బందులు పడుతూ పండించిన హాస్యం ఎప్పటికీ మనం మరచిపోలేం. ఆ చిత్రంతోనే 'యముడు' అంటే సత్యనారాయణే అన్న ముద్రపడిపోయింది. యముడికి ప్రత్యేక బాడీ లాంగ్వేజ్‌నీ డైలాగులు చెప్పడంలో కొత్త స్టైల్‌నీ సత్యనారాయణే తీసుకొచ్చారు. కొన్నాళ్ల తరువాత 'యముడికి మొగుడు' చిత్రం వచ్చింది. మరోసారి యమ మాయాజాలం వర్కౌట్ అయింది. ఇందులోనూ యముడు వేషధారి సత్యనారాయణే. ఆ తరువాత కొన్నాళ్లపాటు 'యమ' విరామం తీసుకున్నాడు! యముడి పాత్రకి 'యమలీల' మళ్లీ కొత్త ఊపును తెచ్చింది. మళ్లీ సత్యనారాయణే యముడు. ఆ తరువాత కొన్ని సినిమాల్లో మళ్లీ యమదర్శనం కలిగినప్పటికీ... ప్రేక్షకులని అంతగా అలరించలేకపోయాడు.

ఆ తరవాత దర్శకుడు రాజమౌళి కూడా యముడిమీద ప్రయోగాలు చేశాడు. భారీ సెట్టింగులతో 'యమదొంగ'లో యమలోకాన్ని కళ్లముందుంచాడు. ఈసారి యముడు పాత్రధారి మోహన్‌బాబు. యముడు అంటే సత్యనారాయణే అన్న ముద్రని మోహన్‌బాబు దాడాపు మార్చేశారనే చెప్పాలి. ఎందుకంటే, 'యమదొంగ'లో అతడి నటన అంతగా అలరించింది. అదే చిత్రంలో జూ.ఎన్టీఆర్‌ని కూడా యముడి గెటప్‌లో చూపించాడు రాజమౌళి. నాటి ఎన్టీఆర్ చెప్పిన డైలాగుల్ని యంగ్ యముడితో చెప్పించి ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించగలిగాడు.

అదే సీజన్‌లో వచ్చిన 'యమగోల మళ్లీ మొదలైంది'లో కూడా యముడు ఓకే అనిపించుకున్నాడు. తాజాగా మళ్లీ 'యమ' హవా మొదలైంది. 'యమహో యమః' చిత్రంలో శ్రీహరి యమ పాత్రధారి. మరోచిత్రంలో తారకరత్న కూడా యముడిగా నటించనున్నాడు.

పేరులో ఉండాల్సిందే

విచిత్రం ఏంటంటే... యముడి పాత్ర ఉన్న సినిమాలన్నింటికీ 'యమ' శబ్దం ఉన్న పేర్లనే పెడుతున్నారు! అప్పట్నుంచీ ఇప్పటివరకూ ఒకటో రెండో సినిమాలు తప్ప... అన్ని సినిమాలూ 'యమ'తో మొదలైనవే. తెలుగు సినిమాల్లో యముడు కామెడీ చేస్తాడు. ఇంకాస్త ముందుకెళ్లి... రొమాన్స్, ఫైటింగులు, డాన్సులు చేయించిన దర్శకులూ ఉన్నారు. యమ పాత్రధారులు మారుతున్నా యముడి వేషధారణా వాచకం మాత్రం ఒకలానే ఉంటున్నాయి. యమ పాత్రకి సత్యనారాయణ 'యముండ' అనే ఊత పదాన్ని తీసుకొచ్చి... దాన్నే ఓ బ్రాండ్‌గా మార్చేశారు. ఆ డైలాగుని 'యమగోల' చిత్రంలో యముడి పాత్రకి రాసిన ఘనత డి.వి.నరసరాజుదే. నరసరాజు నాటక ప్రియులు. ఓసారి 'సావిత్రి' నాటకం చూస్తుండగా అందులో యముడి పాత్రలో నటించిన వేమూరి గగ్గయ్య 'యముండా' అంటుండటం ఆయనకి నచ్చింది. దాన్నే సినిమాల్లోకి తెచ్చారు. ఆ తరువాత వచ్చిన యములందరిపైనా ఎక్కడోచోట సత్యనారాయణ ప్రభావం కచ్చితంగా ఉందనే చెప్పాలి. మొత్తానికి యముడు... సినీ ఫ్రెండ్లీగా స్థిరపడిపోయాడు. యముడి పక్కనే ఉండే చిత్రగుప్తుడు కూడా సినీ ఫ్రెండ్లీనే. నాటి అల్లు రామలింగయ్య నుంచీ నేటి బ్రహ్మానందం, ఎమ్మెస్ నారాయణ వరకూ ఆ పాత్రా మనకి సుపరిచితమైపోయింది. ★

పాముల పల్లె

అరవైఏళ్ల క్రితం థాయిలాండ్ సమీపంలోని ఆ గ్రామం ఎలాంటి అభివృద్ధికీ నోచుకోకుండా ఒక మూలన పడుండేది. సరిగ్గా అప్పుడే గ్రామంలోని ఒక డాక్టరుగారికి మహత్తరమైన ఐడియా వచ్చింది. అది ఆ గ్రామ స్వరూపాన్నే మార్చేసింది. పెంపుడు కుక్కలూ పిల్లులను పెంచినట్టుగా పాములను పెంచమని గ్రామస్తులకు గొప్ప సలహా ఇచ్చాడాయన. ఊరినిండా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన పాములను చూడటానికి టూరిస్టులు క్యూ కట్టారు. దాంతో గ్రామ స్వరూపమే మారిపోయింది. కింగ్ కోబ్రాలూ పైథాన్లే పెంపుడు పాములుగా గ్రామం కళకళలాడుతోంది. ముఖ్యంగా పాములతో బాలలు చేసే సాహస కృత్యాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షించి కరెన్సీ వర్షం కురిపిస్తున్నాయి. దాంతో గ్రామ ఆర్థిక పరిస్థితి ఎక్కడికో వెళ్లిపోయింది. ఒక ఐడియా ఎందరి జీవితాలనో మార్చేసింది కదా!

సింగ్ ఈజ్ క్వీన్!

అమెరికా యూనివర్సిటీలో సైకాలజీ చదువుతోన్న సిక్కు యువతి బల్‌ప్రీత్ కౌర్. గడ్డాలూ మీసాలతో ఉన్న కౌర్ సిక్కు అబ్బాయిలా తలమీద కృపాణం కూడా ధరిస్తోంది. కౌర్‌కు తెలియకుండా ఆమె ఫొటో తీసిన ఒక ఆకతాయి దాన్ని నెట్‌లో పెట్టి అవమానకరంగా కామెంట్లు రాశాడు. 'ఇలా ఉన్నందుకు నేనేమీ సిగ్గుపడటం లేదు. పైగా జుట్టు కత్తిరించుకోవడం సిక్కు సంప్రదాయం కూడా కాదు. మనిషిలోని ఆత్మ విశ్వాసానికి కృపాణం ప్రతీక. బాహ్య సౌందర్యం కోసం సిక్కుల ఆచార వ్యవహారాలకు తిలోదకాలు ఇవ్వలేను' అని ఘాటుగా స్పందించింది కౌర్. దాంతో సిక్కు మత పెద్దల ఆదరాభిమానాలనే కాదు... ఆకతాయి నుంచి క్షమాపణలనూ అందుకుంది.

గుండుతో వ్యాపారం

శతకోటి వ్యాపారాలకు అనంతకోటి ఉపాయాలని బలంగా నమ్మిన బ్రాండన్ చికాట్స్‌కీ గుండునే వ్యాపార ప్రచారానికి వాడేస్తున్నాడు. రోజుకు సుమారు పదిహేడు వేల రూపాయలు చెల్లిస్తే చాలు గుండు మీద వేయించుకున్న కంపెనీ లోగో టాటూతో ఆస్టిన్, టెక్సాస్‌లలో చకచకా తిరిగి అందర్నీ ఆకర్షిస్తున్నాడు. ఇరవైఏడేళ్లకే జుట్టును కోల్పోయిన బ్రాండన్ బాధపడుతూ ఖాళీగా కూర్చోలేదు. రోజుకో కంపెనీ లోగో టాటూ వేయించుకుని ఆరుగంటలు ఆనందంగా ప్రచారం చేసేస్తున్నాడు. అంతేకాదు పని బాగా పెరగడంతో తనలాంటి మరో ఇద్దరిని కూడా వ్యాపారంలో భాగస్వాములుగా చేర్చుకున్నాడు. ఇప్పుడు తన వ్యాపారాన్ని మరింత విస్తరించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు బ్రాండన్.

క్యాలెండర్ బాయ్స్

కొత్త సంవత్సరం అనగానే క్యాలెండర్ గుర్తుకొస్తుంది. క్యాలెండర్ అంటే తమ అందచందాలతో చూపరులకు కనువిందు చేసే అమ్మాయిలు కళ్లముందు మెదులుతారు. కానీ తనకు మాత్రం, అర్ధనగ్నంగా ఉండే అమ్మాయిలు లేదా అబ్బాయిల చిత్రాలను క్యాలెండర్‌లో చూసిచూసి బోరు కొట్టేసిందంటున్నాడు ఆడమ్ కోహెర్. అందుకే చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డ పన్నెండు మంది అబ్బాయిలను ఎంచుకుని సరికొత్తగా క్యాలెండర్‌ను రూపొందించాడు. 'కళ్లు తిప్పుకోలేనంత అందంగా ఉన్నవాళ్లే కాదు సాదాసీదాగా ఉన్న యువకులూ మోడలింగ్‌లో రాణించగలరని నిరూపించడమే నా ధ్యేయం' అంటున్నాడు ఆడమ్.



బాబోయ్ సిగరెట్

ధూమపాన వ్యతిరేక చట్టాలను కఠినంగా అమలుచేస్తోంది ఆస్ట్రేలియా. దీనిలో భాగంగా పొగతాగడం వల్ల వచ్చే భయంకరమైన వ్యాధుల గురించి బొమ్మలతోసహా సిగరెట్ ప్యాకెట్ల మీద స్పష్టంగా ముద్రిస్తోంది. రాబోయే ప్రమాదాలను ఇంత చక్కగా చెప్పాక ఎవరు మాత్రం సిగరెట్‌ను వెలిగించగలరు చెప్పండి? కాస్త ధైర్యంచేసి ఎవరైనా స్టయిల్‌గా అలా రింగురింగులుగా పొగను గాలిలోకి వదలాలన్నా సిగరెట్ పెట్టె మీద బొమ్మలు కలలోకి వచ్చిమరీ భయపెట్టేలా ఉన్నాయి.

రాశి ఫలం

గ్రహబలం (డిసెంబరు 16 - 22)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

భవిష్యత్ ప్రణాళికలు వేస్తారు. చేపట్టిన పనుల్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా విజయం సాధిస్తారు. బంధుమిత్రులను కలుసుకుంటారు. ఒక శుభవార్త వింటారు. మీ ప్రతిభకు గుర్తింపు దక్కుతుంది. అధికారులు మీకు అనుకూలంగా వ్యవహరించక పోవచ్చు. వాళ్లతో సర్దుకుపోవడమే మంచిది. అనవసరంగా కలహాలు వచ్చే సూచనలున్నాయి. దైవారాధన మరిచిపోవద్దు.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

సొంతింటి కలను నెరవేర్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. చేపట్టే పనుల్లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రయత్నం మానరు. ఒక వార్త మీకు బాధ కలిగిస్తుంది. స్థానచలన సూచనలున్నాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. గతంలో నిర్లక్ష్యం చేసిన అనారోగ్య సమస్యలు ఇప్పుడు కాస్త ఇబ్బంది పెడతాయి. దుర్గాదేవి ఆరాధన సత్ఫలితాలనిస్తుంది.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఎలాంటి పరిస్థితుల్లోనూ మనోధైర్యాన్ని కోల్పోరు. మీపై పైచేయి సాధించాలని శత్రువులు చేసే ప్రయత్నాలేవీ ఫలించవు. కుటుంబ వాతావరణం అంత అనుకూలంగా ఉండకపోవచ్చు. అవసరానికి డబ్బు చేతికి అందుతుంది. ఒక వార్త మీకు మనస్తాపాన్ని కలిగిస్తుంది. భోజన సౌఖ్యం ఉండకపోవచ్చు. ఖర్చులు పెరుగుతాయి. శ్రీహరి ఆరాధన చేస్తే మంచిది.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

చేపట్టిన పనుల్లో చిన్నచిన్న ఆటంకాలు ఎదురైనా విజయం సాధిస్తారు. భవిష్యత్ ప్రణాళికలు వేసి, అమలు చేసే ప్రయత్నాలూ ప్రారంభిస్తారు. ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయి. బంధుమిత్రుల్లో మీ గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. స్థానచలన సూచనలున్నాయి. ఒక శుభవార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

పరిస్థితులు మీకు అనుకూలంగా మారతాయి. చేపట్టిన పనుల్లో చిన్నచిన్న ఇబ్బందులున్నా కష్టపడి అధిగమిస్తారు. ఒక శుభవార్త మీ ఇంట్లో ఆనందాన్ని నింపుతుంది. కీలక సమయాల్లో బుద్ధిబలంతో విజయం సాధిస్తారు. ధార్మిక కార్య క్రమాల్లో పాల్గొంటారు. చెడ్డపనుల మీదకు మనసు మళ్లుతుంటుంది. ఉద్యోగులకు స్వస్థానప్రాప్తి సూచనలున్నాయి. అస్థిరబుద్ధి, అలసట.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

కీలక విషయాల్లో చాకచక్యంగా వ్యవహరించి అందరి మన్ననలూ పొందుతారు. ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయి. ఆరోగ్యం సహకరిస్తుంది. కుటుంబంలో చిన్నపాటి అభిప్రాయ భేదాలు వస్తాయి. అధికారుల వ్యవహారశైలి మీకు కోపాన్ని తెప్పిస్తుంది. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. సొంతింటి ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధుమిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. భవిష్యత్ ప్రణాళికలు వేస్తారు. అవసరానికి డబ్బు చేతికి అందుతుంది. మీ పనితీరుకు ప్రశంసలు లభిస్తాయి. నిర్ణయాలు తీసుకోవడంలో చంచలబుద్ధిని ప్రదర్శిస్తారు. కోపం తగ్గించుకుంటే పరిస్థితులు మీకు అనుకూలంగా మారతాయి. ఒక శుభవార్త, ఒక దుర్వార్త వింటారు. దైవారాధన మానకండి.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

కీలక సమయాల్లో మనోధైర్యాన్ని ప్రదర్శిస్తారు. పరిస్థితులను మీకు అనుకూలంగా మార్చుకోగలుగు తారు. ఒక ముఖ్యమైన విషయంలో సందిగ్ధం తొలగకపోవచ్చు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఎదురైనా అధిగమించే ప్రయత్నం చేస్తారు. భోజన సౌఖ్యం ఉండకపోవచ్చు. శివారాధన మంచిది.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఒక ముఖ్యమైన విషయంలో పురోగతి కనిపిస్తుంది. ఒక సంఘటన మీకు కాస్త బాధ కలిగిస్తుంది. బంధుమిత్రులతో కలహాలు వచ్చే సూచనలున్నాయి కాబట్టి మాట్లాడే టప్పుడు జాగ్రత్త. ఆర్థికంగా ఇబ్బందులుండవు. ఆదాయానికి తగ్గట్టే ఖర్చులుంటాయి. భూసంబంధ వ్యవహారం ఒక కొలిక్కి రాకపోవచ్చు. దైవారాధన తప్పకుండా చేయాలి.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఒక శుభవార్త వింటారు. ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారు. మీ పనితీరుకు పైఅధికారుల లేదా పెద్దల ప్రశంసలు లభిస్తాయి. ఆరోగ్యం అన్నివిధాలా సహకరిస్తుంది. కీలక సమయాల్లో ఆర్థికంగా ఇబ్బందులు తొలగి, డబ్బు చేతికి అందుతుంది. శారీరక బలం ఇనుమడిస్తుంది. బంధువులను ఆదరిస్తారు. చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

చేపట్టే పనుల్లో కొన్ని ప్రతికూలతలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగుతారు. చేయని తప్పుకు అపవాదు ఎదుర్కోవాల్సి రావొచ్చు. శుభకార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక శుభవార్త మీ మనోధైర్యాన్ని పెంచుతుంది. ఖర్చులు అదుపు తప్పే సూచనలున్నాయి. కుటుంబ సభ్యుల్లో ఒకరి అనారోగ్యం మీకు కాస్త ఆందోళన కలిగిస్తుంది. ఆంజనేయారాధన శ్రేయస్కరం.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

పరిస్థితులు మీకు కాస్త అనుకూలంగా మారతాయి. చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు స్థానచలన సూచనలున్నాయి. ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది. ఒక ముఖ్యమైన వ్యవహారంలో నిర్ణయం మీకే అనుకూలంగా వస్తుంది. బంధువులతో ఒక విషయమై మాటపట్టింపులు వచ్చే అస్కారముంది. దైవారాధన మర్చిపోవద్దు.

సమీక్ష

కదిలించే కథలు

రంగనాథ రామచంద్రరావు కథల సంపుటి 'నేనున్నానుగా' పాఠకులను ఆకట్టుకుంటుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్వీయ ప్రాణరక్షణ మీద ఉన్న ధ్యాస ఇతరులను రక్షించడం మీద ఉండదు. దీనికి భిన్నంగా 'నేనున్నానుగా' అంటూ కదలలేని మామగారికి అండగా నిలిచిన విశాలాక్షి కథ గుండె తలుపులు తడుతుంది. 'ప్రేమిస్తావా, ఆసిడ్ మీద పొయ్యనా' అన్న సంస్కృతి ఉన్న ఈ రోజుల్లో అన్నపూర్ణమ్మ చూపించిన పరిష్కారం ఏమిటో తెలుసుకోవడానికి 'దేవుడిసాక్షిగా' చదవాలి. 'తెలుగోళ్ళ పేర్లు పెట్టకుండా తెల్లోళ్ళ పేరు ఎందుకు పెట్టావు?' అని మునిమనవడు థామస్ మన్రో అడిగిన ప్రశ్నకు జవాబు 'థామస్ మన్రో మళ్ళీ చచ్చిపోయాడు' కథలో దొరుకుతుంది. తెల్లదొరల రాజ్యమే నయమనిపించేలా నల్లదొరల రాజ్యం ఉందన్న సందేశం ఈ కథలో అంతర్లీనంగా ఉంది. వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన పరిస్థితుల్లో... ఓ రోగి అనుభవించే బాధే 'ఇంకా ఎంతకాలం...'.

నేనున్నానుగా; రచన: రంగనాథ రామచంద్రరావు; పేజీలు: 112; వెల: రూ.60/–
ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 040-27678430

– *పాలంకి సత్యనారాయణ*

సంవేదన

కాశీభట్ల వేణుగోపాల్ 'నికషం' తాత్త్విక కోణంలో సాగుతుంది. ప్రతీకాత్మక పాత్రలూ భావాలతో వినూత్నంగా అనిపిస్తుంది. రామసూరి అనే అలెక్స్, దుర్గ, కథకుడు - ఈ మూడు పాత్రల చుట్టూ తిరుగుతుంది. మూడు పాత్రలూ వాస్తవం-భ్రమ అనే మజిలీల మధ్య సాగించిన ప్రయాణమే ఈ నవల. మధ్యతరగతి జీవితాల్లోని సందిగ్ధతలూ ప్రేమా

ఉద్వేగాలూ వ్యక్తిత్వాల్లోని పార్శ్వాలూ మనసుల మార్మికతా జీవనయానంలోని భిన్నకోణాలూ... ఇలా ఎన్నో అంశాల్ని నవల స్పృశిస్తుంది. ఆవేదనాపూరితమైన చింతనా ధోరణి నవలికలో అంతర్లీనంగా ప్రవహిస్తుంటుంది. ప్రతి పాత్రపట్లా సానుభూతి భావన కలుగుతుంది. అలెక్స్ పాత్ర గాఢమైన చింతనకూ మనసుపొరల్లో గూడుకట్టిన అస్తిత్వ వాద భావజాలానికీ అద్దంపడుతుంది.

నికషం
రచన: కాశీభట్ల వేణుగోపాల్
పేజీలు: 124; వెల: రూ.70/–
ప్రతులకు: సాహితీ మిత్రులు
28-10-26/1, అరండల్‌పేట, విజయవాడ.

– *కావూరి వంశీవిద్యత్*

గ్రహాంతర విహారం

కలలో కనిపిస్తూ రారమ్మని పిలిచే కుజగ్రహ సుందరి చేయి అందుకోడానికి...మధ్య ఆసియా

లోని ఇండికా సెంట్రల్ వర్సిటీలో బయోమెడికల్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఒక యువకుడు చేసిన ప్రయాణమే ఈ నవల. కథంతా నాలుగో సహస్రాబ్ది నేపథ్యంగా సాగుతుంది. అప్పటికి భూమ్మీద రెండు అణుయుద్ధాలు జరిగుంటాయి. రెండు సార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, చాలా భాగం నాశనమైపోయి ఉంటుంది. మనుషులు గ్రహాంతర యాత్రలు చేస్తుంటారు. ధనవంతులైతే ఇతర గ్రహాలకు వలసవెళ్లి కాలనీలు కట్టుకుని జీవిస్తుంటారు. అలాంటి కాలంలో భూమి మీద మిగిలిన కొందరిలో ఈ ఇంజినీర్ ఒకడు. 'మరి, రాకుమారిని కలుసుకున్నాడా? ఆమె ఎందుకు పిలిచింది?' తదితర ప్రశ్నలకు సమాధానం కావాలంటే ఈ నవల చదవాల్సిందే. కల్పనకు శాస్త్ర విజ్ఞానాన్ని జతచేయడంలో రచయిత ప్రతిభ కనబరిచారు.

కుజుడి కోసం...; రచన: చిత్తర్వు మధు
పేజీలు: 227/–; వెల: రూ.150/–
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచిగూడ
హైదరాబాద్.

– *పాటిబండ్ల శ్రీనివాస్*

హృదయావిష్కరణ

ఫ్రెంచి పాలన ముగిసి కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన యానాం కేంద్ర బిందువుగా స్థానీయతా స్పృహతో రాసిన 18 కథల సంపుటి ఇది. విదేశీ పాలనకూ తదనంతర కాలానికీ చెందిన రాజకీయ, ఆర్థిక సామాజికాది పరిస్థితులు ఇందులో ప్రతిబాన్వితంగా చిత్రితమయ్యాయి.

లోగడ 'యానాం చరిత్ర' రచించిన దాట్ల దేవదానం రాజు వీటికి ఆద్యంతం ప్రామాణికత చేకూర్చారు. ఇతివృత్తం, పాత్రచిత్రణ, కథనం, శైలి ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. ఫ్రెంచి దొర బంగ్లాపై మువ్వన్నెల జెండా ఎగరవేసి వారి తుపాకులకు బలైన బాపన్న త్యాగం; నౌకరీ కోసం కొడుకు అప్షన్ విధానం కింద ఫ్రాన్స్ వెళ్తానంటే బతకనని హెచ్చరించి ప్రయాణం ఆపగలిగిన శారదమ్మ ముందుచూపు; తలభాగం యానాం వైపూ మొండెం నీలపల్లి (తూ.గో.జిల్లా) వైపూ ఉన్న శవం గురించి ఎవరు చర్య తీసుకోవాలో తెలియని పోలీసుల సంకటస్థితి - ఇలా ఎన్నెన్నో పార్శ్వాలను పాఠకులు ఉద్విగ్నతతో దర్శిస్తారు. సమగ్ర స్థానీయతా ముద్రకి ఈ గ్రంథం మచ్చుతునక.

యానాం కథలు
రచన: దాట్ల దేవదానంరాజు
పేజీలు: 168; వెల: రూ.100/–
ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ పుస్తక కేంద్రాలు.

– *జి.రా.*

బుక్‌షెల్ఫ్

బుద్ధుని ధర్మోపదేశం
(ప్రవచనాలు)
రచన: కొల్లా భాస్కరరావు
పేజీలు: 54; వెల: రూ.10/–
ప్రతులకు: ఓమ్ ఆర్ట్ ప్రింట్
జె.డి.హాస్పిటల్ రోడ్, గవర్నరుపేట, విజయవాడ.

శతాయుష్మాన్ (చరిత్రపుటల్లో ఒక 'ఊరు-రైతు' కథ)
రచన: కృష్ణ సాయిరామ్; పేజీలు: 78; వెల: రూ.100/–
ప్రతులకు: వేగేశ్న సోమరాజు మెమోరియల్ ట్రస్ట్, సోమరాజుగారి గరువు, కాళ్ళకూరు-534 237, కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జి॥.

శ్రీకృష్ణలీలామృతం (మధుర కథాసుధలు)
రచన: తాడిమేటి వెంకట సత్యనారాయణ; పేజీలు: 118; వెల: రూ.90/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

తెలుగు పత్రికలు-తీరుతెన్నులు
రచన: జి.యస్.వరదాచారి; పేజీలు: 167; వెల: రూ.150/–
ప్రతులకు: వయోధిక పాత్రికేయ సంఘం, ప్లాట్ నం.24
జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నం.3, బంజారాహిల్స్, హైదరాబాద్.

భారతీయ లహరి
రచన: జానమద్ది హనుమచ్ఛాస్త్రి
పేజీలు: 120; వెల: రూ.80/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

మహా 'ఆత్మ' బోధ
రచన: శ్రీరంగం గోపాలాచార్యులు
పేజీలు: 63; వెల: రూ.30/–
ప్రతులకు: రచయిత
ప్లాట్ నం.14, వివేకానగర్
ప్రసన్నాంజనేయస్వామి గుడి దగ్గర,
జిల్లెలగూడ, హైదరాబాద్-500 097.

పదవినోదం-1121



ఆధారాలు

అడ్డం:

1. ఆలోచన (3)
3. విజ్ఞాపన (3)
5. క్రిస్మస్‌నాడు జన్మించిన మాజీ ప్రధాని? (4)
7. ఆశీస్సు (3)
8. మొసలి (3)
10. యమునను పిలవండి! (3)
12. విష్ణుచక్రం (4)
13. ముమ్మరం (3)
14. మీ అందరిలో (2)
16. హతమారుస్తావా? (4)
19. డప్పు కొట్టి అందరికీ తెలియజెప్పు (3)
21. మెడలో ధరించే బంగారు వస్తువు (3)
23. కుంతి సవతి? (2)
24. నందిని తన పేరులో ఇముడ్చుకున్న ఊరు! (4)
27. గుర్రం (3)
29. రాయబారి (2)
30. నొసలు (3)
32. మంచు (3)
35. ఇంద, ఇది తీసుకో! (3)
36. ప్రణవనాదం అంటే? (1)
37. ఆవహించు (2)
38. కుతూహలం, అపేక్ష (2)
39. గాలించు, అన్వేషించు (3)
41. అవకాశం (2)
42. యశోద భర్త (3)
43. విజృంభించు (4)
46. సిద్ధం (3)
47. లభించు (2)
48. క్షీరం (2)

నిలువు:

1. విదియ తరవాత? (3)
2. సువాసన కోసం మాంసాహార వంటల్లో ఉపయోగించే ఆకులు (3)
3. మదిలో (4)
4. విమర్శిస్తూ చేసేవి? (4)
5. ఏడు రోజులు (2)
6. కయ్యాలమారి (4)
9. చూడం (2)
11. సమాప్తి (3)
14. ఇవి మీ వస్తువులా? (2)
15. అమలుపరచు (3)
16. గంధం (3)
17. సరికొత్తగా (3)
18. వెలుగు మరోవిధంగా (4)
20. కొండ (2)
22. మద్యం (2)
23. తల్లి (2)
25. మద్దెల చప్పుడు (4)
26. జీవించు (2)
28. దుముకు (2)
29. దగ్గర కాదు! (2)
31. శకుంతలను చేపట్టినవాడు (4)
33. ఆంగ్లంలో నీడ; అపరాధ పరిశోధక నవలల్లో ఒక కథానాయక పాత్ర! (2)
34. రానని చెప్పండి! (2)
35. అతడు కాదు (3)
37. విరులు (2)
39. వేణువు కోసం ఉపయోగపడే మొక్కలు (3)
40. ఒక రాశి (2)
41. తీర్మానం, ఓడిపోవు (2)
42. తలకిందుల యానం! (2)
43. చాకుతో పైన తోలు తీయు (2)
44. ధర (2)
45. అటు ఇటు ఊగు, నిలబడలేక పడిపోవు (2)

సుడొకు-165

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

	8		1		4	7		9
		3		6				
5			7					6
	2	8						3
		7				8		
3						1	2	
8					1			7
				4		6		
4		1	9		6		3	

సమాధానాలు

పదవినోదం-1120

1 అం	2 కె	లు		3 వా		4 వి		5 వి		6 తా	7 వి
	ర		8 గ	యు	డు		9 ఎ	న్నా	ళ్లు		ష్ణు
10 అ	టం	11 కం		పు		12 ఎ	లు	క		13 లే	పు
మె		14 గా	యం		15 పు	రు	ను		16 శా	ఖ	
	17 అ	రు		18 న	లు	పు		19 చె	ర		20 భూ
21 తా	మ		22 చే	లు	పు		23 జ		24 ద	25 శ	మి
	26 ల	క్ష్మ	ణు	డు		27 న	లు	వ		కు	
28 శా	కం		పు		29 వ		బు		30 మ	వి	31 ష
ర్దు		32 క్షే		33 చె	న్నె	34 ల		35 చె	రో		టో
36 లం	37 క		38 జా	లి		39 శో	స	రు		40 జ్ఞ	
	41 ల	బ్ధి		42 తి	43 న	ను		44 పు	45 రు	లు	46 ఎ
47 పె	రా		48 క్షీ		ది		49 క్లా		డ్డు		లా

సుడొకు-164

1	6	5	7	3	2	8	9	4
7	3	2	4	9	8	1	5	6
9	8	4	1	6	5	2	7	3
5	1	3	9	8	6	7	4	2
4	7	8	2	5	1	3	6	9
2	9	6	3	7	4	5	8	1
3	4	7	8	2	9	6	1	5
8	5	9	6	1	3	4	2	7
6	2	1	5	4	7	9	3	8

అత్యాధునిక సేద్యం అన్నదాత తోనే సాధ్యం



- ఆయా సీజన్లకు, నేలలకు అనువైన పంటల ఎంపిక-సాగు వివరాలు
- కూలీల సమస్యలనధిగమించే ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు
- ప్రగతిపథంలో నడుస్తున్న అభ్యుదయ రైతుల అనుభవాలు
- సమగ్ర సస్యరక్షణ, సమగ్ర ఎరువుల వాడకం
- సాగునీటి పొదుపు మార్గాలు
- పంటమార్పిడి విధానాలు, అంతరపంటల సాగుతో లాభాలు
- రైతుల సందేహాలు తీర్చే జాబులు - జవాబులు
- స్వయం ఉపాధి పథకాలు, పెరటి తోటల పెంపకం
- పాడి, పట్టు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, చేపలు, రొయ్యలు, పుట్టగొడుగుల పెంపకంపై సమగ్ర వివరాలు
- పంటల ఎగుమతులు, రాయితీలు , బీమాలపై ప్రత్యేక అంశాలు

అన్నదాత డైరీ
చందాదారులకు మాత్రమే లభించే ప్రత్యేక కానుక

డిసెంబరులోగా
అన్నదాత సంవత్సర చందా రూ.150 లు చెల్లించండి.
నెలనెలా అన్నదాత సంచికలను పొందడంతో బాటు వ్యవసాయ సమగ్ర సమాచారదర్శిని
అన్నదాత 2013 డైరీని అందుకోండి

చందాను మీ సమీపంలోని 'ఈనాడు' కార్యాలయంలో గానీ, 'ఈనాడు ఏజెంటు'కు గానీ లేదా మీ వద్దకు వచ్చే మా ప్రతినిధికి గానీ చెల్లించి **'అన్నదాత 2013 డైరీ'ని** పొందండి.

చందాను మాకు నేరుగా పంపేవారికి డైరీని 'రిజిష్టర్ పార్శిల్'గా పంపిస్తాం. దీనికోసం అదనంగా రూ.60లు కలిపి, మొత్తం రూ.210లు పంపించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని మనియార్డర్ లేదా డీడీ ద్వారా పంపించండి. దానితోపాటు మీ పూర్తి చిరునామానూ, పిన్‌కోడ్‌నూ స్పష్టంగా పేర్కొనడం మరచిపోకండి.

మీ చందాను పంపాల్సిన మా చిరునామా:

మేనేజర్, 'అన్నదాత',
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-500 082

RAMOJI GROUP

www.kalanjali.com

క్రిస్మస్.. న్యూ ఇయర్
వేడుకల హోయలు..
కళాంజలి చీరెల్లో
స్వాగతాల లయలు..

బంగారానికి తావి అబ్బితే ఎలా ఉంటుంది?
కళాంజలి చీరలో కాంతులు చిమ్మే మీరు -
క్రిస్మస్.. న్యూ ఇయర్ వేడుకలకు
స్వాగతం పలికినట్లుగా ఉంటుంది!
అందానికి మరో పేరైన మీరు -
కళాంజలి వస్త్రాలలో కనువిందు చేసే ఆ తీరే వేరు!
రానున్న వేడుకల కోసం రమ్యమైన వైవిధ్యాలు
కళాంజలిలో కొలువుదీరి ఉన్నాయి..
నేడే విచ్చేయండి.. క్రిస్మస్.. న్యూ ఇయర్ సంబరాల
సింగారాల్ని మీ కళాంజలిలో ఆరంభించండి..
అందరి దృష్టినీ అన్నుల మిన్నగా ఆకర్షించండి!

ఫ్లాట్ 15%* తగ్గింపు
2012 డిసెంబర్ 15 - 2013 జనవరి 14

*Conditions Apply

RK SWAMY BBDO 0481

హైదరాబాదు: • సైఫాబాద్: ఫోన్: 040 23231147 / 23423440
• కూకట్‌పల్లి: ఫోన్: 040 23056813 / 14
విజయవాడ: • లబ్బీపేట్, ఫోన్: 0866 2496464
వైజాగ్: • అసిల్‌మెట్ట జంక్షన్, ఫోన్: 0891 2577905
తిరుపతి: • రేణిగుంట రోడ్, ఫోన్: 0877 2238820

www.kalanjali.com

KALANJALI®
Our weaves are our worship
SARIS | SALWAR KAMEEZ | KIDS' WEAR | MEN'S WEAR

ఈనాడు
ఆదివారం
23 డిసెంబరు 2012

మన పలుకులు...
పూతరేకులోయ్!



టాటా... వీడుకోలా..!

అమ్మాయిలు కత్తిపట్టారంటే...

ఎప్పుడూ డాన్సులు చేస్తూ డైలాగులు చెప్పే హీరోయిన్లు... అప్పుడప్పుడూ కథను బట్టీ కదనరంగంలోకి దిగుతుంటారు. ఫైటింగులు చేస్తుంటారు. 'యాక్షన్' అనగానే ఫైటింగ్ వచ్చేయదు కదా. అందుకే కొన్ని యుద్ధ విద్యల్లో శిక్షణ కూడా తీసుకుంటారు. అలా కొన్ని రకాల యుద్ధ విద్యలపై పట్టుసాధించిన హీరోయిన్లలో కొందరు ఏమంటున్నారో చూద్దాం.

ఫైటుకి సిద్ధం

'హీరోయిన్ అన్నాక గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం నాకు ఇష్టం లేదు. కేవలం డాన్సులు నేర్చుకుంటే చాలు అని నేను అనుకోవడం లేదు. అందుకే తైక్వాండో నేర్చుకున్నాను. నటించడం కోసం అన్నట్టు కాకుండా... పూర్తిస్థాయిలో శిక్షణ పొందాను. ఇటీవలే తైక్వాండో బ్లాక్ బెల్టు సాధించాను. ఈ యుద్ధ విద్య పుణ్యమా అని నా ఫిట్‌నెస్ కూడా మెరుగైంది. ఢిష్యుం ఢిష్యుం కథలేవైనా ఉంటే చెప్పండి... నేను కూడా ఇరగదీస్తాను.'

– నీతూ చంద్ర

ప్రయోగించలేదు

'ఇది రెండుమూడేళ్ల కిందటి మాట. ఒక సినిమా కోసం యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకున్నాను. గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నాను. కరాటే సాధన చేశాను. కత్తి యుద్ధంలో కూడా ఓ రెండుమూడు నెలలు శిక్షణ పొందాను. అయితే, ఇవన్నీ నేర్చుకుని నేను సిద్ధమయ్యే సమయానికి ఆ సినిమా ఆగిపోయింది! అది ఆగిపోవడానికి కారణాలేవైతేనేంగానీ... ఆ చిత్రం వల్ల నాకు కొన్ని యుద్ధ విద్యలు వచ్చాయి. కానీ, ఇప్పటివరకూ వాటిని ఉపయోగించాల్సి అవసరం రాలేదు.'

– త్రిష

కేరళ పట్టు

'గజిని తరువాత నేను కలారిపట్టు నేర్చుకున్నాను. ముంబైలోనో చెన్నైలోనో కూర్చుని శిక్షకుణ్ణి రప్పించుకుని కలరి నేర్చుకోవచ్చు. నాకలా ఇష్టం లేదు. ఎందుకంటే ఇది కేరళలో ఎంతో చారిత్రక ప్రాధాన్యమున్న యుద్ధ కళ. దాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. కాబట్టి అలాంటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా ఆ కళని నేర్చుకోవాలని... కొన్నాళ్లు కేరళలోనే ఉండి శిక్షణ తీసుకున్నాను. దురదృష్టం ఏంటంటే... ఏ సినిమా కోసమైతే నేను ఆ విద్యను నేర్చుకున్నానో ఆ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనే లేదు'

– అసిన్

అవసరాన్ని బట్టీ...

'చేస్తున్న సినిమాలో పాత్ర అవసరాన్ని బట్టీ యుద్ధ విద్యలు నేర్చుకునేందుకు నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. అప్పట్లో బిల్లా సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్ ట్రెయినింగ్‌కి వెళ్లాను. ఈ మధ్య మళ్లీ మరో సినిమా కోసం శిక్షణ తీసుకుంటున్నాను. శిక్షణ అంటే ఏదో సినిమా కోసం అన్నట్టు కాకుండా... నిజంగానే యుద్ధానికి వెళ్తున్నాను అన్నంత సీరియస్‌గా సాధన చేస్తాను'.

– అనుష్క

పట్టు పట్టి

'ప్రస్తుతం కలారిపట్టు నేర్చుకుంటున్నాను. ఒక మలయాళీ చిత్రం కోసం ఈ యుద్ధ విద్యను నేర్చుకోవాల్సి వచ్చింది. మొదట్లో ఈ శిక్షణ తరగతులకు వెళ్లడం చాలా బద్ధకంగా ఉండేది. గురువు చెప్పినట్టు కదలడం కూడా ఇబ్బందిగా అనిపించేది. అయితే, ఈ కళలో ఉన్న మహత్యం ఏంటోగానీ... కొద్దిరోజులయ్యే సరికి నాలో ఉత్సాహం పెరిగింది. ఇది చేస్తుంటే వేరే వ్యాయామం అవసరం లేదనిపిస్తోంది'.

– శ్రియ

కర్ర తిప్పాను

'క్షేత్రం సినిమా కోసం కర్ర సాము నేర్చుకున్నాను. శిక్షణకి వెళ్తున్న మొదట్లో అయితే, కర్ర తిప్పడం వచ్చేదేకాదు. గాయలౌతుండేవి. రానురానూ ఒడుపు తెలిసింది. ఈ విద్య నేర్చుకున్న తరువాత ఏకాగ్రత బాగా పెరిగింది. కర్రసాముతో పాటూ కత్తిసామూ కొన్నాళ్లు నేర్చుకున్నాను. అయితే, దాన్లో అంత ప్రావీణ్యం రాలేదు.'

– ప్రియమణి

'మాయ'లోకం

మనిషిని పోలిన మనుషులు ఈ ప్రపంచంలో ఏడుగురు ఉంటారంటారు. అలాంటివారు ఇద్దరు కనిపిస్తేనే వింతగా ఉంటుంది. అలా రూపురేఖలు మాత్రమే కాదు... వారి హాబీలూ, పుట్టినతేదీ, పిల్లలూ, ఆ పిల్లల పేర్లూ కూడా ఒకేలా ఉండటం అంటే అత్యంత అరుదైన విషయమే కదా. అలాంటి యాదృచ్ఛికమే అమెరికాలో చోటుచేసుకుంది. రొనాల్డ్ రీగన్ అధ్యక్షుడిగా ఉన్న రోజులవి. అప్పట్లో న్యూయార్క్‌లో పోలీసు శాఖలో జాకబ్ అనే ఉద్యోగి ఉండేవాడు. అతడు ముమ్మూర్తులా రీగన్‌ని పోలి ఉండేవాడు. ఎత్తూ పొడవూ రంగూ... అచ్చం రీగన్‌లానే కనిపించేవాడు. జాకబ్ రోడ్డుమీద నడుస్తుంటే చాలామంది అతడిని రీగనే అనుకుని అలా ఒంటరిగా సెక్యూరిటీ లేకుండా నడిచివెళ్తున్నందుకు ఆశ్చర్యపోయేవారు. ఆటోగ్రాఫులు అడిగేవారు. అంతే కాదు... జాకబ్‌కు ఇద్దరమ్మాయిలు, ఒకబ్బాయి. రీగన్‌కీ అంతే. రీగన్ ఫుట్‌బాల్ ఆడేవారు. జాకబ్‌కీ అదే హాబీ. జాకబ్ పుట్టినరోజూ రీగన్ పుట్టిన రోజూ కూడా ఫిబ్రవరి 6. రీగన్ పెద్ద కుమార్తె పేరు రిన్. జాకబ్ తొలి కుమార్తె పేరు కూడా అదే. ఒకరిని పోలి ఒకరుండటమే అరుదైతే... వారి హాబీలూ పిల్లలూ వారి పేర్లూ కూడా కలవడం ఎంత ఆశ్చర్యమో కదా!

మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

కనువిప్పు

'ఇల్లేబడి' ఆలోచింపజేసింది. మన విద్యా వ్యవస్థలో ఉన్న డొల్లతనాన్ని ఎత్తిచూపింది. ఈరోజుల్లో చదువంటే పిల్లలకి ఓ భారంగా మారిపోతోంది. అలా కాకుండా పిల్లల్ని ఇంట్లోనే ఉంచి కూడా ఎన్నో విద్యాసంస్థలకు దీటుగా చదివించుకోవచ్చు అని తెలిసింది. చదువు పేరుతో పిల్లలను ఒత్తిడికి గురిచేసే తల్లిదండ్రులకు ఈ వ్యాసం ఓ హెచ్చరిక.

– శ్రీనివాస్ దొడేపల్లి, ఆదిలాబాద్
– గులాబీల మల్లారెడ్డి, కరీంనగర్

సంగీతానికి శక్తి

'పాట' కథ నచ్చింది. బాధకలిగినా ఆనందంగాఉన్నా పనిలో కష్టాన్ని మరచిపోవాలనుకున్నా ఓ పాట చాలు అన్నది వాస్తవం. సంగీతానికి మన కష్టాల్ని మరిపించే శక్తి ఉంటుందన్న అంశం చుట్టూ చక్కటి కథను అల్లారు. రచయితకి ధన్యవాదాలు. ఇటీవలి కాలంలో ప్రచురిస్తున్న కథలు బాగుంటున్నాయి.

– వి.రాజేశ్వరి, పాలకొల్లు
– ఆర్. కూర్మారావు, విశాఖపట్నం

మంచి నటుడు

'అయినా కంటతడి పెట్టలేదు' అంటూ ప్రముఖ నటుడు సుమన్ చెప్పిన ముచ్చట్లు చాలా బాగున్నాయి. మనం అనుకున్నట్టు జరిగితే అది జీవితమెలా అవుతుందన్న ఆయన మాట అక్షర సత్యం. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆయన ధైర్యంగా నిలబడ్డారు. సుమన్ మరెన్నో మంచి పాత్రల్లో నటించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

– మౌనికారెడ్డి, పోతిరెడ్డిపేట, కరీంనగర్
– సి.హరీష్, హిందూపూర్

పదాల వేట

'మాట్లాడే బొమ్మలు' ఆసక్తికరంగా ఉంది. 'ది నౌన్ ప్రాజెక్టు'లో సామాన్యులు కూడా పాల్గొంటే మరిన్ని పదాలకు ఇంకా సులువుగా గుర్తించగలిగే చిహ్నాలు రూపొందుతాయి. నౌన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఐకానథాన్' ఆలోచన చాలాచాలా బాగుంది. 'బాలవినోదిని' పజిల్స్ ఎప్పటిలానే మెదడుకు మేతపెట్టాయి.

– నివేదిత, నిడదవోలు
– వి.వి.సురేష్‌రెడ్డి, కడప

ఖరీదైన అందాలు

బంగారు దోశ ఖరీదు చూసి అబ్బో అనుకున్నాం. 'అందమైన కుర్చీ', 'ఖరీదైన పానీయం'... ఇలా పేజీలోని అన్ని అంశాలూ నివ్వెరపోయేలా చేశాయి. 'ఇల్లేబడి' మాకు నచ్చింది. పిల్లల చదువుల విషయంలో జాగ్రత్త పేరుతో ఒత్తిడిని పెంచేస్తున్నాం. వాళ్లకి ప్రశాంత వాతావరణం కల్పించడం ఎంత ముఖ్యమో అర్థమయింది.

– కె.గణపతిరావు, నెల్లూరు
– అల్తాఫ్(ఈమెయిల్)

అందాల జిగిబిగి

'గజిబిజి అందం ఆతిథ్యం' అలరించింది. స్పెయిన్‌లో గజిబిజిగా నిర్మించిన హోటల్ చిత్రాలు కళ్లను తిప్పుకోనివ్వలేదు. చివరి పేజీలోని నదిమీద వంతెన చిత్రం చాలా బాగుంది. 'అనాథ బాలలకు కొత్త కుటుంబం' ఆలోచింపజేసింది. ప్రభుత్వోద్యోగులంతా ఒకటై సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

– బైరెడ్డి సుబ్బారావు, శ్రీకాకుళం
– ఆర్.కామేశ్వరరావు, చౌటుప్పల్

లోపల...

చురుక్కు చమక్కు 4
ఎదలో లక్ష్మి... వెనుక శిఖ! 5
మీ మందు మీ చేతిలో 6

మన పలుకులు... పూతరేకులోయ్!

జాతీయాలతో నుడికారాలతో సామెతలతో పద్యాలతో పొడుపు కథలతో కళకళలాడే భాష మనది. మన సంభాషణల్లో వాటిని భాగం చేసుకుందాం. అసలుసిసలు తెలుగు మాట్లాడటం అంటే అదే! ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రత్యేక కథనం...

7
రండి...రూ.కోటి గెలుచుకోండి! 11
కథ 12
ఆ కలం ఖరీదు ఏడు కోట్లు! 15

టాటా... వీడుకోలా..! 16
బస్సు బడి వచ్చిందోచ్! 19
చాట్...కొనసాగుతూనే ఉంటుంది! 20
పెరిగింది చాలు...ఇక తగ్గండి 21
తెలుగువారికి సాయం చేస్తాం 22
రుచి అభిరుచి 23
బాలవినోదిని 24
రాత్రి 8దాకా సూర్యుడుంటాడు! 26
రాశి ఫలం 28
సమీక్ష 29
పదవినోదం 30

మంచిమాట

అతి కామం వల్ల రావణాసురుడు, అతి ఆశ వల్ల దుర్యోధనుడు, అతి దానం వల్ల బలిచక్రవర్తి నశించారు. అందువల్ల 'అతి' అన్నింటా వర్జనీయమే.

చురుకు


మా ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు!
కెటర్
యడ్యూరప్ప
శ్రీధర్

!
సీలింగ్స్
నగదు బదిలీ
రుణ మాఫీ

చురుకు


అమెరికా
ఐటెం వికాసము

ఎదలో లక్ష్మి... వెనుక శిఖ!

పశ్చిమ గోదావరి అంటే పచ్చదనమే కాదు... ఆధ్యాత్మిక భావాలను పాదుకొల్పే ఆలయాలకూ నెలవే. అలాంటి క్షేత్రాల్లో కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయం ఒకటి. దేశంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడి స్వామివారికి వెనుకభాగంలో శిఖ ఉంటుంది. ఆయన హృదయంలో లక్ష్మీదేవి కొలువై కనిపిస్తుంది.

ఆ ఆలయ ప్రాంగణం... రంగురంగుల పూలతో, పచ్చని మొక్కలతో శోభిల్లుతుంటుంది. ఒకసారి అందులోకి అడుగుపెడితే, ఇక బయటకు రావాలనిపించదు.

కాస్త ముందుకు వెళ్తే... మనోహరమైన అన్నమాచార్యుని విగ్రహం చూపరులను ఆకర్షిస్తుంది. అలా ఆలయంలోనికి వెళ్తే... అంతకంటే సుందరమైన వేంకటేశ్వరుడు కనిపిస్తాడు. ఆయనే కాళ్లకూరు వేంకటేశ్వరుడు. పశ్చిమగోదావరిజిల్లా కాళ్ల మండలంలోని ఈ ఊరికి కాళ్లకూరు అని పేరు రావడానికి కూడా ఆ స్వామే కారణం.

పురాణగాథ ప్రకారం...

పూర్వం తిరుపతి వేంకటాచలం కొండపై శ్రీధరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆ కొండపైనే పద్మావతి అనే గంధర్వకన్య శ్రీవారి వద్ద వీణాగానం చేసేదట. ఓసారి ఆమెను చూసిన శ్రీధరుడు వెంటనే మోహిస్తాడు. అంతేకాదు, తనను వివాహం చేసుకోవాలని కోరతాడు. ఆమె తిరస్కరించడంతో శపిస్తాడు. అప్పుడు పద్మావతి కూడా శ్రీధరుణ్ణి శపిస్తుంది. శాపవిమోచనం కోసం ఇద్దరూ వేంకటాచలపతిని ప్రార్థిస్తారు. పద్మావతీ నది పేరుతో గోదావరికి సమీపంలో అవతరిస్తావని పద్మావతికీ; బ్రాహ్మణుడిగా జన్మించి అష్టకష్టాలూ పడి శిష్యులతో తీర్థయాత్రలు చేస్తూ పద్మావతీ నదివద్దకు వచ్చి తనను ప్రతిష్ఠిస్తాడని శ్రీధరుడికీ శాపవిమోచన మార్గాలు చెబుతాడు వేంకటేశ్వరుడు. కొన్నాళ్ల తరవాత... శ్రీధరుడు పద్మావతి నదీ తీరాన వేంకటేశుని బంగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించాడు. ఒకరోజు ఆ విగ్రహాన్ని ఎవరో దొంగిలించారు. ఆ రాత్రి శ్రీవారు శ్రీధరుడికి కలలో కనిపించి... నదికి పశ్చిమానున్న అశ్వత్థ వృక్షంలో శిలారూపంలో తాను వెలిసినట్లు చెబుతారు. అప్పుడు శ్రీధరుడు ఆ విగ్రహాన్ని తీసి నదికి తూర్పున ప్రతిష్ఠించి ఆరాధించాడు. అలా శ్రీధరుడికీ, పద్మావతీనదికీ శాప విమోచనం కలిగింది. అప్పట్లో స్వామివారి విగ్రహం నడుము కిందిభాగం భూమిలోపల ఉండేది. కాళ్లు కూరుకుపోయి ఉన్నట్టుండటంతో ఆయనకు కాళ్లకూరు వెంకన్న అనే పేరు స్థిరపడింది. ఈ ప్రాంతం కాళ్లకూరు అయ్యింది.

ప్రస్తుత మొగల్తూరు ప్రాంతాన్ని పూర్వకాలంలో పాలించిన కలిదిండి రంగరాజు ఈ ఆలయ నిర్వహణకోసం 83 ఎకరాల భూమిని దానంచేశాడు. నేటికీ ఈ భూమి ఆలయ ఆధీనంలోనే ఉంది. ఇందులో 72.81 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. మరో 10.56 ఎకరాల్లో చేపల చెరువులు, 1.25 ఎకరాల్లో తోట ఉన్నాయి.

గుండెల్లో లక్ష్మీదేవి

కాళ్లకూరు వెంకన్న రూపానికి ఓ ప్రత్యేకత ఉంది. అదేంటంటే... స్వామికి శిఖ(మహిళా కొప్పు) ఉంటుంది. మరో విశేషమేంటంటే... స్వామి హృదయంలో లక్ష్మీదేవి రూపం కనిపిస్తుంది. కిందివైపు కుడి, ఎడమల్లో పద్మావతీ, ఆండాళ్ అమ్మవార్లు దర్శనమిస్తారు. ఈ స్వామి... కోరిన కోర్కెలు తీరుస్తాడని స్థానికుల విశ్వాసం. అందుకే, ఈ స్వామికి పూజలేకాదు... భూములిచ్చి, దానాలు చేసి తమ భక్తిని చాటుకుంటారు. ఆలయానికి ఏటా భక్తుల రద్దీ పెరగడంతో గ్రామానికి చెందిన కొత్తపల్లి రామలింగరాజు దంపతులు రూ.7.50 లక్షలతో విశ్రాంతి గృహం నిర్మించారు. స్వామివారి కల్యాణోత్సవాలూ ఇతర పూజలకోసం గ్రామస్థులు... ఆలయం వెలుపల ఉన్న 17.50 సెంట్ల భూమిని ఇచ్చారు. జువ్వలపాలెం గ్రామానికి చెందిన గోకరాజు మహాలక్ష్మమ్మ కుమారులు, నడింపల్లి వెంకట్రామరాజు ఇచ్చిన రూ.7 లక్షలతో కార్యనిర్వహణాధికారి కార్యాలయం నిర్మించారు.

కాళ్లకూరు చేరుకోవాలంటే...

కాళ్ల మండలానికి నడిబొడ్డున ఉన్న ఈ ఆలయం భీమవరం నుంచి 12 కి.మీ. దూరంలో ఉంది. విజయవాడ నుంచి కలిదిండి మీదుగా పశ్చిమగోదావరిలోకి ప్రవేశించగానే ఏలూరుపాడు, జువ్వలపాలెం గ్రామాలు దాటాక ఈ ఆలయం వస్తుంది. భీమవరం నుంచి ప్రతి అరగంటకూ ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. దసరా నవరాత్రులూ, వైకుంఠ ఏకాదశి వంటి పుణ్యదినాల్లో ఆలయాన్ని కొన్నివేలమంది భక్తులు దర్శించుకుంటారు.

– *వారా కిషోర్*, న్యూస్‌టుడే, కాళ్ల

ఫొటోలు: నోబుల్

పులిహోర బాగా ప్రసిద్ధి

ఏటా వైశాఖశుద్ధ ఏకాదశి, ఆశ్వయుజ శుద్ధ చతుర్దశి రోజుల్లో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ఈ సమయంలో తయారుచేసే పొంగలి ప్రసాదం తీసుకుంటే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని నమ్మిక. ఆలయంలో శాంతి కల్యాణం జరిపిస్తే... తమ ఇంట మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఇందుకోసం మనరాష్ట్రం నుంచేకాక బెంగళూరు, ఆగ్రా, బళ్లారి, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ వంటి పట్టణాల నుంచి కూడా ఎంతోమంది ఇక్కడికి వస్తుంటారు.

ఈ ఆలయంలో చేసే పులిహోర ప్రసాదం దేశవిదేశాల్లోనూ ప్రసిద్ధమైంది. ప్రత్యేకంగా పులిహోర పొడి తయారు చేయించుకుని విదేశాలకు తీసుకెళ్తుంటారు. మొదటిసారి ఉద్యోగంలో చేరిన ప్రతిఒక్కరూ తమ మొదటి జీతాన్ని ఈ స్వామికి ఇవ్వడం కాళ్లకూరు పరిసర ప్రాంతాల్లో పరిపాటి.

మీ మందు 50 హోమియో మీ చేతిలో

చికాకుపెట్టే జలుబు



జలుబు అతి సామాన్యమైన వ్యాధి. ఇది వైరస్ క్రిముల ద్వారా సంక్రమిస్తుంది. ముక్కు కారడం గొంతునొప్పి మొదలైన లక్షణాలు కన్పిస్తాయి. 3 మాసాల నుండి 3 సంవత్సరాలలోపు పిల్లలు ఈ వ్యాధికి గురైతే చాలా విసుగుగా కనిపిస్తారు. అకస్మాత్తుగా జ్వరం. కొంతమందిలో జ్వరంతో పాటు దగ్గూ, విరేచనాలు కూడా కనిపిస్తాయి. కాస్త పెద్ద పిల్లలైతే దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు మొదలైన బాధలు చోటు చేసుకుంటాయి. ఆరంభమైన 4 రోజుల నుంచి 10 రోజుల్లోపు బాధలన్నీ తగ్గిపోతాయి.

ఒంట్లో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) బలహీనపడితే ఈ వైరల్ ఇన్ఫెక్షన్ తావులో బాక్టీరియా ఇన్ఫెక్షన్ చోటు చేసుకొనడం జరుగుతుంది.

దశాబ్దాలుగా ఎంతో పరిశోధన జరిగినా కూడా నేటికీ మనకు జలుబు నిరోధంగానీ,

నియంత్రణగానీ కుదరడం లేదనే చెప్పుకోవాలి. జలుబు కారకాలైన వైరస్ క్రిములు దాదాపు 200లకు పైమాటే. ఒక రకమైన వైరస్‌కూ మరో రకమైన వైరస్‌కూ ఏ రకమైన సాన్నిహిత్యం ఉండదు. ఒకసారి జలుబు చేసిన పిల్లవానికి ఇంతలో మరో వైరస్ కారణంగా తిరిగి జలుబు పట్టుకోవచ్చు. స్కూలుకు పోయే పిల్లలకు ఇతర పిల్లల ద్వారా మాటిమాటికీ జలుబు చేస్తుండటానికి కారణమిదే. కాకపోతే కొంతమంది పిల్లలు ఎక్కువగానూ, మరి కొంతమంది తక్కువగానూ జలుబుకు గురికావటానికి కారణాలు ఇప్పటికీ తెలియవు. బహుశా వారసత్వ అంశ ఉండొచ్చు. దానినే 'మయాజం' అని వ్యవహరిస్తారు హోమియో వైద్యంలో. సంవత్సరానికి సగటున 6 సార్లయినా జలుబుకు గురికావడం జరుగుతుంది.

టాన్సిల్స్, ఎడినాయిడ్స్ ఆపరేషన్ ద్వారా తీసివేస్తే జలుబుకు గురికారని భావిస్తారు. కాని అది భ్రమ మాత్రమే. ఇంటికి కాపలా కుక్కలను లేకుండా చేస్తే దొంగలు రారని భావించినట్లే అవుతుంది. టాన్సిల్స్, ఎడినాయిడ్స్ దేహరక్షణ కోసం శ్రమించే రోగనిరోధక వ్యవస్థ అంశాలన్న విషయం గమనార్హం.

జలుబు సమయంలో పసిపిల్లలు పాలు తాగేటప్పుడు శ్వాసాడక బాధపడతారు. అదే జలుబు న్యుమోనియా లాంటి వ్యాధులకు దారితియ్యొచ్చు. జలుబు చేసిన తర్వాత 2, 3 రోజుల వరకూ కూడా ఆ వ్యక్తి నుండి ఇతరులకు జలుబు సంక్రమించొచ్చు.

పెద్దపెట్టున జ్వరం, వాంతులు, గొంతు నొప్పి, చెవిపోటు వున్నట్లయితే డాక్టరును సంప్రదించడం మేలు. జలుబు వైరస్‌క్రిముల వ్యాధి గనుక యాంటిబయాటిక్ మందులు నిష్ప్రయోజనకరం. అంతేగాదు అపకారం గూడా. హోమియో ఔషధాలు వాడుకొనడం ఎంతో సముచితం. ఒక్క జలుబు అనే కాదు, ఏ వ్యాధి విషయంలోనైనా రెండు అంశాలు గమనించాలి. ఒకటి బాహ్య కారణాలు. రెండు ఆంతరంగిక స్థితి. ఆంతరంగిక స్థితి దేహవ్యవస్థే. దేహ వ్యవస్థను బలోపేతం చేయడం హోమియో వైద్య ధ్యేయం. ఇది ఒక్క జలుబుకే కాదు, అన్ని వ్యాధులకూ వర్తిస్తుంది.

1 సమస్య

ముక్కులు బిగుసుకుపోవటం, ముక్కు కారటం, తెరలు తెరలుగా తుమ్ములు, వాసనలూ రుచీ తెలియకపోవటం.

2 ఔషధాన్ని ఎంపిక చేసుకునేదెలా?

తేమతో కూడిన చల్లటి గాలికి జలుబు చేస్తే	డల్కమారా
తుమ్ములెక్కువ, ముక్కులు మంటబెడుతుంటే	ఆర్సినికం ఆల్బ్
అకస్మాత్తుగా చలిబెడుతూ, పొడిదగ్గుతో వచ్చే జలుబుకు	ఎకొనైట్
కళ్ల వెంట నీరు, పైపెదవి ఒరుసుకుపోయే స్రావం ఉంటే	ఏలియం సెపా
తెరలు తెరలుగా తుమ్ములు విపరీతంగా ఉంటే	శాబడిల్లా
విపరీతంగా చెమటలు, ఆకుపచ్చని స్రావముంటే	పల్సటిల్లా
ధారాళంగా కారుతున్నా ముక్కులు బిగుసుకుపోయి ఉంటే	ఆర్స్
వేసవి కాలంలో పట్టుకున్న జలుబుకు	డల్కమారా
విపరీంగా తుమ్ములు, ధారాళంగా ముక్కు కారుతున్నట్లయితే	ఏలియం సెపా
పూలవాసన మూలంగా అలర్జీ, ముక్కు కారుతున్నట్లయితే	శాబడిల్లా
గదిలో ఉంటే ముక్కులు బిగుసుకుపోయి, ఆరుబయట హాయిగా ఉంటే	పల్సటిల్లా
ముక్కు మొదటి భాగంలో నొప్పి, ముక్కులు పొడారి బాధపెడుతుంటే	ఎకొనైట్

3 మీ ఔషధం గురించి మరిన్ని వివరాలు

ఎకొనైట్: ముక్కులో మండుతుంది. అకస్మాత్తుగా చలిపెడుతుంది. నిస్త్రాణ, ఆందోళన. పగలు లేక రాత్రి 11 గం. నుండి అస్థిమితం. ముక్కులు పొడారిపోతాయి, స్రావం తక్కువ.

ఆర్సెనికం ఆల్బ్: పగలు లేక రాత్రి 1 నుండి 3 గం. వరకు అస్థిమితం. ముక్కులు మండుతాయి. వెచ్చటి ద్రవాలు కావాలి. కొద్దికొద్దిగా చప్పరిస్తారు. తుమ్ములు విపరీతం. చలి పెడుతుంది.

ఏలియం సెపా: ముక్కు, పైపెదాలు ఒరుసుకుపోయి ఎర్రగా కనిపిస్తాయి. చల్లటి గాలి హాయి నిస్తుంది. వెచ్చదనం ఇష్టపడరు. మాట బొంగురుపోతుంది. ఆకురాలే కాలంలో పట్టుకునే జలుబుకు ప్రత్యేక ఔషధం.

డల్కమారా: తేమ గాలి, వేసవిలో నదీస్నానం పడకపోవటంతో వచ్చే జలుబు. ముక్కులు బిగుసుకుపోతాయి. చెవిపోటు, వికారం, వాంతులు, విరేచనాలు. కీళ్ళలో నొప్పులు. చెమట పట్టినప్పుడు స్నానం గిట్టదు.

పల్సటిల్లా: ముక్కు నుండి ఆకుపచ్చని స్రావం. నుదుటి మీద తలనొప్పి. సాయంకాలం 4 గం. బాధలు ఎక్కువ. ఉదయం నోరు దుర్వాసన. తోడు కావాలి. ఓదార్పు ఇష్టపడతారు. మీగడ గిట్టదు.

శాబడిల్లా: తుమ్ములు విపరీతం. ముక్కు రంధ్రాలలో జిల, వాసనలు గిట్టవు. ఉల్లి వాసన అస్సలు గిట్టదు. జలుబు తొందరగా తగ్గదు. కేకరించి ఉమ్మితో రక్తంతో కూడిన కళ్ళె.

మోతాదు: *మీరు ఎంచుకున్న ఔషధాన్ని 30 పొటెన్సీలో రోజూ ఉదయం సాయంత్రం... 6 మాత్రల చొప్పున... 2, 3 వారాలపాటు వాడాల్సి ఉంటుంది.*

మన పలుకులు... పూతరేకులోయ్!

అవధానం-ఆవకాయ, పద్యం-పులిహోరా నైవేద్యం... ఇవొక్కటేనా, తెలుగువారికి దానవిక్రయాది సమస్త హక్కులూ ఉన్న వారసత్వ ఆస్తి మరొకటుంది... సంభాషణా చాతుర్యం! జాతీయాలూ నుడికారాలూ సామెతలూ ఛలోక్తులూ... తెలుగువారి మాటకచేరీలో పక్కవాద్యాలవుతున్నాయి.

గొంతులో గలాటా. కడుపులో ఉబ్బరం. మనసంతా చికాకు. నాలుక నానాతిప్పలు పెడుతుంది. ఎవరో తరుముకొస్తున్నట్టు గుండెల్లో దడ. మాట్లాడేయాలి. వెంటనే మాట్లాడేయాలి...

ఎవరో ఒకరితో. ఏదో ఒకటి. ఎంతోకొంత సేపు.

బస్సులో పక్కసీటు శాల్తీ. ఇంటిదగ్గరైతే ఇరుగూపొరుగూ. కార్యాలయంలో సహోద్యోగి. బళ్లో సహపాఠీ. ఆసుపత్రిలో ఇంకో రోగి. మానసిక వైద్యశాలలో మరో పిచ్చాడు.

మన బలహీనత సంభాషణ.

మన బలమూ సంభాషణే.

తెలుగువారు సంభాషణా చతురులు. వాక్భూషణులు. చిన్న పరిచయం చాలు. ఇట్టే అల్లుకుపోతారు. పరిచయం లేకపోయినా సరే... దరహాస ప్రయోగాలతోనో నమస్కార బాణాలతోనో దారికి తెచ్చుకుంటారు. సంభాషణంటే అవును, కాదు, సరే, నీ ఇష్టం... తరహా సంక్షిప్త వ్యక్తీకరణ కాదు. అదే సమయంలో, 'ఔరా ఈ రచనా చమత్కృతి ఏమియో గాని...' అంటూ మొదలుపెట్టి అరగంటో గంటో ఏకబిగిన ఏకపాత్రాభినయం చేసేయడమూ కాదు. సంభాషణ శృంగారం లాంటిది. సమాన భాగస్వామ్యం ఉండాలి. అదీ హృదయపూర్వకమై ఉండాలి. అప్పుడే, వినబుద్ధేస్తుంది, రససిద్ధి కలుగుతుంది. మాటలు మాత్రమే కలిస్తే .. మొక్కుబడి ముచ్చట్లే! హృదయాలు కూడా కలిస్తేనే అది సంభాషణ అవుతుంది. 'సంభాషణా కళ' అన్న పాఠం ఏ డేల్‌కార్నెగీ మహాశయుడో వచ్చి బోధించాల్సిన దౌర్భాగ్యం ఎప్పుడూ లేదు. గిరీశం కాలం నుంచే మనకంటూ ఓ ప్రత్యేకత ఉంది. భాషణాసంభాషణా చతురులు జంఘాలశాస్త్రి మనకు పెద్దదిక్కు. కొంగర జగ్గయ్య మార్కు గంభీరస్వరం తెలుగువారికి స్వతస్సిద్ధ కంఠాభరణం. ఉద్ధండులైన తెలుగు మాస్టార్లకు ఆంధ్రదేశంలో కొదవేలేదు కాబట్టే గుంజీలు తీయించడంలోనూ తొడపాశాలు పెట్టడంలోనూ వారికి తిరుగేలేదు కాబట్టే... పున్నం అమాసలకు బడికెళ్లిన బడుద్ధాయికైనా అంతోయింతో సాహితీ సంస్కారం అబ్బే ఉంటుంది. దినపత్రికని పూతరేకులా చుట్టేసి చప్పరించడమన్నది తెలుగువారి దినచర్యలో భాగం కావడం మూలాన, లోక జ్ఞానమైనా వ్యవహార జ్ఞానమైనా పిసరంత ఎక్కువే. ఆదిభట్ల నారాయణదాసుగారి ఆశీర్వచన ప్రభావం కాబోలు, మాటల మధ్యలో పిట్టకథలకు కొదవుండదు.

...ఈ లక్షణాలన్నీ మంచి సంభాషణకు ముడిసరుకు. అందుకే, తెలుగువారి మాటల్లో అంత మాధుర్యం! కొత్తావకాయలా పసందుగా ఉంటాయి. నేతి అరిసెల్లా ఘుమ ఘుమలాడుతుంటాయి. రాగిసంకటిలా కమ్మగా ఉంటాయి. సకినాల్లా కరకరలాడుతుంటాయి. పూర్ణాల్లా నర్మగర్భంగా అనిపిస్తాయి. చల్లమిరపకాయల్లా భలే చురుకు పుట్టిస్తాయి.

పలకరింపు... తేనె చిలకరింపు!

పలకరింపు - సంభాషణకు స్వాగతద్వారం. 'బావున్నారా..' అని అడగాలంటే, ఏ కన్నడిగులో అయితే 'చన్నాగిద్దీరా...' అంటూ వాకబుచేస్తారు. ఆంగ్లేయులైనా అంతే క్లుప్తంగా 'హౌ ఆర్ యు' అంటారు. మరి మనమో... 'మీరెలా ఉన్నారు. మీ శ్రీమతిగారెలా ఉన్నారు. పిల్లలెలా ఉన్నారు. నాన్నగారు కులాసానా. అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది. అద్దిల్లు సౌకర్యంగా ఉందా. కొత్తకారు మైలేజీ ఇస్తోందా?'... ఎన్ని ప్రశ్నలెంత ఆత్మీయత! ఆ ఎత్తుగడా, ఆ కొనసాగింపూ, ఆ ముగింపూ... అనితరసాధ్యం. కాబట్టే, తిరుపతి వేంకట కవులు తమ పాండవోద్యోగ విజయాల్లో నాటకీయ సంభాషణలకు అపారమైన ప్రాధాన్యమిచ్చారు. 'బావా ఎప్పుడు వచ్చితీవు. సుఖులే బ్రాతల్ సుతుల్ చుట్టముల్...' అంటూ కుశలప్రశ్నలకే ఒకట్రెండు పద్యాలు కేటాయించారు. ఆ పద్యనాటకంలో కనిపించేదంతా అచ్చమైన సంభాషణా చాతుర్యమే. ఆ మెరుపులూ, ఆ చురకలూ, ఆ దెప్పిపొడుపులూ, ఆ పుల్లవిరుపులూ... తెలుగువారికిగాక మరెవరికి చేతనవుతాయి? ఆ అక్షర భిక్షే కాబోలు, చాలా సందర్భాల్లో పద్యపాదాలే రెండు పాదాలై తెలుగువారి

సంభాషణలను పరుగులు తీయిస్తాయి. నన్నయ తిక్కనాదులు మొదలు... ఎందరో కవిపుంగవులు మనకు అత్యద్భుతమైన పద్య సంపదనిచ్చారు. సందర్భోచితంగా వాటిని జొప్పించి, సంభాషణల్ని మెప్పించే అవకాశాన్నీ ఇచ్చారు. మహాశాంతమూర్తులకు కోపం వచ్చినప్పుడు 'అలుగుటయే ఎరుంగని..' అంటూ సదరు అజాతశత్రువు గుణగణాల్ని కీర్తిస్తాం. ఆ పార్టీవాళ్లూ ఈ పార్టీవాళ్లూ మీసాలు మెలేస్తూ ముందుకు ఉరుకుతుంటే 'జెండాపై కపిరాజు..' అందుకుంటాం. ఫక్తు మొక్కుబడి వ్యవహారం నడపాల్సి వచ్చినప్పుడు 'అయినను పోయిరావలె హస్తినకు' అని నర్మగర్భంగా చెప్పేస్తాం. ఎదుటిమనిషిని తేలిగ్గా తీసుకోడానికి వీల్లేదనడానికి 'వచ్చెడి వాడు పార్థుడ'ని హెచ్చరిస్తాం. చిలకమర్తివారి గయోపాఖ్యానమైతే... అచ్చంగా మన రచ్చబండ సంభాషణల్ని గుర్తుకుతెస్తుంది. వీధి కుళాయి గొడవల్ని తలపిస్తుంది. కృష్ణార్జునులు ఏకంగా సంభాషణా సమరమే చేస్తారు. ఒకరి మాట నాగాస్త్రమైతే, మరొకరి మాట గరుడాస్త్రం. ఒకరు నిప్పులు కురిపిస్తే, మరొకరు నీళ్లు చల్లుతారు. ఒకరు... ఏకచక్రపురంలో బిచ్చమెత్తుకుని బతికావని గేలి చేస్తే, మరొకరు... గోకులంలో పాలూ పెరుగూ దొంగిలించుకు తిన్నావని ఎగతాళి చేస్తారు. ఎత్తిపొడుపులు మొదలు దుమ్మెత్తిపోయడాల వరకూ... తిరుగులేని పదవ్యూహాలు. తెలుగు వారి వాదనాపటిమా సంభాషణా చతురతా పక్కాగా ఉంటుంది. చేయితిరిగిన తాపీమేస్త్రీ కట్టిన గోడలా దుర్భేద్యంగా ఉంటుంది.

పలుకు తేనెలతల్లి..

వజ్రపు ముక్కుపుడక కిసుక్కుమన్నట్టు, రవ్వలగాజులు తళుక్కుమన్నట్టు... గృహిణుల మాటల్లో పదహారణాల తెలుగుదనం. పిట్టగోడల చాటునో, నీళ్లబిందెల మాటునో జరిగే ఇరుగమ్మ పొరుగమ్మ సంభాషణల్లో తెలుగంత వెలుగు. ఆ నుడికారాల వయ్యారాలూ జాతీయాల జాణతనాలూ... ఆస్వాదించి ఆనందించాల్సిందే. కొన్నిసార్లయితే, తిట్ల లోనూ పెసరట్లంత రుచుందా అనిపిస్తుంది. వాళ్లేం ప్రబంధాలు చదువుకోలేదు. సూర్యరాయాంధ్ర నిఘంటువును బట్టీపట్టలేదు. అమ్మమ్మ నుంచి అమ్మకూ, అమ్మ నుంచి అమ్మాయికీ వారసత్వంగా వచ్చిన పుట్టింటి ఆస్తి..ఆ వాక్చాతుర్యం. 'గ్రంథాలు చదివి నేను భాష తెలుసుకున్నాను. స్త్రీల నాశ్రయించిన్నీ నేర్చుకున్నాను. తెలుగు భాష, ప్రయోగ విజ్ఞానం కూడా స్త్రీలవల్లనే అలవడింది నాకు. పురుషుల కంటే స్త్రీలభాషలో మాధుర్యమూ హృదయాలను పట్టివేసే జాతీయతా కనబడింది నాకు. ఇవాళ నేను రాస్తున్న భాష వారనుగ్రహించి నదాన్లో సహస్రాంశమయినా కాదు, యింతా చేస్తే' అంటారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

తల్లి కావచ్చు, చెల్లి కావచ్చు, అర్ధాంగి కావచ్చు... బాధ్యతకు తగినట్టు, సందర్భానికి సరిపడినట్టు సంభాషిస్తున్నప్పుడు ఆ తెలుగు నారి మాట వింటినారి అవుతుంది. బాణం ఎవరికి ఎక్కడ తగలాలో అక్కడే తగుల్తుంది. కొన్నిసార్లు సుతిమెత్తగా, ఇంకొన్నిసార్లు దిమ్మదిరిగేలా. శ్రీరమణ 'బంగారు మురుగు' కథలో బామ్మ పాత్రే తీసుకోండి. నరసింహం పంతులు ద్వారా వచ్చిన సంబంధం తెగనచ్చుతుందావిడకు. ఆడపెళ్లివారికీ మగపెళ్లి వారికీ నాలుగు కాసుల బంగారం దగ్గరే తేడా వస్తుంది. అయినా సరే, ఎలాగోలా మనవడిని మనువుకు ఒప్పించాలని కోరిక. ఆ ప్రయత్నంలో తన సంభాషణా చాతుర్యమంతా ప్రయోగిస్తుంది.

'పిల్ల పొందిగ్గా వుందిరా... పచ్చగా దొరసానిలా ఉంది... కళ్లు కజ్జికాయల్లా వున్నాయి... నాలుగు కాసుల బంగారం ఒక్క ముద్దుకి చెల్లు. పిల్లపేరు గాయత్రి...'

'అయితే...'

'రోజూ పదిసార్లు పిలిచినా చాలు పుణ్యం పురుషార్థం... పదిమందిలో పుట్టి పెరిగిన పిల్ల...'

'అయితే...'

'కష్టసుఖాలు తెలుస్తాయి..అరటిదూట కూర ఆవపెట్టి కమ్మగా వండుతుందిట..పెద్ద పెద్ద ముగ్గులు వేస్తుందిట..'

'అయితే..'

'ఒరే కోర్నాసీ, దూటకూరకీ ముగ్గులకీ బోలెడు ఓర్పూ ఓపికా కావాల్రా-పనితనమూ వుండాలి... పిల్లకి రుక్మిణీ కల్యాణం కంఠతా వచ్చుట-టీకా తాత్పర్యంతో సహా"-

'అయితే...'

'అయితేనా, ఇష్టమైన వాడి కోసం ఏదైనా చేసే జాణతనం వుందని... నువ్విట్టాగే మీన మేషాలు లెక్కిస్తూ కూర్చుంటే ఆ పిల్లే నిన్ను లేవదీసుకుపోతుంది... సరేనా...' అంటూ మనవడికి రోషం తెప్పిస్తుంది.

గిచ్చినట్టు, గిల్లినట్టు, గిలిగింతలు పెట్టినట్టు, గుసగుసలాడినట్టు, రుసరుసలాడినట్టు... ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా మాటలాడి కార్యాల్ని చక్కబెట్టడం తెలుగు మహిళకు వెన్నతోపెట్టిన విద్య. వెన్నముద్దను

కరిగించినట్టు మనసునూ కదిలించగలదా సంభాషణ. ఆంధ్ర మహాభారతంలోని ద్రౌపది తెలుగు మహిళకు ప్రతినిధి. కౌరవసభలో జరిగిన అవమానాన్ని ఓపట్టాన ఆమె మరచిపోదు. రగిలిపోతూ ఉంటుంది. పాండవుల్లో ప్రతీకారవాంఛ చల్లబడిపోతోందన్న అనుమానం కలిగిన ప్రతిసారీ... తన సంభాషణా చాతుర్యంతో ఆవేశాగ్నికి ఆజ్యంపోస్తూ ఉంటుంది. కృష్ణుడు రాయబారానికి బయల్దేరుతున్నప్పుడు చూడాలి... ద్రౌపది వాక్పటిమ. 'అన్నా! కౌరవులతో సంధి గురించి మాట్లాడుతున్నప్పుడు... దుశ్శాసనుని వేళ్లలో చిక్కుకుని సగానికి సగమైపోయిన నా వెంట్రుకల్ని గుర్తుతెచ్చుకో' అంటూ కొప్పుముడి విప్పి చూపుతుంది. చెల్లెమ్మ అంత మాటంటే, ఏ అన్న మనసైనా విలవిల్లాడకుండా ఉంటుందా? 'ఆ దుర్మార్గుడిని ముక్కలు ముక్కలు చేయకపోతే ఈయన చేతిలో గద ఎందుకు, ఆయన చేతిలో గాండీవం ఎందుకు?' అంటూ భర్తల్ని దెప్పిపొడుస్తుంది. కాంతామణి కంటతడిపెడితే, కట్టుకున్నవాడు కాలనాగై బుసకొట్టకుండా ఉంటాడా? 'నిప్పుల్ని ఒళ్లో కట్టుకున్నట్టు..ఇన్నాళ్లూ ఈ కోపాన్ని దాచుకున్నాను అచ్యుతా' అంటూ విషాదాన్ని ఒలికిస్తుంది. భర్తల పట్ల వెటకారం, కృష్ణుడి పట్ల విశ్వాసం, పన్నెండేళ్లుగా గూడుకట్టుకున్న బాధ, ఆక్రోశం... ఒక్కమాటలో చెప్పాలంటే సంభాషణా సవ్యసాచిత్వమది! ఉత్తరాది ద్రౌపదికి ఇంత సంభాషణా నైపుణ్యం లేదు. తిక్కన సోమయాజి ఎక్కడో యమునా తీరం నుంచి నెల్లూరు సీమకు తీసుకొచ్చి జానుతెలుగు నేర్పించి, జాణతనమనే ఉగ్గుపోసి పెంచారు. పదకవితా పితామహుడు అన్నమయ్య 'పలుకుతేనెల తల్లి..' అని ప్రేమగా పిలిచింది పద్మావతమ్మనే అయినా... ఆ ప్రశంస తెలుగు మహిళలందరికీ వర్తిస్తుంది.

వీణ...
వాగ్దేవి చేతిలో,
తెలుగు మహిళ నోటిలో.

ఊరగాయలు...

ఆవకాయ, గోంగూరపచ్చడి, కందిపొడి వగైరా వగైరా అనుపానాలు ప్రతి తెలుగింట్లోనూ ఉంటాయి. నోళ్లు చప్పబడినప్పుడూ కొత్తరుచుల కోసం కుటుంబ సభ్యుల నాలుకలు నానాయాగీ చేస్తున్నప్పుడూ... ఆ ఇల్లాలు అటక మీది నుంచి జాడీలు దించుతుంది. వెల్లుల్లి తిరగమోతతో ఇల్లంతా గుప్పుమనిపిస్తుంది. అచ్చంగా అలానే, తెలుగు సంభాషణలకు రంగూరుచీ దట్టించే సరంజామా భాషాభోషాణంలో సిద్ధంగా ఉంది. శతకాలూ జాతీయాలూ నుడికారాలూ సామెతలూ వాటి పేర్లు. 'ఉప్పుకప్పురంబు...', 'తనకోపమె తన శత్రువు', 'సాధనమున పనులు సమకూరు ధరలోన'... ఇలా వేమన శతకాలూ సుమతీ శతకాలూ చింతాకు పతకాలై తెలుగు సంభాషణలకు వన్నె తెస్తాయి. 'ఆయనో కప్పగంతుల నాయకుడు', 'ఏమిటా గాడిదగత్తర..', 'నక్కను తొక్కొచ్చావోయ్', 'సింగడు అద్దంకి వెళ్లనూ వెళ్లాడు'... వగైరావగైరా జాతీయాలు జాతిరత్నాల్లా మెరుస్తాయి. 'అప్పుచేసి పప్పుకూడు', 'ఆడలేక మద్దెల వోడు అన్నట్టు'... తదితర సామెతలు సాంబ్రాణి పొగలా వింత సుగంధాన్ని విస్తరిస్తాయి. తెలుగు మాటల్లో ఓ వింత మెరుపు ఉంటుంది. పదాలవిరుపు మహాగమ్మత్తుగా ఉంటుంది. 'ఊరకరారు మహాత్ములు..' అనడంలో ఎంత వ్యంగ్యం! 'అబ్బో ఆయనా... మెత్తనిపులి!' అంటున్నప్పుడు ఎంత శ్లేష!

సకలం మధురం...

అన్ని భాషలూ అన్ని సంభాషణలకూ అతికినట్టు సరిపోవు. కొన్ని హాస్యం కోసమే పుట్టినట్టుంటాయి. ఇంకొన్ని విషాదాన్ని పంచడానికే ప్రాణంపోసుకున్నట్టు అనిపిస్తాయి. మరికొన్ని బీభత్సభయానకాలను మాత్రమే బాగా పండిస్తాయి. తెలుగు భాషకు అలాంటి పరిమితులేం లేవు. ఏ రసమైనా పలికించగలదు. అందులోనూ వలపు సంభాషణలైతే మైమరపు తెప్పిస్తాయి. వలపంటే ఎన్ని విరహాలు, ఎన్ని తాపాలు, ఎంత బెట్టు, ఎంత కనికట్టు! బెదిరించినట్టే ఉండాలి కానీ, బెదిరించకూడదు. హెచ్చరించినట్టే ఉండాలి కానీ, హెచ్చరించకూడదు. కాదన్నట్టే ఉండాలి కానీ, కాదనకూడదు. ఆ కిటుకు పెదతాతయ్య పెద్దనగారికి బాగా తెలుసు. 'మనుసంభవం'లో వరూధినీ ప్రవరాఖ్యుల సంభాషణ రూపంలో ఆ మర్మాలన్నీ విప్పిచెప్పారు.

ప్రవరుడు దారితెలియక తికమకపడుతుంటే... వరూధిని అతన్ని దారికి తెచ్చుకునే ప్రయత్నం మొదలుపెడుతుంది. ప్రవరుడిని చూడగానే 'నను వాడు పరిగ్రహించినన్' అన్న ఆలోచన వచ్చేస్తుంది. 'తొలిచూపు ఆకర్షణ' అంటే అదే కాబోలు! 'భీత హరిణేక్షణా! అంటూ అతను (యథాలాపంగానో ఉద్దేశపూర్వకంగానో) సంభాషణ ప్రారంభించేసరికి, వరూధిని మనసు పులకించిపోతుంది. అంటే, తన కళ్లు సువిశాలమన్న సంగతి అతగాడు గుర్తించినట్టే కదా! ఆమాట కొస్తే ప్రవరుడి కళ్లూ చిన్నవేం కాదు. అందుకేనేమో 'ఇంతలు కన్నులుండ దెరువెవ్వరి వేడెదు? భూసురేంద్ర' అంటూ తీపి తగాదాకు దిగుతుంది. 'ఒంటరి అమ్మాయిని పలకరించడానికి ఇదే సాకు గాబోల'ని వయ్యారంగా కయ్యానికి కాలుదువ్వుతుంది. అక్కడ తామిద్దరే ఉన్నామన్న సంగతి పరోక్షంగా ప్రస్తావిస్తుంది. మాటలో ఒక అర్థం, మనసులో ఒక భావం. సరస సంభాషణలకు తెలుగే సరైన మాధ్యమం.

నడివయసు ఆలూమగల సంభాషణకు వచ్చేసరికి, ఇంత సున్నితత్వం ఉండదు. కాలం గడిచేకొద్దీ కాపురం పాతబెల్లం పాకంలా గట్టిపడుతుంది. జంకు తగ్గుతుంది. గొంతు పెరుగుతుంది. తగ్గట్టే సంభాషణలూ. ఆ మాటల్లో డొంకతిరుగుడు ఉండదు. దొంగచాటు బాణాలుండవు. సరసమైనా

డవిలాగులు...

ఇస్తినమ్మ వాయనం. పుచ్చుకుంటినమ్మి వాయనం. తెలుగువారి గొప్పదనం ఏమిటంటే నలుగురూ మెచ్చేలా మాట్లాడటమే కాదు, ఎదుటివారి మాటల్లోని నవరసాల్నీ హృదయపూర్వకంగా ఆస్వాదిస్తారు. పెద్దతారలు అక్కర్లేదు, భారీ సెట్టింగులు అవసరం లేదు.. సంభాషణలు బావుంటే చాలు... సినిమా ఘనవిజయం సాధించినట్టే. అనేకానేక తెలుగు చలనచిత్రాలు మాటల కారణంగానే డబ్బు మూటలు సంపాదించిపెట్టాయి. 'మాయాబజార్'లో పింగళివారి సంభాషణల్ని ప్రేక్షకులు ఎప్పటికీ ఆస్వాదిస్తూనే ఉంటారు. సాంఘిక చిత్రాలకు వచ్చేసరికి డి.వి.నరసరాజు తీరే వేరు. చర్నాకోలా ఝుళిపించినట్టు ఉంటాయా సంభాషణలు. ఆత్రేయ సంభాషణల్ని వరుసగా పేరిస్తే మంచి ప్రేమ కవిత్వం అవుతుంది. ముళ్లపూడి వెంకటరమణ 'ముత్యాలముగ్గు' సంభాషణలైతే తెలుగు దనాన్ని చిదిమి దీపం పెట్టినట్టే ఉంటాయి. పరుచూరి సోదరుల కలాలకు కాలదోషమే లేదు. నవతరంలో పూరిజగన్నాథ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు మాటల తూటాలు పేలుస్తున్నారు. అమ్యామ్యా... నీ ఎంకమ్మా... ఏమిరా డింభకా... మడిసన్నాక కూసంత కళాపోసణ ఉండాలి... తుత్తి-సుత్తి... వగైరా వగైరా మాటలు మన సంభాషణల్లో తళుక్కున తారసపడుతున్నాయంటే... అదంతా సినిమా ప్రభావమే!

సంభాషణను కాపాడుకుందాం...

తిరుపతి వేదికగా... డిసెంబరు 27న ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం కాబోతున్నాయి. వేలమంది అక్షర అర్చకులూ భాషా ప్రేమికులూ ఓచోట సమావేశం అవుతారు. తెలుగు వైభవాన్ని కీర్తించు కుంటారు. తెలుగు సమస్యల్ని చర్చించు కుంటారు. తెలుగు భాషను బతికించు కోవాలంటూ ఎన్నో కొన్ని తీర్మానాలు చేసు కుంటారు. తెలుగు సంభాషణ గురించి మాత్రం ఎక్కడా ప్రస్తావనకు రాకపోవచ్చు. మనం బతికించుకోవాల్సింది... ఆక్సిజన్ మాస్కు తొడుక్కున్న బిక్కుబిక్కు భాషను కాదు, మార్చురీ పెట్టెలోని శవంలాంటి భాషను కాదు... గలగలా పారే చైతన్య భాషను, కళకళలాడే సజీవభాషను, నవనవలాడే నవయవ్వన భాషను. సజీవ సంభాషణలతోనే భాషకు జవజీవాలు.

అర్థంపర్థంలేని సంక్షిప్త సందేశాలూ ఆంగ్ల లిపితో సంకరమైన అర్ధతెలుగు ఇ-మెయిల్లు - భాషా సౌందర్యాన్ని నాశనం చేస్తున్నాయి. జాతీయాలనూ నుడికారాలనూ సామెతలనూ... ఇప్పటికే దాదాపుగా అటకెక్కించాం. ఆ రుచుల జాడీని భద్రంగా కిందికి దించుకునే ప్రయత్నమూ జరగాలి. కట్టె-కొట్టె-తెచ్చె అన్నట్టు మొక్కుబడిగా మాట్లాడ్డం కాదు... తెలుగు సౌరభం గుబాళించేలా సంభాషించాలి. కనీసం ఆ ప్రయత్నమైనా చేయాలి. మంచి సాహిత్యాన్ని చదవడం ద్వారా, మంచి సంగీతాన్ని ఆస్వాదించడం ద్వారా, మంచి సినిమాల్ని చూడ్డం ద్వారా..అదేం అసాధ్యమైన పని కాదు. అప్పుడిక... ఎవరో వచ్చి బతికించాల్సిన పన్లేదు, పన్నెండుకోట్ల నాలుకలపై సంభాషణా సరస్వతి నాట్యమాడుతూ ఉంటుంది.

విరసమైనా... సూటిగా సంధించడమే. ముని మాణిక్యంవారి కాంతానికి ఆ విద్య బాగా తెలుసు. 'ఏమోయ్! మీ చుట్టాలొచ్చారు...' అని కేకేశాడు భర్త... ఇంటి బయట నిల బడిన గాడిదల గుంపును చూపిస్తూ. 'నిజమే, మిమ్మల్ని కట్టుకున్నాకే ఈ చుట్టరికం కలిసింది' రపీమని జవాబిచ్చిందామె.

ఇదీ సరసమే. అదీ సరసమే. పీచు మిఠాయిని సుతారంగా చప్పరించడం ఒక ఆనందం. చెరుకుగడను పళ్లతో చీల్చి పకా పకా నమిలేయడం ఒక ఆనందం. ఆతీపి పేరూ ఈతీపి పేరూ ఒకటే -తెలుగు.

ఒక్క శృంగారమనే కాదు, సర్వరసాలూ గోరింటాకులా పండేస్తాయి తెలుగు సంభాషణల్లో. ముళ్లపూడి వెంకటరమణ 'కోతి కొమ్మచ్చి'లో మంచి సన్నివేశముంది. ఓ కుబేరుడు మిత్రులతో కలిసి కార్లో వెళ్తున్నాడు. మధ్యదారికి వచ్చేసరికి ఆకలి మొదలైంది. చుట్టుపక్కల ఎక్కడా హోటళ్లు లేవు. ఊళ్లూ లేవు. ఆకలేమో రెచ్చిపోతోంది. ఓచోట కూలీలకు కూడొండుతున్నారు. ఆ మేస్త్రీని అడిగితే, వచ్చి తినమన్నాడు. కొసరికొసరి వడ్డించాడు. కడుపునిండా తిన్నారు. వెళ్తూవెళ్తూ రెండు పెద్దనోట్లు తీసిచ్చారు కుబేరుడుగారు. ఆ మేస్త్రీ వద్దన్నాడు. 'ఇక్కడ అన్నం తిండానికే. అమ్మడానికి కాదు బాబూ...' అని చెప్పాడు. ఎంత లోతైన మాట! అల్పాక్షరాల్లో అనంతార్థం... ఒక్క తెలుగు సంభాషణల్లోనే సాధ్యమేమో.

అవధానమే మన అబ్బసొత్తు అయినప్పుడు సమయస్ఫూర్తి మాత్రం కాకుండా పోతుందా! ఓ రాజుగారికి ఒంటికన్ను. అయినా, మహా అందగాడినన్న గుడ్డి నమ్మకం. ఓ కవిని పిలిపించి తన రాజసాన్ని వర్ణించమని ఆదేశించాడు. 'నువ్వు కురూపివి మహాప్రభో' అని నిజం చెబితే తలకాయ పుచ్చకాయలా ఎగిరిపోతుంది. పొగడటానికేమో మనసు రాదు. మధ్యేమార్గంగా 'ప్రభూ! రాణీగారి కళ్లతో కలిపితే మీరు ముక్కంటి గౌరీపతి. ఒక్కరే అయితే ఒంటికన్ను అసురపతి. ఆ ఒక్క కన్నూ పోయిందా... అంధుడైన కౌరవపతి!' అంటూ సవినయంగా సెలవిచ్చాడు. రాజుగారు మురిసిపోయి లక్ష్మీపతిలా వరాలిచ్చారు.

తెలుగు సంభాషణల్లో తాత్వికత అంతర్లీనం. ఎవరి మరణవార్తో చెప్పాల్సి వచ్చినప్పుడు 'హంస ఎగిరిపోయింది' అంటుంటారు. హంస ఆత్మకు ప్రతీక. 'చింతచెట్టు కొనల మీద చిలుక ఉన్నది బిడ్డా! చిలుక పొట్టలోన బంగరు పలుకులున్నవి కొడుకా!'... అని పాడుకునే గోసంగులు పల్లెపల్లెలో కనిపిస్తారు. ఆ మాటా పాటా అర్థమైనట్టే అనిపిస్తుంది... అర్థంకాని దేదో మిగిలే ఉంటుంది. చింతచెట్టు శరీరాన్ని సూచిస్తుంది. చిలుక ప్రాణానికి సంకేతం. బంగరు పలుకులు... ఆత్మస్వరూపం!

కవిగార్ని పరీక్షించడానికి 'చీకుముల్లు' మీద పద్యం చెప్పమన్నాడట పృచ్ఛకుడు. కవికి చిర్రెత్తుకొచ్చింది. 'నిన్ను గాల్చినగాని నీ బుద్ధి మానవే... ఛీ' అనేశాడు అసహ్యంగా మొహంపెట్టి. ఎంతమాట ఎంతమాట! అంతా ముక్కున వేలేసుకున్నారు. మళ్లీ తనే అందుకుని '...యేమందునే చీకుముల్లు' అంటూ కందాన్ని అల్లాడు. పృచ్ఛకుడి మొహమైతే కందగడ్డే అయ్యింది. మన హాస్యంలో ఘాటెక్కువ, గుంటూరు మిరపకాయలా!

★ ★ ★

'తృప్తి' - సత్యం శంకరమంచి అమరావతి కథల నుంచి...

పూర్ణయ్యని బావగాడంటారు అందరూ. విందువినోదాల్లో అన్నీతానై పనులు చేస్తాడు. వంటశాల బాధ్యతంతా భుజానికెత్తుకుంటాడు. 'వంకాయ వదిలేయకూడదు, నిమ్మకాయ పిండిన అరటికాయ కూరలో కరివేపాకు రుచి తమకు తెలియనిది కాదు. చుక్కకూర పప్పులో వూరుమిరపకాయలు మిళాయించండి. పప్పుచారులో గుమ్మడి వడియాలు కలిపి చూడండి. ఇంకా విస్తట్లో మిగిల్చావేం? పూర్తి చేసి పాయసానికి ఖాళీగా ఉంచుకో, అప్పుడే మంచినీళ్లు తాగేయకు మీగడపెరుగుంది...' అందరిచేతా కొసరికొసరి తినిపించిన పూర్ణయ్య బావ, వంటవాళ్లకూ వడ్డించి, వాళ్ల భోజనాలు కూడా అయిన తర్వాత, గాడిపొయ్యి పక్కన చిన్న ఆకు వేసుకుని కూర్చున్నాడు. కూరలు మిగల్లేదు. పిడికెడు పులిహోరా మాత్రం ఉంది. అయినా బాధ లేదు. నలుగురూ హాయిగా, తృప్తిగా రుచిగా తిన్నారనే సంతోషమే ఆ బావగాడి తాంబూలపు పెదాలపై చిరునవ్వు!

ఆమాటకొస్తే, తెలుగువారూ పూర్ణయ్య బావలే. తమ సంభాషణా శక్తితో తిమ్మిని బమ్మిని చేయాలనో, నలుగుర్ని మభ్యపెట్టాలనో, మాటల్నే మూటలుగా మార్చుకోవాలనో కల్లో అయినా అనుకోరు.

ఒక చిరునవ్వు, ఒక ప్రశంస, ఒక కరచాలనం... ఇంతకు మించి మరేం ఆశించని అల్పసంతోషులు, అనల్ప భాషాభిమానులు... మనవాళ్లు!

తెలుగుజాతీ వర్ధిల్లు.

తెలుగు సంభాషణా పరిఢవిల్లు.

– జనార్దన కరణం

రండి... రూ.కోటి గెలుచుకోండి!

**గెలవాలని అందరికీ ఉంటుంది.
కానీ, గెలిచేవారు కొందరే ఉంటారు.
అలా గెలిచినవారే గెలవాలనుకునే వారికి మార్గదర్శకులుగా మారుతారు!
వాళ్లే సక్సెస్ గురువుల అవతారమెత్తుతారు.
అలాంటి ఓ కొత్త గురువు... కోటి రూపాయలు ఎలా గెలుచుకోవాలో నేర్పిస్తున్నాడు!**

సివిల్స్ కోసం... ఎలా చదివితే ర్యాంక్ కొట్టడం సులువో నేర్పిస్తారు.

గ్రూప్స్ కోసం... ఏం చదివితే ఇంటర్వ్యూలో పాస్ కాగలమో చెబుతారు.

ఆర్.ఆర్.బి.లో... అర్థమెటిక్స్ చిక్కుల్ని సులువుగా సాధించే ట్రిక్స్ విడమరుస్తారు. ఒకటనేంటి... ప్రతీ పరీక్షలో నెగ్గడానికీ ఓ మార్గం ఉంటుంది. ప్రతీ ప్రశ్నకీ సులువుగా జవాబును చెప్పగలిగేందుకు కొన్ని చిట్కాలు ఉంటాయి. ఆసక్తికరమైన అభ్యర్థుల కు ఆ రహస్యాలను వివరించి చెప్పడానికి పుట్టినవే కోచింగ్ సెంటర్లు. ఇలాంటివి సందుకొకటి ఉంటాయి... అది రొటీన్! మరి, డిఫరెంట్‌గా అంటే... 'టీవీ షోలో గెలవడం ఎలా' అనే అంశంపై ఎవరైనా కోచింగ్ ఇస్తారా? 'ఆ షోలో విజేతలుగా నిలవాలంటే ఈ పుస్తకం చదవండీ' అని ఎవరైనా రాస్తారా? ఈ ప్రశ్నలకి సమాధానంగా 'నేనున్నాను' అంటున్నాడు అనిల్‌కుమార్ సిన్హా. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమంలో మీరు కోటి రూపాయలను ఎలా గెలుచుకో వచ్చో నేను నేర్పిస్తాను అంటున్నాడు. ఇంతకీ ఇలా పాఠాలు చెప్పేందుకు ఈయనకి ఉన్న అర్హత ఏంటి అంటే... కేబీసీలో అతడు రూ.కోటి గెలుచుకున్నాడు!

ఆ అనుభవాలే

అనిల్‌కుమార్ సిన్హాది పాట్నా. అందరిలానే 'కేబీసీ' హాట్ సీట్‌లో అమితాబ్ బచ్చన్ ఎదురుగా కూర్చోవాలని కలలు కన్నాడు. కోటి రూపాయల ప్రశ్నవరకూ ఆ ఆటలో నిలవాలనుకున్నాడు. చివరికి ఒక్కడిగా... ఆ కోటి గెలుచుకున్నాడు! గత ఏడాది ప్రసారమైన 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్ర మంలో విజేతగా నిలిచాడు. ఆ గెలుపు వెనక చాలా కృషే ఉంది. ఎన్నో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలూ చరిత్ర పుస్తకాలతో రాత్రుళ్లు కుస్తీ పట్టాడు. విషయాన్ని నేర్చుకోవడం ఒకెత్తు అయితే... హాట్ సీటులో అమితాబ్ ఎదురుగా కూర్చుని అతడు సంధించే ప్రశ్నా స్త్రాలకు వందలమంది ప్రేక్షకుల సమక్షంలో సమాధానం చెప్పడం మరో ఎత్తు. అందుకే, మానసికంగా సిద్ధపడేందుకూ శిక్షణ తీసుకు న్నాడు. అలా కేబీసీ సమరంలో విజేత య్యాడు. తరువాత సిన్హాకి ఓ ఆలోచన వచ్చింది. "నేను రూ. కోటి గెలుచుకున్నానని ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరికీ తెలిసింది. వేలకొద్దీ మెసేజ్‌లు నా ఫోన్‌కి వచ్చాయి. వాటన్నింటి సారాంశమూ దాదాపు ఒక్కటే. 'కేబీసీకి మీరెలా సిద్ధపడి వెళ్లారూ' అని. నిజమే, నేను విజేతను అని అందరికీ తెలుసు. కానీ, ఎలా విజేతనయ్యానో తెలీదు. ఆ అనుభవాలన్నింటినీ ఓ పుస్తకంగా రాయాలన్న ఆలోచన వచ్చింది" అని వివరిస్తారు సిన్హా. అలా రాసిన పుస్తకమే 'ఏబీసీ టు కేబీసీ'.

మరో అడుగు

పుస్తకానికి మంచి ఆదరణ లభించింది. కేబీసీ షోకి వెళ్దాం అనుకున్నవారందరికీ ఇదో మార్గదర్శకంగా మారిపోయింది. దాంతో మరో అడుగు ముందుకేశాడు సిన్హా. కరోడ్‌పతి రహస్యాలను నేరుగా వివరించేందుకు ఒక కోచింగ్ సెంటర్‌ని తెరిచారు. అనూహ్య స్పందన. ఇప్పటివరకూ 250 మందికిపైగా ఈ సెంటర్‌లో పాఠాలు నేర్చుకున్నారు. కేబీసీ విజయ సూత్రాలను ఒంట పట్టించుకోవడం కోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగు తుండటంతో ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టే శాడు సిన్హా. 'కేబీసీ గురు'గా అవతారమెత్తాడు. మరో పుస్తకం 'కైసా బనే కరోడ్‌పతి' రాశాడు. ఈ పుస్తకాలే అతడి కోచింగ్ సెంటర్‌లో పాఠ్య పుస్తకాలు. ఆత్మవిశ్వాసం... హాట్ సీటులో ధైర్యంగా కూర్చోవడం... క్లిష్టమైన ప్రశ్న ఎదురైనప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించడం... చుట్టూ ఉన్న ప్రేక్షకుల కోలాహలంలోనూ నిశ్చలంగా ఉండగల గడం... నిర్ణయాలను ధైర్యంగా తీసుకోగల గడం... ఇవీ సిన్హా నేర్పుతున్న పాఠాలు. ఇక, శిక్షణ రుసుము ఎంతా అంటారా... ప్రస్తుతానికైతే ఉచితమే. నిర్వహణ ఖర్చులు పెరుగుతుండటంతో కోర్సుకి కొంత ఫీజును నిర్ణయించాలనుకున్నాడు.

దక్కింది చాలు

కోరుకున్న వారందరికీ కోట్లు దక్కాలనేం లేదు! లక్షలు వచ్చినా ఆనందమే కదా. సిన్హా దగ్గర శిక్షణ పొందినవారు ఈ మధ్య కేబీసీలో మెరిశారు. వినీత్‌కుమార్‌ది కోయంబత్తూర్. 'కేబీసీలో పాల్గొనేందుకు పదిరోజులే సమయ ముంది. ఎవరితో మాట్లాడాలో... ఏం చదువు కోవాలో అర్థం కాక చాలా టెన్షన్ పడ్డాను. అప్పుడు సిన్హా గురించి తెలుసుకుని ఫేస్‌బుక్ ద్వారా సంప్రదించాను. ఆయన వల్లే ఆరున్నర లక్షలు గెలుచుకున్నాను' అని చెబుతాడు. 'ఆయన చెబుతున్న పాఠాలు మాకెంతగానో ఉపయోగపడుతున్నాయి' అని చెబుతుంది ప్రస్తుతం శిక్షణలో ఉన్న ఓ అమ్మాయి. 'ఒక టీవీ షో కోసం శిక్షణ ఇవ్వడం ఇదే ప్రథమం. అయితే... ఇక్కడ నేనిస్తున్న శిక్షణ కేవలం టీవీ కార్యక్రమం కోసమే కాదు. ఈ పాఠాలు నిజజీవితంలోనూ ఎంతో ఉపయోగపడతాయి. కేబీసీలో కోటి గెలుపు అన్నది ఒక కెరీర్ కాదు. ఒక అవకాశం. దానికోసం ఒక ప్రయత్నం చేయడం తప్పుకాదు. ఆ చేసేదేదో సీరియస్‌గా చేయాలంటాను' అని చెబుతాడీ బీహారీ బాబు. ★



బాంధవ్యబంధం

– వలివేటి నాగచంద్రావతి

"ఇందాక మార్కెట్లో జయమ్మ పి... కనిపించింది." తెచ్చిన కూరలు విడదీస్తూ స్వరంలో ఏ భావమూ తొణకనీకుండా చెప్పాను.

'దారిలో పులి ఎదురొచ్చింది' అని చెప్పినట్టుగా ఉలిక్కిపడింది అమ్మ. అంతలోనే తెప్పరిల్లి "దుష్టగ్రహ దరిశనం. వెంటనే తలస్నానం చెయ్. కొంతన్నా దోషం పోతుంది" కఠినంగా అని విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

ద్రోహం - అది చేసిన గాయం ఇన్నేళ్ళయినా మానుపట్టలేదు అమ్మకి. అవును, ఆ దెబ్బ సామాన్యమైనదా! నిట్టూర్చాను.

నేను ఆఫీసుకు తయారవుతుండగా మళ్ళీ గదిలోకి వచ్చింది అమ్మ. "దేవీ" అని ఆగి, "ఎలా ఉన్నదది?" అనడిగింది. అమ్మ కంఠంలో మొహమాటం తెలుస్తోంది నాకు. 'అది' అంటే జయమ్మ పిన్ని. స్వయానా అమ్మకి చెల్లెలు. అమ్మ దృష్టిలో దుష్టగ్రహం.

"బావుంది."

"ఎందుకు బావుండదూ" అమ్మ మామూలయిపోయింది. "అందరి ఉసుర్లూ పోసుకుని అది బాగానే ఉంటుంది. దాని సెగ తగిలి మనమే మాడిపోయాం. ఆ- ఆ- నేనూ చూస్తాగా - ఎన్నాళ్ళో ఆ మిడిసిపాటు - దేవుడు లేడూ" చివర్లో అమ్మ గొంతులో ఆ విసురు స్థానే తడివచ్చి చేరుకుంది.

అమ్మ ఆక్రోశం పూర్తవటానికి కాలపరిమితి ఉండదు ఒక్కోసారి. సానుభూతిగానో విచారంగానో చూస్తూండటం మినహా ఏం చేయగలను?

'మౌనమె నీ భాష ఓ మూగ మనసా...' నాకిష్టమైన ఆ పాట నా సెల్ రింగ్‌టోన్. సెల్ మోగటం విని మాటలాపింది అమ్మ. ప్రశ్నార్థకంగా మొహంపెట్టి ఊపిరి పీల్చుకున్నాన్నేను. సెల్ చెవి దగ్గర కొచ్చింది. అవతలున్నది గిరిజ. డా॥ గిరిజ. నాకు మంచి స్నేహితురాలు.

"బ్లడ్ డొనేట్ చేసి ఎన్నాళ్ళయింది? అహ ఏం లేదూ, నీ గ్రూప్ రక్తం చాలా అవసరం ఓ పేషెంటుకి."

"పది రోజులయింది. పర్లేదులే ఇస్తాను. ఎప్పుడు రమ్మంటావ్, ఆఫీసుకు వెళుతూ రానా. ఓ పావుగంటలో పంపించేస్తావుగా?" అడిగాను ఆలస్యం చేయకుండా.

"ఏమిటీ, రక్తం ఇస్తావా... మతిగానీ పోయిందా. పదిరోజులన్నా అవలేదు ఆ యాక్సిడెంటు కుర్రాడికిచ్చి, మళ్ళీ అప్పుడేనా? ఉహుఁ నేనొప్పుకోను. నువ్వు వెళ్ళటానికి వీల్లేదు" కీచుగొంతుతో అరుస్తోంది అమ్మ.

తననిప్పుడు ఒప్పించి వెళ్ళాలనుకోవటం సాధ్యమయ్యేపనికాదు. నేను కామ్‌గా వెళ్ళి స్కూటీ తీశాను. "ఆగు, నేనూ వస్తాను" వారించే వ్యవధి ఇవ్వకుండా వెనకెక్కి కూర్చుంది అమ్మ.

ఇక తోవ పొడుగునా నస పెడుతూనే ఉంది. "దానానికైనా ధర్మానికైనా ఓ హద్దుండాలే. నీకేం, తగుదునమ్మా అని పదిరోజులకోమాటు రక్తం ధారపోసొస్తావ్. ఇల్లా పాటికి పదిమాట్లు రక్తం ఓడుస్తూపోతే ఒంట్లో సత్తువేం మిగుల్తుంది? తయ్యిమంటూ బయల్దేరావ్, అక్కడ కళ్ళు తిరిగి పడిపోతే నీకెవరు దిక్కు? ఆ డాక్టరుకేమీ- ఇస్తానంటే చర్మమైనా ఒలిచి ఇచ్చెయ్యమంటుంది. మనకే బుద్ధుండాల్సింది. వెడుతున్నాంగా చెబుతా... ఆ డాక్టరుతోనే చెబుతా - ఎవరికి నెత్తురు అవసరంపడినా నీకు నా కూతురే జ్ఞాపకం రావటం న్యాయం కాదమ్మా అని."

నేనెప్పుడు బ్లడ్ డొనేట్ చేసినా అమ్మ అలా కస్సుకస్సుమంటూనే ఉంటుంది. నవ్వుకున్నాను. గిరిజ ముందుకు వెళ్ళేదాకానే అమ్మ ప్రతాపం అని నాకు తెలుసు.

మమ్మల్ని చూడగానే "థాంక్ గాడ్, వచ్చేశారా! రండి రండి" అంది గిరిజ రిలీఫ్‌గా.

కూర్చున్నాం.

"రెండురోజుల కిందటే జాయినయింది ఆ పేషెంటు. నార్మల్ డిసీజ్ అనుకున్నారట. గచ్చాకు పుచ్చాకు వైద్యం చేసి వ్యాధిని బాగా ముదరపెట్టేశారు. టెస్టులన్నీ చేయించాం. హైదరాబాదు తీసుకువెళితే బెటర్ అన్నారు ప్రమోద్."

ప్రమోద్ గిరిజ భర్త. ఆయన కూడా డాక్టరే.

"ఉన్నట్టుండి ఈ తెల్లవారుజామున బ్లడ్ వామిటింగ్ చేసుకుంది. అసలే బాగా ఎనిమిక్‌గా ఉంది. జర్నీలో కొలాప్సయ్యే ప్రమాదం ఉంది. బ్లడ్ ఎక్కిద్దాం అనుకున్నాం. వెంటనే నువ్వు గుర్తొచ్చావ్. నీ బ్లడ్ గ్రూపే తనది. ఏబి నెగెటివ్. వేరే 'వే' ఆలోచించలేదు నేను. వెంటనే నీకు ఫోన్ చేశాను."

పులుకూ పులుకూ చూస్తోంది అమ్మ మాట్లాడకుండా. "అన్నట్టు అమ్మా-" గిరిజ అమ్మవైపు తిరిగింది.

"వాళ్ళు మీ ఊరునుంచే వచ్చారట. పల్లెటూరు కదా, బహుశా మీకు తెలిసినవాళ్ళయి ఉండొచ్చు. రూమ్ నంబర్ ఫిఫ్టీన్‌లో ఉన్నారు. ఓసారి తొంగిచూసి రండి. ఈలోగా..." నావైపు అర్థవంతంగా చూసింది గిరిజ.

'నాకు రక్తం తీసేటప్పుడు అమ్మ చూసి బాధపడకుండా ఈ ఏర్పాటన్నమాట. పాపం గిరిజ ఉద్దేశ్యమయితే మంచిదేకానీ ఆమెకి ఒకటి తెలీదు - ఆ ఊరన్నా ఆ ఊరి మనుషులన్నా అమ్మకి తగని ద్వేషమని. ఇప్పుడా ఊరి పేషెంటుకి రక్తం ఇవ్వటానికి ససేమీ వీల్లేదంటుందేమో ఖర్మ.' భయంభయంగా అమ్మ వంక చూశాను. అమ్మ మొహంలో కలవరపాటు, అయిష్టం. కానీ, అందులోనే తొంగిచూస్తున్న ఓ కుతూహలం కనిపించాయి నాకు. గిరిజ సూచనని ఒప్పుకున్నట్టుగా కదిలింది కూడా - అమ్మయ్య.

కానీ, అలా వెళ్ళిన అమ్మ ఇలా తిరిగొచ్చేసింది గోడకి కొట్టిన బంతిలాగ. మళ్ళీ ఎలాగ..? తుఫాన్‌లాగ. వస్తూనే, "పద, నువ్వెవ్వరికీ రక్తం ఇవ్వక్కరలేదిక్కడ. పద- ముందు లే..." దూకుడుగా అంటూ నా చెయ్యి పట్టుకు గుంజటం మొదలుపెట్టింది.

వెళ్ళినప్పుడు ప్రసన్నంగానే వెళ్ళిందే. ఉన్నట్టుండి అమ్మ ఎందుకిలా మారింది చెప్మా!

"ఎందుకమ్మా, అలా అంటున్నారు? ఆమె ఎంత ప్రమాదంలో ఉందో చెప్పాను గదా" కలవరపడుతూ అడుగుతోంది గిరిజ.

"ప్రమాదంలో కాకపోతే నిప్పుల్లో ఉండనీ, నాకు చింతలేదు. దానికి నా బిడ్డ రక్తం మాత్రం ఇవ్వనివ్వను" కసిగా అంది అమ్మ, నా చెయ్యి వదలకుండా.

"వాళ్ళు మీకు తెలుసా అమ్మా" అనుమానంగా అడిగింది గిరిజ.

"తెలుసు" తమాయించుకోటానికన్నట్టు ఓ క్షణం ఆగింది అమ్మ. "ఇదిలా మోడులా

మిగిలిపోటానికీ నేనిట్టా ముండమోపినవ్వ టానికీ కారకులెవరో తెలుసా? వాళ్ళు. ఇప్పుడు చెప్పు, కాటేసిన పాముకి పాలు పొయ్యమంటావా?" ఆవేశపడితే అమ్మకి ఆయాసమొస్తుంది.

ఇక మాట్లాడలేకపోయింది గిరిజ.

"జబ్బుపడ్డది ఎవరమ్మా?" సంశయిస్తూనే నిర్ధారణ కొరకు అడిగాను.

"జాహ్నవి"

హతోస్మి. జాహ్నవి అంటే జయమ్మ పిన్ని కూతురు. అర్థిస్తే రాష్ట్రపతి క్షమాభిక్షయినా దొరకవచ్చేమోగానీ అలా వేడుకునే అర్హత కూడా లేదు మా దృష్టిలో వాళ్ళిద్దరికీ.

నేను నిస్సహాయంగా చూసి లేచాను.

"నెవర్‌మైండ్. నీ బ్లడ్ అయితే మరే ప్రాబ్లమ్ ఉండదు కదా అనుకున్నాను, అంతే. నేను ఆల్టర్నేట్ కోసం ప్రయత్నిస్తాను" అంది గిరిజ.

ఆసుపత్రి బయటకు వచ్చేశాం. అమ్మని ఆటో ఎక్కించాను.

"ఆగు, ఇలారా."

స్కూటీ స్టార్ట్ చేయబోయేదాన్నల్లా ఆగి ఆటో దగ్గరకొచ్చాను.

"నామీద ఒట్టెయ్, వెనక్కెళ్ళి రక్తం ఇచ్చిరానని" నా చెయ్యి లాగి తన తలమీద పెట్టుకుందమ్మ. పట్టుపడితే అమ్మంత మొండిది లేదు.

"అలాగే"

ఆటో కదిలింది.

నేను ఆఫీసుకు వచ్చేశాను. లెడ్జర్లు ముందే సుకున్నాను. మనస్సు కల్లోలంగా ఉంది. పేజీల్లో అంకెలూ అక్షరాలూ అల్లుకుపోయి అవుపడుతున్నాయి.

నాకు తెలుసు. గిరిజ ఇప్పుడు ఫోన్ చేస్తుంది- 'ఏమిటా గాథ?' అని. ఏమని చెప్పను? వద్దు వద్దంటున్నా మనస్సు గతాన్ని కెలికింది.

టౌనుకి కాస్త దగ్గరగా ఉన్న పెద్ద పల్లెటూరు మాది. పంచాయతీ ఆఫీసుతో పాటు ఆసుపత్రీ చిన్న గ్రంథాలయమూ, హైస్కూలు కూడా ఉన్నాయ్. ఆ హైస్కూల్లో తెలుగు మాస్టారు మా నాన్న. భాషా ప్రవీణ ఆయన. శాస్త్రం తెలిసినవాడనీ, సంస్కృతం చదివినవాడనీ, మంచీచెడ్డా విచక్షణ కలవాడనీ ఊర్లో అందరికీ నాన్నంటే గౌరవం, భక్తి.

నాకు పదేళ్ళప్పుడనుకుంటాను- మా జయమ్మ పిన్నివాళ్ళు వాళ్ళ ఒక్కగానొక్క సంతానం జాహ్నవిని తీసుకుని మా ఊరికి కాపురమొచ్చేశారు. మా చిన్నాన్నగారు అన్నదమ్ముల విభేదాలతో విడిపోయి మా అమ్మానాన్నల ప్రోద్బలంతో ధాన్యం కమీషన్ వ్యాపారం ప్రారంభించారు ఈ ఊరొచ్చి. మా ఇంటికి రెండు సందుల అవతల వీధిలోనే ఉండేవాళ్ళు.

వాళ్ళూ మేమూ చాలా అన్యోన్యంగా ఉండేవాళ్ళం. చిన్నతనంలోనే తల్లిపోతే ఒకరికి ఒకరై పెరిగారట అమ్మా పిన్నీ. పిన్నంటే అమ్మకి పంచప్రాణాలు. జాహ్నవికీ నాకూ దాదాపు ఒకే వయస్సు. స్కూల్లోనూ ఇంటాబయటా అంటుకు తిరిగేవాళ్ళం. మా ఆటలకీ కబుర్లకీ నవ్వులకీ ఎంత సమయమూ చాలేది కాదు. మా అన్న గోపీ అయితే ఎప్పుడూ పిన్నీ వాళ్ళింట్లోనే ఉండేవాడు. మగపిల్లలు లేకపోవటంవల్ల అనుకుంటాను... చిన్నాన్నగారు కూడా వాణ్ణి బాగా చేరదీసేవారు.

ఆ రోజులెంత బావుండేవని. అమ్మ తరచూ ఏదో స్పెషల్ వంట - గుమ్మడి పులుసు చేశాననో, మెంతి వంకాయ బాగా కుదిరిందనో పిన్నివాళ్ళని భోజనానికి పిలిచేది. పిన్ని ఇంట్లో ఏ టిఫిన్ చేసినా తీసుకొచ్చి మాకు రుచి చూపించేది. ఇక పండగలూ పబ్బాలూ పూజలూ ఫంక్షన్లూ లాంటి విశేష మైన రోజులైతే చెప్పనే అక్కర్లేదు - అందరం ఒకరి ఇంట్లోనే జరుపుకునేవాళ్ళం. అందరం

చేరినచోట సంతోషం విరగపండేది.

జీవితం సుఖంగా జరిగిపోతున్నప్పుడు కాలం పరిగెడుతోందన్న సంగతే గుర్తుండదు. చూస్తుండగానే పిన్నివాళ్ళు మా ఊరొచ్చి అయిదేళ్ళయిపోయింది.

హాయిగా వీనులవిందు చేస్తూ సాగిపోతున్న రాగాలాపనలో ఉన్నట్టుండి ఓ అపశ్రుతి దొర్లింది.

మా చిన్నాన్న ఒక ఆసామికని బేరమాడిన ధాన్యాన్ని ఎక్కువ కమీషన్‌కి ఆశపడి ఇంకొకరికి అప్పగించాడని అభియోగం.

"చూశారా మాస్టారూ, మీ తోడల్లుడు ఏం చేశాడో- నేనతని మాటన్నమ్ముకుని మిల్లు వాళ్ళకి ధాన్యం వేస్తానని ఒప్పుకున్నాను. అడ్వాన్సు కూడా తీసుకున్నాను. ఇప్పుడీ యన ఇలా మోసం చేశాడు. అదేమిటయ్యా అనడిగితే, 'మాటే గదా అన్నానూ, బయానా తీసుకోలేదు కదా. అంచేత నేను చేసినదాన్లో తప్పేంలేదూ' అంటున్నాడు. ఇదేమన్నా బాగుందా చెప్పండి. ఇప్పుడా మిల్లు వాళ్ళకి ఏం సమాధానం చెప్పన్నేను" అని నాన్న దగ్గర వాపోయాడా నష్టపోయిన పెద్దమనిషి.

"ఈ పల్లెటూర్లలో డబ్బుకంటే మాటకే విలువెక్కువ కేశవా! వ్యాపారానికి నిజాయతీ ముఖ్యం. రేపు నీ మాటలెవరు నమ్ముతారు చెప్పు. నువ్వు చేసింది చాలా తప్పు సుమా" పెద్ద తరహాగా చిన్నాన్నని మందలించారు నాన్న.

ఎదురు మాట్లాడలేదుగానీ చిన్నాన్నకది నచ్చలేదు. అహం దెబ్బతింది. 'ఈయనెవరు నాకు చెప్పడానికి' అన్నారట వెనకాల. అప్పట్నుంచీ ఇద్దరిమధ్యనా సుహృద్భావం చెడింది. అమ్మ సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. చిన్నాన్న మొహం ముడుపు విడలేదు. నాల్రోజులు గడిస్తే అపార్థాలు వాటంతట అవే మాసిపోతాయి అని ఆశపడింది అమ్మ. కానీ, అందుకు పరిస్థితులు అనుకూలించలే దు. నాన్న అన్నట్టుగానే ఆ నష్టపోయినతను చేసిన ప్రచారంతో చిన్నాన్న వ్యాపారం బాగా కుంటుపడింది. కూడతీసుకోటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

ఈలోపల ఎన్నో డబ్బు ఇబ్బందులు. వాటి మూలంగా ఆలుమగల మధ్య కీచులాటలు... అవి చాలవన్నట్టు ఆ ఏడాదే జాహ్నవి టెన్త్ ఫెయిలయ్యింది. వెక్కిరిస్తున్నట్టుగా నేను ఫస్టుక్లాసులో పాసయ్యాను.

ఈ చికాకుల్తో మొదట్లో తటస్థంగా ఉన్న పిన్ని పూర్తిగా మగనివైపుకి తిరిగిపోయింది. తమ ఇక్కట్లన్నిటికీ మూలం పాపాలన్నిటికీ భైరవుడూ మా నాన్నే అన్న నిర్ణయానికి వచ్చేసింది. రాకాపోకా తగ్గించేసింది. పుల్లవి రుపు మాటలూ నిష్ఠూరాలూ ఎక్కువ య్యాయి. ఎప్పట్నించి దాచుకున్నదో ఏమో మామీద అసూయని- మేము ఆస్తిపరులం కావటం, జాహ్నవికి చదువు అబ్బకపోవటం, నేను అందంగా ఉంటాననీ వాళ్ళూ వీళ్ళూ అనటం, ఊరివాళ్ళంతా మాపట్ల ఎక్కువ వినయ విధేయతలు కనబరచటం... వీటన్నిటిమీదా తన అక్కసుని వ్యంగ్యంగా వెటకారంగా ఎద్దేవా చేస్తున్నట్టుగా మాటల్లో బయటపెడుతోంది పిన్ని.

"మాకే ముదనష్టాలూ కలవలేదమ్మా. పైసా కోసం అలానే కక్కుర్తిపడతాం మరి..." అన్నదోసారి.

ఎప్పుడో నాన్న మేనత్తకి పిల్లలు లేని కారణంగా ఆవిడ ఆస్తి మా నాన్నకి రాసిపోయిందట - అదీ విషయం.

'బంగారబ్బొమ్మ, చదువుల సరస్వతి' అని నోరారా నన్ను మెచ్చుకున్న మా పిన్ని, 'తెల్ల తోలుండగానే సరా, కళా కాంతీ ఉండక్కర్లా' అంటోందిప్పుడు. మా నాన్న స్కూల్లో మాస్టారవటంబట్టి నాకు మార్కులు ఎక్కువే యించి క్లాసు తెప్పించారన్నది ఇంకోసారి.

'నా చెల్లెలు ఇంత చుప్పనాతా?'

పాపం విలవిల్లాడిపోయింది అమ్మ.

ఇవన్నీ చిన్నచిన్న మొట్టికాయలు. కపాలం

బద్దలయ్యే పిడికిలిపోటు తరవాత వేసింది.

నేను కాలేజీలో చేరాను. అన్నయ్యతోపాటు బస్‌లో కాలేజీకి టౌన్‌కి వెళ్ళి వస్తున్నాను.

ఆరోజు- బస్ వచ్చే టైమయిందని త్వర త్వరగా తయారవుతున్నాం అన్నయ్యా నేనూ.

"ఇంత పొద్దెక్కింది. రాజేశ్వరమ్మగారు ఇంకా లేచినట్టుగా లేదు. ఒంట్లో బాగుందో లేదో ఓసారి చూసిరా" అంది అమ్మ.

రాజేశ్వరమ్మ ఆంటీది మా పక్కిల్లే. ఒంటరిగా ఉంటారు. భర్త పోయి నాలుగేళ్ళ యింది. పొలం నుంచి వస్తుంటే పురుగు ముట్టిందట. కూతురు అత్తవారింట్లోనూ కొడుకు వేరే రాష్ట్రంలో చదువుకుంటూనూ ఉన్నారు. మంచావిడ. తనేమో తన పనేమో, అంతే. పిన్ని తనకు దూరమైన వెలితితో అమ్మ ఈమధ్య తనకు తానుగా ఆవిడకు చేరువయింది.

తలంటుకున్న జుట్టు ముడి వేసుకుంటూనే హడావుడిగా పక్కింటికి వెళ్ళాను. తలుపు తట్టబోతే దగ్గరకు వేసుంది కాబోలు- తెరుచుకుంది. ఆంటీని పిలుస్తూ లోపలికి వెళ్ళాను. మూలుగు వినిపించి, గదిలోకి వెళ్ళాను. జ్వరమొచ్చినట్టుంది, మంచం మీద పడున్నారు ఆంటీ. ఒంటిమీద చేయి వేశాను. కళ్ళు తెరిచారు.

"భయపడకండి ఆంటీ, అమ్మని పంపిస్తాను" అంటూ వంగున్నదాన్ని లేవబోతున్నాను. అప్పుడు పడిందో చేయి భుజంమీద కర్కశంగా.

ఒళ్ళు జలదరించింది. "ఎవరు?" అన్నాను హడలిపోతూ. జవాబుగా నా రెండోభుజం మీద కూడా బలంగా చేయి వేసి ముందుకు తిప్పుకుంటున్నదో మృగం.

"ఒరేయ్, అదేం పనిరా... ఒదులు, ఒదలరా వెధవా. వద్దురా, తప్పురా" అంటూ లేవలేక లేస్తూ అడ్డుకోవాలని చేయి చాస్తూ అరిచారు ఆంటీ.

ఏమవుతోందో నాకేం తెలీటంలేదు. పెనుగులాడుతున్నాను, అరుస్తున్నాను. అదృష్టం... ఆంటీ ఎలాగో లేచారు. తూలుతూ వచ్చి వాడి వీపుమీద చరిచారు. నన్ను విడిపించారు. తలుపు తెరుచుకుని బయటపడ్డానెలాగో.

ఎలా ఉన్నానప్పుడు... ఓణీ ఎక్కడో పడిపోయింది, జాకెట్ హుక్ తెగిపోయింది. జుట్టుముడి విడిపోయింది. ఆయాసంతో ఏడుస్తూ ఇంటికి పరిగెత్తుకు వచ్చాను. 'బయట ఎవరైనా ఉన్నారా, నన్ను చూస్తున్నారా' అన్న స్పృహే లేదు.

నా వెనకే ఆంటీ కూడా పడుతూ లేస్తూ వచ్చారు మా ఇంటికి. మా అమ్మ చేతులు పట్టుకున్నారు కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ "రేవతీ, నన్ను క్షమించమ్మా. వాడు మనిషి కాదు పశువు. అర్ధరాత్రివేళప్పుడు వచ్చాడు. డబ్బిమ్మని కాళ్ళావేళ్ళా పడ్డాడు. పినతల్లి కొడుకమ్మా వాడు. కాదనలేకపోయాను. అంత రాత్రప్పుడు పొమ్మనలేక తెల్లారగానే ఇంతో అంతో ఇచ్చి పంపించేద్దామనుకున్నాను. పులకమొచ్చి లేవలేకపోయానమ్మా. తాగుబోతని తెలుసుగానీ సీసా వెంట తెచ్చుకుంటాడనిగానీ పొద్దున్నే తాగి ఇంత అఘాయిత్యం చేయబోతాడనిగానీ అనుకోలేదు. ఎలాగో లేవగలిగాను కాబట్టి సరిపోయింది. బిడ్డ దడిచిపోయింది. నన్ను మన్నించు తల్లీ. వాణ్ణిప్పుడే తన్ని తగిలేస్తాను" అంటూ విలవిల్లాడిందావిడ.

మా పిన్నికి ఈ వార్తని ఎవరు ఏ రకంగా అందించారో, ఆవిడ దాన్ని ఇంకెలాగ అర్థం చేసుకుందో తెలీదుగానీ - ఈ సంఘటననీ మూణ్ణెళ్ళ తరవాత టౌన్‌లో నాకు చేయించిన అపెండిసైటిస్ ఆపరేషన్‌నీ ముడిపెట్టి దానికో దిక్కుమాలిన రంగు అద్ది ఆయుధంలాగా దాచి, సిద్ధంగా ఉంచుకుందనుకుంటాను.

మూడేళ్ళ తరవాత ఆ ఆయుధాన్ని ప్రయోగించే అవకాశం దొరికిందావిడకి.

నా నిశ్చితార్థం ఇంకొన్ని గంటల్లో. పెళ్ళివారి కోసం ఎదురుచూస్తున్నాం. వరుడు ఎవరో కాదు... మా అన్నయ్య క్లాస్‌మేట్ గిరీష్. అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తూండే వాడు. నన్ను ఇష్టపడ్డాడని నాకే తెలీదు. పెళ్ళి ప్రస్తావన వాళ్ళవైపు నుంచే వచ్చింది. మంచి సంబంధమని, నా డిగ్రీ పూర్తవక పోయినా ఒప్పుకున్నారు నాన్న.

ముహూర్తం దగ్గరపడింది. వాళ్ళు రాలేదు. సమయం దాటిపోయింది. వాళ్ళు రానేలేదు. అన్నయ్య సెల్‌కి సమాధాన మొచ్చింది. తాము రావటంలేదనీ ఒకసారి అబార్షన్ అయిన పిల్ల తమకవసరంలేదనీ కరుగ్గా చెప్పిందట గిరీష్ తల్లి.

అంతే, అక్కడికక్కడే కూలిపోయారు నాన్న. మరి లేవనేలేదు. అప్పటివరకూ ఆనందోత్సాహాల వెల్లువలా ఉన్న ఇల్లు క్షణంలో శోకసముద్రమయింది. పచ్చని తోరణం కట్టిన ఇంటి ముందునుంచి ఏడుకట్ల సవారీ ఎక్కి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయారు నాన్న.

ఎంతటి విషాదమైనా తొలినాటి గాఢత నిలవదు. మా దుఃఖం పలచబడింది. అన్నయ్య తనవంతు బాధ్యతగా గిరీష్ దగ్గరకు వెళ్ళాడు. "మీకు దగ్గర బంధువులు చెప్పిన సమాచారమే ఇది. మీతో బంధుత్వానికి మా పేరెంట్స్ ఇష్టపడటంలేదు. సారీ" అన్నాడట గిరీష్.

'ఇది పిన్నీవాళ్ళ నిర్వాకమే' ఆవేశపడ్డాడు అన్నయ్య. అమ్మా నేనూ ఊరుకోబెట్టాం.

ఆ తర్వాత చిన్నాన్న, పిన్నీ గిరీష్ వాళ్ళ దగ్గరకు పిల్లనిస్తామని వెళ్ళి, కాదనిపించుకు వచ్చారట. అన్నయ్యకి కోపం ఆగక, అడ్డుకుంటున్నా వినక పిన్నీవాళ్ళ మీదకి జగడానికి వెళ్ళాడు. ఫలితమేముంటుంది... అల్లరి మాత్రం అయింది.

'ఏమో మరి, ఆ రోజున ఆ అమ్మాయి ఆ ఇంట్లోంచి బయటకు వచ్చిన వాలకం అనుమానాస్పదంగానే ఉంది మరి. మూణ్ణెళ్ళ తరవాత ఆసుపత్రిలో నాల్రోజులుండి తిరిగొచ్చిన మాటా నిజమే. ఏమో, ఏ పుట్టలో ఏ పాముందో మనమేం చెప్పగలం? ఏ నిప్పూ లేకపోతే పెళ్ళెందుకు చెడగొడతారు అంత దగ్గరివాళ్ళు?'- చెవులు కొరుక్కున్నారు లోకులు.

అవమానభారంతో ఆ ఊరొదిలిపెట్టేశాం. విషాదాన్ని దిగమింగుకుంటూ చదువుల్లో పడిపోయాం. అమ్మ నాకు పెళ్ళి ప్రయత్నాలు చెయ్యబోయింది. వద్దన్నాను. ఇంకా పరాభవాల్ని ఎదుర్కొనే ధైర్యం నాకులేదని కచ్చితంగా చెప్పేశాను. అన్నయ్య ఉద్యోగం వంకన విదేశాలకు వెళ్ళిపోయాడు.

అమ్మా నేనూ కాలాన్ని తోస్తూ మిగిలిపోయాం. ఉద్యోగరీత్యా ఎన్నో ఏళ్ళు ఎక్కడెక్కడో తిరిగితిరిగి ఇన్నేళ్ళకు మళ్ళీ ఈ టౌనొచ్చాం. చెంపలు నెరుస్తున్నాయి నాకు. ఆశలకీ కోరికలకీ అతీతంగా బతకటం అలవాటు చేసుకున్నాను. జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది. ఇప్పుడు అవకాశం దొరికింది గదా అని ఎప్పుడో జరిగిపోయిందానికి ప్రతీకారం తీర్చుకోవాలని నాకసలు లేదు. బ్లడ్ అవసరమైన వాళ్ళకు ఎప్పుడూ కాదనక డొనేట్ చేస్తూనే ఉంటాను. ఇప్పుడు వీళ్ళకు అవసరమైంది. ఎందుక్కాదనాలి? అంతేకాదు, ఎవరో చెప్పినట్టు అపకారికి ఉపకారం చేయటం విజ్ఞత కదూ! పిచ్చి అమ్మ, అమ్మ వేసిన ఒట్టు తీసి గట్టుమీద పెట్టేశాను.

గిరిజకి ఫోన్ చేశాను. "పావుగంటలో వస్తున్నాను, నువ్వు టెన్షన్ పడకు" అని.

"అవసరం లేదు, బ్లడ్ దొరికింది. దేవీ నీకో విచిత్రం చెప్పనా... చెప్పొద్దని ఒట్టేసినా చెప్పేస్తున్నా. ఆ డోనరు ఎవరనుకున్నావ్... అమ్మ."

తుళ్ళిపడ్డాను. చెప్పలేదు కదూ అమ్మది కూడా నా బ్లడ్‌గ్రూపే.

ఆ కలం ఖరీదు ఏడు కోట్లు!

**కీబోర్డులు వచ్చినా టచ్‌స్క్రీన్లు ఎన్ని ఉన్నా...
పెన్ను పట్టుకుని రాయడంలో ఉన్న మజానే వేరు.
అలా రాయడంలో ఓ రాజసం ఉంటుంది!
అలా రాయల్‌గా రాస్తున్నవారూ ఉన్నారు.
అలా రాయించే పెన్నులకు ఇప్పుడు మాంచి డిమాండ్ ఉంది.**



సూటూ బూటూ... జేబులో ఓ పాళీ పెన్ను! ఎంత హుందాతనం. ఎంత దర్జా. సూటుకి బూటు సూట్టైందిగానీ... ఆ స్టైల్‌కి పాళీ పెన్నే కుదరదేమో అనిపిస్తోంది కదా! అవును... పెన్నును పెన్నులా కాకుండా ఓ ఆభరణంగా భావించి ధరిస్తే ఏ సూటుకైనా సూటై తీరుతుంది. ఇదో వీఐపీ స్టైల్ స్టేట్‌మెంట్. లగ్జరీ ఫౌంటెయిన్ పెన్ను ఉండటం ఇప్పుడో హోదా. వాటితో రాయడం అంటే... కేవలం సంతకం మాత్రమే పెట్టడం! అవును, ఎంతోమంది సీఈవోలూ వ్యాపారవేత్తలూ పైస్థాయి అధికారులూ లగ్జరీ పెన్నులను చెక్కు బుక్కులూ ఆఫీస్ ఫైల్స్ మీద సంతకాలు పెట్టేందుకే ఉపయోగిస్తున్నారు. ఈ పెన్నులను జేబులో పెట్టుకోవడం కూడా ఓ స్టైలే. బహుమతిగా ఎవరికైనా ఇవ్వడమూ ఓ హోదానే.

కానీ.. పెరిగింది

కంప్యూటర్లూ సెల్‌ఫోన్లూ టాబ్లెట్లూ ఎక్కువైపోయి పెన్నులతో రాసే పని చాలా వరకూ తగ్గింది. ఈ లెక్కన మామూలు పెన్నులకు డిమాండ్ తగ్గాలి. అలానే తగ్గింది కూడా. కానీ, లగ్జరీ పెన్నుల మార్కెట్ మాత్రం ప్రతీయేటా పెరుగుతూనే వస్తోంది. రూ.15,000 నుంచి రూ.40,000 ఖరీదున్న పెన్నుల అమ్మకాలు మనదేశంలో ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలోనే అత్యధికులు లగ్జరీ పెన్నులు వాడుతున్నారు. అంతేకాదు... వీటిని వినియోగించేవారిలో సింహభాగం 50 ఏళ్లు పైబడినవారు కావడం మరో విశేషం. ఇక, ఖరీదైన కలాల విషయానికొస్తే...

రూ.కోటి విలువ చేసేవి కూడా మనదేశంలో బాగా అమ్ముడవుతున్నాయి. లా మోడర్నిస్టా అనీ ఓ పెన్నుంది. దానిపై రోడియం కోటింగ్ ఉంటుంది. బంగారపు పాళీ ఉన్న ఆ కలం ఖరీదు రూ. కోటి మాత్రమే! ఇది మన దగ్గర బాగా పాపులర్. ఇంకోటి... వినాయకుడి బొమ్మ ఉన్న సెయిలర్ పెన్ను. ఖరీదు కేవలం రూ. 4.5 లక్షలు. దీన్ని ధరిస్తున్న వారూ ఎక్కువే. ఇంకా చెప్పాలంటే... మన మెట్రోనగరాల్లో 'విలియమ్ పెన్', 'లగ్జర్', 'మాంట్ బ్లాంక్'... ఇలా వివిధ లగ్జరీ బ్రాండ్లవీ లభిస్తున్నాయి. కలం ఓ ఆభరణమైనప్పుడు... ఖరీదు కూడా తారస్థాయిలోనే ఉంటుంది. ఇక, ప్రపంచంలోనే ఖరీదైన కొన్ని ఆభరణాలేంటో చూద్దాం.

కలమే ఆభరణం

ప్రపంచంలోనే అత్యధిక ధరగల పెన్నుకి ఒళ్లంతా వజ్రాలే! అవును, అరోరా డయామంటె ఫౌంటెయిన్ పెన్ ఖరీదు సుమారు రూ.7 కోట్లు. దీన్లో 2000 వజ్రాలను పొదిగారు. దీని తరువాత చెప్పుకోదగ్గది 'కారన్ డాక్ డైమండ్' పెన్. 850 వజ్రాలతో నిండి ఉంది. పెన్ను మూతపై 26 లైన్లలో బుగాటీ కట్ డైమండ్స్‌ని అమర్చారు. ఈ పెన్ను బాడీ అంతా బంగారమే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేలేదు. దీని ఖరీదు... రూ. 5 కోట్లు. దాని తరువాత వచ్చిన హెవెన్ గోల్డ్ పెన్... దీని ఖరీదూ అంతే. 48 క్యారెట్ల వజ్రాలతో దీన్ని తయారుచేశారు. అవి కూడా వివిధ రంగుల్లో మెరుస్తూ అతి పురాతనమైనవిగా చెబుతున్నారు. ప్రముఖ బ్రాండ్ మాంట్ బ్లాంక్ కూడా కొన్ని లిమిటెడ్ ఎడిషన్ పెన్నులను తయారుచేసింది. ఆ కలం పేరు 'మిస్టరీ మాస్టర్‌పీస్'. 840 వజ్రాలుంటాయి. కావాలనుకుంటే వాటి మధ్య అక్కడక్కడా కెంపులనూ అమర్చుకోవచ్చు. వాటిని బట్టీ ఖరీదు రూ.3 కోట్ల 96 లక్షలకు కాస్త అటుఇటుగా ఉంటుంది. కారన్ డాక్ గోతికా పెన్స్ ఉన్నాయి. వివిధ రంగుల్లో ఉండే రోడియంతో ఇవి తయారయ్యాయి. ఒక్కోదాని వెల రూ.2 కోట్ల 20

లక్షలు. దీని తరువాత చెప్పుకోదగ్గది లా మోడర్నిస్టా. 96 రూబీలూ 30 క్యారెట్ల వజ్రాలతో రూపొందిన ఈ కలం కాస్ట్ రూ.కోటి యాభై లక్షలు. ఆ మధ్యన మకావో రాజు రెయినర్ 3 మరణించాక అతని పేరున మాంట్ బ్లాంక్ కొన్ని పెన్నులు తయారు చేసింది. 81వ యేట మరణించాడు కాబట్టి... కేవలం 81 కలాలనే విడుదల చేసింది. ఒక్కోదాని ఖరీదు రూ. కోటి నలభైరెండు లక్షలు. వీటి తరువాతి స్థానంలో విస్కోంటీ హెచ్చార్‌హెచ్ పెన్నులున్నాయి. ఒక్కోటీ రూ. 30 లక్షలు. ఆ తరువాతి స్థానంలోనూ అదే కంపెనీ తయారుచేసినవి ఉన్నాయి. వాటిలోని ఒక్కోదాని విలువా రూ. 22 లక్షలు. గ్రేసన్ బై కంపెనీ కూడా రూ. 13 లక్షలు ఖరీదున్న కలాలను తయారుచేసింది. ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా టాప్-10 ఖరీదైన లగ్జరీ పెన్నులు.

ఖరీదును బట్టే స్టైల్ ఉంటుంది. స్టైల్‌ని బట్టే గుర్తింపూ ఉంటుంది. అందుకే పదిమందిలోనూ ప్రత్యేకంగా నిలవాలనుకుంటున్న మిలియనీర్లు ఇలాంటి పెన్నులను ఎక్కువగా వాడుతున్నారు. ★



టాటా... వీడుకోలూ..!

టాటా... అంటే ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక సంస్థ. అంతేకాదు... ఒక నమ్మకం, ఒక విశ్వాసం, అంతకుమించి మానవీయత. ఒకటిన్నర శతాబ్దాల చరిత్ర ఉన్న టాటా బ్రాండ్ టీ నుంచి ఐటీ వరకూ కొన్నివందల రకాల సేవల్ని అందిస్తోంది. ఈ వ్యాపార సామ్రాజ్యానికి చక్రవర్తి రతన్ టాటా. డిసెంబరు 28న టాటా తన పదవికి బైబై చెబుతున్నారు. ఈ సందర్భంగా రతన్ ప్రస్థానం ఆయన మాటల్లోనే...

నేను ఈరోజు ఈస్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం నాయనమ్మ నవాజ్‌బాయి. ఆవిడ నాకు అమ్మ అనే చెప్పాలి. ఎందుకంటే నాకు ఏడేళ్లపుడే అమ్మానాన్నా విడిపోయారు. తర్వాత కొన్నాళ్లకు నాన్న రెండో పెళ్లి చేసుకున్నారు. నాయనమ్మే తమ్ముణ్ణీ, నన్నూ పెంచింది. తాత పేరు రతన్. నా పేరు కూడా అదే కావడంతో నన్ను చాలా గారాబంగా చూసుకునేది. నా స్కూల్ చదువు ముంబయిలోనే సాగింది. నాన్నగారి స్నేహితు డొకరు పిలిస్తే మొదటిసారి కుటుంబంతో కలిసి అమెరికాలో అడుగుపెట్టాను. నాకు అప్పుడు 11 ఏళ్లు. తర్వాత 14 ఏళ్లప్పుడు వేసవి సెలవుల్లో మళ్లీ అమెరికా వెళ్లి రివర్‌డేల్ సమ్మర్ స్కూల్లో చేరాను. రెండు నెలలు న్నాను. ముంబయిలో స్కూల్ చదువు పూర్తయ్యాక నాన్న ఇంగ్లండ్ వెళ్లి సీఏ చదవమన్నారు. ఆయన కూడా ఇంగ్లండ్‌లో అకౌంటెన్సీ చదివారు. కానీ, నేను అమెరికా వెళ్లి ఇంజినీరింగ్ చేస్తానన్నాను. అయిష్టంగానే పంపించారు. అమెరికాలో కార్నెల్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో చేర్పించారు. నాకు ఆర్కిటెక్ట్ కావాలని ఉండేది. మళ్లీ నాన్నను ఒప్పించి రెండో సంవత్సరంలో ఆర్కిటెక్చర్ కోర్సుకి మారిపోయాను.

విమానాలు శుభ్రంచేశా

ముంబయిలో విశాలమైన ఇల్లు, అన్ని పనులూ చేసిపెట్టే నౌకర్లు... కానీ అమెరికాలో అందరు విద్యార్థుల్లానే ఉండేవాణ్ని. అప్పట్లో రిజర్వ్‌బ్యాంక్ విదేశీ మారక ద్రవ్యం విషయంలో పరిమితి విధించేది. దాంతో నా ఖర్చులకు సరిపడా పంపలేకపోయేవారు. చాలా పొదుపుగా ఉండాల్సి వచ్చేది. కొన్నిసార్లు డబ్బు సకాలంలో అందేది కాదు. దాంతో స్నేహితుల నుంచి 100, 200 డాలర్లు అడిగి తీసుకునేవాణ్ని. అలా అడగడానికి ఇబ్బందిగా ఉండేది. కానీ తప్పేది కాదు. డబ్బుకోసం స్నేహితులతో కలిసి విమానాశ్రయానికి వెళ్లి విమానాల్ని శుభ్రం చేసేవాణ్ని కూడా. విమానాలను దగ్గరగా పరిశీలించవచ్చనే ఆసక్తి కూడా ఉండేదనుకోండి. మొదట రెండేళ్లు యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండేవాణ్ని. తర్వాత స్నేహితులతో కలిసి ఒక ఇల్లు తీసుకున్నాను. మూడో సంవత్సరంలో ఉండగా నాకు బ్లాక్ మెర్సిడెజ్ బెంజ్ కారు కొన్నారు. నా స్నేహితుల్లో చాలామందికి ఫోర్డ్ కార్లు ఉండేవి. బెంజ్ మాత్రం నా ఒక్కడికే ఉండేది. దాన్ని చాలా జాగ్రత్తగా వాడేవాణ్ని. కారు దిగాక స్నేహితులు ఎవరైనా డోర్‌ని గట్టిగా వేస్తే, 'అలా నెట్టొద్దు' అని వారించేవాణ్ని. వాళ్ల కారులో వెళ్లినపుడు నేను కారు దిగి డోర్‌ని గట్టిగా వేస్తే వాళ్లు కూడా... 'రతన్ నెమ్మదిగా...' అని జోక్ చేసేవారు. బెంజ్‌ని అరుదుగా బయటకు తీసేవాణ్ని. రోజూ యూనివర్సిటీకి వెళ్లడానికి మరో కారు ఉండేది. కారుకి చిన్నపాటి రిపేర్లు అవసరమైతే నేనే చేసుకునేవాణ్ని.

రివర్‌డేల్‌లో సమ్మర్ స్కూల్లో చేరిన సమయంలోనే చిన్న విమానాలు నడపడంలో శిక్షణకు చేరాను. నాన్న ఎప్పుడు అమెరికా వచ్చినా నన్ను ఫ్లయింగ్‌కి తీసుకెళ్లేవారు. యూనివర్సిటీలో ఉన్నప్పుడు స్నేహితుల్ని తీసుకొని ఫ్లయింగ్‌కి వెళ్లడం నాకో హాబీ అయిపోయింది. ఓసారి అలావెళ్లినపుడు గాల్లో ఇంజిన్ ఫెయిల్ అయింది. ఆ విమానంలో మరో ముగ్గురు ఉన్నట్టు గుర్తు. దాన్ని ఓ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో తక్షణం ల్యాండ్ చేద్దామనుకున్నాను. కానీ విమానం నుంచి ఎలాంటి శబ్దమూ రావడం లేదు. అక్కడ ఆడుతున్నవారు గుర్తించకపోతే ప్రమాదమని నెమ్మదిగా విమానాశ్రయం దగ్గరికి తీసుకెళ్లి రన్‌వేమీద కాకుండా, ఎవ్వరూ తిరగని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి దించాను. విమానం ఇంకా పూర్తిగా నిలవనే లేదు. స్నేహితులు భయంతో అందులోంచి బయటకు దూకేశారు. తర్వాత కొద్దిరోజులు ఫ్లయింగ్‌కి దూరంగా ఉన్నా, కొన్నాళ్లకు మళ్లీ అలవాటైపోయింది.

బామ్మకోసం భారత్ వచ్చా

1962లో ఆర్కిటెక్చర్ కోర్సు పూర్తయిన తర్వాత లాస్ ఏంజెలెస్‌లో ప్రఖ్యాత ఆర్కిటెక్చరల్ కంపెనీ జోన్స్ అండ్ ఎమన్స్‌లో ఉద్యోగం వచ్చింది. ఇక అక్కడే సెటిల్ అయిపోవాలనుకున్నాను. అప్పట్లో ఇంటికి ఫోన్ చేద్దామన్నా ముందుగా కాల్ బుక్ చేసుకోవాల్సిందే. దాంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇంట్లోవాళ్లతో మాట్లాడలేక పోయేవాణ్ని. ఓసారి నాయనమ్మకు ఒంట్లో బాగాలేదు. నన్ను చూడాలనంటే ఇండియాకి వచ్చాను. చూసి వెళ్లిపోదామనుకున్నాను కానీ, ఆవిడ ఇక్కడ కొన్నిరోజులు ఉండమంది. అప్పుడు టాటా స్టీల్‌లో చేరాను. అప్రెంటిస్‌గా కెరీర్ ప్రారంభించాను. అందరు ఉద్యోగులతో పాటే నిప్పుల కొలిమి దగ్గరే నిలబడి పనిచేసేవాణ్ణి. శరీరం ఇక్కడ పని చేస్తున్నా నా మనసు అమెరికామీదే ఉండేది. ఆ తర్వాత కూడా ఒకట్రెండుసార్లు తిరిగి అమెరికా వెళ్లిపోదామని అనుకున్నాను కానీ కుదరలేదు. ఈ మధ్యలో నాకు ఐబీఎమ్ వాళ్లు భారత్‌లో ఉద్యోగం ఇవ్వజూపారు. కానీ నేను తిరస్కరించాను. '71లో నాకు నెల్కో (నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ లిమిటెడ్) బాధ్యతలు అప్పగించారు. అప్పటికి నెల్కో నష్టాల్లో నడుస్తోంది. భారతీయ మార్కెట్‌లో దాని వాటా రెండు శాతం. దాన్ని లాభాల్లోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆ తర్వాత అమెరికా ఆలోచన మర్చిపోయాను. ఆరేళ్లలో నెల్కో లాభాల్లోకి వచ్చింది. మార్కెట్‌లో 25 శాతం వాటా సంపాదించింది. కానీ ఎమర్జెన్సీ సమయంలో ఉద్యోగుల సమ్మె కారణంగా మూసేయాల్సి వచ్చింది. నెల్కోలో ఉన్నపుడే మధ్యలో ఓ ఏడాది హార్వర్డ్‌లో ఎంబీఏ చేయడానికి వెళ్లాను. '77లో టెక్స్‌టైల్ తయారీ కంపెనీ 'ఎంప్రస్ మిల్స్' బాధ్యతల్ని అప్పగించారు. దాన్నీ లాభాల బాట పట్టించాను. విస్తరణకు రూ.50 లక్షలు అవసరమని అడిగాను. కానీ కంపెనీ బోర్డు అందుకు అంగీకరించలేదు. కొన్ని కారణాలవల్ల దాన్ని అమ్మేశారు. ఆ తర్వాత 1981లో టాటా ఇండస్ట్రీస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాను. 1983 ప్రాంతంలో అమ్మ సూనూ క్యాన్సర్ చికిత్స కోసం న్యూయార్క్ హాస్పిటల్‌లో ఉన్నపుడు చాలారోజులు తన దగ్గరే ఉన్నాను. అదే సమయంలో వ్యాపార అభివృద్ధికి ప్రణాళిక వేశాను. అందులో ఇంధనరంగానికీ, ఐటీకి ప్రాధాన్యత ఇచ్చాను. బ్యాటరీలూ, సౌరశక్తి విభాగంలో ఎక్కువ పెట్టుబడులు ఉండాలని సూచించాను. కానీ నా ప్రణాళికలో ఉన్న కొన్ని మాత్రమే అమలుకు నోచుకున్నాయి.

వారసుణ్ణంటే నమ్మలేకపోయా

జేఆర్డీ టాటాకూ, నాకూ ఫ్లయింగ్ ఒక హాబీ. వ్యాపార వ్యవహారాలతో పాటు విమానాల గురించీ మాట్లాడుకునే వాళ్లం. ఆయన ప్రోత్సాహంతో జంషెడ్‌పూర్‌లో అప్పట్లో ఒక ఫ్లయింగ్ క్లబ్ కూడా ప్రారంభించాను. వృత్తిలో నాకు ఆయనే మార్గదర్శి. ఆయన నాలో కొడుకుని చూశారో లేదో తెలియదు కానీ నేను మాత్రం అతణ్ని తండ్రిగా భావించేవాణ్ని. వృత్తిగత, వ్యక్తిగత విషయాలు చాలా ఆయన దగ్గరే నేర్చుకున్నాను. నాన్నతోకంటే ఆయనతోనే నా అభిప్రాయాల్ని ఎక్కువగా పంచుకునేవాణ్ని. ఎప్పటిలానే ఒక సోమవారం నేను ఆయన్ని ఆఫీసులో కలవడానికి వెళ్లాను. 'ఏంటి విశేషాలు' అని అడిగారు. 'శుక్రవారమే మాట్లాడాం... ఇంకేం ఉంటాయి' అన్నాను. 'నీ దగ్గర లేకపోవచ్చు కానీ నా దగ్గర ఉంది. నేను రిటైర్ అయిపోవాలనుకుంటున్నాను. నా తర్వాత సంస్థ బాధ్యతలు నువ్వే చూసుకోవాలి' అన్నారు. నేను నమ్మలేక పోయాను. అయితే ఆ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దన్నారు. ఎందుకంటే ఆ స్థానానికి మరో ఇద్దరు సీనియర్లు పోటీలో ఉన్నారని అంతా అనుకునేవారు. తర్వాత ఆయనే బోర్డు మీటింగులో అధికారికంగా చెప్పారు. అయితే అప్పటికే ఆ విషయాన్ని బోర్డు సభ్యులు ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడారు. ఆ నిర్ణయంపై కొంతమంది సీనియర్లలో అసంతృప్తి ఉండేది. మొదట్లో వారు నాకు సహాయనిరాకరణ చేసేవారు. కానీ తర్వాత పరిస్థితి నెమ్మదిగా సద్దుమణిగింది.

కార్లూ బైకులూ జేఆర్డీ కల

నేను పగ్గాలు చేపట్టేసరికి టాటా గ్రూప్‌లో 85 సంస్థలు ఉన్నాయి. వాటిలో నష్టాల్లో ఉన్నవాటిని ముందు అమ్మేశాం. ఏసీసీ, టాటా ఆయిల్ మిల్స్... ఇవన్నీ అప్పుడు వదులుకున్నవే. అప్పటికి టాటా స్టీల్ కూడా నష్టాల్లో ఉంది. కానీ అది టాటాలకూ దేశానికీ గర్వకారణమైన కంపెనీ. దాంతో వివిధ మార్గాల్లో ఖర్చుని తగ్గించుకుని దాన్ని నిలబెట్టుకున్నాం. '91 నాటికి ఏటా 78 టన్నుల ఉత్పత్తి ఉంటే,



వ్యక్తిగతం

పుట్టినతేదీ	:	డిసెంబరు 28, 1937
నివాసం	:	ముంబయిలోని కలోబాలో మూడంతస్తుల 'క్యాబిన్స్'.
టాటాలో ప్రవేశం	:	1962
టాటా సన్స్ ఛైర్మన్	:	1991
ప్రత్యేకత	:	పొగతాగరు, డ్రింక్ చేయరు.
అవార్డులు	:	పద్మభూషణ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ జీవితకాల సాఫల్య పురస్కారం... ఇంకా ఎన్నెన్నో.
ఇష్టమైన రంగు	:	ఎరుపు. ఆ రంగు పెయింటిన్గ్స్ ఎక్కువగా కొంటారు.
కళలు	:	మంచి చిత్రకారుడు, మిమిక్రీ కూడా తెలుసు.
మెచ్చే కారు	:	ఫెరారీ
ఖాళీ సమయంలో	:	పెంపుడు కుక్కలు టిటో, టాంగోలతో కాలక్షేపం. పుస్తకాలు... ముఖ్యంగా జీవిత చరిత్రలు ఎక్కువగా చదువుతారు. విమానాలూ, హెలికాప్టర్లను నడుపుతారు. కార్లో లాంగ్‌డ్రైవ్‌కి వెళతారు.

తెల్లోడి గడ్డపై

టాటా టీ 1999లో తనకంటే పెద్దదైన బ్రిటన్‌కు చెందిన టెట్లీ టీని దక్కించుకుంది. దానిద్వారా 35 దేశాల్లో అడుగుపెట్టగలిగింది. జాగ్వార్, కోరస్ కంపెనీలను హస్తగతం చేసుకొన్నాక తయారీ రంగంలో బ్రిటన్‌లో అత్యధిక సంఖ్యాకులకు (40 వేలమంది) ఉపాధి కల్పిస్తున్న సంస్థగా ఘనత దక్కించుకుంది. బ్రిటన్ ప్రధాని డేవిడ్ కేమరాన్ వాణిజ్య సలహాదారుల బృందంలో రతన్ కూడా ఉన్నారు. మాంద్యంలో కొట్టుకుపోతున్న బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు టాటా ఓ చుక్కానిలా కన్పిస్తోంది.

టాటా సామ్రాజ్యం

టాటా గ్రూప్‌లో టాటా స్టీల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టాటా మోటార్స్, తాజ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్, టాటా సెల్యులార్, టాటా బెవరేజెస్, టాటా కన్‌స్ట్రక్షన్స్, టాటా పవర్, టాటా జీపీ సోలార్, టాటా టీ, జాగ్వార్, ల్యాండ్ రోవర్, కోరస్, టైటాన్, తనిష్క్, టాటా ఫైనాన్స్... ఇలా వందకు పైగా సంస్థలు, మళ్లీ వాటిలో 300 ఉప సంస్థలు ఉన్నాయి. వీటిలో అధికంగా ఆదాయం తెచ్చేవి టీసీఎస్, టాటా మోటార్స్.

దత్త పుత్రుడి కొడుకు

రతన్ టాటా తండ్రి నావల్ ఓ బట్టల మిల్లులో పనిచేసే సాధారణ ఉద్యోగి కొడుకు. నావల్ నాలుగేళ్ల పుడే తండ్రి చనిపోయాడు. తర్వాత నావల్ ఓ పార్సీ అనాథాశ్రమంలో చేరారు. నావల్ నాయనమ్మా, జంషెడ్జీ టాటా భార్యా, అక్కా చెల్లెళ్లు. జంషెడ్జీకి ఇద్దరు కొడుకులు దోరాబ్జీ, రతన్. వీరిద్దరికీ పిల్లలు లేరు. నావల్‌ను దత్తత తీసుకోవాలన్న ఆలోచన రతన్ దంపతులకు ఉండేది. 1918లో రతన్ ఆకస్మికంగా మరణించడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి వారసుడు లేడని అప్పటి కప్పుడు 13 ఏళ్ల నావల్‌ను దత్తత తీసుకొన్నారు. అయితే అనాథాశ్రమం నిబంధనల ప్రకారం మెట్రిక్ పూర్తికాకుండా ఎవరినీ బయటకు పంపరు. దాంతో దత్తత తీసుకున్నప్పటికీ నావల్ రెండేళ్లు అనాథాశ్రమంలో ఉన్నారు. నావల్ తన మొదటి కుమారుడికి రతన్ అని పేరుపెట్టారు.

ఇప్పుడు సుమారు 1600 టన్నుల ఉక్కుని ఉత్పత్తిచేస్తున్నాం. మూస ధోరణిని విడిచిపెట్టి కొత్తగా ఆలోచించాలనీ, పనితీరు కూడా కొత్తగా ఉండాలని చెప్పా. ఉద్యోగుల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాను. కార్లూ, టూవీలర్ల తయారీ వ్యాపారంలోకి అడుగు పెట్టాలనేది జేఆర్డీ కల. 1995లో కారు తయారు చేయాలనుకుంటున్నామని చెబితే 'ఇది సాహసోపేత నిర్ణయం. మీరు పొరపాటు చేస్తున్నట్లు అనిపించడం లేదా' అన్నారు బయటి వాళ్లు. అంబాసిడర్ లోపలి స్థలం, మారుతి జెన్ అంత పరిమాణం, మారుతి 800 అంత ధర... అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించి... ఇండికా కారును తయారు చేశాం. 1998 నుంచి ఇప్పటివరకూ 11లక్షలకు పైగా కార్లు అమ్మాం. తర్వాత టాటా సుమో, సఫారీ... ఇలా చాలా వచ్చాయి. కానీ బైకుల తయారీలో మాత్రం ఇప్పటికీ అడుగు పెట్టలేకపోయాం.

మంచి అవకాశమని...

భారతీయ మార్కెట్‌లో మేం చాలావరకూ సంతృప్తస్థాయికి చేరుకున్నామని అర్థమైంది. అందుకని విదేశీ మార్కెట్‌పై దృష్టిపెట్టాం. అలాగని కొత్తగా సంస్థలు స్థాపించాలంటే చాలా ఏళ్లు పడుతుంది. ఉన్నవాటినే కొంటే సులభమని గ్రహించాం. అందులో భాగంగానే టెట్లీ టీ, కోరస్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ లాంటి యురోపియన్ దేశాల కంపెనీలను కొనుగోలుచేశాం. వాటికున్న ప్రపంచవ్యాప్త మార్కెట్‌వల్ల వివిధ దేశాల్లో సులభంగా అడుగుపెట్టగలిగాం. అంతేకాదు, సొంతంగా దక్షిణ ఆఫ్రికాలో మైనింగ్, టూరిజం, ఇంజిన్ల తయారీ రంగంలో ఉన్నాం. ఉగాండాలో కాఫీ ప్లాంట్, సెనెగల్‌లో బస్ ఫ్యాక్టరీ, మొరాకోలో ఫాస్ఫేట్ ప్లాంట్, సిడ్నీ, న్యూయార్క్‌లలో హోటళ్లు ఉన్నాయి. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా ఖండాల్లో టాటా అడుగులు ఉన్నాయి. టాటా ఇప్పుడు భారత్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ.

చైనా యుద్ధం పెళ్లికి అడ్డం

వ్యాపారంలో బిజీ అయిపోయి పెళ్లి మానుకున్నాను అనుకుంటారు అందరూ. నిజానికి... నాలుగుసార్లు పెళ్లి దగ్గరగా వచ్చినా ముడిపడలేదు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఒకామెను ప్రేమించాను. అప్పుడే నేను భారత్ వచ్చేశాను. తనను కూడా ఇక్కడికి రమ్మని చెప్పాను. కానీ ఆమె అందుకు అంగీకరించలేదు. కారణం... అప్పుడు భారత్, చైనాల మధ్య యుద్ధం జరుగుతోంది. అది చాలా పెద్ద యుద్ధమని అమెరికాలో ప్రచారం జరగడంతో ఆమె వెనకడుగు వేసింది. ఆ తర్వాత కొన్ని కారణాలవల్ల మూడు సంబంధాలు తప్పాయి. ఇప్పుడు వెనక్కి తిరిగిచూసుకుంటే... నేను పెళ్లిచేసుకొని ఉంటే జీవితం చాలా సంక్లిష్టంగా ఉండేదనిపిస్తోంది.

చాలామంది భారతీయ వ్యాపారవేత్తలు ఎదుటివారి లోపాల్ని తమకు లాభంగా ఎలా మలచుకోవాలా అని ఆలోచిస్తారు తప్ప నిజాయతీగా మాట్లాడరు. ఉద్యోగుల్లో చాలామంది బాధ్యతలకంటే హోదాలకే ఎక్కువ విలువ ఇస్తారు. హోదాలు పక్కనబెట్టి వృత్తికి విలువ ఇచ్చే విధంగా ఉద్యోగుల్లో మార్పు తీసుకురావడంలో మనం విఫలమయ్యాం.

నన్ను మించినవాడు

ఇండికా మాదిరిగా 'నానో' విజయవంతం కాలేదు. ఆ అసంతృప్తి ఇంకా ఉంది. మార్కెటింగ్ కాస్త భిన్నంగా చేయాల్సింది. మేం తక్కువ ధరకే సొంత కారులో ప్రయాణించవచ్చని చెబితే, నానో ఒక తక్కువ ధర కారనీ ఇంకా రకరకాలుగా ప్రచారం జరిగింది. టాటా కంపెనీల సేవలూ విలువలూ నాణ్యతల్లో రాజీలేకుండా

వారసుడు మిస్త్రీతో...

నా వారసుడు సైరస్ మిస్త్రీ పనిచేస్తాడని నమ్మకం ఉంది. అయితే అదంత సులభమైన పనికాదు. లాభనష్టాలను అంచనా వేయడంలో జేఆర్డీకంటే నేను కాస్త నయమని నమ్ముతాను. ఈ విషయంలో సైరస్ నాకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివాడని చెప్పగలను. అందుకే అతడు సమర్థుడైన నాయకుడు. కొత్త ఆలోచనలు, కొత్త అంశాలను తీసుకురాగలడు. 'నువ్వు నీలాగే ఉండు. నీ నిర్ణయం నువ్వే తీసుకో. ఎవరినీ అనుకరించకు' అని మిస్త్రీకి చెప్పాను. మేం నెలలో రెండుసార్లయినా కలుస్తూ ఉంటాం. కలిసి భోంచేస్తాం. అలాంటప్పుడు సలహాలు మాత్రం ఇస్తాను. ఎందుకంటే టాటా ట్రస్టులు నడవడానికి సంస్థ లాభాల్లో నడవడం ముఖ్యం. రోజువారి విధుల్లో మాత్రం కలగజేసుకోను.

టాటాలో ఈ అయిదు దశాబ్దాల ప్రస్థానంలో ఎన్నో విజయాలూ, కొన్ని అపజయాలూ చూశాను. నేను కాస్త సిగ్గరిని. నలుగురిలో తొందరగా కలవలేను. ఈ లోపాన్ని అధిగమించి ఉంటే ఇంకా మంచి ఫలితాలు రాబట్టేవాణ్ని. ప్రస్తుతం వచ్చిన సమాచార విప్లవం, ఇతర సౌకర్యాలను చూస్తుంటే నాకు 20 ఏళ్లు తగ్గిపోయినట్లు ఉంది. అందుకే టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకున్నా, ఫౌండేషన్ బాధ్యతలు మాత్రం చూసుకుంటాను. సేవ అనేది టాటా కంపెనీ డీఎన్ఏలోనే ఉంది. కంపెనీ లాభాల్లో 4.5 శాతం సొమ్ముతో సేవా కార్యక్రమాలు చేపట్టే సంప్రదాయం మొదట్నుంచీ ఉంది. మా కుటుంబానికి చెందిన వ్యక్తుల పేరున అనేక సేవా సంస్థలు ఉన్నాయి. వాటిని మరింత సమర్థంగా నడుపుతాను. చిన్నారుల నుంచి గర్భిణీల వరకూ అందరికీ పోషకాహారాన్ని అందించడం, గ్రామీణాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం వంటివి చేస్తాను. టాటాల వ్యాపార సామ్రాజ్యం సరిహద్దులు దాటింది. మా సేవా కార్యక్రమాలు కూడా అలాగే ఉండాలనుకుంటున్నా. పదవీ విరమణ తర్వాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకోవడానికి సమయం కేటాయిస్తాను. ఫ్లయింగ్ చేస్తాను. కార్లలో షికారు కెళ్తాను. తొమ్మిదేళ్లపుడు విడిచిపెట్టిన పియానో సాధనను మళ్లీ కొనసాగిస్తాను. మరి ఉంటా... టాటా... బైబై..!

– సుంకరి చంద్రశేఖర్

టాటా లేని ఫోర్బ్స్ జాబితా

భారతీయులు ఫోర్బ్స్ ప్రపంచ ధనవంతుల జాబితాలో చోటు సంపాదించడం చూశాం. కానీ టాటాలు ఎప్పుడూ ఆ జాబితాలో కనిపించరు. కారణం... టాటా సన్స్‌లో 66 శాతం వాటా దోరాబ్జీ టాటా ట్రస్ట్, రతన్ టాటా ట్రస్ట్‌లకు చెందుతుంది. అందుకే, టాటాల పేరు ధనవంతుల జాబితాలో కనిపించదు. ఈ ట్రస్టులు ఐఐఎస్‌సీ, టీఐఎఫ్ఆర్, టిస్‌లతో పాటు వందకుపైగా స్వచ్ఛంద సంస్థలకు నిధులు అందిస్తున్నాయి.

అంకెల్లో టాటా గ్రూప్...

కంపెనీల సంఖ్య	: 100కు పైగా
కంపెనీలు ఉన్న దేశాలు	: 80
గ్రూప్ ఆదాయం	: రూ.4,75,000 కోట్లు
చెల్లించే పన్ను	: ఏడాదికి రూ.36 వేల కోట్లు
వాటాదారుల సంఖ్య	: 38 లక్షలు
విదేశాల నుంచి వచ్చే ఆదాయం	: 56 శాతం
ఉద్యోగులు	: 4,50,000
టాటాలో అతిపెద్ద వాటాదారు	: షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్(18.5%)

బస్సు బడి వచ్చిందోచ్!

ఆకాశంలో చంద్రుడూ నక్షత్రాలూ ఎంత సహజమో... బాల్యంలో ఆటపాటలూ అంతే సహజం. 'మరి, చదువు?' అని సందేహం వస్తుంది. చదువు... సూర్యుడిలాంటిది. నిజానికి, కావాలని చీకట్లో ఎవ్వరూ ఉండరు. వెలుగు గొప్పదనం తెలియక ఉండిపోతారంతే. అందుకే, అలాంటివాళ్లకు సాయపడుతోంది. వరంగల్‌లోని 'అమృతబిందు లక్ష్మీ రంగనాయకమ్మ ఛారిటబుల్ ట్రస్ట్'.

వానా వానా వల్లప్పా... పాటను చూస్తున్న ఆ చిన్నారి, వానలో తడుస్తున్నంత సంబరపడిపోతోంది.

చుక్ చుక్ రైలూ వస్తోందీ... చూస్తోన్న మరో బుజ్జాయి 'రైలంటే ఇలా ఉంటుందా' అని పలకమీద ఏవేవో బొమ్మలు గీస్తున్నాడు.

'...ఏనుగుమీదా రాముడు ఎంతో చక్కని దేవుడు'... చూసిన ఓ పాప 'రాముడంటే అంత మంచివాడా' అని తెలుసుకున్నట్టుంది, 'రామ రామ రామ' అంటూ రామభజన మొదలుపెట్టింది.

ఈ చిన్నారులంతా ఓ బస్సులో ఉన్నారు. పాటలూ ఆ బస్సులోనివే. ఒక్క పాటలే కాదు... అ ఆలూ, ఏబీసీడీలూ, పదాలూ వాళ్లను అలరిస్తుంటాయి.

బస్సులోని చిన్నారులకు అదో కొత్తప్రపంచంలా ఉంది. ఇన్నాళ్లూ తమకు ఎవ్వరూ ఈ ప్రపంచాన్ని పరిచయం చేయలేదెందుకా అన్న సందేహం వాళ్లలో ఉందో లేదోగానీ... ఇకమీదట మాత్రం ఈ ప్రపంచాన్ని వదలకూడదని కచ్చితంగా అనుకుని ఉంటారు.

ఆ బస్సు 'అమృతబిందు లక్ష్మీ రంగనాయకమ్మ ఛారిటబుల్ ట్రస్ట్' వాళ్లు ఏర్పాటుచేసింది. 'బాల్యం తేనెపట్టులాంటిది. వికాసమనే తేనెను వాళ్లకు పరిచయంచేస్తే... దాన్ని సంపాదించాలని వాళ్లే వెంటబడతారు. మేం చేస్తున్నది అదే' అంటారు ట్రస్టు నిర్వాహకుడు సమీర్ కుమార్.

అమ్మకోసం...

వరంగల్ జిల్లా హన్మకొండలో వ్యాపారస్తుడైన సమీర్... తన తల్లి లక్ష్మీరంగనాయకమ్మ జ్ఞాపకార్థం 2000లో ఈ ట్రస్టును ప్రారంభించారు.

'కష్టాల్లో ఉన్నవాళ్లకు సాయంచేయాలనేది అమ్మ మనస్తత్వం. అందుకే, ఆమె పేరుమీద ట్రస్టును ఏర్పాటుచేశాను. మొదట్లో జిల్లాలోని చిన్నచిన్న స్వచ్ఛంద సంస్థలకు ఆర్థికసాయం చేసేవాళ్లం. తెలివైన నిరుపేద విద్యార్థులకు పెద్ద చదువులకు ఆర్థికసాయం అందించేవాళ్లం. దీపావళినాడు... మురికివాడల్లోని పిల్లలతో కలిసి టపాకాయలు కాల్చేవాళ్లం' అంటూ తమ కార్యక్రమాల గురించి చెబుతారు సమీర్.

అలా చేస్తున్న సమయంలో ఓరోజు... గుంటూరు రోటరీ క్లబ్ వాళ్ల ఒక పాతబస్సు బాలకార్మికుల పాఠశాలకు వెళ్లడం చూశారాయన. నిరుపేద చిన్నారులకు చదువుపై ఆసక్తిని పెంచేందుకు ప్రారంభించిన ఆ బస్సు సమీర్‌ను ఆకర్షించింది. అలాంటిదే తానూ ఎందుకు ఏర్పాటుచేయకూడదూ అనుకున్నారు. బస్సును తెచ్చాక దాన్ని ఏయే స్కూళ్లకు తీసుకెళ్లాలి అనే ప్రశ్న తలెత్తింది. సమాధానం కనుక్కునేందుకు... వరంగల్ పట్టణంలో ఓ సర్వే నిర్వహించారు. అందులో ప్రకాశ్‌రెడ్డిపేట, పద్మాక్షీ కాలనీ, సుధానగర్, హనుమాన్ నగర్, సమ్మయ్య నగర్, భీమారం ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లని చిన్నారులు ఎక్కువగా ఉన్నారని తెలిసింది. ముఖ్యంగా... ఈ ప్రాంతాల్లో బాలకార్మిక పాఠశాలలు ఉన్నాయి.

'నిరుపేదలైన ఆ చిన్నారులు చదువు విలువ తెలియక బడికి వెళ్లడం లేదు. అందుకే, వాళ్లను ఆకట్టుకునేలా చదువు చెప్పేందుకు ఈ ప్రాంతాల్లోనే బస్సును తిప్పాలని నిర్ణయించాం' అని చెబుతారు సమీర్. ఈ బస్సు కొనడానికి... సాయంకోసం రోటరీక్లబ్ వాళ్లను సంప్రదించారు. దేశ విదేశాల్లోని రోటరీక్లబ్‌లూ, మిత్రుల ఆర్థిక సాయంతో బస్సును కొన్నారు. ఇందులో ఒక సహాయకుణ్ణీ, ఇద్దరు ఉపాధ్యాయులనూ నియమించారు.

పిల్లల వద్దకే బస్సు

బస్సును నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి... 2-3 నెలల వ్యవధిలో రెండు స్కూళ్లమధ్య నడపాలనుకున్నారు. మొదటగా ప్రకాశ్‌రెడ్డిపేట, పద్మాక్షీ కాలనీల్లోని వడ్డెరబస్తీలను ఎంచుకున్నారు. ఒకరోజు ప్రకాశ్‌రెడ్డిపేటలో ఉంటే,

మర్నాడు వడ్డెరబస్తీలో... ఇలా రోజుతప్పించి రోజు ఆ స్కూళ్లకు బస్సు వెళ్లేది.

బస్సు వచ్చిందంటే... చిన్నారులు సంతోషంగా అందులోకి ఎక్కేవారు. ఎందుకంటే... ఇది ఏసీ బస్సు. అందులో ఎల్సీడీ టీవీ కూడా ఉంది. సీట్లకు వెనుక భాగంలో పలకలున్నాయి. వాటిని వెనక్కులాగితే... టేబుల్‌లా వస్తుంది. దానిపైన పుస్తకం పెట్టి రాసుకోవచ్చు. మొదటిదశలో విద్యార్థులకు తెలుగూ, ఆంగ్ల అక్షరాలనూ నేర్పిస్తారు. తరవాతి దశలో పదాలనూ పాటలనూ పరిచయం చేస్తారు. మూడో దశలో... చిన్నచిన్న పరీక్షలూ ఆటలపోటీలూ నిర్వహించి ప్రతిభ కనబరచినవాళ్లకు బహుమతులూ ఇస్తారు. అలా ఆ రెండు ప్రాంతాల్లోని చిన్నారులూ క్రమం తప్పకుండా బడికి వస్తున్నారని నిర్ధరించుకున్నాక... మరో రెండు ప్రాంతాలను ఎంచుకున్నారు.

'విద్యార్థులకు చదువుతో పాటు శుభ్రత, తల్లిదండ్రులను గౌరవించడం వంటి అంశాలనూ నేర్పుతాం. ప్రస్తుతం హన్మకొండలోని సమ్మయ్యనగర్, హసన్‌పర్తి మండలం భీమారంలోని బాలకార్మిక పాఠశాలలకు బస్సు వెళ్తోంది. వీటితో కలిపి ఇప్పటివరకూ ఆరు పాఠశాలల్లో 300కుపైగా చిన్నారులను కలిశాం. ప్రకాశ్‌రెడ్డిపేట బాలకార్మిక పాఠశాలలో బాగా చదివే ఆశ అనే అమ్మాయికి పద్మాక్షీ కాలనీలోని వివేకానంద పాఠశాల ఉచితంగా చదువుచెప్పడానికి ముందుకొచ్చింది. ఇతర ప్రైవేటు పాఠశాలలు కూడా ఇలాంటి విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పేందుకు ముందుకొస్తే బాగుంటుంది' అంటారు సమీర్. మంచి ఆలోచనే కదూ.

– కన్నెబోయిన రాజు, న్యూస్‌టుడే, న్యూశాయంపేట

చాట్... కొనసాగుతూనే ఉంటుంది!

లైవ్‌గా ఉంటే లైఫ్... ఇదీ ఇప్పటి యూత్ యాటిట్యూడ్. ఆలస్యం అస్సలు నచ్చదు. సందేశాలు సెకెన్లలో స్నేహితులకు చేరిపోవాలి. సమాధానాలు చిటికెలో ఇచ్చేస్తుండాలి. ఆ ముచ్చట్లు ఎంతసేపైనా... అంతా 'లైవ్'లో ఉండాలి. అలా ఉండాలంటే... ఈ మెసెంజర్లు ఉండాలి!

'ఎలా ఉన్నావ్'... 'ఎక్కడున్నావ్'... 'ఏం చేస్తున్నావ్'... ఇవి మూడు జనరేషన్ల మధ్య తేడాలను సూచించే పలకరింపులు! ల్యాండ్‌లైన్ల జమానాలో మిత్రులకు ఫోన్ చేయగానే 'ఎలా ఉన్నావ్' అంటూ సంభాషణలు మొదలయ్యేవి. సెల్‌ఫోన్ ప్రవేశించాక 'ఎక్కడున్నావ్' అనే పలకరింపుతో ముచ్చట్లు మొదలువుతున్నాయి. ఇది స్మార్ట్‌ఫోన్ హయాం... ఇప్పుడు ఫ్రెండ్స్ మధ్య ముచ్చట్లు లేవు! 'ఏం చేస్తున్నావ్' అంటూ చాటింగులు మొదలవుతున్నాయి. ఒకప్పుడు ఎస్సెమ్మెస్సులు స్నేహితుల మధ్య వారధులుగా రాజ్యమేలేవి. మొదట్లో ఎస్సెమ్మెస్సులకు కూడా ప్రత్యేకంగా బిల్లు కట్టాల్సి వచ్చేది. ఆ తరువాత అన్ లిమిటెడ్ ప్లాన్లూ వచ్చాయి. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక... ఆ ప్యాకేజీల గొడవే లేదు. చాటింగ్స్ కోసం ఎన్నో మెసెంజర్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. పైసా ఖర్చులేకుండా ఎంతసేపైనా ఫ్రెండ్స్ చాట్ ముచ్చట్లు పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయివి.

అన్నింటా ప్రత్యేకం

మెసెంజర్లు ఒకప్పుడు కంప్యూటర్లకు మాత్రమే సరిపోయేలా ఉండేవి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లన్నింటికీ సరిపోయే మెసెంజర్లు బోలెడు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా మొబైల్ ఫోన్ల ప్లాట్‌ఫారమ్‌లను బట్టి వాటి ఆప్స్ స్టోర్ల నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ మెసెంజర్లలో అత్యంత ప్రజాదరణ పొందిందీ... అత్యంత వేగంగా సేవలందించేదిగా గుర్తింపు పొందిందీ బీబీఎమ్. ఇది బ్లాక్‌బెర్రీ ఫోన్లకు మాత్రమే ప్రత్యేకం. బ్లాక్‌బెర్రీ ఫోన్లు వాడుతున్న వారందరూ ఈ మెసెంజర్ ద్వారా చాటింగులు చేసుకోవచ్చు. బీబీఎమ్ తరువాత ప్రపంచవ్యాప్తంగా బాగా పాపులర్ అయిన మరో మెసెంజర్... 'వాట్స్ అప్'. ఇది అన్ని రకాల స్మార్ట్‌ఫోన్లలోనూ పని చేస్తుంది. ఐఓయస్, ఆండ్రాయిడ్, సింబియాన్, విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ల ఆధారంగా పనిచేసే ఫోన్లన్నింటిలోనూ దీన్ని ఉచితంగానే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీన్లోని మరో మంచి లక్షణం ఏంటంటే... ఫ్రెండ్స్ జాబితాను ప్రత్యేకంగా రూపొందించుకోవాల్సిన అవసరం లేదు. మన ఫోన్‌బుక్‌లో ఉన్నవారెవరైనా ఈ మెసెంజర్ వాడుతుంటే... వాళ్లందరి పేర్లూ ఈ జాబితాలో చేరిపోతాయి. ఆ తరువాత చెప్పుకోదగ్గది 'స్కైప్' మెసెంజర్. ఉచితంగా వీడియో కాలింగ్‌ను అందించే స్కైప్‌లో వాయిస్ కాలింగ్‌తోపాటూ ఉచితంగా టెక్స్ట్ మెసేజ్‌లను పంపుకునే సౌకర్యమూ ఉంది.

ఫేస్‌బుక్ మెసెంజర్... ఫోన్లో ఫేస్‌బుక్ వాడుతున్నవారందరూ దాదాపు దీన్ని ఉపయోగిస్తారు. మామూలుగా అయితే... మొబైల్‌లో ఫేస్‌బుక్ చూస్తున్నప్పుడు ఆన్‌లైన్‌లో ఉన్న స్నేహితులతో ముచ్చట్లు పెట్టుకోవచ్చు. దీని ద్వారా అయితే... ఫేస్‌బుక్ ఆన్ చేయాల్సిన అవసరం లేదు. మెసెంజర్ ఓపెన్ చేసి లైవ్‌లో ఉన్నవారితో ముచ్చట్లు పెట్టొచ్చు. ఆఫ్‌లో ఉన్నవారికి సందేశాలూ పంపొచ్చు. వాళ్లు మళ్లీ లైవ్‌లోకి వచ్చినప్పుడు ఆ సందేశాలను చదువుకోగలరు. ఇ-బడ్డీ... దీన్ని ఫోన్లోంచీ వాడుకోవచ్చూ కంప్యూటర్ నుంచీ చాట్ చెయ్యొచ్చు. ఇది కూడా యువజనాదరణ బాగా పొందుతున్న మెసెంజరే. వియ్‌చాట్... గూగుల్ చాట్... యాహూ మెసెంజర్... ఏఓయల్ మెసెంజర్... ఇలాంటివి మరికొన్నింటినీ ఎంతోమంది యూత్ ఉపయోగిస్తున్నారు.

అందుకే ప్రత్యేకం

ఇప్పుడు యూత్ ఎస్సెమ్మెస్సుల కంటే వీటినే ఎందుకు వినియోగిస్తున్నారంటే కారణం... సౌకర్యాలు! ఎస్సెమ్మెస్సులకు పరిమితి ఉంది. వాటి ద్వారా కేవలం టెక్స్ట్‌ని మాత్రమే పంపగలం. చాటింగు చేస్తున్నప్పుడు మనకు నచ్చిన ఓ ఫొటోని స్నేహితుడికి పంపాలనుకోండి... ఎస్సెమ్మెస్సు ద్వారా సాధ్యమా? గిలిగింతలు పెట్టే వీడియో క్లిప్పింగ్ చూపాలనుకోండి... ఎస్సెమ్మెస్సు ద్వారా సాధ్యమా? ఇవన్నీ మెసెంజర్ల ద్వారా సాధ్యం. పైగా వేగం... ఎస్సెమ్మెస్ మనం పంపిన తరువాత అది అవుట్ బాక్స్‌లో చిక్కుకుపోతే వెళ్లదు! మెసెంజర్లలో ఆ సమస్య ఉండదు. మనం ఎంటర్ కొట్టామంటే... అవతలివాడికి అందినట్టే. ఎస్సెమ్మెస్సులకు ఓ పరిమితి ఉంటుంది. ప్యాకేజ్‌లను బట్టీ నెలకి 200... 500... 1000 ఇలా ఉంటాయి. ఆ సంఖ్య దాటితే ఖర్చు పెరిగిపోతుంది! మెసెంజర్లలో ఆ గొడవ ఉండదు. ఎంతసేపైనా ఎన్ని సందేశాలైనా ఓపిక ఉన్నంతవరకూ పంపుకోవచ్చు. ఈ మెసెంజర్లు పనిచేయాలంటే మొబైల్ డాటా కనెక్షన్ తప్పనిసరి అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదనుకోండి. ఇంకోటి... మనం ఏ మెసెంజర్ వాడుతున్నామో మన మిత్రులూ అదే వాడాలి. అప్పుడే మనవాళ్లంతా చాట్‌కి అందుబాటులో ఉంటారు. దాదాపు అన్ని మెసెంజర్లకీ లాగిన్ ప్రక్రియ ఒకేలా ఉంటుంది. మనం వాడే ఫోన్‌ని బట్టీ తీసుకున్న డాటా ప్లాన్‌ని బట్టీ ఈ మెసెంజర్ల పనితీరులో కాస్త హెచ్చుతగ్గులుంటాయి.

★ ★ ★

'ఏం చేస్తున్నావ్...'
'ఫొటో తీస్తున్నావా?'
'అయితే, పంపెయ్.'
'ఇదిగో.. ఎలా ఉందో చెప్పు?'
'నీ ముఖంలా ఉంది.'
'అంత అందంగా ఉందా...'.....

ఇకపై, ఈ చాటింగులు ఇలా కొనసాగుతూనే ఉంటాయి... ఆ ఇద్దర్లో ఎవరో ఒకరికి విసుగొచ్చేంత వరకూ! ★

పెరిగింది చాలు... ఇక తగ్గండి

పోలీస్‌శాఖలో ఉద్యోగం కావాలంటే ఎత్తూ బరువూ ఛాతీ... ఈ లెక్కలన్నీ కచ్చితంగా ఉండాలి. కానీ ఒకసారి ఉద్యోగంలో చేరిన తర్వాత చాలామంది పోలీసులు బరువు బాగా పెరిగిపోవడం చూస్తాం. ఇదే సమస్య ఇండోనేషియాలోనూ ఉంది. అందుకే అక్కడ పోలీసు ఉన్నతాధికారులు తమ ఉద్యోగులకు ఫిట్‌నెస్ పాఠాలు మొదలుపెట్టారు. రాజధాని జకార్తా, మరో నగరం తాంగెరంగ్‌లో 100 కిలోల బరువు దాటిన పోలీసులకు వారంలో రెండ్రోజులు ప్రత్యేకంగా ఫిట్‌నెస్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ శాఖలోనే ఫిట్‌గా ఉన్నవారిని శిక్షకులుగా నియమించి వారిచేత పాఠాలు చెప్పిస్తున్నారు. శిక్షణలో కచ్చితంగా పాల్గొనాలనే నిబంధనేమీలేదు. కానీ ఫిట్‌గా ఉన్నవారికే పదోన్నతులన్న అనధికార ప్రచారంతో 500మంది ఈ శిక్షణకు హాజరవుతున్నారు. మంచి కార్యక్రమం కదూ.

కౌగిలింతల క్లాసులు

తక్కువ కష్టం ఎక్కువ లాభాలతో సాగే వ్యాపారం కోసం ఆ జంట కాస్త గట్టిగానే ఆలోచించింది. ఒక శుభ ముహూర్తాన లండన్‌లో కౌగిలింతల వర్క్‌షాప్‌ను ప్రారంభించింది. ఇది నెలకు రెండు ఆదివారాల్లో నాలుగు గంటలు మాత్రమే పనిచేస్తుంది. దీనికి హాజరుకావాలంటే రెండువేల అయిదువందల రూపాయలు సమర్పించుకోవాల్సిందే. వస్త్రధారణ కూడా ఎలాంటి అసభ్యతకూ తావులేకుండా హుందాగా ఉండాలి. సభ్యత్వం తీసుకున్నవారు- ఇతర సభ్యుల్లో తమకు నచ్చినవారిని జంటగా ఎంచుకుని నేల మీద మెత్తగా ఉండే తలదిండులపైన పడుకుని కౌగిలించుకోవాలి. ఇదేదో బాగుందని ముద్దులతో ముందుకు ప్రొసీడ్ అవుతామంటే కుదరదు. కౌగిలింతలోని దగ్గరితనాన్ని అనుభవించడానికి మాత్రమే ఈ ఏర్పాటు. 'విడాకులు తీసుకున్నవాళ్లూ భాగస్వాములను కోల్పోయి ఒంటరిగా మిగిలినవాళ్లూ ఆత్మీయ ఆలింగనం కోసం ఎంతో పరితపిస్తున్నారు. వాళ్ల ఆవేదన చూడలేకే ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించాం' అంటున్నారు వ్యవస్థాపకులు.

రాగాలు పలికే రంపాలు

వీణా నాదాలూ సితార రాగాలూ అందరికీ తెలిసినవే. అలాగే రంపాలకూ రాగం ఉందని నిరూపిస్తున్నారు సంగీత ప్రియులు. న్యూయార్క్‌లో గత తొమ్మిదేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఏటా జులై నెలలో నటాలియా షా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. దేశ విదేశాల నుంచీ వచ్చిన ఎందరో కళాకారులు ఈ పోటీలో పాల్గొంటున్నారు. అందరికంటే ఎక్కువ దూరం నుంచి వచ్చి పోటీలో పాల్గొన్నవారిని 'గెస్ట్ ఆఫ్ ఆనర్' బిరుదుతో సత్కరిస్తున్నారు. పదునైన రంపాల్లోనూ రసరమ్య రాగాలుంటాయని వీనులవిందుగా వినిపించేస్తున్నారు.

ఘనమైన వీడ్కోలు

చనిపోయినవారి అస్థికలను నీళ్లలో కలిపేయడం పాత పద్ధతి. సిడ్నీలో కొత్త పద్ధతిని కనిపెట్టాడు క్రెయిజ్ హాల్. 'యాషెస్ టు యాషెస్' అనే పేరుతో చనిపోయిన పెంపుడు జంతువుల అంత్యక్రియలను ఘనంగా నిర్వహిస్తున్నాడు. మందుగుండు సామగ్రి సహాయంతో పెంపుడు కుక్క

బూడిద ఉన్న కంటైనర్‌ను ఆకాశంలోకి దూసుకుపోయేలా చేస్తున్నాడు. అక్కడి నుంచి అది అలాగే సముద్రంలో పడేలా ఏర్పాటు చేస్తున్నాడు. 'ప్రాణాధికంగా ప్రేమించే పెంపుడు కుక్కలు చనిపోతే ఎంత బాధగా ఉంటుందో నాకు తెలుసు. ఎందుకంటే రెండేళ్ల క్రితం నేనెంతో ప్రేమించే నా పెంపుడు కుక్కలు చనిపోయాయి. వాటి అంత్యక్రియలైనా ఘనంగా నిర్వహిస్తే మనసు కాస్త ఊరట చెందుతుంది. అందుకే నా వంతుగా ఈ ప్రయత్నాలు' అంటాడు హాల్.

గుర్రం మీద బొమ్మ

గుర్రం అంతర్గత నిర్మాణం గురించి సులువుగా వెటర్నరీ విద్యార్థులకు వివరించాలనుకుంది గిలియన్ హిగ్గిన్స్ అనే పంతులమ్మ. అనుకున్నదే తడవుగా నిలుచున్న గుర్రంపైన ఒకపక్క దాని ఎముకలూ కండరాలూ లోపలి భాగాలన్నింటినీ పెయింట్‌తో చిత్రించింది. 'ఇందుకు నాలుగు గంటలు కష్టపడాల్సి వచ్చినా, ఇలా చేయడం వల్ల గుర్రం పరుగెడుతున్నప్పుడు దాని అంతర్గత భాగాల కదలిక ఎలా ఉంటుందో విద్యార్థులకు సులువుగా అర్థమవుతోంది' అని సంతోషంగా చెబుతోంది హిగ్గిన్స్. ఈ సృజనకు విద్యార్థులు కూడా ఎంతో ముచ్చటపడిపోతున్నారట.



తెలుగువారికి సాయం చేస్తాం

మనం పక్క ఊరికి వెళ్లినప్పుడు అక్కడ మన ఊరివాళ్లు కనిపిస్తే సంతోషం. వేరే జిల్లాకు వెళ్లినప్పుడు అక్కడ మన జిల్లావాళ్లు తారసపడినా... ఇతర రాష్ట్రంలో మనరాష్ట్రంవాళ్లు కలిసినా అంతే సంబరం. అలాంటిది, దేశంకానిదేశంలో... మనదేశంవాళ్లు కలిస్తే ఇంకెంత సంతోషంగా ఉంటుంది! అలా భారతీయులను ఓచోటకు చేర్చారాయన. అంతేకాదు, ఎన్నో సేవా కార్యక్రమాలూ చేపడుతున్నారు.

ఆ దేశం... మానవాభివృద్ధి సూచికలో దక్షిణాసియాలో రెండోస్థానంలో ఉంది. అక్కడ పెట్రోలియం, సహజవాయు నిల్వలకు కొదవేలేదు. అందుకే, ఫోర్బ్స్ ప్రపంచ సంపన్న దేశాల జాబితాలో ఆ దేశమూ ఉంది. అదే... బ్రూనై. జనాభా అయిదులక్షల లోపే. కానీ, అందులో పదివేలమంది భారతీయులే. వాళ్లలోనూ తెలుగువాళ్లు 500కు పైనే. దేశంకానిదేశంలో భారతీయులను ఒకేతాటి పైకి తెచ్చారాయన. ఆయనే సూర్యదేవర వెంకటరమణారావు.

అప్పటివరకూ 20 మంది...

బ్రూనైలో బెలాయిత్, ట్యుటాంగ్, ముువారా, తెంబురంగ్ అనే నాలుగు జిల్లాలున్నాయి. ఆ దేశంలో మొట్టమొదటి భారతీయుల సంఘం 1949లో ఏర్పాటైంది. ఆ తరవాత 60 ఏళ్లలో భారతీయుల సంఖ్య వందల నుంచీ వేలకు పెరిగిందికానీ... సంఘంలో సభ్యుల సంఖ్య మాత్రం వంద కూడా దాటలేదు.

2009లో ఉద్యోగరీత్యా బ్రూనైలోని బెలాయిత్ జిల్లాలో ఉన్న రమణ... ఆ ఏడాది వార్షిక సమావేశానికి హాజరయ్యారు. అందులో కేవలం 20 మందే పాల్గొన్నారు.

'కొన్నివేలమంది భారతీయులు ఉంటే 20 మందే రావడం నాకు బాధగా అనిపించింది. దేశంకాని దేశంలో ఉంటున్న భారతీయులంతా ఒకరికొకరు తెలిసి, కలుసుకుంటుంటే ఆ ధైర్యమేవేరు. అందుకే, బెలాయిత్‌లోని భారతీయులందరినీ కలపాలనుకున్నాను. అలా చేయాలంటే నేను సంఘంలో కీలకపాత్ర పోషించాలి. అందుకే, మరుసటి ఏడాది కార్యదర్శిగా పోటీచేసి గెలిచాను. అప్పటికి సంఘంలోని సభ్యుల సంఖ్య 80. ఆ తరవాత నేను జిల్లా అంతటా పర్యటించి భారతీయులను కలిసి సంఘసభ్యులుగా చేరేలా చేశాను. అలా సభ్యులసంఖ్య ప్రస్తుతం 375కి చేరింది' అని సంతోషంగా చెబుతారు రమణ. ఖజానాధికారి మహేష్, క్రీడాకార్యదర్శులు గోపి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి; సమాచార కార్యదర్శి రామకృష్ణ ఈ సంఘంలో ఇతర కీలకసభ్యులు.

1949 నుంచీ 2010 వరకూ సంఘ కార్యాలయం పాత భవనంలోనే ఉండేది. దానికి మరమ్మతులు చేయించి, కొత్త హంగులద్ది, ఏసీ సౌకర్యమూ పెట్టారు.

పండగలూ ఉత్సవాలూ

తెలుగువాళ్లంటే సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టిందిపేరు. శుభకార్యాలూ పండుగలప్పుడు బంధుమిత్రులతో ఆనందం అంబరాన్ని అంటుతుంది. మరి, విదేశాల్లో అలా కుదురుతుందా?

కుదిరేలా చేశారు వెంకటరమణ, ఆయన స్నేహితులు. దీపావళి, సంక్రాంతి వంటి పండగలను కలిసి జరుపుకునే ఏర్పాటుచేశారు. చిత్రలేఖనం, ఆటల పోటీలూ, పాటల పోటీలూ... ఇలా ఎన్నో నిర్వహిస్తున్నారు.

ఇక్కడ ప్రమాదాల్లో గాయపడిన భారతీయులకు సమయానికి రక్తం అందడం కష్టం. అలాంటివాళ్లకోసం రక్తదానం చేయాలనుకున్నారు రమణ. అందుకే, ఏడాదిలో రెండు సార్లు సంఘం సభ్యులంతా రక్తదానం చేస్తారు. అలా ఇప్పటివరకూ 500 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎంతోమందిని ఆదుకున్నారు.

బీమా సాయం...

ఓసారి బ్రూనైలోని ఓ కంపెనీలో పనిచేసే ఒక భారతీయుడు ప్రమాదవశాత్తూ చనిపోయాడు. వాళ్లది పేద కుటుంబం కావడం వల్లా, ఆయనకు సహాయం చేసే భారతీయులు లేకపోవడం వల్లా శవాన్ని ఓ అనాథ శవంలా తగలబెట్టేశారు. ఆ సంఘటన రమణను చాలా బాధపెట్టింది.

మరెవరికీ అలాంటి దుస్థితి రాకూడదనుకున్నారు. అందుకే, ఓ బీమా కంపెనీతో సంప్రదింపులు జరిపి భారతీయులకు తక్కువ మొత్తానికే బీమా అందేలా చేశారు. దాని ప్రకారం భారతీయులు ఎవరైనా ఆ కంపెనీకి ఏడాదికి 36 బ్రూనై డాలర్లు (రూ.1500) చెల్లిస్తే చాలు.. బీమా తీసుకున్న వ్యక్తి మరణిస్తే 10వేల బ్రూనై డాలర్లు చెల్లిస్తారు. అంతేకాదు, వాళ్ల మృతదేహాన్ని భారతదేశానికి పంపడానికి మరో 8000 డాలర్లు ఇస్తారు.

'బ్రూనై ఓ ముస్లిం దేశమైన భారతీయులను ఎంతో గౌరవిస్తారు. బ్రూనైకి వచ్చే తెలుగువాళ్లకు సమాచారం ఇవ్వడంలోనూ, విజిటింగ్ వీసాలు సంపాదించడంలోనూ మేం సాయపడుతుంటాం(ramanarao22@gmail.com)' అని చెబుతారు రమణ. దేశంకానిదేశంలో అలా ఆత్మీయంగా ఆహ్వానించేవాళ్లు ఉండటం ఎంత సంతోషకరమైన విషయమో కదా.

– పి.మధుసూదనాచారి, ఈటీవీ2

'ధ్రువ తార'ల కోసం

వెంకటరమణది గుంటూరు జిల్లా. ఆయన తండ్రి బాబూరావు... నాగార్జున విశ్వవిద్యాలయం డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. 2002లో ఉద్యోగరీత్యా బ్రూనై వెళ్లిన రమణ ప్రస్తుతం... సాహిద్ సెందిరియన్ బర్హాద్ అనే ఇంజినీరింగ్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ మేనేజర్. గతేడాది రమణ దంపతులకు కవలలు పుట్టి చనిపోయారు. వాళ్లకు ధ్రువ, తార అని పేర్లు పెట్టాలనుకున్నారాయన. వాళ్లు లేనిలోటును మరిచిపోవడానికి వాళ్ల పేరుమీదే 'ధ్రువతార' అనే స్వచ్ఛంద సంస్థను మనరాష్ట్రంలోనే రిజిస్టర్ చేయించారు. తెలివైన నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం చేయడమే దాని లక్ష్యం.

విదేశాంగశాఖ మంత్రి ఎస్.ఎం.కృష్ణతో...

రక్తదానం చేస్తూ

రోస్టెడ్ చికెన్ చేసేదిలా...



క్యారెట్ కేక్

కావలసినవి

మైదా: 2 కప్పులు, **దాల్చినచెక్కపొడి:** ఒకటిన్నర టీస్పూన్లు, **బేకింగ్‌పౌడర్:** ఒకటిన్నర టీస్పూన్లు, **బేకింగ్‌సోడా:** టీస్పూను, **ఉప్పు:** అరటీస్పూను, **క్యారెట్ తురుము:** రెండున్నర కప్పులు, **కోడిగుడ్లు:** నాలుగు, **పంచదార:** ఒకటిన్నర కప్పులు, **వెనీలా ఎక్స్‌ట్రాక్ట్:** 2 టీస్పూన్లు, **నూనె:** కప్పు

తయారుచేసే విధానం

మైదాలో దాల్చినచెక్కపొడి, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు వేసి కలిపి పక్కన ఉంచాలి.

విడిగా ఓ గిన్నెలో కోడిగుడ్లు వేసి రెండు నిమిషాలు గిలకొట్టాలి. తరవాత పంచదార వేసి మరో ఐదు నిమిషాలు బీట్ చేయాలి. ఇప్పుడు వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ వేసి మరో నిమిషం గిలకొట్టాలి. నెమ్మదిగా నూనె పోస్తూ గిలకొడుతుండాలి. ఇప్పుడు పిండిమిశ్రమాన్ని కొంచెంకొంచెంగా వేస్తూ తెడ్డులాంటి గరిటెతో కలపాలి. చివరగా క్యారెట్ తురుము వేసి కలపాలి.

ఇప్పుడు మిశ్రమాన్ని రెండు భాగాలుగా చేసి వెన్న రాసిన రెండు కేకు గిన్నెల్లో వేసి ముందుగానే 180 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర వేడిచేసిన ఓవెన్‌లో 30 నిమిషాలపాటు బేక్ చేయాలి. చల్లారిన తరవాత ముక్కలుగా కోయాలి.

కావలసినవి

చికెన్: ఒకటి, **తాజా హెర్బల్ ఆకులు** (రోజ్‌మేరీ, కొత్తిమీర, సేజ్, వాము, పుదీనా): అరకప్పు, **ఉప్పు:** రుచికి సరిపడా, **మిరియాలు:** రుచికి సరిపడా, **నిమ్మరసం:** 2 టేబుల్ స్పూన్లు, **నూనె:** మూడు టేబుల్‌స్పూన్లు, **కిచెన్ కింగ్ మసాలా:** టేబుల్‌స్పూను, **కారం:** టేబుల్‌స్పూను

స్టఫింగ్‌కోసం

నిమ్మకాయ: అరచెక్క, **వెల్లుల్లి:** కొన్ని, **రోజ్‌మేరీ:** చిన్న కొమ్మ

రోస్టెడ్ చికెన్

తయారుచేసే విధానం

ఓవెన్‌ను ముందుగానే 180 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర వేడి చేయాలి. చికెన్ పైన ఉన్న తోలు, లోపల ఉన్న కొవ్వు తీసేయాలి. తరవాత శుభ్రంగా కడిగి పలుచని బట్టతో తడిలేకుండా అద్దాలి.

తాజా ఆకులన్నీ సన్నగా తరగాలి.

ఓ చిన్న గిన్నెలో ఆకుల తురుము, ఉప్పు, మిరియాలపొడి, నిమ్మరసం, నూనె, కిచెన్ కింగ్, కారం వేసి కలపాలి.

కోడి పొట్ట లోపల నిమ్మచెక్క, వెల్లుల్లి రెబ్బలు, రోజ్‌మేరీ ఉంచాలి. ఇవి తినడానికి కాదు, కేవలం మంచి వాసన కోసమే.

ఇప్పుడు తాజా ఆకుల తురుముని కోడికి అన్ని వైపులా పట్టించాలి. ఛాతీ దగ్గర చర్మం వదులుగా లాగి లోపల కూడా పట్టించాలి.

కాళ్లను మందపాటి దారంతో కట్టేసి బేకింగ్ ట్రేలో పెట్టి ఓవెన్‌లో సుమారు గంట నుంచి గంటన్నర సేపు రోస్ట్ చేయాలి. మధ్యమధ్యలో చికెన్ నుంచి కారిన జ్యూస్‌ని అది ఎండిపోకుండా చికెన్‌కు పట్టిస్తుండాలి.

మొత్తం రోస్ట్ అయ్యాక దాన్ని అలాగే పదిహేను నిమిషాలు ఉంచాలి. బయటకు తీసి పొట్టలోపల ఉంచినవన్నీ తీసేయాలి. ఇప్పుడు దీన్ని కావలసినట్లుగా ఏ భాగానికా భాగాన్ని విడదీసి వడ్డించాలి.

రుచి అభిరుచి

కావలసినవి

మైదా: ఒకటిన్నర కప్పులు, **బేకింగ్ పౌడర్:** టీస్పూను, **బేకింగ్‌సోడా:** అరటీస్పూను, **ఉప్పు:** అరటీస్పూను, **దాల్చినచెక్కపొడి:** టీస్పూను, **అల్లంపొడి:** పావుటీస్పూను, **గుమ్మడికాయగుజ్జు:** కప్పు, **నూనె:** ముప్పావు కప్పు, **పంచదార:** ఒకటింపావు కప్పు, **వెనీలా ఎస్సెన్స్:** టీస్పూను, **చాక్లెట్ చిప్స్** లేదా **చాక్లెట్‌బార్ తురుము:** 125 గ్రా.

చాక్లెట్ పంప్కిన్ బ్రెడ్

తయారుచేసే విధానం

ఓవెన్‌ను ముందుగా 180 డిగ్రీల సెంటీగ్రేడుకి వేడిచేసుకోవాలి.

తరవాత ఓవెన్‌లో పెట్టే ఓ పాన్ లేదా గిన్నెకి వెన్న రాసి పక్కన పెట్టాలి.

చాక్లెట్ చిప్స్ లేదా చాక్లెట్ తురుముని ఓ గిన్నెలో వేసి, ఆ గిన్నెని వేడినీళ్లమీద పెట్టి అది కరిగేవరకూ స్పూనుతో కలుపుతుండాలి. కరిగిన చాక్లెట్‌ని పక్కన ఉంచాలి.

ఓ గిన్నెలో మైదా, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు, అల్లంపొడి, దాల్చినచెక్కపొడి వేసి అన్నీ కలిసేలా స్పూనుతో కలపాలి.

మరో గిన్నెలో గుడ్ల సొన వేసి బీట్ చెయ్యాలి. తరవాత పంచదార, నూనె వేసి బాగా కలిసేలా రెండు నిమిషాలు బీట్ చేయాలి. ఇప్పుడు గుమ్మడికాయ గుజ్జు, వెనీలా ఎస్సెన్స్ వేసి మెత్తగా అయ్యేటట్లు ఐదు నిమిషాలు గిలకొట్టాలి.

ఒక స్పూనుతో ముందుగా కలిపి ఉంచుకున్న మైదా మిశ్రమాన్ని రెండు లేదా మూడు విడతలుగా గుడ్డు మిశ్రమంలో వేసి కలపాలి. మరీ ఎక్కువగా కలిపితే బ్రెడ్ గట్టిగా వస్తుంది. అందుకే నెమ్మదిగా కలపాలి.

ఈ బ్రెడ్ మిశ్రమాన్ని పాన్‌లో వేసి దానిమీద ముందుగా కరిగించి ఉంచిన చాక్లెట్‌ను వేయాలి. ఓ చిన్న చాకుతో ఎనిమిది ఆకారంలో గీస్తే చాక్లెట్ లోపలకు దిగుతుంది. ఇప్పుడు ఈ పాన్‌ని వేడి చేసిన ఓవెన్‌లో పెట్టి 55 నుంచి 60 నిమిషాలు బేక్ చేసి తీయాలి. ఐదు నిమిషాలు చల్లారాక కట్ చేయాలి.

– స్పందన

www.cooklikemom.net

ఆటవిడుపు

ఆ ఒక్కటే

నాలుగింటిలోకీ భిన్నంగా ఉన్నది ఏది?



అమరిక

వృత్తాల్లో ఎరుపు, పసుపు, నీలం రంగులు నింపాలి. ఒకే రంగు పక్కపక్క వృత్తాల్లో రాకూడదు.



ఎన్ని మొక్కలు?

రంగయ్య తన పొలానికి నాలుగు వైపులా నీలగిరి మొక్కలు నాటాలనుకున్నాడు. ప్రతీ వరుసకూ 25 మొక్కలు రావాలంటే రంగయ్య ఎన్ని మొక్కలు కొనాలి?

జతచేయండి

ఇక్కడ ఎడమవైపు ఉన్న క్రియావిశేషణాలను కుడివైపు క్రియలతో జతచేయండి.

1. గిరగిర- అ. నవ్వు
2. పెళపెళ - ఆ. మాట్లాడు
3. ధగధగ- ఇ. బాదు
4. పకపక - ఈ. వణుకు
5. లొడలొడ - ఉ. నడువు
6. దబదబ - ఊ. విరుగు
7. గజగజ - ఎ. తిరుగు
8. చకచక- ఏ. మెరియు

అంకెలాట

ప్రశ్నమార్కు దగ్గర రావాల్సిన అంకె ఎంత?



గప్‌చుప్

1. ఇక్కడ ఎవరి ప్రాణాలకు ప్రమాదం ఉందో చెప్పగలరా?
2. ఆంగ్ల అక్షరం Bతో మొదలయ్యే ఆరు పదాల్ని రాయండి.
3. నీటిలో తడిసిన అబ్బాయి టోపీ కనిపించడంలేదు. ఎక్కడ ఉంది?
4. బొమ్మలో రెండు జతల కవలలు ఉన్నారు. వాళ్లని గుర్తుపట్టండి.
5. ఇక్కడ మనుషులే కాకుండా, ఇంకా ఏయే ప్రాణులున్నాయి?



సుమతి

మాధవరంలో సుమతి అనే అమ్మాయి ఉండేది. మాధవరం జమీందారు రంగస్వామి ఇంటి దగ్గర పిల్లలకు రొట్టెలు పంచుతున్నారని తెలిసి ఆమె కూడా వెళ్లింది. అక్కడ చాలామంది పిల్లలు రొట్టెలకోసం ఉన్నారు. జమీందారు ఇంట్లోని ఉద్యోగి రొట్టెల బుట్ట తెచ్చి పెట్టి... 'ఒకరి తర్వాత ఒకరు వచ్చి తీసుకోండ'ని చెప్పి పక్కన నిల్చున్నాడు. అతడు పక్కకు వెళ్లగానే పిల్లలు ఒకరిమీద ఒకరు పడి ఎవరికి దొరికినన్ని రొట్టెలు వారు తీసుకున్నారు. సుమతి మాత్రం అందరూ వెళ్లిపోయాక బుట్టలో మిగిలిన రెండు చిన్న రొట్టెలు తీసుకొని ఇంటికి వెళ్లింది.



ఇంటి దగ్గర సుమతి రొట్టె విరిచి చూస్తే అందులో ఓ వెండి నాణెం ఉంది. ఆ విషయం అమ్మా నాన్నలకు చెప్పింది. 'ఈ నాణెం పొరపాటున రొట్టెలో పడినట్లుంది. ఇది తిరిగి జమీందారుకి ఇచ్చి వస్తాను' అంది సుమతి. అందుకు సుమతి అమ్మానాన్న కూడా సరేనన్నారు. ఆ నాణెం పట్టుకొని సుమతి జమీందారు ఇంటికి వెళ్లి ఆయనకు జరిగిందంతా చెప్పింది.

'మన ఊళ్లో సహనం, నిజాయతీ ఉన్నవారిని గుర్తించడానికి ఈ నాణెం రొట్టెలో పెట్టించాను. నువ్వూ, మీ అమ్మానాన్నా ఆ పరీక్షలో నెగ్గారు. మాకు నమ్మకమైన ఉద్యోగులు కావాలి. మీ అమ్మానాన్నల్ని తీసుకొస్తే వారికి పని అప్పగిస్తాను. నీ చదువుకి అయ్యే ఖర్చు కూడా నేనే పెడతాను' అని చెప్పాడు జమీందారు. తర్వాత సుమతి తల్లిదండ్రులు జమీందారు ఇంట్లో ఉద్యోగులుగా మారారు. సుమతి చక్కగా చదువుకుంది.

పట్టుకోండి చూద్దాం

బొమ్మలో ఈ అమరిక ఎక్కడ ఉందో చెప్పగలరా?



ఆటాడుకుందాం

ఈ ఆటపేరు క్రాస్ స్టెప్. ఇది ఆడేందుకు ఇంటిముందు లేదా ఆట స్థలంలో సుద్దముక్కతో 10x10(100) గళ్లు గీయాలి. ఒక్కో గడి ఒకరు నిలబడేందుకు సరిపోవాలి. ఆటలో పాల్గొనే ఇద్దరూ లేదా ముగ్గురు ఆటగాళ్లు తమకు నచ్చిన చోట ఒక్కో గడిలో నిలబడాలి. ఆ తర్వాత ఒక్కొక్కరూ తాము ఉన్న గడి నుంచి పక్క గడికి కదలాలి. కొత్త గడి అప్పటికి ఉన్న గడికి పక్కదే అయి ఉండాలి. ఐమూలగా అయినా ఫర్వాలేదు. కొత్త గడిలోకి వెళ్లాక అంతకు ముందు ఉన్న గడిలో సుద్దముక్కతో ఇంటూ మార్కు పెట్టాలి. తర్వాత ఆ గడిలోకి మరెవ్వరూ వెళ్లకూడదు. ఒక రౌండ్ అయ్యాక రెండో రౌండ్‌కు వెళ్లాలి. రౌండ్లు పెరిగేకొద్దీ ఖాళీ గళ్లు తగ్గిపోతుంటాయి. దాంతో పక్క గడికి కదలలేరు. ఎవరైతే ఎటూ కదలలేకపోతారో వాళ్లు ఔట్ అయినట్లు. చివరకు మిగిలేవారే విజేత.

ఎన్ని తలగడలు?

బొమ్మలో మొత్తం ఎన్ని తలగడలు ఉన్నాయో లెక్కించండి.



దారి కనుక్కోండి

ఎలుకకు జున్నుముక్కను చేరే మార్గం చూపండి.



రంగులేద్దాం

సూచనల ఆధారంగా బొమ్మకు రంగులు వేయండి.



1=నీలం 2=నారింజ 3=పసుపు 4=ఆకుపచ్చ 5=గోధుమ 6=లేత ఆకుపచ్చ

జవాబులు

గమనించండి: 1. బంతులు, గుడ్లతో మూడరంగులున్నవి కిందివి. 2. Butterfly, Ball, Banana, Belt, Boot, Bow. 3. కుక్కకున్నవి ఆంటెన్నా మీద తేనెటీగ నాలుగు. 4. ఉత్తర మూడ సైకిలం ఉన్నాయి, చిత్రపటం ఉన్నాయి. 5. కుక్క, బంతులు, స్కూటర్లు, చిన్న, దిండ్లు మరియు.

జవాబు:



జతపరుచుండి: 1-ఎ, 2-ఉ, 3-ఎ, 4-ఇ, 5-ఇ, 6-ఇ, 7-ఉ, 8-ఉ.

ఇ జన్మదిన: D

ఎన్ని ఉరుములు?: 15

ఎన్ని నిమిషాలు?: 96

మిస్టరీ ఫ్రూట్?: పనసపండు బయట ముళ్లతో మరియు లోపల ఎర్రటి తొనలతో ఉంటుంది.

ఉరకలు: 10(పరుగు ఊరం మధ్యలైనా, దాదాపు ఉరకలు ఉన్నాయి 23)

రాత్రి 8 దాకా సూర్యుడుంటాడు!

'అందములు విందులయే అవని ఇదేనా? కమలాసనుని దివ్యసృష్టి ఇదేనా?' అని సందర్శకులు పరవశించిపోయేలా చేసే మనోహరమైన దీవి అది. దాని పేరే 'బార్ హార్బర్' అంటూ ఆ దీవి విశేషాలు చెప్పుకొస్తున్నారు ఇటీవలే ఆ ప్రాంతాన్ని సందర్శించిన అనంతపురం వాసి డాక్టర్ గాల్లాపిన్ని వసుంధరాదేవి.

అకేడియా జాతీయ పార్కు అందాలు...

అమెరికా ఈశాన్య ప్రాంతంలో అట్లాంటిక్ మహాసముద్రం మధ్యలో ఉన్న సహజ సుందర ద్వీపం బార్ హార్బర్. అక్కడ మా అమ్మాయి అల్లుడూ ఉండటంతో కొన్నాళ్లు ఉండి వచ్చాను. బెంగళూరు నుంచి లండన్ మీదుగా బోస్టన్‌కు బ్రిటిష్ ఎయిర్ వేస్‌లో దాదాపు 23 గంటల ప్రయాణం. ఇక్కడ తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరితే మన కాలమానం ప్రకారం మర్నాడు తెల్లవారుజామున 4 గంటలకు అక్కడకు చేరుకున్నాను. మనకీ వాళ్లకీ 10 గంటల వ్యత్యాసం ఉంది. విమానాశ్రయంలో కస్టమ్స్ చెకింగ్, లగేజీ తీసుకోవడం... అన్నీ ముగించుకుని బయటపడేసరికి రాత్రి ఏడు గంటలైంది. కానీ రాత్రి 8 గంటలవరకూ చీకటి పడలేదు. వేసవిలో అక్కడ రాత్రి 8 గంటలకు సూర్యాస్తమయం, వేకువజామున 5 గంటలకే సూర్యోదయం అవుతాయి. అక్కడ నుంచి క్రమంగా పగటిసమయం వారానికి పదినిమిషాలు తగ్గుతూ వచ్చి శీతాకాలానికి 7.30 గంటలకు భానుడు ఉదయిస్తాడు. మళ్లీ మధ్యాహ్నం 3.30 గంటలకు అస్తమిస్తాడు.

బోస్టన్ నుంచి కారులో బార్ హార్బర్‌కు దాదాపు ఆరుగంటల ప్రయాణం. విమానం లేదా ఓడల్లో కూడా అక్కడకు వెళ్లవచ్చు. రోడ్లన్నీ పరిశుభ్రంగా విశాలంగా ఉన్నాయి. . ట్రెంటిన్ దగ్గర నేల వంతెనను చూడగానే ద్వీపంలోకి ప్రవేశించామని అర్థమైంది. చేయి తిరిగిన చిత్రకారుడు గీసినట్లుగా చుట్టూ పచ్చని చెట్లూ ఎత్తైన కొండలతో అందంగా ఉందా దీవి. రోడ్డు మలుపులు తిరిగేటప్పుడు ఓసారి కుడివైపూ, మరోసారి ఎడమవైపూ కనిపిస్తూ సముద్రం మనతో దోబూచులాడుతున్నట్లే ఉంటుంది. 'ఫ్రెంచ్‌మెన్ బే' అని పిలిచే అట్లాంటిక్ సముద్రతీరంతోనూ అకేడియా పర్వత పంక్తుల మధ్యలో ఉన్న బార్‌హార్బర్ ద్వీపం అందమైన పక్షిగూడుని తలపించింది.

స్వర్గధామం

ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి మే నుంచి అక్టోబర్ వరకూ అనుకూల సమయం. మిగిలిన ఆరునెలలూ విపరీతంగా మంచు కురుస్తుంటుంది. అప్పుడు ఉష్ణోగ్రత రమారమి మైనస్ 20 డిగ్రీల సెంటీగ్రేడు వరకూ పడిపోతుంది. అందువల్ల వేసవిలో మాత్రమే ఈ ద్వీపం పర్యాటకులతో కళకళలాడుతుంటుంది. వారాంతంలో సందర్శకుల తాకిడి మరీ ఎక్కువ. అటు ప్రకృతి ఆరాధకులకీ ఇటు పరిశోధకులకీ కూడా ఈ ద్వీపం ఓ స్వర్గధామం. అద్దెకు ఇళ్లు, కాటేజీలు, లాడ్జీలు, స్టార్ హోటళ్లు... వంటివి దొరుకుతాయి. రకరకాల 'సీఫుడ్'ను అందించే రెస్టారెంట్‌లు 70కి పైగానే ఉన్నాయి. అమెరికన్ రుచులతో పాటు మెక్సికన్, ఆసియన్... ఇలా సమస్త ప్రపంచదేశాల శాకాహార, మాంసాహార రుచులన్నీ అక్కడ దొరుకుతాయి. వివిధ ప్రదేశాలకు వెళ్లడానికి సైట్‌సీయింగ్ విమానాలూ క్రూయిజ్‌లూ ట్రాలీలూ దొరుకుతాయి. గంటలప్రకారం స్కూటర్లు, సైకిళ్లు, కార్లు, పడవలు, హెలికాప్టర్లు కూడా అద్దెకు దొరుకుతాయి. 'ఐల్యాండ్ ఎక్స్‌ప్లోరర్' అనే ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉంది.

మెయిన్ రాష్ట్రంలో 28 మైళ్ల పొడవుగల సముద్రతీరంతో 45 చదరపు మైళ్ల వైశాల్యంతో



కేడిలాక్ పర్వతం మీద నుంచి బార్‌హార్బర్... వేసవిలో పచ్చపచ్చగా...

సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో రంగులు మారుస్తూ...

ఉన్న ఈ ద్వీపంలో టౌన్‌హిల్, ఈడెన్, సాలిస్‌బరీ కోవ్, హల్స్‌కోవ్, ఆటర్ క్రీక్, డౌన్‌టౌన్ అనే ఆరు ప్రాంతాలు ఉన్నాయి. అకేడియా నేషనల్ పార్క్, వివిధ మ్యూజియాలు, లైట్‌హౌస్‌లు, బీచ్‌లు... ఇలా చూడదగ్గ ప్రదేశాలు చాలానే ఉన్నాయి.

అకేడియా నేషనల్ పార్కు

అమెరికాకే గర్వకారణంగా చెప్పే అకేడియా నేషనల్‌పార్క్‌ను సందర్శించగలగడం ఓ మధురజ్ఞాపకం. 1916లో ఉడ్రోవిల్సన్ చేతులమీదుగా ఆరువేల ఎకరాల స్థలంలో ప్రారంభించిన ఈ జాతీయ పార్కు, ప్రస్తుతం యాభైవేల ఎకరాలకు విస్తరించారు. ఈ పార్కులో మన అభిరుచీ, ఆసక్తీ, సామర్థ్యాలను బట్టి వాకింగ్, బైకింగ్, హైకింగ్, స్కేటింగ్, కయాకింగ్, స్విమ్మింగ్, రైడింగ్... వంటివన్నీ ఉన్నాయి. పురాతన కాలానికి చెందిన విభిన్న వాహనాల్లోనూ విహరించవచ్చు. ఈశాన్య అమెరికాలో నెలకొల్పిన ఏకైక జాతీయపార్కు ఇదే. సంవత్సరానికి 20 లక్షల మంది పైనే సందర్శిస్తున్న ఈ పార్కు అమెరికాలోని మోస్ట్ విజిటెడ్ పార్కుల జాబితాలోని తొలి పది పార్కుల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుంది. ప్రపంచంలోని అన్ని రకాల వృక్షసంపదా ఇక్కడ ఉంది. జింకల గుంపులు, నెమళ్లు, నక్కలు, కుందేళ్లు, ఉడుతలు... ఇలా ఎన్నో రకాల వన్యజీవులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగుతూ మనకు కనువిందు చేస్తుంటాయి. ముఖ్యంగా ఈ రాష్ట్రమృగమైన 'మూస్' అని పిలిచే అతిపెద్ద జింకలు ఇక్కడ ఉంటాయి.

ఈ పార్కులోనే ఉన్న 1,532 అడుగుల ఎత్తైన కేడిలాక్ పర్వతంమీదకి ఉదయం ఐదు గంటలకే చేరుకుని సముద్రంలోంచి మెల్లమెల్లగా ఉదయిస్తోన్న బాలభానుణ్ణి చూడటం అనిర్వచనీయమైన ఆనందానుభూతిని కలిగిస్తుంది. ఆరోజు అమెరికాలో అందరికన్నా మొదటగా సూర్యోదయాన్ని చూసిన ఘనతను దక్కించుకోవచ్చు.

తరవాత ఈ పార్కులోనే ఉన్న మౌంట్ డెజర్ట్ ద్వీపాన్ని సందర్శించాం. సముద్రగవ్వలతో ఇసుకతో సహజంగా ఏర్పడిన "శాండ్ బీచ్" ఆబాలగోపాలాన్నీ అలరిస్తుంది. అత్యంత శీతలంగా ఉండే ఈ బీచ్‌లో నడివేసవిలో కూడా 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాలేదట. తరవాత సముద్రపు అలలహోరును ప్రతిధ్వనించే థండర్‌హోల్‌ను సందర్శించాం. సముద్ర కెరటాల రాపిడితో ఏర్పడిన అతి పెద్ద బిలం ఇది. ఇక్కడే ఉన్న లాబ్‌స్టర్ హేచరీలో వాటి జీవితచరిత్రనీ రకాలనూ వాటితో చేసే వివిధ వంటకాల తయారీనీ తెలుసుకోవచ్చు. ఈ పార్కులోనే సముద్రాంతర్భాగాన్ని కామెంటరీతోసహా చూపించే అద్భుతమైన ఓషనేరియం ఉంది. అక్వేరియం, ఎకోలేక్‌గా పిలిచే మంచినీటి ఈతకొలను, జోర్డాన్‌పాండ్, బబుల్‌పాండ్.. మొదలైనవన్నీ తిరిగాం.

ఎబే మ్యూజియం!

అకేడియా పార్కుకు నైరుతి దిక్కులో బార్ హార్బర్ హెడ్‌లైట్ అనే అతి పురాతన లైట్ హౌస్ ఉంది. 1858వ సంవత్సరం నుంచి నేటివరకూ ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ప్రతి సెకనుకీ ఒకసారి రెడ్ ఫ్లాష్‌లైట్ మూడుసార్లు వెలుగుతూ నాలుగోసెకనుకు ఆరిపోతుంది. అమెరికా కోస్ట్‌గార్డ్ నియంత్రణలో ఉన్న ఈ లైట్‌హౌస్, జాతీయ చారిత్రక అద్భుతంగా పేరు పొందింది. ఇది కాకుండా ఈ ద్వీపంలో ఇంకా మౌంట్ డెజర్ట్ రాక్ లైట్, గ్రేట్ డక్ ఐల్యాండ్ లైట్‌లను 'కాలేజ్ ఆఫ్ అట్లాంటిక్' నిర్వహిస్తుంది.

బార్‌హార్బర్ డౌన్‌టౌన్‌లో స్థానిక చరిత్ర, సంస్కృతి, పురావస్తు కళలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించే అద్భుతమైన ఎబే మ్యూజియం ఉంది. ఇది ఏడాదిపొడవునా సందర్శకుల కోసం వివిధ కార్యక్రమాలను రూపొందిస్తూ ఉంటుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకూ మాత్రమే తెరిచి ఉండే బార్‌హార్బర్ హిస్టారికల్ సొసైటీ మ్యూజియంలో వివిధరకాల ఫొటోలు, చిత్రపటాలు, వస్త్రాలు, వస్తువులను చూశాం. కాలేజ్ ఆఫ్ అట్లాంటిక్ విద్యార్థులు నిర్వహించే జార్జ్.బి.డర్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ, సియర్‌డి. ఒక్క ఎబే మ్యూజియం తప్ప మిగిలినవి జూన్ నుంచి అక్టోబర్ వరకూ మాత్రమే తెరిచి ఉంటాయి.

ప్రయోగాలకు నిలయం!

బార్‌హార్బర్‌లో షాపింగ్ చేయడంకోసమే సుదూర ప్రాంతాల నుంచి యువతీయువకులు వస్తూ ఉంటారు. జ్యువెలరీ, వస్త్రాలూ, హస్తకళల దుకాణాలూ ఉంటాయి. టోరమెలైన్ అనే రంగురాళ్ల నగలకు ఈ ప్రాంతం పెట్టింది పేరు. రోజుకో రకం వెరైటీ నాటకాలనూ నృత్యప్రదర్శనలనూ ప్రదర్శించే ఆర్ట్ థియేటర్, సినిమాతోపాటు వెరైటీ పిజ్జాలను కూడా ఆరగించే వీలున్న రీల్ పిజ్జా అనే సినిమా థియేటర్ బార్ హార్బర్‌లో ఉన్నాయి. ప్రతిరోజూ ఉత్సవాలూ, ప్రదర్శనలూ, మారథాన్‌లూ నిర్వహిస్తుంటారు.

ప్రపంచ ప్రసిద్ధిపొందిన జాక్‌సన్ లేబొరేటరీ, మౌంట్ డెజర్ట్ ఐల్యాండ్ బయోలాజికల్ లేబొరేటరీలు ఇక్కడ ఉన్నాయి. క్యాన్సర్లు, గుండెజబ్బులు, మధుమేహం, అల్జీమర్స్... మొదలైన ఎన్నో వ్యాధులను నియంత్రించే లేదా నిర్మూలించే మందులను తయారుచేస్తున్న ఈ ప్రయోగశాలలను ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా సందర్శించవచ్చు. అక్కడ పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలను కలుసుకోవడం, వాళ్లు చేస్తునవాటి గురించి తెలుసుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

17వ శతాబ్దం వరకూ నావికులకూ మత్స్యకారులకూ మాత్రమే ఆవాసంగా ఉన్న ఈ ప్రదేశాన్ని థామస్‌కోల్, ఫ్రెడరిక్ చర్చ్ అనే ఇద్దరు చిత్రకారులు తమ చిత్రాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారు. ఆ చిత్రాల ద్వారా ఈ ద్వీపసౌందర్యానికి ముగ్ధులైన రాక్‌ఫెల్లర్స్, మోర్గాన్స్ మొదలైన ధనిక వంశాల వాళ్లు ఇక్కడ భవంతులు నిర్మించుకుని, వేసవి విడిదులుగా వాడుకున్నారు. 1947లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం నుంచి చాలా వేగంగా కోలుకుని దీటుగా తిరిగి నిలవడం గొప్ప చారిత్రక అద్భుతమని చెప్పుకుంటారు.

బార్‌హార్బర్‌లో ఉన్న ఆరునెలలూ ఆర్రోజుల్లా ఆనందంగా గడిచిపోయాయి. ప్రతిరోజూ సముద్రంవైపు నడిచివెళ్లడం, అక్కడున్న అగమాంట్‌పార్క్‌లో కూర్చుని ఐస్‌క్రీంకోన్‌లను తింటూ టూరిస్టులను వారి జీవనసరళినీ గమనించడం, క్రూయిజ్‌లలో సముద్రంపైకి వెళ్లిరావడం, సముద్రపు ఆటుపోట్లనూ రకరకాల బీచ్‌రోజ్‌పూలనూ చూడటం... మరిచిపోలేని తీపిగుర్తులుగా మిగిలిపోతాయి. ముఖ్యంగా క్రమశిక్షణకూ పరిశుభ్రతకూ అమెరికన్లు ఇస్తున్న ప్రాధాన్యం మమ్మల్ని ముగ్ధుల్ని చేసింది.

శ్రీ వేదనారాయణస్వామి ఆలయం

ఈటీవీ2

నాగలాపురం

మన రాష్ట్రంలో అత్యంత అద్భుతమైన శిల్పకళా వైభవానికి సంబంధించిన ఆలయాలలో చిత్తూరు జిల్లా నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి ఆలయం ఒకటి. ఇది తిరుపతి నుంచి చెన్నై వెళ్లేదారిలో తిరుపతికి 68 కిలోమీటర్ల దూరంలో ఉంది. శ్రీకృష్ణదేవరాయలు తన తల్లి నాగమాంబ కోరికమేరకు నిర్మించిన ఈ ఆలయం ఎన్నో చారిత్రక, పౌరాణిక, ఆధ్యాత్మిక విశేషాంశాల సమాహారం. సోమకాసురుని నుంచి వేదాల్ని రక్షించి వేదనారాయణమూర్తిగా ఆవిష్కృతమైన ఈ దివ్యక్షేత్ర విశేషాలు నేటి తీర్థయాత్రలో...

తీర్థయాత్ర

ఈరోజు సాయంత్రం 4.30 గంటలకు

రాశి ఫలం

గ్రహబలం (డిసెంబరు 23 - 29)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఒక శుభవార్త వింటారు. ఒక ముఖ్యమైన విషయమై పెద్దలను కలుస్తారు. నిర్ణయం మీకు అనుకూలంగా వచ్చే అవకాశముంది. ఆర్థికంగా ఫర్వాలేదనిపిస్తుంది. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. భోజన సౌఖ్యం ఉండకపోవచ్చు. ఒక సంఘటన మీపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అధికారులు మీపట్ల కాస్త నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తారు. శివారాధన మంచిఫలితాలనిస్తుంది.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

భవిష్యత్ ప్రణాళికలను అమల్లోపెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తారు. చేసే ప్రయాణాలు అంత లాభదాయకంగా ఉండకపోవచ్చు. చేపట్టే పనుల్లో ఆటంకాలు తప్పవు. వృత్తి ఉద్యోగాల్లో వాతావరణం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుంది. బంధుమిత్రులతో ఓ కీలక విషయాన్ని చర్చిస్తారు. స్వల్ప అనారోగ్యం, కలహాలు సూచితం. దైవారాధన మానవద్దు.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆరోగ్యం కాస్త సహకరిస్తుంది. శుభకార్యక్రమాల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో విరోధావకాశాలున్నాయి. అనుకున్నదాన్ని ధైర్యంగా, పట్టుదలతో చేస్తారు. రుణప్రయత్నాలు అనుకూలించకపోవచ్చు. శారీరక శ్రమ పెరుగుతుంది. విందూవినోద కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తారు. ఓ కీలక విషయంలో నిర్ణయం మీకు అనుకూలంగా రాకపోవచ్చు.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారు. చేపట్టే పనులను పట్టుదలగా పూర్తిచేస్తారు. బంధుమిత్రులను ఆదరిస్తారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. మీరు తీసుకునే నిర్ణయాలు మిమ్మల్ని ఆర్థికంగా బలోపేతం చేస్తాయి. ఒక శుభవార్త మీ ఇంట్లో ఆనందాన్ని నింపుతుంది. ఆరోగ్యం అన్నివిధాలా సహకరిస్తుంది. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కోపం తగ్గి, బుద్ధిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టే పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తారు. ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయి. ఒక శుభవార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. కుటుంబ వాతావరణం మీకు అనుకూలంగా మారుతుంది. మీ ప్రతిభకు ప్రశంసలు లభిస్తాయి. బంధుమిత్రుల వల్ల ధనవ్యయం జరగొచ్చు. అనవసరంగా కలహాలు వచ్చే ఆస్కారముంది.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

కీలక విషయంలో అవసరమైన ఆర్థిక సహకారం అందుతుంది. మీ ప్రత్యర్థుల ఎత్తులు పనిచేయవు. బంధుమిత్రుల్లో మీకు ఆదరాభిమానాలు పెరుగుతాయి. ఒక సంఘటన లేదా వార్త మీకు కాస్త బాధకలిగిస్తుంది. స్వల్ప అనారోగ్య సమస్యలున్నా ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది. చేపట్టే పనుల్లో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. దైవారాధన చేస్తే మంచిది.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సంతానాభివృద్ధికి సంబంధించి ఒక శుభవార్త వింటారు. ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయి. అనుకున్న పనులను అనుకున్నట్టుగా పూర్తిచేస్తారు. కుటుంబ వాతావరణం మీకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. మీ చుట్టుపక్కలవాళ్లు మిమ్మల్ని గౌరవిస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో సద్గోష్ఠుల్లో పాల్గొంటారు. పరుషంగా మాట్లాడతారు. అనవసరంగా భయపడుతుంటారు.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు స్వస్థానప్రాప్తి సూచనలున్నాయి. మీ కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం సహకరిస్తుంది. ప్రణాళికా లోపాన్ని పరిహరించుకుంటే అనుకున్న ఫలితాలు వస్తాయి. ఒక ముఖ్యమైన విషయమై పెద్దలను కలుస్తారు. నిర్ణయం మీకు అనుకూలంగా వస్తుంది. కలహాలు వచ్చే సూచనలున్నాయి. మాటలు జాగ్రత్తగా వాడండి.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

సంతానాభివృద్ధికి సంబంధించి ఒక శుభవార్త వింటారు. అనుకున్న పనులను అనుకున్నట్టు పూర్తిచేయాలని ప్రయత్నిస్తారు కానీ, పూర్తిచేయలేకపోతారు. ఆర్థికంగా ఫర్వాలేదనిపిస్తుంది. ఒక సంఘటన లేదా వార్త మీ ఇంట్లో విచారాన్ని నింపుతుంది. కుటుంబంలో అభిప్రాయ భేదాలు వస్తాయి. శారీరక శ్రమ పెరుగుతుంది. ఆంజనేయస్వామి ఆరాధన చేయాలి.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

గతంలోకంటే పరిస్థితులు బాగుంటాయి. భవిష్యత్ ప్రణాళికలు అమలు చేస్తారు. ఒక వార్త మీ ఇంట్లో ఆనందాన్ని నింపుతుంది. చేపట్టిన పనులను పట్టుదలతో, ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తారు. ఆర్థికంగా ఎదుగుతారు. ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ప్రయాణాల్లోనూ, మాట్లాడేటప్పుడూ చాలా జాగ్రత్తగా ఉండాలి.

కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఇంట్లో శుభకార్యక్రమాలు జరుగుతాయి. మానసికంగా దృఢంగా ఉంటారు. ఒక సంఘటన మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు కాస్త ఇబ్బందిపెడతాయి. ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. నిర్ణయాలు తరచూ మారుస్తుంటారు. ఒక వార్త లేదా సంఘటన మీకు కాస్త బాధ కలిగిస్తుంది. అలసటగా ఉంటారు. దైవారాధన మానవద్దు.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

గతంలోకంటే పరిస్థితులు మెరుగవుతాయి. ఒక వార్త లేదా సంఘటన మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. ఆరోగ్యం అన్నివిధాలా సహకరిస్తుంది. బంధుమిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. చేపట్టే పనుల్లో విజయం సాధిస్తారు. కుటుంబంలో చిన్నపాటి విభేదాలు రావచ్చు. విరోధులు పెరిగే సూచనలున్నాయి. ఖర్చులు పెరిగే అవకాశముంది.

సమీక్ష

'రంజని' కథలు

తెలుగు భాషా సాహిత్యాలకు తమ వంతు సేవ చేస్తున్న సంస్థల్లో ఏజీ ఆఫీసు వారి 'రంజని' ఒకటి. ఈ సంస్థ యాభై వసంతాలు నిండిన సందర్భంగా డెబ్భై ఉత్తమ కథానికలతో 'స్వర్ణరంజని' సంకలనాన్ని తీసుకు వచ్చింది. తొలి కథానిక రచయిత గురజాడ అప్పారావు ముఖచిత్రంతో... గిడుగు రాజేశ్వరరావు, ఇసుకపల్లి దక్షిణామూర్తి, పాలకోడేటి, కె.కె.మీనన్, శంకరమంచి పార్థసారథి, సి.భవానీదేవి వంటి ప్రసిద్ధుల రచనలతోపాటు సమ్మెట ఉమాదేవి, కేశరత్నం సుబ్బారావు, పరుచారి, ఎ.శ్రీదేవి వంటి పేరున్న రచయితల కథలూ చోటుచేసుకున్నాయి. 'రిక్షా' అనే గిడుగు రాజేశ్వరరావు కథ మనల్ని ఆర్ద్ర హృదయుల్ని చేస్తుంది. 'నేరాల్ని వ్యక్తుల మీదే మోపుతున్నాం. వారి కుటుంబాల్ని గాలికి వదిలేస్తున్నాం... మొత్తం సమాజానిది కూడా బాధ్యతే' అంటూ చీకోలు సుందరయ్య రాసిన 'బాధ్యత' కథ చెప్తుంది. పమ్మి వీరభద్రరావు 'నిన్ను నీవు తెలుసుకో' కథ 'మాట' విలువను తెలియజేస్తుంది. ఒకరికి ఇవ్వటంలో ఉన్న ఆనందం, తృప్తి మాటలలో చెప్పలేమని వెల్లడించే కథ విశ్వనాథ సోమయాజి రాసిన 'నిర్భాగ్యులు'.

స్వర్ణరంజని (70 కథానికల సంకలనం)
సంపాదకుడు: చీకోలు సుందరయ్య
పేజీలు: 464; **వెల:** రూ.250/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– డా॥ ద్వా.నా.శాస్త్రి

బతుకు నడక

స్వార్థపరుల చేతుల్లో ఖమ్మం ప్రాంత గిరిజనం మోసపోతున్న వైనం... అమాయకులపై మందుల కంపెనీలు చేస్తున్న ప్రాణాంతక ప్రయోగాలు... ఇలాంటి వర్తమాన అంశాలతో గిరిజన పల్లెల జీవనాన్ని అక్షరబద్ధం చేశారు రచయిత. ప్రతీ కథ పాఠకుల హృదయాంతరాళాలను స్పృశిస్తుంది. కులవృత్తిని వదులుకుని సేద్యంలోకి దిగిన వీరన్న వంటి సామాన్యులు లాభాలను కళ్లచూస్తే ఓర్వలేని పెత్తందార్లూ... అటవీ సంపదను కొల్లగొట్టడానికి గిరిజన మహిళను పెళ్లాడి, అవసరం తీరాక వంచించే పున్నారావులూ ఈ కథల్లో కన్పిస్తారు. డబ్బు ముందు మానవ సంబంధాలన్నీ దిగదుడుపే అనుకుని బంధాలను తెంచుకుని జీవితంలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించే పెంటయ్య వంటి వ్యక్తులూ తటస్థపడతారు.

ఊతకర్రలు; రచన: శిరంశెట్టి కాంతారావు
పేజీలు: 269; **వెల:** రూ.125/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– అన్నపురెడ్డి రాజేశ్వరరావు

కదిలించే నవల

జఫర్సన్ నల్లజాతి యువకుడు. ఒక హత్యోదంతంలో అతనికి మరణశిక్ష విధిస్తుంది తెల్ల సమాజం. ముద్దాయికి హత్యచేసేంత తెలివి తేటలు లేవనీ అతను పందిలాంటివాడనీ న్యాయవాది వాదిస్తాడు. జఫర్సన్‌ను పెంచిన దాది ఆ వ్యాఖ్యలతో బాధపడుతుంది. అతను ఎలక్ట్రిక్ ఛెయిర్ వద్దకు పందిలా కాకుండా మనిషిలా నడిచి వెళ్లాలని కోరుకుంటుంది. ఆ బాధ్యత ఓ ఉపాధ్యాయుడికి అప్పగిస్తుంది. ఏడు దశాబ్దాలకు ముందు అమెరికాలోని నల్లజాతి ప్రజల బతుకులను నవల కళ్లకు కడుతుంది. ఎర్నెస్ట్ జె.గెయిన్స్ రాసిన 'ఎ లెసన్ బిఫోర్ డయింగ్'కి ఇది తెలుగు రూపం.

గెలిచిన పాఠం; రచన: ఎర్నెస్ట్ జె.గెయిన్స్
అనువాదం: అనపర్తి పద్మావతి
పేజీలు: 269; **వెల:** రూ.160/–
ప్రతులకు: కలశపూడి శ్రీనివాసరావు, 415 ది ల్యాండ్‌మార్క్, కాప్రా, హైదరాబాద్.

– నీలి వేణుగోపాల్‌రావు

జ్ఞానమార్గం

'జ్యోతిర్గమయ'... వేదాలసారం, ఉపనిషత్తుల సంక్షిప్తరూపం. సనాతన జ్ఞానసంపదను నేటి పరిస్థితులకు అన్వయించి చెప్పడం దామెర వేంకట సూర్యారావు ప్రత్యేకత. గురుశిష్య సంబంధాలు బీటలువారుతున్న నేపథ్యంలో రామకృష్ణ వివేకానందుల గురించి వివరించారు. వైవాహిక జీవితంలోని గొప్పదనాన్ని 'దాంపత్య యజ్ఞం'లో చక్కగా బోధించారు. నైతికత, కృతజ్ఞత, కరుణ, వైరాగ్యం, సేవ... మనిషి పరిపూర్ణత దిశగా ప్రయాణించడానికి చుక్కానిలా దారిచూపే వ్యాసాలివి. శైలి సూటిగా ఉంది. భాష సరళంగా ఉంది.

జ్యోతిర్గమయ (ఆధ్యాత్మిక వ్యాస ప్రకాశం)
రచన: డా॥ దామెర వేంకటసూర్యారావు
పేజీలు: 152; **వెల:** రూ.150/–
ప్రతులకు: జ్యోతి బుక్ సెంటర్ దాబాగార్డెన్స్, విశాఖపట్నం.

– అక్షయ

బుక్ షెల్ఫ్

మనసు గెలవాలి!
పేజీలు: 144; వెల: రూ.100/–

టైమ్ ఫర్ సక్సెస్
పేజీలు: 144; వెల: రూ.100/–
రచన: వాసిలి వసంతకుమార్

సమ్రాట్ అశోక
పేజీలు: 230; వెల: రూ.150/–

సిద్ధార్థ
పేజీలు: 136; వెల: రూ.100/–
రచన: శ్రీశార్వరి
ప్రతులకు: మాస్టర్ యోగాశ్రమమ్ ప్లాట్ నం.89, కృష్ణ ఎన్‌క్లేవ్ ఎండీ ఫామ్ రోడ్, తిరుమలగిరి సికింద్రాబాద్.

తిరుమల క్షేత్ర వైభవం
రచన: ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర్‌రావు
పేజీలు: 108; వెల: రూ.60/–
ప్రతులకు: కె.విజయలక్ష్మి ఫ్లాట్ నం.404, క్లాసిక్ టవర్స్ ప్రకాష్‌నగర్, కడప.

నేటిభారతం (శతకం)
రచన: గండూరి లక్ష్మీనారాయణ
పేజీలు: 56; వెల: రూ.50/–
ప్రతులకు: రచయిత, 9423956248.

బహుముఖ ప్రజ్ఞాశాలి ధర్మపురి కృష్ణమూర్తి సంక్షిప్త జీవిత చరిత్ర
రచన: దేవరకొండ సహదేవరావు
పేజీలు: 86; వెల: రూ.75/–
ప్రతులకు: రచయిత సుస్మిత ఎన్‌క్లేవ్, 50-50-27(3) బి.ఎస్.లే అవుట్, విశాఖపట్నం.

ద్రవ్యరత్నావళి
సంపాదకులు: భాగవతము రామారావు
పేజీలు: 444; వెల: రూ.158/–
ప్రతులకు: రచయిత 23-49/3, నేతాజీనగర్ దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్.

కథలగూడు
రచన: దేవులపల్లి కృష్ణమూర్తి
పేజీలు: 122; వెల: రూ.60/–
ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్లాట్ నం.85, బాలాజీనగర్ గుడిమల్కాపూర్, హైదరాబాద్.

ఒక యుద్ధం తర్వాత...(నవల)
రచన: యస్.మునిసుందరం
పేజీలు: 157; వెల: రూ.172/–
ప్రతులకు: యస్.లక్ష్మీరాజ్యం 'కవితాలయ', 10-3-190ఎ2 కోటకొమ్మల వీధి, తిరుపతి.

పదవినోదం-1122



ఆధారాలు

అడ్డం:

1. వేలాది హిందీ సినీ గీతాలకు ప్రాణం పోసిన భారతరత్నం! (2)
4. అంకురం (3)
6. అడవి (3)
8. గమనించాల్సింది (4)
11. చోటు (2)
12. అలక, కోపం లాంటిది (3)
14. ఉషాకిరణ్ మూవీస్ నిర్మించిన ఒక చిత్రం, మనసును సంతోషపరచేది (3)
18. ఎల్లప్పుడూ (4)
19. బంట్రోతు బిళ్ల తగిలించే పట్ట (3)
21. బెదురు (3)
22. ఒక రాక్షస చక్రవర్తి (2)
23. ప్రాప్తించు; ఎలుక నివాసం! (3)
25. ఒట్టు (2)
28. పెద్దక్కది అనుకుంటున్నావా, కాదు... కాదు- కచ్చితంగా! (4)
29. పాములవాడు ఊదే బుర్ర (4)
30. ఆంగ్లంలో- జనం ఒకరివెంట మరొకరు వరసగా నిలబడ్డారు! (1)
32. సందేహం (2)
34. శపథం (3)
36. బేరమ్ము, స్వరమ్ము, సారమ్ము... మూడింటా ఉన్నదేమిటి? (2)
38. వెంకప్పను పిలవండి! (3)
39. రెండో దావా కాదు, నాలుగోదీ కాదు... (2+2)
41. గడువు (3)
42. శిగ్రువు అంటే ఏమిటో నిఘంటువులో చూడండి... (3)
44. తోకతో (3)
46. ఆంగ్లంలో నిలుపుదల! (1)
47. పరశురాముడి తండ్రి (4)
48. అసలుకన్నా ముద్దు! (2)
49. గుమ్మం వరకు వచ్చి లోపలికి అడుగు పెట్టేందుకు సంకోచిస్తున్నాడు... వాణ్ని పిలవండి! (1)

నిలువు:

2. జగడం, తగాదా (3)
3. అస్తిత్వం (3)
5. సంపదలు అనుగ్రహించే దేవత (2)
7. వెలుగు (2)
9. అందువల్ల (3)
10. లెక్కల్లో వర్గంకన్నా పెద్దది (2)
11. రాగి (2)
13. క్షోభ (3)
14. ఆసరా, ఊతం (4)
15. హారం (2)
16. అమితాబ్, పునీత్ ఇస్సార్‌ల మీద ఈ హిందీ సినిమా చిత్రీకరణ సమయంలో ప్రమాదం జరిగి కథానాయకుడు ఆస్పత్రి పాలయ్యాడు (2)
17. ఛత్రం అంటే? (3)
20. వ గుణింతంలో బంధుత్వం (2)
21. రొంప, పడిశం (3)
24. విజ్ఞాపన (3)
25. ఆజ్ఞ (3)
26. మిగిలిన (3)
27. ఏడురోజుల్లో (3)
31. శీర్షాసనమేసిన ముప్పాతిక! (4)
33. ఖడ్గం (4)
34. ప్రకర్ష చివరిదాకా లేదు... (2)
35. ద్వితీయ (2)
37. తగ్గింపు (3)
38. రజతం (2)
39. మూగమనసులు తొలిసగం (3)
40. కార్చిచ్చు (3)
43. నజరానా రెండోసగం మాయం! (2)
45. మార్గం (2)

సుడొకు-166

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

			5					6
4				7				5
		2	9			1	4	
	8		1		5	2	6	
	5	3	4		7		1	
	1	7			8	4		
3				2				1
8					1			

సమాధానాలు

పదవినోదం-1121



సుడొకు-165

2	8	6	1	3	4	7	5	9
7	4	3	5	6	9	2	8	1
5	1	9	7	8	2	3	4	6
6	2	8	4	1	5	9	7	3
1	5	7	2	9	3	8	6	4
3	9	4	6	7	8	1	2	5
8	6	2	3	5	1	4	9	7
9	3	5	8	4	7	6	1	2
4	7	1	9	2	6	5	3	8

కోపిష్ఠి పక్షుల కొలువు

అసలే వాటికి చిరాకు! పైగా ఎటుచూసినా శత్రువులు. లాఆఆ గి వదిలేస్తే.. పందులు పగిలిపోవాల్సిందే! పక్షుల కసి తీరాల్సిందే. యాంగ్రీ బర్డ్స్ గేమ్ కాన్సెప్ట్ ఇదే. ప్రపంచవ్యాప్తంగా ఈ గేమ్ ఎంతో ప్రాచుర్యం పొందింది. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉన్నవారందరికీ ఈ ఆట గురించి తెలుసు అనడంలో సందేహం లేదు. అందుకే ఈ గేమ్ థీమ్‌తో ఓ పార్కు కూడా వెలిసింది.. ఇది ఫిన్‌ల్యాండ్‌లో ఉంది. టాంపరె ప్రాంతంలో ఉన్న ఈ అడ్వంచర్ పార్కు ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తోంది. వీడియోగో గేమ్‌లో ఉన్న బర్డ్స్, పిగ్స్ అన్నీ ఇక్కడున్నాయి. అంతేకాదు, గేమ్‌లోని వివిధ లెవల్స్‌లో ఉన్నట్టే ఇక్కడా ఎన్నో రకాల ఆకారాలు ఉన్నాయి. ఈ పార్కులో అడుగుపెడితే... యాంగ్రీ బర్డ్స్ లోకంలో విహరిస్తున్నట్టే ఉంటుంది.

FLAT 10%* DISCOUNT
from 15th Dec to 14th Jan 2013
RAMOJI GROUP
Euoke
Celebrate the New Year wrapped in the splendour of Brisah silks. Choose from a range of spectacular designs, embellished with rich motifs. Why just attract, when you can euoke.
Brisah
Pamper your royal senses
Nagarjuna Hills, Hyderabad. Ph: 23423443/4/5
Western Wear | Designer Saris | Fabrics | Bridal Wear | Ghagras | Salwars | Kanjivarams | Kids' Wear | Accessories
R K Swamy BBDO 0501

ఈనాడు ఆదివారం

30 డిసెంబరు 2012

ఉందిలే మంచికాలం ముందుముందునా...

లక్షలాది మంది జీవితాలను ఉన్నతంగా మార్చిన
4 అద్భుత గ్రంథాలను రూ. 500 లకే పొందండి

వ్యక్తిత్వ వికాసం Rs.150/- విజయపథం Rs.200/- బిడియం వద్దు! Rs.100/- విజయాభవ Rs.200/-

Rs.150 తగ్గింపు

సి. నరసింహారావుగారి నాలుగు వ్యక్తిత్వవికాస గ్రంథాలను మీరు పూర్తిగా చదివితే చాలు. అన్ని సమస్యలను, ఇబ్బందులను అధిగమించి ఉన్నతంగా ఎదిగే అనూహ్య శక్తిసామర్థ్యాలు మీ స్వంతమవుతాయి. కలలోకూడా ఊహించి ఎరుగని జీవితం మీకు లభిస్తుంది. ఈ పుస్తకాలు రూ.150/- తగ్గింపుతో మీకు లభిస్తాయి.

ఈ పుస్తకాలు పొందడం అతి సులభం

ఉచితంగా Rs. 75 (పోస్టేజీ+ప్యాకింగ్)

మీరు 040-65995959 కు ఫోను చేసి, లేదా 094400-55475 కు SMS చేసి మీ చిరునామాను తెలియజేయండి. లేక cnraobooks@yahoo.com లేదా cnraobooks@gmail.com కు మీ చిరునామాను e-mail చేయండి

పోస్టేజీ, ప్యాకింగ్ ఖర్చులు రూ. 75/- భరించి ఈ నాలుగు పుస్తకాలను VPP ద్వారా మీకు పంపుతాము. వీటిని మీకు అందించే పోస్టుమాన్‌కు కేవలం రూ 500/- చెల్లించితేచాలు.

లేదా www. teluguebooks.com వెబ్‌సైట్లో కార్డు ద్వారా రూ. 500/-లకే ఈ నాలుగు పుస్తకాలు కొనండి. వెంటనే రిజిస్టరు పోస్టు ద్వారా ఈ పుస్తకాలు అందుకోండి.

Nani International, 408,Vijaya Towers, Shanti Nagar, Hyd-28.

ఇంట్లో... ఒకరోజు!

సినిమా తారలు అన్నాక రోజువారీ షెడ్యూల్స్ వారి చేతిలో ఉండవు. షూటింగులకు అనుగుణంగా అన్నీ మార్చుకోవాల్సిందే. కానీ, ఏదో ఒక రోజు విశ్రాంతి తీసుకోవాలీ అనిపిస్తుంది. అలా ఎప్పుడైనా సెలవు దొరికినప్పుడు కెమెరాలూ క్లాప్‌బోర్డులూ మేకప్ హడావుడీ లేకుండా రోజుని ఎలా గడుపుతుందో ఇలా వివరించింది ఇలియానా.

కారును కడిగేసి...

ఇంటి దగ్గర ఉంటే నేను బాగా ఇష్టపడి చేసేపని కారుని కడగటం. నేనూ చెల్లీ ఓ రెండు బకెట్ల నీళ్లు పట్టుకుని శుభ్రంగా కడిగేస్తుంటాం. అదేదో పనిలా కాకుండా... ఆడుతూ చేస్తుంటాం.

బాల్కనీలో...

మా ఇంటి చుట్టూ పచ్చని కొండలు ఉంటాయి. తెల్లారి లేవగానే బాల్కనీలో కుర్చీ వేసుకుని కాఫీ తాగుతూ సూర్యోదయాన్ని చూస్తుండటం నాకు చాలా ఇష్టం.

పచ్చదనంతో...

మొక్కలు నాటడం... వాటికి నీరు పోయడం... చుట్టూ ఉన్న మట్టిని సరిచేయడం... అవసరమైన ఎరువులు కొని తెచ్చి వేయడం... ఈ పనులంటే నాకు చాలా ఇష్టం. ఒక్కోసారి రోజంతా ఈ పనులతోనే గడిపేస్తూ ఉంటాను.

డిజైనింగ్...

చిన్నప్పట్నుంచీ నాకు డ్రాయింగ్ హాబీ. 9, 10 తరగతులు చదువుతున్నప్పుడైతే అమ్మాయిల డ్రెస్‌ల డిజైన్లు వేస్తుండేదాన్ని. పెద్దయ్యాక డిజైనర్ అవుదామని కలలు కంటుండేదాన్ని. ఇప్పటికీ ఆ కల అలానే ఉంది. ఇంట్లో ఉంటే సరదాగా ఏవైనా డిజైన్లు వేస్తుంటాను.

కొత్తవాళ్లతో....

ట్విట్టర్‌లో నాకు అకౌంట్ ఉంది. ఖాళీ దొరికినప్పుడల్లా అభిమానులను పలకరిస్తుంటాను. వాళ్లు అడిగినవాటికి సమాధానాలు చెబుతుంటాను. ఇంట్లో ఉంటే నేనేం చేస్తున్నదీ అభిమానులకు ట్విట్టర్ ద్వారా ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంటాను.

కొందరితోనే....

నాకు క్లోజ్ ఫ్రెండ్స్ కొద్దిమందే ఉన్నారు. ఖాళీ ఉంటే వాళ్లతో కలిసి కాలక్షేపం చేస్తుంటాను. మాదో చిన్న గ్యాంగ్. వీలున్నప్పుడల్లా ఏదో ఒక రెస్టారెంట్‌లో సాయంత్రంపూట కలుసుకుని డిన్నర్ చేస్తాం.

నా ఫ్రెండ్స్....

ఇంట్లో నాకు బోలెడంతమంది ఫ్రెండ్స్ ఉన్నారు! ఎనిమిది పిల్లులూ మూడు కుక్కలూ ఉన్నాయి. పిల్లులంటే నాకు చాలా ఇష్టం. నేను కూర్చుంటే అవి నా ఒళ్లోకి వచ్చేసి నిద్రపోతుంటాయి. వాటితో బోలెడు టైంపాస్.

వంటింట్లో...

నాకు వంటిల్లంటే ఇష్టం. అంటే, నాకేదో వంటలు బాగా వచ్చు అనుకోకండి. అమ్మ వంట చేస్తుంటే... తన పక్కనే కూర్చుని కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తుంటాను. వండినవాటిని వేడివేడిగా అక్కడే కూర్చుని లాగించేస్తుంటాను.

సంగీతంతో...

సంగీతమంటే చిన్నప్పట్నుంచీ చాలా ఇష్టం. చిన్నప్పుడు సెలవు రోజు వచ్చిందంటే చాలు... కజిన్స్ అందరూ మా ఇంటికి వచ్చేసేవారు. టేపురికార్డరులో పాటలేసుకుని తెగ డాన్సులు చేసేవాళ్లం. ఇప్పటికీ ఇంట్లో ఇలాంటి అల్లరి అప్పుడప్పుడూ చేస్తూనే ఉంటాను.

ల్యాప్‌టాప్‌తో...

షూటింగుల్లో ఉంటే ల్యాప్‌టాప్ ఎక్కడుంటుందో గుర్తుండదు. కానీ, ఇంటి దగ్గరుంటే అది లేనిదే ఒక్క క్షణం కూడా తోచదు అనిపిస్తుంటుంది. ఏదో ఒక విషయం గురించి ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేస్తూ గడిపేస్తుంటాను.

వీధుల్లో ఆటలు...

ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. అదీ మా వీధిలోని పిల్లలతో ఆడుకోవడమంటే మరీ ఇష్టం. రోడ్డుమీదే ఆడుకుంటాం.

లోపల...

చురుక్కు చమక్కు 4
కనక మహాలక్ష్మికి కోటి దండాలు 5
మీ మందు మీ చేతిలో 6

ఉందిలే మంచీకాలం ముందూముందూనా...

7

మంచితనం చచ్చిపోలేదు. బతికే ఉంది. మానవత్వం కనుమరుగైపోలేదు. మన మధ్యే ఉంది. నిజాయతీ నేలకొరిగి పోలేదు. అవినీతితో ధైర్యంగా పోరాడుతూనే ఉంది. ఈ వార్తలు శుభసూచికలు. 'మంచి'గంధపు సువాసనలు.

మీ ప్రశ్నకు బదులిస్తాం 11
కథ 12

కొత్త ఫీచర్లు ఉంటేనే ఫోన్లు కొంటారు 15
కేకు సోకు 16
ముంచినా...కాల్చినా...నో ప్రాబ్లమ్ 18
విద్యార్థుల కోసం ఓ 'ఫార్ములా' 19
నాన్నతో హౌరామెయిల్ ఎక్కేశా 20
అనుకున్నదొక్కటీ... 22
ఎగుడుదిగుడు అందాలు 23
బాలవినోదిని 24



రుచి అభిరుచి 26
సేవా ప్రయాణం 27
రాశి ఫలం 28
సమీక్ష 29
పదవినోదం 30

మంచి పద్యం

లోపం తెలుసుకోవాలి!

ప్రయత్నాన్ని బట్టే ఫలితం. అంతేకానీ కోరినది సొంతం కాలేదని ఇతరులపై అకారణంగా ద్వేషాన్ని పెంచుకోవడం సరికాదంటారు వేమన. ఇదే విషయాన్ని ఈ పద్యంలో ఎంత చక్కగా చెప్పారో చూడండి.

తనకు ప్రాప్తిలేక దాత లివ్వరటంచు
దోషబుద్ధిజేసి దూరుటెల్ల
ముక్కువంక జూచి ముకురంబు దూరుట
విశ్వదాభిరామ వినుర వేమ.

అద్దంలో ముక్కును చూసుకున్నప్పుడు అది వంకరగా కనిపిస్తే... ఆ దోషం అద్దానిది అనుకోవడం వెర్రితనం. అలాగే మనం ఆశించినది దక్కకపోతే ప్రయత్నలోపం అని అర్థం చేసుకోకుండా ప్రాప్తం లేదని సరిపెట్టుకోకుండా ఇతరులను నిందించడం సరికాదు. మనం చేసిన ప్రయత్నం ఆశించిన ఫలితాలను రాబట్టేలా ఉందో లేదో విశ్లేషించుకోవాలన్నది ఈ పద్యంలోని అంతరార్థం.

మంచిమాట

ఆనందమంటే ఏ లోటూ లేకపోవడం కాదు, లోటుపాట్లకు అతీతంగా మెలగగలగడం.

మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

మెదడుకు పదును

'ఐడియా యుద్ధం' స్ఫూర్తిదాయకంగా ఉంది. యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. బుర్రలకు పదునుపెట్టి సరికొత్త ఆలోచనలతో జీవితాన్ని కొత్త మార్గంలో నడిపించుకోవాలి అనుకునేవారికి ఇదో మార్గదర్శకం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈరోజుల్లో ఎన్ని రకాల అవకాశాలున్నాయో తెలుసుకున్నాం.

– గులాబీల మల్లారెడ్డి, హిందూపురం
– నడిమింటి వెంకట రమణమ్మ, హైదరాబాద్

కళ్లు తెరవాలి

'కామెర్ల రోగులు' కథ నచ్చింది. ఎన్నో సినిమాల్లోనూ నవలల్లోనూ అవినీతి గురించి ఎంతోమంది రచయితలు చర్చిస్తూనే ఉన్నారు. అయినా, ఓ కొత్త కోణాన్ని తీసుకుని ఈ కథను మలచిన తీరు ఆకట్టుకుంది. రచయితకు అభినందనలు. ఈ కథను ఏ అవినీతిపరుడైనా చదివితే ఆ వ్యక్తిలో మార్పు తథ్యం అని భావిస్తున్నాం.

– వెంకటేష్ చింతకింది, ముంబై
– పి. రుషిరాజ్(ఈమెయిల్)

దివ్యౌషధం

'అదే నేర్చుకున్నాం అదే నేర్పుతున్నాం' అంటూ జిందా తిలిస్మాత్ సంస్థ నిర్వాహకులు పంచుకున్న అనుభవాలు ఆకట్టుకున్నాయి. ఆ మందును కనిపెట్టి దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హకీమ్ ముహమ్మద్ మోయిజుద్దీన్ ఫారుఖీ చేసిన కృషి అమోఘం. తండ్రిమాటకు కట్టుబడి కంపెనీని నిర్వహిస్తున్న రవూఫ్, మిన్హాజ్ సోదరులకు అభినందనలు.

– పసలపూడి వెంకటరత్నం(ఈమెయిల్)
– నాగయ్య కపలవాయి, హైదరాబాద్

ఆరునెలలు గంగలో

'ఈ నీలకంఠుడు ఆరు నెలలు నీళ్లలోనే' ఎన్నో కొత్త విషయాలను తెలిపింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో ఉన్న ఈ శివాలయం ప్రత్యేకత ఆశ్చర్యపరచింది. ఆరునెలలు శివలింగం నీట మునిగి ఉండటం అద్భుతం. త్వరలోనే ఈ దేవాలయానికి వెళ్లాలని నిర్ణయించుకున్నాం.

– రాళ్లపల్లి శ్రీనివాస శ్రీవాస్తవ, విశాఖపట్నం
– పి.జి.కె.పట్నాయక్, పర్లాకిమిడి (ఒడిశా)

మనకీ కావాలి

'అరటిపండ్ల రైలు' మంచి ఆలోచన. కేవలం అరటిపండ్లను ఎగుమతి చేయడం కోసం ఒక రైలు ఉందని తెలుసుకుని ఆశ్చర్యపోయాం. ఇలాంటి రైళ్లు మన రాష్ట్రంలోనూ ఉంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతీయేటా మన రైతులు పండించే ఎన్నో కూరగాయలకు గిట్టుబాటు ధర లభ్యంకాక... పండించిన వాటిని రోడ్డున పడేయాల్సిన పరిస్థితిని మనం చూస్తున్నాం. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు పండ్లూ కూరగాయల్ని ఇలా ఎగుమతి చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు.

– ఆర్.విజయ(ఈమెయిల్)
– సీహెచ్.దుర్గాప్రసాద్, విజయవాడ

యమహో

'వెండితెరపై యమ ముద్ర' అలరించింది. సినిమాల్లో యముడి పాత్ర గురించి చక్కగా వివరించారు. యముడి పాత్రలకు ఆద్యుడు కైకాల సత్యనారాయణ అని ఇన్నాళ్లూ అనుకునేవాళ్లం. ఇది చదివాక ఆ ఘనత ఎస్వీ రంగారావుకి దక్కుతుందని తెలిసింది. 'ఐడియా యుద్ధం' ఆలోచింపజేసేలా ఉంది. ఈ తరం యువతకి ఒక్క ఐడియా ఉంటే చాలు... జీవితాన్ని ఎలా మార్చుకో వచ్చో అన్నది చక్కగా వివరించారు.

– ఎస్.సంతోష్‌కుమార్, కర్నూలు
– ఎమ్.చక్రవర్తి, భైంసా, ఆదిలాబాద్

చురుకు

ఒలింపిక్స్
అధ్యక్షుడు
ధరల్స్
గవర్నర్
అనుమతి
సమ్మతి
మిత్రులు
శ్రీధర్


ఎన్డీఏ
తృణమూల్
ఎన్డీఏ వైపు తృణమూల్ చూపు


పాకిస్థాన్
భారత్

చమకు

ఆహార భద్రత
భోజనం లేదా?
రమాకాంత్
కే.జీ. కిలో బియ్యం ప్రవేశపెట్టిన రమాకాంత్

కనక మహాలక్ష్మికి కోటి దండాలు

ఆ ఆలయానికి గోపురంగానీ, చుట్టూ పెద్దపెద్ద గోడలుగానీ ఉండవు. రోడ్డు మధ్యలో ఉండే ఆలయం... రేయింబవళ్లూ తెరిచే ఉంటుంది. భక్తులే అమ్మవారికి నేరుగా ఫల, పుష్ప, నైవేద్యాలూ, అభిషేకాలూ చేసుకోవచ్చు. విశాఖవాసుల కొంగుబంగారమైన ఆ తల్లి కనకమహాలక్ష్మి.

'యాదేవీ సర్వభూతేషు... లక్ష్మీరూపేణ సంస్థితా...'... అని చండీసప్తశతి చెబుతోంది. అలాంటి లక్ష్మీదేవి భక్తుల కొంగుబంగారమై, అన్ని వర్గాలవారికీ అందుబాటులో ఉన్న ఆలయమే విశాఖపట్నం వన్‌టౌన్ పరిధిలోని బురుజుపేటలో ఉన్న కనక మహాలక్ష్మి దేవాలయం. విశాఖ బస్టాండునుంచి పాత పోస్టాఫీసుకు వెళ్లే ఏ సిటీ బస్సు ఎక్కినా అమ్మవారి ఆలయం దగ్గర దిగొచ్చు.

ఈ తల్లి ఆలయం ఎంతో విచిత్రంగా ఉంటుంది. అక్కడ వర్ణ, వర్గ భేదాలుండవు. పేదా ధనికా తారతమ్యాలుండవు. అందరూ ఆ అమ్మను తాకవచ్చు. పూజాదికాలు నేరుగా చేసుకోవచ్చు. ఆ ఆలయానికి మిగతా ఆలయాల్లా గోపురం ఉండదు. చుట్టూ పెద్దపెద్ద ప్రహరీలుండవు.

అమ్మవారి విగ్రహం... నడుంపైభాగం మాత్రమే ఉంటుంది. మరో విశేషం ఏంటంటే... అమ్మవారి ఎడమచేయి సగం తెగిపోయి ఉంటుంది. ప్రస్తుత ఈ ఆలయ పరిస్థితి వెనకా, అమ్మవారి రూపం వెనుకా విచిత్రమైన గాథ ఒకటుంది.

కలియుగారంభంలో...

స్థలపురాణం ప్రకారం... బతికుండగానే దైవసాయుజ్యం పొందాలని ఒక బ్రాహ్మణుడు కాశీకి కాలినడకన బయల్దేరాడట. విశాఖ సముద్రతీరాన నడుస్తూ బురుజుపేట వద్దకు చేరుకున్నాడట. అప్పటికే మధ్యాహ్నం కావడంతో, సమీపంలోని బావిలోని నీటితో స్నానంచేసి సూర్యనమస్కారం చేసుకుంటు

న్నాడు. సరిగ్గా అప్పుడే... లక్ష్మీదేవి 'నేను ఈ బావిలో ఉన్నాను. నా విగ్రహాన్ని వెలికితీసి ప్రతిష్ఠించు' అని చెప్పిందట. అప్పుడా బ్రాహ్మణుడు... మహాదేవుణ్ణి తప్ప మరెవ్వరినీ పూజించనన్నాడట. అంతేకాదు, కాశీకి వెళ్లే తొందరలో ఉన్నాననీ విగ్రహాన్ని వెలికితీసేంత సమయం వెచ్చించలేననీ చెప్పాడట. దాంతో అమ్మవారికి కోపంవచ్చి బ్రాహ్మణుణ్ణి తన ఎడమచేతిలోని ఆయుధంతో సంహరించాలనుకుందట. అప్పుడు శివుడు అమ్మవారి ఆగ్రహాన్ని ఉపశమింపజేసేందుకు ఆమె ఎడమచేతిని మోచేతి వరకూ ఖండించేశాడు. శాంతించిన తరవాత ఆమెతో... 'కలియుగంలో ఈ ప్రాంతంలోనే నువ్వు కనక మహాలక్ష్మిగా అవతరిస్తావు' అని చెప్పాడట.

రేయింబవళ్లూ తెరిచే...

ఈ ప్రాంతాన్ని విశాఖ రాజులు పాలించే సమయంలో బురుజువీధిలో అమ్మవారి విగ్రహం ఓ పక్కకు పడి ఉండేదట. 1912లో విశాఖ రాజులు ఈ వీధిని వెడల్పు చేయాలనుకున్నారట. అందుకోసం అమ్మవారి విగ్రహాన్ని వేరేచోటికి జరిపారు. మరుక్షణం నుంచీ స్థానికులకు అనారోగ్య సమస్యలూ, ప్రకృతి ఉపద్రవాలూ ప్రారంభమయ్యాయట. ముఖ్యంగా ప్లేగు వ్యాధి ప్రబలి ఎంతోమంది మరణించారట. ఇదంతా అమ్మవారి విగ్రహాన్ని జరపడం వల్లే జరిగిందని ఆ విగ్రహాన్ని యథాస్థానంలో పెట్టేశారట. విచిత్రంగా... వెంటనే సమస్యలన్నీ సమసిపోయాయట. అప్పట్నుంచీ స్థానికులంతా అమ్మవారిని పూజించడం మొదలుపెట్టారు.

మొదట్లో ఇక్కడ ఆలయ నిర్మాణం చేయాలనుకున్నారు. కానీ, ఆలయం నిర్మిస్తే... అందరూ అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉండదేమోననీ ముఖ్యంగా గర్భగుడిలో అమ్మవారిని ఉంచితే పూజారులు తప్ప అందరూ లోపలకు వెళ్లే అవకాశం ఉండదన్న సందేహంతో ఆ ప్రయత్నం మానుకున్నారు. అప్పట్నుంచీ అమ్మవారు బహిరంగంగానే అందరికీ దర్శనమిస్తోంది.

అమ్మవారికి ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయం సమయాల్లో పంచామృత అభిషేకం చేస్తారు. అమావాస్య తరవాత వచ్చే మంగళవారంనాడు కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహిస్తారు.

ప్రత్యేక, రోజువారీ పూజల సమయంలో తప్ప మూలవిరాట్ వద్ద పూజారులు ఉండరు. అందువల్ల, మహిళలు నేరుగా అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకోవచ్చు. అప్పుడే పుట్టిన పసికందుల నుంచీ మూడునాలుగేళ్ల బిడ్డలను కూడా ఆశీర్వాదం కోసం ఆ తల్లిఒడిలో పెడుతుంటారు.

అయ్యప్ప, దుర్గాదేవి భక్తుల్లానే కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులూ మాలధారణ చేస్తారు. ఈ దీక్ష చేపట్టిన స్త్రీ, పురుషులు ఆకుపచ్చని వస్త్రాలు ధరిస్తారు. వీళ్లంతా మార్గశిరంలో ఆఖరి గురువారం తరవాత వచ్చే శనివారంనాడు దీక్ష విరమణ చేస్తారు. కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి 1997లో కనకమహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ఆలయ ఆవరణలో శ్రీచక్ర ప్రతిష్ఠాపనకు ప్రాంతాన్ని సూచించారు. ఆ తరవాత ఆలయంలో శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు.

మార్గశిరంలో ప్రత్యేక పూజలు

మాసాల్లో మార్గశిరం తానేనని గీతాచార్యుడు చెప్పాడు. అందుకే, శ్రీమహాలక్ష్మికి కూడా మార్గశిరమాసం అంటే ఎంతో ఇష్టం. అందుకే, మార్గశిరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఏటా కార్తీక శుద్ధ ఏకాదశినాడు ఆలయంలో రాటవేసి మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుడతారు. ముఖ్యంగా మార్గశిర గురువారాల్లో లక్షలాదిమంది మహిళలు వస్తారు. ఈ మాసంలో ప్రతి బుధవారం అర్ధరాత్రి తరవాత అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఇవికాక, ఇతర ప్రత్యేక పూజలూ జరుగుతాయి. ఈ మాసం చివరిరోజుల్లో (జనవరి 5న) అమ్మవారి రథయాత్ర జరుగుతుంది. మార్గశిరం నెలరోజుల్లోనూ మనరాష్ట్రంలోని ఇతర జిల్లాలూ, ఒడిశా రాష్ట్రం నుంచి 15 లక్షలకుపైగా భక్తులు వస్తారు.

– *అల్లం నాగేశ్వరరావు,* విశాఖ సిటీ డెస్క్

మీ మందు 51 హోమియో మీ చేతిలో

పీడించే ఫ్లూ

జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో అతి సామాన్యంగా కనిపించే జ్వరాన్ని 'ఫ్లూ' అని వ్యవహరిస్తారు. ఇది వైరస్ కారణంగా వచ్చే ఇన్ఫెక్షన్. ఈ ఇన్ఫెక్షన్ ఎగువ శ్వాసావయవాలకు మాత్రమే పరిమితం గాక ఛాతీలో వుండే దిగువ శ్వాసావయవాలకు సైతం సోకటం జరుగుతుంది. ఛాతీలో వున్న శ్వాసనాళికలు, శ్వాసనాళాలు, శ్వాసకోశాలు సైతం ఈ ఇన్ఫెక్షన్‌కు గురైనట్లయితే 'న్యుమోనియా' అని వ్యవహరిస్తారు. ఈ న్యుమోనియా ప్రాణాంతకంగా పరిణమించవచ్చు. 1918లో మహమ్మారిలా విస్తరించిన ఫ్లూ జ్వరాల (ఎపిడమిక్) వల్ల 2 కోట్ల మంది చనిపోయారంటే ఫ్లూ ఎంతటి విలయాన్ని సృష్టించగలదో అర్థం చేసుకోవచ్చు. 1957, 1968 సంవత్సరాలలో వరుసగా విస్తరించిన ఏషియన్, హాంకాంగ్ ఫ్లూ ఎపిడమిక్‌లలో కూడా ఇదే జరిగింది.

ఫ్లూ జ్వరానికి వైరస్ ఎ, బి, సిలు ప్రధాన కారణంగా గుర్తించారు. ముక్కు కారడం, గొంతు నొప్పి లాంటి సాధారణ లక్షణాలు కన్పించి తగ్గిపోవచ్చు. ఇతర మనుషుల నుండి సంక్రమించిన విధంగానే జంతువుల నుండి సంక్రమించటం ద్వారా కూడా ఫ్లూజ్వరం రావచ్చు. పందుల నుంచి సంక్రమించే 'స్వైన్ ఫ్లూ' ఈ బాపతు జ్వరమే. ఈ వ్యాధికి గురై అమెరికాలోనే లక్షల మంది చనిపోవడం జరిగింది. ఆసియాలో కూడా ఇలా ఎంతోమంది చనిపోయారు, దీన్నే 'వైట్ ప్లేగ్' అని వ్యవహరిస్తారు.

ఫ్లూ లక్షణాలు జలుబుకన్నా భిన్నంగా వుంటాయి. వైరస్ సంక్రమించిన 2 రోజులలో వ్యాధి లక్షణాలు ప్రారంభమవుతాయి. అకస్మాత్తుగా పెద్దపెట్టున జ్వరం కన్పిస్తుంది. చెమటలు, వెన్ను- కాళ్లు- చేతులలో నొప్పులు, దగ్గు, కనుగుడ్లలో నొప్పి, చిన్నపిల్లలైతే వాంతులూ విరేచనాలు, ముక్కు నుండి రక్తం కన్పిస్తాయి.

రెండు మూడు రోజులలో పై లక్షణాలన్నీ తగ్గిపోతాయి. పది రోజుల పాటు దగ్గూ కఫం కన్పించవచ్చు. ఛాతీ, వాయునాళాలలో బాధలు తగ్గడానికి ఒకటిరెండు నెలల సమయం పట్టే అవకాశముంది.

ఫ్లూ తీవ్రమైన వ్యాధిగా పరిగణించ దగ్గదే. పిల్లలు, వృద్ధులు, మరణానికి గురి కావచ్చు. గుండె, శ్వాసావయాల వ్యాధిగ్రస్తులకు ఫ్లూ వ్యాధి చాలా ప్రమాదకరం.

న్యుమోనియా చోటు చేసుకుంటే దగ్గు, రక్తంతో గూడిన శ్లేష్మం కన్పించవచ్చు. 48 గంటలలో మరణం సంభవించవచ్చు.

'వైరస్ ఎ'కు గురైనట్లయితే కోలుకోలేక మరణించవచ్చు. వైరల్ ఇన్ఫెక్షన్‌తో పాటు బాక్టీరియా ఇన్ఫెక్షన్ తోడయినట్లయితే రోగి కోలుకోవటం మరీ కష్టం. చిన్న పిల్లలు 'వైరస్ బి' వ్యాధికి గురైతే కోలుకోవడం కష్టమే. 'ఆస్పిరిన్' గోలీలు వాడినట్లయితే ప్రమాదం హెచ్చు.

1 సమస్య

జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, వాంతులు, విరేచనాలు, ముక్కు కారడం, మగత.

2 ఔషధాన్ని ఎంపిక చేసుకునేదెలా?

మామూలు జ్వరాలలో ఉపయోగపడే ఔషధాలేగాక ఫ్లూ విషయంలో ప్రత్యేక ఔషధాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

నిస్త్రాణ, అస్థిమితంగావుండి, ప్రాణభయంతోడైతే	ఆర్స్‌ఆల్బ్
దాహం విపరీతం, మాటిమాటికీ కొద్దిగా మాత్రమే నీళ్ళు చప్పరిస్తుంటే	ఆర్స్‌ఆల్బ్
జ్వరం, దుర్వాసనతో కూడిన చెమటలుంటే	మెర్క్‌సాల్
తల, కాళ్ళు, చేతులు బరువెక్కిపోతే	జెల్సిమియం
జ్వరంవున్నా దాహం వుండదు, వెన్నులో చలిపెడుతుంటే	జెల్సిమియం
జ్వరం, కండరాలు నొప్పిపెడుతుంటే	రస్టాక్స్
చెమటలు పట్టేటప్పుడు తడిసి, జ్వరంవస్తే	రస్టాక్
గది వెచ్చగా వున్నా చలిపెడుతుంటే	పల్సటిల్లా
రాత్రిళ్ళు దగ్గు, పడుకోలేరు, కూర్చోవలసిందే	పల్సటిల్లా
వేగంగా పెరిగిపోయే జ్వరం, మగత	బాప్టీజియా
జ్వరం తీవ్రంగా వున్న, నాడీవేగంగా కొట్టుకోదు	పైరోజినం
కండరాలలో విపరీతంగా నొప్పి, బల్లమీద పడుకొంటున్నట్లుంటే	పైరోజినం

3 మీ ఔషధం గురించి మరిన్ని వివరాలు

మెర్క్‌సాల్: నోరు దుర్వాసన. చెమట విపరీతం, కానీ జ్వరం తగ్గదు. చొంగ కారుతుంటుంది. జలుబు. ఛాతీలో కూడా బాధలు.

బాప్టీజియా: వేగంగా జ్వరం పెరిగిపోతుంది. మగత. మాట్లాడుతూ మాట్లాడుతూ మగతలోకి జారిపోతారు. వాంతులూ విరేచనాలు తోడవుతాయి. సంధి (డెలీరియం). కాళ్ళూ చేతులూ మొండెం నుండి విడిపోయినట్లనిపిస్తుంది.

పైరోజినం: జ్వరం విపరీతం. అస్థిమితం. జ్వరం తీవ్రంగా వున్నా నాడీ వేగం తక్కువ. లేదా జ్వరం తక్కువున్నా నాడీ వేగం హెచ్చు. కండరాలన్నీ నలగగొట్టినట్టు నొప్పి. పరుపు మీద పడుకున్నా బల్ల మీద పడుకొన్నట్లుంటుంది.

ఆర్సెనికం ఆల్బ్: దాహం ఎక్కువ. అయినా కొద్దికొద్దిగా మాత్రమే నీళ్ళు చప్పరిస్తారు. ఆందోళన. ప్రాణభీతి. చలి ఎక్కువ.

పల్సటిల్లా: గది వెచ్చగా వున్నా చలిపెడుతుంది. గుండె దడ. కప్పుకొంటే సహించలేరు. రాత్రిళ్ళు దగ్గు ఎక్కువ. కూర్చోవాల్సిందే. పడుకోలేరు. ఆకలి తక్కువ. దుఃఖం హెచ్చు.

జెల్సిమియం: స్తబ్ధుగా, మగతగా వుంటారు. రెప్పలు వాలిపోయి వుంటాయి. జ్వరం ఎక్కువగా వున్నా నాడి తక్కువే. దాహం వుండదు. కాళ్ళూ చేతులూ చల్లగా వుంటాయి.

రస్టాక్స్: తడిసిన తర్వాత జ్వరం పట్టుకుంటుంది. ఒళ్ళు నొప్పులు. స్థిమితంగా పడుకోలేరు. ఒంటిమీద దద్దు కన్పించవచ్చు. ఒళ్ళు విరుపు ఎక్కువ.

మోతాదు: *మీరు ఎంచుకున్న ఔషధాన్ని 30 పొటెన్సీలో రోజూ ఉదయం సాయంత్రం... 6 మాత్రల చొప్పున... 2, 3 వారాలపాటు వాడాల్సి ఉంటుంది.*

ఉందిలే మంచికాలం ముందుముందునా...

కొంచెమే కావచ్చు, మంచితనమంటూ ఉంది. ఏ మూలనో అయినా, మానవత్వం మిగిలే ఉంది. నూటికొక్కరే ఉన్నా, నిజాయతీపరులైన అధికారులంటూ లేకపోలేదు. ఒకశాతమో అరశాతమో అయితేనేం, సాధారణ ప్రజలూ అవినీతిని ప్రశ్నిస్తున్నారు, అన్యాయాన్ని నిలదీస్తున్నారు. వైద్య విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం సామాన్యుడికి చేరువవుతోంది - ఆశావాదంతో ఆలోచిస్తే...ఇదంతా మార్పు దిశగా తొలి అడుగని అనిపిస్తుంది.

366 రోజులు(లీపు సంవత్సరం కాబట్టి), 363 సంచికలు (దసరా, దీపావళి, సంక్రాంతి సెలవు రోజులు మినహాయించి)... రోజువారీ వార్తల్లోంచి మానవీయ కథనాలను వెలికి తీయడమంటే, ఓమోస్తరు అక్షర సాగర మథనమే. 'అగ్నిగుండం చేస్తాం. ఆగమాగం చేస్తాం' అని రంకెలేసే కాగితం పులుల హెచ్చరికల్ని వినీ వినట్టు నటిస్తూ - 'నువ్వు వెధవ్వి. నువ్వే వెధవ్వి'...తరహా రాజకీయ రొచ్చును ముక్కుమూసుకుని దాటేస్తూ - వేలకోట్ల లక్షలకోట్ల అవినీతి వ్యవహారాల్ని నిబిడాశ్చర్యంతో గమనిస్తూ - హత్యలూ ఆత్మహత్యలూ ప్రమాదాలూ విస్ఫోటనాల రక్తపు మరకలముందు శ్రద్ధాంజలి ఘటిస్తూ - పాదయాత్ర రాజకీయాల పరమార్థాన్ని గ్రహించుకుంటూ - చంచలమైన మనసును జయించలేని చంచల్‌గూడా వీఐపీ ఖైదీల విధిరాతల్ని ఊహించుకుంటూ - సర్కారువారి 'పీసీ సర్కార్ మార్కు' ఇంద్రజాల విద్యల్ని ఓకంట కనిపెడుతూ - ఎక్కడో ఏమూలనో చిక్కుకుపోయిన మంచితనపు ఆనవాళ్లనూ మానవత్వపు చిరునామాల్నీ వెతికి పట్టుకోవాలంటే- ఆశావాదపు కళ్లజోడు ధరించాలి. అక్షరాల్ని పువ్వుల్లా సుతారంగా స్పృశించాలి.

నిజాయతీ...రైట్‌రైట్!

నరసింహులు కోటీశ్వరుడేం కాదు. హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ కండక్టరుగా పనిచేస్తున్నాడు. జీతంరాళ్లే జీవనాధారం. అంకితభావమే ఆస్తిపాస్తులు. లక్షలకోట్లు కూడబెట్టుకున్న కుబేరకుమారులకంటే ఈ చిరుద్యోగే చాలా చాలా సంతోషంగా ఉన్నాడు. వారికి లేనిదీ ఇతనికి ఉన్నదీ - సంతృప్తి, నిజాయతీ. ఓరోజు డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లబోతుంటే, బస్సులో రెండు లక్షల విలువైన నగలు కనిపించాయి. ఆ అవకాశమే వస్తే, ఎవరైనా ఏం చేస్తారు? గుట్టుచప్పుడు కాకుండా జేబులో వేసుకుంటారు. కానీ నరసింహులు అలా చేయలేదు. సంబంధిత అధికారులకు సమాచారం అందించాడు. పోగొట్టుకున్నవారూ మధ్యతరగతి కుటుంబీకులే. చేజారిపోయిందనుకున్న సొత్తు భద్రంగా చేతికి అందినప్పుడు...ఆ ఇల్లాలి కళ్లలోంచి టపటపా రెండు ఆనందబాష్పాలు. మంచితనానికి ఒకటి, మానవత్వానికి ఒకటి...జంట సాక్ష్యాలు!

'ఆ పార్టీవాళ్లు అవినీతిపరులే
ఈ పార్టీవాళ్లూ అవినీతిపరులే...
నేను మాత్రం నిజాయతీగా ఓటేయాలా?'
అనుకునే ఓటరూ...నరసింహన్నను
అడుగు, నిజాయతీలోని
గొప్పదనమేమిటో చెబుతాడు'

నిర్భీతికి ...ఐఏ'ఎస్'!

ఐఏఎస్, ఐపీఎస్ లాంటి అత్యున్నత సర్వీసులు రాజకీయాలతో అక్రమ సంబంధం వెలగబెడుతున్నాయి. నచ్చిన చోటు కోసం, మెచ్చిన సీటు కోసం...అన్యదా శరణం నాస్తి అంటున్నారు అధికారులు. మరికొందరైతే 'దూర' దృష్టితో...పదవీవిరమణ అనంతర పదవుల కోసమూ పాకులాడుతున్నారు. ఆ పాపం పండిపోయి... ఇప్పటికే జైలులోనో బెయిలుపైనో కాలం వెళ్లదీస్తున్నవారూ ఉన్నారు. ఈ పరిస్థితుల్లో... అక్కడక్కడా తళుక్కున మెరిసే నిఖార్సయిన నిజాయతీపరులు పాలన వ్యవస్థ మీద నమ్మకాన్ని కలిగిస్తున్నారు. తమిళనాడు కేడర్‌కు చెందిన ఆశీష్‌కుమార్, అనుజార్జ్, దారేజ్ అహ్మద్, అన్సుల్ మిశ్రా...అన్నా డీఎంకే నేతల సిఫార్సులను బుట్టదాఖలు చేశారు. పైరవీకారులను ఆఫీసు గేటు లోపలికి కూడా రానివ్వలేదు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణ కోసం సిబ్బంది నియామకాల్ని అంత పక్కాగా జరిపారా కలెక్టర్లు. ఫలితం.. కొందరికి బదిలీ బహుమానం దక్కింది, కొందరికి వేధింపులే ప్రశంసలయ్యాయి. ఎంత ధైర్యం! ఎంత అంకితభావం! జగన్ అక్రమాస్తుల దర్యాప్తు, మద్యం సిండికేట్ల వ్యవహారం, రాజధానిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ...తదితర అంశాల్లోనూ ఒకరిద్దరు ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్‌లూ ఐపీఎస్‌లూ ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేశారు.

'రాజకీయమా ఖబడ్దార్...
కనిపించని నాలుగో సింహం...
కళ్లెర్రజేస్తోంది!'

సమాచార సైనికుడు

అప్పటిదాకా అతనికి బట్టల మురికిని శుభ్రంచేయడమే తెలుసు. వ్యవస్థలోని మురికిని ఎలా వదిలించాలో అర్థమయ్యేది కాదు. ఆ మరకల్ని కడిగేయడానికి 'సమాచార హక్కు' చట్టమనే తిరుగులేని డిటర్జెంటు పొడరుందని ఎవరో చెప్పారు మాణిక్యానికి. అతను నిరుపేద రజకుడు.

సొంతగూడు కూడా లేదు. ప్రభుత్వం బడుగు బలహీనులకు పక్కా ఇళ్లు ఇస్తోందని తెలిసి దరఖాస్తు చేసుకున్నాడు. కొన్నాళ్లకు గృహాలు మంజూరైనా...చాలా వరకూ పక్కదారి పట్టాయి. మాణిక్యం నోట్లో మట్టి పడింది. విశాఖపట్నం జిల్లా అధికారుల ముందు గోడు వెళ్లబోసుకున్నాడు. అయినా ఫలితం లేదు. దీంతో పాశుపతాస్త్రాన్ని బయటికి తీశాడు. నిజమే, తోలు మందం వ్యవస్థతో పోరాటమంటే అంత సులభం కాదు. అలా అని, చేతులు ముడుచుకుని కూర్చోవడమూ పిరికితనం అవుతుంది. 'అన్ని అర్హతలూ నాకున్నాయి. ఎంతకాలమైనా పోరాడుతా...' అంటాడు మాణిక్యం. ఆ తెగువే ఫైళ్లలో కదలిక తీసుకొచ్చింది.

'ప్రశ్నించడానికి భయపడితే ఇల్లో, కిరోసినో, రేషన్ బియ్యమో కాదు... మొత్తంగా నిన్ను నీవు కోల్పోతావ్!'

జయహో...జోస్

ఉరుగ్వే అధ్యక్షుడు జోస్ ముజికా...అతి సామాన్య జీవితం గడుపుతున్నారు. అధ్యక్షుడి హోదాలో అందే వేతనంలో 90 శాతం సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. ఆయన ఇల్లు సాధారణ మధ్యతరగతి నివాసంలా ఉంటుంది. భార్య కున్న కొద్దిపాటి పొలంలో పూలసాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు అంగరక్షకులు మినహాయించి హంగూ ఆర్భాటం కనిపించదు. గతంలో ఆయన ప్రజాస్వామ్య ఉద్యమాల్లో పాల్గొన్నారు. జైలు జీవితం గడిపారు. ఆ అనుభవమే తనకెన్నో అమూల్యమైన పాఠాలు నేర్పిందంటారు జోస్.

సర్పంచ్ అంటే కారైనా ఉండాలి, కార్పొరేటరంటే ఓ షాపింగ్ కాంప్లెక్స్ అయినా కట్టుకోవాలి, ఎమ్మెల్యేలూ ఎంపీలైతే...నియోజకవర్గమంతా అబ్బసొత్తే. అదృష్టం కలిసొచ్చి ఏ మంత్రో ముఖ్యమంత్రో అయితే...నింగి, నీరు, భూమి, పాతాళం...సమస్తం దోచుకోవచ్చు. గంపగుత్తగా రాసిచ్చుకోవచ్చు. ఇలాంటి దురదృష్టకర పరిస్థితుల్లో జోస్‌లాంటి నాయకులే ఆశాజ్యోతులు!

'స్టడీటూర్లంటే సింగపూరూ స్విట్జర్లాండ్లూ చుట్టిరావడం కాదు. మన నేతల్ని నేరుగా ఉరుగ్వే పంపాలి!'

నిరుపేద గాంధేయవాది

పైసాపైసా కూడబెట్టుకున్న సొమ్ముతో పెంటయ్య అనే సామాన్యుడు మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. మెదక్ జిల్లాలోని రామాయిపల్లి పెంటయ్య స్వగ్రామం. అతనో వ్యవసాయ కూలీ. ఇరవై వేలంటే...ఆ నిరుపేదకు పెద్ద మొత్తమే! పుస్తెతాడు తప్ప మరో ఆభరణం చూడని ఇల్లాలికి ఏ నగోనట్రో చేయించవచ్చు. తాతలనాటి పూరిల్లు బాగు చేయించుకోవచ్చు. పిల్లల పేరుతో బ్యాంకులో నాలుగురాళ్లు దాచుకోవచ్చు. కానీ పెంటయ్య మాత్రం గాంధీ విగ్రహం ఏర్పాటుకే మొగ్గు చూపాడు. అతని జీవితాశయమది! 'ఎందుకు పెంటయ్యా మహాత్ముడంటే అంత ప్రేమ...అధికారమిచ్చాడా, ఆస్తులిచ్చాడా?' అని అడిగితే 'స్వతంత్రం ఇచ్చాడు సార్!' అంటాడు అమాయకంగా.

నిజమే, అంతకంటే ఏం కావాలి?

'గాంధీభవన్ వాసులకంటే జన్‌పథ్ వారసులకంటే... నువ్వే ఆ మహాత్ముడిని బాగా అర్థం చేసుకున్నావు పెంటయ్యా!'

పండగంటే అదే..

పండగంటే...హిందువులకు దసరా, దీపావళి, సంక్రాంతి. ముస్లింలకు రంజాన్. క్రైస్తవులకు క్రిస్మస్. పండగరోజంటే... సెలవురోజు, కొత్తబట్టలు, పిండివంటలు. ఎవరైనా అలానే ఆలోచిస్తారు. హైదరాబాదీ ఆటోడ్రైవర్ నాగేశ్వరరావు కోణం వేరు. సంక్రాంతి మొదలు క్రిస్మస్ దాకా...అన్నిమతాల పండగలూ ఆయనకు పరమపవిత్రం. అంతే భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాడు. అలా అని పూజలో ప్రార్థనలో చేయడు. ఆరోజంతా వృద్ధులనూ అంధులనూ వికలాంగులనూ తన ఆటోలో ఉచితంగా తీసుకెళ్తాడు. ఎంత దూరమైనా సరే, నయాపైసా కూడా తీసుకోడు. 'నా పరిధిలో నేను సమాజానికి చేస్తున్న సేవ ఇది...' అంటాడు నాగేశ్వరరావు.

'ఎవరి పరిధిలో వారు...నీలా ఆలోచించగలిగితే దేశం బాగుపడుతుంది దోస్త్!'

ప్రాణదాత

ఊపిరితిత్తులిచ్చి ఒకరికి ఊపిరిపోసింది. కాలేయమై మరొకరి ప్రాణం కాపాడింది. మూత్రపిండాలనిచ్చి ఇద్దరికి జీవితాల్ని ప్రసాదించింది. అవయవదాతగా లక్ష్మి అమరత్వాన్ని సాధించింది. కరీంనగర్ జిల్లా సిరిసిల్లకు చెందిన లక్ష్మి...రక్తపోటు పెరగడంతో కళ్లు తిరిగిపడిపోయింది. అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 'బ్రెయిన్ డెడ్'గా వైద్యులు నిర్ధరించారు. అటు బతుకూ కాదు, ఇటు చావూ కాదు. ఆమె అవయవాలు మాత్రం సజీవం. వాటితో ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి జీవం పోయవచ్చు. 'నలుగురికీ సాయపడినప్పుడే జన్మ సార్థకం అవుతుంది. ఈ పుట్టుకకు ఒక అర్థం, పరమార్థం' అని ఎప్పుడూ అంటుండేదట లక్ష్మి. ఆ మాట నిజం చేయడానికి ఆమె భర్త నారాయణ అవయవదానానికి అనుమతి ఇచ్చాడు. నేత్రదాత సత్యవతి త్యాగమూ నిరుపమానమే. మరునిమిషంలో మరణం తప్పదని తెలిసినప్పుడు సత్యవతి...ఆస్తిపాస్తుల గురించో అయినవారి గురించో ఆలోచించలేదు. నేత్రదానం విషయమై భర్తతో చర్చించింది. తూర్పు గోదావరి జిల్లా తిప్పకుళ్ల గ్రామానికి చెందిన ఆ మహిళ ఇప్పుడు...ఇద్దరి కళ్లతో ప్రపంచాన్ని చూస్తోంది.

'ఏవరికైనా ఒక జననం, ఒక మరణం. అవయవదాతలకు మాత్రం ఒక జననం, ఒక మరణం, మరో జననం!'

ఆత్మాభిమాన పోరాటం

ఆ కొత్తకోడలు కోటి ఆశలతో అత్తారింట్లో అడుగుపెట్టింది. భర్త మంచివాడు, అత్తామామలు ఆదరించారు. ఎక్కడా ఏలోటూ లేదు...ఆ ఒక్కటి తప్ప! తెల్లారే లోపు చెంబుపట్టుకుని ఊరవతలికి వెళ్లాలంటే...ఇబ్బందిగా అనిపించేది. ఇది ఆత్మాభిమానానికి సంబంధించిన సమస్య. తనకే కాదు, ఊళ్లోని మహిళలందరికీ. 'మరుగుదొడ్డి కట్టేదాకా కాపురానికి వచ్చేదిలేదని' శపథం చేసింది అనితాబాయ్.

ఆ స్ఫూర్తితో మిగతా గృహిణులు కూడా పరోక్షంగా సమ్మె నోటీసులు జారీ చేశారు. ఆ నిరసన మధ్య ప్రదేశ్‌లోని చిఛోలీ గ్రామపెద్దల్ని ఆలోచింపజేసింది. దీంతో పంచాయతీ ఆఫీసువాళ్లు మరుగుదొడ్లు కట్టుకోడానికి అప్పిస్తామంటూ ముందుకొచ్చారు. ఇప్పుడా ఊళ్లో ఇంటికో మరుగుదొడ్డి ఉంది.

'ప్రతి సమస్యకూ పరిష్కారం ఉండవచ్చు ఉండకపోవచ్చు. కానీ ప్రతి పరిష్కారం వెనుకా ఓ పోరాటం మాత్రం ఉండితీరుతుంది'

అమ్మ కోసం..

ఓ కొడుకు బతికుండగానే తండ్రికి కొరివిపెట్టే ప్రయత్నం చేశాడు, ఓ కూతురు ఆస్తి కోసం కన్నతల్లిని హతమార్చాలనుకుంది. ఇలాంటి వార్తలు చదివినప్పుడు...మనుషుల్లో మానవత్వం పూర్తిగా చచ్చిపోయిందేమో అన్న అనుమానం కలుగుతుంది.

అదే సమయంలో... కాదుకాదు బతికే ఉందని నిరూపించడానికి కాబోలు, సాక్షి సంతకాల్లాంటి కథనాలు వెలువడుతుంటాయి. జన్మనిచ్చిన మాతృమూర్తిని వెతుక్కుంటూ ఓ యువతి హాలెండ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. ఆమె పేరు పేత్రామర్సీ. తనదగ్గరున్న సమాచారమల్లా ఒకటే..1978 ప్రాంతంలో తనను ఓ అనాథాశ్రమం నిర్వాహకులు హాలెండ్‌కు చెందిన సారీ, క్రిస్ దంపతులకు దత్తత ఇచ్చారు. రికార్డుల ప్రకారం, ఓ కుంతీమాత తనకు జన్మనిచ్చినట్టు తెలుస్తోంది. ఎక్కడుందో తెలియని అమ్మకోసం పేత్రా నగరమంతా గాలించింది. ఎపుడొస్తుందో తెలియని అమ్మకోసం ఆ కూతురు వేయి కళ్లతో ఎదురు చూస్తోంది. 'దూరమైనప్పుడే అమ్మ విలువ తెలుస్తుంది. అమ్మలేని లోటు అర్థమవుతుంది. అమ్మను ప్రేమించకపోయినా ఫర్వాలేదు, బాధపెట్టకండి'... కొడుకులకూ కూతుళ్లకూ పేత్రా సలహా ఇది. తనను పెంచిన అమ్మానాన్నలన్నా పేత్రాకు చాలా ప్రేమ.

'కన్నవారిపై కనికరం లేని బిడ్డలు...
పుట్టనేలవారు, గిట్టనేల!'

చట్టానిదే పైచేయి..

చట్టం కోరల్లో చిక్కుకునేది, ఎప్పుడూ చిన్నచేపలేనా? తిమింగలాల సంగతేమిటి? అన్న ప్రశ్నకు చంచల్‌గూడా జైలు ఆవరణే సమాధానం. సచివాలయం గడప తొక్కకుండానే... గడుసుగా భూపాతాళ వనరుల్ని నొక్కేసిన యువనేతా, ఆయన అడుగులకు మడుగులొత్తిన అనుచరగణమూ జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారు. ఒకరిద్దరు బెయిలు జీవితం గడుపుతున్నా...మళ్లీ ఎప్పుడు పిలుపొస్తుందో తెలియని అనిశ్చితి. జాతీయ స్థాయిలో కనిమొళి, రాజా తదితరులు కూడా చట్టం చూపుల్ని తప్పించుకోలేకపోయారు. ఇలాంటి సంఘటనలే ప్రజల్లో వ్యవస్థ పట్ల నమ్మకాన్ని కలిగించేది.

'ఒక్క అవినీతి నేతకు శిక్షపడితే...
లక్ష విషపు మొక్కల్ని పెకిలించినట్టే.
నాయకుల బంధుగణం చాలాపెద్దది'

భాషాభిమానం

మకరందాన్ని వెతుకుతూ సీతాకోకచిలుక కొండల్నీ కోనల్నీ దాటొచ్చినట్టు...1983 ప్రాంతంలో డేనియల్ నేజర్స్ పారిస్ నుంచి ఆంధ్రదేశానికి వచ్చారు. ఆయన ఆంథ్రోపాలజీ ప్రొఫెసరు. అక్కడ ఉన్నప్పుడే మక్కువకొద్దీ తెలుగు నేర్చుకున్నారు. 'పెద్దాపురం సంస్థానం-చరిత్ర, సంస్కృతి'పై ఎంఫిల్ చేయడమే ప్రధాన లక్ష్యం. ఆతర్వాత మళ్లీ బుర్రకథలు, తోలుబొమ్మలాటలు, గొల్లసుద్దులు మొదలైన కళారూపాలపై పీహెచ్‌డీ చేయడానికని భార్యాపిల్లలతో సహా విమానం దిగారు. ఆ అనుబంధం తెలుగు భాష మీద మమకారాన్ని పెంచింది. ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. తెలుగు బుర్రకథల్ని ఫ్రెంచిభాషలోకి అనువదించేంత పాండిత్యాన్ని సంపాదించారు. తెలుగు-ఫ్రెంచి నిఘంటువును కూడా రూపొందించారు. 'ఇదంతా నా భాగ్యం' అని మురిసిపోతారు డేనియల్.



'తాజా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా 8,46,55,533 మంది కాదు. దానికి ఒకటి జతచేసి చదువుకోవాలి. ఆ పేరు డేనియల్!'

'తీపి' కబురే

రెండు దశాబ్దాల్లో భారత్ మధుమేహ రాజధానిగా మారిపోతుందన్న నిపుణుల హెచ్చరికలు వణుకు పుట్టిస్తున్నాయి. మధుమేహం... పేరుకు ఒక వ్యాధే అయినా చెడు ప్రభావాలు అనేకం. ఆ చేదుచేదు చక్కెర రోగానికి అడ్డుకట్ట వేయడంలో మనవారు విజయం సాధించారు. ఇక, సూదిమందు బాధల్లేవు. మిఠాయి ముట్టొద్దన్న హెచ్చరికల్లేవు. మధుమేహ రోగులు కూడా మామూలు మనుషుల్లానే ఉంటారు, తింటారు. హైదరాబాద్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఛైర్మన్ నాగేశ్వరరావు నేతృత్వంలోని వైద్యుల బృందం ఓ ప్రత్యేక విధానాన్ని అభివృద్ధి చేసింది. 'ఏలెట్' కణాల మార్పిడి ద్వారా జరిగే ఈ తరహా చికిత్స అంతర్జాతీయంగా కూడా మొదటిదే.

క్షయ, హృద్రోగం, కేన్సర్ తదితర వ్యాధుల పైనా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని కొలిక్కి వచ్చాయి. ఆ ప్రయత్నాలు కనుక విజయవంతం అయితే...అనారోగ్య భయాలే ఉండవు.

'ఆరోగ్య భారతం నుంచి ఆనంద భారతం...ఆనంద భారతం నుంచి ఐశ్వర్య భారతం... ఆతర్వాత అజేయ భారతం!'

దిగివచ్చిన 'ఆకాశ్'

ఏ అనంతపురం జిల్లాలోని మారుమూల గ్రామంలోనో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు టాబ్లెట్లను ముందేసుకుని పాఠాలు చదువుకుంటూ ఉంటారు.

ఏ ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు పల్లె విద్యార్థులో గూగుల్ మ్యాప్‌లో తమపల్లె ఎలా కనిపిస్తోందో కళ్లింతలు చేసుకుని చూస్తుంటారు.

...ఊహకే అద్భుతంగా అనిపించే ఈ దృశ్యం అక్షరాలా నిజం కాబోతోంది. ఆధునికీకరించిన 'ఆకాశ్ -2' టాబ్లెట్ తొలిదశలో ఇంజినీరింగ్ విద్యార్థులకూ ఆతర్వాత...పాఠశాల విద్యార్థులతో సహా అందరికీ అందుబాటులోకి రానుంది.

ధర కూడా తక్కువే...ప్రభుత్వ సబ్సిడీ తర్వాత రూ. పదకొండు వందల ముప్పై రూపాయలు.

'ఆకాశ్ - టెక్నాలజీని భూమికి తీసుకొచ్చింది. సామాన్యుడి చేతికి చందమామనిచ్చింది'

పెంచుకుంటూ... పంచుకుంటూ!

ఎన్ని ఆస్తులు కూడబెట్టాం, ఎన్ని తరాలకు దాచిపెట్టాం...అనుకునే వారు కొందరు. ఎంతమందికి దారిచూపాం, ఎన్ని జీవితాల్లో వెలుగులు నింపాం అని ఆలోచించేవారు మరికొందరు...మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌లా. ఆ మహాదాత ఈ ఏడాది దాదాపు 3,760 కోట్ల రూపాయలను సమాజసేవకు కేటాయించారు. గతంలో చేసిన వేలకోట్ల దానాలకు ఇది అదనం. ఎయిడ్స్, క్షయ, మలేరియా మహమ్మారులపై పోరాటానికి ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. బిల్, మిలిందాగేట్స్ ఫౌండేషన్ భారత్ సహా అనేకానేక దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 'ఆరోగ్యవంతమైన జీవితం...ప్రతి ఒక్కరి హక్కు' ఇది ఫౌండేషన్ నినాదం. ఫేస్‌బుక్ సృష్టికర్త జుకెన్‌బర్గ్ కూడా మహాదాతల జాబితాలో చేరిపోయారు. ఓ సేవా సంస్థకు రూ.2,700 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఫేస్‌బుక్ సంస్థలో దాదాపు 18 లక్షల వాటాలను సిలికాన్ వ్యాలీ ఛారిటీకి బదిలీ చేశారు. షేర్ మార్కెట్ దిగ్గజం వారెన్ బఫెట్ తన ఆస్తి పాస్తుల్ని గేట్స్ ఫౌండేషన్‌కు ఇవ్వడం ద్వారా...కార్పొరేట్‌దాత అనిపించుకున్నారు.

'ప్రపంచ కుబేరుల జాబితా మారిపోతూ ఉంటుంది. ఎందుకంటే, అది అంకెలకు సంబంధించింది. మహాదాతల జాబితాలో మార్పు ఉండదు. ఎందుకంటే, ఇది హృదయాలతో ముడిపడింది'

గాంధీ గ్రామాలు

యువత తలుచుకుంటే కానిదేముంది? తూర్పుగోదావరి జిల్లాలోని ఆముదాలబంద యువకులు భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా ...గ్రామస్వరూపాన్నే మార్చేశారు. మద్యం విక్రయాల్ని అడ్డుకున్నారు. రక్షిత మంచినీటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. సీసీ రోడ్లు వేయించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించారు. ఇప్పుడదో ఆదర్శగ్రామం. యువత చొరవతోనే మహబూబ్‌నగర్ జిల్లాలోని మంగళపల్లి నూరుశాతం పారిశుద్ధ్యాన్ని సాధించింది.

'మహాత్ముడు మళ్లీ పుడితే శబర్మతికి వెళ్లడు...ఇలాంటి పల్లెలకే వస్తాడు'

'మాయమైపోయెనమ్మ మనిషన్నవాడు!'...శీర్షికతో 'ఈనాడు'లో ఓ కథనం ప్రచురితమైంది. హృదయాల్ని కదిలించే ఓ ఫొటో కూడా ఇచ్చారు. కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలోని డంపింగ్‌యార్డు పక్కన ఓ మృతదేహం, పక్కనే బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు. భవన నిర్మాణ కార్మికుడు మల్లేశం అనారోగ్యంతో చనిపోవడంతో...ఇంటి యజమాని ఆ మృతదేహాన్ని నగర పంచాయతీ ట్రాక్టరులో డంపింగ్‌యార్డుకు తరలించాడు. దహన సంస్కారాలు కూడా చేయలేని దుర్భర దారిద్ర్యం. ఆ దుస్థితి పాఠకుల్ని కదిలించింది. సాయం చేయడానికి ఎంతోమంది ముందుకొచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంఘంవారు అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు అధికారులు ఇంటి యజమానిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ కుటుంబాన్ని వీధులపాలు చేయవద్దని సూచించారు. ఓ స్వచ్ఛంద సంస్థ పిల్లల్ని చదివించడానికి ముందుకొచ్చింది. ఓ వృద్ధాశ్రమం నిర్వాహకులు నిత్యావసర వస్తువుల్ని అందించారు. ఆర్థికంగా ఆసరా ఇచ్చిన వారూ ఉన్నారు. ఇవన్నీ...జీవితం మీద మమకారాన్ని పెంచే వార్తలు. భవిష్యత్ పట్ల ఆశను ఇనుమడింపజేసే శుభసంకేతాలు. మనిషి మారిపోలేదనడానికీ మానవత్వం కనుమరుగైపోలేదని చెప్పడానికీ గుండెల్లోని తడింకా ఇంకిపోలేదని రుజువు చేయడానికీ...ఇంతకు మించిన సాక్ష్యాలేమున్నాయి. ★

మీ ప్రశ్నకు బదులిస్తాం

ఇక్రిసాట్ పూర్తి పేరేమిటి? ఐశ్వర్యారాయ్ వయసెంత? ఐఫోన్-5 రేటెంత? ఇలాంటి ప్రశ్నలే చాలామందికి వస్తాయి. కానీ వాటికి జవాబులు వెంటనే దొరకవు. అది 'ఐనోజ్' రాక ముందటి మాట. ఇప్పుడు ఎక్కడైనా ఎప్పుడైనా ఒక్క ఎస్సెమ్మెస్‌తో ఇలాంటి ప్రశ్నలకు జవాబు మీ చేతిలో ఉంటుంది.

కేరళకు చెందిన దీపక్, హిసముద్దీన్, అభినవ్, అశ్విన్ నలుగురూ స్నేహితులు. కర్నాట్ పట్టణంలోని లాల్ బహదూర్ శాస్త్రి ఇంజినీరింగ్ కాలేజీలో చదువుకున్నారు. నాలుగేళ్ల కిందటయితే వారిని ఇలానే పరిచయం చేయాలి. ఇప్పుడూ స్నేహితులే. కానీ అంతకుమించి వ్యాపార భాగస్వాములు. ఒక్క ఎస్సెమ్మెస్‌తో కావాల్సిన సమాచారాన్ని అందించే 'ఐనోజ్ టెక్నాలజీస్'కి యజమానులు. పాతికేళ్లు కూడా నిండని వయసులో కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ నలుగురి విజయగాథ ఎలా మొదలైందంటే...

ఫోన్ ఉంది కానీ...

దీపక్ ఒకరోజు తన మిత్రులతో కలిసి కాలేజీ క్యాంపస్‌లో మాట్లాడుతూ కూర్చొన్నపుడు ఓ అమ్మాయి అటుగా వెళ్తోంది. 'అమ్మాయి మెచ్చాలంటే ఏం చేయాలి' అని పక్కనున్న స్నేహితుణ్ని అడిగితే 'ఇంటర్నెట్‌లో వెతికితే టిప్స్ తెలుస్తాయి' అని బదులిచ్చాడు. కానీ దీపక్ చేతిలో అప్పటికి మొబైల్ మాత్రమే ఉంది. అందులో ఇంటర్నెట్ లేదు. అంతే, వెంటనే 'యురేకా' అన్నాడు. తన ఆలోచనను మిత్రులతో చెప్పాడు. కోరుకునే సమాచారాన్ని ఎస్సెమ్మెస్ రూపంలో మొబైల్ ఫోన్లకే అందించడమే ఆ ఆలోచన. అందులోని సాధ్యాసాధ్యాల్ని పరిశీలించారు.

దీపక్

అశ్విన్

హిసముద్దీన్

అభినవ్

భవిత బంగారమని గమనించారు. చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టి తమ వ్యాపారానికి పునాదులు వేశారు. తమ ప్రాజెక్టుకి 'ఎస్సెమ్మెస్ జ్ఞాన్' అని పేరుపెట్టారు. దీనిమీద పేటెంట్ కూడా సంపాదించారు.

సాధారణంగా ఎలాంటి ప్రశ్నలకైనా ఇంటర్నెట్‌లో జవాబులు దొరుకుతాయి. ఐనోజ్ ఇంటర్నెట్‌లోని సమాచారాన్ని మొబైల్‌కు అందేలా సాంకేతికతను అభివృద్ధి చేసింది. దీనికోసం దీపక్ స్నేహితులు నలుగురూ ఇంజినీరింగ్ మధ్యలోనే ఆపేశారు. అందరిదీ మధ్యతరగతి నేపథ్యమే. వ్యాపార కుటుంబాలూ కావు. దాంతో తల్లిదండ్రుల్ని ఒప్పించడానికి చాలా కష్టపడ్డారు. ప్రాథమిక దశలో కాలేజీ కంప్యూటర్ ల్యాబ్‌నే ఉపయోగించుకున్నారు. కాలేజీ కూడా వీరి ప్రాజెక్టును ప్రోత్సహించింది. నలుగురూ రూ.లక్ష సేకరించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారు. త్రివేంద్రంలోని టెక్నోపార్క్ ఐటీ హబ్ వీరికి ఆఫీసును ఉచితంగానే అందించింది. వ్యాపారపరమైన మార్గనిర్దేశం కోసం ఐఐఎమ్- అహ్మదాబాద్ నిర్వహించే 'ఐ-యాక్సిలిరేటర్' శిక్షణకు వెళ్లారు.

కోటి జవాబులు

"అవసరమైన ప్రతిదశలోనూ మాకు మార్గదర్శులు దొరికారు. పెట్టుబడిదారులూ ముందుకు వచ్చారు. రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తయింది. అప్పుడు టెలిఫోన్ ఆపరేటర్లతో ఆలోచన పంచుకోవడానికి గుర్గావ్ వెళ్లాను. అక్కడ చాలా కంపెనీల ప్రతినిధుల్ని కలిశాను. వాళ్లు 'నువ్వు సీయీవోనా!' అన్నట్లు చూసేవారు. ఎవరూ మాతో పనిచేసేందుకు ముందుకు రాలేదు. ఓరోజు కాఫీ డేలో కూర్చొని ఉన్నపుడు మెడలో ఎయిర్‌టెల్ ట్యాగ్‌తో వచ్చిన వ్యక్తికి నా ఆలోచన చెప్పాను. అతని విజిటింగ్ కార్డు ఇచ్చి మర్నాడు ఆఫీసులో కలవమన్నారు. అక్కడికి వెళ్లాక తెలిసింది ఆయన ప్రొడక్ట్ మేనేజరని. తర్వాత మా ప్రాజెక్టుకు ఎయిర్‌టెల్ అంగీకారం తెలిపింది" అని చెబుతాడు కంపెనీ సీయీవో దీపక్. ఇప్పుడు దాదాపు అన్ని టెలిఫోన్ సంస్థలూ వీరితో కలిసి పనిచేస్తున్నాయి. వీరి వ్యాపార విస్తరణకు సీడ్‌ఫండ్ అనే సంస్థ పెట్టుబడి పెట్టింది. 2010 మేలో సర్వీసులు ప్రారంభించిన ఐనోజ్ డిసెంబరు 2012 నాటికి కోటి ప్రశ్నలకు జవాబు ఇచ్చింది.

అయిదు సెకన్లలో

ఎవరైనా, ఏ ఫోన్ నుంచైనా 55444కు తమ ప్రశ్నను ఎస్సెమ్మెస్ చేస్తే 480 అక్షరాలకు మించని సమాధానం అయిదు సెకన్లలో వస్తుంది. అందుకు రూపాయి ఖర్చవుతుంది. రూపాయిలో 70పైసలు టెలిఫోన్ ఆపరేటర్లకు దక్కుతుంది. ఏటీఎమ్‌లూ, పెట్రోల్ బంకులూ, సినిమాలూ, పాటల గురించి సమాచారం తెలుసుకోవాలనుకునేవారు ఎక్కువగా ఉంటున్నారు. ఇంగ్లిష్ పదాలకు అర్థాలూ ఆరోగ్యం, శృంగారానికి సంబంధించిన ప్రశ్నలూ ఎక్కువే వస్తున్నాయి. ఈ ప్రశ్నకు బదులు అడిగితే ఏమనుకుంటారో అన్న సందేహం అవసరం లేదు. నెలకు రూ.30 కడితే అపరిమితంగా ప్రశ్నలు అడగొచ్చు. దక్షిణాది రాష్ట్రాలు... ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి సమాచారం అడిగేవారు ఎక్కువగా ఉన్నారని ఐనోజ్ సీవోవో అభినవ్‌శ్రీ చెబుతాడు. ప్రస్తుతం భారత్‌తో పాటు ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో, ఫిలిప్పైన్స్, దుబాయ్‌లోనూ సేవలు అందిస్తున్నారు. అమెరికా, శ్రీలంక, ఇండోనేషియాలతో పాటు ఆఫ్రికాలో మరిన్ని దేశాలకు తమ సేవల్ని విస్తరించాలనే ఆలోచనలో ఉన్నారు. 'మనదేశంలోనే 90 కోట్ల మొబైల్ ఫోన్ల వినియోగదారులు ఉన్నారు. వారిలో 10 శాతం మందికి మాత్రమే ఫోన్లో ఇంటర్నెట్ సదుపాయం ఉంది. అంటే మేం ఎదిగేందుకు ఎంతో అవకాశం ఉంది' అంటాడు దీపక్.

బెంగళూరులో ఐనోజ్ ప్రధాన కార్యాలయం ఉంది. ఢిల్లీ, అమెరికాలలో ఆఫీసులూ ఉన్నాయి. ఐనోజ్ గత ఆర్థిక సంవత్సరంలో ఆరు కోట్ల రూపాయల లాభం పొందింది. వచ్చే సంవత్సరంలో రూ.15 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఐనోజ్ సాధారణ ఫోన్లలోనూ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లూ, మెయిల్స్ చూసుకునే అప్లికేషన్ తయారుచేసింది. ఇది త్వరలో అందుబాటులోకి రానుంది.

'మీకు వచ్చిన ఆలోచనను వాస్తవరూపంలోకి తెచ్చేంతవరకూ నిద్రపోవద్దు' అని సలహా ఇస్తోంది దీపక్ మిత్ర బృందం.

కథ

ఒక్క మాట చాలు

– తమ్మెర రాధిక

"ఇదిగో, ఈ దిష్టిముం...నెందుకు పంపావు బజారుకు... ఇంట్లో వాసుగాడుండగా. ఎన్నిసార్లు చెప్పినా నీకు బుద్ధిరాదు... పనికిమాలినదానివి దొరికావు నాకు" గేటు విసురుగా నెట్టుకుంటూ, అక్కణ్ణుంచే అరుచుకుంటూ వస్తున్నాడు రామారావు. అతని చేతిలో సరుకులతో బరువుగా ఉందో సంచి. ఇంకో చేత్తో పంచె కొంగులు పట్టుకుని వగరుస్తున్నాడు.

అందరూ హాల్లో కింద కూర్చుని టీవీ చూస్తున్నవాళ్ళల్లా ఠక్కున దాన్ని ఆపేసి వాకిటి వైపు తలలు తిప్పారు. వసుంధర గబగబా లేచి ఇవతలికి వచ్చింది. అప్పటికే అతను వరండా మెట్లెక్కి కుర్చీలో కూలబడ్డాడు. మంచినీళ్ళు తెద్దామని ఆమె వెనుతిరగంగానే మరో రంకె వేశాడు.

"సంచి అందుకోవేమే దేబ్యం మొహమా! అసలు మనుషులంటేనే లక్ష్యం లేకుండా ఉందీ ఇంట్లో."

"మంచినీళ్ళు తెద్దామనీ..." భర్త చేతిలోని సరుకుల సంచీ అందుకుంటూ గొణిగింది వసుంధర.

"హు..." గుర్రుగా చూశాడు రామారావు.

"ఏవిట్రా?" గోవిందమ్మ వత్తులు నలుస్తూ ఉన్నదల్లా, వాటిని డబ్బాలోకి సర్దుతూ అడిగింది.

"ఏవిటేవిటీ, నా పిండాకూడు... నేను నాగారం బస్సు దిగి వస్తుంటే అప్పలశెట్టి కేకేశాడు. 'పంతులుగారూ, పొద్దుననగా మీ అమ్మాయి సంచి ఇక్కడ పడేసి పోయింది. సరుకు కట్టి ఏ కాలమయిందీ, కాస్తన్నా బాధ్యత లేకపోతే ఎలాగండీ' అన్నాడు. ఏ అమ్మాయి వచ్చిందని అడిగితే నవ్వాడు వెధవ... 'ఇంకెవరూ, మీ చిన్న అమ్మాయి గిరిజ' అంటూ. వాడితో కూడా ఒకసారి వాదనేసుక్కూర్చుందిగా... ఏదీ ఆ పింజారీ..." కుర్చీలోంచి లేవబోయాడు.

వాసూ, పావనీ, శ్రీనూ నెమ్మదిగా బైటకొచ్చి నిలబడ్డారు. గోలేమిటో అర్థం అయ్యి మంచినీళ్ళు తెచ్చిన తల్లి వైపు చూశాడు వాసు.

"నాకు చెప్పొచ్చుకదమ్మా."

"ఎందుకు చెబుతుందీ, ఉన్నారుగా ఆడమేళమంతా. బజార్లెంబడి తిప్పొద్దూ."

"అమ్మెప్పుడూ ఇంతే" వాసు గొంతులో విసుగూ ఈసడింపూ.

"పొద్దున తొమ్మిది గంటలకు నువ్వెక్కడ ఉన్నావురా ఇంట్లో? ఫ్రెండ్ హాస్పిటల్లో ఉన్నాడు, చూసిరావాలని వెళ్ళావు. మళ్ళీ ఇందాకేగా వస్తా!"

"ఇహ చాల్లే ఆపు... కన్నావు గంపెడు మందిని. ఎవర్నీ అజమాయిషీ చెయ్యలేవు. మా అమ్మ ఉంది గనుక సరిపోయింది. లేకపోతే ఈ కొంపెప్పుడో కొల్లేరయిపోయేది."

కొడుకు మాటలకు గోవిందమ్మ భుజాలు పొంగాయి. నలుగురు సంతానమని అతనికి భయమనీ, అందులో ఆడపిల్లలు ఎదిగొస్తున్నారని చిరాకనీ ఆవిడకు తెలుసు. అతని కోపం చూసి అంతలోనే దిగులుపడింది. నలుగురు పిల్లల్ని పెంచి పోషించడమంటే మాటలుకాదీ రోజుల్లో.

నాగారంలో ఉన్న రెండెకరాల పొలంలో వచ్చే రాబడి అంతంత మాత్రమే. వ్యవసాయం చేయలేక కౌలుకిచ్చేశాడు కొడుకు. తండ్రి ఉండగానే ఈ గంగాధర మండలంలో ఇల్లు కట్టించాడు పిల్లల చదువుకని. ప్రస్తుతం అదే ఆస్తి అతనికి. చేసే పంతులు నౌకరీతో అప్పులు లేకుండా రోజులు వెళ్ళడంలేదు. పెద్దపిల్ల పావని కలెక్టరాఫీసులో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తోంది. రెండోవాడు వాసు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. స్నేహితుల దండా ఎక్కువ. మూడోవాడు శ్రీను ఇంటర్ చదువుతున్నాడు. పుస్తకాల పురుగు. ఆఖరిది గిరిజ. నోరు ఒక్క నిమిషం మూతపడకుండా అందరికీ మాటకు మాటా జవాబిస్తూ హడలగొడుతుంది. ఆత్మాభిమానం ఎక్కువ. పదోతరగతి చదువుతోంది.

'కొసరేసిన వంకాయవి నువ్వు తెల్సా!' బామ్మ మాటకు గయ్యిమని లేచేది.

'కనేప్పుడు తెలియదా, కొసరేసిన వంకాయో, కొనదేరిన బాణమో' ఠక్కున నోరు నొక్కుకునేలా చేసేది గిరిజ.

'ఆడపిల్లవి, ఎందుకే అంత నోరూ...'

'నువ్వే అన్నావుగా కొసరునని. నోరు లేకపోతే ఈపాటికి కుప్పతొట్టి పాలైవుందును.'

గిరిజను చూస్తే, తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అభిమన్యుడిలా పోరు సలుపుతుందనిపిస్తుంది వసుంధరకు.

గిరిజను రామారావు పెద్దగా పట్టించుకోడన్న విషయం ఆవిడకు తెలుసు. తండ్రీ కూతుళ్ళిద్దరూ యుద్ధం అంచున ఉన్నట్టు ఉంటారు. గిరిజ ఎప్పుడైనా పెడసరంగా జవాబు చెప్పినప్పుడు-

"ఎవడికైనా దత్తు చేస్తే పీడా పోయేది. ఇండినిండా ఆడ సజ్జు" అని గొణిగేవాడు.

"ఇలాంటోళ్ళకు గంజి పోయడానికి నేనే దిక్కు" అని తల్లి దగ్గర ఎగిరిపడేది గిరిజ.

రామారావు మధ్యాహ్నం నుంచీ ఎగిరినవాడు ఎగిరినట్టే ఉన్నాడు. సాయంకాలం గేట్లోంచి వస్తున్న గిరిజను చూస్తూనే- "ఎక్కడ చచ్చావే పొద్దుటినుంచీ" కోపంతో ఊగిపోయాడు.

"ఛస్తే ఇంటికి రానుగా నాన్నా... ఫ్రెండ్ ఇంట్లో చదువుకుని వస్తున్నా. రెండ్రోజుల్లో పరీక్షలు వస్తున్నాయి" ఆ పిల్ల గొంతులో అభిమానం గింజుకుంది.

"ఆ చదువేదో ఇంట్లో ఏడవచ్చుగా..."

"మీ అమ్మ బతకనిస్తుందా! 'కాళ్ళు పిసుకూ... మడిబట్ట ఆరేయి... నీళ్ళు తోడు... పొయ్యి కింద మంటెయ్యి... అని సవాలక్ష చెబుతుంది."

వాసు కిటికీలోంచి చూస్తున్నాడు. పావని చీరపూలు కుట్టుకుంటూ తల్లివైపు చూసింది.

"మాటకు మాట కలేస్తావ్, ఇంకోసారి కొట్టుకెళ్ళావంటే కాళ్ళిరగ్గొడతాను. ఇంట్లో మగాళ్ళు చచ్చారనుకున్నావా?" గర్జించాడు.

వసుంధర ఎదురొచ్చి చెయ్యందుకుని లోపలికి తీసుకుపోయింది కూతుర్ని కసిరి.

"జవాబు చెప్పనియ్యవేమమ్మా" గిరిజ చెయ్యి గింజుకుంటోంది.

"నీ మొహం... వేలెడు లేవు ఏం గీరే... పద లోపలికి" తల్లి లాక్కుపోయింది.

పావని చెల్లెలి వైపు చూసింది ఊరుకోమన్నట్టుగా. సాయంకాలం నీళ్ళు పోసుకోవడానికి పెరట్లో పొయ్యి రాజేసుకుంటున్న గోవిందమ్మ 'ఇంతమందివి కని కాపురానికి అగచాట్లు తెచ్చుకున్నాడు. పెద్దదానికి సంబంధాలు చూడలేక బీపీ పెరుగుతోంది వాడికి' అని గొణుక్కుంటోంది. షుగర్ కూడా కాస్త పొడ సూపిందని రాత్రిపూట భోజనం చెయ్యడంలేదు రామారావు.

గోధుమరవ్వ ఉప్మా చేస్తోంది వసుంధర వంటగదిలో. పిల్లలందరూ మౌనంగా గదిలోనే ఉండిపోయారు. గోవిందమ్మ స్నానం చేసి పొడిబట్ట కోసం వంటగదిలోకి వస్తూ, కోడలు పరధ్యానంగా పొయ్యిమీద ఏదో కలుపుతుండటం చూసి- "తినేవాళ్ళ నోట శని ఉండబట్టి, రోగంతో ఇలాగైందిగానీ, గుండ్రాళ్ళు తిని హరాయించుకునేవాడు కదా పిచ్చిసన్నాసి" అంది. కొడుక్కి షుగర్ అని ఆవిడ బాధ.

"ఆయనే చెయ్యమన్నారత్తయ్యా, నోరు అరుచిగా ఉందట. పొద్దున్న భోజనమే మానేశారుగా."

"సరి, సరి. పిల్లదాని నోరు సంబాళించలేవూ... వాడేదో ఆవేశంలో మాట్లాడితే, అదీ తయ్యని లేస్తుంటే - చాటుగా నాలుగు దులపక ఏం గారాబం! వాడసలే బీపీ, షుగర్‌లతో సతమతమవుతున్నాడు. కాస్త తెలివిగా మసలుకో" కొంత కఠినంగా, మరికొంత వ్యాకులంగా కోడల్ని హెచ్చరించింది.

"చిన్నపిల్ల గదా...దాంతో ఎందుకాయనకూ."

"వాడికి మాత్రం సరదాటే... ఏవో పనుల ఒత్తిడి మూలాన."

"బావుంది, దానికి అర్థం అవ్వొద్దూ."

"అర్థం కాకపోతే నువ్వు బోధపరుచు" విసురుగా అంది గోవిందమ్మ.

"అందర్నీ ఒకెత్తునా... తననే వెలేసిన ట్టుగా... దానికీ అర్థంకావడంలేదూ."

"ఇప్పుడేవంటావూ, వాడి ప్రాణం గాల్లో కలిసినా మంచిదేనా? వాడి పిండాకూడు, తలా ఇంత ఉడకేసుకుందావా?" పళ్ళు గిట్టకర్చిందావిడ.

"నా ఖర్మ" ఉప్మా పళ్ళెంలోకి దిమ్మరించి నిమ్మ ముక్క వేసి, హాల్లో టీవీ చూస్తున్న భర్త దగ్గరికి తీసుకుపోయింది వసుంధర.

భార్య పొద్దున్నే వంటగదిలో భోజనం క్యారియర్ సిద్ధం చేస్తుంటే, వరండాలో కండువా మడతలు సరిచేసి భుజంపైన వేసుకుంటూ- "రఘునాథపాలెంవాళ్ళు తొందర్లో పావనిని చూసుకొందుకు వస్తారటమ్మా. బాగా ఉన్నవాళ్ళట. పెద్ద కుటుంబం. కట్నం, లాంఛనాలూ... వేడుకగా చేస్తే బావుంటుంది అంటున్నాడు వాళ్ళ తరపు పెద్దమనిషి. నాకేవిటో గాభరాగా ఉంది" అన్నాడు రామారావు.

"గాభరా ఎందుకురా... మేమంతా లేమూ. అమ్మాయిని నచ్చనీ, ఆనక చూద్దాం. కట్నాలూ కానుకలూ అన్నీ వాళ్ళన్నట్టుగానే ఏం ఉండవు. మన తరపువారూ మాట్లాడతారుగా. అందర్లో నువ్వలా ఊర్కే కూర్చో. అంతా అదే సజావుగా అయిపోతుంది" అంది గోవిందమ్మ నవ్వుతూ.

"అంత భారీగా కట్నం అంటే... తప్పదనుకుంటే నాగారం పొలం అమ్మేయాల్సి వస్తుందేమో" ఆ సందిగ్ధం చూస్తే చిరాకేసిందావిడకు.

"అవసరమైతే అమ్మితే పాయె. వాళ్ళు మన కట్నానికి తూగితే సరే, లేకపోతే పిల్లరాత మన చెప్పుచేతల్లో లేదని నమస్కారం పెడితే సరి, ఏం చేస్తాం!"

"నిజమేలే" వసుంధర ఇచ్చిన బ్యాగు భుజాన వేసుకుని వెళ్ళిపోయాడు రామారావు. వసుంధర మనసులో ఉక్రోషపడ్డా బైటికి ఏమన్లేక మిన్నకుండిపోయింది. పిల్ల సంబంధం గురించి తల్లితో అన్నాడుగానీ తనతో సంప్రదించడమేలేదని అభిమానపడింది. కోడలు అంతః సంఘర్షణ గోవిందమ్మకు అర్థం అయినా నిర్లక్ష్యంగా చూసింది.

"ఏం చెప్తున్నారూ?" అత్తగారిని అడిగింది వసుంధర.

"నీ మొహం నన్నడుగుతావేం, వాడేం చెప్పలేదా నీకూ?"

"ఏం చెప్తారూ, ఎంతసేపూ మా తల్లీ కూతుళ్ళను తిట్టడమేగా ఆయన పని."

"కన్నావుగా మరీ, అనడూ..."

అసలు విషయం పక్కదారి పట్టించే అత్తగారు తనకు ఉపకారా, అపకారా!

'కన్నావుగా మరీ' అంటే- దానర్థం... తను ఒక్కతే కందా? 'ఏం చెప్పలేదా' అంటే, అసలు ఎన్నడూ భర్త తనతో సరిగా మాట్టాడిందీ? మాటకుముందు 'నీ మొహం, నీకేం తెలుసు ఊరుకో' అంటమేగా. అత్తగారు మాత్రం ఏం తక్కువ తిందీ... 'ఇలాంటి తెలివితక్కువ దాంతో వేగలేకపోతున్నామమ్మా, ఓ చురుకూ లేదూ పాడూ లేదూ. కని మా ఎదాన పారేశారు. ఏ వ్యవహారం చాతగాదు, ఒంటి చేత్తో ఈదుకొస్తున్నాడు సన్నాసి' అంటూ కొడుకు మీద సానుభూతి పెరిగేలా మాట్లాడ్డం. అక్కడికీ ఓసారి 'అత్తయ్యా, నా గురించి ఎందుకు అలా తక్కువచేసి మాట్లాడ్డం' అంటే, ఇరూగూ పొరుగూ ముందు ఎంత యాగీ చేసిందీవిడ! కొంగు బొడ్లో దోపుకుని 'రానీ, వాడ్నివ్వాళ. ఈ ఇంట్లో నువ్వో నేనో తేలిపోవాలి. నువ్వేం అవకతవకలు చేసినా వాడు చెండాడకుండా నీ వెన్నుకాసినందుకు నాకు కావల్సిందే. మా బాగా జరిగింది శాస్తి' అని నోరూ నెత్తీ వేసుకోలేదూ. ఎన్నిసార్లు ఇలాంటివి జరగలేదూ. బంధువర్గంలో తననో అసమర్థురాలిగా ఈవిడగాదూ ముద్ర వేసిందీ?

"ఇదిగో, ఇట్రా... ప్రతీదానికీ ఆ టీవీ సీరియల్స్‌లో వాళ్ళలా గంటలు గంటలు అలా ఆలోచిస్తూ నిలబడతావేం..." అంది గోవిందమ్మ.

వంటింటి తలుపువేసి, అత్తగారికి ఎదురుగా వచ్చి గోడనానుకుని కూర్చుంది మౌనంగా.

"రఘునాథపాలెం అబ్బాయి మన పావనిని చూసుకోవడానికి వస్తున్నాట్ట! జాగ్రత్త, ఇల్లంతా బాగా సర్దించు. వాళ్ళకు పెట్టడానికి మంచి స్వీటూ, కారం చేయి. పావనిని బాగా తయారుకమ్మను. చిన్నదాన్ని కాస్త తండ్రితో వాదానికి దిగకుండా చూసుకో."

వసుంధర హృదయం మొద్దుబారింది. ఇదా తనకు చెప్పేది, కూతురికి రాబోయే పెళ్ళివారి గురించి తను వినాలనుకుంటే, వచ్చేవారికి చేయాల్సిన మర్యాదల గురించి అత్తగారు చెప్తోంది. ఇన్నేళ్ళ సంసారజీవితంలో మర్యాదలు ఎలా చేయాలో నేర్చుకోవాల్సి వస్తోంది.

"పిల్లవాడు ఏం చేస్తున్నాడో" అత్తగారి జాగ్రత్తలు పక్కనపెడుతూ అడిగింది.

"అంతా వాళ్ళొచ్చాక తెలుస్తుంది కదా!" అంతటితో తుంచేసిందావిడ.

వసుంధర మొహం నల్లబడిందామాటకు. స్కూలుకు తయారై బైటికి వచ్చిన గిరిజ తల్లి మొహం చూసి- "ఏవైందమ్మా, అలా ఉన్నావ్?" అడిగింది.

"ఏలా ఉందే, లేనిపోని పరామర్శలూ... నీ పని నువ్వు చూసుకో పో" ఇప్పటినుంచే ఖండించాలనుకుంది గోవిందమ్మ.

"అమ్మెందుకలా ఉందో కనుక్కోవడం కూడా నా పనే" ఫెడీమంది జవాబు.

"మాటకు మాట కలుపుతావు. పెద్దంతరం చిన్నంతరం ఉండక్కర్లా!"

"ఇందులో తప్పేవుందీ, మర్యాదగానేగా మాట్లాడిందీ. నిన్న వాసన్నయ్య ఎంతలేసి మాటలు మాట్లాడాడు నిన్ను. డబ్బు లిచ్చిందాకా వదిలాడూ... తప్పంతా నా దగ్గరే తీస్తావు" ధనధనా వరండా మెట్లు దిగిపోయింది చిరాకుగా.

ఇహ, ఇప్పుడేం అడిగినా 'మనవరాలి మీద కోపమంతా తన నెత్తిన రుద్దుతుందీవిడ' అనుకుంటూ అన్యమనస్కంగా బట్టలు జాడించడానికి వెళ్ళింది వసుంధర.

పొద్దున్న క్యారియర్ కడ్తూ అరకొరా భర్త మాటలు చెవినపడ్డాయామెకు. పొలం అమ్మేస్తే ఒక్క జీతంమీద బతకడం కష్టం. అయినా పెద్దదాని పెళ్ళికే పొలం అమ్మేస్తే, గిరిజ పెళ్ళినాటికి మగపిల్లలు చేతికంది రాక దాని పెళ్ళి చెయ్యలేకపోతే... ఎంత అప్రదిష్ఠ! ఇవన్నీ సవ్యంగా జరిగినా మధ్యలో ముసలమ్మ 'హరీ'మంటే! అప్పుడు పొలం అమ్మాల్సివస్తే తమకిక ఏంటీ గతి? భర్తను చూస్తే ఏ సంగతీ తనతో చర్చించడు. ఆడపిల్లలిద్దరికీ అసలు విలువా ఇవ్వడు. ఈ ఇంట్లో ఎందుకూ పనికిరానిది పూర్తిగా తాము ముగ్గురమే- అనుకుంది వసుంధర.

పావనిని చూడ్డానికి పెళ్ళివారొచ్చారు.

ఇంటిముందు దబదబామని రెండు కార్లు ఆగేసరికి, ఇంట్లోవాళ్ళకి కాళ్ళకి చక్రాలూ, ఒంటిమీదకి చలీ వచ్చాయి.

బ్రూ కాఫీలూ, బొబ్బట్లూ, మినపసున్నీ గబగబా బల్లమీదికొచ్చాయి. అందరూ విచిత్రంగా చూసినా ఆరగించి 'ఆహా... ఓహో' అన్నారు. పెళ్ళికొడుకు ప్రసన్నంగా తండ్రి మొహంలోకి చూడ్డం గమనించి రామారావు గుబగుబలాడిపోయాడు. కంగారులో తన పంచెనే రెండుసార్లు కాళ్ళకిందికి తొక్కాడు తూలిపోబోతూ.

గోవిందమ్మ వంటగదికి ముందూ, హాలుకి చివరా కలిసేచోట కుర్చీ వేయించుకు కూర్చోనుంది. కొడుకు అవస్థ గమనిస్తూ- "ఊc... రావుడూ" అంది గట్టిగా చూస్తూ. ఇక దాంతో అక్కడే కుర్చీలో కూలబడ్డాడు రామారావు.

"అమ్మాయి నచ్చిందట మావాడికి. ఊరికే రావడం, పోవడంకంటే అందరూ ఉన్నప్పుడే మిగతా వ్యవహారాలు కూడా మాట్లాడుకుంటే బావుంటుంది" ఆఖరి మినపసున్ని నోట్లో వేసుకు చప్పరించాడు భీమారావు, పిల్లవాడి తండ్రి. దాంతో మగవాళ్ళంతా లేచి ఇంటిముందరి మామిడిచెట్టు కిందికి చేరారు. ఆడవాళ్ళంతా ఆ గదిలోనే బిడియపు నవ్వులూ, అనవసరపు భేషజాలూ ఒలకబోస్తూ గిజాటుపడుతున్నారు. గోవిందమ్మ వ్యవహారంలోకి దిగింది. తమ కుటుంబం పాత వైభోగం నుంచి ప్రారంభించి ఖర్చులూ రయాలవల్ల రాన్రానూ ఎలా ప్రాభవం తగ్గిపోయిందో చెప్తూ- "కోడలయినా కుటుంబానికి అండగా ఉంటుందంటే అదీ లాభం లేకుండాపోయిందమ్మా. చురుకుదనం లేదు. ఏదో వాడి రెక్కల కష్టంమీదే పిల్లల్నీ కుటుంబాన్నీ ఈదుకొస్తున్నాడు" అంది.

వంటగదిలో ఉన్న వసుంధర మొహం తెల్లబడిందామాటకు. అత్తగారు వాళ్ళందరిముందూ తనను ఎలా తీసిపారేస్తోంది... ఈవిడ తర్ఫీదులోనేగాదూ... భర్త అలా తయారైంది!

"చూశావామ్మా, మీ అత్తగారి తీరు! నువ్వెందుకూ పనికిరానిదానివన్నట్టు అప్పుడే వాళ్ళముందు టముకూ కొట్టేస్తోంది" కాఫీ కప్పులు తీసుకుపోవడానికి వంటగదిలోకి వచ్చిన గిరిజ అంది. ఆ మాటకు వసుంధర కళ్ళల్లో పలుచటి నీటిపొర అలుక్కుపోయింది.

"పోనీలేవే, వాళ్ళనే రాజ్యాలేలనీ... ఏదో విధంగా పిల్ల పెళ్ళయిపోతే చాలు" అంది.

"నువ్వు మారవమ్మా" గిరిజ విసురుగా ట్రే తీసుకెళ్ళిపోయింది.

వసుంధర నెమ్మదిగా అత్తగారి పక్కకువచ్చి చాపమీద కూర్చుంది. పెళ్ళివాళ్ళల్లో కొందరు ఆమెని జాలిగా చూశారు. మరికొందరు విచిత్రంగా చూశారు. నలుగురు బిడ్డల తల్లి ఇంకా అత్త చాటేనని.

"కడుపు చల్లబడితే చాలదు, కన్నూ చల్లబడాలి" పిల్లవాడి తల్లి లోపలికొచ్చిన మగవాళ్ళతో అంది.

గోవిందమ్మ గ్రహించింది.

"మీకంటే ముందు నాలుగు సంబంధాలు వచ్చాయి పిల్లకు. రెండు బానే ఉన్నాయి. మూడోవాళ్ళే, ఎక్కళ్ళేనీ ఆశ... లాంఛనాలే లక్షన్నారు. ఇవాళా రేపూ రోజులెలా ఉన్నాయీ... ఆడపిల్ల దొరుకుతున్నదీ..? సాఫ్ట్‌వేరువాళ్ళ సంత సాగుతున్నది పట్నాల్లో అన్నాను నాకు ఒళ్ళుమండి" అంది గోవిందమ్మ.

ఆ మాటకు పిల్లవాడి మొహంలో కళ తప్పింది. రామారావు కలవరపడ్డాడు.

"ఏం మాట్లాడావు నాయినా, బైట వాళ్ళతో?" కొడుకునడిగింది చిన్నగా గోవిందమ్మ.

తల్లి పక్కకొచ్చి స్టూలుమీద కూర్చున్నాడు. పక్కనే ఉన్న వసుంధరకే వినపట్టంలా ఆ గొణుగుడు. దగ్గరగా జరిగి చెవొగ్గింది వసుంధర.

"పిల్లవాడికి మోటారుసైకిలూ, తులం గొలుసూ, వెండి కంచం, వెండి చెంబూ... కట్నంగాకట."

"మరదెంతా?" గొంతు ఆర్చుకుపోతోంది ఆవిడకు.

"రెండుట!"

"రెండే!" కుర్చీలో ఆసరా కోసం అటూ ఇటూ తడువుకుంది. నోటిదాకా ఎవరోతెచ్చిన నీళ్ళ గ్లాసు ఎత్తి గటగటా గొంతులోకి వంపుకుంది.

"ఏవంటావూ?" అడిగాడు కొడుకు.

ఆవిడ కళ్ళు నిలువుకు తిరిగిపోయాయి. గిరిజ తల్లిభుజం పట్టుకుని లేపి వంటగదిలోకి తీసుకుపోయింది.

"అమ్మా, నీ అభిప్రాయం ఏమిటి? నీకేం అన్పిస్తోందో సూటిగా చెప్పెయ్యి."

"నాన్న ఏవంటారో..."

"అదంతా వదిలేయి. అది నీ కూతురు కూడా" కోపంగా అంది గిరిజ.

పావని వంటగదిలోకి వచ్చింది. కూతురు మొహంలో వసుంధరకు ఏ భావం కనపడటంలేదు.

"నువ్వేమంటావమ్మా" ఆ మాటకు పావని బేలముఖం వేసింది.

"నాకేం తెలుసమ్మా, మీ ఇష్టం" అంది.

"పావనీ, ఉన్న రెండెకరాల్లో మీ ఇద్దరి పెళ్ళిళ్ళూ అయిపోవడం నాకు సబబు అనిపిస్తోందే... ఏమంటావు?"

"అమ్మా... నాన్న వాళ్ళకు ఏ మాటా చెప్పకముందే నువ్వెళ్ళి నాన్నతో నీ మనసులో మాట చెప్పెయ్ ఫో..." ఆదుర్దా విసుగూ కలిసిన కంఠంతో గిరిజ మళ్ళీ హాల్లోకి తీసుకువచ్చింది తల్లిని.

అక్కడి బేరసారాలు చూసి- "అమ్మేదో మాట్లాడుతుందిట నాన్నా" అంది గిరిజ పెద్దగా.

అందరి కళ్ళూ తనకేసి తిరగడం చూసి గొంతులోకి వచ్చిన గుండెను నిమురుతూ- "ఇందాక మా అత్తగారు చెప్పింది కదా... మాకున్న భూమల్లా రెండెకరాలేననీ. ఇద్దరాడ పిల్లలకూ చెరో ఎకరం కట్నంగా ఇద్దామనుకుంటున్నాం. లాంఛనాలవీ మాకూ పెట్టాలనే ఉంటుంది కదా... కానయితే, అన్నీ ఒక్కసారి ఇచ్చుకోలేం. మోటార్‌సైకిల్‌కి ఇన్‌స్టాల్‌మెంట్స్ కడతాం. ఏడాదిన్నరలో వస్తుంది. మా అమ్మాయికి మీరు పెట్టే బంగారంలో ఒక తులం తగ్గించుకుని అబ్బాయికి గొలుసు చేయించండి. మా పిల్లకు బంగారంపై అంతగా ఆసక్తిలేదు, అందుకని అంటున్నా. ఇహ వెండి కంచం, వెండి చెంబూ అంటారా... మా పొలంలో పంట అమ్మగానే ఎంత వస్తే అంతా పెట్టి, రెండూ చేయిస్తాం సరా. ఎక్కువగా మాట్టాడాననుకోకండీ... మా ఇంట్లో అందరి అభిప్రాయమూ అదే. మా పిల్ల బంగారం... నెలకు పదిహేనువేలు సంపాయిస్తోంది. ఉద్యోగం చేయించుకోవాలన్నా వద్దన్నా మీ ఇష్టం" అంటూ ఊపిరి పీల్చుకుంది వసుంధర.

గోవిందమ్మ కంటిచూపు నిగిడ్చి కోడల్ని చూసింది తల ఊగిస్తూ. రామారావు భుజంమీది కండువా మార్చిమార్చి వేసుకుంటూ కంగారుపడిపోతున్నాడు - వాళ్ళు ఎలా ప్రతిస్పందిస్తారోనని.

నిశ్శబ్దం అందరి అభిప్రాయాలూ అడుగుతోందల్లే ఉంది... రెండు నిమిషాలు సుదీర్ఘంగా గడిచాయి. ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

"బ్రాహ్మణ్ణి పిలిపించండి. అందరమూ వచ్చాం గనుక ముహూర్తం కూడా ఒక మాటనుకుంటే బావుంటుంది. మళ్ళీ మళ్ళీ అందరం ఏం వస్తాం! ఏం బావగారూ, ఏవంటారూ?"

పెళ్ళివాళ్ళ మొహాల్లో చిరునవ్వు ప్రవహిస్తోంది, పరాచికాలు దోబూచులాడుతున్నాయి.

"వసుంధరా... భోజనానికి ఏర్పాట్లు చూడు. వాసూ, ఈలోపు నువ్వెళ్ళి కూరగాయలు పట్రా. ఇదిగో, అలాగే ఇంకా సామానేమైనా కావాలేమో అమ్మనడిగి అప్పలశెట్టి కొట్లో పట్టుకురా. గిరిజా, అమ్మకు కాస్త సాయం చెయ్యి. అమ్మా, లోపల పనేమైనా ఉందేమో కాస్త కోడల్ని అడక్కపోయావూ..." రామారావు వాక్ప్రవాహం ఆగడంలేదు. మాట తీరులోనూ భార్యపట్ల ఎన్నడూలేని మర్యాదా మన్ననా.

చిన్నమాట... ధైర్యంగా నిలబడి చెప్పిన చిన్నమాట... ఒక చిన్న తెగింపు... జీవితంలో ఎంత మార్పు తీసుకువస్తుందో... ఆశ్చర్యపోతూ చూస్తోంది వసుంధర. గిరిజ చెయ్యి పట్టుకుని వంటగదిలోకి నడుస్తున్న ఆమె పెదాలమీద నవ్వు, కళ్ళల్లో సంతృప్తి!

విదేశీ కంపెనీలు తక్కువ రేటుకే ఎక్కువ ఫీచర్లున్న ఫోన్లు తయారుచేసేలా భారతీయ మార్కెట్‌లో మార్పులు తీసుకొచ్చిన కంపెనీ మైక్రోమ్యాక్స్. రెండు సిమ్‌లు, క్వెర్టీ, స్మార్ట్ ఫోన్లను సగటు భారతీయుడికి అందుబాటులోకి తెచ్చిన ఘనత ఈ భారతీయ కంపెనీకే దక్కుతుంది. మైక్రోమ్యాక్స్ ఆవిర్భావంలో కీలక వ్యక్తీ కంపెనీ ఎండీ రాజేష్ అగర్వాల్ తమ విజయగాథను వివరిస్తున్నారిలా...

కొత్త ఫీచర్లు ఉంటేనే ఫోన్లు కొంటారు

మైక్రోమ్యాక్స్‌ను 1991లో డెల్, హెచ్‌పీ, సోనీ కంప్యూటర్లు పంపిణీ చేసే కంపెనీగా ప్రారంభించాను. 1999లో సుమిత్ అరోరా, రాహుల్ శర్మ, వికాస్ జైన్ నాతో కలిశారు. రాహుల్ నాగ్‌పూర్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. అతడు మా ఇంటికి పొరుగునే ఉంటాడు. ఓరోజు మాటల మధ్య అతడు... తనూ, తన కాలేజీ స్నేహితులూ నా కంపెనీలో భాగస్వాములుగా చేరాలనుకుంటున్నట్లు చెప్పాడు. నాకు అనుభవం ఉంది. వారికి ఏదైనా చేయాలన్న తపన ఉంది. అలా జోడీ కుదిరింది. వారు వచ్చాక సాఫ్ట్‌వేర్ విభాగంలో అడుగుపెట్టాం.

★ అమెరికా కంపెనీలకు పనిచేయాలంటే అక్కడి వారితో పరిచయం ఉన్నవాళ్లు కావాలి. మేం ఇక్కడ ఢిల్లీలో ఉండి చేయడం కష్టంగా ఉండేది. అప్పుడు అక్కడ సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసే స్నేహితుల్ని కలిసి మా ప్రతినిధులుగా నియమించాం. తర్వాత 'యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా' వాళ్లతో కలిసి పరిశోధనలు చేశాం.

★ 2002లో నోకియా భారత్‌లో తమ విడిభాగాలను హ్యాండ్‌సెట్‌గా అసెంబుల్ చేసే సాంకేతికత ఉన్న కంపెనీ కోసం ప్రకటన విడుదల చేసింది. మేం అప్పటికి చేస్తున్న పని దాదాపు అలాంటిదే. ఆ ప్రాజెక్టు మాకు దక్కింది. రెండేళ్లపాటు ఆ వ్యాపారం చేశాం. తర్వాత ఆ ఒప్పందం రద్దయింది. అప్పట్నుంచి మేమే మైక్రోమ్యాక్స్ బ్రాండ్ పేరుతో ఆ సేవల్ని మిగిలిన వారికి అందించడానికి ముందుకు వచ్చాం. మొబైల్ ఫోన్ల విపణిలోకీ ప్రవేశిద్దామని 2008లో రాహుల్ సలహా ఇచ్చాడు. అప్పటికి నోకియా, శాంసంగ్, సోనీ, మోటోరోలా, ఎల్‌జీ మార్కెట్‌లో ఉండేవి. వారితో పోటీ సాధ్యమా అన్న సంశయం. ఒకే రకమైన ఫీచర్లు ఉన్నప్పుడు, ధర కాస్త తక్కువ ఉన్నంత మాత్రాన పరుగున వచ్చి ఫోన్లు కొనరు. అదనపు సౌకర్యాలూ ఇవ్వాలి. అదెలా సాధ్యమో ఆలోచించాం. గ్రామీణ, పట్టణ ప్రజలకు బ్యాటరీ బ్యాకప్ బాగా ఉండాలి. ఎందుకంటే అక్కడ విద్యుత్తు కోతలు ఎక్కువ. దాన్ని దృష్టిలో పెట్టుకొని మొదటి ఫోన్ 'ఎక్స్1ఎ' మార్కెట్లో ప్రవేశపెట్టాం. నెల రోజుల బ్యాటరీ బ్యాక్‌అప్ ఉండేది. మంచి స్పందన వచ్చింది. చాలా సందర్భాల్లో స్థానిక బలాన్ని ఉపయోగించి హ్యాండ్ సెట్లు తయారుచేసి మేం మార్కెట్‌లో నిలదొక్కుకోగలిగాం.

★ రిటైల్ దుకాణాల్లో విదేశీ బ్రాండ్‌లు ఒకట్రెండు శాతమే మార్జిన్ ఇచ్చేవి. మేం మాత్రం అయిదు శాతం ఇచ్చేవాళ్లం. అయితే నగదు చెల్లించి సరుకు తీసుకువెళ్లాలని నియమం పెట్టాం. దీనివల్ల రిటైలర్లు మైక్రోమ్యాక్స్ అమ్మకాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. అంతేకాదు మాకు అరువుల ప్రసక్తి ఉండేది కాదు. మిగతా కంపెనీల ఫోన్లు తయారీ తేదీ నుంచి వినియోగదారుడి దగ్గరకు చేరడానికి ఏడాదిపైనే పట్టేది. మా ఫోన్లు మాత్రం కేవలం మూడు నెలల్లోనే చేరేవి.

★ చైనా ఫోన్ల అమ్మకాలపై నిషేధం వచ్చాక మా ఫోన్లకు మరింత డిమాండ్ పెరిగింది. టెలిఫోన్ ఆపరేటర్ల మధ్య పోటీ బాగా పెరిగి టాక్‌టైమ్‌లో ఆఫర్లు బాగా వచ్చేవి. కానీ నిత్యం ఫోన్ నంబర్లు మార్చాలంటే కష్టం. అప్పుడే డ్యూయల్ సిమ్ ఆలోచన వచ్చింది. ఆపైన క్వెర్టీ కీప్యాడ్... ఇవన్నీ సామాన్యుడికి ముందుగా చేర్చింది మేమే. మార్కెట్ అవసరాలు తీర్చేందుకు 100 మందితో కూడిన పరిశోధక బృందాన్ని ఏర్పాటుచేశాం. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు ఉన్న ఫోన్‌ని మార్కెట్‌లోకి ప్రవేశం పెట్టడం ఒక అలవాటు చేసుకున్నాం. మా నుంచి కొత్తగా ఏం వస్తుందా అని జనాలు ఎదురు చూసేట్టు చేసుకోగలిగాం. ఫీచర్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లను దాటి సూపర్ ఫోన్లనూ మేం మార్కెట్ చేస్తున్నాం. వీటిలో స్మార్ట్ ఫోన్లకు మించిన ఫీచర్లూ, పనివేగం ఉంటాయి. విద్య, వినోదం... యువతకు ఈ రెండూ ముఖ్యం. అందుకే ఫన్‌బుక్ తయారుచేశాం.

★ మైక్రోమ్యాక్స్‌ది ఇండియాలో ఇప్పుడు మూడో స్థానం. నెలకు 13 లక్షల హ్యాండ్ సెట్లు అమ్ముతున్నాం. ఇప్పుడు మాకు అమెరికా, చైనా, హాంకాంగ్‌లలో కార్యాలయాలు ఉన్నాయి. మేం విజయం సాధించాలనుకున్నాం తప్ప ఈ స్థాయికి చేరుతామని ఎప్పుడూ అనుకోలేదు. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌తో కలిపి 17 దేశాల్లో మా అమ్మకాలు బాగా ఉన్నాయి. గత మూడేళ్లుగా మార్కెట్‌లో మా వాటా ఏడు శాతం, ఆపైనే. ఒకప్పుడు మేం విదేశీ కంపెనీలతో పోటీపడేవాళ్లం. ఇప్పుడు మాతో పోటీ పడే కంపెనీలూ వచ్చాయి. కొత్త విజయాల్ని సాధించడమే కాదు, సాధించినదాన్ని నిలుపుకోవాలన్నా కొత్తదనం కోసం ప్రతిక్షణం తహతహలాడాల్సిందే, పరుగులు తీయాల్సిందే. పోటీ ప్రపంచంలో ఇవన్నీ తప్పవు. ★

ఇంకొంత

చదువు: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్.

స్ఫూర్తి: వారెన్ బఫెట్.

అభిరుచులు: వాలీబాల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్. ప్రముఖుల జీవిత చరిత్రలు చదవడం.

విజయసూత్రం: నమ్మింది పట్టుదలతో చేస్తే విజయం వరిస్తుంది.

కేకు సోకు

'కేకు కేకులా ఉంటే అది కేకు ఎలా అవుతుంది...' అంటున్నారు ఈనాటి కేకు మేకర్లు. 'అస్సలు ఇది కేకేనా... తినడానికేనా...' అని ఆశ్చర్యపోయేరీతిలో కేకుల్ని తయారుచేస్తున్నారు. అంతేకాదు, ఒక కేకు లక్షల రూపాయల ఖరీదు ఉంటుందంటే ఊహించగలరా? కానీ కేకుకీ దాని అలంకరణకీ అంత సీనుంది మరి..!



పుట్టినరోజుకో, క్రిస్మస్ పండగకో, కొత్త ఏడాదిని స్వాగతిస్తూనో కేకు కోయడం, పంచుకుని తినడం మనకి సుపరిచితమే. ఇప్పుడిప్పుడు పెళ్ళిళ్లకీ పెళ్లిరోజులకీ... ఒక్క మాటలో చెప్పాలంటే, వేడుక చేసుకోదగ్గ అన్ని సందర్భాలకీ కూడా కేకుల్ని ప్రత్యేకంగా తయారు చేయించి మరీ కోస్తున్నారు. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో పిల్లల పుట్టినరోజు కేకులతోపాటు పెళ్లి కేకుల్ని ప్రత్యేకంగా తయారుచేయిస్తారు. అందుకోసం ఎంత ఖర్చుకైనా వెనకాడరు. ఈ సరికొత్త సంస్కృతి ఇప్పుడిప్పుడు మనదగ్గరా పెరుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా కేకు బొటిక్‌లు కూడా పుట్టుకొస్తున్నాయి.

కేకు రుచులు!

పాతకాలం నాటి ఈస్ట్ కేకులూ తరవాత వచ్చిన చీజ్ కేకుల్నీ వదిలేస్తే ప్రస్తుతం బేకింగ్ పౌడర్ కలిపి చేసే స్పాంజ్ కేకులూ పేస్ట్రీలదే హవా. వీటిలోనే ఫ్రూట్ కేకులనీ చాకొలెట్ కేక్‌లనీ రకరకాలు కేకుప్రియుల్ని చవులూరిస్తున్నాయి. మైదా, గుడ్లు, పంచదార, వెన్న లేదా నూనె, కొద్దిగా బేకింగ్ పౌడర్... ఇవి ఉంటే చాలు సాదా సీదా కేకు తయారుచేయడానికి. పండ్లూ నట్‌లూ చాక్లెట్లూ... ఇవన్నీ కేకుకి అదనపు రుచులే.

కేక్ బాల్స్, కప్ కేక్స్, లేయర్ కేక్స్, షీట్ కేక్స్, స్విస్‌రోల్ కేక్స్... అంటూ ఆకారాన్ని బట్టీ కేకుల్లో రకాలున్నాయి. అయితే ఒకప్పుడు కేకుని కేకులా మాత్రమే చేసి దానిమీద ఐసింగ్ లేదా ఫ్రాస్టింగ్ చేసి పేరు రాయడం, మార్జిపాన్‌తో చేసిన పూలనో చిన్న చిన్న బొమ్మలనో అలంకరించడం మాత్రమే చేసేవారు. లేదంటే పంచదారతో చేసిన రంగుల గుళికల్ని చల్లేవారు. కానీ ఇప్పుడు కేకు రుచికన్నా దాని ఆకారానికీ అలంకరణకీ ప్రాధాన్యం పెరిగింది.

కేకుల అలంకరణకోసం బోలెడు పరికరాలూ దొరుకుతున్నాయి. పైపింగ్ బ్యాగులూ సిరంజ్‌లతోపాటు అధునాతన పరికరాలతో కేక్ డెకరేటర్లు అద్భుతంగా ఐసింగ్ చేస్తున్నారు. బటర్‌క్రీమ్ ఐసింగ్‌తోపాటు పంచదార తక్కువ ఉండే మార్జిపాన్ లేదా బాదంపేస్టుతో చేసే రాయల్ ఐసింగ్‌కూ, అచ్చంగా పంచదార పేస్టుతో చేసే ఫాండెంట్ ఐసింగ్‌లకూ కూడా ఆదరణ పెరిగింది. స్మూత్, లేస్, లాటిస్, బాస్కెట్‌వీవ్, డాటెడ్ స్విస్... అంటూ ఐసింగ్ టెక్చర్‌లోనూ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం పంచదార పేస్టుని లేసు లేదా ఇతర మౌల్డ్‌ల్లో వేసి వాటికి ఎడిబుల్ కలర్స్ అద్ది ఆరనిచ్చాక కేకులపైనా చుట్టూ అందంగా అతికిస్తున్నారు.

రిబ్బన్ ర్యాపింగ్‌లతోపాటు పువ్వులూ, ఆకులూ, సీతాకోకచిలుకలూ, రకరకాల జంతువులు, బొమ్మలతో అలంకరించడం సాధారణమైపోయింది. పైగా ఇవన్నీ నిజమైనవేనా అనిపించేలా చేస్తున్నారు. పంచదార పూలనీ లేదా మార్జిపాన్ పండ్లనీ అలంకరించడం కేకు తయారీలో అధిక ప్రాధాన్యతని సంతరించుకుంది.

వ్యక్తుల ఫొటోలను సైతం కేకులమీద వచ్చేలా చేస్తున్నారు. అదెలా అంటే- ఫొటో ప్రింటుల్లోని బొమ్మల్ని ఎడిబల్ ప్రింటర్ల ద్వారా ఫ్రాస్టింగ్ లేదా షుగర్ షీట్ల మీద ముద్రిస్తారు. తరవాత వీటిని కాసేపు ఆరనిచ్చి జాగ్రత్తగా కేకుల పైన అతికిస్తారు. వీటినే 'కేక్ స్టిక్కర్స్' అనీ పిలుస్తారు.

కేకు ఓ కళ!

కావలసిన ఆకారంలో కేకుని చేసి వాటిని అలంకరించడం ఓ ఎత్తయితే, అసలు కేకునే రకరకాల త్రీడీ బొమ్మలరూపంలోకి మలచడం మరో ఎత్తు. ఇందుకోసం నిపుణులు ఎంత సమయమైనా వెచ్చిస్తున్నారు. దిండులూ బ్యాగులూ కప్పులూ జంతువులూ భవంతులూ... ఒకటేమిటి ఏ ఆకారమయినా త్రీడీ బొమ్మలా కనిపించేలా కేకుల్ని తయారు చేస్తూ వావ్... అనిపించేలా చేస్తున్నారు. ప్రముఖ హోటళ్లూ బేకరీలూ కంపెనీలూ నిర్వహించే కేకు పోటీల్లో షెఫ్‌లు తమలోని సృజనాత్మక తని కేకుల రూపంలో ఆవిష్కరిస్తున్నారు. వీటికి తోడు ఇటీవల ఛానెల్స్ ప్రసారం చేస్తోన్న కేక్స్ షోలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయి. దాంతో ప్రత్యేకంగా కేకుల్ని రూపొందించే డిజైనర్లు మనదగ్గరా పెరుగుతున్నారు. రెండు, మూడు, నాలుగు... బహళ అంతస్థుల కేకుల్ని తయారుచేయడమే కాదు, వాటిని అంతే అద్భుతంగా అలంకరిస్తూ 'కేకో కేక... ' అని అంతా ఈలవేసి గోల చేసేలా చేస్తున్నారు.

60 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా ఆ ఫోన్‌కి ఏమీ కాదు. ఆ కెమెరాను నీళ్లలో పడేసి... మర్నాడు తీసుకున్నా ఎంచక్కా పనిచేస్తుంది. ఆ హార్డు డిస్కుమీద రెండు టన్నుల బరువు వేసినా... ఆఖరికి పెట్రోల్‌లో పడేసినా కూడా చెక్కుచెదరదు. ఒక స్మార్ట్‌ఫోనో ల్యాప్‌టాపో ట్యాబ్లెట్లో మరో గ్యాడ్జెట్టో కొంటే... వాటిని కంటికి రెప్పలా చూసుకుంటాం. కానీ, వీటిని ఎలా వాడినా ఫర్వాలేదు... రఫ్ అండ్ టఫ్.

ముంచినా... కాల్చినా... నో ప్రాబ్లమ్

22 గంటలాచ్చే బ్యాటరీలు

పేరు: గెటాక్ బి300 నోట్‌బుక్
ధర: రూ.1.55 లక్షల నుంచీ...
ప్రత్యేకతలు: 2 గిగాహెర్ట్జ్ ఇంటెల్ కోర్ ఐ7 ప్రాసెసర్ దీని ప్రధాన ఆకర్షణ. వేలిముద్ర ఆధారంగానే ఇది తెరుచుకుంటుంది తప్ప... ఎవరుపడితే వాళ్లు దీన్ని తెరవలేరు. దీని బ్యాటరీ 11 గంటలపాటు వస్తుంది. ఇందులో మరో బ్యాటరీ వేసుకునే సదుపాయమూ ఉంది. అంటే... రెండూ కలిపి 22గంటలు పనిచేస్తాయన్నమాట. అమెరికా సైన్యం నిర్వహించే అత్యంత కఠినమైన పరీక్షలన్నింటిలోనూ ఇది పాసైందట. నిప్పు, నీరు, వాన, ఫంగస్, ఇసుక, వాయువులు, రసాయనాలు, చిన్నచిన్న పేలుళ్లు... ఇలాంటివేవీ దీన్నిగానీ, ఇందులోని ఫొటోలూ ఫైళ్లూ లాంటి సమాచారాన్నిగానీ ఏమీ చేయలేకపోయాయి.

షాకిచ్చినా ఏమీ కాదు

పేరు: పెంటాక్స్ ఆప్టియో డబ్ల్యూజీ 2 కెమెరా
ధర: రూ.12,500 నుంచీ...
ప్రత్యేకతలు: 16 మెగాపిక్సెల్ సామర్థ్యముండే ఈ కెమెరాను కరెంట్ షాకులు, మంచు, నీళ్లు, దుమ్ము ధూళీ... ఏమీ చేయలేవు. దీనిమీద కాలువేసి తొక్కేసినా, కారును పోనిచ్చినా కూడా దీనికిగానీ, లెన్సుకిగానీ, ఇందులోని సమాచారానికిగానీ ఏమీ కాదు.

2000 కిలోలు పడినా...

పేరు: ఐ.ఒ.సేఫ్ రగ్గ్‌డ్ పోర్టబుల్ హార్డ్‌డిస్క్
ధర: రూ.12,500 నుంచీ...
ప్రత్యేకతలు: 2000 కిలోల బరువు దీనిపై పడినా దీనికి ఏమీకాదు. అల్యూమినియంతో చేసిన హార్డ్‌డిస్క్ మూడురోజులపాటు 10 అడుగుల లోతునీళ్లలో ఉన్నా ఎలాంటి ప్రమాదమూ ఉండదు. అదే, టైటానియంతో చేసిందైతే 30 అడుగుల లోతులో ఉన్నా ఏమీకాదు. అతినీలలోహిత కిరణాలు, దుమ్ము, బురద, వర్షం, మంచు... ఇవేవీ దీనికిగానీ, ఇందులోని సమాచారానికిగానీ రవ్వంత నష్టాన్ని కూడా కలిగించలేవు. దీన్ని 20 అడుగుల ఎత్తునుంచి కిందకు పడేసినా; ఇంధనాల్లోగానీ, నూనెల్లోగానీ ఒక గంటపాటు ఉండిపోయినా ఏమీకాదు.

వాహనం వెళ్లిపోయినా...

పేరు: కోజియర్ ఫ్లాష్ సర్వైవర్ పెన్‌డ్రైవ్
ధర: 8 జీబీదైతే రూ.1500, 64 జీబీదైతే రూ.5,500
ప్రత్యేకతలు: దీనిమీది నుంచి వాహనాలు వెళ్లిపోయినా దీనికిగానీ, ఇందులోని సమాచారానికిగానీ ఏమీకాదు. ఎందుకంటే, విమానాల తయారీలో ఉపయోగించే తేలికపాటి అల్యూమినియంతో తయారైందిది. 200 మీటర్ల లోతునీళ్ళలో పడేసినా ఇది చెక్కుచెదరదు.

కింద పడేసినా...

పేరు: పానసోనిక్ టఫ్ ప్యాడ్ ఎఫ్‌జెడ్ ఏ1
ధర: రూ.75,000
ప్రత్యేకతలు: ఒక జీబీ ర్యామ్, 16 జీబీ స్టోరేజీ సామర్థ్యం కలిగి ఉండే ఈ ఐప్యాడ్‌ని దుమ్మూధూళీ కప్పేసినా, నీళ్లలో పడేసినా ఏమీ కాదు. ప్రత్యేకంగా తయారుచేసిన దీని తెరపై గీతలే పడవు. దీన్ని నాలుగు అడుగుల ఎత్తునుంచి కిందపడేసినా ఏమీ కాదు. దీని బ్యాటరీ పదిగంటలు పనిచేస్తుంది.

60 డిగ్రీల వేడిలోనూ...

పేరు: నాటిజ్ ఎక్స్ I స్మార్ట్‌ఫోన్
ధర: సుమారు రూ.45,000
ప్రత్యేకతలు: ఈ ఫోన్‌ని తేమలో వదిలేసినా, నాలుగు అడుగుల ఎత్తు నుంచి నేలపై పడేసినా దీనికిగానీ, ఇందులోని సమాచారానికి గానీ ఎలాంటి నష్టమూ జరగదు. మైనస్ 20 డిగ్రీల చల్లదనాన్నీ, గరిష్ఠంగా 60 డిగ్రీల వేడినీ ఇది తట్టుకోగలదు. దీనిపై నీరూ, దుమ్మూధూళీ, ఇసుకా పోసేసినా కూడా ఏమీకాదు. 3జీ, వైఫై, జీపీఎస్, 5 మెగాపిక్సెల్ కెమెరా... ఇందులోని ఆకర్షణల్లో కొన్ని.

మనదేశంలో క్రికెట్, టెన్నిస్ లాంటి ఆటలకున్న క్రేజు దానికి లేదు. నిజానికి చాలామందికి దానిగురించి తెలియదు కూడా. మరి, తెలిసేలా చేయాలంటే ఏం చేయాలి? పెద్దవాళ్లకైతే ఏవేవో ఇష్టాలూ ఆసక్తులూ ఉంటాయి. కానీ, పిల్లలకు... అప్పుడప్పుడే ఏర్పడుతుంటాయి. అందుకే, మొక్క దశలోనే 'దాన్ని' వాళ్లలో పెంచాలనుకున్నారు. 'ఫార్ములా 1' అంటే అదే మరి!

విద్యార్థుల కోసం ఓ 'ఫార్ములా'

పిల్లలు - ఆటలు... ఈ రెంటినీ విడదీసి చూడలేం. ఆటలాడేవాళ్లంతా పిల్లలు కాకపోవచ్చుగానీ... పిల్లలందరూ తప్పకుండా ఆటలాడతారు.

మామూలు వాళ్లకు ఇది సాధారణ వాక్యంలా కనిపిస్తుంది. కానీ, కార్పొరేట్ కంపెనీలకు ఇందులో వ్యాపారకోణం కనిపిస్తుంది. అదే కోణాన్ని పట్టుకుంది ఫార్ములా వన్ (ఎఫ్ 1) కంపెనీ.

ఎఫ్ 1... కార్ల రేసులకు పెట్టిందిపేరు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో దీనికి ఎంతో ఆదరణ ఉంది. కానీ, మనదేశంలో మాత్రం తక్కువే.

'విదేశాల్లో బాగానే ఉందిగా... మనదేశంలో ఎందుకూ? అయినా ఆ రేసులు మనవాళ్లకు అంతత్వరగా ఎక్కుతాయా ఏంటి?' అనేగా మీ సందేహం.

సుమారు 130 కోట్ల జనాభా... ప్రపంచంలోని అతిపెద్ద మార్కెట్లలో ఒకటి... కొనుగోలు శక్తి ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటి... వీటన్నింటినీ కలిపి ఒక్కమాటలో చెప్పాలంటే... వ్యాపారావకాశాలు మెండుగా ఉన్న దేశం మనది!

ఈ ఒక్క కారణంవల్లే... ఎఫ్ 1 మనదేశంలోనూ పాగా వేయాలనుకుంది. మొక్కై వంగనిది మానై వంగదు అన్న సామెతను వంటబట్టించుకుని మొక్కల్లాంటి మన విద్యార్థులమీద దృష్టిపెట్టింది. నేటి

బాలలే రేపటి పౌరులు... కాబట్టి, అలాచేస్తే భవిష్యత్తులో ఆదరణ ఖాయమన్నది వాళ్ల మాస్టర్ ప్లాన్.

మెదడుకు పదును

'ఇంతకీ విద్యార్థులకు చేరువవ్వాలంటే ఏం చేయాలి?' - ఈ ఆలోచన 1999లోనే చేసింది ఫార్ములా వన్. దాని ఫలితమే 'ఎఫ్ 1 ఇన్ స్కూల్స్'. ఇల్లు తరవాత సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసేది బడి. ఆ ప్రపంచంలో ఎఫ్ 1 కూడా ఉంటే..! భలే ఆలోచన కదూ. అలా బ్రిటన్‌లోని స్కూళ్లలోకి అడుగుపెట్టింది.

ఎఫ్ 1 అంటే ఏంటో సులభంగా అర్థమయ్యేలా వివరించడం మొదలుపెట్టింది. పిల్లలకు పాఠాలకంటే పరిచయాలే వేగంగా అర్థమవుతాయి కదా. అందుకే, రెండో దశలో కార్ రేసులను పరిచయం చేయాలనుకుంది. అందుకోసం, చిన్న కార్లు కావాలి. నిజానికి వాటిని తామే తయారుచేసేయొచ్చు. కానీ, అది కూడా పిల్లలతోనే చేయిస్తే... వాళ్లకు విజ్ఞానదాయకంగానూ ఉంటుంది కదా. అలా కార్ల తయారీకి అవసరమైన సామగ్రిని ఇచ్చేది. ఓ సాఫ్ట్‌వేర్ ద్వారా వాళ్లే మోడళ్లు తయారుచేసేలా శిక్షణ ఇచ్చేది.

తరవాతి అంకం... బృందాల విభజన. ఈ పోటీలు 12 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకోసమే. ముగ్గురి నుంచి ఆరుగురు విద్యార్థులతో ఒక బృందం ఏర్పాటుచేసుకోవచ్చు. ఒక పాఠశాల నుంచి ఇలా ఎన్ని బృందాలైనా ఉండొచ్చు. ఆ తరవాత కార్ రేసులు మొదలవుతాయి.

స్థానిక పోటీలు మొదలు...

ఈ పోటీల ఉద్దేశం కేవలం విజేతను ఎంపికచేయడం ఒక్కటే కాదు... కార్లను తయారుచేయడం దగ్గరి నుంచీ బృంద నిర్వహణా, ఆలోచనా శక్తీ, నాయకత్వ లక్షణాలూ, భావనైపుణ్యాలూ వంటివాటిని కూడా పరీక్షిస్తారు. ఆ విభాగాల్లోనూ బహుమతులుంటాయి. రేసుకోసం 80 అడుగుల పొడవైన ట్రాక్‌ను ఏర్పాటుచేస్తారు. ఇందులో ఒకేసారి రెండుకార్లు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. వీటిని మోటార్ సాయంతో నెట్టినప్పుడు... రెండు కార్లలో ఏ కారైతే మధ్యలో ఆగిపోకుండా, పడిపోకుండా లక్ష్యాన్ని తొందరగా చేరుకుంటుందో అదే విజేత. అలా అందరి కార్లనూ పరిశీలించాక అంతిమ విజేతను నిర్ణయిస్తారు. అలా ప్రాంతీయంగా ఉన్న బృందాల్లోంచి ఒక విజేతను ఎంపికచేసిన తరవాత... ఆ విజేత లందరి మధ్యా పోటీ నిర్వహిస్తారు. అలా జాతీయ విజేతను ప్రకటిస్తారు. 2004 వరకూ ఇలాగే ఉండేవి. కానీ, ఈ పోటీలను విదేశాలకూ విస్తరించాలన్న లక్ష్యంతో 2005లో అంతర్జాతీయ పోటీని నిర్వహించడం మొదలుపెట్టారు. అంటే ఇది... ఆయా దేశాల్లో విజేతలుగా నిల్చినవాళ్ల మధ్య జరిగే పోటీ అన్నమాట.

మనదేశంలో కూడా...

2011 వరకూ ప్రపంచంలోని సుమారు 40 దేశాల్లో ఈ పోటీలు జరిగేవి. 20వేలకు పైగా పాఠశాలలు ఇందులో సభ్యులుగా ఉండేవి. పదిలక్షలకుపైగా విద్యార్థులు పాల్గొనేవారు. ఈ ఏడాది మనదేశంలోకీ అడుగుపెట్టింది 'ఎఫ్ 1 ఇన్ స్కూల్స్' ప్రాజెక్టు. ఇందులో సుమారు 60 స్కూళ్లు ఇప్పటికే సభ్యులుగా చేరిపోయాయి. దీనిలో సభ్యత్వం తీసుకోవాలంటే స్కూల్ లేదా కాలేజీ యాజమాన్యం f1inschoolsindia.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఆసక్తిని నిర్వాహకులకు తెలియజేయాలి.

ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్ మొదలైన 9 రాష్ట్రాలను మొదటి జోన్‌గానూ; ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిషా మొదలైన 8 రాష్ట్రాలను రెండోజోన్‌గానూ నిర్ణయించారు. మొదటి జోన్‌లోని విద్యార్థులకు జనవరి 9 నుంచి 11 వరకూ పోటీలు జరుగుతాయి. రెండోజోన్ విద్యార్థుల పోటీ తేదీని ఇంకా నిర్ణయించాల్సి ఉంది.

అంటే, వచ్చే ఏడాదిలో మనదేశంలో కూడా ఎఫ్ 1 ప్రాక్టీసు మొదలవుతుందన్నమాట.

ఇందులో వ్యాపారకోణం సంగతి ఎలా ఉన్నా... విద్యార్థుల మెదళ్లకు మాత్రం పదును పెట్టేదే. అంతేకాదు, ఆయా రాష్ట్రాల విద్యార్థులు కలిసే అవకాశం వస్తుంది. విజేతలైనవాళ్లకు విదేశీ విద్యార్థులతో కలిసే అదృష్టమూ ఉంటుంది. ఇది కూడా ఒకరకంగా మంచిదేగా. ★

నాన్నతో హౌరామెయిల్ ఎక్కేశా

ఆయన సినిమాల్లో... సుమోలు గాల్లోకి లేవవుకానీ జోకుల బాంబులు పేలతాయి. హీరోలు తొడ కొట్టరు. కడుపుబ్బా నవ్విస్తారు. ఆయన కత్తులతోకాదు... కామెడీతో చంపేస్తాడు. అలాంటి ఆయన నాగార్జునతో కలిసి 'ధమరుకం' మోగించారు. ఆయనే దర్శకుడు శ్రీనివాసరెడ్డి. 'ఏంటిసార్, కామెడీ ట్రాక్ వదిలి ఈ ట్రాక్‌లోకి వచ్చారూ' అంటే... 'దర్శకుడు ఏ ట్రాక్‌లోనైనా వెళ్లగలగాలి, హిట్టు కొట్టగలగాలి. ఒక సినిమా బాగా ఆడితే ఈ రంగంమీద ఆధారపడ్డ ఎన్నో కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. వాళ్ల సంతోషమే నా సంతోషం' అంటారు. ఇంకా ఏమన్నారంటే...



నవమాసాలూ మోసి, బిడ్డను కన్నాక తల్లి ఎంత సంతోషంగా ఉంటుందో నాకిప్పుడు అంత సంతోషంగా ఉంది. సినిమా అనే దానికి దర్శకుడూ, నిర్మాతా భార్యాభర్తల్లాంటి వాళ్లు. వాళ్లకు పుట్టే బిడ్డే సినిమా. సినిమా విడుదలయ్యాక నా పని అయిపోయిందని చేతులు దులిపేసుకోను. ఆ బిడ్డను పెంచి, పెద్దచేసే బాధ్యత...అంటే, సినిమా కనీసం 50 రోజులు ఆడేవరకూ ప్రచారంకోసం కష్టపడతాను. ఇప్పుడూ అలాగే కష్టపడుతున్నాను.

నాగార్జునగారికి ఇది ప్రత్యేకమైన సినిమా. ఇది ఆయన చేసిన తొలి సోషియో ఫాంటసీ సినిమా, అత్యధిక పెట్టుబడి పెట్టిన సినిమా, అత్యధిక థియేటర్లలో విడుదలైన సినిమా. అంతేకాదు, అత్యధిక కలెక్షన్లు వసూలు చేసిన సినిమా కూడా. నిజానికి ఈ ఆనందం నా ఒక్కడిది కాదు. ఎంతోమంది నాకిచ్చింది.

మనకు కీడు తలపెట్టినవాళ్లను మరిచిపోయినా ఫర్వాలేదు... మేలుచేసిన వాళ్లను మాత్రం జీవితాంతం గుర్తుపెట్టుకోవాలి. అలా నా జీవితాన్ని ప్రభావితం చేసినవాళ్లూ నాకు సాయపడిన వాళ్లూ చాలామంది ఉన్నారు.

వాళ్లిద్దరూ...

నేను మొట్టమొదట రుణపడి ఉన్నవాళ్లూ, కృతజ్ఞతలు చెప్పుకోవాల్సినవాళ్లూ ఎవరైనా ఉన్నారూ అంటే... వాళ్లు మా అమ్మానాన్నలు. నన్ను ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. నేను ఏది అడిగినా 'కాదు, లేదు' అనకుండా ఇచ్చేవారు. ఎందుకలా చూసుకునేవాళ్లంటే... వాళ్లకు లేకలేక పుట్టినవాణ్ణి నేను. చెప్పాలంటే... నేను పుట్టేనాటికి నాన్నకు 45 ఏళ్లు! మాది పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని వెలగలవారిపాలెం అనే పల్లెటూరు. మాదో మధ్యతరగతి కుటుంబం. నాన్న రైతు.

పెద్దయ్యాక పోలీసును అవ్వాలని... చిన్నప్పుడు అనుకునేవాణ్ణి. తొమ్మిదో తరగతి నుంచీ కథల మోజు పట్టుకుంది. చిన్నచిన్న కథలు రాసి, స్వాతి వంటి వారపత్రికలకు పంపేవాణ్ణి. వాటిలో కొన్ని అచ్చయ్యాయి. దాంతో నా స్నేహితులు 'నువ్వు, ఇక్కడుండాల్సినోడివి కాదురా... సినిమాల్లోకి వెళ్లిపో' అని మునగచెట్టు ఎక్కించేసేవారు. అప్పట్నుంచే సినిమా పిచ్చి మొదలైంది.

కె.బాలచందర్, దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావు, కె.విశ్వనాథ్... వీళ్లంతా చిన్నప్పుడు నా అభిమాన దర్శకులు. వీళ్ల సినిమాలూ బాగా చూశాక... సినిమాల్లోకి వెళ్లిపోవాలన్న కోరిక మరింత బలపడింది.

పదో తరగతి పూర్తయ్యాక భీమవరంలోని డీఎన్నార్ కాలేజీలో ఇంటర్‌లో చేరాను. కాలేజీలో చేరానన్నమాటేగానీ సినిమా పురుగు మెదడును తొలిచేస్తుండేది. రెండునెలలు మాత్రమే కాలేజీకి వెళ్లాను. ఇకలాభం లేదనుకుని ఒక నిర్ణయానికి వచ్చాను. అమ్మానాన్నలు నేను ఏది అడిగినా ఇస్తారన్న ధైర్యంతో... నాకు సినిమాలమీద ఆసక్తి ఉందని చెప్పేశాను. వాళ్లు మొదట కాస్త కంగారుపడ్డారు. ఎందుకంటే, మాదేం ఆస్తిపరుల కుటుంబం కాదు... పెట్టుబడితో నన్ను మద్రాసు సాగనంపడానికి. అలాగని, వాళ్లు నా ఆశను చంపేయాలనుకోలేదు. నేను కోరుకున్నది ఇవ్వాలనుకున్నారు.

1987 జూన్ 27... నా జీవితంలో మరిచిపోలేని రోజు. మా పెదనాన్నగారి అల్లుడు మల్లారెడ్డి అనే ఆయనతో కలిసి నాన్నా నేనూ తాడేపల్లిగూడెంలో హౌరామెయిల్ ఎక్కి మద్రాసులో దిగాం. విజయారెడ్డిగారని కన్నడలో గొప్ప దర్శకుడు. తెలుగులో ఎన్టీఆర్, రాఘవేంద్ర రావు కాంబినేషన్ ఎలాగో... కన్నడలో విజయారెడ్డి, రాజ్‌కుమార్ కాంబినేషన్ అలాంటిది. ఆయన మల్లారెడ్డికి బాబాయి. అలా నాన్న నన్ను విజయారెడ్డిగారి దగ్గర చేర్చారు. ఆయన దగ్గర రెండు సినిమాలకు పనిచేశాను. తరవాత ఆయన నన్ను శ్యామ్ ప్రసాదరెడ్డిగారికి అప్పగించారు. ఆయన కోడి రామకృష్ణతో నిర్మిస్తున్న 'అంకుశం' సినిమాకి నన్ను అసిస్టెంట్ డైరెక్టర్‌గా తీసుకున్నారు. దాంతో 1988లో నా సినీజీవితం ప్రారంభమైంది. నా మొదటిజీతం రూ.500. 1988 మే 31న శ్యామ్‌ప్రసాద్‌గారి చేతుల మీదుగా అందుకున్న ఆ క్షణాలు ఇప్పటికీ గుర్తున్నాయి. ఆ డబ్బులతో అమ్మానాన్నలకు బట్టలు కొన్నాను. అప్పుడు వాళ్ల ముఖాల్లో చూసిన ఆనందం... కోట్లిచ్చినా కొనలేననిపించింది.

ఆ ముగ్గురూ...

అంకుశం తరవాత నేను దర్శకుడు జి.రామ్మోహనరావుగారి దగ్గర చేరాను. తరవాత వై.నాగేశ్వరరావుగారి దగ్గరకు వెళ్లాను. ఆయనా, ఆయన భార్య శివపార్వతి నన్ను సొంత కొడుకులా చూసుకునేవారు. ఆ రోజుల్లో మాకు పని తప్ప వేరే ధ్యాసే ఉండేది కాదు.

సినిమా తప్ప వేరే లోకం తెలీదు. సినిమా బాగా రావాలన్న ఆరాటం తప్ప ఆకలి గురించి పట్టించుకునేవాళ్లం కాదు. ఒక్కోరోజు మధ్యాహ్నం సమయంలో ఏదో పనిమీద వాళ్లింటికి వెళ్తే... తలుపు తీసిన వెంటనే ఆమె అడిగే మొదటిప్రశ్న 'అన్నం తిన్నావ్‌రా' అని. ఒకవేళ నేను తినలేదంటే భోజనం తిని వెళ్లేదాకా ఒప్పుకునేవారు కాదు. భోజనం సిద్ధంగా లేకపోతే, వెంటనే వండి మరీ పెట్టేవారు. ఆ దంపతులిద్దరూ పార్వతీపరమేశ్వరుల్లాంటివాళ్లు. తరవాత కొన్నాళ్లకు శివనాగేశ్వరరావుగారి దగ్గర పనిచేసే అవకాశం వచ్చింది. వీళ్ల ముగ్గురి దగ్గరా రక్తకన్నీరు, రారాజు, మొండి మొగుడు పెంకి పెళ్లాం, ప్రయత్నం, నాయనమ్మ వంటి 40 సినిమాలకు అసిస్టెంట్, కోడైరెక్టర్‌గా పనిచేశాను. ఒక దర్శకుడు ఎలా ఉండాలో వీళ్ల దగ్గరే నేర్చుకున్నాను.

ఆ నలుగురూ...

నా బాల్య మిత్రులు ఆనంద రెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, రామలింగేశ్వర్రెడ్డి, రామకృష్ణారెడ్డి... ఈ నలుగురూ లేకపోతే ఈరోజున దర్శకుడిగా మీముందు తలెత్తుకుని ఉండేవాణ్ణి కాదు.

1996నాటి సంగతి. నేను కోడైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు వీళ్లు షూటింగులకు వచ్చేవాళ్లు. నా పనితీరు చూసి 'మనోడు చాలా కష్టపడుతున్నాడు. వీణ్ణి మనమే దర్శకుడిగా ఎందుకు పరిచయం చేయకూడదూ' అనుకున్నారు.

'సినిమా తీయడానికి ఎంత డబ్బు కావాల్రా' అని నన్ను అడిగారు. అప్పట్లో అలీగారు యమలీల, పిట్టలదొర వంటి సూపర్‌డూపర్ హిట్ సినిమాలతో ఊపుమీదున్నారు. ఆయనతో సినిమా చేస్తే బాగుంటుందని పించి... రూ.25 లక్షలు సరిపోతాయని వాళ్లతో చెప్పాను.

నలుగురూ కలిసి రూ.25 లక్షలు ఒక సూట్‌కేసులో పెట్టి నాకు ఇచ్చారు. 'దీంతో సినిమా తియ్. హిట్టయితే ఫర్వాలేదు. లేదనుకో... మేం నలుగురమూ కలిసి ఎక్కడికో ఈ డబ్బుతో వెళ్తుంటే సూట్‌కేసు పొరపాటున పోయిందని అనుకుంటాం' అని నాకు భరోసా ఇచ్చారు. అలా వాళ్ల ప్రోత్సాహంతో నేను దర్శకుణ్ణయిన మొదటి సినిమా 'ఆషాఢం పెళ్లికొడుకు'.

అప్పట్లో అలీ ఎంత బిజీగా ఉన్నా, కాల్షీట్లు లేకపోయినా నేను దర్శకుణ్ణి అవుతున్నానన్న సంతోషంతో నాకోసం డేట్లు సర్దుబాటు చేశాడు. అంతేకాదు, తాను తీసుకునే రెమ్యునరేషన్‌లో సగం మాత్రమే తీసుకున్నాడు. సినిమా 50 రోజులు ఆడింది. తరవాత సుమన్‌తో 'ఫిబ్రవరి 14 నెక్లెస్‌రోడ్' తీశాను. అదీ నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టింది. మూడో సినిమా 'అందం'. కానీ, అది విడుదల కాలేదు. దాంతో, నాలుగేళ్లు ఎన్నో కష్టాలుపడ్డాను.

వాళ్లందరూ...

ఆ సమయంలో నన్ను ఆదుకున్నాడు త్రినాథ్ అనే పాత్రికేయ మిత్రుడు. 2004లో నా పరిస్థితి చూసి బాధపడి... వ్యాపారవేత్త నూకారపు సూర్యప్రకాశరావు గారితో నా గురించి చెప్పాడు. ఆయన నాకో అవకాశమిచ్చారు. అలా చేసిన చిత్రమే 'అదిరిందయ్యా చంద్రం'. అక్కణ్ణుంచి నా రెండో ఇన్నింగ్స్ మొదలైంది.

మొదటిసారి అలీలా... ఈసారి హీరో శివాజీ నాకు సాయపడ్డాడు. ఆ సినిమా పెద్ద హిట్టయ్యింది. తర్వాత అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. 'టాటా బిర్లా మధ్యలో లైలా', 'యమగోల మళ్లీ మొదలైంది', 'బొమ్మన బ్రదర్స్ చందన సిస్టర్స్', 'కుబేరులు' చేశాను. అన్నీ హిట్లే. తరవాత చేసిన 'అఆఇఈ' ఫ్లాపయింది.

నా రెండో ఇన్నింగ్స్‌లో సాధించిన విజయాల వెనుక ఒక వ్యక్తి ఉన్నాడు. నాకు కథలూ డైలాగుల విషయంలో ఎంతో సాయంచేసిన వ్యక్తి కృష్ణభగవాన్. అందుకే, అతణ్ణి సొంత అన్నయ్యలానే చూస్తాన్నేను.

'అఆఇఈ' ఆడకపోవడంతో కాస్త ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తింది. ఆ సమయంలో... ఆర్.ఆర్. మూవీ మేకర్స్ వెంకట్ గారి దగ్గరకు కథ చెబుదామని వెళ్లాను. 'నాగార్జునగారితో సినిమా చేయాలనుకుంటున్నాను, కథ ఉందా?' అన్నారాయన. నేను రెండు కథలు చెప్పాను. రెండూ ఆయనకు నచ్చాయి. మరి, నాగార్జునగారిని ఒప్పించడం ఎలా? అప్పుడు నాకు సాయం చేసిన పాత్రికేయమిత్రుడు బీఏ రాజు. ఆయనే నాగార్జునగారికి నా గురించి చెప్పి, నా కథ వినేలా ఒప్పించారు. అలా నేనూ, కథా రచయిత వెలిగొండ శ్రీనివాస్ కలిసి నాగార్జునగారికి కథ చెప్పాం. వెంటనే ఆయన ఒప్పుకొన్నారు. అలా ఢమరుకం ప్రయాణం మొదలైంది.

చిన్న సినిమాలు చేసే నాకు ఈ అవకాశమిచ్చిన నాగార్జున, ఆర్.ఆర్. మూవీస్ వెంకట్‌గార్లకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఒక సినిమామీద ఎంతోమంది జీవితాలు ఆధారపడి ఉంటాయి. నిర్మాత నుంచీ ప్రేక్షకుడి వరకూ ఎంతోమందిని దృష్టిలో పెట్టుకుని నవరసాల సమ్మేళనంతో సినిమా తీయాలి. వీళ్లంతా సంతోషంగా ఉండాలనేది నా సిద్ధాంతం. ఢమరుకం కోసం నేను పడిన కష్టం వృథాపోలేదు. నిర్మాతలూ బయ్యర్లూ ప్రేక్షకులూ అందరూ సంతోషంగా ఉన్నారు.

నేను పెద్ద చదువులు చదువుకోలేదు. సినిమా తప్ప నాకు మరొకటి తెలియదు. అందుకే సినిమాలు తీస్తూనే ఉంటాను.

ఈ సినిమా ఇచ్చిన జోష్... మరిన్ని సినిమాలు చేయడానికి నన్ను పురికొల్పింది. నాగార్జున... నాగచైతన్యతో పనిచేసే అవకాశమిచ్చారు. ఇప్పుడు అన్ని రకాల కథలు చేయడానికీ సిద్ధంగా ఉన్నాను. మరిన్ని విజయాలు సాధించగలనన్న ధీమా వచ్చింది.

నాకో కల ఉంది. అమ్మకు కట్నంగా ఇచ్చిందీ, మాకున్న ఒకే ఒక్క ఆస్తీ... మా ఊళ్లోని ఎకరా పొలం. చిన్నప్పట్నుంచీ నాకు మదర్ థెరీసా అంటే చాలా అభిమానం. ఆమె స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేయాలనుకునేవాణ్ణి. అందుకోసం ఊళ్లోని మా పొలంలో అనాథాశ్రమం, వృద్ధాశ్రమం, ఆసుపత్రి, అన్నదాన కేంద్రం కట్టాలనుకున్నా. అదే నా కలా, జీవితాశయమూ. దానికోసమే ప్రయత్నిస్తున్నాను. అది సాధిస్తే... చాలు, ఈ జీవితానికి సార్థకత ఏర్పడినట్టే.

ఆ నాలుగేళ్లూ...

2000-'04... నా జీవితంలో అత్యంత కష్టసమయం. నేను చేసిన మూడో సినిమా 'అందం'. ఎమ్మెస్ రెడ్డిగారు నిర్మించిన ఆ సినిమా కొన్ని కారణాల వల్ల విడుదల కాలేదు. అదిగో, అప్పట్నుంచీ నా సినిమా కష్టాలు మొదలయ్యాయి. పరిశ్రమలోకి రాకముందు నాకు ఆస్తులేమీ లేవు. వచ్చిన తరవాత సంపాదించిన ఆస్తులూ ఏమీలేవు. వచ్చిందాంట్లో నా భోజనం, ఇంటిఅద్దెలకు కొంత ఉంచుకునేవాణ్ణి. అమ్మానాన్నలకు కొంత పంపించేవాణ్ణి. మిగతాదాంతో వీసీడీలూ, పాటల క్యాసెట్లూ కొనేవాణ్ణి. సినిమావాళ్లకు పెట్టుబడి అవే కదా. 'దర్శకుడిగా స్థిరపడిపోయాడు మావాడు... ఇంకేంటి' అని నాకు పెళ్లిచేసేశారు నాన్న. కానీ, సినిమావాళ్ల జీవితంలో కూడా సినిమా కష్టాలుంటాయని ఊహించలేదు. నాకు అవకాశాలు రాలేదని నా భార్య ఎప్పుడూ బాధపడలేదు. కానీ, మా పాప ఏడుపు మాత్రం నన్ను దహించి వేసేది. అప్పట్లో ఎంత సమస్యగా ఉండేదంటే... పాపకు పాలప్యాకెట్ కొనడానికి కూడా డబ్బులు ఉండేవి కావు. పాలప్యాకెట్ డబ్బుల కోసం మిత్రుల దగ్గర చేయిచాచి అడిగిన రోజులూ ఉన్నాయి. మరోపక్క సినిమాలకోసం ప్రయత్నాలు చేస్తుండేవాణ్ణి. అప్పట్లో నాకు బైకు కూడా ఉండేది కాదు. ఎక్కడికివెళ్లాలన్నా నడిచే వెళ్లేవాణ్ని.

అనుకున్నదొక్కటీ...

ఓ అబ్బాయి. ఓ అమ్మాయిని ఇష్టపడ్డాడు. అమ్మాయిలు కానుకలకు పడిపోతారని చాలామంది అబ్బాయిలకు లాగానే అతడికీ ఓ అపోహ. ఆ అమ్మాయికి తనంటే ఇష్టమో కాదో తన స్నేహం కోరుతుందో లేదో తెలుసుకోకుండానే ఆమె పుట్టిన రోజు కానుకగా ఓ కేక్ పంపించాడు. అదికూడా మామూలు కేక్ కాదు. ఆమె ఫొటో ప్రింట్ చేసి ఉన్న కేక్. ఆ అమ్మాయికి తెలియకుండా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ నుంచి ఆమె ఫొటో తీసుకుని దాన్ని ఈమెయిల్ ద్వారా బేకరీకి పంపాడు. బేకరీవాళ్లు అతడిచ్చిన అడ్రస్‌కు ఫొటోకేక్ పార్శిల్ పంపించారు. అక్కడే కథ అడ్డం తిరిగింది. ఆ పార్శిల్‌ను అందుకున్న అమ్మాయి తండ్రి కేక్ మీద తన కూతురి ఫొటోను చూసి అగ్గిమీద గుగ్గిలమై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బేకరీలో ఆ యువకుడి వివరాలేవీ లేనప్పటికీ ఈమెయిల్ ఐడీ ఆధారంగా అతడు అమ్మాయి క్లాస్‌మేట్ అని పోలీసులు గుర్తించారు. అనుమతి లేకుండా అమ్మాయి ఫొటోను కేక్‌మీద వాడినందుకు కేసు నమోదు చేసి, ఆ అబ్బాయి కోసం గాలిస్తున్నారు.

కొత్తా హోటలండే

'నేనంటూ ప్రత్యేకం నాదంటూ ఓలోకం...' అనుకునే వారికోసమే బెల్జియంలోని ఈ హోటల్ ఎదురుచూస్తోంది. ఎందుకంటే దాన్ని మిగతావాటి కంటే భిన్నంగా నిర్మించారు. కేస్‌అనస్ అనే ఈ హోటల్ ముప్పై ఎకరాల స్థలంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఉంది. మానవుడి పెద్దపేగు ఆకారంలో ఉండటం దీని ప్రత్యేకత. లోపల డబుల్‌కాట్ బెడ్లూ ఏసీలూ లాంటి సౌకర్యాలన్నీ మామూలుగానే ఉంటాయి. హోటల్ బైటకు వస్తేచాలు చుట్టూ అందమైన ప్రకృతి కనువిందు చేయడంతోపాటు నల్లటి హంసలూ కొంగలూ కప్పలూ కనిపించి ఆశ్చర్యపరుస్తాయి. ఇప్పటివరకూ కొన్ని వేలమంది దీనిలో బసచేశారు. విదేశీ పర్యాటకులను ఇది విశేషంగా ఆకర్షించడంతో యజమానులు ఉబ్బితబ్బిబవుతున్నారట.



రెండు చేతులతోనూ రాసేస్తా

చైనాకు చెందిన చెన్ సుయాన్ కుడిఎడమల తేడాలేకుండా రెండు చేతులతోనూ చకచకా రాసేస్తోంది. ఇందులో పెద్ద వింతేముంది, ఇప్పటికే చాలామంది రాశారని తీసిపారేయకండి. సుయాన్ ఒక చేత్తో నిలువుగానూ మరో చేత్తో అడ్డంగానూ రాస్తుంది. అంతేకాదు ఒకచేత్తో ఇంగ్లిష్ మరో చేత్తో చైనీస్ కూడా రాసేస్తోంది. 'స్కూలు రోజుల్లో హోమ్‌వర్క్ చేయడానికి టైమ్ సరిపోయేది కాదు. దాంతో గబగబా రెండు చేతులతోనూ రాసి తొందరగా పూర్తిచేసేదాన్ని. ఇప్పుడదే అలవాటుగా మారిపోయి ప్రత్యేకమైన గుర్తింపునూ తెచ్చిపెట్టింది' అంటోంది సుయాన్ ఎంతో మురిపెంగా.

వామ్మో... మల్టీ టాస్కింగ్

తమ విజయానికి కారణం మల్టీ టాస్కింగేనని చాలామంది గర్వంగా చెబుతుంటారు. పోలెండ్‌కు చెందిన థామస్ పెకోవ్‌స్కీ మాత్రం మల్టీ టాస్కింగ్ అంటేనే ఉలిక్కిపడుతున్నాడు. ఒంటిచేత్తో ఇల్లంతా చక్కదిద్దే భార్యను ఒక్క రోజైనా అనుసరించి ఆమెను ఆశ్చర్యంలో ముంచెత్తెయ్యాలి అనుకున్నాడు పెకోవ్‌స్కీ. అనుకున్నదే తడవుగా రెండు మూడు పనులు ఒకేసారి పెట్టేసుకుని అమాంతంగా కార్యరంగంలోకి దూకేశాడు. ఒకపక్క టీవీలో తనకిష్టమైన బాక్సింగ్ షో చూస్తూ మరోపక్క బీర్ తాగుతూ బట్టలు ఇస్త్రీ చేయడం మొదలుపెట్టాడు. ఈలోపు సెల్‌ఫోన్ మోగడంతో టీవీ చూడటంలో పరధ్యానంగా ఉన్న అయ్యగారు హలో అంటూ ఐరన్‌బాక్స్‌ను చెంపకు ఆనించికున్నాడు. కట్‌చేస్తే... సగం కాలిపోయిన మొహంతో లబోదిబో మంటున్నాడు.

వీడని మిస్టరీ

'ఎందుకిలా జరిగింది? అసలు ఇలాగే ఎందుకు జరుగుతోంది?' అని అంతా ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే అక్కడ జరిగే విషాదాన్ని నిరూపించడానికి ఎలాంటి ఆధారాలూ దొరకడం లేదు. స్కాట్లాండ్‌లోని మిల్టన్‌లో ఉన్న వందేళ్లనాటి బ్రిడ్జ్ పైనుంచి కుక్కలు దూకి చనిపోతున్నాయి. ఒకటికాదు రెండుకాదు ఇప్పటివరకూ యాభై కుక్కలు బ్రిడ్జి కుడిపక్క నుంచి మాత్రమే హటాత్తుగా కిందికి దూకేస్తున్నాయి. పైగా ట్రాఫిక్ ఏమాత్రంలేని రోజులూ ఆదివారాల్లోనే ఇలా జరగడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. తామెంతో ప్రేమించే ప్రియనేస్తాలు ఇలా అకాల మృత్యువాత పడటాన్ని జీర్ణించుకోలేక ఇందుకు కారణమేమిటో అర్థంకాక యజమానులు విలవిల్లాడిపోతున్నారట.



ఎగుడుదిగుడు అందాలు

ర్యాంప్ ఫ్యాషన్లు వాడుకలోకి రావడం... అదీ సాధారణ ప్రజల్ని ఆకర్షించడం... అనేది అరుదుగా జరుగుతుంటుంది. అలాంటి వాటిల్లో ఒకటి ఎసిమ్మెట్రికల్(అసమతల) అనార్కలీ. అటు సెలెబ్రెటీల్నీ ఇటు సామాన్యుల్నీ కూడా ఏకకాలంలో కట్టిపడేస్తోన్న ఈ ఫ్యాషన్ కథాకమామీషు...

అది సంప్రదాయ అనార్కలీ కావచ్చు... ఆధునిక ప్రింటెడ్ కుర్తీ కావచ్చు... ఏదయినాగానీ ఇది ఇప్పుడు కుదురుగా సమతలంగా ఉండటం లేదు. ముందో వెనకో కొంచెం పైకి పోతుంది. లేదంటే కొంచెం కిందకి సాగిపోతుంది. మొత్తం మీద ఎంత ఎగుడుదిగుళ్లు ఉంటే అంత లేటెస్ట్ ఫ్యాషన్‌గా వయ్యారాలొలికిస్తోంది. దీనికి తోడు ఈమధ్య అనార్కలీ డ్రెస్సులన్నీ పలుచని జార్జెట్, షిమ్మర్ జార్జెట్, షిఫాన్ నెట్ ఫ్యాబ్రిక్‌లతో పొరలుపొరలుగా అందాల గులాబీల్లా విచ్చుకుంటున్నాయి. అవన్నీ దేనికది కనిపించేందుకా అన్నట్లు ఒక్కొక్క పొరకీ అంచుల్లో గోటా ఎంబ్రాయిడరీలూ మెరుస్తున్నాయి. దాంతో ఈ గోటా అంచులున్న అనార్కలీ కమీజ్‌ల్లో ఈ అసమతలం మరింత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది.

అలాగని ఇదేదో పూర్తిగా కొత్త దనుకునేరు... అంతర్జాతీయ ఫ్యాషన్ ప్రపంచంలో ఎసిమ్మెట్రీ అనేది ఎప్పటినుంచో ఉంటూనే ఉంది. కాకుంటే అప్పట్లో గౌనులు, స్కర్టులూ ఇతరత్రా డ్రెస్సులూ మాత్రమే అసమతల కట్టింగులతో ఆకర్షించేవి. అత్యాధునిక గ్రాఫిక్, ప్లెయిన్ డ్రెస్సుల్లోనే ఈ స్టయిలిష్ కట్‌లు ఎక్కువగా కనిపిస్తుండేవి. మనదైన సంప్రదాయ డ్రెస్సుల్లో వీటికి అంతగా స్థానం ఉండేది కాదు. కానీ చిత్రంగా ఇప్పుడివి అనార్కలీ డ్రెస్సుల్నే అత్యధికంగా ఆకట్టుకుంటున్నాయి. అసలే ఈమధ్య పొడవు సాగిన హెవీ అనార్కలీ కుర్తీలకు ఈ అసమతల కట్‌లు కూడా తోడవడంతో అవి మరింత అందంగా పార్టీల్లో రెపరెపలాడుతున్నాయి.

హెవీ ఎంబ్రాయిడరీలతో డిజైన్ చేసిన అనార్కలీ డ్రెస్సుల తోపాటు క్యాజువల్‌వేర్‌గా ధరించే సాదాసీదా కుర్తీలు కూడా ఈ ఎసిమ్మెట్రికల్ కట్‌లతో యువతను ఆకట్టుకుంటున్నాయి. కట్‌లే కాదు, వాటిమీద డిజైన్ చేసిన ఎంబ్రాయిడరీ అంచుల్ని కూడా అసమతలంగానే కుడుతున్నారు. డ్రెస్సులతోపాటు చీరలమీద బ్లౌజు కట్‌లూ వాటి మీదుండే డిజైన్లూ ఈ కొత్త రకం కట్‌తో కనువిందు చేస్తున్నాయి. అందునా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లయిన సవ్యసాచి ముఖర్జీ, మనీష్ మల్హోత్రా, కవితా భార్టియా, అర్చనా కొచ్చర్, అనితా డాంగ్రె... లాంటి వాళ్లంతా బాలీవుడ్ సెలెబ్రిటీల కోసం ఈ ట్రెండీ కట్‌లతో సరికొత్తగా డిజైన్ చేస్తున్నారు. అవి చూస్తూ చూస్తూ మిగిలిన వాళ్లెందుకు ఊరుకుంటారు... ఫలితం ఇప్పుడు ఎక్కడ చూసినా ఎవర్ని చూసినా అంతా అసమతలం... ఓ ఫ్యాషన్ మాయాజాలం..!

ఆటవిడుపు

ఏం వస్తుంది?



కిందనున్న సూచనలతో ఏ భాగం ఏ అక్షరాన్ని సూచిస్తుందో చెప్పగలరా?

B - E, F లతో కలిసి ఉంది. అలాగే

C - D, E, I
D - A, C, F
E - A, B, H
F - B, D, G
G - C, F, J
H - E, I
I - C, H, J
J - G, I లతో కలిసి ఉన్నాయి.

విభజన

మూడు తిన్నని గీతలు గీసి ఈ వృత్తాన్ని అయిదు భాగాలుగా విభజించాలి. ప్రతిభాగంలోనూ అయిదు వేర్వేరు రంగుల భాగాలు ఉండాలి మరి.



దాగుడుమూతలు

బొమ్మలో దువ్వెన, రెంచ్, లైట్, టోపీ, కొడవలి, ఉత్తరం, రొట్టెముక్క, పెన్ను ఎక్కడ ఉన్నాయో చెప్పండి.



అంకెలాట

ఇక్కడున్న పిల్లుల బొమ్మలు 1-5 అంకెల్ని సూచిస్తాయి. అయితే ఏ బొమ్మ ఏ అంకెను సూచిస్తుందో చెప్పగలరా?

మీకు తెలుసా?

తేనెటీగలు మకరందం సేకరించిన పువ్వుల్ని బట్టి తేనె రుచి మారుతుంటుంది.

సాధారణంగా జంతువుల నాలుక గులాబీ రంగులో ఉంటుంది. జిరాఫీలకు మాత్రం నలుపు రంగులో ఉంటుంది.

గుడ్లగూబల గుంపును పార్లమెంట్ అంటారు.

కంగారూలు ఒక్క దాటులో 30 అడుగుల దూరం గెంతగలవు. గంటకు 50కిలోమీటర్లు పరిగెత్తగలవు.

వడ్రంగి పిట్ట సెకెనులో 20సార్లు ముక్కుతో చెట్టుని పొడుస్తుంది.

తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాల్ని చెప్పండి.



రామలింగడి తెలివి

విజయనగరాన్ని పాలించే శ్రీకృష్ణదేవరాయలు సాహితీ ప్రియుడు. ఆయన భాషా పండితులకు ఇచ్చే గౌరవ మర్యాదలు గురించి తెలుసుకొని పొరుగు రాజ్యం నుంచి విద్వాన్ అనే పండితుడు విజయనగర సందర్శనకు వచ్చాడు. అతడు కృష్ణదేవరాయల్ని కలిసి... 'రాజా, నాకు చాలా భాషల్లో పట్టుంది. ఈ ప్రపంచంలో మాట్లాడే భాషల్లో సగం నాకు తెలుసు. మీ రాజ్యంలో పండితులెవరైనా నాకు తెలియని భాషలో మాట్లాడ గలిగితే, నేను ఓటమిని అంగీకరిస్తాను. లేదంటే మీరు ఓటమిని అంగీకరించాలి' అని సవాలు విసిరాడు విద్వాన్.

ఆ మాటలు విన్న కృష్ణదేవరాయలు వెంటనే తన ఆస్థాన మంత్రి తెనాలి రామలింగడిని పిలిపించి విషయం చెప్పి ఎలాగైనా రాజ్య ప్రతిష్ఠను నిలబెట్టాలని చెప్పాడు. అంతా శ్రద్ధగా విన్న రామలింగడు, ఈ సమస్య నుంచి సులభంగా గట్టెక్కిస్తానని రాజుకు భరోసా ఇచ్చి అక్కణ్ణుంచి వెళ్లి ఓ గంట తర్వాత వచ్చి రాజు చెవిలో ఏదో చెప్పాడు.

మర్నాడు కృష్ణదేవరాయలు, రామలింగడితో ఒక గదిలో కూర్చొని మాట్లాడుకుంటూ... విద్వాన్‌ని రమ్మని భటులతో కబురు పంపాడు. రాయల పిలుపుతో విద్వాన్ తలుపు తీసుకొని గదిలోకి వస్తుండగా, రాయలుతో రామలింగడు... 'బ్లాబ్లా బ్లూబ్లూ బ్లేబ్లి' అని అంటుంటే రాయలు... 'బ్లోబ్లి బ్లాబ్లూ బ్లేబ్లే' అని సమాధానం ఇవ్వడం విద్వాన్ విన్నాడు. ఆ భాష విద్వాన్‌కి అర్థం కాలేదు. తాను ఇబ్బందుల్లో చిక్కుకుపోతున్నట్లు అర్థమైంది. ఆ మరుక్షణమే వెనక్కు తిరిగి వచ్చి పెట్టేబేడా సర్దుకొని వెళ్లిపోయాడు.

గుర్తుందా?

దిగువనున్న అంకెలూ అక్షరాల్ని రెండు నిమిషాలపాటు జాగ్రత్తగా గమనించండి. తర్వాత వాటిమీద చెయ్యి అడ్డుపెట్టుకుని కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

1. ఏ అక్షరం రెండుసార్లు వస్తుంది?
2. ఏ రంగు అక్షరాలు ఎక్కువగా ఉన్నాయి?
3. ఎరుపు రంగులో ఉన్న ఒకే ఒక్క అక్షరం ఏమిటి?
4. దీనిలో అక్షరాలూ, అంకెలూ ఎన్నేసి ఉన్నాయి.
5. నాలుగు మూలల్లో ఉన్న అక్షరాలూ లేదా అంకెల్ని చెప్పండి.



రంగులేద్దాం

బొమ్మకు రంగులు వేయండి.





నా క్యాలెండర్!

జవాబులు

అంకెలూ: ఐదూఐదే ఉన్నాయి 1,2,3,4,5

మధ్యలో? 1. F; 2. ఆరు; 3. C; 4. ఆక్టోపస్ 13, అంకెలు 6; 5. 1, C, R, M.

ఉదాహరణ?: 1. ఎడమ వైపు నుంచి కుడి వైపుకు 2. బల్లిఱెక్కలున్న పాము 3. మనుషులంతా తినే ఆహారంగా 4. నలుగు మర్రి ఆకులూ ఎన్నో చేతులు 5. ఆకుపచ్చ ఎన్నో ఇరుకు రహదారి 6. పాదరక్షల్లో ఆణిముత్యం చిత్రం 7. ఎరుపు రంగు ఇంటర్నెట్ ఆన్నీయం రెండూ రంగు 8. ఐఓఎ రంగులు గోధుమ.

చిత్రమంచిచిత్రాలు: ఆక్టోపస్ మనిషిగా, లైట్ హౌస్ రెండు, బంగారుగుడ్డు లైట్, లైట్ మనిషి ఆకారం, పిల్లి మీద తాళ్లు, కాలు మీద కట్టుకున్న, ఉత్తరం.

చాక్లెట్ సమోసా చేద్దామా

మల్టీ ఫ్రుట్ కాజా

కావలసినవి

పన్నీర్‌కోసం: పాలు: 2 లీటర్లు, నిమ్మరసం: 2 టేబుల్‌స్పూన్లు, పిస్తా: 75గ్రా., కాస్టర్ షుగర్: 300గ్రా., ఫిలో పేస్ట్రీ షీట్లు: కొన్ని (మార్కెట్లో దొరుకుతాయి)

ఆరెంజ్ బ్లాజమ్ సిరప్‌కోసం

వెన్న లేదా నెయ్యి: 4 టేబుల్‌స్పూన్లు, ఆరెంజ్ బ్లాజమ్ వాటర్: 250 మి.లీ.

తయారుచేసే విధానం

మందపాటి గిన్నెలో పాలు పోసి మీడియం మంటమీద బాగా మరిగించాలి. పాలు మరగడం ప్రారంభం కాగానే నిమ్మరసం పోస్తే విరిగిపోతాయి. ఇప్పుడు ఈ పాలవిరుగుడుని బట్టలో వేసి మూటలా కట్టి దీన్ని చల్లని నీళ్లతో కడగాలి. తరవాత సుమారు గంటసేపు ట్యాప్‌కే వేలాడదీస్తే నీళ్లన్నీ వాడిపోతాయి.

ఫిలో పేస్ట్రీ షీటుని కావలసిన సైజులో తీసుకుని వెన్న రాసిన బేకింగ్ షీటుమీద పరచాలి. తరవాత టేబుల్‌స్పూను కరిగిన వెన్న తీసుకుని షీటుకి రాయాలి.

ఇలాగే మిగిలిన మూడు షీట్లనూ కూడా ఒకదానిమీద ఒకటి వచ్చేలా పరచాలి. ఇప్పుడు ఈ మొత్తం షీటుని 8 సె.మీ. పొడవు, 8 సెం.మీ. వెడల్పు వచ్చేలా కత్తిరించాలి.

ఓవెన్‌ను 400 ఫారన్ హీట్ డిగ్రీలకు వేడి చేయాలి.

ఓ గిన్నెలో పన్నీర్, 150 గ్రా. పంచదార వేసి మెత్తని పేస్టులా అయ్యేవరకూ బ్లెండర్‌తో బీట్ చేయాలి.

ఇప్పుడు 2 టీస్పూన్ల చొప్పున పన్నీర్ మిశ్రమాన్ని ఫిలో షీట్లలో వేసి నలు మూలల్నీ మధ్యలోకి వచ్చేలా మూటలా మడవాలి. ఇలాగే అన్నీ చేసుకుని బేకింగ్ పాన్‌లో పెట్టి 15 నిమిషాలు బేక్ చేసి తీయాలి. ఇప్పుడు మూట కొద్దిగా తెరిచినట్లుగా అవుతుంది. ఇప్పుడు ఒక్కో మూటలో కొద్దిగా పిస్తాపప్పుల పొడిని వేసి మరో ఐదు నిమిషాలు ఓవెన్‌లో పెట్టాలి. ఇవి తయారుచేసేటప్పుడే ఆరెంజ్ సిరప్‌ను రెడీ చేసి పెట్టుకోవాలి. ఇందుకోసం పాన్‌లో ఆరెంజ్ వాటర్ పోసి మిగిలిన పంచదార వేసి మీడియం మంటమీద వేడి చేయాలి. పాకం మూడింట రెండు వంతులయ్యేవరకూ మరిగించి దించి ఒక్కో కాజాలోనూ కాస్త సిరప్ వేసి చల్లారనివ్వాలి.

చాకో కొకోనట్ లడ్డూ

కావలసినవి

చాకొలెట్ తురుము: కప్పు, **కండెన్స్‌డ్ మిల్క్:** 3 టేబుల్‌స్పూన్లు, **వాల్‌నట్స్ పొడి:** పావుకప్పు, **ఎండుకొబ్బరి తురుము:** రెండున్నర కప్పులు, **బాదంపప్పులపొడి:** అరకప్పు, **పిస్తాముక్కలు:** సరిపడా

తయారుచేసే విధానం

బౌల్‌లో చాకొలెట్ తురుము వేసి ఓ నిమిషం ఓవెన్‌లోగానీ వేడినీళ్ల మీద పెట్టిగానీ కరిగించాలి.

ఓ గిన్నెలో రెండు కప్పుల డెసికేటెడ్ కొబ్బరి తురుము వేయాలి. అందులోనే కరిగించిన చాకొలెట్ వేసి బాగా కలపాలి. ఇప్పుడు కండెన్స్‌డ్ మిల్క్ వేసి బాగా కలపాలి.

తరవాత వాల్‌నట్స్ పొడి, బాదం పప్పుల పొడి, పిస్తా ముక్కలు వేసి కలిపి లడ్డూల్లా చుట్టాలి. చివరగా వీటిని కొబ్బరి తురుములో దొర్లించి తీయాలి.

కావలసినవి

చాక్లెట్ తురుము: కప్పు, **చాక్లెట్ సాస్:** తగినంత, **డ్రై ఫ్రూట్స్:** సరిపడా, **క్రీమ్:** అరకప్పు, **నెయ్యి:** టేబుల్‌స్పూను, **మైదా:** పావుకిలో, **నూనె:** వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

మైదాలో తగినన్ని నీళ్లు పోసి చపాతీపిండిలా కలపాలి. తరవాత నెయ్యి కూడా వేసి కలిపి 5 నిమిషాలు పక్కన ఉంచాలి.

చాక్లెట్ తురుము, డ్రైఫ్రూట్స్ బాగా కలపాలి. పిండిని చిన్న ఉండలుగా చేసుకుని చిన్న చపాతీల్లా వత్తాలి. ఒక్కో చపాతీని సగానికి కోసి అందులో చాక్లెట్ తురుము, డ్రైఫ్రూట్స్ మిశ్రమాన్ని పెట్టి సమోసాలా మడవాలి. ఇలాగే అన్నీ చేసుకుని నూనెలో వేయించి తీయాలి. వీటిని చాక్లెట్ సాస్‌తో అద్దుకుని కానీ విడిగా గానీ తినవచ్చు.

చాక్లెట్ సమోసా

కావలసినవి

పంచదార: 2 కప్పులు, **మైదా:** కప్పు, **సెనగ పిండి:** కప్పు, **నెయ్యి:** ఒకటిన్నర కప్పులు, **యాలకులపొడి:** టీస్పూను, **పిస్తా బాదంపలుకులు:** సరిపడా

తయారుచేసే విధానం

నాన్‌స్టిక్ పాన్‌లో నెయ్యి వేసి కరిగిన తరవాత మైదా, సెనగపిండి వేసి పచ్చి వాసన పోయేవరకూ వేయించి పక్కన ఉంచాలి. పంచదార పాకం కలిపే సమయానికి ఇది గోరువెచ్చగా ఉండేలా చూసుకోవాలి.

ఓ గిన్నెలో పంచదార వేసి అది మునిగేవరకూ నీళ్లు పోసి బాగా కలపాలి. పాకం ఉండ కట్టేవరకూ ఉడికించాలి. ఇప్పుడు దీన్ని నెయ్యి రాసిన నాన్‌స్టిక్ పాన్‌లో వేసి తెడ్డులాంటి గరిటెతో తీగలు తీగలుగా అవుతూ గట్టిపడేవరకూ ఆపకుండా తిప్పుతూ ఉండాలి. తరవాత దీన్ని గోరువెచ్చగా ఉన్న నెయ్యి మిశ్రమంలో వేసి కలపాలి. మిశ్రమం గట్టిపడుతుండగా పాన్‌లోనే చేత్తో సమంగా సర్ది పైన బాదం, పిస్తాముక్కలు చల్లాలి.

ఇప్పుడు అచ్చు మొత్తాన్ని నెయ్యిరాసిన ప్లేటులోకి బోర్లించి నలువైపులా సమంగా సర్ది చాకుతో కోయాలి. ఆరిన తరవాత ముక్కలుగా విడదీసి తింటే కరకరలాడుతూ ఎంతో రుచిగా ఉంటుంది.

సోన్ పాపడి

సేవా ప్రయాణం

స్విట్జర్లాండ్ బ్యాంకర్... హాంకాంగ్ పారిశ్రామికవేత్త... అమెరికా సీఈఓ... బ్రిటన్ సామాజిక కార్యకర్త... ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వీరంతా కలిసి ప్రయాణ మయ్యారు. వీరందరి అన్వేషణా గమ్యం ఒక్కటే. అదే... 'జర్నీస్ ఫర్ ఛేంజ్'.

సేవ చేయాలనే తపన చాలామందికి ఉంటుంది. కానీ సామాజిక పరిస్థితులపై సరైన అవగాహన ఉండదు. 'ఏం చేస్తే బాగుంటుంది? ఎలా చేస్తే బాగుంటుంది? ఎక్కడి నుంచి మొదలుపెట్టాలి?' ఇలాంటి అనేక సందేహాలు తలెత్తుతాయి. 'సేవ చేయాలనే ఆలోచన మీకుంటే ఎలాంటి సందేహాలకూ తావులేకుండా మాతో కలిసి నడవండి' అంటుంది జర్నీస్ ఫర్ ఛేంజ్ సంస్థ.

వివేక్ నాయర్... చిన్న వయసులోనే కార్పొరేట్ రంగ నిచ్చెనను చకచకా ఎక్కేశాడు. ఆర్థిక సంతృప్తినిచ్చిన ఉద్యోగం ఆత్మసంతృప్తిని మాత్రం ఇవ్వలేదు. సమాజానికి ఏదో చేయాలనే తపన అతడిని నిలబడనీయలేదు. వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేసి సూక్ష్మరుణ సంస్థను ప్రారంభించాడు. దాంతోనూ అతడు తృప్తి చెందలేదు. పన్నెండు రోజులపాటు కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్‌లలో పర్యటించాడు. అప్పుడే అతడికి తనలాంటి వారికోసమే పనిచేస్తున్న 'జర్నీస్ ఫర్ ఛేంజ్' (journeys for change) సంస్థ గురించి తెలిసింది. అంతే అందులో చేరిపోయి తన సేవా ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు.

ఎలా ప్రారంభమైంది?

పూజా వారియర్, రిచర్డ్ ఎల్డర్‌సన్ ఏడేళ్ల క్రితం కొంతమంది బ్రిటన్ సామాజికవేత్తలతో కలిసి మనదేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అప్పుడు వారికి 'జర్నీస్ ఫర్ ఛేంజ్' సంస్థను స్థాపించాలనే ఆలోచన వచ్చింది. సేవ చేయాలనే ఆసక్తి ఉంటే చాలు వివిధ ప్రాంతాలూ దేశాలకు చెందిన వారెవరైనా దీనిలో చేరవచ్చు. ఈ సంస్థ ద్వారా సభ్యులను దేశంలోని వివిధ ప్రాంతాలకు తీసుకువెళతారు. సమాజ స్థితి గతులపై పూర్తి అవగాహనను తీసుకురావ డానికి ఈ పర్యటన ఎంతగానో తోడ్పడు తుంది. సభ్యత్వం మాత్రం ఉచితంకాదు. ఆయా వ్యక్తుల స్థితిగతులను బట్టి నిర్ణీత సభ్యత్వ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ సంస్థ ద్వారా సమాజ స్థితిగతులపై ఒక అవగాహనకు వచ్చినవాళ్లు అనేక రకాలుగా సేవలను అందిస్తున్నారు.

మద్యపానానికి బానిసై ఆ దురలవాటు నుంచి బైటపడాలనుకునే వారికి జిమ్‌కిన్ బ్రిటన్‌లో టెలిఫోన్ కౌన్సెలింగ్ ఇచ్చేవాడు. మూడేళ్ల కిందట దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన కిమ్ మద్యపానం మాన్పించే ప్రయత్నంలో భాగంగా స్థానిక జె.ఎఫ్.సి. సభ్యులతో కలిసి తమిళనాడులో కౌన్సెలింగ్ సంస్థను ప్రారంభించాడు. పర్యటన పూర్తిచేసు కున్న తర్వాత ఇలా ఎంతోమంది వివిధ సేవా సంస్థలు స్థాపిస్తున్నారు.

సామాజిక వ్యాపారం

విదేశీయులను కూడా ఈ సంస్థ సభ్యు లుగా చేర్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజ నాలు చేకూరుతున్నాయి. కొందరు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. మరికొందరు విదేశాల్లోని తమ బంధువుల ద్వారా సహాయం అందేలా చేస్తున్నారు. ఈ సంస్థ చేసేదీ ఒకలాంటి వ్యాపారమే... సామాజిక వ్యాపారం. అయితే ఇందులో లాభాల ప్రసక్తే ఉండదు. దీని ద్వారా వచ్చే ఆదాయం సమాజ సేవ మాత్రమే.

'వివిధ సమస్యలపై సదస్సులు నిర్వ హించడం అంటే డబ్బును వృథా చేయడమే. ఇలాంటి పర్యటనల వల్ల సమస్యలను దగ్గర నుంచి చూడవచ్చు. వాటిని పూర్తిగా అర్థంచేసుకోవచ్చు. పైగా బృంద సభ్యులతో కలిసి చర్చల్లో పాల్గొనడం వల్ల పూర్తి అవగాహన కూడా వస్తుంది' అంటారు బ్రిటన్‌లో సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ విభాగాధిప తిగా పనిచేస్తున్న స్యూవైట్.

నది ఒడ్డున చూస్తూ కూర్చుంటే ఎప్పటికీ ఈత రాదు. దిగితేనే లోతు తెలుస్తుంది. అలాగే సేవ చేయాలనే తపన ఉంటేనే సరిపోదు. ఇలాంటి సంస్థలో చేరడం వల్ల వివిధ ప్రాంతాల్లో పర్యటించి సామాజిక సేవా కార్యక్రమాలపై ఒక అవగాహన పెంచుకోవచ్చు. మారుమూల ప్రాంతాల్లో పర్యటించడం వల్ల అక్కడి సమస్యలను స్థానికులు ఎలా పరిష్కరిస్తున్నారో సభ్యులు స్వయంగా చూసి తెలుసుకుంటారు. ఇలా ప్రజలతో మమేకం కావడం వల్ల ఎన్నో విషయాలు సభ్యులకు తెలుస్తున్నాయి.

ఆత్మావలోకనం చేసుకోడానికి కూడా ఈ ప్రయాణాలు ఉపయోగపడుతున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు భౌతిక సుఖాన్ని అందిస్తాయి. కానీ అసలైన ఆత్మానందం కావాలంటే ఇలాంటి ప్రయాణాలు చేయా ల్సిందే. ఇలా పర్యటించడం వల్ల ఆలోచనా పరిధీ పెరుగుతుంది. వాస్తవికంగా ఆలోచించి సమస్యలకు పరిష్కారం కనిపెట్టగలుగుతు న్నారు. ఈ సంస్థ ద్వారా వివిధ ప్రాంతాల్లో పర్యటించిన రెండు వందలమంది ప్రముఖులు ఇప్పటివరకూ నాలుగు ఖండాల్లో విస్తరించారు. మారుమూల ప్రాంతాల్లో పర్యటించినప్పుడు అక్కడి సేవా సంస్థలకు స్వయంగా ఆర్థిక సహాయం అందించిన సభ్యులూ ఉన్నారు.

వచ్చే ఏడాది బెంగళూరు, చెన్నై, పాండిచ్చేరి, ఢిల్లీ, రాజస్థాన్, అహ్మదాబాద్‌లలో పర్యటనలు నిర్వహించబోతున్నారు. అభివృద్ధిలో సామాజిక కార్యకర్తల పాత్రను మరింత పెంచడానికి ఈ యాత్ర ఎంతగానో ఉపయోగపడనుంది. మరెన్నో అద్భుతమైన సేవా కార్యక్రమాలకు ఈ సంస్థ నిర్వహించే ప్రయాణాలు తోడ్పడాలని మనసారా కోరుకుందాం.

రాశి ఫలం

గ్రహబలం (డిసెంబరు 30 - జనవరి 5)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

మనశ్శాంతి లభిస్తుంది. బంధుమిత్రులను కలుసుకుని ఆనందంగా గడుపుతారు. ఖర్చులు అధికమయ్యే అవకాశాలున్నాయి. కీలకమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో కాస్త తడబాటుకు గురవుతారు. ఉద్యోగులకు స్థాన చలనం సూచితం. కాస్త నిరుత్సాహానికి గురవుతారు. విదేశీయాన ప్రయత్నాలకు సరైన సమయం. ధర్మకార్యాచరణపై ఆసక్తి పెరుగుతుంది.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆర్థిక వ్యవహారాలు కలసి వస్తాయి. శత్రువులపై మీదే పైచేయి అవుతుంది. మాట దురుసుతనం వల్ల శత్రువులు పెరిగే ఆస్కారమూ ఉంది. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతమౌతాయి. పైఅధికారులతో కాస్త సర్దుబాటు ధోరణితో వ్యవహరించడమే మేలు. కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి. బంధుమిత్రుల సమాగమం. భూసంబంధ వ్యవహారాలన్నీ మేలైన ఫలితాలను ఇస్తాయి. ఆరోగ్య విషయమై కాస్త జాగ్రత్తగా ఉండాలి.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఎంతో ఉత్సాహంతో చేపట్టిన పనులకు బంధుమిత్రుల నుంచి సరైన ప్రోత్సాహం అందదు. దాంతో కాస్త నిరుత్సాహానికి గురవుతారు. కుటుంబ సంబంధ వ్యవహారాల్లో ఆచితూచి మాట్లాడటమే మేలు. శుభకార్యములు తలపెడతారు. తద్వారా ఖర్చు పెరుగుతుంది. ఉద్యోగులకు శ్రమకు తగ్గ గుర్తింపు లభిస్తుంది. పైఅధికారుల మెప్పు పొందుతారు.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

దీర్ఘకాల వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుంది. చేపట్టిన పనులన్నీ అనుకున్న సమయానికే పూర్తి చేయగలుగుతారు. ఆర్థిక వ్యవహారాలు లాభిస్తాయి. బంధుమిత్ర వర్గాల్లో గౌరవం పెరుగుతుంది. శత్రువులపై పట్టుసాధిస్తారు. భోజన సౌఖ్యం, నూతన వస్తు వస్త్రలాభం. ఉద్యోగులకు యోగదాయకం. కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కాస్త తడబాటు తప్పదు.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొత్తగా ప్రారంభించిన పనులన్నింటినీ సకాలంలో పూర్తిచేయగలుగుతారు. ఉద్యోగులకు స్వస్థాన ప్రాప్తి. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. అనవసర ప్రయాణాలు చేయాల్సి రావొచ్చు. శారీరక శ్రమ పెరుగుతుంది. వివిధ రూపాల్లో ఖర్చులు పెరుగుతాయి. బంధుమిత్రులతో అనవసర మాటపట్టింపులకు పోకుండా ఉంటే మంచిది. కీలకమైన అంశాలపై నిర్ణయాలను వాయిదా వేసుకోండి.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మీమాటకి విలువ పెరుగుతుంది. ఆలోచనలు కార్యరూపానికి వస్తాయి. గుర్తింపు లభిస్తుంది. చేపట్టిన కార్యాలన్నీ నిర్విఘ్నంగా పూర్తిచేయగలుగుతారు. కులాచారంపై ఆసక్తిని చూపుతారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. కొన్ని విషయాల్లో అనవసర మాటపట్టింపులకు పోకుండా ఉండాలి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధుమిత్రుల సమాగమం. పెట్టిన పెట్టుబడులు లాభాలను అందిస్తాయి. సంతానం వల్ల ఆనందం. కోపాన్ని నియంత్రించుకుంటే ప్రతికూల ఫలితాలు చాలావరకూ తగ్గుతాయి. వృధాగా ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. చంచలబుద్ధి కలిగి ఉంటారు. పేరు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది, జాగ్రత్త. ఉద్యోగులకు పైఅధికారుల వల్ల స్వల్ప ఇబ్బందులు.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

దుష్టజనుల సావాసంతో చెడ్డపేరు వస్తుంది. తలపెట్టిన పనులు త్వరగా పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాలు కలసివస్తాయి. భోజన సౌఖ్యం ఉండకపోవచ్చు. సంబంధంలేని విషయాల్లో కలుగజేసుకోకపోవడమే ఉత్తమం. బంధుమిత్రులతో కలహాలు సూచితం. మాటను అదుపులో ఉంచుకోవడం ఉత్తమం. శత్రువులపై విజయం సాధిస్తారు.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

శారీరకంగా బలాన్ని పుంజుకుంటారు. వివిధ రూపాల్లో ధనం చేతికి అందుతుంది. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. ఉద్యోగులకు స్థానచలన అవకాశాలున్నాయి. నూతన వస్తు, వస్త్ర ప్రాప్తి. వేళతప్పి భోజనాలు చేయాల్సిరావొచ్చు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. చిత్తచాంచల్యం కలిగి ఉంటారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఒత్తిడికి గురవుతారు.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇంట్లో శుభకార్యాలు చేయాలని నిర్ణయించుకుంటారు. కీర్తిప్రతిష్ఠలు వృద్ధి చెందుతాయి. ఆరోగ్య విషయమై అశ్రద్ధ వద్దు. చర్మ సంబంధ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. మానసికంగా ఆందోళనకు గురవుతారు. ఖర్చులకు సరిపడా సొమ్ము అందుతుంది. చేపట్టిన కార్యాల్లో విఘ్నాలు తప్పకపోవచ్చు. ఐశ్వర్య వృద్ధి, కర్మసిద్ధి. మృష్టాన్న భోజన ప్రాప్తి. కోరికలకు కళ్లెం వేయడం మంచిది.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

బంధుమిత్రులను కలుసుకుంటారు. వివిధ రూపాల్లో ఆర్థిక లాభాలు చేకూరుతాయి. బంధువర్గంలో మీకు గుర్తింపు పెరుగుతుంది. కుటుంబ సభ్యులకు అనారోగ్యం సూచితం. తలపెట్టిన కార్యాలు ముందుకు సాగకపోవడంతో కాస్త నిరుత్సాహానికి గురవుతారు. ఖర్చులు పెరగొచ్చు. శత్రువుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కొత్తగా ప్రారంభించిన పనులన్నీ ఎలాంటి విఘ్నాలూ లేకుండా పూర్తవుతాయి. స్థిర చిత్తాన్ని కలిగి కీలక నిర్ణయాలను ధైర్యంగా తీసుకుంటారు. బంధుమిత్రుల సమాగమం. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి. నూతన వస్త్రలాభం. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగులు పైఅధికారులతో అనవసర మాటపట్టింపులకు పోకూడదు. ఖర్చులను కాస్త అదుపులో ఉంచుకోవాలి. ప్రయాణాల వల్ల అలసట.

సమీక్ష

జగదేక దర్శకుడు

పురాణ, చారిత్రక, జానపద, సాంఘిక చిత్రాల నిర్మాణంలో తనదైన శైలినీ బాణినీ సృష్టించుకున్న దర్శకుడు కె.వి. రెడ్డి. ఆయన వ్యక్తిగత, సినిమా జీవితాన్ని స్పృశిస్తూ రాసిన పుస్తకమిది. బాల్యమిత్రుడు నారాయణస్వామి తన పలుకుబడితో ఆర్థిక సాయంతో కేవీరెడ్డిని సినీరంగప్రవేశం చేయించారు. ఆతర్వాత కేవీ



రెడ్డి ఎంతో ఎత్తుకు ఎదిగినా తన మిత్రుడిని మరచిపోలేదు. పోతన, యోగివేమన, పాతాళభైరవి, మాయాబజార్, జగదేకవీరుని కథ తదితర చిత్రాలు ఆయన కళాదృష్టికి నిదర్శనాలు. ఆయా చిత్రాల విశేషాలను చాగం కొండారెడ్డి ఆసక్తికరంగా చెప్పారు. 'కేవీరెడ్డి నిర్మాతల దర్శకుడు. నిర్మాతల క్షేమం కోరే దర్శక నిర్మాత. బడ్జెట్‌పై ఒక అంచనా వేసుకుని, అంతకంటే ఒక పైసా కూడా ఎక్కువ ఖర్చుపెట్టని వ్యక్తి' అంటారో చోట. కేవీరెడ్డి వ్యక్తిత్వాన్ని రచయిత కాచి వడపోశారనడానికి ఇంతకంటే నిదర్శనం అక్కర్లేదు.

దర్శక మహేంద్రుడు కె.వి.రెడ్డి
రచన: డాక్టర్ చాగం కొండారెడ్డి
పేజీలు: 143; వెల: రూ.150/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– సుదర్శనరావు

అఖిలం మధురం!

'వందేకృష్ణం' కృష్ణతత్వాన్ని బోధపరుస్తుంది. కృష్ణప్రేమను రుచిచూపుతుంది. కృష్ణసంగీతాన్ని వినిపిస్తుంది. కృష్ణుడి



లోని గురువునూ దేవుడినీ ప్రేమికుడినీ తండ్రినీ బిడ్డనూ పరిచయం చేస్తుంది. ఇప్పటికే భాగవతంపై అనేకానేక పుస్తకాలొచ్చాయి. 'మరలనిదేల..' అన్న సందేహం రావచ్చు. కానీ డాక్టర్ కె.వి.కృష్ణకుమారి రచన... భాగవత కథలకో, శ్రీకృష్ణ లీలలకో పరిమితం కాలేదు. అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మిక రహస్యాల్ని చెప్పింది. రాధ, ఉద్ధవుడు, కృష్ణచైతన్యుడు మొదలైన భాగవతోత్తములను పరిచయం చేసింది. గీతాసారాన్ని విపులీకరించింది. శ్రీకృష్ణ ఉవాచను సమకాలీన సమాజానికి అన్వయించింది.

వందేకృష్ణం; రచన: డాక్టర్ కె.వి.కృష్ణకుమారి; పేజీలు: 248; వెల: రూ.100/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– విష్ణుప్రియ

కవి స్వరం



పదకేళితోకాక జీవనసారంలోని ప్రగాఢతను వ్యక్తీకరించే పదాలతో ఆకట్టుకోగలిగితేనే కవిత్వానికి సార్థకత అని నిఖిలేశ్వర్ విశ్వాసం. 'యుగస్వరం'లో 93 కవితలున్నాయి. ఈ 'యుగాన్వేషణలు మొదలై', 'యుగధ్వనితో మమేకమై', 'యుగస్వరం వినిపిస్తూ' వీటిని రచించినట్టు శీర్షికల్లో సూచించారు. భావసాంద్రత, అభివ్యక్తి నిబిడత వీటిలో స్పష్టమవుతుంది. ఒక కవితలో 'శ్రమ విలువకై స్వేచ్ఛకై/జనముక్తి పోరాటం... శతకోటి కంఠాల/యుగస్వరమిది' అని ప్రకటించారు. మరో కవితలో జీవితసత్యాన్ని 'భూత భవిష్యత్ వర్తమాన/త్రికాలసంధిలో మనమంతా' అనే పంక్తుల్లో ఆవిష్కరించారు. 'మౌనమెప్పుడూ నిస్సహాయత కాదు/అది విస్ఫోటనం చెందే/అగ్నిపర్వత నిశ్శబ్దం' అని హెచ్చరించారు ఇంకో కవితలో. ఇది రసదృష్టి ఉన్న పాఠకుల్ని అలరించే సంపుటి.

యుగస్వరం; రచన: నిఖిలేశ్వర్; పేజీలు: 150; వెల: రూ.80/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– జి.రా.

ఇట్లు... ప్రేమతో!

ప్రముఖ రచయిత ప్రేమ్‌చంద్ జీవిత భాగస్వామి శివరాణీదేవి, భర్త మరణానంతరం రాసుకున్న జ్ఞాపకాల మాలిక ఇది. చిన్నతనంలోనే తల్లిపోవడం, తండ్రి మారు తల్లిని తెచ్చిపెట్టడం, ఒంటరితనం...ఇలా ప్రేమ్‌చంద్ బాల్యంలోని అనేకానేక సంఘటనలను కళ్లకుకట్టారు రచయిత్రి. శివరాణిని పెళ్లాడే నాటికే ప్రేమ్‌చంద్ మరొకరిని మనువాడటమూ పుట్టింట్లో వదిలేయడమూ జరిగింది. బాల్యవివాహాలూ బాలారిష్ట కాపురాలూ యథేచ్ఛగా నడిచిన వ్యవస్థ అది. అనేకానేక అంశాలపై రచయితగా ప్రేమ్‌చంద్ స్పందన ఏమిటో ఆయన రచనల ద్వారా



తెలుస్తుంది. వ్యక్తిగా ఆయన ఆలోచనలూ స్పందనలూ ఈ పుస్తకం ద్వారా అర్థమవుతాయి. ప్రేమ్‌చంద్ నడిపిన ప్రింటింగ్ ప్రెస్సు వ్యవహారాల్ని కూడా ఆమె పూసగుచ్చినట్టు వివరించారు. లక్నోలో ఓ బ్రిటిష్ అధికారి వేలాది రూపాయలు దుబారా చేసి బాణాసంచా కాల్చడం గురించి...భార్యాభర్తల మధ్య జరిగిన సంభాషణ ప్రేమ్‌చంద్ సామాజిక కోణానికి అద్దం పడుతుంది. అలా కాల్చి తగలేయడం కన్నా, పేదలకు ఉపయోగపడే పనేదైనా చేయాల్సిందని బాధపడ్డారట ఆయన. 'ఇంట్లో ప్రేమ్‌చంద్'...శివరాణీదేవి హృదయంలోని ప్రేమ్‌చంద్ పాఠకులకు పరిచయం చేస్తుంది.

ఇంట్లో ప్రేమ్‌చంద్
రచన: శివరాణీదేవి ప్రేమ్‌చంద్
అనువాదం: ఆర్.శాంతసుందరి
పేజీలు: 274; వెల: రూ.120/–
ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్లాట్‌నం.85, బాలాజీనగర్ గుడిమల్కాపూర్ హైదరాబాద్.

– ఆచంట

బుక్‌షెల్ఫ్

చైతన్య కిరణాలు (వ్యాసాల సంకలనం)
రచన: వి.జయరాముడు
పేజీలు: 208; వెల: రూ.100/–
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

విజేతలు (జీవిత పోరాటంలో...)
రచన: పాలపర్తి సంధ్యారాణి
పేజీలు: 145; వెల: రూ.125/–
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు.

లోపలిస్వరం (కవిత్వం); రచన: రేణుక అయోల
పేజీలు: 119; వెల: రూ.60/–
ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 040-27678430.

దళిత జర్నలిజం; రచన: జి.కె.డి.ప్రసాద్
పేజీలు: 435; వెల: రూ.200/–; ప్రతులకు: ఎమెస్కో బుక్స్ 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్ దోమలగూడ, హైదరాబాద్.

ఆరడుగుల నేల ఆహ్వానించిన వేళ (దీర్ఘ కవిత)
రచన: కె.బాలకృష్ణారెడ్డి; పేజీలు: 60; వెల: రూ.50/–
ప్రతులకు: రచయిత, నిర్మల్ హైట్స్, నిర్మల్‌నగర్, ఒంగోలు.

జాతీయకవి కాళిదాసు
హిందీమూలం: సీతారామ్ సహగల్
అనువాదం: కాలిపు కూర్మావతారం
పేజీలు: 124; వెల: రూ.120/–
ప్రతులకు: కె.కూర్మావతారం
సెల్: 9491838718.

భావవ్యక్తీకరణం - ఒక కళ
రచన: ఎమ్.ఆర్.కె.మూర్తి
పేజీలు: 227; వెల: రూ.150/–
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు.

పదవినోదం-1123



ఆధారాలు

అడ్డం:

1. బంగారుబొమ్మలా ఉందనడానికి ఇలాగంటారు... (6)
5. అంతెత్తున కూర్చోవడానికి, కొబ్బరి ఆరబెట్టడానికి ఏర్పరచిన మంచం (3)
8. అంతవరకు, అందిన తరవాత (3)
9. నాలుగు సోలలు (2)
10. ప్రాణి సమూహం, సమాజం (2)
11. సర్దుబాటు, అవకాశం లాంటిది (5)
13. అన్నంలో, చపాతీతో కలిపి తినేది? (2)
14. పొలంలో ఇల్లు, చావడి (2)
15. గోరు (2)
17. గడువు, కొలది (2)
19. అటునుంచి వినవు! (3)
20. గజం (3)
22. సగం ఆడం తరవాత సగం బుద్ధి చేరితే- స్థితికి మించిన వేషం, ఆడంబరం! (2)
24. ఏనుగు కాలి సంకెల (3)
26. మాల అవునో కాదో సందేహం అక్కర్లేదు... అవును! (2)
28. యుద్ధం (3)
30. ఆంగ్లంలో ఉచితం! (1)
31. దారిలో వేరేవిధంగా (4)
34. ఆరుబయలు, సువిశాల సమతల ప్రాంతం (3)
36. కుడినుంచి మణిశర్మ! (4)
39. ఇల్లు (3)
41. దృష్టి (2)
43. చెక్కపెట్టె (3)
45. అదితి, అల్లు అర్జున్ ముఖ్యపాత్రలు పోషించిన చిత్రం (3)
47. ప్రయాణమే (2)
49. సంపద (3)
51. సరిపోతుంది, ఇక అక్కర్లేదు! (2)
53. గుడి (3)
54. ఒక స్వరం (2)
55. సహనం (2)
56. బొమ్మ, సినిమా (2)

నిలువు:

1. కుండలో పుట్టినవాడు- అగస్త్యుడు, ద్రోణుడు (6)
2. సముద్రంలో కలిసేది (2)
3. బొమ్మకు రెండోవైపు? (2)
4. ఉన్నట్టుండి, హఠాత్తుగా (4)
6. ఇంచుమించు (4)
7. కట్ట (2)
8. ఆవు అరుపు (2)
11. ధర (2)
12. శీర్షాసనమేసిన నుతులు (3)
14. మాయాబజార్‌లో మహానటి (3)
16. ఆసియా ఏమిటి? (2)
18. చీకటి (3)
20. ఇదా, అదా? (2)
21. తెలుగులో క్లర్కులు (4)
23. పాము కొట్టేది! (2)
25. తెర (3)
27. ఇంకో భాషలో- తీసుకో (ల గుణింతంలో) (2)
29. మణిగం అంటే అధికారం. ఇక్కడ అది తడబడింది... (3)
32. ఒక నది (3)
33. చివర; ధాన్యపు సంచులు కుట్టడానికి ఉపయోగపడేది! (2)
34. కొవ్వొత్తిని దేనితో చేస్తారు? (2)
35. తలకిందుల ధ్యానం! (2)
37. మొదట్లో తడబడిన సంశయాలు! (4)
38. మైకం (2)
40. కాగితాల కట్ట (2)
42. అర్ధభాగం (2)
43. అమాత్యుడు (2)
44. మొదటి (2)
46. బరి (2)
48. మరో (2)
49. స్వప్నం (2)
50. నెపం, సాకు (2)
51. ఒక యువనటి (2)
52. ఆరాటం, ఉబలాటం, తొందర (2)

సుడొకు-167

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

				7	2			
9		1					2	
					4	6		9
	4			9		8	3	
			4		5			
	2	5		3			9	
8		4	7					
	9					7		3
			6	8				

సమాధానాలు

పదవినోదం-1122

సుడొకు-166

9	3	8	5	1	4	7	2	6
4	6	1	8	7	2	9	3	5
5	7	2	9	3	6	1	4	8
7	8	4	1	9	5	2	6	3
1	9	6	2	8	3	5	7	4
2	5	3	4	6	7	8	1	9
6	1	7	3	5	8	4	9	2
3	4	5	7	2	9	6	8	1
8	2	9	6	4	1	3	5	7

M.. S..

ఈ అడవీ దాగిపోనా...

కొమ్మలో కొమ్మనై
రెమ్మలో రెమ్మనై
మోడులో మోడునై రాతిలో రాయినై
ఈ అడవీ దాగిపోనా...

ఈ గుడ్లగూబలకి కనుక మాటలొస్తే కచ్చితంగా ఇలాగే పాడుకుంటాయేమో! పగలంతా నిద్రపోతూ రాత్రిపూట మాత్రం మేల్కొని ఉండే ఈ నిశాచరి, శత్రువుల కంటపడకుండా పరిసరాల్లో కలిసిపోయిన తీరు చూస్తే ఇదంతా తన సృష్టేనా అని ఆ విధాత సైతం ఆశ్చర్యపోక తప్పదు. శాస్త్ర పరిభాషలో దీన్నే కెమోఫ్లేజ్ అంటారు. శత్రువుల నుంచి రక్షణ కోసం పరిసరాలలో కలసిపోగల ఈ లక్షణం కొన్ని జీవజాతులకు ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం.



200 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే నీరు... నిత్యం సుమారు నాలుగు మీటర్ల ఎత్తున ఎగసిపడుతుంటే ఎలా ఉంటుంది?

మనిషి సృష్టించిన ఫౌంటెయినయితే కృత్రిమ దీపాల వెలుగులతో కృత్రిమంగానే ఉంటుంది. కచ్చితంగా ఇంత అందంగా ఉండదు. అవును నిజమే, ఇది మనిషి సృష్టించింది కాదు... ప్రకృతి ఒడిలో పుట్టిందే. అమెరికాలోని నెవడాలో ఉంది. 1916వ సంవత్సరంలో ఈ ప్రాంతంలో స్థిరపడాలని కొందరు వచ్చారట. నీటికోసం తవ్వకాలు మొదలుపెడితే... వేణ్ణీళ్లు ఎగసిపడటం మొదలుపెట్టాయట. ఎంతకీ ఆగకపోవడంతో ఇక్కణ్ణుంచి వెళ్లిపోయారట. భూగర్భం నుంచి ఉబికివచ్చే ఈ నీటిలోని ఖనిజాలూ లవణాల కారణంగా క్రమక్రమంగా చుట్టుపక్కల పాముపుట్టల్లా... రంగురంగుల దిబ్బలు పెరగడం మొదలైంది. నీటిరంగు మారినప్పుడల్లా ఈ దిబ్బల రంగూ మారుతుంటుంది. నీటిని విరజిమ్మే ఈ బుగ్గను అందరూ ఫ్లయింగ్ గీజర్ అని పిలుస్తారు.